# మాదిరాజు రామకోటీశ్వరరావు స్వీయచరిత్ర

## అభ్యుదయ తెలంగాణా చరిత్రాంశములు

తెలంగాణ సాహిత్య అకాడమి : ప్రచురణ – 7

# మాదిరాజు రామకోటీశ్వరరావు స్వీయచరిత్ర

## అభ్యుదయ తెలంగాణా చరిత్రాంశములు

తెలంగాణ సాహిత్య అకాడమి

ప్రచురణ : 7

Publication : 7

# మాదిరాజు రామకోటీశ్వరరావు స్వీయచరిత్ర

# Madiraju Ramakotiswararao Swiyacharitra

© తెలంగాణ సాహిత్య అకాడమీ

© Telangana Sahitya Akademi

మొదటి ముద్రణ : సెప్టెంబర్, 1960
రెండవ ముద్రణ : డిసెంబర్, 2017
ప్రతులు : 2000
వెల : రూ 200/-
డిటిపి, లేఅవుట్ : కరుణ
కవర్‌పేజీ డిజైన్ : ఏ. వెంకటేశ్వరు

ప్రచురణ, ప్రచులకు :
**తెలంగాణ సాహిత్య అకాడమీ**
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణము,
హైదరాబాద్ - 500 004.

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్,
ఫోన్ : 040-27678411

First Edition : September, 1960
Second Edition : December 2017
Copies : 2000
Price : Rs 200/-
DTP, Layout : Karuna
Cover Design : A. Venkateshwar

Published by and Copies Available at:
**Telangana Sahitya Akademi,**
Kalabhavan, Ravindra Bharathi,
Hyderabad - 500004.

Printed at :
Charita Impressions,
Azamabad, Hyderabad - 500020.
Ph : 040-27678411



# సందేశం

తెలంగాణ ప్రజలు తమపై సామాజికంగా, సాంస్కృతికంగా అన్ని రంగాలలో అమలవుతున్న వివక్ష నుంచి బయటపడేందుకు ఉద్యమించి తెలంగాణ సాధించుకున్నారు. ప్రజల ఆకాంక్షలు సాకారం చేస్తూ ఏర్పడిన స్వరాష్ట్రంలో తెలంగాణలో వెలుగొందిన తెలుగు భాషావైదుష్యాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది. నేటి తరానికి మాతృభాష విశిష్టతను తెలియజేయాలని, మన సాహిత్య వారసత్వాన్ని అందించాలని కృతనిశ్చయంతో కృషి చేస్తోంది. తెలంగాణ సాహిత్యంపై నిరంతర అధ్యయనం, పరిశోధన, విశ్లేషణ, ప్రచురణ, ప్రచారం జరుగవలసిన అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం ఇందుకోసం తెలంగాణ సాహిత్య అకాడమీని ఏర్పాటు చేసింది.

తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో డిశంబర్ 15 నుండి 19 వరకు ఐదు రోజుల పాటు హైదరాబాదు నగరంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగబోతున్నాయి.

ఖండాంతరాలనుంచి వచ్చిన సాహిత్య రసహృదయులందరూ ఒక చోటకు చేరడంతో వారి మధ్య పరస్పర సాహిత్య సంబంధాలు, సుహృద్భావనలు నెలకొంటాయి. ఈ సభలు కొత్త తరానికి తెలంగాణ సాహిత్య వారసత్వాన్ని పరిచయం చేయడంతో పాటు వారిలో నూతనోత్తేజాన్ని, ప్రేరణను కలిగిస్తాయి.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురిస్తున్న పుస్తకాలు ప్రత్యేక అధ్యయనాలు భావితరాలను తీర్చి దిద్దుతాయని ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణ సాహిత్య అకాడమీకి, రచయితలకు నా శుభాభినందనలు.

తేది : 9-12-2017

**– కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు**
ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్రం

# ముందుమాట

ప్రపంచ తెలుగు మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. మహాసభల నిర్వహణ బాధ్యతలను తెలంగాణ సాహిత్య అకాడమికి అప్పగించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, సమకాలీన చరిత్ర, తెలంగాణ సాహిత్య అకాడమి ఏర్పాటు, సాహిత్య చరిత్ర, తెలుగు భాష ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పటానికి, సాహిత్య అకాడమికి ప్రాచుర్యాన్ని కల్పించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు గారు, 'ప్రపంచ తెలుగు మహాసభలు' తలపెట్టటం జరిగింది.

తెలుగు భాషా సంస్కృతుల మూల భూమి తెలంగాణ, తెలగు భాషా సాహిత్యాల వికాసం కోసం సమున్నతంగా కృషిచేసిన మహనీయుల మాగాణం తెలంగాణం. యుగాలుగా, శతాబ్దాలుగా ఎన్ని ఆటుపోట్లు ఎదురయినా ప్రాణసమానంగా తెలుగు తేజస్సును, కమ్మదనాన్ని కాపాడుకుంటూ వచ్చిన చరిత్ర తెలంగాణది. క్రీ.పూ. 300 గోపరాజుల కాలం నాటి నాణాల్లోని 'నారన' పేరు ఆధారంగా 'అన్న' తెలుగు మాట వాడుకలో ఉన్నట్లు నిరూపిత మవుతున్నది. ఇప్పటి వరకు లభిస్తున్న ఆధారాలను బట్టి ఇదే మొదటి తెలుగు మాట. క్రీ.శ. 61 ప్రాంతంలో హాలుడు సంకలనం చేసిన ప్రాకృత గ్రంథాల 'గాథాసప్తశతి'లో అత్త, పిల్ల, పత్తి వంటి కొన్ని తెలుగు పదాలు చోటు చేసుకోవటం వల్ల తెలంగాణలో తెలుగు అప్పటికే వ్యవహారంలో ఉన్నదని భావించటానికి వీలవుతున్నది. ఇట్లాగే క్రీ.శ. 947 నాటి కుర్క్యాల శాసనంలోని కందపద్యాలు, పంపకవి

తెలుగు పద్యం తెలంగాణలో ఛందోబద్ధ కవిత్వం వర్ధిల్లిందని చెప్పే సాక్ష్యాలు. అందువల్ల అనేక విధాలుగా తెలుగు ప్రాభవానికి నెలవైన నేల తెలంగాణ. ఈచరిత్రంతా ప్రపంచానికి చాటిచెప్పి తెలంగాణలో తేజరిల్లిన 'తెలుగు వైభవాన్ని' ఆవిష్కరించటమే ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన సూత్రం. తెలుగు ఖ్యాతిని ప్రకటించటం, తెలంగాణ మహాకవులను మననం చేసుకోవటం, తెలుగు భాషా సాహిత్యాల ఘన వారసత్వం వైపు కొత్త తరాన్ని ఆకర్షించి, అభిరుచి కల్పించటం ప్రపంచ తెలుగు మహాసభల లక్ష్యాలు. ఇది సాంస్కృతిక పునరుజ్జీవన సంకల్పం. తెలంగాణ పునర్వైభవ ప్రకటనం.

ప్రపంచ తెలుగు మహాసభల (డిసెంబర్ 15 నుంచి 19 వరకు) సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమి పదిహేను పుస్తకాలు ప్రచురిస్తున్నది. వాటిలో ఒక ప్రచురణ 'మాదిరాజు రామకోటీశ్వరరావు స్వీయచరిత్ర' – అభ్యుదయ తెలంగాణా చరిత్రాంశములు.

తెలంగాణ చరిత్ర మహత్తరమైంది. ప్రాచీనకాలంలో యుద్ధాల చరిత్ర, ఆధునిక కాలంలో ఉద్యమాల చరిత్ర తెలంగాణకు గర్వకారణం. ఇరువయ్యో శతాబ్దం తొలిదశలో తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం చిగురించింది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంతో ప్రారంభమైన సాంస్కృతిక చైతన్యం అంచెలంచెలుగా వికసించి, నిజామాంధ్ర మహాసభలతో విస్తరించి, ఆంధ్రమహాసభల్లో ప్రజ్వరిల్లింది. ఆనాటి పరిస్థితులు, సందర్భాలు హైదరాబాద్ రాష్ట్ర వాతావరణం చిత్రిస్తూ ఎందరో ప్రముఖులు రచనలు చేశారు. వాటిలో స్వీయచరిత్రలు ప్రత్యేకమైన ప్రక్రియ. మాదిరాజు రామకోటీశ్వరరావు స్వీయచరిత్ర మరింత విశిష్టమైన రచన. తెలంగాణ చరిత్రను సమగ్రంగా రూపొందించాలన్నా, అవగాహన చేసుకోవాలన్నా ఇట్లాంటి రచనల అధ్యయనం తప్పనిసరి. ఒక చారిత్రిక సందర్భంలో వెలువడిన రామకోటీశ్వరరావు స్వీయచరిత్రను మరొక చారిత్రిక సందర్భం ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురిస్తున్నాం. చాలా కాలం నుంచి అన్వేషిస్తున్నా ఈ పుస్తకం అందుబాటులో లేనందువల్ల దొరుకలేదు. అకస్మాత్తుగా మిత్రుడు వి.ప్రకాశ్ దీని విషయం ప్రస్తావించటమే కాకుండా ప్రచురిస్తే బాగుంటుందని ప్రతిని అందజేసి ఆనందం కలిగించాడు. మాదిరాజు కోటీశ్వరరావుగారి మనుమడు మాదిరాజు కృష్ణారావు, వారి

సహోదరులు పుస్తక ప్రచురణ కోసం ఉత్సాహంగా సహకరించారు. వారందరికీ ధన్యవాదాలు. సరళ గ్రాంధికంలో సాగినా ఈ రచనలో తెలంగాణ విలువైన సమాచారమున్నది. సహృదయంతో ఆదరిస్తారని భావిస్తున్నాను.

తేదీ: 2-12-17

**నందిని సిధారెడ్డి**
**అధ్యక్షుడు**
**తెలంగాణ సాహిత్య అకాడమి**

# పరిచయ వాక్కు

కీ.శే. మాదిరాజు రామకోటీశ్వరరావు వ్రాసిన 'స్వీయ చరిత్ర'ను సాకల్యముగా చదివితిని. ఆయన మరణించినాడని వ్రాయుట నాకెంతో దుఃఖమును కలుగచేయుచున్నది. నా కాతడు మేనమామ కుమారుడు. నాకంటె అయిదు సంవత్సరములు చిన్నవాడు. చాల సజ్జనుడు. దేశాభిమాని. ప్రతి మంచి యుద్యమములోను సేవచేసినవాడు. చిన్నప్పటి నుంచి అతడు స్వర్గస్తు డయ్యేవరకు నా కత్యంత ప్రేమాస్పదుడైన చెలికాడుగ నుండెను. అట్టి బాల్యమిత్రుడు సమీప బంధువు నన్ను వీడిపోయినందుకు నాకు విశేషదుఃఖము కలుగుట అస్వాభావికముకాదు. అతడు స్వీయచరిత్ర వ్రాయుటకు నేనే ప్రోత్సహించితిని. మా మాతామహుల కుటుంబపు చరిత్ర దీనిలో వివరించబడినందువలన నా స్వంతలాభ మిందులో నిమిడియున్నది. యిదిగాక ముఖ్యముగా తెలంగాణలోని యుద్యమము లన్నిటిలో నాతని అనుభవములను తెలుపుచూ అప్పటికాలమున పరిస్థితులను గురించియు, ఆ యుద్యమములలో పనిచేసిన ఇతర ప్రముఖుల గూర్చియు రామకోటీశ్వరరావుగారు వ్రాయుట వలన అతడి కాలపు తెలంగాణా చరిత్ర చదువరులకు బాగుగా విశదమగు చున్నది. ఈ గ్రంథము మిగుల సరళమైన శైలిలో వ్రాయబడినది. కథా సంగ్రహము మనోహరముగా నున్నది. ఈ చరిత్ర యొక్క కాలమనేక ముఖ్య మయిన పరిణామములతో కూడిన కాల మయినందున యీ గ్రంథము మిగుల విలువగలదిగ నున్నది. ఈ కాలములోనే తెలంగాణము, తెలంగాణా ఆంధ్రులు ప్రత్యేక వ్యక్తిత్వమును పొంది ప్రజాజీవితములో ప్రముఖ పాత్రను వహించి విశాలాంధ్ర స్థాపనకు ప్రజారాజ్య నిర్మాణమునకును యెక్కువగా తోడ్పడినారు. యీ మహత్తర కృషిలో రామకోటీశ్వరరావు కూడా తన విధిని గౌరవముగా నిర్వర్తించి యున్నాడు. ఆంధ్ర మహాజనులు ఈ ఆత్మకథను చదివి యెక్కువైన లాభమును పొందెదరుగాక యని కోరుచూ శ్రీ రామకోటీశ్వరరావు ఆత్మకు శాశ్విత శాంతి కలుగజేయ వలెనని భగవంతుని ప్రార్థించుచున్నాను.

నాగార్జున విహార్,
హిమాయత్‌నగర్
హైద్రాబాదు
తేదీ 6-8-1960

ఇట్లు
**అయ్యదేవర కాళేశ్వరరావు**
**స్పీకరు**

# తొలిపలుకు

హైద్రాబాదు రాష్ట్రంలో ఆంధ్రోద్యమానికి మూలపురుషులలో నొకరును, సుప్రసిద్ధ న్యాయవాదులును, ప్రజాహితములగు ఉద్యమాలన్నింటిలో ప్రముఖ పాత్రవహించిన స్వార్ధసేవా పరాయణులగు, స్వర్గీయ శ్రీ మాదిరాజు రామకోటీశ్వర రావుగారి స్వీయచరిత్ర కేవలము ఒక వ్యక్తి చరిత్రయేకాక, అభ్యుదయ తెలంగాణా యొక్క సమగ్ర చరిత్రయని చెప్పవచ్చును.

ఈ చరిత్రలో వారు తమ బాల్య, యౌవన, వార్థిక్య కలాపాలను, తాము సాధించిన విజయాలను, వానికొరకై తాము చేసిన ప్రయత్నాలను, వారు అనుభవించిన కష్టసుఖాలను వారి కాలములో రాష్ట్రములో నడుపబడిన ఉద్యమాలను, జరిగిన మార్పులను, వాటితో తమకు కలిగియుండిన సంబంధాలను చాలా విపులముగా వ్రాసియున్నారు.

శ్రీ రామకోటీశ్వరరావుగారు హైద్రాబాదులో న్యాయశాస్త్ర పరీక్షకు కూర్చుండెడి విద్యార్థులకు శిక్షణ నిచ్చు లా కమిటీలో నా సహపాఠిగా నుండిరి. వారు, నేను 1908 సంవత్సరములో మూడవ తరగతి వకాలత్ పరీక్షలో ఒకేసారి ఉత్తీర్ణుల మయితిమి. అప్పటినుండి వారు వరంగల్లులోను, నేను హైద్రాబాదులోను న్యాయవాద వృత్తి నవలంభించితిమి. ప్రజాహిత రంగములోను, తెలంగాణకు సంబంధించిన తదితర రంగములలోను, యితరులతో సహా మేముభయులము పనిచేసితిమి. స్వీయచరిత్రలో వారు వర్ణించినట్లుగా తెలంగాణలో, ప్రత్యేకముగా వరంగల్లు సూబా (ప్రాంతము)లో, ప్రతి ప్రజాహిత కార్యములో వారు ముందంజ వేయుచుండిరి. స్వాభావికముగ వారు ఉత్సాహవంతులు, కార్యదక్షులు; కోపమెరుగని శాంతి స్వరూపులు. ఏమాత్రము సమయము వృధాచేయక ఎల్లప్పుడు ఏదియో పనిచేయుచుండెడి వారు. దీర్ఘాలోచన, దూరదృష్టికలిగి, సదా ప్రజాశ్రేయస్సు చింతకలిగినవారు. ఏ కార్యమును తలపెట్టినా పట్టుదలతో దానిని పూర్తిచేసెడివారు. అతి విపులముగా వ్రాయబడిన వారి స్వీయచరిత్రయే దానికి తార్కాణము.

అభ్యుదయ రంగాలన్నిటిలో ముందడుగువేసి, శ్రేయోద్యమాలలో నిరంతర కృషిచేసిన యీ ప్రజా సేవాభిలాషికి హైద్రాబాదులో స్వాతంత్ర్య పోరాటము ప్రారంభమగు సమయములో దురదృష్టవశాత్తు గుండె జబ్బు వచ్చినది. దాని వలన ఆ పోరాటములో ప్రముఖ పాత్ర వహించజాలక చింతిల్లుచుండెడి వారు. అదే జబ్బువలన వారు దినదినము క్షీణించి చివరకు దివంగుతులైరి.

తెలంగాణ రాజకీయ చరిత్రలోని వివిధ ఘట్టాలను, వర్ణించుచూ, సులభ శైలిలో వ్రాయబడిన యీ స్వీయచరిత్ర చదువరులకు మార్గదర్శకముగా నుండగలదని నా విశ్వాసము.

హైదరాబాద్
తేదీ. 5-9-1960

ఇట్లు,
**కొండా వెంకట రంగారెడ్డి**
**ఉపముఖ్యమంత్రి.**

# అభిప్రాయము

కీర్తిశేషులగు మాదిరాజు రామకోటీశ్వరరావుగారు నాకు అర్ధశతాబ్ది కాలముకంటే మించిన పాతమిత్రులు. ప్రారంభమున 3వ తరగతి న్యాయవాదిగా హనుమకొండలో వారు వృత్తిని యారంభించి నపుడు మేమిద్దరము - రెండు కుటుంబముల వారము ఒక యింటిలోనే యుండి ఏండ్లు గడిపితిమి. వారు క్రమముగా అచ్చటనే ప్రముఖ న్యాయవాదిగా కీర్తి సంపాదించిరి.

ప్రజాహిత కార్యములందు వారికి ఉత్సాహము మెండుగా నుండెను. మా సహచర్యమువలన వారికి తెలంగాణా ఆంధ్రోద్యమము నందున యభిరుచి వృద్ధియైనది. సుప్రసిద్ధమైన ధర్మవరపు ఆంధ్ర మహాసభ సమావేశమునకు వారు అధ్యక్షత వహించి జయప్రదముగా దానిని నిర్వహించిరి. తుదివరకును పై యుద్యమమున వారు పాల్గొనుచు ధైర్యముతో పనిచేసిరి.

రాజకీయములందు నావలనే వారును మితవాదులుగా నుండిరి. నా వలనే వారు జైలునకుపోక తొలగియుండిరి. నిర్మాణ కార్యక్రమములందు యెక్కువ శ్రద్ధ గలవారై వరంగల్లులోని సంస్కృత పాఠశాల, అనంతలక్ష్మీ ఆయుర్వేద వైద్యశాలయొక్క అభివృద్ధికిని అవిశ్రాంతముగ పాటుపడినారని నేనెఱుగుదును.

ఇట్టి మహాశయుని స్వీయచరిత్ర విపుల వివరణలతో వెలువడుచున్న దానిని నేను చాల భాగము చదివితిని. వారి జీవిత కాలమున ఈ గ్రంథము ప్రకటింపబడుట జరుగలేదు. ఐనను వారి యనంతరమైనను ఇది ప్రకటింప బడుట సంతోషావహము. ఇది తెలంగాణా వాసుల వలన చదువబడి కీర్తిశేషుని యాత్మకు శాంతిని కలిగించునని నమ్ముచున్నాను.

‘ఆంధ్రకుటీరము’
హనుమాన్‌టేక్డి
హైదరాబాదు.
తేదీ: 1-9-1960

ఇట్లు,
**మాడపాటి హనుమంతరావు**
**సభాపతి.**

# అభిప్రాయము

కీర్తిశేషులైన శ్రీ మాదిరాజు రామకోటీశ్వరరావు పంతులుగారితో నాకు 40 సంవత్సరముల పరిచయము. నేను విద్యార్థిగా వుండే రోజులలోనే వారు వరంగల్ పట్టణములో వకాలతుచేస్తూ తమ వృత్తిలో మంచి కీర్తి ప్రతిష్టలను పొందినవారు. శ్రీ పంతులవారు గొప్ప జమీందారి కుటుంబమునకు చెందినవారు. సదాచారులను, సత్ప్రవర్తన కలవారునైయుండిరి.

హైద్రాబాదు రాష్ట్రపు ప్రజాజీవితముతో కీర్తిశేషులైన పంతులవారికి సన్నిహిత సంబంధముండేది. వారు పాల్గొనని ఉద్యమము లేదు. వారి సహచరునిగా నిజాం రాష్ట్రాంధ్రోద్యమములో పాల్గొను భాగ్యము నాకు కూడా లభించినది. అన్ని వుద్యమాలలో కూడా వారు సేవాదృష్టితో పనిచేసెడివారు. స్టేట్ కాంగ్రెసు ఆదేశాను సారము శ్రీవారు తమ వకాలతు ప్రాక్టీసును మానుకొని న్యాయస్థానాల బహిష్కార మునకు వరంగల్ జిల్లాలో నాయకత్వము వహించి మార్గదర్శకులైరి.

శ్రీవారు, తాము పరమపదించుటకు కొద్దిరోజులకు పూర్వము రచించిన తమ స్వీయచరిత్ర చాలా విలువగలదని నేను భావిస్తాను. ఇందులో పూర్వపు హైద్రాబాదు రాష్ట్ర ప్రజాజీవితమునకు సంబంధించినవెన్నో విషయములు కలవు. హైద్రాబాదు రాజకీయ సంఘర్షణను గురించిన చరిత్ర వ్రాయదలచు కున్నవారికీ గ్రంధము ఎంతో సహాయపడగలదని నేను విశ్వసించుతాను. శ్రీవారు తమ స్వీయచరిత్రను వ్రాసి హైద్రాబాదు భవిష్యత్తునందలి చరిత్రకారుల కెంతో సహాయముచేసిన వారైరి. శ్రీవారికి నా శ్రద్ధాంజలులు సమర్పించుచున్నాను.

హైదరాబాద్ — ఇట్లు

తేదీ: 1-9-1960 — **యం. నరసింగరావు**

**హెూంశాఖమంత్రి**

# మనవి మాటలు

గ్రంథకర్త అయిన స్వర్గీయ మా జనకులు శ్రీ మాదిరాజు రామకోటీశ్వర రావు పంతులుగారే యీ మనవిమాటలు వ్రాయుటకు అర్హులు. కాని విధి వారి కట్టి అవకాశము ఇవ్వలేదు. ఆ బాధ్యత మాపైనబడినది. ఎంతవరకు దానిని సక్రమముగా నిర్వహింపగలమో అనుమానమే. ధైర్యం చేయుచున్నాను. అనౌచిత్యములను విజ్ఞులు మన్నింపగలరని ప్రార్థన.

గ్రంథప్రాశస్త్యమును గురించిగాని, లోపముల గురించిగాని మేము వ్యాఖ్యానము చేయబూనుకొనుటలేదు. ప్రాజ్ఞులైన పాఠకలోకమునకే ఆ పని వదలివేయుచున్నాము.

మానవు డేకాకిగా సంఘమున జీవించలేడు. అతని ప్రభావము సంఘము పైనను సంఘ ప్రభావమాతని మీదను అనుక్షణము పని చేయుచుండును. ఈ విషయము వ్యక్తులందరి యెడ సత్యమే. అయినను కొందరి యెడ ప్రత్యేకత కలిగి యుండును. అట్టి ప్రత్యేకత వున్నప్పుడే స్వీయచరిత్ర యొక్క ప్రాధాన్యత, ప్రత్యేకతగల వ్యక్తులలో యీ గ్రంథ రచయిత వకరని మేము మనవిచేయ నక్కరలేదు. అది సర్వ విదితము.

ఆంధ్రప్రదేశ్ పరిస్థితు లొకమాదిరివి. అందున్న తెలంగాణ పరిస్థితి మరియొక మాదిరిది. అది మహానాయకుల పిలుపులందుకొని చైతన్యవంతమై పురోగమించు చుండ; నిది యా నాడు యినుప సంకెలలో తగుల్కొని చలనశక్తియే లేనట్లు నిద్రాణమై యుండినది. అట్టి పరిసరములలో ప్రాణవాయువును ప్రవేశపెట్టి మేల్కొల్పిన వారిలో శ్రీ స్వర్గీయ పితృపాదులు గణింపదగిన వారని లోక మెరుంగును.

మా జనకులు కలలుగన్న 'మహాంధ్రము' నిజమైనది. నేడు ఆంధ్రావని చరిత్ర, తెలంగాణ చరిత్ర చేర్చబడక సంపూర్ణము కానేరదు. అది గుర్తించియే స్వర్గీయులు స్వీయచరిత్రమును వ్రాయుటకు తలపెట్టి ఆరోగ్యము నానాటికి

క్షీణించుచున్నను, క్షణక్షణమునకు మృత్యువాసన్నమగుచున్నను పట్టుదల వీడక తమ చివరి రోజులలోనే గ్రంథము పూర్తి యొనరించి శార్వరి సంవత్సరం, ఆషాఢ శు. ద్వాదశి మంగళవారం రోజు దివంగతులైనారు. వారు సత్య సంకల్పులు. వారి యీ గ్రంథము తప్పక జనాదరణ పొందగలదని నమ్ముచున్నాము. కోరినదే తడవుగా యీ పుస్తకానికి పరిచయ వాక్యములు వ్రాసియచ్చిన ఆంధ్ర శాసన సభాధ్యక్షులు, మా శ్రేయఃకాములు అయిన శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు గారికి మా నమోవాకములు.

మా తండ్రిగారి సమకాలికులు సాంఘిక రాజకీయాది కార్యకలాపములలో వారి కత్యంత సన్నిహితులు మిత్రులు అయిన అమాత్యపుంగవులు శ్రీ కొండా వెంకటరంగారెడ్డి గారు, శ్రీ మందుముల వెంకటనరసింగరావు గారు, కార్యభారములలో నుండి కూడా యీ గ్రంథమును గూర్చి తమ అమూల్యాభిప్రాయము లొసంగినారు. వారికి మా నమస్సులు.

కీ.శే. మా నాయనగారు కోరిన వెంటనే ధర లాకాశము నంటుచున్న ఈ కాలములో గ్రంథ ముద్రణ కొరకు ఒకే పర్యాయము 14 రీముల కాగితము అందజేసినట్టి మిత్రులు శ్రీ సిద్దంశెట్టి రామనాథంగారికి, స్వర్గీయులపైనున్న ఆదరణ భావముతో గ్రంథ ముద్రణకువలయు మొత్తములను పెద్దపద్దులలో అందజేసి సహకరించిన మిత్రులు శ్రీ ఆకారపు రాజ చెన్నవిశ్వేశ్వరరావు, శ్రీ నాయన వెంకట క్రిష్ణారెడ్డి, కీ.శే. శ్రీ రాజా రాఘవరాజు యఱ్ఱం రాజు (వెంకటాపురం తాలూకా నూగూరు ఎస్టేటు జమీందారు) ప్రభృతులకు కేవలము కృతజ్ఞత తెలుపుకొనుటతోనే మా కర్తవ్యము పూర్తికాదు. వారికి సర్వేశ్వరుడు యితోధిక పుణ్యకార్యాచరణాసక్తి కలిగించి శుభముల నొసంగుగాక యని ప్రార్థన.

మా తండ్రిగారి అస్తమయానంతరం వారి గుణగణములను ప్రశంసించుచూ వారి ఆత్మశాంతి నభిలషించుతూ విచార సాగరమున మునిగియున్న మా కుటుంబము నకు ప్రముఖులు, పూజ్యులు అయినవారు పంపిన సంతాప సందేశముల నిందువెంట ప్రకటించుచున్నాము. వారి కందరకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

సమయోచిత ధైర్యవచనములతో గ్రంథ ముద్రణకు ప్రోత్సాహమొసంగిన మా మేలుకోరువారు, మా తండ్రిగారి సన్నిహిత సహచరులు అయిన శ్రీ

జమలాపురం గోపాలరావు, తాండ్ర వెంకట్రామనర్సయ్య, కాళోజి రామేశ్వరరావు, తూము వరదరాజులు గారలకు మా వందనములు.

గ్రంథకర్త చెప్పుచుండగా వ్రాతప్రతి పూర్తి చేయుటలోను తరువాత అచ్చు సరిచూచుటలో దివారాత్రములు సహకరించిన శ్రీ గండ్లూరి రామచంద్రరావు, శ్రీ అబ్దుల్ సత్తారు గారలకు మరియు గ్రంథమును తగ్గింపు రేటుతో అచ్చు వేయుటయేగాక అవిరామ కృషిచేసి, వీలగునంత త్వరలో దానిని సుందరముగా ముద్రించి అందించిన జయలక్ష్మీ ప్రింటింగ్ ప్రెస్ ప్రొప్రైటరు శ్రీ రామా సమ్మయ్యగారికిని మా అభినందనలు

మా తండ్రిగారు రచించిన 'స్వీయచరిత్ర – తెలంగాణ చరిత్రాంశములు' అను గ్రంథమును పూజ్యులు, మిత్రులు అయిన వారి ఆదరాభిమాన సహకారముతో ప్రకటించి పాఠకలోకమున కందజేయు సద్భాగ్యము మా కందజేసిన కరుణామయు డగు పరమేశ్వరునకు జోహారు లర్పించుచూ మరియొక మారు గ్రంథప్రకటనకు సహాయపడిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పి మనవి మాటలు ముగించుచున్నాను.

ఇట్లు,

బుధజన విధేయులు

**మాదిరాజు వెంకటసుబ్బారావు**

ఎడ్వకేటు,

**మాదిరాజు లక్ష్మీకాంతరావు**

బి.ఏ.ఎల్ఎల్.బి., ఎడ్వకేటు

హనుమకొండ.

# సంతాపము

శ్రీయుత మాదిరాజు వెంకటసుబ్బారావు,

లక్ష్మీకాంతరావుగార్ల సముఖమునకు–

మీరు వ్రాసిన 6వ జూలై లేఖవలన మీ తండ్రిగారు శ్రీ రామ కోటీశ్వర రావు పంతులుగారు 5వ తేదీనాడు సాయంకాలము దివంగతులైన వార్త విని చాల సంతాపము కలిగినది. నలభై సంవత్సరాల పైగా వారి పరిచయభాగ్యము కలిగి వారితో పాటు ప్రజాసేవలో పాల్గొను అవకాశము లభించిన నా కత్యంత ఖేదము గల్గుట సహజము, వారు నాకంటె పెద్దలు. శ్రీ మాడపాటి హనుమంత రావు పంతులుగారు మరియు అయ్యదేవర కాళేశ్వరరావుగారి యొక్క సమకాలికులును, అనుచరులును, పెద్దలందరును ఒకరొకరుగా విడిపోవుచుండుట వారి మిత్రులకు, సహచరులకే గాక దేశమునకే లోటు కల్గుచున్నది. పితృచ్ఛాయని కోల్పోయిన మీకును, మీ కుటుంబమువారి అందరికిని నా హృదయపూర్వకమైన సంతాపమును, సానుభూతిని తెలియబరచుచున్నాను. కీర్తిశేషులగు పంతులుగారి ఆత్మకు ప్రశాంతి నొసగుచు మీ కందరకు ధైర్యము ప్రసాదించుగాకయని పరమేశ్వరుని ప్రార్థించు చున్నాను.

గవర్నర్స్ క్యాంపు
ఉత్తరప్రదేశ్

ఇట్లు,

**బూర్గుల రామకృష్ణరావు**

**ఉత్తరప్రదేశ్ గవర్నర్**

# DISTRICT BAR ASSOCIATION,

HANAMKONDA, WARANGAL

RESOLUTION

"We the members of the Bar Association Warangal deeply mourn the death of Sri Madiraju Ramakoteshwar Rao, Advocate who passed away at 4 P.M. on 5-7-1960. It is with great regret we note theloss of a great Advocate, a scholar and a social worker. We the members of the Bar Association express our deepfelt condolences to the bereaved family of the deceased and pray the Almighty to bestow upon the family sufficient strength and courage to with - stand the loss. May the soul rest in peace."

Hanamakonda Sd/-
6-7-1960 Secretery Bar Assn.

# సంతాపసభ

శ్రీ మాదిరాజు సుబ్బారావుగారికి,

తేదీ 6-7-1960 రోజున శ్రీ రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషా నిలయములో మీ నాయనగారి నిర్యాణమునకు గాఢ సంతాపమును వెలబుచ్చుచు సంతాప సమావేశము జరుపబడినది. అందు ఈ క్రింది తీర్మానము ఆమోదించ బడినది.

**తీర్మానము :**

"మన నిలయాధ్యక్షులు, ఆదర్శ పురుషుడు, మహా మేధావి ప్రఖ్యాత స్థానిక న్యాయవాది, వివిధ ప్రజాహిత సంస్థలకు ఆధారభూతులు, నూతనోత్సాహులు మాదిరాజు రామకోటీశ్వరరావు పంతులుగారి నిర్యాణమునకు నేటి సభ తన గాఢసంతాపమును వెలిబుచ్చుచున్నది. కీర్తిశేషుని పుత్రునికి తన సానుభూతిని తెల్పుచున్నది. కీర్తిశేషుని యాత్మకు శాంతిని గలుగజేయుటకు ఈశ్వరుని ప్రార్థించుచున్నది.

ఇట్లు,

**సత్యనారాయణ**

కార్యదర్శి

శ్రీరాజరాజనరేంద్ర ఆంధ్ర భాషానిలయం

హనుమకొండ

తేదీ: 8-7-1960

# సంతాపసభ

నేడు శ్రీ ఆకారపు రాజ చెన్న విశ్వేశ్వరరావుగారి అధ్యక్షతన శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల పాలక సమితి సమావేశము సాయంత్రము 6 గంటలకు కళాశాల భవనములో జరిగినది. ఈ క్రింది సభ్యులు విచ్చేసిరి.

శ్రీ ముదిగొండ వీరేశలింగశాస్త్రి గారు

శ్రీ చిదిరాల సోమశేఖరం గారు

శ్రీ సూర్యదేవర రమణయ్య గారు

శ్రీ ముదిగొండ వీరభద్రయ్య గారు

శ్రీ బొల్లం లింగయ్య గారు

**తీర్మానము :**

శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలకు 1952 సంవత్సరం నుంచి 8 సంవత్సరములు అధ్యక్షులుగా యుండి సర్వవిధముల తన సహాయ సంపత్తులను వినియోగించుచూ కళాశాలను అభివృద్ధిలోనికి తెచ్చిన మాదిరాజు రామ కోటీశ్వర రావుగారి నిర్యాణము మా పాలక సమితి సభ్యులకెల్లరకు మిక్కిలి సంతాపమును కలిగించినది. వారు చేసిన అపారమైన సేవకు సంతసించుచూ మేమెల్లరము వారి ఆత్మకు పరమేశ్వరుడు శాంతిని గూర్చుగాక అని కోరుచూ వారి కుటుంబమునకు మా సానుభూతిని తెలియపరుచు చున్నాము.

ఇట్లు,

**ఎ. రాజ చెన్న విశ్వేశ్వరరావు**

అధ్యక్షులు

స్టేషన్‌రోడ్, వరంగల్

తేదీ: 8-7-1960

# ఆత్మీయ స్పర్శ

కీర్తిశేషులు మా తాతగారైన మాదిరాజు రామకోటేశ్వరరావు గారి మనుమలమైన మేము వారి స్వీయ చరిత్ర తిరిగి ముద్రణ చేయుటలో మా అందరి ఆమోదముంటుంది.

**మనుమలు**

1. మాదిరాజు కృష్ణారావు
2. మాదిరాజు పార్థసారధి రావు
3. మాదిరాజు మోహన్ రావు
4. మాదిరాజుసుభాష్ చందర్ రావు
5. మాదిరాజు రమేష్ చందర్ రావు
6. మాదిరాజు హరినారాయణ రావు
7. మాదిరాజు ఫణీంద్ర శంకర్ రావు
8. మాదిరాజు శేషతల్పసాయి

మా తాతగారు మాదిరాజు రామకోటేశ్వర రావు గారు సుమారు 60 సంవత్సరాల క్రితం తమ 'స్వీయ చరిత్ర' వ్రాసినారు. వారు తమ స్వీయ చరిత్రలో అప్పటి తెలంగాణలో ఉన్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక, విద్యాపరమైన ఎన్నో పరిస్థితులను పేర్కొన్నారు. నిజాం కాలంలో వరంగల్లులో న్యాయవాద వృత్తి చేస్తూ పైన వ్రాసిన అన్ని రంగాలలో సేవలందించారు.

ముఖ్యముగా గ్రంథాలయాల స్థాపన అభివృద్ధి, సంస్కృత కళాశాల, ఆయుర్వేద కళాశాల స్థాపనలో కృషి సల్పినారు. తొమ్మిదవ ఆంధ్ర మహాసభ

అధ్యక్షునిగా పని చేసినారు. మద్యపాన నిషేధమునకు కృషి చేసినారు. దేవాదాయ ధర్మాదాయ సలహా సంఘ న్యాయ సలహాదారుగా పనిచేసినారు.

ఆ రోజులలో రజాకార్ల వలన తెలంగాణా ప్రజలు ఎన్నో రకాల బాధలు పడ్డారు. తెలంగాణ విమోచనం కోసం ఆనాటి నాయకులు పడ్డ బాధలు మరియు చేసిన పోరాటముల గురించి, తాతగారు కథలు, కథలుగా చెప్పేవారు. అది విన్నవారికి ఎంతో స్ఫూర్తి కలుగుతుండేది. ఆ తర్వాత క్రమములో నేను కూడా తొలి దశ తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నాను. "ఇడ్లీ సాంబార్ గో బ్యాక్" అంటూ, మేము చేసిన నినాదాలకు తమిళ రిజర్వ్ పోలీసుల లాఠీదెబ్బలకు గురి అయినాము. అప్పట్లో ఆ దెబ్బలకన్నా, ఆ ఉద్యమంలో నేను కూడా పాల్గొన్నందుకు గర్వంగా భావిస్తున్నాను.

తాతగారు వ్రాసిన స్వీయ చరిత్రలో మొత్తం అయిదు అధ్యాయాలు ఉన్నవి. మొదటి అధ్యాయంలో తాతగారి వంశం గురించి, రెండవ అధ్యాయంలో జననం నుంచి ఉద్యోగ విరమణ వరకు గల ప్రస్థానం లిఖించబడినది. మూడవ అధ్యాయంలో న్యాయశాస్త్ర విద్య మూసీనది వరద బీభత్సం మొదలగు అనేక విషయాలు వ్రాయ బడినవి. నాల్గవ అధ్యాయంలో స్వతంత్ర జీవనారంభంతో ప్రారంభమై గ్రంథాలయ సేవ, మద్యపాన నిషేధం, న్యాయశాఖ విభజన వంటి 13 అంశాలు వ్రాసినారు. అయిదవ అధ్యాయంలో హైద్రాబాద్‌లో వార్తా సభల నిర్వహణ, ఆయుర్వేద విద్యాపీఠం, సంస్కృత కళాశాల, రజాకార్ల ఉద్యమం, దేవాదాయ, ధర్మాదాయ శాఖ తదితర అంశాలను ప్రస్తావించారు. మాదిరాజు వంశవృక్షాన్ని తయారు చేయుట మాకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఇంతటి గొప్ప పుస్తకం (గ్రంథం) మా తాతగారిచే లిఖించబడటం వలన మాదిరాజు వంశం ధన్యమైనది.

తాతగారి స్వీయ చరిత్ర అయినప్పటికీ, ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ ఉద్యమ నేపథ్యాలతో ముడిపడియున్నవి. ఆనాడు సమాజ స్థితిగతులు కళ్ళకు కట్టినట్లుగా వ్రాసినారు. ఇది తెలంగాణ ప్రజల పఠనీయ గ్రంథం అని నేను అభిప్రాయపడుతున్నాను.

ఈ స్వీయ చరిత్ర సుమారు 60 సంవత్సరాల క్రితం వ్రాయబడినది. అపుడు నాకు సుమారు 15 సంవత్సరాల వయస్సు. స్వీయచరిత్ర వ్రాసిన వ్రాత పేజీలు వరంగల్ చౌరస్తా యందున్న జయలక్ష్మీ ప్రింటింగ్ ప్రెస్ వారికి అచ్చువేయుటకు ఇచ్చి, వారు ఇచ్చిన అచ్చయిన ప్రూఫ్‌లు చూచుటకు నక్కల గుట్టకు తాతగారి స్వగృహమునకు తీసుకు వచ్చేవాడను. ఈ విధముగా 481 పేజీలు ఉన్న స్వీయ చరిత్ర పూర్తి అగునంత వరకు తిరిగేవాడను. ఈ స్వీయ చరిత్రలో ఉన్నటువంటి ఫొటోలకు బ్లాకులు తయారు చేయుటకు ఆ రోజులలో వరంగల్‌లో ఫోటో బ్లాకులు తయారు చేయు సౌకర్యము లేకుండెను. వాటికోసం తరచూ హైద్రాబాద్‌కు వెళ్ళి రావలసి వచ్చేది.

ఈ విధముగా స్వర్గీయ తాతగారి చరిత్ర నిర్మాణ క్రమములో నేను భాగస్వామిని కాగలుగుట అదృష్టంగా మరియు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

ఆత్మీయ స్పర్శతో పులకించిన

**మాదిరాజు కృష్ణారావు**

సెల్: 9502856344


# విషయ సూచిక


| ప్రకరణము | విషయము | పేజీ |
|---|---|---|
| | **ఒకటవ అధ్యాయము** | |
| 1. | నా వంశము | 27 |
| 2. | రాజా తిరుమలరావు | 51 |
| 3. | రాజా జ్ఞానవంతు - చంద్రవంతుగార్లు | 54 |
| 4. | రాజా చంద్రవంతుగారి సంతతి | 55 |
| 5. | రాజా రామారావుగారి శాఖ | 57 |
| 6. | నరసింహంగారి ఆదర్శజీవితం | 60 |
| 7. | నరసింహంగారి సంతతి | 67 |
| 8. | మా తండ్రిగారి జీవిత విశేషములు | 71 |
| | **రెండవ అధ్యాయము** | |
| 1. | జననము - బాల్యము | 79 |
| 2. | విద్యాభంగము | 107 |
| 3. | సేవకావృత్తి - పేష్కారి ఉద్యోగము | 112 |
| 4. | ఉద్యోగ విరమణ | 117 |
| | **మూడవ అధ్యాయము** | |
| 1. | న్యాయశాస్త్ర విద్య | 119 |
| 2. | పునః ప్రయత్నము | 130 |
| 3. | మూసీనది వరద బీభత్సము | 133 |
| 4. | న్యాయశిక్షణ రెండవ ఘట్టము | 143 |

## నాలుగవ అధ్యాయం


| | | |
|---|---|---|
| 1. | స్వతంత్ర జీవనారంభము | 151 |
| 2. | సనదులు తీసుకొనుటలో కష్టము | 153 |
| 3. | గ్రంథాలయ సేవ | 155 |
| 4 | వకాలత్ వృత్తి దినదినాభివృద్ధి | 161 |
| 5. | మొదటితరగతి వకాలత్ పరీక్ష కొరకు ప్రయత్నము | 171 |
| 6. | సదర్ అదాలత్ వకీలుపట్టా పొందితిని | 175 |
| 7. | హైకోర్టు వకీలునైతిని | 178 |
| 8. | న్యాయశాఖ విభజన | 179 |
| 9. | అనుభవ జ్ఞానముచే సంపాదించిన ప్రయోజనములు | 193 |
| 10. | వృత్తినిర్వహణలో తటస్థించిన విషయములు | 195 |
| 11. | రాష్ట్రేతర ఉద్యమంలో సహకారం | 199 |
| 12. | మద్యపాన నిషేధ ప్రయత్నము | 205 |
| 13. | ఆర్థిక సంపాద్యము | 209 |
| 14. | శుభకార్యములు – యాత్రలు | 215 |
| 15. | నా మతవిశ్వాసము | 219 |
| | **అయిదవ అధ్యాయము** | **221** |
| 1. | గ్రంథాలయ స్థల సంపాద్యము | 222 |
| 2. | వరంగల్ మొదటి దురంతము | 230 |
| 3. | హైద్రాబాదు విద్యాసభలు | 243 |
| 4. | భారత కాంగ్రెస్ ఖిలాఫత్ ఉద్యమము | 246 |
| 5. | త్రిలింజ్ఞాయుర్వేద విద్యాపీఠము | 249 |
| 6. | స్థానిక పరిపాలనా వాంఛ | 255 |
| 7. | వరంగల్ కాకతీయ కాన్ఫరెన్స్ | 261 |
| 8. | సహకారోద్యమము | 268 |
| 9. | న్యాయవాది సంఘము | 271 |

| | | |
|---|---|---|
| 10. | వరంగల్ రెండవ దురంతము | 276 |
| 11. | వరంగల్ ఖాస్గీ పాఠశాలలు | 284 |
| 12. | ఆహార కమిటీ | 292 |
| 13. | నిజాం ఆంధ్రోద్యమము | 298 |
| 14. | వరంగల్ మూడవ దురంతము | 369 |
| 15. | రజాకార్ ఉద్యమము | 374 |
| 16. | వరంగల్ నాల్గవ మహాదురంతము – బీభత్సము | 381 |
| 17. | స్టేటు కాంగ్రెసు సభానంతరం కోర్టు బహిష్కారము | 393 |
| 18. | గౌర్నరు పరిపాలన – స్టేటు కాంగ్రెసులో చీలికలు | 402 |
| 19. | అనుమాన కమ్యూనిస్టుల రిలీజు కమిటీ | 411 |
| 20. | సంస్కృతభాషా సేవ | 417 |
| 21. | దేవాదాయ ధర్మదాయ సలహాసంఘము | 435 |



మాదిరాజు వంశ వృక్షము
గోత్రం : ఆత్రేయస

# ఒకటవ అధ్యాయము

*ప్రకరణము - 1*

## నా వంశము

స్వీయ చరిత్ర వ్రాయుటకు నా హృదయములో మధ్యమధ్య ప్రేరేపణ కలుగుచున్నను, కొంత సిగ్గు, ఉదాసీనత, వెనుకకులాగుచువచ్చినవి. కాని వంశములో రక్తస్పర్శగల ఉత్సాహియగు ఒక యువక మిత్రుని ప్రోద్బలము అధికముగా కాజొచ్చినది. బహుశః పూజ్యులగు మా ప్రపితామహులతో కొంత రక్తసంబంధము కలవాఁడగుటచే ఆ కథను వినుటకు ఆయన హృదయమున కొంత సంచలనము కలిగియుండవచ్చును. కష్టజీవినగు నా చరిత్ర వ్రాసికొనుటకు ముందు పూజ్యపితరుల చరిత్ర పేర్కొనుట సాంప్రదాయము, కర్తవ్యము అయి యుండును. ప్రఖ్యాత పురుషసింహముల వంశమున జన్మించిన అల్పుడనగు నేను వారి వంశసంభూతుడ నని చెప్పుకొనుటకు నైజమగు సిగ్గు బాధించుచున్నను, మిత్రుని ప్రోత్సాహము, ఆత్మప్రబోధము నాపైన ఆజ్ఞారూపమున ప్రభావము చూపినది. కాన ఆత్మ ప్రబోధ నిర్బంధముచే మా పూజ్య పితామహులగాథను గ్రంథస్థము చేయుటకు 1958 మే నెల నుండి సాహసించితిని. మహామహుల జీవిత విశేషములు వినదగినవి, గ్రహింప తగినవి, అనుకరించతగినవి అసంఖ్యాకములుగా నున్నవి. వాటిని గ్రంథస్థము చేయుట కెందరో ప్రయత్నించి పూర్ణ విజయము గాంచలేకపోయిరి. ఆ కాలమున, ఆత్మకథను వ్రాసియుంచు అభ్యాసములు లేకుండెను. కాఁబట్టి చరిత్ర పరిశోధకులు, శిలాశాసనములను, తామ్రశాసనములను దానపత్రములను, కృతులను, గేయములను, తుదకు పరంపరగా వాడుకొని కట్టకథలను ఆధారము చేసికొని పుణ్యపురుషుల జీవిత

కథలను గ్రంథస్థము చేసియున్నారు. నేను ముందు చెప్పబోయెటి గాధలకు తారీఖువారి లిఖితాధారములు పూర్తి లభించియుండలేదు. కొన్ని మాజ్ఞాతుల యిండ్లలో నుండి భద్రపరచబడనందున క్షిప్తమయినవి. కొన్ని కాపురముల మార్పుల వలనను కొన్ని క్రిమికీటకాదుల భక్షణము వలనను అదృశ్యములయినవి. దొరికినన్ని లిఖితాధారములను సందర్భానుసారముగా వివరించగలను. కాని నా రచనకు మూలాధారము, మా తండ్రిగారి వలన వినిన గాధయే మేము బ్రాహ్మణులమైనను "ఇదంబ్రాహ్మ్యం ఇదంక్షాత్రం" అని దేశముకొఱకై బ్రాహ్మణ ధర్మమును రాజ్యాంగ చక్రమును నడిపించిన ఆరువేల నియోగి బ్రాహ్మణ కుటుంబమునకు చెందినవారమని చెప్పుటకు గర్వించు చున్నాను.

## నా పూర్వుల చరిత్ర

మాది ఆత్రేయస గోత్రము. మొదట యింటి పేరు చల్లాప్రగడ. మూలపురుషుని శుభనామము అన్నమరాజు గారు. వారి కుమారులలో ఒకరు మాదయ్య లేక మాదిరాజు అనే ఒక పుణ్యపురుషుడు యశోవంతుడైనందు వలన, ఆయన తరువాత వంశీకులు తమ గృహనామము మాదిరాజు అని వాడుచు వచ్చిరి. వంశవృక్షములను, తరములనుబట్టి బహుశః మాదిరాజు గారు వేయి సంవత్సరములకు పూర్వపువాడని నా అంచనా. ఆయన తరువాత నేను 15వ తరమువాడను. మాదిరాజు వంశము శాఖోపశాఖలుగా వృద్ధి చెందినది. దానినంతయు గ్రంథవిస్తరణ భీతిచే నిందుదహ రించలేదు. చల్లాప్రగడ అన్నమరాజు నాటి నుండియు మాదిరాజు వంశీకులందరికిని జన్మస్థానము నేటి నందిగామ తాలూకా జుజ్జూరు గ్రామమేయనుట నిర్వివాదమైన చరిత్రాంశము. జుజ్జూరునకు పేరు ద్రుజ్జూరు అనియును ప్రస్తుతము గుంటూరు అనే దానికి గొంటూరు అనే పేరుండెననియు ఈ రెండు సీమలను అమ్మరాజ విష్ణువర్ధనుని కాలమున చాళుక్య భీముడనే సేనాపతికి జాగీరుగా క్రీ.శ. 980 సంవత్సర ప్రాంతమున యిచ్చిరనియును ఆంధ్రచరిత్రలో శ్రీ చిలుకూరి వీర భద్రరావుగారు వ్రాసియున్నారు. యావదాంధ్ర దేశము గోల్కొండ ప్రభుత్వమునకు చెందియుండిన సంగతి చరిత్రాత్మకమే. మొగలయి ప్రభుత్వ కాలమునకు తదుపరి కుత్బ్‌షాహి పరిపాలన కాలమునను తదుపరి ఆసఫ్‌జాహి వంశీకులలో మొదటి రాజుల పాలమునను సంస్థానములు, జాగీర్లు, జమీందారీలు ఉండెడివి. సరిబస్తా కవుళ్లనికూడా ఉండేవి. కొన్ని గ్రూపుగ్రామములకు పరిగణాలనేవారు. జుజ్జూరు కూడా పరిగణాగా ఉండి దాని క్రింద 15 గ్రామములుండేవి. వాటి పేర్లు (1)

జుజ్జూరు, (2) పరిటాల (3) కంచికచెర్ల (4) గొట్టుముక్కల (5) పొన్నవరం (6) జమ్మవరం (7) అల్లూరు (8) పెద్దాపురం (9) చట్టన్నవరం (10) చౌటపల్లి (11) దొడ్డదేవరపాడు (12) వైరదరి అన్నవరం (13) రుద్రవరం (14) మొలుగుమాడు (15) భైరవునిపాడు పరిగణాలను స్థానిక ప్రముఖులకు సర్‌బస్తాకవుళ్లు యిచ్చేవారు. కవులు డబ్బు ప్రభుత్వమునకు చెల్లించి భూమ్యాదాయము యావత్తు వసూలు చేసికునేవారు. పై చెప్పిన జుజ్జూరు పరిగణా జమీందారి మాదిరాజు కుటుంబమునకు చెందియుండెడిది. ఇంతేగాక దేశముఖి దేశపాండ్యాగిరి కొన్ని కర్ణీకపుహోదాలు మాదిరాజు కుటుంబమునకే ఉండెడివి. దేశముఖీ దేశపాండ్యాగిరి పరిటాలకు మాత్రము మిగిలియుండెను. 1949 సం.లో పరిటాల కూడా నైజాం ప్రభుత్వం నుంచి తొలిగిపోవడము వలన అంతమైనది. అద్దానిని ముందు వివరించెదను.

స్న 1105 (1698) సంవత్సరంలో అప్పటి పెద్దలైన మాదిరాజు కూర్మరాజు, కోదండుడు మఱి యిద్దరిపేర సనదు ఈయబడెను. అందు జుజ్జూరు పరిగణా దేశముఖి దేశపాండ్యాగిరి హోదాలు పూర్వము వలెనే బహాలు చేయబడినట్లు వ్రాయబడెను. దీనిని బట్టి పూర్వము నుండియు పరంపరగా వచ్చుచున్నట్లు తెలియగలదు. మాదిరాజు వంశీకులు జుజ్జూరు పరిగణాకు, ఎట్లు జమీందారులో అట్లే కలవకొలను (వెలమవారు) వారు మధిరె పరగణాకు జమీందారులుగా నుండిరి. జుజ్జూరునకు 6 మైళ్ల దూరమున నున్న యెర్రుపాలెం గ్రామము మధిరె పరిగణాకు చెందినదిన్ని అయి యుండెను. సరిహద్దు తగాదాలు ఉభయ పరిగణాల జమీందారు లలో ఉండడము సహజము. సరిహద్దు తగాదాల సందర్భములో ఉభయ జమీందా రులు పెద్దాపురం, యెర్రుపాలెం పొలిమేరల పైకి వెళ్లినారనిన్ని, అప్పటి జుజ్జూరు జమీందారులైన మాదిరాజు కూర్మరాజు, కోనేటిరాజుగార్లను మధిర జమీందార్లు చంపి జుజ్జూరు పరగణాను ఆక్రమించుకొనినట్లును, మా పెద్దలు చెప్పుచుండెడివారు. కాలము మాత్రము తెలియదు.

తదుపరి జుజ్జూరు పరిగణాకు కలవకొలనువారే జమీందారులుగా నుండిరి. మాదిరాజు కుటుంబము జమీందారి కుటుంబము. కొన్ని గ్రామాధికారములు వారికె సంక్రమించి యుండెను. కాని కర్ణీకము చేయుట న్యూనతగా నెంచుకొనుచుండిరి. ఆ కారణమున ఒక బీద కుటుంబీకునికి పిల్లనిచ్చి పరిటాల కర్ణీకమున్ను, ఒక బీద కుటుంబీకుని తెచ్చి, పిల్లనిచ్చి, జుజ్జూరు

కర్ణీకమున్ను దత్తముచేసిరి. పరిటాలకు వచ్చిన ఆయన తన ఇంటి పేరు పరిటాల అని వాడుకున్నాడు. కాని జుజ్జూరుకు వచ్చిన ఆయన బహుశః మేడుకొండూరు గ్రామం నుంచి వచ్చియుండవచ్చును. ఆ కారణమున ఆయన యింటిపేరు మేడుకొండూరు అనే వాడుచువచ్చెను. ఈ రెండు కుటుంబములకు ఆర్థిక సహాయము కూడా చేసి సంబంధ బాంధవ్యములు చేయుచు వచ్చిరి. ఇటీవల కొన్ని సంవత్సరముల క్రితం వరకు సభలు సమావేశములలో అగ్రతాంబూలములు మాదిరాజు వంశీయులకే యిచ్చుచుండిరి.

జమీందారి పోయినది. ఆర్థిక లోపము పెరగజొచ్చినది. కాన పరిగణాలలోని కొన్ని గ్రామముల కరిణీకములు (జమ్మవరం, చౌటపల్లి, దొడ్డదేవురపాడు, జుజ్జూరులో సగము వాటా) హస్తగతము చేసికొనగలిగిరి. కుటుంబము పెరిగినది కనుక జాతామృతాశౌచములలో అప్పుడప్పుడు శు భకార్యములకు నిరోధములు కలుగుట తటస్థించుచు వచ్చినవి. అందువలన సాంప్రదాయానుసారం కొన్ని శాఖలు వేరువేయబడినవి. వంశవృక్షము చాలా పెద్దది. అందులో మా శాఖ కొంచెము చిన్నది. బహుళ సంఖ్యాకులగు వంశీకు లందరి చరిత్ర నాకు లభించియుండలేదు. కాని నా పూర్వుల శాఖలతో సంబంధించినంత వరకు కొంత గాథ మా తండ్రిగారి వలన తెలిసికొనియుంటిని. కాబట్టి నాకు అయిదవ తరపు మూలపురుషుడగు నర్సరాజుగారి శాఖను తెలుపగల వంశ వృక్షమును దీనిలో చేర్చుచున్నాను. నర్సరాజుగారి కుమారుడు వెంకటనర్సుగారు వసుదేవునివలె పుత్రరత్నములనుగనిన మహానుభావుడు. పుణ్యపురుషుడు. మరియు ఆయనను “ఆసల్ యాదిందామాఫు” (హోదాలను సంపాదించినవారు) అని కూడా వ్రాయబడుచుండెను. కనుక ఆయన నాటి నుంచి లభించిన చరిత్రనే యిందు వ్రాయుచున్నాను.

శ్రీ మాదిరాజు వెంకటనర్సుగారి కాలము క్రీ.శ. 1750 నుండి 1800 సంవత్సరముల మధ్యకాలమని నేనూహించుటకు కొన్ని సనదులు దుంబాలాలు దానపత్రములు లభించినవి. శ్రీ వెంకటనర్సుగారికి చాలాకాలము పూర్వమే మాదిరాజు కుటుంబము నుంచి జమీందారిపోయి వెలమవారి కుటుంబమునకు చెందిపోయినది. జుజ్జూరు 4, 5 శివారు పల్లెలతో చేరిన పెద్ద గ్రామమగుటచే 6గురు కరణములుండేవారు. అందొకభాగము వెంకటనర్సుగారి కుటుంబమునకు చెందియుండెను.

వెంకటనర్సుగారు బహుకుటుంబీకుడు 4గురు కుమారుల పేర్లు వంశ వృక్షమునుబట్టి వ్రాయగలిగితిని. వారికి స్త్రీ సంతాన మెందరో నాకు తెలియదు. దేశముఖీ, దేశపాండ్యా హోదాలు కలిగి జమీందారి కుటుంబమునకు చెందిన వెంకటనర్సుగారికి కుటుంబ పోషణ భారమైనది. జీవనోపాధికి స్వస్థానమున తగిన మార్గము లభించలేదు.

ఆ కాలమున పారశీభాష రాజభాషగానున్నను తెలుగుభాషలోనే రాజకీయ వ్యవహారములన్నియు నడుచుచుండెడివి. వెంకటనర్సుగారు తెలుగుభాషలో వ్యవహార కార్యనిర్వహణము చేయు సమర్థుఁడున్ను, లెఖ్ఖల్లో ప్రవీణుడున్ను. కనుక ఉద్యోగము సంపాదించవలెనని నిశ్చయించుకొనెను.

ఉత్తర సర్కారులు కూడా నిజాం ప్రభుత్వమునకు చెందినవనుట చరిత్రాత్మక విషయమే గనుక జుజ్జూరు మొదట ఖమ్మం సర్కారుకు చేరియుండెను. తరువాత మచిలిపట్నం సర్కారులో చేరెను. నిజాం పరిపాలనలో మొదటి నుండియు కరోడ్గిరిపన్ను వసూలు చేయుచుండెడివారు. ఈ నియమము 1953 వరకు ఉండియుండెను. మొదట కొంతకాలము ఈ కరోడ్గిరిని ఒకరికి కంట్రాక్టు యిచ్చేవారట. అందువలన కోటివరహాలు ఆదాయము వచ్చేదట. ఆ కారణమున ఆ పన్నుకు కరోడ్గిరి (కోటి వరహాల పన్ను) అని పేరు వచ్చినదని చెప్పుకునేవారు. నిజాం రాష్ట్రము యావత్తు కంట్రాక్టు అబ్దుల్ కరీంఖాన్ అనే ఆయనకు ఉండేదని ఆయన తరచుగా ఖమ్మంలో ఉండేవాడని వాడుక. ఖమ్మం సర్కారురతో సంబంధించిన కార్యస్థానము ఖమ్మంలో ఉండెడిది. కనుక శ్రీ వెంకటనర్సుగారిని ఖమ్మం వెళ్లి కంట్రాక్టరును దర్శించుటయు ఆయన వెంకటనర్సుగారిని ఖమ్మం కార్యస్థానంలో ఉద్యోగిగా నియమించుకొనడము జరిగినది. శ్రీ వెంకటనర్సుగారు ఒక్కడే వెళ్లి ఖమ్మం ఉద్యోగమున ప్రవేశించెను. నాలుగు నెలలయిన తరువాత సెలవు తీసికొని యింటికివచ్చి కొలదిరోజులుండి ఉపనయనము గాని 12 సంవత్సరముల ఈడుగల వెంకటకృష్ణమ్మను వెంటతీసికొని ఖమ్మం బయలుదేరెను. అప్పటికి వెంకటకృష్ణమ్మ తెలుగులోబడి చదువు పూర్తి చేసుకొన్నాడు. బడిచదువు అనగా సుమతి శతకము కృష్ణశతకము మొదలగునవి అర్థసహితముగా చదువుటయు ఆంధ్రనామ సంగ్రహము, అమరకోశము వల్లించుటయు, నేర్వవలెను. అన్నివిధములైన గణితములు తెలసియుండవలెను. దస్తూరి బాగా ఉండవలెను. ఉత్తరములు, దస్తావేజులు అర్జీల మతలబులు తెలిసియుండవలెను. ఇప్పటి బడులలోని ఏ తరగతి విద్యకిది సమానమో అనుభవజ్ఞులు గ్రహించగలరు.

తండ్రి వెంట పయనమయ్యే కృష్ణమ్మలో ఈ సమర్థత వచ్చియుండెను. ఆ రోజులలో రైళ్లు లేవు. బండ్లమీదను లేక కాలినడకను ప్రయాణములు చేయువారు. అందువలన శ్రీవెంకటనర్సుగారి కుమారరత్నము కృష్ణమ్మసహా కాలినడకను ఖమ్మం ప్రయాణము సాగించెను. ఖమ్మం మెట్టు జుజ్జూరుల మధ్య అయిదామడ దూరము అనగా నలభైమైళ్లు. సామాన్య మనుష్యులు రెండవరోజు సాయంత్రము ఖమ్మం చేరగలుగుతారు. అట్లే శ్రీ వెంకటనర్సుగారును మధ్యాహ్నము వేళకు పెనుగంచిప్రోలు లేక అదే ప్రాంతపు గ్రామమునకుచేరి యొక బ్రాహ్మణునియింట బసచేసెను. శ్రీ వెంకటనర్సుగారు బ్రాహ్మణునియింట బసచేసిన తరువాత ఉపనయనముగాని కృష్ణమ్మను యింటవదలి తాను స్నాన సంధ్యాద్యనుష్ఠానములు తీర్చుకొనుటకు జలాశయమున కేగెను. ప్రయాణబడలిక ఆకలిచే డస్సియున్న కృష్ణమ్మ బ్రాహ్మణు నింటి వసారాలో చాపమీద ఉత్తరీయము కప్పుకొని పరుండి గాఢనిద్రనుచెందెను. ఆ సమయమున ఒక నాగుపాము పరున్న బాలకృష్ణమ్మ పాదముల నుండి యెక్కి ఉత్తరీయము మీదుగా తలమీదికి పాకి దిగి పడిగెవిప్పి పోవుచున్నదట. ఈ దృశ్యమంతయు ఇంటి బ్రాహ్మణుడు దూరము నుండి చూచుచునే యుండెను. పామును చంపుటకు ప్రయత్నము చేయుటగాని కృష్ణమ్మను మేలుకొలుపుటగాని మంచిదికాదని గ్రహించి దూరాదూర విచారముగల బ్రాహ్మణుడు, దైవికముగా నీ కార్యము దానంతట అదే జరిగిపోగలదని గ్రహించెను. పాముకు ఎవరిని కరవవలెననెడి అపకార చింతనలేదు. కనుక తనదారిన తాను యెటో వెళ్లి పోయెను. గాఢనిద్రలో పడియున్న కృష్ణమ్మ కేమియును తెలియదు. శ్రీ వెంకటనర్సుగారు స్నానసంధ్యాద్యనుష్ఠానములను పూర్తి చేసుకొని భోజనమువేళకు బ్రాహ్మణుని యింటికి వచ్చెను. కుమారుడట్లే నిద్రించుచుండుట జూచి, భోజనమునకు లెమ్మని లేపెను. కృష్ణమ్మ మేల్కొని భోజనమునకు సిద్ధపడినాడు. వడ్డన అయినది. భోజన సమయమున యింటి బ్రాహ్మణుడు జరిగిన నాగుబాము చిత్రమును పూర్తిగా వెంకటనర్సుగారితో చెప్పెను. తన కుమారుఁడికి సర్పమువలన ప్రమాదము కలుగకుండా గండము తప్పినందుకు, అపరిమితానందమును పొందెను.

ఇంటిబ్రాహ్మణుడు కొంత తెలిసినవాడేయగుటచే ఈ దృశ్యమును గుఱించి యోచించి కృష్ణమ్మ అఖండలక్ష్మీ సంపన్నుఁడు రాజభోగి కాగలడని ఊహచేసికొని తన మనోభావమును అనగా కృష్ణమ్మ గొప్ప అదృష్టవంతుడుకాగలడని వెంకటనరసుగారికి జోస్యముచెప్పెను. కుమారుడు అదృష్టవంతుఁడు కాగలడంటె

విని సంతోషించని తలిదండ్రులుండరు గదా. అట్లే వెంకటనర్సుగారును కొంత ఆనందమును చెందినను దారిద్ర్యముతోనున్న తన కుమారుడు అఖండ లక్ష్మీసంపన్నుడు కాగలఁడనుట గగన కుసుమమని నమ్మలేక ముందు ప్రయాణమునకు ఉద్యుక్తు డయ్యెను. ఆరోజో లేక మరురోజో తండ్రికుమారులు ఖమ్మం చేరుకొనిరి. నియమానుసారము సెలవు గడచిపోయినది. గనుక వెంకటనర్సుగారు కార్య స్థానములోనికి వెళ్లి ఉద్యోగ విద్యుక్తములను నెరవేర్చుచుండెను. కుమారుఁడు చదువను వ్రాయను నేర్చినవాఁడే గనుక వెంకటనర్సుగారు కృష్ణమ్మను కూడా కచహరీకి తీసికొని వెళ్లుచు ఆయనచేత వ్రాత, లెఖ్ఖ పనులను చేయించుచుండెడివాఁడు. సూక్ష్మబుద్ధిగల వెంకటకృష్ణమ్మ తండ్రికి సహకారిగా వ్రాత లెఖ్ఖపనులను జాగరూకత తోను సమర్థతతోను స్వతంత్రముగాను నెరవేర్చగలవాఁడాయెను. ఒకనాడు యజమానియగు కరీంఖాన్‌గారి పేషీ (సన్నిధి)లోనికి వెంకటనర్సుగారు వెళ్లవలసి వచ్చెను. అప్పుడు ఆయన తన కుమారుడఁగు వెంకటకృష్ణమ్మను వెంటతీసికొని వెళ్లెను. ఖాన్‌గారు వ్యవహారం సంప్రదింపుల అనంతరము కూడా ఉన్న కృష్ణమ్మను గుఱించి అడుగుటయు వెంకటనర్సుగారు ఈయన తనకుమారుడని చెప్పుటయు జరిగినది. కరీంఖాన్‌గారికి సంతతిలేదు. బాలకృష్ణమ్మయొక్క భావిభాగ్య శుభసూచక లక్షణములుగల ముఖారవిందమును చూచి, ప్రేమానందములుట్టిపడ "వెంకటనర్సు ఈ పిల్లవానిని నాకిమ్ము" అని అడిగెనట. అప్పుడు వెంకటనర్సుగారు "అయ్యా నేను బ్రాహ్మణుడను మీరు మహమ్మదీయులు కులం చెడగొట్టి ఎట్లా ఈయగలను" అని బదులుచెప్పెను. వెంకటనర్సుగారూ! మీ మతమునకు భంగము లేకుండా ఈ పిల్లవానిని పెంచి తరిబీయతు చేసి పెద్దవాడిని చేయగలనని ఖాన్‌సాహెబు నమ్మకముగా చెప్పెనట. వెంకటనర్సుగారికి యజమాని మాటలయందు నమ్మకమే గనుక అట్లేనని వాగ్దానముచేసెను. తదుపరి కృష్ణమ్మకు ఉపనయనము చేయదలచి యజమానిని కోరగా ఖాన్‌సాహెబు ఉపనయనార్థము, నలుబది వరహాలు వెంకటనర్సుగారికి యిచ్చి కొన్నిరోజులు సెలవిచ్చి ఉపనయనము కాగానే వెంకటకృష్ణమ్మను తప్పక తీసికొని రమ్మని ఆజ్ఞాపించెనట. ఆ ప్రకారము వెంకటనర్సు గారు కుమారునితో కూడా జుజ్జూరు వచ్చి ఆ డబ్బుతో కృష్ణమ్మ యొక్కయు, రెండవ కుమారుడునాగోరావు యొక్కయు ఉపనయన కార్యములు పూర్తి చేసికొనెను. అప్పుడు మాకుటుంబమునకు గోరింట్ల అన్నప్పశాస్త్రీగారు పౌరోహితులుగా నుండిరట. ఉపనయనానంతరము వెంకటనర్సుగారు కృష్ణమ్మ నాగోరావులతో మరల ఖమ్మమునకు వచ్చెను. తక్కిన

కుటుంబము జుజ్జూరునందే యుండెనో ఖమ్మం చేర్చబడినదో తెలియలేదు. గాని నాగోరావు రామారావులు పారసీవిద్య నభ్యసించి వ్యవహార పత్రములను లెఖ్ఖలను పారసీభాషలో నిర్వహించుచుండెడి వారు. హైద్రాబాదు ప్రభుత్వమున చాలాకాలము పారసీయే రాజభాషగానుండి తరువాత ఉరుదు రాజభాషగా చేయబడినది. తిరుమల రాయుని విద్యాజ్ఞానము సంగతి తెలియలేదు. సుబ్బయ్యగారి కుమారుఁడు వెంకటపాపయ్యకు కూడా తెలుగు పారసీ భాషలలో ప్రవేశమున్నదని చెప్పేవారు. వెంకటనర్సు ఖమ్మం చేరినతరువాత కరీంఖాన్ కృష్ణమ్మను తన యింటినే ఉంచుకొని లెఖ్ఖ పనులలో బాగా తరిబీయ్యతు చేయించి ప్రావీణ్యుని జేసెను. భోజనము మాత్రము తండ్రి వద్దనే చేయుచు అహోరాత్రములు వెంకటకృష్ణమ్మ కరీంసాహెబు వద్దనే ఉండేవాడట. బాల్యమునుండియు ఖాన్ సాహెబు యింటికి వచ్చేవాడు గనుక జనానాలోనికి వెళ్లేవాడు. ఖాన్‌సాహెబు దంపతులు కన్నపుత్రునికన్న యెక్కువ వాత్సల్యముతో చూచుటయే గాక తమవద్దనే పరుండబెట్టుకొనేవారు. వెంకటకృష్ణమ్మ అసాధారణ ప్రజ్ఞావంతుడగుటచే కరోడ్గిరి లెఖ్ఖవ్రాత పనులలో నిపుణుడై ఉద్యోగస్తు లందఱిచేతను పనితీసికొన శక్తిగలవాఁడాయెను. ఇక కన్నకుమారుని బోలిన వెంకటకృష్ణమ్మ లెఖ్ఖ మొదలగు ఆఫీసు పనులను నిర్వహించు చున్నాఁడు. గనుక కరీంఖాన్ సాహెబుకు భారము తక్కువ అయినది. సుఖముగా కంట్రాక్టు లాభము యధాప్రకారము అనుభవించు చుండెను. ఈ మధ్యకాలమున వెంకటకృష్ణమ్మగారి వివాహము తటస్థించి సమీపగ్రామమగు పల్లెంపల్లిలోని ఆదిరాజు వారింటి కన్య రాజ్యలక్ష్మిని యిచ్చి వివాహము జరుపబడినది. వెంకటకృష్ణమ్మ సమర్థత భక్తివిశ్వాసములు కరీంఖాన్ సాహెబును బాగా ఆకర్షించినవి. ప్రతి వ్యవహారములోను ఖాన్‌సాహెబు వెంకటకృష్ణమ్మను వెంటనుంచుకొని అధికారవర్గము వద్దకు ముఖ్యమంత్రి వద్దకును పోవుచుండెను. క్రమేణ వెంకటకృష్ణమ్మకు హైదరాబాదు లోని అధికారులందరి తోను జాగీర్దారులు సంస్థానాధిపతులతోను బాగా పరిచయము కలిగినది. కంట్రాక్టు సంపాదించుటకును ఆ సంబంధమైన ఉత్తర్వులు జారి చేయించుటకును, డబ్బు చెల్లించుటకును, తీసికొనుటకును కరీంఖాన్‌తో పనిలేకుండా స్వయముగానే సమర్థించుచుండెడివాడు. ముఖ్త్యారునామా యిచ్చునేలేదో అప్పటి నియమములు తెలియవు. గాని వెంకటకృష్ణమ్మ రాజ్యమందంతటను మంచి ప్రతిష్ట, విశ్వాసము సంపాదించెను. కరీంఖాన్ సాహెబుకు ఖమ్మంలోనేగాక హైదరాబాదు యాఖూల్‌పూరాలో కూడా ఒక యిల్లు ఉండెడిది. వీలునుబట్టి రెండుచోట్ల

వుద్యోగస్తులు కాగిదపత్రములే గాక కరీంఖాన్ సాహెబు వెంకటకృష్ణమ్మలు కూడా ఉంటూ ఉండెడివారు.

గీ. కసవుచే నీటిచే ! మోదకలనచేత
బ్రతుకు మృగమీన సజ్జన ప్రకరమునకు
శబరకై వర్తసూచకజనులు జగతి
కారణములేని పగవారు కారెతలప.. **(భర్తృహరి)**

అను ఆర్యోక్తిననుసరించి నిజాం ప్రభుత్వమునకంతటను ఏకైక వ్యాపార సంస్థను నిరాఘాటముగా కంట్రాక్టరుకు, ప్రతినిధిగా వ్యవహారము చేయుచున్న వెంకటకృష్ణమ్మకు విరోధులుంటారనుటలో ఆశ్చర్యమేమి ఉండదు. ఆ కారణమున కంట్రాక్టరు నౌకర్లు మఱికొందఱు స్వలాభాపేక్షాపరులు కుట్రజేసి కరీంఖాన్ వెంకటకృష్ణమ్మల మధ్య భేదభావములు కల్పించుటకు ప్రయత్నింపసాగిరి. కరీంఖాన్‌కు వెంకటకృష్ణమ్మ యందెంత పుత్ర వాత్సల్యమున్నను "మాతాపితృ విరోధాయ హిరణ్యాయనమోనమః" అనునట్లు వూరికె రాకపోకలేగాక కోటివరహాల కంట్రాక్టు వ్యవహారమునడుపుచున్న వెంకటకృష్ణమ్మ యెడ అర్థార్థ సంబంధము మున్నగు విషయములలో అపోహలు యెక్కువయి కార్పణ్యములు పెరిగి తనచే పెంచబడిన, వెంకటకృష్ణమ్మను తుదముట్టించవలెనని ఖాన్‌సాహెబు కృతనిశ్చయమునకు వచ్చెను. గాని సహజమగు ఆత్మప్రబోధమో లేక తటస్థించిన పరిస్థితులో లేక వెంకటకృష్ణమ్మ భాగ్యప్రభావమోగాని ఒకేసారి చంపించుటకు ఖాన్‌సాహెబు తయారుకాలేక పోయెను. 175 సంవత్సరములకు పూర్వము ఈ కార్యము అంతగా పెద్దదిగాదు. ఆ రోజులలో ఇప్పటివలె చట్టములు, శాసనములు ఉండెడివి కావు. ముస్లింప్రభువులు కొంతవరకు ఖురాన్ హదీన్‌షరా (మహమ్మదీయ ధర్మశాస్త్రము)ను అనుకరించేవారు. అనగా దొంగవాడికి చేయినరకడము, వ్యభిచార దోషమునకు నేరస్తునిని ఒక గుంటలో దింపి ప్రజలందరు తలా ఒక రాయి వాడిమీద వేయుచుండడము, ఆమూలముగా వాడు బాధపడి చావడం, మున్నగు శిక్షలుండెడివి. వెంకటకృష్ణమ్మపైన ఏదో ఒక నేరము మోపబడి అందుకు ఒక విచిత్రమైన ఖయదు యిచ్చినారట.

## వెంకటకృష్ణమ్మ చెఱసాల

ఇటుకతో యిరుకైన చిన్నదొడ్డి కట్టుట ప్రారంభించడము, ఆదొడ్డి మధ్యన ఖయిదీని ఉంచడము, ప్రతిరోజు ఒక యిటుకయో లేక కొన్ని యిటుకలతోనో ఒకవరస కట్టుచుండడము ఖయిది. గోడయెత్తు లేచినదాక బయటకు రాగలుగుతాడు గాని గోడ యెత్తులేచిన తరువాత ఖయిది అందే ఆహారనిద్రలు మలమూత్రములు జరుపుకొనవలసి ఉంటాడు. కొన్నిరోజులు బ్రతికినను తుదకు దుర్మరణమునకు పాలుకావలసి ఉంటాడు. వెంకటకృష్ణమ్మ ఈ శిక్షకు గురి అయినాడు.

కంచర్ల గోపన్న (రామదాసు) గారు గోల్కొండ చెఱసాలలో పడిన బాధలు చదువుచుంటాము గనుక ఆ కాలపు కఠినశిక్షలు గ్రహించగలుగుతాము. వెంకట కృష్ణమ్మ బీదకుటుంబీకుడు. స్వయంప్రకాశకుడగు ఏకైక పురుషసింహము బోనులో పడినది. విడుపించువారెవరు?

కంట్రాక్టరువద్ద మహసబ్ (లెఖ్ఖబ్రాంచికి పెద్ద) పనిచేసి వృద్ధుడయిన తండ్రి వెంకటనర్సుగారు యువక సోదరులగు నాగోరావు, రామారావుగారలు ఉన్నారు. కృష్ణమ్మను విడిపించు సామర్థ్యము చాలదుగాని, వారలు ఏదో ప్రయత్నము చేయుచు హైదరాబాదునందే యుండిరి.

## రాజ్యలక్ష్మి సాహసము

వెంకటకృష్ణమ్మ ధర్మపత్ని శ్రీమతి రాజ్యలక్ష్మి అని పేర్కొంటిని. భర్త చెఱసాలకు వెళ్లినప్పుడు జుజ్జూరులోనో పల్లెంపల్లిలోనూ ఉండెను. ఈ వార్తవిని అతి సాహసముతో బయలుదేరి పట్టంచేరి మామగారిని మరదులను కలుసుకొనెను. సమయోచితబుద్ధిగల రాజ్యలక్ష్మి రాజాంతఃపురరాణుల పరిచయము చేసు కొనుటకు ప్రయత్నము సాగించి కృతకృత్యురాలయ్యెను.

రాజ్యలక్ష్మి విద్యాజ్ఞానము మనకంతగా తెలియదు. దానితో మనకవసరము లేదు. గాని కుట్టుపనిలో చాలా ప్రవీణత కలదనియు అందుచేతరాణీ (బేగం)గారి మనస్సు నాకర్షించు ఒక చిత్రపు రెవికె కుట్టుకొని అంతఃపురములోనికి వెళ్లి రాణిగారికి నజరు (కానుకగా) సమర్పించగా అందుకు రాణిగారు ఈమె నైపుణ్యమునకు వాఙ్మాధుర్యమునకు మెచ్చి మధ్యమధ్య తన వద్దకు వచ్చునట్లును యింకేమయిన యిలాంటి గృహపరిశ్రమలను చూపెట్ట మనియును కోరెను.

రాజ్యలక్ష్మి ప్రథమతః ఏ రాణిని దర్శించినదో చెప్పలేముగాని క్రమక్రమముగా కొందరు రాణుల పరిచయము అనుగ్రహము సంపాదించినది. ఉత్తమవంశ సంభూతలగు రాణులు రాజ్యలక్ష్మి కూలిమనిషి కాదనియును మర్యాదగల కుటుంబపు ఆడబిడ్డయె మర్యాదగల వారింటికోడలో మొత్తం మీద అగ్రజాతికి చెందినదని మాత్రము వారు గ్రహించిరి. తదుపరి తమ నాశ్రయించుచున్న రాజ్యలక్ష్మికి ఉపకా రము చేయ నెంచి ఆమె ఉదంతము విచారించిరి. రాజ్యలక్ష్మి తనభర్త అనుభవించు చున్న చెరసాల పరిస్థితులు తెలిపి త్వరలో జీవితము కూడా పూర్తికానున్నదని చెప్పి దుఃఖించెను.

మహమ్మదీయులు ఎంత రజోగుణప్రధానులో అంత దయార్ద్ర హృదయులు. పరోపకార పారాయణులు కూడా అయియుంటారు. దుఃఖవారధిలో మునిగియున్న రాజ్యలక్ష్మి దుఃఖమును చూచి భరించజాలక రాణులందరు వెంకట కృష్ణమ్మను విముక్తిని చేయించుటకు నిశ్చయించుకొని అభయమొసంగిరి.

అధికారులకుగాని మూర్ధాభిషిక్తులయిన రాజులకుగాని, యితరులు నచ్చ జెప్పజాలరు. గాని భార్యలు చెప్పి వినిపించగలరనుట నిస్సందేహము. కావుననే కంచర్ల గోపన్నగారు రాముని వేడివేడి తిట్టుతిట్టి సీతమ్మను ప్రార్థించెను. తదుపరి త్వరలోనే విముక్తుడయ్యెను.

రాణులు యిచ్చిన అభయము ననుసరించి వెంకటకృష్ణమ్మ చెరసాల ఉదంతమును రాజున కెరంగించిరి. నవ్వాబుగారు నమ్మకస్తునిద్వారా విచారించి వెంకటకృష్ణమ్మ నిర్దోషియని గ్రహించి వెంకటకృష్ణమ్మను విడిచిపెట్టుటకు ఆజ్ఞ యొసంగెను. భర్తను విముక్తిని చేసిన ప్రతిభ రాజ్యలక్ష్మిదేనని స్మరించుచున్నాము.

మానవజీవితము కష్టసుఖ భూయిష్టమనుట నిర్వివాదాంశము. అలాగే "స్త్రీణాంచచిత్తం! పురుషస్యభాగ్యం దేవో నజాతి కుతోమనుష్యాః" అనునట్లు మానవులు ఉచ్చనీచదశలు అనుభవించుచుంటారు. కడు బీద స్థితిలోనుండి రాజ్యాధికారమునకు వచ్చిన తానీషావంటి మహారాజుల పేర్లను చరిత్రలో చదివి యున్నాము. మా వెంకటకృష్ణమ్మ పులి నోటనుండి బయట పడుటయే మహాదృష్టమనక తప్పదు.

పుత్ర వాత్సల్యముతో పెంచినను క్రూరబుద్ధితో దుర్మరణమునకు పాల్పడజేసిన కరీంఖాన్‌ను ప్రబల శత్రువుగానెంచుట సహజమే గనుక తనను చంపించదలచినను తానుమాత్రము ఖాన్ దంపతులను చంపుటకు మాత్రము సంకల్పించలేదు.

"ఘూతాన్న ఘూతకోవిప్రః" అనునట్లు బ్రాహ్మణుడు ఉత్తమవంశ సంభూతుడును అయిన వెంకటకృష్ణమ్మ మాతాపితృతుల్యులగు ఖాన్ దంపతులను తుదముట్టించు ప్రయత్నము చేయడని మనము నేడును గ్రహించగలము. గాని ఖాన్ సాహెబు యింటినిలేకుండాజేసి ఆచోట ఆముదాలు వేయించెదనని మాత్రము శబథము చేసినాడట.


వెంకటకృష్ణమ్మ ఖాన్‌సాహెబు పక్షమున పని చేయుచున్నప్పుడు నగరములోని పెద్దలవద్దను అధికారవర్గము వద్దను పరిచయమును మంచినమ్మకమును సంపాదించెనని పైన వ్రాసియుంటిని. నైజాములో కరోడ్గిరి చాలాకాలము వరకు కంట్రాక్టు పద్ధతిమీదనే నడచెను. ఈ కంట్రాక్టు ఏటేటా లేక రెండు మూడు సంవత్సరముల కొరకు యిచ్చుచుండు అలవాటు ఉండెడిది. గనుక వెంకటకృష్ణమ్మ చెరసాలనుండి బయటపడిన తరువాత తానే ముందు సంవత్సరము కంట్రాక్టు తీసుకొనవలెనని దృఢసంకల్పము చేసుకొనెను.


## వెంకటకృష్ణమ్మ దశప్రభావము

వెంకటకృష్ణమ్మ తెలివితేటలు చాలాగొప్పవి. ధనవంతులతోకూడా పరిచయము ఉండియుండవచ్చును. లేదేని కోటివరహాల కంట్రాక్టు నవీన బీద బ్రాహ్మణునకు లభించుట మామూలువిషయము కాదు. కావుననే సిద్ధసంకల్పుడగు వెంకటకృష్ణమ్మ కరోడ్గిరి కంట్రాక్టును సంపాదించగలిగెను.

వెంకటకృష్ణమ్మగారి స్వంత తమ్ములలో నాగోరావు కార్యనిర్వహణము నందును, రామారావు లెఖ్ఖపనియందును ఆరితేరినవారు. పినతండ్రి కుమారుడు వెంకట పాపయ్య వీరికి సాయముగా ఉండెడివాడు. ఈ ముగ్గురు తెలుగు, పారసీ భాషలలో చదువను వ్రాయను సమర్థులుగానుండిరి.

సర్వశక్తివంతుడును, రాజ్యాంగమున పేరుప్రతిష్టలు సంప్రాదించిన సాటిలేని ధీరుడును అగు వెంకటకృష్ణమ్మ ఆధ్వర్యమున నిజాంరాజ్యపు కరోడ్గిరి పన్నులు నిర్ణయించుటకు వసూలు చేయుటకును తగినంత సిబ్బంది అనగా వేలాది నౌకర్లను నియమించి వారిని అదబులోనుంచుకొని లెఖ్ఖలు కవెలెలు మొదలగు వ్యవహార పత్రములు ఉంచి కార్యములను నిర్వహించుటకు వ్యవహారదక్షులైన ముగ్గురు సోదరులుండుట కుటుంబముయొక్క అదృష్టమని చెప్పవచ్చును. సాధారణముగా తండ్రియో లేక ఒక సోదరుడో సంపాదించడము తక్కినవారు సోమరులుగానుండి తినడము హిందూ కుటుంబములలో చూచుచునే





యున్నాము. అట్లుగాక అందరు సోదరులు పాటుపడి ఆర్థికాభివృద్ధికి ప్రయత్నము చేయగలిగిరేని ఆ కుటుంబము పెంపొందుటకు అవకాశము తటస్థించగలదు. మొత్తముమీద వెంకటకృష్ణమ్మకు అట్టి అదృష్టము లభించినది. దీనినే దశప్రభావ మంటారు. కోటివరహాల కరోడ్గిరి కంట్రాక్టును నిర్వహించుభాగ్యము చేబట్టిన వెంకటకృష్ణమ్మకు ధనరాసులతో యిల్లు నిండియున్నదనుట అతిశయోక్తి కానేరదు. కాల నిర్ణయమునకు ప్రయత్నముచేసితిని గాని పూర్తి దాఖలాలు దొరికియుండలేదు. కొంతకాలము క్రితము చూచిన కొన్ని కాగితములు, సనదు యిప్పుడు కనబడుట లేదు. అయినను దొరికినంత వరకు ముందు ఉదహరించెదను.

స్న. 1190 హిజిరీలోఫ్రెంచి గవర్నర్ ప్లాయర్ గోరుందోరు ఫతహెయార్జంగ్ మచిలీపట్నం వగైరా సర్కారులకు అధికారిగాను తాను మొగల్ ప్రభుత్వమునకు విధేయుడ ననియును చెప్పుచు పూర్వపు నిజాం పర్వానాలను అనుసరించి జుజ్జూరు పరిగణా దేశముఖి దేశపాండ్యాగిరీలనున్ను, జమ్మవరం మకాసాయున్నూ, ఘాట్ బందం సంతరావూరు సాయరుధరణికోట వసూలు చేసుకొనే మొదలగు కొన్ని హక్కులను గురించిన్ని మాదిరాజు వెంకటనర్సు (వెంకటకృష్ణమ్మ తండ్రి) మరియు తిమ్మన్న (సన్నిహితజ్ఞాతి) గార్ల పేర సనదు జారి చేసెను. అప్పటికి వెంకటకృష్ణమ్మ ఒక మంచిదశకు వచ్చినాడనిన్ని కావుననే ఈ సనదు తన తండ్రిపేర సంపాదించినా డనిన్ని గ్రహించుచున్నాను. పైచెప్పిన గోరుందోరు యిచ్చిన సనదును మదరాసు ఈనాముల విచారణ కమిషనరువద్ద 1850 సంవత్సరంలో దాఖల్ చేసి మా తాతగారు దానినకలును వ్రాసియించు కొనియుండిరి. దాని ఫోటోను యిందులో చేర్చనైనది. దానివలన 1190వ హిజిరీలో (1775) సంవత్సరంలోని వ్యవహార గ్రామ్య తెలుగుభాషయు 1850 సంవత్సరంలో వ్రాసిన మా తాతగారి దస్తూరియు, అప్పటి కాగిదమును, సిరాను తెలుసుకొనవచ్చును. మరియు ఒక సనదు రాయ్ మాదిరాజు వెంకటకిషన్ అను పేరుతో జారికాబడియెను. అది దొరకనందున తేదీ వ్రాయజాలక పోయినాను. ఆ కాలమున పట్టాదారుల సంగతి తెలియదు. కాని యీనాందారులు తమ యీనాం భూములలోని పంటనుకోసి నురిపిడిచేసి తెచ్చుకొనుటకు స్థానికాధికారులు ఉత్తర్వులను జారీచేయుచుండెడివారు. వాటిని దుంబాలాలు అంటారు. ఈనాముల విచారణ కమిటీవారు సనదులనేగాక చెకునామాలను; దుంబాలాలను, దానపత్రములను ధృవప్రతములుగానెంచి యీభగోటపైన

ఈనాములను, అగ్రహారములను బహాలు చేయుచుండేవారు. మా తాతగారు మద్రాసు కమిషనర్‌గారివద్ద దాఖల్ చేసిన దుంబాలాలలో ఈ చరిత్రాంశముల దృష్ట్యా ఈక్రింది దుంబాలాలను యిందు ఉదహరించుచున్నాను.

1) స్న 1196 ఫసిలి పరాభవ నామసం. పాల్గుణ బ10 గురువారము మాదిరాజు వెంకటనర్సుగారికి కలవకొలను రామారాయణింగారి దుంబాలా.

2) స్న. 1198 ఫసిలి కీలక నామసంవత్సర ఫాల్గుణ బ10 ఆదివారము మాదిరాజు వెంకటకృష్ణమ్మ గారికి కలవకొలను వెంకటకృష్ణా రాయణం గారి దుంబాలా.

3) స్న 1199 ఫసిలి కీలక నామసంవత్సర ఆషాడ శు 6లు రాయా మాదిరాజు వెంకట కృష్ణమ్మగారికి క. వెంకట కృష్ణారాయణింగారి దుంబాలా.

4) స్న 1201 ఫసిలి విరోధికృతు సంవత్సర చైత్ర బ3లు రాజా మాదిరాజు కృష్ణవంతు బహదుర్‌గారికి క. వెంకటకృష్ణారాయణంగారి దుంబాలా.

5) స్న 1201 ఫసిలి పరీధారి నామ సంవత్సరం చైత్ర శు.5లు రాజా మాదిరాజు కృష్ణపంతు బహుదుర్‌గారికి క. వెంకటకృష్ణా రాయణంగారి దుంబాలా.

జుజ్జూరు పరగణాదేశముఖి దేశపాండ్యగిరీలు మా కుటుంబమునకు చెందియుండెనని పైన వ్రాసియుంటిని ఆహోదాతో పూజ్యులగు మా పెద్దలు ఈ క్రింద చెప్పిన ఈనాములను ఆయా సంవత్సరములలో యిచ్చి యుండిరి. దీనివలన ఆ కాలమున వారికిగల బిరుదములు వారి ఔదార్యము మతపక్షపాతము లేని దానశీలత తేటపడగలదు. ఈ ఈనాములు జుజ్జూరు పరగణాలోని పరిటాల గ్రామమునకు చెందినవైయుండెను. ఈ ఈనాములు యిచ్చిన తరువాత పరిటాల గ్రామమునున్ను, మరికొన్ని పరిసర గ్రామముల నున్ను నిజాం ప్రభుత్వముచే నవ్వాబు హిసాముల్ ముల్క్. ఖాన్‌ఖానాన్ బహద్దుర్‌కు 1229 ఫసిలీ తరువాత జాగీర్‌గా యిచ్చియుండిరి. పరిటాల మొదలగు కొన్ని గ్రామములలో వజ్రపు గనులు ఉండుటచే, ఆ గ్రామముల కొరకు కానాత్ (గనుల సమూహము) అనే పేరుతో తాలూకా కార్యస్థానము యేర్పాటుచేసి జాగీర్దారు పాలించుచుండెను.

కానాత్ తాలూకా కచేహరిలో దొరికిన దాఖలాలనుబట్టి యీ విషయములను వ్రాయు చున్నాను.

1) క్రోధి సంవత్సర శ్రావణ శు. 5 గురువారం రోజున శ్రీ మాదిరాజు వెంకటనరుసుగారు బ్ర. శ్రీ. విందమూరి లక్ష్మయ్యగారికి యిచ్చిన ఈనాము.

2) క్రోధి సంవత్సర మార్గశిర బ 7ల రోజున శ్రీమాన్ కోర్కొండ భట్టర్ వెంకట నరసిహ్మాచార్యులవారికి రాయ్ వెంకటకృష్ణమ్మ యిచ్చిన ఈనాము.

3) సౌమ్య సంవత్సర మార్గశిర శు. 10 గురువారం రోజున బ్ర. శ్రీ చతుర్వేదుల అప్పయ్యగారికి శ్రీ రాయ వెంకటకృష్ణమ్మ గారు యిచ్చిన ఈనాము.

4) సాధారణ సంవత్సర ఆషాడ బ 2 సోమవారం రోజున ఉస్మాన్ గాలబ్, సయ్యద్ బందగీకి శ్రీ రాయ్ మాదిరాజు వెంకటకృష్ణమ్మ యిచ్చిన ఈనాము.

5) హ్నా 1200 ఫసిలీలో బ్ర. శ్రీ పాలపర్తి సుందర రామావధానిగారికి రాజాకృష్ణవంతు బహద్దురుగారు యిచ్చిన ఈనాము.

6) ప్రభవ సంవత్సర జ్యేష్ఠ శు 5లు స్న 1216 ఫసిలీ రోజున బ్ర. శ్రీ అమరవాది శ్రీరామశాస్త్రీగారికి, రాజా నాగోరావు జ్ఞానవంతు బహద్దురు గారు యిచ్చిన ఈనాము.

వెంకటకృష్ణమ్మ మొదట ఏ ఉద్యోగమును స్వీకరించకున్నను ఉత్తర సర్కారులు దత్తమండలములు గల ఆంధ్రప్రదేశము, ఔరంగాబాద్, పర్భిని, నాందేడ్, బీడ్ ఉస్మాన్ఆబాద్ మండలములు గల మహారాష్ట్ర ప్రదేశమున్ను, బీదర్, గుల్బర్గా, రాయ్చూర్ మండలములుగల కర్నాటక ప్రదేశమున్ను, ఆ కాలమున నైజాం ప్రభుత్వ భూభాగమంతటికిని వెంకటకృష్ణమ్మయే కరోడ్గిరి కంట్రాక్టును సంపాదించెను. వెంకటకృష్ణమ్మ ఆ వ్యవహారమును అమోఘముగను, అతిదీక్షతోను నిర్వహించు చుండెను. ఆయన కార్యభారము, వ్యవహార చతురత ఒక మంత్రిపుంగవునికి వుండవలసిన దానికన్న తక్కువలేదని గట్టిగా చెప్పవచ్చును. మొదటి నుండియు వెంకటకృష్ణమ్మ సూక్ష్మగ్రాహి, సమయోచిత బుద్ధిగల మేధావి. రాజనీతి విశారదు డనుటలో సందేహము లేదు.

ఈ సందర్భమున అప్రస్తుతమైనను ఆ కాలపు నీతివర్తనము తెలియజేయు టకై ఒక గాధను వ్రాయుటకు సాహసించుచున్నాను.

20 సంవత్సరములకు పూర్వము మా పరిటాల జాగీర్‌దారు నవ్వాబు కమాల్‌యార్‌జంగ్ బహద్దుర్ నాయందు ప్రేమవిశ్వాసములు కలిగియుండెడి వాడు. ఆయన నన్ను ఒకరోజున తన తండ్రి నవ్వాబ్ ఖాన్‌ఖానాన్ బహద్దుర్ వద్దకు తీసుకొని వెళ్లెను. మేము ముగ్గురము స్టేట్‌తో సంబంధించిన కొన్ని విషయములను కొంతసేపు ముచ్చటించితిమి. అంతట వృద్ధ నవ్వాబు తన తాతగారి కాలపు ఒక సంగతిని చెప్పెను. పైచెప్పిన పరిటాల మొదలగు గ్రామములు తనకు జాగీరుగా యిచ్చిన తరువాత ఆ గ్రామములలో పరిశోధన చేయించి రెండు చేటల వజ్రపురాళ్లను తీయించెను. ఆ రెండు చేటల వజ్రపురాళ్లను నిజాం ప్రభువు వద్దకు తీసుకొని వెళ్లి సమర్పించెను. వాటిని గురించి నిజాం ప్రభువు విచారించగా యివి తన జాగీరులో ఉత్పత్తి అయిన రాళ్లు అనిన్ని, తన జాగీర్ యీలాకా గ్రామములలో తీయించి తెచ్చితిననిన్ని, యివి మీరు తీసుకొనవలెననిన్ని మనవి చేసెను. అంతట నిజాం ప్రభువు నావద్దకు ఎందుకు తెచ్చితివి. నీవే తీసుకొని వెళ్లు అని చెప్పెను. అందుపైన జాగీర్దారు, అయ్యా! తమరు ప్రభువులు, నా జీవనార్థము శిస్తు వసూలు చేసుకొని జీవించుటకు, జాగీరు యిచ్చితిరేకాని, యిలాంటి అమూల్యఖనిజ పదార్థములకు ప్రభులగు తామే అధికారులని చెప్పెనట. నిజాం ప్రభువు మొదట తీసుకొనుటకు అంగీకరించలేదు. గాని జాగీర్దార్ కోరిక పైన ఒక చేట వజ్రములను నాకు యిచ్చి, రెండవచేట వజ్రములను నీవే తీసుకొని వెళ్లుము, అని ఆజ్ఞాపించెనట. ఆ కాలమునాటి రాజులు, సామంతులు ఎట్టి నీతివర్తనులో యీ గాథవల్ల తేటపడ గలదు.

**ఇది తెలంగాణలోని అపూర్వ చరిత్రాంశము.**

## రాజకృష్ణవంతు బహద్దుర్ దివాన్ (ప్రధాని)

మాదిరాజు వెంకటకృష్ణమ్మ స్వప్రయోజకత్వముచే నిజాం రాజ్యకరోడ్గిరి శాఖ కంట్రాక్టును చేబట్టగలిగినాడని పైన వ్రాసియున్నాను. ఆయన తమ్ములలో పెద్దవాడు నాగోరావు పరిపాలన వ్యవహారము చూచేవాడు. రెండవ సోదరుడు రామారావు లెఖ్ఖ మొదలగు కార్యస్థాన వ్యవహారములను చూచేవాడు. పినతండ్రి కుమారుడు వెంకటపాపయ్య సహాయకారిగా నుండేవాడు. మొత్తంమీద వెంకటకృష్ణమ్మ హైదరాబాదులోని మంత్రులు సామంతులవద్ద సమాన గౌరవము పొంది ప్రజ్ఞావంతుడు రాజనీతివిశారదుడనీ ప్రతిష్ఠను సంపాదించుకొనెను. ఆ

రోజులలో నిజాముకు మైసూరురాజు టిప్పుసుల్తాన్‌తోను మహారాష్ట్రులతోను పోరాడవలసి వచ్చినది. యుద్ధ కార్యక్రమము నడిపించే బాధ్యత పూర్తిగా దివాన్ వహించ వలసివచ్చినది.

ఆ కారణమున రాజ్యముయొక్క సివిల్ పరిపాలనాబాధ్యత వహించుటకు సమర్థుడైన ఒకవ్యక్తి అవసరమని తోచెను. కాబట్టి అప్పటి దివాన్ నిజాముతో కరోడ్గిరి ముస్తాజరుగానున్న వెంకటకృష్ణమ్మయే తాత్కాలికముగా దివాన్‌గా నుండుటకు సర్వవిధముల సమర్థుడని సిఫారసుచేసెను. అంతట నిజాంప్రభువు వెంకటకృష్ణమ్మను పిలిపించి విచారించెను. దానికి వెంకటకృష్ణమ్మయు సమ్మతించెను. అందుపైన నిజాం ప్రభువు పూర్వ సాంప్రదాయానుసారముగా ఒక తాంబూలము తెప్పించి వెంకటకృష్ణమ్మకు ఈయబోయెను. గాని వెంకటకృష్ణమ్మ తాంబూలము తీసుకొనుటకు వెనుకాడి రాజా! మీదివాన్ నన్ను తాత్కాలికముగా పనిచూచుటకు కోరియున్నాడు. కాబట్టి నేను తాంబూలము మీవలన తీసుకొనుట ఉచితముకాదు. తాంబూలము మీరు యిచ్చుటయు ఆయన నాకిచ్చుటయు ఆయన వలన నేను తీసుకొనుటయు న్యాయమని బదులుచెప్పెను. అందుకు రాజు సంతోషపడి నీవు చాలా న్యాయబుద్ధి గలవాడవని మెచ్చుకొనెను. ఈ విధముగా వెంకటకృష్ణమ్మ నిజాం రాజ్యమునకు తాత్కాలిక దివానుగా ఏర్పరచబడెను. కరోడ్గిరి ముస్తాజరుపని నాగోరావు నడుపు చుండేవాడు. పెద్దలవలన వినిన మాటలనుబట్టి ఈ కాలము 1199 ఫసిలినుండి 2, 3 సంవత్సరములలో నుండునని నా నమ్మకము. ఏలనన పైచెప్పిన దుంబాలాలు దానపత్రములను బట్టి 1199 ఫసిలీలో రాయ్ వెంకటకిషన్ అనిన్ని, 1200 ఫసిలీలో రాజా కృష్ణవంతు బహదురు అనిన్ని వ్రాయబడియున్నది. అధికారము లభించిన తరువాతనే బిరుదములు లభించినవని దృఢముగా విశ్వసింపవలసి వచ్చును. ప్రయత్నము చేసితినిగాని వారి నియామక ఉత్తర్వులు దొరికియుండలేదు గాని మా మిత్రులు కీర్తిశేషులైన రాజగోపాలరెడ్డి బారిష్టరు గారు, రాజాకృష్ణవంతు బహద్దురు గారు దివానుగా నుండి మెదకు జిల్లాలో కొందరికి యిచ్చిన దేశముఖాగిరి సనదులు చూచితిమని చెప్పియుండిరి. అందువలన నా నమ్మకము కొంత బలపడినది. వెంకటకృష్ణమ్మకు పారసిభాష రాదని పైన వ్రాసియే యున్నాను. ఒకరోజు యుద్ధ రంగమున నున్న మంత్రి వద్ద నుంచి నైజాంపేర ఒక వుత్తరము వచ్చెను. ఆ సమయమున రాజువద్ద వెంకటకృష్ణమ్మ ఒక్కడే ఉండెను. ఆ కవరును రాజు వెంకటకృష్ణమ్మకు యిచ్చెను. వెంకటకృష్ణమ్మ కవరు చించి లేఖను యిటు అటు త్రిప్పి యుద్ధముకు యింత సైన్యము, యింత డబ్బు పంపమని ఉత్తరములో

నున్నదని చెప్పెను. ఉత్తరం చదవకుండా వెంకటకృష్ణమ్మ చెప్పుచున్నాడని గ్రహించి ఆ ఉత్తరము రాజు స్వయముగా తీసుకొని చదివి అవే మాటలు వ్రాసియుండుట కాశ్చర్యపడి వెంకటకృష్ణమ్మతో నీకు పారసీ రానట్లున్నది అయినను లోపలి మాటలను ఉన్నదు న్నట్లు చెప్పగలిగిన నీపరేంగిత జ్ఞానము (పరోక్ష జ్ఞానము) అద్భుతమని కొనియాడెను. అందుపైన వెంటకృష్ణమ్మ జేబు నుండి ఒక అసరఫి (తులం బంగారు నాణెం) అయిదు రూపాయీలు జేబురుమాలు నందుంచిన జరుయిచ్చి సవినయముగా కృతజ్ఞతను తెలిపినాడట. అదే సందర్భమున రాజా కృష్ణవంతు బహద్దురు అనే బిరుదము ప్రసాదించబడి నదని తెలియబడినది. సందర్భము తెలియదుగాని వారి సోదరులలో నాగోరావు గారికి జ్ఞానవంతు బహద్దుర్ అనిన్ని వెంకటపాపయ్య గారికి చంద్రవంతు బహద్దురు అనిన్ని, రామారావుగారికి రాజా రామారావు అనిన్ని, కృష్ణవంతు గారి కుమారుడు తిరుమలరావుకు రాజా తిరుమలరావు అనిన్ని బిరుదములు ప్రసాదించబడినవి. ఈ బిరుదములు వ్యవహార (మార్జిన్‌లో) పత్రములలో వాడుచువచ్చినారేగాని ఆ సనదులు ఉత్తర్వులు దొరకనందున తారీఖువారిగా వ్రాయజాలకున్నాను.

మా వంశమువారు అనాదినుండియు జుజ్జూరులోనే ఉండేవారు. అప్పటి నివేశనస్థలాలు చాలా పెద్దవి. ఇప్పటికి మా స్వాధీనములో సుమారు 1– పెరడు ఉన్నది. మొదట మామూలి యిండ్లే వుండెడివి గాని రాజాకృష్ణవంతుగారి కాలములో మిద్దెలు, మేడలు వరహాలుపోయు హవుజులు కట్టబడినవి. ఒకభావి త్రవ్వించబడి గచ్చుచేయబడినది. యిప్పుడా స్థలములో పాతకట్టడముల గచ్చు పెల్లలు యిటుకలు మాత్రము మిగిలి వున్నవి. వారు ఏనుగుపైనెక్కి లోపలికి వెళ్లేవారు. గేటుప్రాంతములో ఒక వేపచెట్టు మొలచి పెద్దదైనది. 1700 సంవత్సరముల వేపచెట్టును జ్ఞాపకార్థముగా నిలిపియుంచినాను. కొంత శ్రద్ధతో చెట్టును కాపాడగలిగినాను. కాని 3 మాసముల క్రిందట పడిపోయినది. అట్లాగే వారు త్రవ్వించిన గచ్చుబావినికూడా జ్ఞాపకార్థముగా కాపాడుచున్నాను.

రాజాకృష్ణవంతుగారు జుజ్జూరు పరగణా జమీందారీని మరువలేదు. జుజ్జూరు పరగణా జమీందారి దురాక్రమణను గురించి పైన వ్రాసియున్నాను. దాదాపు 100 సంవత్సరముల కాలములో జమిందారిని తిరిగి సంపాదించగల వ్యక్తి మాదిరాజు కుటుంబములో పుట్టినట్లు కనబడలేదు. మా మాదిరాజు కుటుంబములో రెండు సంప్రతులు అప్పటికే ఉండెడివి. రెండవ సంప్రతివారు జమీందారులను ఆశ్రయించి ఈనాములను సంపాదించుకున్నారు. అందు జుజ్జూరులోనే వారి కుటుంబమునకు 300 యకరముల పెద్ద ఈనాము దొరికినది.

గాని మా శాకవారు మాత్రము జమీందారును ఆశ్రయించి సంపాదించుకొనలేదు. మొగలాయి ప్రభుత్వపునాటి దేశముఖీగిరి ఈనాములతోనే తృప్తి చెందిరి.

రాజాకృష్ణవంతు బహద్దురుకు జమీందారి విషయము మాత్రము హృదయములో ఆందోళన కలిగించుచునే యుండెను.

జమీందారు అత్యున్నత పదవి నదిష్టించి దివాను కృష్ణవంతు బహద్దురును కరణం వెంకటకృష్ణమ్మ అనె సంబోధించుచుండెను. యిది ఒక న్యూనతగా గ్రహించినాడనుట సహజమైన విషయము. రాజాకృష్ణవంతుగారు జుజ్జూరులో ఉండగానే స్నానసంధ్యలు తీర్చుకొని పాక్కోళ్లపైన తిరుగుచుండగానే జమీందారు అసభ్యతగా మాట్లాడినాడని తెలియవచ్చినది. అంతట కోపము పట్టజాలక పాదుకలు విడువకుండనే ఆయన వాడుకొనే పట్టాకత్తిని తీసుకొని దివాణంవైపు బయలు దేరెను. మాపూర్వుల నివేశన స్థలమునకు జమీందారుయిల్లు (దానిని దివాణమనేవారు) ఫర్లాంగుదూరము మాత్రమే ఉండెడిది. రాజా కృష్ణవంతుగారు కత్తి పట్టుకొని వచ్చుచున్నాడని అందరికి తెలిసినది. నౌకర్లు ఎందరు ఉండిరో తెలియలేదు. కాని మాదిరాజు కుటుంబీకులు మేడుకొండూరు వంశీకులు షుమారు ఒక వంద మంది ముసల ముద్గరములు కాండ్లు, మేళ్లు దుడ్డు కఱ్రలతో వెంటనడచిరి. ఆగ్రహముతో బయలుదేరిన బ్రాహ్మణ పటాలమును చూచి జమీందారుని రాయుదుడుగను పాదచారిగను కృష్ణవర్మగారికి యెదురుగావెళ్లి ఆగ్రహ కారణమడిగి తెలుసుకొని క్షమింపకోరెను. “ఉత్తమస్య క్షణంకోపః” అనునట్లు మంత్రి పదవిలోనున్నను క్షాత్రమున్నను, బ్రాహ్మణుడే గనుక రాజాకృష్ణవంతుగారు కోపమును ఉపసంహ రించుకొని బంధుమిత్రులతో తన యింటికి తిరిగి వచ్చెను.

అదే కాలమున అమరావతి పరగణాకును, నందిగామ పరగణాకును రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు జమీందారుగా నుండెను. ఆయన ఒక కోరికను మనసునందుంచుకొని రాజా కృష్ణవంతు బహద్దురును జుజ్జూరులో దర్శించుట మంచిదనుకొని కొన్ని రోజులు దర్శనార్థము జుజ్జూరు మకాములో నుండెను. ఆ కాలములో కృష్ణవంతుగారు మేడలు, మిద్దెలు కలిగియుండిరని పైన వ్రాసితిని. అట్లే ఆ భవనమునకు ప్రాకారము గలిగి వేపచెట్టు వద్ద యేనుగ అంబారితో వెళ్లగల సింహద్వారము ఉండెడిది. ఒక దిడ్డి దర్వాజకూడా ఉండెడిది. ఒకరోజు వెంకటాద్రి నాయుడు గారు ప్రాకారప్రాంతముల పోవుచుండగా కృష్ణవంతుగారితల్లి అచ్చమ్మ గారు గుమ్మం వద్ద నిలుచుని యుండెను. అప్పుడు

నాయుడుగారు అచ్చమ్మ గారికి నమస్కరించి అమ్మా! అన్నయ్యతో నేను వచ్చినానని చెప్పుమని కోరెను. ప్రేమపూరిత మధురవాక్కులతో యెంత కార్యమైనను సాధించుట సులభముగదా.

అచ్చమ్మగారు వెంకటాద్రినాయుడు గారి రాకను కృష్ణవంతుగారికి వెంటనే తెలిపినది. తరువాత కృష్ణవంతుగారు వెంకటాద్రినాయుడు గారిని తమ భవనమునకు సగౌరవముగా పిలిపించుకొని మర్యాదచేసిరి.

జుజ్జూరు పరగణాలోనిది పరిటాల గ్రామము, నందిగామ పరగణాలోనిది గనిఆత్కూరు గ్రామము. జుజ్జూరు పరగణాకు దేశముఖు, దేశపాండ్యా రాజా కృష్ణవంతుగారు, నందిగామ పరగణా దేశముఖ్ రాజా వెంకటాద్రినాయుడు గారు ఈవిధముగా అనువంశీక సరిసమాన ప్రతిపత్తి ఉభయులలో ఉండెడిది.

మధిర పరగణాకు కల్వకొలనువారు జమీందారులని పైన వ్రాసియున్నాను. పరగణా సరిబస్తా సంపాదించినవాడే జమీందారు అనుపించుకుంటాడు. బహుశ: అప్పుడు పరగణాల సరిబస్తాలకవుళ్లు యిచ్చేరోజులై యుండునుకాబోలు. వెంకటాద్రినాయుడు గారు మధిర పరగణా సరిబస్తా కవులు (కౌలు) తమ కిప్పించమని దివానుగానున్న కృష్ణవంతుగారికి తన కోరికను తెలిపెను. దానికి కృష్ణవంతుగారు నాయుడుగారికి మాటయిచ్చియుంటారు. కొలదిరోజులలోనే సరిబస్తా కవుళ్ల ప్రమేయము వచ్చినది. ఆ సందర్భమున వెంకటాద్రి నాయుడిగారి ప్రయత్నము కృష్ణవంతుగారి సహాయమున సఫలీకృతమైనది.

దాని తరువాత వెంకటాద్రినాయుడుగారి దివాను కృష్ణవంతుగారి వద్దకు వెళ్లి కృతజ్ఞత తెలిపెను. దానికిబదులు కృష్ణవంతుగారు మీకు పరిగణా యిప్పించితిమిగదా మీ రాజాగారు మాకేమి బహుమతి చేయుదురు అని చలోక్తిగా మాట్లాడిరి. ఆ దివాను ఈమాటలను వెంకటాద్రి నాయుడుగారితో చెప్పెను.

రాజా వెంకటాద్రి నాయుడుగారు పరిపాలనాదక్షుడు, రాజనీతివిశారదుడు దూరాదూరవిచారపరుడు. ఈచలోక్తి మాటలను విని మహదైశ్వర్య సంపత్తితోను అత్యున్నత పదవిలోను ఉన్న రాజా కృష్ణవంతుకు ద్రవ్యాశ లేదనియును ఆవిధ ముగా తాను తృప్తిపరచజాలననియును యిదియొక చలోక్తి యనియును గ్రహించి ఒక కృతజ్ఞతాపూర్వకమైన లేఖ వ్రాసి అందు మీరు బ్రాహ్మణులు నేను శూద్రుడను. మీకు సేవచేయుట నావిధి. కావున మీ దిడ్డి దర్వాజా వద్ద పహరా యిచ్చెదనని తెలిపెను; అటుపైన జుజ్జూరు యింటిదొడ్డి దర్వాజవద్ద ఉండే జవానుల జీతము

ఆయన ప్రతినెలా పంపుట మొదలుపెట్టెను. కృష్ణవంతుగారు ఉత్తరంలో నాయుడు గారు సవినయముగా చూపిన కృతజ్ఞతకు సంతోషించినాడేగాని జవానులకిచ్చే జీతము సంగతి ఆయనకు తెలియలేదు. నాలుగైదు మాసముల తరువాత గుమాస్తా తెచ్చిచూపిన యింటిఖర్చు లెఖ్ఖలను చూడగా ఆ లెఖ్ఖలో దొడ్డి దర్వాజ వద్ద పహరా జవానుల జీతము చేరియుండకపోవడము తెలుసుకొని గుమస్తాను కారణమడిగి తెలుసుకొనెను. గుమాస్తా వెంకటాద్రినాయుడుగారి ఉత్తరమును జ్ఞప్తికి తెచ్చి అప్పటి నుండి పహరా జవానుల జీతము నాయుడుగారు యిచ్చు చుండిరనియును ఈరూపకముగా సేవచేసినట్లు అర్థమగుచున్నదనియును గుమాస్తా చెప్పెను. అందుపైన స్నేహపూర్వకముగా ఈపని మానవలసినదని వెంకటాద్రి నాయుడుగారికి వ్రాసి తమ జవానుల జీతము తామే యిచ్చుచుండెడి వారు.

ఈ కథను మాగ్రామములోని మద్దూరి సుబ్రహ్మణ్య సోమయాజుల గారను వృద్ధ బ్రాహ్మణుడు నా బాల్యమున తెలిపెను. ఆ కాలముననేగాదు యిటీవల జమీందారీలు రద్దు అయ్యేవరకును జమీందారులు తమ ఎస్టేట్లకు తామే ప్రభువుల మనుకొనుచుండెడివారు. నిజాం ప్రభుత్వములో పోలీసు చర్యవరకు జాగీర్దార్లకు సివిల్ క్రిమినల్ పోలీసు అధికారములు ఉండెడివి. ఈ జమీందారులు తమ భవనములను కోటమాదిరిగా నిర్మించుకుండెడివారు. నిజాం ప్రభుత్వమున దేశముఖులు కూడా యిదే స్వరూప భవనములను నిర్మించుకున్నారు. వాటిని గడీలు అంటారు. గడి అనగా గడ్ అనే హిందీ శబ్దతద్భవమనుకుంటాను. చిత్తూర్‌గడ్ ఉదయపూర్‌గడ్ అనే ఉత్తర హిందూస్థానపు పేర్లు అని మనకందరకు తెలిసిన విషయములే. ఈ అభ్యాసమును బట్టి రాజాకృష్ణవంతు బహద్దురు దేశముఖుకు ఒక గడి లేక కోట అవసరమని తోచినది. జుజ్జూరు పరగణాకు ముఖ్యస్థలమైనను తనకు మేడలు మిద్దెలు ఉన్నను అచ్చట ఒక జమీందారుకోట కట్టుకున్నాడు. గనుక తనకోటను అచ్చట నిర్మించక పరిటాల గ్రామములో కట్టుటకు సంకల్పించి గడీ నమోనాతో గ్రామమధ్యమున ఒక కోటను ఎత్తుగల బలమైన మట్టిగోడలతో నిర్మాణము చేసెను. ఈకోటకు పూర్వమో లేక వెనువెంటనో ఒక శివాలయముకూడా నిర్మాణము చేసి శివప్రతిష్ట చేసెను. ఆ శివాలయమునకు ఈనాము కూడా ఈయబడినది. ఆ శివాలయమునకు మల్లేశ్వర స్వామి దేవాలయ మని పేరు. ప్రతి సంవత్సరము శివరాత్రికి కల్యాణోత్సవము జరుగుచుండును. మా వంశపు జ్యేష్ఠ శాఖవారు పరిటాలలోనే ఉంటున్నారు. గనుక తలంబ్రాల

బియ్యం మంగళ సూత్రము మావారె పంపుచుంటారు. కల్యాణము నేటివరకు సక్రమముగా జరిపించబడుచున్నది.

ఈ కోట కట్టించడములో జుజ్జూరు జమీందారి తీరుగా సంపాదించె అభీష్టముకూడా గర్భితముగా నున్నదని కొంత వదంతి ఉన్నది. గాని రాజా కృష్ణవంతు బహద్దురుగారు స్న 1202 ఫహలీ (1793)లో దివంగతులయిరి. పరిటాల కోటలో గృహప్రవేశము జరుగలేదు. ఆ కోట అట్లే శిథిలమైపోయినది.

శ్రీకృష్ణ నిర్యాణానంతరము యాదవ వంశమెట్లు అధోగతి పాలయినదో అట్లే కృష్ణవంతు నిర్యాణానంతరము మా మాదిరాజు కుటుంబము అధోగతి పాలయినది.

రాజా కృష్ణవంతుకు తిరుమలరావను కుమారుడు, రాజమ్మ అనే కూతురు ఉండేవారు. రాజమ్మ భర్త మేడుకొండూరు నరసరాజు గారు. ఈ నరసరాజు రెండవ భార్య తిరుమలమ్మ వారి కుమారుడు రాజేశ్వరరాయుడు. రాజేశ్వర రాయుడుకి ముగ్గురు కూతుళ్లు 1. అల్లూరు రాజమ్మ. 2. తాడేపల్లి వెంకమ్మ 3. మాదిరాజు రంగమ్మ. ఈ రంగమ్మగారే నాతల్లి అయియున్నది. కృష్ణవంతుగారి పురుష సంతతిని గురించి ముందు వ్రాసెదను.

* * *

ప్రకరణము - 2

# రాజా తిరుమలరావు - దుర్దశకాలము

కం. కొరగాని కొడుకుబుట్టిన కొరగామియెకాదు
తండ్రిగుణముల జెరుచున్! చెరుకు తుదవెన్ను
పుట్టిన చెరుకునతీపెల్ల జెరుచు సిద్ధముసుమతీ - సుమతిశతకము

రాజా కృష్ణవంతు మరణానంతరము దివాను హోదాపోయినది. కరోడ్గిరి ముస్తాజరికూడా పోయినది. కృష్ణవంతుగారు చనిపోయిన కొలది రోజులలోనే కుటుంబములో అంతఃకలహములు అధికమైనవి జ్యేష్ఠానుక్రమణికగా గౌరవింప బడవలసిన వాడనని తిరుమలరావునకును కుటుంబ మేనేజరునని రాజాజ్ఞాన వంతుగారికిని అహంకారములు ప్రబలినవి. సాంప్రదాయసిద్ధముగా గొప్ప అమీర్ల మరణానంతరము నైజామురాజు వారి వారసులను పిలుపించి ఆదరించె మర్యాద యుండెను. అదేవిధముగా రాజానుమతిచొప్పున తిరుమలరావు దేవుడీకివెళ్లి నిజాం రాజును సందర్శించుటయు నిజాంరాజు సంతాపమును వెలిబుచ్చి తిరుమలరావును ఆదరించుటయు జరిగినది. తదుపరి ఏమికోరెదవని తిరుమలరావును రాజు ప్రశ్నించినాడు. తిరుమలరావు ఏమియుకోరక నీదయ అని చెప్పితెనే బాగా వుండేది. తిరుమలరావు అట్లాచెప్పక మా నాయనగారు సంపాదించిన ధనము అపరిమిత ముగా నున్నదనియును అందు పినతండ్రులు భాగమిచ్చుట లేదనియును చెప్పెను. రాజుల మనసులు సున్నితములు వారి ఆగ్రహానుగ్రహములు అట్లే వుంటవి. అవి ఆశ్రితుడి అదృష్టాదృష్టములపై ఆధార

పడియుంటవి. ఈ కారణమున తిరుమలరావు ప్రసంగము మాదిరాజు కుటుంబమునకు శాశ్వితమైన నష్టము కలుగచేసినదై పోయినది.

రాజు తిరుమలరావును పనికిరానివాడు నాలాయఖ్ అనుటయేగాక కృష్ణవంతు గారి ఆస్తిని దోచుకొనిరమ్మని క్రిందివారికి ఆజ్ఞాపించెను. ఆ ప్రకారము ఏనుగులు, ఒంటెలు భటవర్గము జుజ్జూరువచ్చినవి. వరహాల రూపమున నున్న ధనము, వెండి బంగారు వస్తువులు దివానుయింట ఉండతగిన మేలయిన పరికరములు ఏనుగుల పైనను, ఒంటెలపైనను యెత్తించుకొని హైదరాబాదు తీసుకొని పోబడినవి. ఇక రాజా జ్ఞానవంతు, రాజా రామారావు, రాజా చంద్ర వంతుగారలు బీద బ్రాహ్మణులుగా అనగా నిర్ధనులుగాను, నిరుద్యోగులుగాను, పెద్ద భవనములలో మిగిలిపోయినారు.

కం. సిరిదావచ్చిన వచ్చును సలలితముగ
నారికేళ సలిలముభంగిన్ ! సిరిదాపోయిన
బోవును కరిమ్రింగిన వెలగపండు గదరాసుమతీ–

అను నార్యోక్తి సార్థకమైనది. డబ్బులేదు, వృత్తిలేదు – జీవనోపాధికి కష్టము సంభవించినది.

రాజా రామారావుగారు జుజ్జూరులోనే ఉండిపోయినారు. మిద్దెలు, మేడలు పడిపోయినవి. అదే స్థలములో పూరియిల్లు వేసుకొని ఉంటూ వచ్చినాడు.

రాజా కృష్ణవంతుగారి కుమారుడు రాజా తిరుమలరావుగారికి పిన తండ్రులతో విరోధము సంభవించెను. ఆ కారణముచేతనో లేక తన తండ్రి పరిటాల నివేశము యిచ్చగించుచున్నాడనియునో మొత్తంమీద తిరుమలరావు గారు పరిటాలలో నివాసము యేర్పరచుకొనెను. గృహప్రవేశముగాని తండ్రి కట్టించిన కోటలో ఉండలేదు. వేరే స్థలములో యిల్లు కట్టుకొనెను. మాదిరాజు వారిలో రెండు సంప్రతులుండెడివి. రెండవ సంప్రతివారితో మాకు జాతాశౌచములు లేవు. అయినను బలహీనుడగు తిరుమరావు రెండవ సంప్రతివారికి పరిటాలలో సగభాగమిచ్చుట కంగీకరించెను. గాని చంద్రవంతుగారి కుమారులగు రామారావు, సీతారాంరావుగార్లకు సగముకు బదులు 3వ భాగమిచ్చెను. జ్ఞానవంతు రామారావుగారి సంతతికి వారి భాగములు వారికీయక యిది తన స్వార్జితమని చెప్పి నిరాకరించెను. తిరుమలరావుకు శోభనాద్రిరావు, కిష్టయ్య అనే యిద్దరు కుమారులు, ఒక కుమార్తె యుండిరి. ఆమెను పరిటాలవారింటి

కిచ్చెను. శోభనాద్రిరావు విద్యావంతుడు. కిష్టయ్యకు వివాహమయినదిగాని ఆయన పిచ్చివాడు. శోభనాద్రిరావు ఖాన్ ఖానాన్ జాగీరులో ప్రయత్నముచేసి జాగీరు గ్రామములకు తాలూకా అయిన కానాత్‌కు పేష్కారి ఉద్యోగము సంపాదించెను. అద్దానిని మహాగొప్పగా నెంచి హైదరాబాదు నుండి పరిటాలకు ఏనుగునెక్కివచ్చి పదవి స్వీకారమొనర్చెనట. అనతికాలములోనే పురుష సంతతి లేకుండా తండ్రి జీవితకాలములోనే ఆయన చనిపోయెను. వృద్ధుడుగు తిరుమల రావుకు ఒక కుమారుడు పురుష సంతతిలేకుండా చనిపోవుటయు, రెండవ కుమారుడు పిచ్చివాడగుటయు తటస్థించినందున రాజా రామారావుగారి కుమారుడు వెంకటప్పయ్యగారి 3వ కుమారుడు నాగోరావును తనకోడలు శోభనాద్రిరావు భార్య పిచ్చమ్మకు దత్తు చేయించెను. తదుపరి కిష్టయ్యకు తిరుమలరావనే కుమారుడు కలిగెను. ఆయన వివాహము కాగానే నిస్సంతుగా మరణించెను. నాగోరావుగారికి తిరుమలరావు కలిగెను. తిరుమలరావుకు దుర్గా ప్రసాదరావు, రాధాకిషన్‌రావు అనే కుమారులున్నారు. స్త్రీ సంతతిలో శోభనాద్రి రావు గారి దౌహిత్రుడు పరిటాల నరసింహ్మారావుకు కుమారులు లేరు. కుమార్తె అవ్వాపిచ్చమ్మ యున్నది. ఆమెకు లక్ష్మీనారాయణరావు (సబ్‌రిజిస్ట్రార్ వరంగల్) సత్యనారాయణరావు (అడ్వకేటు) ఉన్నారు. ఈ లక్ష్మీనారాయణరావుగారే నన్ను చరిత్ర వ్రాయుటకు ప్రేరేపించినది.

* * *

*ప్రకరణము - 3*

# రాజా జ్ఞానవంతు - చంద్రవంతుగార్లు

రాజా జ్ఞానవంతుగారు జుజ్జూరు నుంచి గొల్లపల్లి అత్తవారి గ్రామం వెళ్లిపోయినాడు. అచ్చటనే స్వ 1216 ఫసిలీలో కాలధర్మమునొందిరి. ఆయనకు కుమారుడు రాయసుబ్బారావు అటువైపులనే వుండేవాడు. జ్ఞానవంతుగారి కుమార్తె ఆదిరాజు జోగయ్య ప్లీడరుగారిభార్య సుబ్బమ్మ. ఆ సుబ్బమ్మగారి కుమార్తె గండేపల్లి లక్ష్మినరసయ్యగారి భార్య రాజమ్మ. రాజమ్మగారి కుమార్తె మాతాత నరసింహ్వాం గారి భార్య వెంకాయమ్మ అయియుండిరి. అనగా నా పితామహి. రాయసుబ్బా రావుగారి కుమారుడు వెంకట్రావు అనే వెంకటప్పయ్యగారు పరిటాల ప్రవేశించి నివేశన స్థలం సంపాదించుకొని యిల్లు కట్టుకున్నాడు. ఆయన కుమారులు 1. సుబ్బారావు, 2. కోటేశ్వరరావు, 3. కామేశ్వరరావులు ఉండిరి. వెంకటేశ్వరరావు దత్తు ఈయబడినాడు. సుబ్బారావు కోటేశ్వరరావుల కుమారులు తండ్రి జీవిత కాలములోనే మరణించిరి. కామేశ్వరరావుగారి కుమారుడు దేవరాజు పరిటాలలోనే స్థిరనివాసము కలిగి ఉన్నాడు. కుమార్తె పరిటాల సీతారాంరావు భార్య బుజ్జమ్మ ఉన్నది.

కృష్ణవంతుగారి కఒక సోదరుడు తిరపతిరాయుడు ఉండెను. ఆయనకు పురుష సంతతిలేదు.

* * *

*ప్రకరణము - 4*

# రాజా చంద్రవంతుగారి సంతతి

రాజా చంద్రవంతుగారి జుజ్జూరు నుంచి లేచిపోయి హైదరాబాదు ప్రాంతముల ఏదో ఒక గ్రామములో తన కుమార్తె ఉన్నందున ఆయన ఆ ప్రాంతముల ఏదో ఉద్యోగము సంపాదించుకొని జీవనము జరుపుకొనుచు తన కుమారులు రామారావుకు, సీతారామారావుకు విద్యాబుద్ధులు చెప్పించుకొనుచు ఆ ప్రాంతములనే చనిపోయెను. సీతారామారావు (శీతయ్య)గారు పారశీలో కూడా మంచి ప్రావీణ్యత సంపాదించెను. సోదరులిరువురికి స్వగ్రామముపై యిచ్ఛగలిగి పరిటాల గ్రామము చేరిరి. వేరువేరు నివేశన స్థలములు సంపాదించు కొని యిండ్లు కట్టుకొని కాపురము చేయుచుండిరి. ఆకాలమున పరిటాల జాగీరు తహశీలుకు మాదిరాజు శోభనాద్రిరావుగారు పేష్కారుగా నుండిరని పైన వ్రాసితిని. శోభనాద్రిరావు గారు కాలంచేసినందున పేష్కారి ఉద్యోగముపైన సీతారామారావు గారు నియమించబడిరి. దాదాపు 45, 50 సంవత్సరములు పేష్కారుగాను, నాయబుతహశ్శీలుదారుగాను పనిచేసి 1906 సంవత్సరములో కాలధర్మమునొందిరి. సీతారామారావు గారికి పుత్ర సంతతిలేదు. ఒక కుమార్తె వనం రామచంద్రరావుగారిభార్య నరసమ్మగారు ఉండెను. సీతారామారావుగారు కుమార్తెను అల్లుడిని యింటనే ఉంచుకొనెను. నరసమ్మగారి రెండవకుమారుడు సీతారామరావు తల్లి జీవితకాలములోనే మరణించెను. పెద్దకుమారుడు దౌహిత్య రిత్యా మాతా మహస్తికి వారసుడై పరిటాలలోనే ఉంటూ పుత్రసంతతిలేకుండా 1956 సంవత్సరములో మరణించెను. ఆయనకు ఒక కుమార్తె పరిటాల

నారాయణరావు భార్య వెంకటరామమ్మకు తండ్రి ఆస్తి చెందినది. వనం నరసమ్మ గారి రెండవకుమార్తె అల్లూరు లక్ష్మీకాంతరావుభార్య రంగమ్మ. పెద్దకుమార్తె అనంతలక్ష్మమ్మను నాకిచ్చి వివాహముచేసిరి.

ఈ సందర్భమున ఒక్క విశేషము వ్రాయవలసివచ్చినది. రాజా కృష్ణవంతు గారి స్త్రీ సంతతి నుంచి మా అమ్మగారున్ను, రాజా జ్ఞానవంతు స్త్రీ సంతతి శిలశిలాలో మా నాయనమ్మగారున్నూ, రాజా చంద్రవంతుగారి స్త్రీ సంతతి శిలశిలాలో నా భార్యయున్నూ, మాయింటికే కోడండ్రు అయినారు. యిది వారికి మాకు గర్వకారణము.

* * *

*ప్రకరణము - 5*

# రాజారామారావుగారి శాఖ

శ్రీ రాజా రామారావుగారి దరిద్రదశలో జుజ్జూరులోనే ఉండి స్న 1255 (1846) ఫసలీలో దివంగతులైరి. ధనమదాంధములో నున్నవారికి తత్వజ్ఞాన మరుదుగాని దరిద్రునకు ఈశ్వరుడే దిక్కని జ్ఞానము కలుగుట సహజము. శ్రీ రాజారామారావుగారు అష్టైశ్వర్యములతో తులతూగిన రోజులలో ఆయన భక్తిజ్ఞానము లెంతయుండెనో వినలేదు. గాని ఐశ్వర్యము కోల్పోయిన తరువాత సంధ్యానుష్టానాది నిత్య నైమిత్తిక కర్మలు దేవతార్చనలతో తపస్విగా మయిమరచి యుండేవాడు. రాజాకృష్ణవంతుగారు గతించిన తరువాత ఈనగారు 5 సంవత్సరములు బ్రతికినట్లు తెలియుచున్నది. వారొక ఏకాదశిరోజున ఉపవశించి ద్వాదశిరోజున ఒకరిని బ్రాహ్మణార్థము పిలిచెను. ఆ బ్రాహ్మణుడు వేళకురాలేదు. వంటపూర్తి చేసి రామారావు గారిభార్య చుక్కమ్మగారు భర్తకూర్చున్న స్థలముకు సమీపమున నేలపైపరుండి నిద్రపోయెను. శ్రీరామారావుగారు సమాధిస్థితిలో మయిమరచియుండెను. మధ్యాహ్న ముపేళకు బ్రాహ్మణుడువచ్చి సమాధి సుషుమ్నావస్థలలో నున్న భర్తభార్యలను చూచి వారిని మేలుకొలపరాదని ఎంచి వంటయింటి తలుపు తీసి వండిన వంటక ములు, భక్ష్యభోజ్యములన్నిటిని పూర్తిగా భుజించి తుదకెట్లో చుక్కమ్మగారికి తెలిపి మరల వంట చేసుకొనమనిచెప్పి వెళ్లిపోయినాడు. వంటకము లేమియు మిగలనందున చుక్కమ్మగారు మరల వంట ప్రారంభించి సిద్ధముచేసినది. శ్రీ రాజా రామారావుగారు సమాధి చాలించి

జాగ్రతావస్థకు రాగానే భార్య జరిగినదంతయు వినిపించినది. అది విని రామారావుగారు 'అభ్యాగత స్స్వయంవిష్ణుః' అనునట్లు బ్రహ్మార్పణము జరిగినదని సంతోషము వెలిబుచ్చెను.

యిదియొక చమత్కార విషయమైనను శ్రీ రాజా రామారావుగారి పారమార్ధక చింతన తపోనిష్ఠ మరువతగినవికావు. వారి ఆధ్యాత్మిక జీవితముమాకు ఆదర్శప్రాయ మనకతప్పదు.

రామారావుగారికి 1. వెంకటప్పయ్య, 2. తిరుపతి రాయుడు, 3. సుబ్బయ్య, 4. నరసింహం (నరసింహరావు) అను నలుగురు కుమారులు, రాచూరు ఆదెమ్మ అనే కుమార్తెయుండిరి. సుబ్బయ్యగారికి పురుష సంతతిలేదు. అల్లూరు రాజమ్మ అనే ఒక కుమార్తెయుండెను. వెంకటప్పయ్య గారికి 1. జోగయ్య, 2. కిష్టయ్య, 3. నాగోరావు అనే ముగ్గురు కుమారులున్ను, కొమరగిరి లచ్చమ్మ అనే ఒక కుమార్తెయు ఉండిరి. అందు నాగోరావును శోభనాద్రిరావు గారికి దత్తుయిచ్చి యుండిరని పైన వ్రాసియున్నాను.

జోగయ్యగారికి లక్ష్మికాంతరావు అనే ఒక కుమారు, 1. రేమిడి చర్ల రాజమ్మ, 2. వెంకట్రామమ్మ, 3. నరసమ్మ, 4. రేమిడిచర్ల లచ్చమ్మ అనే కుమార్తెలు ఉండిరి. లక్ష్మికాంతరావుకు సంతులేనందున కోటేశ్వరరావు కుమారుడు రాధాకిషన్ రావును దత్తుతీసుకొనెను.

కృష్ణయ్యగారికి 1. సుబ్బారావు, 2. కోటేశ్వరరావు, 3. వెంకటేశ్వరరావు అనే ముగ్గురు కుమారులు ఉండిరి. వారిలో వెంకటేశ్వరరావు దత్తు ఈయబడి నాడు. సుబ్బారావు తండ్రి జీవితకాలములోనే పురుష సంతతిలేకుండా చనిపోయెను. కోటేశ్వరరావు బి.ఎ. ప్యాసయి ఒక హైస్కూలుకు హెడ్మాస్టరుగా పనిచేయుచున్నాడు.

రాజారామారావుగారి నాలగవ కుమారుడు నరసింహముగారు 16 సంవత్స రముల పిల్లవాడు. పై ముగ్గురు కుమారులు చదువుకున్నవారుకారు. దరిద్రముతోపాటు అప్రయోజకులైన కుమారులుండుట వల్ల కూడా తండ్రికి బాధ కలుగుట సహజము గనుక ఆయన వార్ధక్యములో యిది మనస్సుకు బాధ కలుగజేసినది. ఆయన తన అల్లుడు రాయచూరి నరసయ్యగారిని పిలచి పెద్ద కుమారులు పనికిరానివారైనారని చెప్పి నాలగవ కుమారుడు నరసింహరావు

గారిని ఆయనకు అప్పగింతపెట్టి వీడికి విద్యాబుద్ధులుచెప్పి కుటుంబము పేరు ప్రతిష్ఠలు కాపాడమని ఆదేశించినాడు. రాచూరి నరసయ్యగారు నూజవీడు సంస్థానములో ఉద్యోగిగా నుండెను. నరసయ్య గారు బావమరది నరసింహమును తన వెంట తీసుకొని వెళ్లి చదువు చెప్పించెను. తరువాత వ్రాత లెఖ్ఖ మొదలగు పనులలో ప్రవీణుని చేసెను. మైనరువెళ్లగానే నరసింహంగారు కొన్ని రోజులు ఇస్టేటు అమలుదారుగా పనిచేసి ఉద్యోగము నుంచి విరమించుకొని స్వస్థానమగు జుజ్జూరు ప్రవేశించెను.

* * *

*ప్రకరణము - 6*

# నరసింహంగారి ఆదర్శ జీవితము

మేడలు మిద్దెలు ఆయన పుట్టకముందే శిథిలమైపోయినవి. తండ్రి నివసించిన యిల్లుకూడా పడిపోయినది. విద్యాహీనులగు యిద్దరు అన్నలు ఈనాముల ఆదాయంతో పొట్టపోసుకొనుచుండిరి. వెంకటప్పయ్యగారు తన మామగారు మేడుకొండూరు గోపయ్యగారిచ్చిన యింటిలో ఉంటూ ఉండెను.

నరసింహంగారు అవివాహితుడే గనుక కొలదిరోజులు యెట్లాగో కాలం గడిపి తండ్రితాతల స్థలమునందే 2 పూరియిండ్లు నిర్మాణము చేసుకొనెను. ఆ యింటిలో తనతల్లి చుక్కమ్మగారిసహా నివసించుచుండెను. తదుపరి నేను వ్రాసినట్లు రాజా జ్ఞానవంతుగారి మనమరాలికూతురు అనగా గండేపల్లి రాజమ్మ (లక్ష్మినరసయ్యగారి) కూతురు వెంకాయమ్మ గారిని వివాహము చేసుకొనెను.

నరసింహంగారు కుటుంబ గౌరవమర్యాదలను బాగా మననము చేసినవాడు. జమిందారి శతసంవత్సరముల క్రితమే పోయినను దేశముఖీ, దేశ పాండ్యాగిరి, కరణీకములు ఈనాములు మొదలగు గౌరవవృత్తులను పునః ప్రతిష్ఠ చేయుటకు యెన్ని మార్గములనో ప్రయత్నము చేయవలసి వచ్చినది. ఆ కాలమున యిట్టి రాజగౌరవములకు చాలా ప్రాముఖ్యము ఉండెడిది. నిజాం రాజ్యాంతమువరకు యశస్కాములగువారు మాష్‌దారి వతన్‌దారీల కొరకు బాగా ప్రయత్నము చేయుచుండెడివారు. వ్యాజ్యములు, వ్యవహారములు బాగా నడచు చుండెడివి.

నేడు రాచకీయ నాయకులు, కార్యకర్తలు ఈ పదవులకొరకు ప్రాకులాడుచు వేలాదిద్రవ్యమును వెదచల్లుచుండగా చూచుచున్నాము. గనుక పితృపితా మహార్జితమగు వృత్తుల కాశపడుటలో ఆశ్చర్యముండజాలదు.

నరసింహ్వాంగారు జుజ్జూరు ప్రవేశించినప్పుడు 1840 సంవత్సరం ప్రాంతముల జుజ్జూరు పరగణాకు కలవకొలనువారి జమీందారి యుండెను. జుజ్జూరుకు ఆరుగురు కర్ణములుండేవారు. అందు 3 లీష్టులు మాదిరాజువారికి 3 లీష్టులు మేడుకొండూరి వారికి. మాదిరాజువారి కుటుంబమునకు చెందిన 3 లీష్టులలో ఒకటిఅయినను వెంకటనరసుగారి శాఖకు ఉండవలసి ఉండెను. మధ్య కొంతకాలము ఈ శాకలో మాట్లాడించినవారులేరు. గనుక నరసింహ్వాం గారికి 1 భాగము యిచ్చుటకు నిరాకరించిరి. తుదకు తక్కిన భాగస్థులు బహుప్రయాసముపైన ఒక లీష్టు వెంకటప్పయ్యగారి పేరుతో ఉంచి నరసింహ్వాం గారిని జుజ్జూరు కరణముగా పనిచేయనిచ్చిరి. యిది 1850 సంవత్సర ప్రాంతమనుకుంటాను. వెలమవారి జమీందారి బకాయ పేష్కషు చెల్లించని కారణమున పోయినది. గౌర్నమెంటు పాలనవచ్చినది. అందువలన జుజ్జూరులో చేరియున్న శివారుపల్లెలను విడదీసి నరసింహ్వాంగారిని జగన్నాధపురం, లక్ష్మీపురం గ్రామములకు కర్ణముగా యేర్పాటుచేసిరి. యిది బహుశః 1861 సంవత్సర ప్రాంతం అయి యుంటుంది.

జుజ్జూరు కర్ణీకమునకు మా రెండవ శాఖ మాదిరాజువారును, మేడుకొండూరు వారును పోట్లాడుకొనిరి. మాదిరాజువారు జమీందారులేగాక అసలు లీష్టుదారు కర్ణములేనన్ని, మేడుకొండూరువారిది గుమాస్తాల కుటుంబము గనుక లీష్టు మాదిరాజువారికే యిచ్చిరట. అప్పీలులో మాదిరాజు వారు జమీందారులు స్వయ ముగా నౌకరిచేయువారుకారు. మేడుకొండూరువారు స్వయముగా పనిచేయువారు. గనుక లీష్టు మేడుకొండూరు కుటుంబమునకే యిచ్చుటకు కలెక్టర్ తీర్మానించెను. పెద్దరికముకూడా హానికరమేననుట కిది యొక సాదృశ్యము.

బ్రిటీషుపాలనా కట్టుబాట్ల రీత్యా బేచిరాగ్ అనబడే లక్ష్మీపురం గ్రామమును చట్టన్నవరములో చేర్చినందున నరసింహంగారికి ఒక్క జగన్నాధపురం అనే చిన్న గ్రామ కర్ణీకముకు నెల 1కి రూ. 5-0-0లున్నుగామ మున్సఫ్‌కు నెల 1కి రూ. 3-0-0లు మాత్రమే జీతము యిచ్చేవారు.

రాజా రామారావుగారు పరిటాలకు దేశముఖుగా వ్యవహరించినట్లు పురాతన సనదుల రక్షణవారి నుంచి వచ్చిన కయిఫియ్యతులలో దాఖలా దొరికినది. గాని రామారావుగారి తరువాత పరిటాలలో కాపురమేర్పాటు చేసుకొని జాగీరులో కొంతపలుకుబడి సంపాదించిన తిరుమలరావుగారికి పినతండ్రుల భాగములను గురించి, దుర్యోధన రాజనీతినే అనుకరించి నాగోరావు గారి సంతతితోపాటు రామారావుగారి కుమాళ్లను కూడా పరిటాల గ్రామములో ప్రవేశించనీయలేదు. "జ్ఞాతిశ్చేద నలేనకిమ్" అనునది పురాతన సామెతయే. ఈ విషయము నరసింహ రావుగారికి తరుణ వయస్సులో చాలా బాధపెట్టినదైనది.

నరసింహంగారు యుక్తవయస్కుడైన తరువాత జుజ్జూరు కాపురమును పునఃప్రతిష్ట చేసుకొని జుజ్జూరు తరువాత జగన్నాధపురం కర్ణీకమును సంపాదించ గలిగినాడని పైన వ్రాసి యున్నాను.

జమీందారి, మాఘుదారి, వతన్‌దారి, ఈనాందారి ఇత్యాది స్థానిక గౌరవ ముల యందు యెక్కువ ప్రాధాన్యముగల ఆ రోజులలో పిత్రియమైన పరిటాల దేశముఖి దేశపాండ్యాగిరి తనకులేదని ఆయన బాధపడుటలో ఆశ్చర్యముండదుగదా.

శోభనాద్రిరావు పేష్కారుగా నుండుటగూడ తటస్థించుటచే రాజా తిరుమల రావు గర్వపూరితుడై జ్ఞాతులను లెక్కచేయక తృణీకరించెననె విషయము పైన వ్రాసి యున్నాను. పరిస్థితులు తెలిసియు సమదుఃఖియగు జ్ఞానవంతుగారి మనమడు వెంకటప్పయ్యగారితో కలిసి నరసింహ్వారావు గారు తన భాగము తన కిప్పించమని తిరుమలరావుగారిని ప్రార్థించెను. గాని తిరుమలరావు నీకు నాకు ఏమి సంబంధం లేదని బదులుచెప్పెను.

రాజా తిరుమలరావు పేష్కారు శోభనాద్రిరావులకు నచ్చచెప్పగల సాటి దేశముఖు దేశపాండ్యాలలో యెవరు లేకుండిరి. రాజా చంద్రవంతుగారి కుమారులు దయాధర్మమునకు లోనై 3వ భాగమును తీసుకొనుటకు అంగీకరించినవారైరి. కాబట్టి వారును తిరుమలరావుగారికి సహకారము చేయుచుండిరి.

రెండవ సంప్రతి మాదిరాజువారు కూడా కారణత్వేనా తిరుమలరావు వెంట నుండెడివారైరి. ఆదిరాజు, తుర్లపాటి ఏటూరు, షబ్‌నవీస్ నండూరువారు ఈ తాలూకాలో దేశముఖులుగారు. దేశపాండ్యాలే గనుక దేశముఖులకు చెప్పలేక పోయిరి.

పరిటాలలో కూడా జుజ్జూరుతోపాటె 7 కత్తుల ఈనాం 1107 ఫసలీ సనదులోను, గోరుండోరు సనదులోను వ్రాయబడియుండెను. రాయవెంకటకిషన్ గారి సనదులో యింత విత్తనముగల భూమియని యుండెను. రాజా కృష్ణవంతుగారి సనదులో 7 కత్తుల ఈనాం 2 కత్తుల సావరం అని యుండెను. యిది కల్పితమని మా పెద్దలనుకొనేవారు. రాజా తిరుమలరావు గారిపేర జాగీర్దారు యిచ్చిన సనదులో కొన్ని కుచ్చెళ్ళు ఈనాం, కొన్ని కుచ్చెళ్ళు సావరం అనియుండెను. యిది యొక మోసపూరితమే, ఈ మోసమును బయటపెట్టకుండుటకే సనదులు మొదలుగు, ఆధారములు లేకున్నను పరిటాలలో నివసించు రెండవ కుటుంబపు (సంప్రతి) మాదిరాజు రామ క్రిష్ణయ్య, వెంకటక్రిష్ణయ్యలకు సగభాగమిచ్చుటకు తిరుమలరావు అంగీకరించెను. గాని పినతండ్రి కుమారులకు భాగమిచ్చుటకు మాత్రము అంగీకరించి యుండలేదు.

నిరాకరణానంతరము స్థానిక ప్రాబల్యముగల తిరుమలరావును ధర్మసూక్తులతోగాని భుజబలముతో గాని యెదుర్కొనుటకు నరసింహం, వెంకటప్పయ్య గార్లకు సాధ్యముకాకపోయెను. ఆ కాలపు నిజాం ప్రభుత్వములో సర్వాధికారములు జాగీర్ ఏర్యాలో జాగీర్దారులకే సంక్రమించియుండెను. జాగీర్దారు దేవుడి అనగా దివాణము హైదరాబాదునందే యుండెను.

హైదరాబాదు పిరటాలకు 200 మైళ్లకుమించిన దూరంలో నున్నది. రైళ్లు పడలేదు. మోటార్లులేవు. బండ్లమీద లేక కాలినడకన ప్రయాణము చేయవలసి వచ్చేది. కిరాయబండి యిచ్చటినుండే తీసుకొని వెళ్ళక తప్పదు. ప్రయాణకాలము 15 రోజులయినను ఉండేది. యిట్టి స్థితిలో నరసింహంగారు కర్షికమునకు శలవు పెట్టి హైదరాబాద్ ప్రయాణము సాగించెను. అచ్చట కొన్ని మాసములు మకాంచేసి వ్యవహార పరిష్కారము చేయించమని జాగీర్దార్ వలన కానాత్ నాయబ్ తహశీల్దారు పేర హుకుం తీసుకొని జుజ్జూరు పరిటాలకు వచ్చిన వాడాయెను. అప్పుడు నాయబు తహశీల్దారుగానున్న బాపూరావు ఆదిరాజు తిరుమలరావు వగైరా ముగ్గురు పెద్దలను పంచులుగా ఏర్పాటుచేసి పరిష్కారము చేయమనెనట. ఆదిరాజు తిరుమలరావు పెద్దమనిషె గనుక నరసింహంగారికి 3వ భాగం పంచి పెట్టుటకు తీర్పు వ్రాయ బూనెను.

ఆదిరాజు తిరుమలరావుగారి కూతురు పిచ్చమ్మ శోభనాద్రిరావు గారి భార్యయు చాలా తెలివిగల మనిషియు అయియుండెను. ఈ సంగతి ఆమెకు బోధించి పెనిమిటియు మామగారును ఆమెను తండ్రివద్దకు పంపిరి. ఆమె తండ్రి మనస్సు త్రిప్పుటకు ప్రయత్నించినదిగాని తిరగలేదు. అప్పుడామె యింటి

సమీపముగానున్న (గని ఆత్కూరు శివారు కొత్తపేట) కృష్ణలోదిగి మునిగి చచ్చెదనని తండ్రిని భయపెట్టినది.

అప్పుడు తిరుమలరావు ఆమె సిఫారసును విధిలేక అంగీకరించెను. పర్యవసానముగా రాజారామారావుగారి సంతతికి నాలగవ వంతు భాగమున్ను రాజా జ్ఞానవంతుగారి సంతతికి నాలుగవ వంతు భాగమున్ను యిచ్చుటకును ఉద్ధారకభాగము సహ సగం భాగం రాజా కృష్ణవంతుగారి సంతతికిని యిచ్చు నటుల తీర్పువ్రాసి నాయబు తహశీల్దారుకు అందజేసెనట. ఇది సన్ 1267 ఫసలీ సమాచారము అని జ్ఞాపకము.

దీనిపైన సంతకము చేయుటకు వెంకటప్పయ్య, నరసింహరావుగార్లు సమ్మతించకపోయిరి. తహశీలుదారు వీరిద్దరిని పోనివ్వవద్దని నిర్బంధించెను. వీరుభయులు ఆ గ్రామ కాపురస్తులుకారు. పేష్కారు శోభనాద్రిరావు జ్ఞాతియు ప్రత్యర్థియు గనుక నిస్సహాయులుగా నుండి ఒకరోజు ఉపవాస దీక్ష సలిపి తుదకు ఒకరాత్రి కౌపీనధారులై గొంగడి కప్పుకొని ఎరుకల స్వరూపముతో పహరానుంచి బయటపడి 6 మైళ్ల దూరముననున్న నరసింహంగారి అత్తవారింటికి చేరుకొనిరి. అది బ్రిటీషు యిలాకా గండెపల్లిగ్రామము. కాబట్టి పోలీసులు మొదలగు నిజాం జాగీరు ఉద్యోగులు ఏమిచేయలేకపోయిరి. తరువాత ఒకటి రెండు రోజులలో గండేపల్లి నుంచి బయలుదేరి హైదరాబాదు ప్రయాణము సాగించి పట్నం చేరిరి. జాగీర్దారుకు జరిగిన ఆక్రమమును గురించి చెప్పుకొనిరి. జాగీర్దారు ఉత్తర్వును సంపాదించుటకు కొన్ని మాసములు పయిరవి చేయవలసి వచ్చినది. వ్యతిరేక ప్రయత్నముకొరకు శోభనాద్రిరావుకూడా వెళ్లెను. ఈ ముగ్గురు పట్నం బాలాగంజ్ ధర్మశాలలో ఒకేచోట నివాసము పెట్టుకొనిరి. యింతలో శోభనాద్రిరావు వ్యాధిగ్రస్తుడై లేవలేకపోవుటయు ఆయనకు నరసింహంగారే ఉపచారము చేయుటయు తటస్థించెను. శోభనాద్రిరావుకు వ్యాధి యెక్కువ కాజొచ్చెను. అంతట నరసింహం గారితో బాబూ యింటికి వెళ్లి 3 భాగములుగానే పంచుకుందాము బయల్దేరమని కోరినాడట. అందుకు నరసింహంగారు అంగీకరించి బండిచేయించి 15, 16 రోజులలో ఉభయులు పరిటాల వచ్చిరి. వ్యాధిగ్రస్తుడగు శోభనాద్రిరావును తండ్రికి వప్పగింతపెట్టి నరసింహరావు జుజ్జూరు వెళ్లిపోయెను. యింటికి చేరిన కొలది రోజులలోనే శోభనాద్రిరావు పరలోకగతు డయ్యెను. ఆయనకు పుత్రసంతతి లేదు. రాజా తిరుమలరావు రెండవకుమారుడు కిష్టయ్య పిచ్చివాడని పైన వ్రాసియే యుంటిని. ఈ పరిస్థితులనుబట్టి తిరుమలరావు

నరసింహంగారికి 3వ భాగము యిచ్చుటకు అంగీకరించి నరసింహంగారి అన్న కుమారుడిని దత్తు చేయించుమని కోరెను. దీనిని బట్టియే వెంకటప్పయ్యగారి 3వ కుమారుడు నాగోరావుగారిని శోభనాద్రిరావుభార్య పిచ్చమ్మకు దత్తు చేయించెను. తరువాత నరసింహగారికిని తిరుమలరావుగారికిని కొంత కలిమిడి గలిగినది. నరసింహంగారు తన భాగలబ్దపు రుసుం ఈనాంసావరముల ఆదాయము తీసుకొనేవాడు. పరిటాల దేశముఖి దేశ పాండ్యాగిరి వ్యవహారము లలో ఆయన నరసింహరావు అని సంతకము చేసేవాడు.

నరసింహంగారికి యిద్దరు కుమార్తెలు. 1) అయ్యదేవర లక్ష్మయ్యగారి భార్య వరలక్ష్మమ్మ, 2) అయ్యదేవర లక్ష్మినరసింహంగారిభార్యా సుబ్బమ్మ వుండిరి. కుమారులు: 1) సీతారామయ్య (సీతారామారావు), 2) లక్ష్మికాంతారావు, 3) క్రిష్ణారావు, 4) రామకోటేశ్వరరావు, 5) వెంకట్రామారావు పుట్టిరి. అందు క్రిష్ణారావు బాల్యమున తల్లివుండగానే చనిపోయెను. తరువాత రామకోటేశ్వరరావు 12 సంవత్సరముల వయసులో తండ్రి వుండగానే అనుపనీతునిగా చనిపోయెను. నరసింహంగారు యధార్థవాది. ఆత్మగౌరవము గలవాడు. తాను పెద్ద కుటుంబ మునకు చెందిన వాడననెడి భావము గలవాడు.

ఈనాం కమీషనర్ వద్ద దాఖల్ చేసిన స్టేటుమెంటులో తనతండ్రి పేరు మొదట రామారావు అని వ్రాసి తదుపరి తప్పు గ్రహించి పంక్తుల మధ్యన రాజా శబ్దమును వ్రాసి తన తండ్రి గౌరమును స్మరించెను. మరియు తన స్వాధీనములోని జుజ్జూరు గొట్టుముక్కల చట్టన్నవరం గ్రామములలో వున్న ఈనాములలో రాజా కృష్ణవంతుగారి సంతతిపేరున్ను రాజా జ్ఞానవంతుగారి సంతతి పేరున్ను జేర్చిరి. మాతాతగారు ధనవంతుడుగాడు. తన కర్ణీకపు జీతముతోను భూముల స్వల్ప ఆదాతోను నిరాడంబరముగాను తృప్తిగాను జీవించుచుండెడివాడు. వ్యవసాయము చేయించేవారు. ఆయనకు 4 బర్లు, 4 యెద్దులు, 50 ఆవులు గోధనం వుండుటచే పాలు, పెరుగు, నెయ్యి పుష్కలముగానుండి తినుటకును యితరులకు యిచ్చుటకును లోటు లేకుండవుండేది. చేలలోను, దొడ్లలోను కూరగాయలు వలసినన్ని యుండుటచే చక్కని భోజనము చేసేవాడు. పండుగలు మాతాపితృలతిధి కార్యక్రమములో బ్రాహ్మణ బంధుపరివారముతో భోజనములు సదా జరుగుచుండెడివి. యిద్దరు కుమార్తెల వివాహములు, యిద్దరు కుమారుల వివాహోపనైనములు ఒక కుమారునికి వుపనైనము చేసెను. గాని "రణేధీరం రుణశ్చుచిం" అనునార్యోక్తి సార్ధకము చేసినవాడు. భోజనమునకు గాని శుభ

కార్యములకుగాని శక్తికిమించిన దుర్వ్యయములుచేసి రుణముల పాలుకాలేదు. ఒకరికి రుణస్తుడుకాదు. కాబట్టి ఆత్మగౌరవము న్యాయము యదార్థ ములు గల నడవడికెను అనుష్ఠించి నాడనుటలో సందేహములేదు. తన కర్మ క్రియలకొరకు రు. 100లు పెట్టెలో వుంచి ప్రాణములను వదలిన ధన్యజీవి. 44, 45 సంవత్సరముల వయస్సుననే భార్యగతించినను రెండవ వివాహము చేసుకొనుటకు అంగీకరించి యుండలేదు.

వంశమర్యాద పితృభక్తి ఆయనకు మెండని వ్రాసియుంటిని. తార్కాణముగా తన తండ్రి పెదతండ్రులు పట్టిన పట్టాకత్తిని (వరసహా) పెదతండ్రిగారు యెక్కిన గుర్రపు కంచు అంకెళ్ళను తండ్రివాడుకున్న జపమాల, శంఖము, బానాత్ హయముఖ సంచిని పెదతండ్రి రాజా జ్ఞానవంతు, నాగోరావు బహద్దురు అని ఉరుదు అక్షరములు చెక్కబడిన వుంగరపు యర్రరాయిని ఖలిందాన్ అనగా ఆఫీసు టేకుపెట్టెను భద్రముగా దాచియుంచెను. పై చిహ్నములను నాచిన్నతన మున కనులారాచూచి సంతోషిం చితిని గాని మా పినతండ్రి వెంకటరామారావు గారు మా నాయనగారిని అడిగి నీలికురిత తీసుకొని వెళ్లిరి. తరువాత కొద్దిరోజులకె నీలికుర్తిలో దొంగలు పడి ఆవస్తువులను దోచుకొని పోయిరి.

ఆయనలోని బ్రాహ్మణభక్తికి తార్కాణము. జగన్నాధపురం గ్రామకర్ణీకము మా తాతగారు చేయుచుండిరి. ఆయనకు పరిటాల దేశముఖీగిరి విషయములో హైదరాబాదు వెళ్ళవలసి శలవు తీసుకొనెను. మా నాయనగారు ఆక్టింగు కరణముగా పని చేయుచుండిరి. ఆ గ్రామములో ఒక ఈనాందారు తూటుపల్లి వెంకటనరసయ్య అనే బ్రాహ్మణుడు ఈ గ్రామమునకు రాక క్విటురెంట చెల్లించకపోయినందున ఈనాం 7-0-0లు వేలమునకు వచ్చెను. ఆ పాట మా నాయనగారి పేరిట కొట్టి వేయబడినది. మా తాతగారు తిరిగివచ్చిన తరువాత మా నాయనగారి వల్ల ఈ సంగతి తెలుసుకొని బ్రాహ్మణ ఈనాము కొనినందుకు విచారపడి కొన్ని రోజులకు ఆ బ్రాహ్మణుడు తిరిగి వచ్చినందున కాళ్లు కడిగి ఈనామును మా నాయనగారిచేత దానం చేయించి ఈనాంపట్టా ట్రాన్స్‌పర్ చేయించెను. ఆ బ్రాహ్మణుడు కృతజ్ఞతా పూర్వక ఆశీర్వాదములు చేయుచుండెడి వాడు. మాతాత శ్రీ నరసింహంగారు 1889 సంవత్సర కార్తీక శు 10వ రోజున జగన్నాధపురం గ్రామములో కాలధర్మము నొందిరి.

* * *

ప్రకరణము - 7

# నరసింహంగారి సంతతి

శ్రీ నరసింహంగారి సంతతి పేర్లను పైన పేర్కొనియున్నాను. పెద్దకొమార్తె అయ్యదేవర లక్ష్మయ్యగారి భార్య వరలక్ష్మమ్మగారు. ఆమె సంతతిలో 1) చేమర్తి కోటమ్మ, 2) నందూరు శ్యామాలాంబగారు కుమార్తెలున్ను, శ్రీ కాళేశ్వరరావు పంతులుగారు ఏకైక పుత్రుడున్ను అయి వున్నారు! ఆయన ఆంధ్ర దేశముననే గాక యావద్భారత నాయక మండలికి చెంది నేటి ఆంధ్రప్రదేశ్‌కు ప్రథమముగా అసెంబ్లీ స్పీకరు అయి యున్నారు.

శ్లో. ఏకోపి గుణవాన్ పుత్రః నిర్గుణంః కింశతైరపి!

ఏక చంద్ర ప్రకాశేన! నక్షత్రం కింప్రయోజనం!!

అనునట్టు మా వంశ చరిత్రలో శత సంవత్సరముల తరువాత ఈయన గారి శుభనామమును వ్రాయ గలుగుచున్నందుకు స్త్రీ పురుష వంశీకులందరు సంతోషించి గర్వించదగియున్నది. ఆయన జీవిత చరిత్రము దీనికనుబంధము చేయుట నాకు విధియేగాక ఈ రచనకు శోభాయమానము కాగలదనుటలో సందేహము లేదు. అయినను జీవిత విశేషములను కొన్నిటిని మాత్రము యిందు పొందుపరచుటకు సాహసించుచున్నాను.

శ్రీ కాళేశ్వరరావుగారు విక్రమ సంవత్సరంలో నందిగామ గ్రామములో జన్మించిరి. అందే ప్రాథమిక, మాధ్యమిక విద్యల నభ్యసించిరి. తదుపరి మచిలీ పట్నంలో ఒక కాలేజీలో చదివి పట్టభద్రులైరి. తరువాత బి.ఎల్. పరీక్ష యందుత్తీ

ర్ణులైరి. ప్రాథమిక విద్య మొదలు న్యాయశాస్త్ర పరీక్షల వరకును ఎందును ఓటమి యెరుగక ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడైన మేధావి.

1906 సంవత్సరములో న్యాయవాద పట్టమును పొంది, బెజవాడలో న్యాయవాద వృత్తి నవలంబించి పనిచేయ మొదలిడిరి. శ్రీవారి న్యాయవాద వృత్తి క్రిమినల్‌లోను సివిల్‌లోను దినదినాభివృద్ధి గాంచి బెజవాడలో అగ్రస్థాన మాక్రమించుటయే గాక, కృష్ణాజిల్లా న్యాయవాద ప్రముఖులలో నొకరుగా ప్రఖ్యాతి వహించిరి. శ్రీ కాళేశ్వరరావు గారు విద్యాధికులేగాక విద్యాప్రియులు, సంస్కార ప్రియులుగాను భాషాసేవకులు, దేశసేవకులుగాను పనిచేసిరి. కృష్ణా పత్రికకు, బందరు జాతీయ కళాశాలకు సహాయకులుగా పనిచేసిరి. సభలు సమావేశము లలో పాల్గొనుట వారికి ఉత్సాహము అధికము. విజ్ఞానచంద్రికా మండలి కార్యవర్గములో వారొకరుగా నుండిరి. 1906 సంవత్సరం నుండి ఆరంభింప బడిన స్వరాజ్యోద్యమములో పాల్గొనుచు శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు గారిచే నడపబడిన స్వరాజ్య పత్రికకు ప్రోత్సాహకులుగా నుండిరి. మహాత్మాగాంధీ వారిచే స్థాపింపబడిన అసహాయోద్యమమున ప్రవేశించి మహాత్ముని ఆదేశానుసారము 1921 సంవత్సరమున న్యాయవాద వృత్తిని విసర్జించిరి. పలు నష్ట కష్టముల కోర్చి ఏ వృత్తిని అవలంభించక స్వంత ఆస్తులను ఖర్చుపెట్టుచు త్యాగబుద్ధితో దేశసేవ చేసిరి. 6 పర్యాయములు కారాగారమున కేగి 6 సంవత్సరములకు తక్కువగాని కాలమున కారాగార కష్టములను భరించిరి.

స్వరాజ్యపార్టీ తీర్మానానుసారము మొదట మదరాసు శాసనసభా సభ్యులుగా ఎన్నికయి – కొలది మాసములకే మహాత్ముని ఆజ్ఞానుసారము పదవిని త్యజించి, ఉప్పుసత్యాగ్రహ సందర్భమున కారాగారమున కేగిరి. మరల ఎన్నికలలో పాల్గొని సభ్యుడుగా ఎన్నికొనబడి ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారిగారి కాలమున చీఫ్ సెక్రెటరిగా పనిచేసిరి. ద్వితీయ సంగ్రామ కాలమున ఈ పదవికి రాజీనామా నిచ్చిరి.

బెజవాడ పురపాలక సంఘమునకు అధ్యక్షులుగా పనిచేసిరి. ప్రాంతీయ కాంగ్రెసుకు అధ్యక్షుడుగాను, కార్యదర్శిగాను పనిచేయుటయే గాక అఖిలభారత కాంగ్రెసు సభ్యులుగా నుండిరి. విశాలాంధ్రోద్యమమునకు అధ్యక్షులుగా పనిచేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమును స్థాపింపజేసిన అఖండ కీర్తిని సంపాదించినారు. వీరి 79 సంవత్సరముల వయసులో సాటిలేని త్యాగమును దేశసేవను గ్రహించి

నేడు స్పీకరుగా ఎన్నుకొనుటలో విశేషమేమిలేదు. గాని యిప్పటికైనను బాధ్యులగు దేశ నాయకులు గ్రహించి నందుకు స్మరణీయులు. ఏదియెట్లున్నను మా వంశముతో సంబంధించిన ప్రఖ్యాత పురుషులలో పూర్వము హైదరాబాదు రాష్ట్రములో ప్రధానమంత్రిగా పనిచేసిన రాజాకృష్ణవంతు తరువాత నేటి ఆంధ్ర ప్రదేశ్ చట్టనిర్మాణ సభాధ్యక్షస్థానము నలంకరించిన నా మేనత్తగారి కుమారులును, గురుతుల్యులును అగు శ్రీ కాళేశ్వరరావుగారి పేరును ఇందు బొందుపరచు భాగ్యము నాకు లభించినందుకు సంతసించు చున్నాను.

మా మేనత్తగారి ప్రథమ కుమార్తె (మల్లికార్జునరావుగారి భార్య) చేమర్తి కోటమ్మగారు, సజీవిగానున్నది. రెండవకుమార్తె నందూరి శ్యామలాంబ ఆమె భర్త సూర్యనారాయణగారు నూజివీడు తాలూకా ఆరుకొలను గ్రామ మకాసాలో భాగస్తుడు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు – పెద్దకుమార్తె పెద్దాడ సరస్వతి, బి.ఎ., ఎల్.టి; రెండవ కుమార్తె వరలక్ష్మి ఎం.ఏ.. ఈమె డాక్టర్, (ఇంజనీయర్) కె.వి లక్ష్మణరావు (ఇంజనీయర్) గారి భార్య. ఉభయ దంపతులు విదేశములలో విద్యనభ్యసించినవారు. పెద్దకుమారుడు వెంకట రమణారావు, మెకానికు ఇంజనీరింగు పరీక్షలో ప్యాసయి ఉద్యోగములో నున్నాడు. రెండవ కుమారుడు వెంకటేశ్వరరావు, ఎల్.ఐ.ఎం, ఆయుర్వేద డాక్టరుగా పని చేయుచున్నాడు. మూడవ కుమారుడు మోహనరావును శ్రీ కాళేశ్వరరావు దత్తు తీసుకొని అమెరికా పంపిరి. అచ్చట విద్యనభ్యసించి డాక్టరు పట్టమును పొందినారు. ఆయన భార్య మాలతి ఎం.ఏ. పరీక్షలో ప్యాసయినది. వీరుభయులు ఇండియాకు వచ్చిన తరువాత భారత ప్రభుత్వము విదేశములకు పంపియున్నారు. ఈ విధముగా ఈ కుటుంబము విద్వత్ కుటుంబమని చెప్పవచ్చును.

రెండవ మేనత్త అయ్యదేవర లక్ష్మినరసింహంగారి భార్య సుబ్బమ్మగారు. ఈమెకు మధ్యవయసుననే వైధవ్య దశవచ్చినది. యిద్దరు కుమారులు, యిద్దరు కుమార్తెలు ఉండిరి. పెద్ద కుమారుడు వెంకటనరసింహంగారు చందాపురం కర్ణీకము చేయుచుండిరి. రెండవకుమారుడు రామకృష్ణారావు నూజివీడు జమీందారి యెస్టేటులో ఠాణేదారుగా పనిచేసెను. పెద్దకుమార్తె జములాపురం వరలక్ష్మమ్మ – రెండవకుమార్తె చేమర్తి దుర్గాంబ ఉండిరి. ఇద్దరు కుమారులు ఒక కుమార్తె – తల్లి జీవితకాలములోనే గతించిరి. ఒక కుమార్తె తల్లి మరణానంతరము గతించినది. వెంకటనరసింహం గారి కుమారుడు లక్ష్మినరసింహం, బి.ఎ.బి.ఎల్. ప్లీడరి చేయుచున్నాడు.

మా తాతగారి కుమారుల పేర్లు పైన వ్రాసియే యున్నాను. మా తండ్రిగారు జ్యేష్ఠకుమారుడు – రెండవకుమారుడు లక్ష్మీకాంతరావుకు ముగ్గురు కుమార్తెలు. 1) అయ్యదేవర వెంకటనరసింహంగారి భార్య సుబ్బమ్మ, 2. పబ్బరాజు సుబ్బారావుగారి భార్య దుర్గాంబ, 3. వెల్లంకి లక్ష్మీనరసింహరావుగారి భార్య వెంకటరామమ్మ – మా పినతండ్రి లక్ష్మీకాంతరావునకు పుత్రసంతతి లేనందున నా కనిష్ఠ సోదరుడు నాగభూషణరావును దత్తు తీసుకొనియుండెను. లక్ష్మీకాంతరావు 1311 ఫసలీలో కాలంచేసెను. నాగభూషణరావు ఇంగ్లీషు, హిందీ, ఆంధ్రమునందు పరిచయము గలవాడు. 2వ తరగతి వకీలు పరీక్షలో ప్యాసయి వరంగల్లు నందును, మహబూబాబాదు నందును కొన్నాళ్లు పనిచేసి విరమించుకొనెను. ఇప్పుడాయన మహబూబాబాదు తాలూకా నీలికుర్తి గ్రామములో వ్యవసాయవృత్తి నవలంభించి యున్నాడు. ఆయనకు 1. రామసుందర్రావు, 2. సీతారామరావు, 3. సురేంద్రరావు అనే ముగ్గురు కుమారులు; 1. సీతారాఘవమ్మ, 2. సుబ్బలక్ష్మమ్మ అనే యిద్దరు కుమార్తెలున్నారు.

నా రెండవ పినతండ్రి వెంకట్రామారావు శైశవావస్థలోనే మాతృవియోగము గలిగినందున సూర్యాపేట తాలూకా యరకవరం గ్రామంలో మేనమామల వద్దనే పోషింపబడెను. పెద్దవాడయిన తరువాత నీలికుర్తి గ్రామపటేలుగిరిలో ప్రవేశించి అచ్చటనే స్థిరనివాస మేర్పాటు చేసుకొనెను. ఆయన మాతండ్రిగారి సహాయముతోను, మేనమామ గండేపల్లి నరసింహరావుగారి సలహా వెంటను తనపేర కొంత భూమియు, మేనమామ నరసింహరావుగారిపేర కొంత భూమియును సంపాదించెను. బావాజిగూడెం శివారులో ఒక బంజరును జాయింటులో సంపాదించెను. అచ్చటనే వ్యవసాయము చేయుచుండెను. తుదకు 1326 ఫసలీలో నిస్సంతుగా కాలం చేసెను. కాని వారిభార్య శారదాంబగారు భర్త అనుజ్ఞ ప్రకారము నా రెండవ కుమారుడు లక్ష్మీకాంతరావును దత్తు చేసికొనెను.

* * *

*ప్రకరణము - 8*

# మా తండ్రిగారి జీవిత విశేషములు

మాతండ్రిగారు 1270 (1860)లో జన్మించిరి. వారికి 11 సంవత్సరము ననే మాతృవియోగము కలిగినది. తండ్రిగారి పోష్యములోనే యుండిరి. ఆ కాలపు బడిచదువు పూర్తిచేసి గ్రామలెఖ్ఖలను వ్రాయుటకు తండ్రిగారి వద్దనే శిక్షణ పొందుచు, తండ్రివెంట పని చేయుచుండెను. 18వ సంవత్సరమున మా అమ్మగారితో వివాహము జరిగినది. మా మాతామహుడికి పురుష సంతానము లేనందున కుంటముక్కల అప్పయ్య కుమారుడు శేషగిరిరావుగారిని దత్తు తెచ్చు కొనెను. మాతాతగారు పరమపదించిన తరువాత పూర్వార్జితమైన జగన్నాథపురం గ్రామకర్ణీకము వారసత్వేన తనకు సంక్రమించినను సోదరుడు లక్ష్మీకాంతరావు మరల యెరకవరం పోవునని ఆయనను విడవజాలక బంధువు లెంత జెప్పినను వినక జగన్నాధపురం కర్ణీకమును తమ్ముడిపేర చేయమని దరఖాస్తు యిచ్చెను. అప్పుడు ఆరండల్ జిల్లా కల్టెకరుగా నుండెను. ఆయన ఆలోచించి, చనిపోయిన కర్ణం నరసింహముగారికి బదులు ఆయన పెద్దకుమారుడు సీతారామయ్య పేరు రిజిస్టరు చేయనైనది అనియును ఆయన తనకుగల హక్కును వదలుకున్నందున రెండవ కుమారుడు లక్ష్మీకాంతరావును నియమించనైనది.

లక్ష్మీకాంతరావు జీవితానంతరం సీతారామయ్య వారసులపేర లీష్టు చేయబడును అని ఉత్తర్వు ఇచ్చెను. ఆ కాలమున యూరోపియన్ అధికారులు ధర్మశాస్త్రమును గ్రామోద్యోగ నియమములను సమన్వయముచేసి ఎలా పాటించిరో గమనించవలసి యున్నది. మొత్తముమీద కర్ణీకము లక్ష్మీకాంతరావు గారి పేర అయినందున వారే పనిమాత్రము చేయుచుండిరి. అయినను లక్ష్మీకాంతరావుగారే



మాదిరాజు శీతారాంరావుగారు (గ్ర. తండ్రి)
రంగమ్మగారు (గ్ర. తల్లి)
సత్యనారాయణరావు (దౌహిత్రుడు)



మాదిరాజు రామకోటీశ్వరరావు
అనంతలక్ష్మమ్మగారు (సతీమణి)

అధికారుల వద్దను, క్షితుల వద్దను సమాధానములు చెప్పుచు బాధ్యత వహించుచుండిరి. మాతండ్రిగారు దురాలోచనలు చెప్పి తగవులు పెంచి, వ్యాజ్యములలో దింపి లంచములు తీసుకొనువాడుకాడు. వ్యవహారములలో సంధిపద్ధతితో పరిష్కరించుచు సర్వజనామోదము బడయుచుండేవాడు. ప్రక్క గ్రామముల లెఖ్ఖపనులు స్వయముగా వ్రాయుచు వ్రాయించుచు ఈ ముఠా గ్రామముల లెఖ్ఖపనులను నిరాక్షేపణగా నిర్వహించుచుండెడివారు.

తదుపరి 1900 సంవత్సరములో జగన్నాథపురం గ్రామము పొన్నవరములో కలిసినందున ఆ కర్ణీకము పోయినది. 1902 సంవత్సరములో మా పినతండ్రి లక్ష్మీకాంతరావుగారు కాలంచేసిరి. సోదర వియోగ దుఃఖము, ఆర్థిక చిక్కులు తటస్థించినవి. 1908 సంవత్సరము నుండి జగన్నాధపురము భూములను కౌళ్ళకిచ్చి నీలికుర్తి గ్రామములో వ్యవసాయము చేయుచుండిరి. స్న 1317 ఫసలీ (1908 సం.) నుండి విరోధుల ప్రోద్బలంచే బావాజిగూడెం బంజరుయొక్కయు, ఒకటి రెండు తండాల యొక్కయు రైతులు ఎదురుతిరిగి కౌలుశిస్తుల నీయక తిరుగుబాటుతో ప్రవర్తించుచుండిరి. మధ్యమధ్య మాతండ్రి గారున్ను, మా తాత గండేపల్లి నరసింహరావు గారున్ను నీలికుర్తికి వచ్చిపోవుచు సంధి ప్రయత్నములు చేయుచుండిరి. స్న 1319 ఫసలీ నుండి నేను వరంగల్‌లో వకాలతు ప్రాక్టీసు మొదలు పెట్టితిని. స్న 1326 ఫసలీలో మా పినతండ్రిగారు కాలం చేసినందున మా తండ్రిగారు నీలికుర్తినందే ఉండవలసివచ్చెను. అప్పటి వరకు నేనుకూడ కొంత అనుభవము, పలుకుబడి సంపాదించగలగితిని. మొత్తం మీద మా తండ్రిగారి, గండేపల్లి నరసింహరావు తాతగారి శాంతియుత కృషివలన రైతులు రాజీకివచ్చిరి. యధాప్రకారము వర్తింపసాగిరి. మా తండ్రిగారు శాంతిప్రియులు. సంధికాముకులు. యధార్థవాదిగాను తానున్న ప్రాంతములలో ప్రతిష్ట సంపాదించగలిగెను.

మాతల్లి రంగమ్మగారు భర్తను దైవసమానముగా నెంచుచు భయభక్తులతో మెలగిన ప్రతివ్రత. తగవులు, పోట్లాటలు బిరుసుమాటలు ఎరుగదు. కన్నపిల్లలను తిట్టుటకును, కొట్టుటకును భయపడెడిది. మా మాతామహి అలివేలమ్మగారు సదా రామదాసు కీర్తనలను భక్తిపరమైన పాటలను పాడుచు భగవన్నామ స్మరణ చేయుచుండెడిది. మాతల్లిగారును తన తల్లివలెనే కొన్ని రామదాసు కీర్తనలను పాడుకొనుచుండెడిది. తన పిల్లలకైనను ఇంటిలో మరెవ్వరికైనను రోగములు వచ్చినప్పుడు సదా రామనామస్మరణ చేయుచు దేవతలకు మ్రొక్కుచుండెడిది. మా తండ్రిగారికి అపాయకరమైన గడ్డలేచి వ్యాధిగ్రస్తులైరి. ఆ సందర్భమున నిలువుదోపు యిచ్చెదనని మ్రొక్కి జమలాపురం వెంకటేశ్వరస్వామికి తనన

ఆభరణములను సమర్పించినది. ఆమెకడుపు దుఃఖమెరుగదు. అన్నోదకములకు లోటులేకుండా పాడిపంటలు సమృద్ధిగా నుండుటచే అతిథి అభ్యాగతులకు బంధుమిత్రులకు భోజనములు విరివిగా పెట్టుచుండెడిది. ప్రతిరోజు వెంకటేశ్వర స్వామి పూజ, కొన్ని ఉపవాసములు, వ్రతములు, కుటుంబాచార ప్రకారము సలుపుచు బ్రాహ్మణులకు భోజనము పెట్టుచుండెడిది. నాతరువాత 8 సంవత్సరములకు నాసోదరుడు నాగభూషణరావున్నూ. అతనికి 10వ ఏట నా చెల్లెలు కనకమ్మయు పుట్టిరి. మాతల్లిగారికి నాయందే ప్రేమ యెక్కువ.

నేను వరంగల్‌లో ప్రవేసించినప్పటి నుండియు తరచుగా నావద్దనే వుంటు వచ్చినది. తుదకు 1938 సంవత్సరములో నా వద్దనే వుండి పరమపదించిన సాధ్వీమణి. ఆమెకు ఆమెయే యుదాహరణము. ఈ తరమువారిలో ఆమెను పోలినవారు అరుదుగా నుండవచ్చును. మా అమ్మగారి మరణానంతరము 4 సంవత్సరములు మాతండ్రిగారు జీవించి యుండిరి. మా తమ్ముడు నాగభూషణ రావు మొదటిభార్య సుబ్బమ్మ 1919 సంవత్సరంలో మా తల్లిగారుండగానే కాలముచేసెను. తరువాత రాఘవమ్మ అనే ఆమెతో రెండవ వివాహము జరిగెను– రెండవభార్యయు గతించినందున కొంత దుఃఖమనుభవించిరి. కాని వెంటనే తృతీయ వివాహము జరుగుటయు, కొలది రోజులలో నతడు పుత్రవంతు డగుటయు వారి జీవితములోనే తటస్థించినందున వారికి కొంత శాంతి కలిగినది. పైన వ్రాసినట్లు ఎక్కడ ఉన్నను తగవులు, పార్టీలు ఎరుగరు. కనుక సర్వజనా మోదముతో కాలము గడిపిరి. వారిని అజాతశత్రువన్నను అతిశయోక్తి కాదు. 1942 సంవత్సర అక్టోబరు నెలలో నాకు అడ్వొకేటుపట్టా దొరికినందున కోర్టులో విందుచేసి హారములు వేసిరి. అట్లే యింటికి వచ్చితిని – ఆరోజు మానాన్నగారు హనుమకొండలోనే ఉండిరి. నేను వారికి నమస్కరించితిని. వారు ఆనందముతో కౌగలించుకొని ఆశీర్వదించిరి. ఆయన జీవితంలో సామాన్యమైన పాడిపంటలుండుటచే మంచి గృహస్తుగా గ్రామజీవనము గడుపుచుండిరి. తుదకు మాతండ్రిగారు చిత్రభాను సంవత్సర పుష్య శు. 8 రోజున అనాయాసముగా 84 సంవత్సరముల వయసులో మరణించిరి. కొంతకాలము నుండి వారికి మోకాళ్ల నొప్పులుండుటచే భూములను చూడలేకపోయినను గుఱ్ఱమునెక్కి చూచి వచ్చేవారు. ఎప్పుడు ఒక గుఱ్ఱము వారి సవారిలో వుండెడిది. ఆ సంవత్సరము నేను నిజామాంధ్ర మహాసభ కధ్యక్షుడనుగా నుండుటచే నల్లగొండ పర్యటనకు వెళ్ళవలసి వచ్చెను. అప్పుడు శిస్తులు చెల్లించే తరుణమైయుండెను. ఆ కారణమున కొంతడబ్బు తీసికొని నీలికుర్తివెళ్ళి వారికిచ్చితిని. వారు యధాప్రకారము గుఱ్ఱమునెక్కి వరికుప్ప వద్దకు వెళ్లి ధాన్యము కొలిపించుచుండిరి. నేను కాలినడకతో

అదేమార్గముగా పై భూములవద్దకు వెళ్ళి, రాత్రి 8 గంటలకు యింటికి వచ్చితిని. వారు ధాన్యం కొలిపించి గుఱ్ఱము నెక్కి రాత్రి 8 గంటలకు యింటికి వచ్చిరి. వ్యాధిగ్రస్థులు కాలేదు గనుక నాకు భయమనుపించలేదు. తదుపరి నేను నల్లగొండ పర్యటనకు వెళ్లి సంక్రాంతి పండుగ వచ్చినందున తోడి కార్యకర్తల అభిప్రాయానుసారము దేవరకొండ ప్రయాణము మాని నిజామాబాదు పర్యటన పండుగ అనంతరము వెళ్లుటకు ఏర్పాటు చేసుకొని హనుమకొండ వచ్చితిని. ఆరోజు బుధవారము అయినది – ఇంటికి రాగానే మాతమ్ముడు సోమవారంనాడు వ్రాసిన వుత్తరము చూడగలిగితిని. అందులో మా నాయనగారికి జ్వరం వచ్చుచున్న ట్లును, నేను రావడము మంచిదనియును మాత్రము వ్రాయబడియుండెను. తీవ్రతలేదు గనుక మరోరోజు ఉదయం బస్సులో వెళ్లుటకు నిశ్చయించుకుంటిని. నీలికుర్తిలో మా తమ్ముడు ఉత్తరము వ్రాసిన సోమవారం రోజున స్వల్పముగా జ్వరమున్నను స్నానముచేసి మడిబట్ట కట్టుకొని వంటయింటిలోకి వెళ్లి భోజనము చేసిరి. మంగళవారము జ్వరాధిక్యతచే స్నానము చేయకయే భోజనము చేసిరి. బుధవారం రోజున జ్వరం యెక్కువగా నుండెను. మంచమువద్దకే భోజనము తెప్పించుకొని పీటమీద కూర్చుండి నివేదన పరిషేచనముచేసి భోజనము చేసెను. మంచముపైకి మంచి స్పృహలోనే వెళ్లి పరుండిరి. గాని క్రమేణ స్పృహ తప్పిపోవు చుండెను. తుదకు బుధవారం రాత్రి 2 గంటలకు మా తండ్రిగారు పరమపదించిరి.

నేను అనుకున్నట్లు గురువారం ఉదయం ఖమ్మం బస్సులో మా బావమరిది వెల్లంకి లక్ష్మీనరసింహరావుగారిని తీసికొని ప్రయాణము చేసితిని. నాగారం వద్ద బస్సు దిగితిని. నాకొఱకు బండి సిద్ధముగానుండెను. నౌకర్ల వలన మాతండ్రిగారి మరణవార్తను తెలిసికొంటిని. ఇంటికివెళ్లి నా నిరీక్షణలో నుంచిన వారి శవమును జూచితిని. వారి అంత్యకాలమున నా కెట్టి సందేశము దొరకలేదని విచారపడితిని. అదేరోజు సమంత్రకముగ దహన సంస్కారము జరిపితిని. ఇంత మాత్రము సేవలభించినందుకు తృప్తిచెందితిని. కుమారుని విద్యుక్త కర్మలలో ఇదియొకటికదా. తదుపరి హనుమకొండలో పన్నెండురోజుల వైదికకర్మలు పూర్తి చేసితిని. వారు గోవృషభులను ఎక్కువగా ప్రేమించేవారు గనుక ఒక కోడెను తెప్పించి వారిపేర వృషభోత్సర్జనచేసితిని. ఆవృషభము 14 సంవత్సరములు జీవించి చుట్టుప్రక్కల గ్రామములలో ఏటా దాదాపు 300 గోవత్సములను ఉత్పత్తి చేసి వారి పేరును స్మరింపజేసినది.

సాంప్రదాయానుసారము వారికి గోబ్రాహ్మణభక్తి యెక్కువ. రాజారామా రావు దేశముఖుగారి మనుమడ ననియును బంజరుదారుననియును యిలాటి

అనువంశీక జమీందారి గౌరవభావములుండెడివి. సమయము వచ్చినప్పుడు విశాలభావములతో ప్రవర్తించేవారు. గాని నీచభావములతోను లోభబుద్ధితోను ప్రవర్తించి యుండలేదు.

బావాజిగూడెం బంజరుచెరువు స్వంతచెరువుగా తీర్మానము పొందుటకును పరిటాల దేశముఖు దేశపాండ్యాగిరిలో పేరు చేర్పించుకొనవలెననియును వారికి కోరికెలుండెను. నేను రెండింటికిని వ్యవహార చర్య వారి పేరనే చేసితిని. విచారణానంతరము బావాజిగూడెపు చెరువు స్వంతచెరువని తీర్మానము పొందగలిగితిని. పరిటాల మాషనుగురించి నిజామత్ అత్యాత్‌లోను బాబేహుకూమత్ కమిటీ అత్యాత్‌లోను వ్యాజ్యము నడిపితిమి. శ్రీ బి.రామకృష్ణా రావుగారు వకీలుగా పనిచేసిరి. మా అనువంశీక హక్కును అంగీకరించిరి. గాని భుక్తము లేదనిరి. అందుకు పునర్విమర్శకు పెట్టితిని. ఆ సందర్భమున మా తండ్రిగారు కాలం చేసిరి– నీలికుర్తిలో మొదట 2 అరకలతో మాత్రమే వ్యవసాయముండెను. నేను ఒక బంజరుకుంటను మరికొంతభూమిని క్రయముకు తీసుకొంటిని. అందులో 17 యకరముల పల్లపుభూమి యుండెను. ఆ కారణమున పది అరకల వ్యవసాయము నీలికుర్తిలో వారి ఆధ్వర్యము ఒక గుమాష్తా సహాయముతోను యిద్దరు శేరిదార్లతోను నడుపబడుచు సంవత్సరానికి 1కి ముప్పదిపుట్ల వడ్లు కొంత మిర్చిపంట పండింపబడుచుండెను. నీలికుర్తి ఆదాయ వ్యయములు వారి యిష్టానుసారము జరుపబడుచుండెను. హనుమకొండ భోజనమునకును వారే నాకు ఆరుపుట్ల వడ్లు పంపుచుండెడి వారు – జుజ్జూరులో వారి కాలమున 90 యకరముల భూమి యుండెను. నేను 80, 90 యకరములు సంపాదించి రెండు చినకుంటలు ఒక బావి తవ్వించితిని. ఒక మామిడితోట వేయించితిని. వారు మధ్యమధ్య జుజ్జూరు వచ్చి నాకు సలహాలనిచ్చుచు సంతోషించుచుండిరి. నా మాతాపితృల జీవితములోనే నా యిద్దరు కుమార్తెల వివాహములను, నా యిద్దరు కుమారుల వివాహోపనయనములను వైభవముగాను కులాచార మర్యాదలతోను వారల ఆదేశానుసారము జరిపితిని. మొత్తంమీద ఏ కష్టము లోటుపాటులేకుండా ఆనందముగా జీవితముగడిపి జీవయాత్రను ముగించిన ధన్యజీవి. నా తండ్రి సీతారామరావుగారు నా మాతాపితృల యొక్కయు పితామహ ప్రపితామహుల యొక్కయు, యధార్థ పరమార్థ జీవితఫలితమే నా మనుగడకు కారణమనియును వారి ఆశీర్వాద బలముననే సుఖజీవనము చేయగలుగుచున్నా ననియును స్మరించుట నా విద్యుక్త ధర్మము. ఇప్పటివరకు

నా పితృ పితామహా ప్రపితామహుల చరిత్రాంశమును విన్నంతవరకు ఈ అధ్యాయమున వ్రాసి కృతకృత్యుడను కాగలి గితిని. తెలంగాణమున అత్యున్నత గౌరవబిరుదములను సంపాదించినవారిలో నా ప్రపితామహులుండుట వంశీకుల మగు మాకు గర్వకారణము. చిర స్మరణీయము.

మా మాతామహుడు రాజేశ్వరరావుగారికి మా తల్లిగాక మరియిద్దరు కుమార్తెలు కలరని పైన వ్రాసితిని. పెద్దకూతురు అల్లూరు రాజమ్మగారికి ఒక కుమారుడు నరసింహారావు ఉండెను. ఆయన తండ్రి కాలమునుండియు మేడిచెలం తాలూకా పరాలలో ఉండి కరణీకము, వ్యవసాయము ఆబ్కారి కంట్రాక్టు చేయుచు అచ్చటనే కాలము చేసెను. రెండవ కుమార్తె తాడేపల్లి వెంకమ్మగారికి పెద్దకుమారుడు సీతారామయ్య మూడవ కుమారుడు వెంకటా చెలపతిరావున్ను తరుణవయస్సులలో వివాహములు అయినతరువాత తలిదండ్రు లుండగానే కాలం చేసిరి. రెండవ కుమారుడు లక్ష్మీనరసింహం తాడేపల్లిగ్రూపు కరిణీకము చేయుచు భూస్వామిగానున్నాడు. నాలగవ కుమారుడు వేణుగోపాల రావు ట్రిబుల్ ఎం.ఎ. ప్యాసయి కొన్ని సంవత్సరములు హైస్కూలు అధ్యాపకుడు గాను, మునిసిపాలిటి రివిన్యూ ఆఫీసరుగాను పనిచేసెను. ఆ సహాయోద్యమమున పాల్గొని కారాగారశిక్ష ననుభవించెను. విద్యావంతుడు, భాషాసేవకుడుగాను, పరోపకార పారాయణుడు గాను జీవయాత్రను గడిపిన బుద్ధిమంతుడు, యశోవంతుడు. అయిదవ కుమారుడు హనుమంతరావు వ్యవసాయము చేయించు కొనుచు నడివయస్సులోనే కాలధర్మమునొందెను. ఆయనకు కుమారులు వెంకట్రామయ్య, వెంకటేశ్వర రావులు ఎల్.ఐ.ఎం. పరీక్షలలో ప్యాసయి డాక్టరీ వృత్తిలో ప్రతిష్టీకులుగా నున్నారు. ఆరవకుమారుడు సీతా రామయ్య హైస్కూలులో అధ్యాపకుడుగానుండి నడివయస్సుననే కాలం చేసెను. పెద్దకుమారుడు ఆంజనేయశర్మ, రెండవ కుమారుడు సంజీవరావు ఎల్.ఐ.ఎం. పరీక్షలనిచ్చి బెజవాడ నగర మునిసిపల్ డాక్టర్లుగా ప్రజాసేవ చేయుచు అనురాగము సంపాదించుకున్నారు. మూడవ కుమారుడు రామచంద్రరావు టెక్స్టయిల్ యింజనీయరుగా బొంబాయిలో వుద్యోగము చేయుచున్నాడు. ఈ విధముగా నా బంధువర్గము సమర్యాదగా, విద్యావంతులుగాను, యోగ్యులుగాను జీవించుచున్నారనుట నాకును ఆనందదాయకమే.

* * *

# రెండవ అధ్యాయము

*ప్రకరణము - 1*

## జననము - బాల్యము

1958 సంవత్సరం ఏప్రియల్ మాసము నుండి మొదటి భాగము నెమ్మది నెమ్మదిగా మా పితృ పితామహ ప్రపితామహుల చరిత్రను వ్రాసి పూర్తి చేసితిని. నా జీవితగాథ కూడా వ్రాయమని కొందరు స్నేహితులేగాక నా రెండవ కుమారుడు లక్ష్మీకాంతరావున్నూ, నా పెద్దకుమార్తె వరలక్ష్మమ్మయున్ను కోరుచుండిరి.

జీవిత చరిత్ర మఱియొకరు వ్రాయుటకు అందు చారిత్రక పురుషుని వాస్తవముగానో అతిశయక్తిగానో వర్ణించుటయు సాంప్రదాయమైయున్నది. గాని మానవుడు ఆత్మకథను వ్రాసికొనుటలో క్లిష్టసమస్యలు ఉద్భవించకమానవు. మానవుడు సర్వజ్ఞుడుకాడు. గుణదోష భూయిష్టము మానవ జీవితము. గనుక తన సుగుణములనే వర్ణించుకొని దోషములను పరిత్యజించుట సహజముగా జరుగును. జీవితములో మానసిక దోషములు రహస్యకృతదోషములు ఉండ వచ్చును. వాటిని వ్రాయుట తనకేగాక తన సహచరులకును సంఘములో అవమానము తటస్థించుట సంభవించును. అంతేగాక జీవితములో ఏదేనిభాగముఅనుకరణీయముగాను, ఆకర్షణీయముగాను నుండవలెను. గర్హితముగాను, అవమానపూరితముగాను యుండకూడదు. కాబట్టి ఈ పనిని కథానాయకుడు వ్రాసికొనుటయు, సత్యముగా వ్రాసికొనుటయు సమంజసముగా ఉండనేరదు. మానవ సమాజములో అందరు పొగడ్త పొందజాలరు. ఆత్మీయులు, బంధుమిత్రులు ప్రేమపూర్వకముగా స్మరించుకొనవచ్చును.

ఇదిగాక మానవుడెంత సమర్థుడుగాకున్నను అతనిలో కొన్ని అయినను సుగుణములు ఉండకమానవు. కాబట్టి ఒక పద్యములో శ్రీ చిలకమర్తి లక్ష్మీనర సింహంగారిట్లు వ్రాసియున్నారు.

గీ. నిందుదివ్వెలతోడ క్రీనీడలట్లు అలరు
గురివెందపూసల నలుపులట్లు గుణగణముతోడ
దోసముల్ కూడియుండు
ప్రాజ్ఞులు గణింతురితరులు పరిహసింత్రు !

మొట్టమొదట ఆంధ్రమున శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులు గారు తన జీవితచరిత్రను వ్రాసికొనియున్నారు. తరువాత శ్రీ మహాత్మాగాంధీ, శ్రీ ప్రకాశం పంతులుగారు, శ్రీ పట్టాభి సీతారామయ్యగారు, శ్రీ పండిత జవహర్‌లాల్ నెహ్రూ మొదలగువారు ఆత్మకథలను వ్రాసికొనియున్నారు. అవి పూజనీయుల చరిత్రలు కనుక వాటివలన దేశమునకు లాభము కలుగవచ్చును.

కాని సామాన్య మానవుల జీవితములు ఉపకరించజాలవు.నేను సాంఘిక రాజకీయ నాయకుడనుగాను. ఆదర్శప్రాయమైన త్యాగముచేసిన వాడనుకాను. పల్లెటూరి బ్రాహ్మణ కుటుంబమునపుట్టి ఆంగ్ల విద్యాభ్యాసము చేయక యూనివర్సిటీ పరీక్షలలో ప్యాసుగాక, ఉరుదుభాష నభ్యసించి నిజాము ప్రభుత్వమున న్యాయవాదవృత్తితో జీవనము గడిపిన నేను ఆత్మకథను ప్రకటించుట పరిహాసపాత్రమని ఎరుగుదును. కాని మిత్రులతోచేసిన వాగ్దానమును పురస్కరించు కొని సహజమైన సిగ్గును ఆత్మాభిమానమును దూరము చేసి జనసామాన్యమువలన రాతగిన విమర్శలకు తలయొగ్గుచు ఆత్మగాథ రచనకు సాహసించుచున్నాను. నేను పార్థివ సంవత్సర కార్తీక బ 3 బుధవారం పునర్వసు నక్షత్రమున జన్మించినట్లు వింటిని. గాని జన్మపత్రిక దొరికియుండలేదు. మాతా మహస్థానముకూడా జజ్జూరే కనుక నేను మాతామహి గృహముననే జన్మించితిని. మాతామహుడు మేడుకొండూరు రాజేశ్వరరాయుడుగారు, నేను పుట్టుటకు ఒక సంవత్సరము ముందుగానే చనిపోయిరి. ఇంటిలో వారి భార్య అలివేలమ్మగారును, తల్లి తిరుమలమ్మగారును, దత్తుకుమారుడు మైనరు అయిన శేషగిరిరాయుడు గారును యుండిరి. ఇట్టి కష్టస్థితిలో మా అమ్మమ్మగారు మాతల్లిగారిని ప్రసవము కొరకు తన కుటీరమునకు తీసికొనివచ్చెను. తాత్కాలికముగా తయారుచేసికొనిన పాకలోనే ప్రసవము జరిగినది. అకాలవర్షముల వలన కురవకుండుటకై పనిచేయు

వడ్డెరతిమ్మిచేత ఆ కులలములను తెప్పించి కుటీరమును కప్పించుకొను చుండిరి. ఈ విధముగా నేను కప్పు కూడా సరిగాలేని ఒక కుటీరమున జన్మించిన సంగతిని మరచిపోలేదు. మరవతగినదికాదు.

మా తల్లి గర్భిణిగా నున్నప్పుడు ఒక యోగి ఆమెనుచూచి నీ గర్భమున మొగశిశువు ఉన్నాడనియును వాడు 60 ఏండ్లకుపైన జీవించి ప్రతిష్ఠికుడు కాగలడనియు చెప్పినాడట.

సాధారణముగా తల్లికిట్టి భావి శుభసూచనలు ఆనందదాయకములే కనుక ఈ విషయమును నా చిన్నతనములో కొన్ని పర్యాయములు మాతల్లిగారు చెప్పుచుండగా వినియుంటిని.

జుజ్జూరు యింట్లో నే నొక్కడనే పిల్లవాడను కనుక మా తాతగారు కూడా ఎక్కువ ప్రేమతో చూచేవారు. ఇంట్లో 60, 70 పశువులుండెడివి. సాధారణముగా ఉదయముపూట రెండు బిందెలపాలు స్వయముగాను జీతగాండ్లతోను మాతాత గారు పితికించేవారు. నాకు ప్రతిరోజు గిన్నెడు మీగడ తినిపించేవారు. టీ, కాఫీలులేవు. ఉదయము, సాయంత్రము పెరుగు వేసుకొని తినేవారము. వెన్న కూడ వాడుకునేవారము. నాకు బియ్యపు అన్నము పెట్టేవారు.

మా నాయనమ్మగారు చనిపోయినప్పటి నుండియు ఆమెగారి వితంతు పినతల్లి పింగిలి రామమ్మగారు మాతండ్రి పినతండ్రుల పోషణార్థము మాయింటనే యుండెడిది. ఆమె నన్ను అతిగారాబముగా పెంచినది. ఆమె గారాబ కారణముననో లేక జన్మస్వభావమో తెలియదుగాని 10 సంవత్సరముల ఈడువరకు అన్నము కలుపుకొని తినలేకపోయేవాడను. దీనివివరము ముందు వ్రాసెదను. 3 సంవత్సరముల వయస్సువరకు మా తాత తండ్రులు జుజ్జూరు యింటిలోనే ఉండెడివారు. మా తాతగారు మైలు దూరముననున్న జగన్నాధపురం కరణీకము ఆ గ్రామమునకు ఆనుకొనియున్న భూములలో వ్యవసాయము చేసేవారు. వ్యవసాయ పశువులు రెండు గ్రామములలో తిరుగుచుండడము, ఆడపశువులు అనగా ఆవులు, పెయ్యలు, బర్రెలు జుజ్జూరులో ఉండడము కొంతయిబ్బందికి కారణమైనది. ఆ కారణమున జగన్నాధపురములో గత్యంతరములేక యిల్లుకట్టుకొని కాపురము చేయవలసి వచ్చినది. కాబట్టి మా తాతగారు జగన్నాధపురములో రెండు పూరిండ్లను కట్టించి అందునా 4వ సంవత్సరమున గృహప్రవేశముచేసిరి. అప్పటినుండియు జగన్నాధపురములో

నివాసము చేసికొంటిమి. గాని జుజ్జూరు యిల్లు యధాప్రకారముంచి మధ్యమధ్య జుజ్జూరుకు వెళ్లి కొన్ని నెలలు ఉండి మరల జగన్నాధపురం వచ్చుచుండెడివారు.

నాకు 3వ సంవత్సరమున శిరోముండన సంస్కారము జరిగినది. 12 సంవత్సరముల ఈడువచ్చేవరకు మా యింటిమంగలితో తప్ప యితరులతో క్షౌరము చేయి,చుకొనలేదు. యిదేవిధముగా మా అమ్మగారితోతప్ప యితరులతో అభ్యంగనము చేయించుకొనలేదు.

నా 4, 5 సంవత్సరముల మధ్య మా అమ్మగారికి ఒక మగపిల్లవాడు పుట్టిపోయినాడు. ఈ విచ్ఛిత్తు మా అమ్మమ్మగారియింటనే జరిగినది. తరువాత రెండు నెలలపాటు మా అమ్మ తల్లివద్దనే యున్నది. మా అమ్మమ్మ గారిండ్లు పూరిండ్లకు తూర్పువైపున ఆవరణస్థలము ఉండెడిదికాదు. పబ్లికు చిన్న ఖాలిస్థలము ఉండెడిది. అందులో ఒక పెద్దరావిచెట్టు ఉండెడిది. దాని నీడన పిల్లవాండ్లు బంతి, బలిచెడుగుడు, టొక్కు, గోలీలు ఆడుకొనెడివారు. గోలీల గుంటలు ఖాలిగా ఉండెడివి. గనుక ఒక్కడనే ఉదయంపూట గోలీలు ఆడుకొను చుండెడివాడను. మా అమ్మగారికి చదువురాదు. గాని రామస్మరణ ఎల్లప్పుడు చేయుచుండెడిది. ఆమెకు కొన్ని రామదాసు కీర్తనలు ఇంకా భక్తిపరమైన పాటలు, పద్యములు, భారత సావిత్రి కంఠపాఠముగా వచ్చెడివి. దుఃఖములోనున్న మా అమ్మగారికి మా అమ్మమ్మగారు ప్రతిరోజు భారత సావిత్రి నేర్పుచుండెడిది. దానిని గోలీలు ఆడుకునే నేను వినేవాడను. మాఅమ్మకంటే ముందే పూర్తిగా వల్లించి అప్పగింత పెట్టెడివాడను. జుజ్జూరు కరణంగారు ఇతర నియోగి వైదిక బ్రాహ్మణులు, బంధుమిత్రులు, ఆడుచు తిరిగే 5 ఏండ్ల బాలుడనైన నాచేత తేపతేపకు భారత కధను చదివించుచు సంతోషించెడివారు. బజారులో నాచేత చదివించడము మా అమ్మగారికి ఇష్టముండెడిదికాదు. దృష్టితగులునని ఆమెకు భయము. మా తాతగారు జగన్నాధపురములో మరల మరల చదివించి సంతోషపడు చుండెడివారు.

నాకు 5వ సంవత్సరము రాగానే మా తాతగారు అక్షరములను దిద్దబెట్టు టయు చిన్న చిన్న పద్యములను నేర్పుటయు ప్రారంభించిరి.

ఆకాలములో బూడిదె భూమిమీద పోసి అక్షరములను దిద్దబెట్టుట ఒక నాగరికమైన పద్ధతిగాను భూమి మీద యినపకడ్డీతో అక్షరములను చెక్కి దిద్దు మనుట ఇంకొక మోటుపద్ధతిగా నుండెడిది. నన్ను మా తాతగారు బూడిదెమీద

వ్రాసిన అక్షరములనే దిద్దమనెడివారు. ఇదేవిధముగా 56 అక్షరంలను గుణింతము నేర్పిరి. 2, 3 పర్యాయములు దిద్ది అక్షరములను చూడకుండ వ్రాసేవాడను. అట్లాగే 2, 3 పర్యాయములు వల్లెవేయించితే పద్యములు ఒప్ప జెప్పెడివాడను. వారు నా చురుకుతనమునకు చాల సంతోషపడెడివారు. నాకు కొంటెపిల్లలతో తిరగడము, ఎగరడము మొదలగు అలవాట్లు ఉండేవి కావు. ఇంట్లో ఉండి తాతగారికి ఏవైన వస్తువులు తెచ్చిపెట్టడము, ఇంట్లో లేగదూడలతో ఆడుకొనడము చేయు చుండెడివాడను. నేనొక మంచి ప్రవర్తనగల వాడనుకావలె నని, మా తాతగారి ఆశయము మఱియు వారి ఆశీర్వాదముండెడిది. మా తాతగారు వికృతినామ సంవత్సర కార్తీక శు. 10 రోజున జగన్నాధపురం ఇంటనే నంజువ్యాధితో మరణించిరి. అప్పటికి నాకు 6 సంవత్సరము లుండెడివి. తరువాత రెండు సంవత్సరములు జగన్నాధపురములోనే గడుపవలసి వచ్చినది. 8వ సంవత్సరమున జుజ్జూరులో కాపురంపెట్టి బడికి పంపవలెనని మా తండ్రిగారు సంకల్పించిరి. కాని కాపురములేని కారణమున జుజ్జూరులోని ఒక ఇల్లు పడిపోయెను. దానిని పునర్నిర్మాణముచేసి, మా అమ్మగారిని, నన్ను ప్రవేశపెట్టిరి. రామమ్మగారు కూడ మాతోనే ఉండెడిది. అప్పుడు జుజ్జూరులో ఒక ప్రాథమిక పాఠశాల ఉండెడిది. దానికి కీ.శే. శ్రీ వేంపాటి వెంకటకృష్ణయ్య గారు వుపాధ్యాయులుగా నుండిరి. ఒక మంచిరోజున బ్రాహ్మణులను బంధుమిత్రులను పిలిచి సశాస్త్రీయముగా నాకు 8వ సంవత్సరమున అక్షరా భ్యాసము చేయించిరి. ఓనమాలు బంగారు భటువుతో పళ్ళెములోని బియ్యముపైన మా తండ్రిగారును, ఉపాధ్యాయులును వ్రాయించిరి. ఉపాధ్యాయులకు నూతన వస్త్రములీయబడినవి. ఇది ఒక ఆశ్చర్యమైన కథనము. అనగా గుణింతమువరకు నేర్చిన బాలునకు ఓనమాలు వ్రాయించుటయే – బహుశః అక్షరాభ్యాసముకూడ ఒక సంస్కారమనుకొని సమంత్రణముగా మాతండ్రిగారు ఇలా చేయించియుంటారు.

నన్ను అక్షరముల తరగతిలో చేర్చుకొనవలసి యుండెను. అప్పటికే గుణింతము కూడా వచ్చినది. గనుక మొదటి తరగతిలో చేర్చుకొనెను. గాని 6 మాసములకే రెండవతరగతిలోనికి చేర్చుకొనిరి. తరువాత ఒక సంవత్సరమునకు మా నాయనగారికి పొత్తికడుపుమీద అనగా బొడ్డుకు ఆనుకొని పైభాగమున ఒక గడ్డలేచినది. వారు చాల బాధపడిరి. తుదకు కార్తీక శు. 10 రోజున తండ్రి తద్దినము పెట్టలేక స్నానముచేసి మడికట్టుకొని నేలపై పరుండుట కూడ జరిగినది. మా పినతండ్రిగారే శ్రార్ధకర్మను పూర్తిచేసిరి. వెంటనే మానాన్నగారిని బండిమీద

మా పినతండ్రిగారు నందిగామకు తీసికొనివెళ్ళిరి. అది నందిగామ చిన్న వంటుకరణం మా మేనత్త పెనిమిటి అయ్యదేవర లక్ష్మయ్య గారియిల్లు. ఆయన ఆత్మగౌరవముతో జీవించే మంచి గృహస్తు. ఆయనకును అప్పటి డాక్టరు వెంకటస్వామి నాయుడు గారికిని చాల స్నేహము. మా నాయనగారికి ఆ డాక్టరుగారే వైద్యసేవ మొదలుపెట్టిరి. 20 రోజులు పిండికట్లు కట్టించి దానిని పక్వమునకు తెప్పించి చిన్న ఆపరేషన్ చేసిరి. ఈ మధ్యకాలములో చాలమంది భయపడుచుండిరి. మా అమ్మగారు 9 మాసములునిండిన గర్భిణి గనుక యిల్లు వదలి నందిగామవెళ్ళలేక ఇంటనే ఉండవలసి వచ్చినది. నేనుకూడా జుజ్జూరులోనే ఉంటిని. శస్త్రచికిత్స జరిగిన తరువాత అందరికిని ధైర్యము వచ్చినది. తరువాత వారమురోజులలో మా తల్లిగారు ప్రసవించినది. మా తమ్ముడు నాగభూషణరావు పుట్టినాడు. అది మార్గశిర మాసమని జ్ఞాపకము.

డాక్టరు వెంకటస్వామి నాయుడుగారి కుమారులను నేనుకూడ చూచి నాను. ఆయన పేరుమాత్రము జ్ఞాపకమున్నది గాని వారి కుమారులు, కుమార్తెల పేర్లను మరచిపోయినాను. వారందరు మా మేనమామ గారింటికి వచ్చిపోవు చుండెడివారు. ఆరోజులలో ఆంగ్లేయ వైద్యము ఇంత ఉచ్చదశకు వచ్చియుండ లేదు. ఆయన పాత పద్ధతులతోనే గడ్డ దానంతట అదే పక్వమునకు రావలెనని నిరీక్షించి మెత్తబడిన ఒక స్థలము నుంచి బయలుచేసి చీము, నెత్తురు తీసివేసి బాగు చేసినాడట. ఇందులో కొంత పాత సాంప్రదాయములను దృష్టియందుంచు కొని రణచికిత్స చేసిరి. వారిమేలు మరువతగినది కాదు. మొత్తంమీద సంవత్సరాది వరకు చికిత్స పొందుచు నందిగామలోనే ఉండి పూర్తి ఆరోగ్యమును పొంది మా నాయనగారు ఇంటికి వచ్చిరి. మానాయనగారి యెడ మాపెద్దమేనత్త వరలక్ష్మమ్మగారికి తక్కిన సోదరులకన్న ప్రేమ ఎక్కువ. బావగారు లక్ష్మయ్యగారును వారిని అదే దృష్టితో చూచెడివారు. ఈ రెండు కుటుంబములలో సహాయ సహకారము లిట్లే యుండెడివి. అక్క బావగార్ల సలహా సంప్రదింపులు లేనిది మా నాయన గారు ఏ కార్యము చేసేవారుకారు.

ఆ సంవత్సరము నేను రెండవ తరగతిలో నుంటిని. క్లాసులో మొదటి వాడనుగా చదివేవాడను. గాని మధ్యనే ప్రమోషన్ ఇచ్చిన కారణమున రెండవ తరగతి పరీక్షలో చేరుటకు రోజులు తక్కువయినవని ఉపాధ్యాయులు చెప్పి పరీక్షలో చేర్చకపోయిరి. అప్పుడు శ్రీ పాపిట్ల లక్ష్మీనారాయణగారు రెండవ ఉపాధ్యాయుడుగా

నియమించబడిరి. నాకు రోజులు తక్కువ అయినట్లు మాస్టరుగారు చెప్పినారని ఇంట్లో చెప్పితిని. ఆ మాట మా అమ్మగారికిని మా చిన్నమ్మ రామమ్మగారికిని తప్పుగాతోచినది. నన్ను పరీక్షలో చేర్చకపోవుటచే 9 సంవత్సరముల బాలుడనైనను అది నాకు అవమానముగా పరిణమించినది. అంతట నేను బడిమాని వేసితిని. ఆ సంవత్సరము పరీక్షలు పూర్తి అయినవి. నేను బడిమానుకున్నాను. కొంటెతనముతో కాదు, చదువలేక కాదు. బడి ఎగగొట్టే బడిదొంగను కాను. క్రమశిక్షణతోను, మర్యాదగాను తెలివితేటలతోను చదివే వాడను గనుక నేను అవమానమనుకొని బడిమానినానని ఉపాధ్యాయులు కూడ గ్రహించిరి. అంతట కీ.శే. పాపిట్ల లక్ష్మీనారాయణగారు మాయింటికి వచ్చిరి. ఆయన మాగ్రామ కాపురస్తుడే గనుక మా తండ్రిని బావగారనిన్నీ, మాతల్లిగారిని అక్కయ్య అనిన్ని పిలిచెడివాడు. వారిద్దరి యెదుట నాకు మంచిమాటలు చెప్పి మూడవతరగతిలో చేర్పించుతానని వాగ్దానముచేసి నన్ను ఎత్తుకొనిపోయి మూడవతరగతి విద్యార్థులలో కూర్చుండబెట్టెను. తరువాత కొలది రోజులకే భర్త మరణానంతరము మా చిన్నమేనత్తగారు జుజ్జూరు వచ్చినప్పుడు ఆమెవెంట కుమారుడు రామకృష్ణారావు, కూతురు దుర్గమ్మలు జుజ్జూరు వచ్చిరి. రామకృష్ణారావు నాకంటె ఒకటిన్నర సంవత్సరములు పెద్దవాడు. దుర్గమ్మ నాకంటె 2 సంవత్సరములు చిన్నది. రామకృష్ణారావును నాతోపాటు మూడవ తరగతిలో చేర్పించిరి. ఇద్దరము చదువుచుండెడివారము. అతను ఆటపాటలలో నాకంటె గట్టివాడు. కొంటెవాడు కాడు గాని కొంచెము గుండాతనము వుండెడిది. బడి తప్పించుకొనుటకు ప్రయత్నము చేసేవాడు. నన్నుకూడ ఆటలలో తనవెంట ఉంచుకొనెడివాడు. రామకృష్ణారావుకు నాకు గాఢమైత్రి వుండెడిది. ఒకచోట భోజనము, ఒకటేపక్క వుండెడిది. ఆదివారమునాడు మాత్రము జగన్నాథపురము వెళ్లెడివారము. అక్కడ మా పినతండ్రి, మా పినతల్లిగార్ల వద్ద ఒకరోజు వుండి వచ్చెడివారము.

గ్రామాదులలో వీధినాటకములు జరుగుచుండెడివి. మా గ్రామములో 10 సాతానికుటుంబములుండెను. వారిలో కొందరు రాజవైద్యులు, కొందరు భూతవైద్యులు, కొందరు సంగీత పాఠకులుండెడివారు. అందరికి భజనకీర్తనలు వచ్చును. వారు తాంబూర చేతపట్టుకొని కీర్తనలు పాడుచు భిక్షాటన చేసెడివారు. విష్ణ్వాలయ వుత్సవములలో అందరు తాంబూర, మద్దెల చిరుతలతో పార్టీలుగా వచ్చి సేవలో పాల్గొని భజనకీర్తనలు పాడుచుండెడివారు. సాతాని యువకులు ఎవరో ఒక గురువును తెచ్చుకొని “అనిరుద్ధవిలాస”మనే ఒక నాటకమును

తయారుచేసి జుజ్జూరు దేవాలయము ముందర వీధిలో ప్రదర్శించిరి. అప్పటి గ్రామప్రజలు చూచి ఆనందించిరి. రాజవైద్యులలో తిరునగరి బుచ్చయ్య, వెంకయ్యలును, భూత వైద్యులలో తిరునగరి శేషయ్యయును మద్దెల వాయిద్యమునకు తిరునగరి రంగయ్యయును, సంగీతమునకు శేషాచలపు నరసయ్యయు పేరువడసిరి. అప్పుడప్పుడు వీధులలో భాగవతము ప్రదర్శించెడి వారు. అందులో సత్యభామ వేషమునకు బాలింతవేషమునకు ప్రాముఖ్యత వుండెడిది. ఇట్టి నాటకములు జుజ్జూరులో చూచెడివాడను. జగన్నాధపురం కూడ వెళ్లెడివాడను. దేవాలయము ముందర ప్రతిరోజు ఏదేని పురాణ కాలక్షేపణ జరుగుచుండెడిది. ముఖ్యముగా విందమూరి జానకిరామయ్య గారు మంచి శ్రావ్యముగా చదివి అర్ధం చెప్పెడివారు. ఆయనకు కొంచెము శాస్త్రజ్ఞానముండెడిది. మద్దూరి సుబ్రహ్మణ్యదీక్షితులవారు అర్ధము చెప్పెడివారు. నేను సాధారణముగా వెళ్లి వినేవాడను. ఈ యభిరుచికి నాభోజన సందర్భమున రామమ్మగారు చెప్పుచుండే భారత, భాగవత రామాయణ కథలే కారణము. ఒక సంవత్సరము మా ఊరిలో మద్దూరి సుబ్రహ్మణ్యదీక్షితులవారు యజ్ఞము చేసిరి. ఇది పశు యజ్ఞము. 5, 6 రోజులు హోమములు, వేదమంత్రులతోను అనేకమంది శ్రౌత పండితులతోను, ఇతర వేదశాస్త్ర పండితుల సహాయముతోను జరుపబడినది. వేలాది బ్రాహ్మణులు, ఇతర జనులు భుజించిరి. గ్రామగ్రామముల నుంచి ప్రజలు వచ్చి చూచి వెళ్లుచుండిరి. దాని తరువాత సుబ్రహ్మణ్య దీక్షితుల గారిని సోమయాజులగారని పిలువసాగిరి.

తరువాత ఇంకొక సంవత్సరమునకు విందమూరి జానకిరామయ్యగారు బ్రహ్మసత్రము అనే అన్నదాన యజ్ఞము 11 రోజులు చేసిరి. అహోరాత్రములు భజనలు పారాయణలు చేసినట్లు జ్ఞాపకము. వందలాది పండితులు, వేలాది బ్రాహ్మణులు వచ్చిరి. దూరగ్రామముల నుంచికూడ అశేషజనులు వచ్చి చూచు చుండిరి. కులమత విచక్షణ లేకుండ అన్నదానము చేయబడెను. విడివిడిగా హరిజనులతోసహా అందరికి భోజనము పెట్టబడెను. కొన్నిపుట్ల బియ్యము తగిన సంబారములు నెయ్యి కూరగాయలు మజ్జిగ విరివిగా ఖర్చుపెట్టబడినవి.

రామకృష్ణారావు సలహావెంట బడిఎగగొట్టడం కూడ జరుగుచూవుండెడిది. మార్కులు నాకే ఎక్కువ వచ్చేవి. క్లాసులో నేనే ఫస్టుగా ఉండెడివాడను. ఈ విధముగా రామకృష్ణారావు సహవాసముతో పదవ సంవత్సరము గడచినది. నాకు అన్నము కలుపుకునే అలవాటు లేదని పైన వ్రాసితిని. అందువల్ల బడినుండి

9 గంటలకు ఇంటికిరాగానే రామమ్మగారు పళ్లెములో అన్నముకలిపి నాకు తినుపించుచు కూరుచుండెడిది. నేను పరధ్యానములో నుండెడివాడను. కాని త్వరగా నమిలిమ్రింగే వాడనుకాను. ఆమె నాకు కథలు చెప్పుచుండెడిది. కథలు వింటూ ప్రశ్నలు వేయుచు ఒక్కొక్కముద్ద తింటూ ఉండెడివాడను. ఆమెచెప్పే కథలు చాలా నీతికథలు. అంతేగాక రామాయణము, మహాభారతము, భాగవతము సంగ్రహరూపముగా చెప్పుచుండెడిది. ఆ కథలు వినేటప్పుడు రాముడు, సీత, పాండవులు పడిన కష్టములకు దిగ్భ్రమచెందుచు నిర్విణ్ణుడనై మరల అడిగెడివాడను. సాయంత్రం బడి నుంచి రాగానే ఆమెగారు నాచేత శారదా రామాయణము అనే చిన్నపుస్తకమును, అయోధ్య రామాయణమును చదివి వినుపించుమని నియమించుచుండెడిది. ఆప్రకారము నేను మాబావ రామకృష్ణా రావు ఒకగంటసేపు చదివి వినిపించెడివారము. ఆ చిన్నవయస్సులో రామాయణము, భారతకథలను వినిపించుచు మాచేత చదివించుట మరువదగిన విషయముకాదు. ఆమె చేసినది నాఎడల మహోపకారముగా పరిణమించినది. అదే సంవత్సరము మానాయనగారు రణచికిత్సపొంది యింటికి వచ్చినారని పైన చెప్పియుంటిని. వారు కొంత విశ్రాంతి తీసుకొనుచుండెడివారు. ఆ ముసలమ్మ (రామమ్మగారు) భారతము చదువుమని మా నాయనగారిని కోరెను. ఆప్రకారము నాయనగారు కృష్ణరాయబారము మొదలుకొని భీష్మ పర్వము ఆసాం తమువరకు చదివి వినిపించుచు, అర్థముకూడ చెప్పుచుండెడివారు. భారత సావిత్రి చదువుట వలనను రామమ్మగారి బోధనలవలనను భారతమందు నాకును అభిరుచి యుండుటచేతను నేనుకూర్చొని వినుచుండెడివాడను.

పాఠములలోను, లెఖ్ఖలలోను నేను చురుకుగా ఉండెడివాడను. రామకృష్ణా రావు మాటలలోను, వాక్చాతుర్యముగా మాట్లాడుటలోను గట్టివాడు. ఎప్పటికిని యిద్దరము కలిసి ఉండెడివారము. మామీదకి పిల్లలు పోట్లాటకు వచ్చేవారుకారు. ఒకవేళ అట్లు ఘటించినచో రామకృష్ణారావు బలముగల వాడున్నాడు గనుక మేమే గెలిచెడివారము. క్లాసులో నేనే మొదటివాడను. అతను రెండు లేక మూడవ స్థానములో నుండెడివాడు. ఒకసారి విద్యార్థులలో పోటీపరీక్ష పెట్టినారు. నాకే ఎక్కువ అనగా ఫస్టుక్లాసు మార్కులు వచ్చినవి. నాకు ఒక దస్తాకాగిదములు బహుమతి ఇచ్చినారు. అది రామకృష్ణారావుకు అవమానముగా తోచినది. కన్నీరు కార్చినాడు. గాని అతను సత్ప్రవర్తనగలవాడు, బుద్ధిమంతుడు, ఓర్పుగలవాడు నాయందు చాలా ప్రేమగలవాడు. సోదరునికన్న ఎక్కువ ప్రేమాభిమానములతో

నుండెడివాడు. అతను పరీక్షలకు పూర్వమే జుజ్జూరు నుంచి నందిగామ వెళ్లిపోయి నాడు. నేను ఒంటరివాడనైనాను. జూన్ మాసాంతమున పరీక్ష జరిగినది. ఇనస్పెక్టరు కామేశ్వరరావుగారు పరీక్ష తీసుకున్నారు. మాతండ్రిగారిపేరు హెడ్మాస్టరుగారి వలన తెలుసుకొని నన్ను పిలచి అబ్బాయి నీకు బాగా మార్కులు ఇచ్చినాను, ఫస్టున ప్యాసయినావు. ముందుకూడ బాగుగా చదువుకొనుము అని అన్నారు. నా ఆనందమునకు మేరలేదు. నేను చెప్పగానే మా అమ్మగారును రామమ్మగారును సంతోషపడిరి. అప్పటి నియమనిబంధనలు, పరిస్థితులు నాకు తెలియవు, జ్ఞాపకము లేవు. గాని నా పరీక్ష వరకే 4వ తరగతి నడుచుచున్నది. పాత విద్యార్థులు కొందరు శిక్షణ పొందుచుండిరి. నేను 4వ తరగతిలో చేరితిని. పాఠములు, లెఖ్ఖలు వారితోపాటు నేర్చుకొనుచుంటిని. 4 మాసముల తర్వాత విద్యార్థులలో పోటీపరీక్ష పెట్టినారు. ఫస్టుమార్కులు తీసికున్నవానికి బంతి బహుమానము ఇచ్చెదమన్నారు. ఆ పరీక్షలో నాతోపాటు వరుసలో పెద్దతల్లి కుమారుడు, పెద్దవాడు; అన్న జగన్నాధరావు ఉండెను. ఆయన నన్ను ఎల్లప్పుడు తమ్ముడు తమ్ముడు అంటూ ప్రేమగా చూచేవాడు. ఆ తరగతిలో ఆయన పాతవిద్యార్థి. నేను క్రొత్త విద్యార్థిని. ఇద్దరము పోటీపరీక్షలో ఉన్నాము. మార్కులు నాకే ఎక్కువ వచ్చినవి. నేను మొదటి స్థానమునకు వచ్చితిని. బంతి బహుమతి నాకే దొరికినది. తమ్ముడు ముందుకు రావడము, అన్న వెనుక పడడము విచారకర మైనది. అతను చాల విచారపడి కన్నీరు కార్చినాడు.

పరీక్ష తేది తెలిసియుండవచ్చును. 4వ తరగతి విద్యార్థుల నుంచి పరీక్ష దరఖాస్తులు ఫీజులు ఉపాధ్యాయులు తీసికొనినారు. కాని నా దరఖాస్తు తీసికొన లేదు. 6 నెలలకు 5 రోజులు తక్కువ అయినందున పరీక్షకు పంపుటకు వీలులేద న్నారు. ఈ సంగతి నాకు బాకుపోటుగా పరిణమించినది. బాగుగా చదివితిని. మార్కులు ఎక్కువ సంపాదించి పాఠశాలలో మొదటి స్థానము సంపాదించితిని. కనీసము పరీక్షలో చేరుటకును వీలులేదనుట అక్రమమనుకున్నాను. న్యాయము లేదనుకున్నాను. నాకు మనసు చెడినది. మాస్టరుగారు మారుమాటలతో కొంత కాలహరణముచేసి ముందు సంవత్సరము పరీక్షకు వెళ్లి తప్పకుండా ప్యాసుకమ్మని ఆశీర్వాద వాక్యములతో పర్యవసానము తేల్చి చెప్పినారు.

బాలహట్ – స్త్రీహట్ – రాజహట్ (హిందీ) హట్ అనగా హఠము – నాది బాలహట్ అయినది. బడిమానినాను. లోజ్వరము ప్రారంభమైనది. మానాన్న గారు మందు ఇప్పించిరి కాని జ్వరము పోలేదు. మార్చివరకు అట్లే జరిగినది.

పేరు తీసివేయలేదు. హెడ్మాస్టరు కీ.శే. వేంపాటి వెంకటకృష్ణయ్యగారు మా ఇంటికి వచ్చి నాకెన్నో విధముల బోధచేసి ఈ సంవత్సరము ప్యాసు చేయించే భారము నాది. నీవు తప్పక ప్యాసవుతావు. నీవు స్కూలులో మొదటి విద్యార్థిగానే ఉంటావు. కాబట్టి స్కూలుకు రమ్మని కోరెను. ఆయన మాటను జవదాటలేక మరురోజు నుంచి పాఠశాలకు వెళ్ళనారంభించితిని. జ్వరము పోయినది.

దసరా రోజులలో గ్రామబడులలోని విద్యార్థులను వెంటబెట్టుకొని వుపాధ్యాయులు గ్రామపెద్దలు విద్యార్థుల పోషకులవద్దకు వెళ్లుతారు. విద్యార్థులు– గడలు, విల్లనంబులు చేతపట్టుకొని తిరుగుతారు. విల్లనంబులలో బుక్కాగులాలు పోసి పెద్దలపైన బాణమువలె ప్రయోగించుతారు. విద్యార్థులు దసరాకు ముందే తుంగగడ్డలు, కచ్చూరాలు తెచ్చి పొడిచేసి బుక్కా తయారుచేసెడివారు. కొంచెము రంగు కలిపితే అదేగులాలు అయ్యేడిది. మాకు ఇదికూడ ఉండెడిది. విద్యార్థులు సైనికులవలె మంచి దుస్తులతో నడిచెడివారు. గడలు అనగా గదలు. అవి పొడవుగా నుండెడివి. ఒక వెదురుకు రంగురంగుల నూలుకట్టి చివరభాగమున ఒక సలకస్వరూపముగా చిన్నచిన్న బద్దలను చేర్చి రంగునూలుతోను, అద్దపుముక్కలతోను ఆయుధ స్వరూపముగా తయారుచేసెడివారము. అంబువలె ఒక గూడు ఉండెడిది. బద్దకు కట్టిన త్రాడులాగి అంబును కొట్టగానే గూడులోని బుక్కాగులాలు ఎదురుగానున్న పెద్దమనిషిపైనబడి ఆయనను సత్కరించినట్లయ్యేడిది. దసరా పద్యములు, దేవతాస్తోత్రములుగాను దాతలకై వారములుగాను ఉండెడివి. అవన్నియు ఒకే రాగము, ఒకే తాళము కలవి. చాతుర్వర్ణముల వారిని వారివారి వర్ణాచారములను వర్ణించిపొగడు వాక్యములుండుటచే ఆకర్షనీయములుగాను, ఉత్సాహకరముగాను ఉండెడివి. దసరాలో దేవీ నవరాత్రములు చేయుదురు. దేవి శక్తిస్వరూపిణి గనుక దేవీనవరాత్రములని వాడుక. ఆ నవరాత్రములలో దేవి లేకశక్తి (మూర్తి) స్థాపనచేసి ఆరాధించుచుంటారు. సాధారణముగా బ్రాహ్మణులు శ్రీసూక్తము, శతసహస్ర నామములు, మంత్ర పుష్పములు మంగళహారతులతో దివారాత్రములు పూజలు చేయుదురు. కొందరు శాక్తేయులు బలిదానము నిచ్చుచు ఆరాధించెదరు. ఈ నవరాత్రులలో జరిగే పూజలు భరతఖండములోని వివిధ ప్రాంతములలో వివిధములుగా నున్నవి. కొందరు దేవిని లక్ష్మి అనియును, కొందరు సరస్వతి యనియును, కొందరు పార్వతి అనియును భావించి ఆరాధించుతారు. వంగదేశమున ఆశ్వయుజ మాసమున దేవిపూజలకు యెక్కువ ప్రాముఖ్యత యున్నది. జంతుబలులకు లెక్కలేదు.

నరబలులు కూడా ఉండేవట. పుణ్యక్షేత్రమగు వారణాశి (కాశి)లో కూడా ఒకప్పుడు నరబలులు జరిగే ఆచారముండెడి దంటారు. నామరూప గుణలింగ రహితుడైన ఈశ్వరున కేది ఇష్టమో? సర్వశక్తి స్వరూపియగు ఈశ్వరుడు దేనికి సంతోషించునో దురూహ్యము. భాగవతమున –

"తపముల్ చేసిననో! మనోనియతినో, దానవ్రతావృత్తినో! జప మంత్రంబులనో, శృతిస్మృతులనో ! సద్భక్తినో, యెట్లు లబ్ధపదుండౌనని, బ్రహ్మరుద్రముఖరుల్, భావింతు రెవ్వాని అయ్యప వర్గాధిపు డాదిమూర్తి, సులభుండౌ గాక నా కెప్పుడున్."

నా విద్యార్థిదశలో దసరా పద్యములను రాజేసి మాస్టర్లవెంట విద్యార్థుల తోడ నడచేవాడను. స్వగ్రామమునను, చుట్టుపక్కల గ్రామములలోను మానాన్న గారి స్నేహితులు ఎక్కువగా ఉండెడివారు. కనుక మాస్టర్లు ప్రతిచోటుకి నన్ను తీసుకొనిపోయి నాచేత పద్యములు చదివించి బహుమతులు తెచ్చుకునేవారు.

నా పదకొండవ సంవత్సరమున నాలుగవ తరగతి చదువుచుండగా పరిటాల నుండి నాకు పెండ్లి ప్రసంగము వచ్చినది. దానిని పసిగట్టి మా మాస్టరు గారు పరిటాల యాత్ర సంకల్పము తలపెట్టిరి. నాతో సహా ఆరుగురు విద్యార్థులు సిద్ధపడితిమి. నాతో మాబంధువు గ్రామ కరణముగారి కుమారుడు నారాయణరావు కూడా ఉండెను. నేను 6మైళ్లు నడవజాలను. మా గుఱ్ఱమును తీసుకొంటిమి. దానిపైన నేనున్న నారాయణరావున్ను యెక్కితిమి. తక్కిన విద్యార్థులు మాస్టరు వెంకటకృష్ణయ్యగారును నడచుచుండిరి. నరసింహరావు పాలెం మా మేనమామగారి కర్ణీక గ్రామము. గొట్టుముక్కల మాకు పెద్ద ఈనామున్న గ్రామముదాటి పరిటాల చేరితిమి. పరిటాలలో మా నాన్న పెదతండ్రి కుమారుడు క్రిష్ణయ్యగారింటికి వెళ్లితిమి. ఆయనయు ప్రక్కఇంట్లో వున్న ఆయన సోదరుడు నాగోరావుగారును నా మొదటి రాకకు సంతోషించిరి. ఆ గ్రామములోని నియోగులలో చాలామంది మా నాన్నగారి తాత సహోదర కుటుంబులవారు. రెండిండ్లు జాతాశౌౌతములులేని జ్ఞాతులవి. తక్కినవారు సన్నిహిత బంధువులు. మా కృష్ణయ్యగారు అందరిండ్లకు నన్ను తీసుకొనిపోయి మాసీతారామయ్య కుమారుడు వచ్చినాడని సంతోషముతో పరిచయము చేయించెను. పెద్దలు నన్ను దగ్గరకు తీసుకొనిరి.

అదేవరుసలో కుటుంబపెద్ద కీ.శే. మాదిరాజు సీతారామారావుగారింటికి తీసికొనిపోయెను. సీతారామారావుగారు భాద్రపద మాసమున చనిపోయిరి.

అంతకుముందు సీతారామారావుగారి జీవితకాలమునుండియే వారి కుమార్తె వనం నర్సమ్మగారి కుమార్తెను నాకీయవలెనని ఆలోచనలు జరుగుచుండెను. అప్రయత్నముగా దసరాభిక్షకు నేనే వారింటికిపోతిని. ఆరోజు నన్ను నరసమ్మ రంగమ్మ (సీతారామారావుగారి భార్య) గార్లు చూచిరి. నరసమ్మగారు నన్ను మేనల్లునివలెనే అరే అనే మాటలతో సంబోధించి మాట్లాడించినది. అల్లుడు అయితే బాగుండునని అనుకొని ఉండవచ్చును. అచ్చట కొందరు ఆడపిల్లలు మొగపిల్లలు ఉండిరి. అందులో ఒక నల్లపిల్లను చూచితిని. కాని యిది నాభార్య కాగలదనే సూచనలు నాకేమి తట్టలేదు. కాని నారాయణరావు గ్రహించి వచ్చేటప్పుడు సూచనగా నాతో చెప్పినాడు. ఆమాటలు నాకేమి మనస్సు కెక్కలేదు.

భిక్షాయాత్ర సఫలీకృతముగానే పరిణమించినది. పది పన్నెండు రూపాయలు ఉపాధ్యాయులవారికి దొరకెను. బహుశః రంగమ్మగారు నరసమ్మగారు నా రాకను శుభసూచకముగా గ్రహించియుంటారనుటలో సందేహములేదు. దానికి భావిచరిత్రయే తార్కాణము. పలుకుబడి గలిగి ఎక్కువమంది జ్ఞాతి సామంతులుగల పరిటాలకు నన్ను తీసుకొని రావడము లాభకారి అయినదని నా గురువుగారు గ్రహించియుంటారు.

పరిటాలనుంచి వచ్చిన తరువాతకూడా కొంత డబ్బు ఉపాధ్యాయులకు దొరికినది. 1896 సంవత్సరము డిశంబరులో ప్రయిమరి పరీక్షవచ్చినది. ఆ కాలమున ప్రయిమరీ పరీక్షకకు నేటి యూనివర్సిటీ పరీక్షకన్నా నియమనిబంధనములు లెక్కువ. చదువుకూడా యిప్పటివలె నిస్సారముగా నుండక కొంత పుష్టికరముగా నుండెడిది. వేమనశతకము, సుమతిశతకము, భారతము, భర్తృహరిలోని 64 పద్యములు వల్లించి టీకాతాత్పర్యములు రాజేయవలసి యుండెను. పరీక్ష కేంద్రము తాలూకా ముఖ్యస్థలము నందిగామలో నుండెడిది. పరీక్షకు ముగ్గురు సభ్యులుగల సంఘు ముండెడిది. అందొకరు బందరు హిందూ హైస్కూలు హెడ్మాస్టరు యింకొకరు తాలూకా తహసీల్దారు మరియొకరు స్కూళ్ళ ఇన్‌స్పెక్టరు ఉండెడివారు.

మా పాఠశాలనుంచి నేనును సోము వీరయ్య అనే విద్యార్థియు యిద్దరమే యుంటిమి. నావయస్సు 11 సంవత్సరములు. మాతో మా హెడ్మాస్టరు కూడా నందిగామవచ్చిరి. మరురోజు పరీక్ష నందిగామ స్కూలులో జరిగినది. పలకల మీద లెఖ్ఖలసహా అన్ని ప్రశ్నలకు ఉత్తరములు వ్రాసితిని. అప్పటికప్పుడే మార్కులు వేసుకునేవారు. రెండురోజులు పరీక్ష జరిగినది. నేను బాగానే వ్రాసితిని. రెండవ

రోజు సాయంత్రానికి నేను తాలూకాకు ఫస్టున ప్యాసయితినని మా మేస్టరుగారు వార్త తెచ్చివినిపించిరి. మరురోజు నుంచి నా కాలుకు కురుపులేచి యింట్లోనే వుంటిని. తెగలు తెగలుగా విద్యార్థి సోదరులువచ్చి వీడే తాలూకాకు ఫస్టున ప్యాసయినాడు అంటూ మాట్లాడించి వెళ్లెవారు. మాఘమాసము వచ్చినది. వనం రామచంద్రరావు గారు ఒక మంచిరోజున తన మిత్రుడు పరిటాల నరసింహం గారితో సహా జగన్నాధపురం వచ్చి తన మిత్రునిద్వారా సంబంధము మాట్లాడుటకు వచ్చితి మనియును, నాకు ఉపనయనము కూడా అప్పటికి కాలేదు గనుక ఆపని ఎప్పుడు ఏర్పాటు చేసుకున్నారనియును మా నాన్నగారిని ప్రశ్నించిరి. ఆ సమయమున మా పినతండ్రు లిద్దరును లేరు. యరకవరములోనున్నారు. మా రెండవ పినతండ్రికి 26 సంవత్సరములు వచ్చినవి. వివాహము కాలేదు. సమాధానము చెప్పలేనని మానాన్నగారు జవాబిచ్చిరి. వచ్చినవారు ఆరోజు తిరిగిపోయిరి. గాని మరల రెండు పర్యాయములువచ్చి త్వరపెట్టసాగిరి. రామచంద్రరావుగారి భార్యగారు వనం నరసమ్మ మాదిరాజు సీతారామారావుగారి కుమార్తె. సీతారామారావుగారు మా నాన్నగారికి పినతండ్రి కావలెను. ఆకారణమున మానాన్నగారికి ఆయన యందు గౌరవమెక్కువ. నరసమ్మగారిని స్వంత చెల్లెలిగానే చూచెడివారు. కాబట్టి నరసమ్మగారి మాట తీసివేయలేక మాతండ్రిగారు సంబంధమును తుదకు అంగీకరించిరి. దుర్ముఖి సంవత్సర ఫాల్గుణ బ 6 రోజున ఉపనయనము జరిగినది. ఈ వుపనయనము శ్రీ జమలాపురం వెంకటేశ్వరస్వామి వారి సాన్నిధ్యమున జరిగినది. ఉపనయనములో గోరింట్ల వెంకటప్పయ్యగారు బ్రహ్మోపదేశమును మాతండ్రిగారు గాయత్రి వుపదేశమును చేసిరి. తరువాత హేవళంబి సంవత్సర చైత్ర శు 11 రోజున వనం రామచంద్రరావు గారి పెద్దకూతురు అనంతలక్ష్మిని నాకిచ్చి పరిటాలలో వివాహము చేసిరి. ఆ వివాహములో బంధువులేగాక జుజ్జూరు పండితులు బ్రహ్మశ్రీ గోరింట్ల రామకృష్ణయ్య, వెంకటప్పయ్య మద్దూరి సుబ్రహ్మణ్య సోమయాజులు, విందమూరి జానకిరామయ్య గార్లున్నూ. పరిటాలలోని పాలపర్తి సుందర రామావధానులుగారున్నూ కంచికచర్ల నుండి శ్రీ పెన్నాయజ్ఞ నారాయణ శాస్త్రిగారు మొదలగు చాలామంది బ్రాహ్మణులు వచ్చి మంత్రములు చదివి ఆశీర్వదించిరి. వీరు మాకును మా అత్తవారికిని కూడా ముఖ్య ఆశ్రితులు. వివాహములో అత్తవారి ప్రతిష్ఠను బట్టియు మాకుటుంబ గౌరవమునుబట్టియు సదస్యమురోజున 800 మంది బ్రాహ్మణులు వచ్చిరి. మా నాయనగారు వారికి అర్హతనుబట్టి

సత్కారముచేసిరి. మా మామగారు వారికి భోజనము పెట్టిరి. మళ్లతోరణమునకు నేను అత్తవారింటికి వచ్చితిని. నాతో మా మేనత్త వరలక్ష్మమ్మగారు వచ్చిరి. ఈ సందర్భమున మా అత్తగారు నా విద్యాభ్యాసమును గురించి మేనత్తగారితో ప్రసంగంచేసినది. తెలుగు పూర్తి అయినది. గాని ఇక ఇంగ్లీషు చెప్పించుటయా లేక ఉరుదు ఫారశి చెప్పించుటయా? అది యెక్కడ? ఇంగ్లీషు విద్య వున్నత పరీక్షలు కావలెనంటే బస్తీలకు పోవలెను. బీదకుటుంబము చిన్నపిల్లవాడి భోజనవసతి మార్గము లేదు అనే విషయము మాటాడుకొనిరి.

ఇంతేగాక మా అత్తగారి తండ్రి పేష్కారి హోదాలో నుండెను. ఆ అధికార వ్యామోహము పలుకుబడి మాఅత్తగారికిని ఆమె తల్లికిని జ్ఞాపకము వచ్చుచుండెను. మా మామగారు యెక్కువ ఫారశి చదువనందున ఆస్థానము నాక్రమించలేక పోయెనని వారికి విచారము బాధయు కలుగుచుండెను. ఇవన్నియు పురస్కరించుకొని నాకు ఉరుదు పారశి చెప్పించినట్లయితే తాను పిల్లవాడిని పట్నం తీసుకొని వెళ్లి జాగీర్దారు దేవుడిలో చెప్పి పేష్కారి యిప్పించెదనని మాఅత్తగారి తల్లి రంగమ్మగారు తనమనోభావము తెలిపినది. దీనికి మా అత్తగారు మా మామగారు మా తండ్రిగారు కూడ ఆమోదించిరి. జుజ్జూరు తిరిగిరాగానే మా మేనత్తగారితో నందిగామ వచ్చితిని. మరురోజో మూడవరోజో లక్ష్మయ్యగారు నన్ను ఉరుదు బడిలో చేర్పించిరి. బడిలోని రెండవ అధ్యాపకునిపేరు మహమ్మద్ గాలబ్ సాహెబుగారు పారసీ పండితుడు. శాంతస్వభావము గలవాడు. ఈయనవద్దనే ఉరుదు అక్షరములు దిద్దపెట్టించుకొంటిని. మరురోజే వప్పగింత పెట్టితిని. ఇంకా మూడురోజులు పాఠశాలకు వెళ్లితిని. సంయుక్తాక్షరములను నేర్చుట ప్రారంభించితిని. అప్పుడు నాకు 12వ సంవత్సరము. అంతవరకు మా అమ్మగారిని వదలి పరస్థలమున ఉండిఎరుగను. ఆ కారణమున నాకు విచారము ఎక్కువగుచూ వచ్చినది. ఏడ్చుచుండెడివాడను. క్రిందటిరోజు ఏడ్చిన సంగతి శ్యామలాంబవలన లక్ష్మయ్యవారు వినినారు. ఇక లాభం లేదను కున్నారు. మా నాన్నగారికి తెలియజేసినారు. అంతట మా నాన్నగారువచ్చి యింటికి తీసుకొని వచ్చినారు. ఇది వైశాఖమాసములో జరిగినది. శ్రావణమాసము వరకు జుజ్జూరులోనే వుంటిని. తరువాత మా నాన్నగారికి యరకవరం వెళ్లవలసివచ్చినది. నన్నుకూడ గుఱ్ఱము నెక్కించి నందిగామ తీసుకొనివచ్చిరి. మరల లక్ష్మయ్య మామగారు ఉరుదు పాఠశాలలో ప్రవేశపెట్టిరి. వారంరోజులు చదివితిని. ఏడువ లేదు కాని తప్పించుకొనుటకు ఇంకొకమార్గము కనిపెట్టితిని. ఎవరో మా

గ్రామస్థులు రాగా నాకు తలనొప్పి జ్వరం వచ్చుచున్నదని ఒక ఉత్తరము మా పినతండ్రిగారి పేర వ్రాసి పంపితిని. అంతట వారు కోటమరాజనే భత్రాజుతో గుఱ్ఱమును పంపిరి. కోటమరాజు చెప్పేవరకు మా మేనత్తగారికి నా మనోభావము తెలియదు. ఇంట్లో అందరు వుత్తరము సంగతి నన్నడిగిరి. నేనందుకు అమ్మను వదలిపెట్టి ఒంటరిగా వుండలేక వ్రాసితినని చెప్పితిని. తెలివిగలిగి చదువుచున్న వాడికీ పిరికితన మెందుకని విచారపడి మనోవ్యాధికి మందులేదని నన్ను జుజ్జూరు పంపివేసిరి.

తరువాత దీపావళి పండుగకు మా అత్తగారు నన్ను మా అమ్మగారిని తీసుకొని వెళ్లిరి. దీపావళి తరువాత వారం రోజులచ్చటనే ఉంటిమి. పరిటాలలో పుల్లయ్యగారనే ఉపాధ్యాయులు తెలుగుబడి నడుపుచుండెడివారు. ఆ బడిలో మా బంధువుల పిల్లలు చదువుచుండెడివారు. ఆ పిల్లలు నాకంటే మించిలేరు. వారిలో వెంకట్రామా రావుగారి మూడవ కుమారుడు లక్ష్మీకాంతరావు కూడ వుండెను. ఆయన నాకంటె ఒక సంవత్సరము పెద్దవాడు. మళ్ళుదోరణమునకు వెళ్లినప్పుడు ఆయనతో ఒక సుముహూర్తమున మైత్రికలిసినది. ముందు చెప్పబోయెడి విధముగా మేమిరువురము గాఢమైత్రితో గడిపితిమి. నేను ప్రతిరోజు పుల్లయ్యగారి బడికిపోయి ఏదో విద్యా సంబంధమగు ప్రసంగములే చేయుచుండెడివాడను. ఆ బడికి కొందరు పెద్దలుకూడ వచ్చుచుండెడివారు. వారిలో రంగావఝుల త్యాగరాయుడు గారు తెలుగు పండితుడుకూడా వుండెను. బడిలో పుల్లయ్యగారు గయోపాఖ్యానము చదువుచుండిరి. త్యాగరాయుడుగారు అర్థము చెప్పుచుండిరి. నేను శ్రద్ధగా వినుచుండెడివాడను.

ఇంటికిరాగానే నాకును కవిత్వ సంకల్పము కలిగినది. సీతారామ శతకమను పేరులో సీసపద్యములు వ్రాయ మొదలుపెట్టితిని. విడికాగితముల పైన వ్రాయుచు ఎవరికిని కనపడకుండా జాగ్రత్త చేయుచుంటిని. 108 పద్యములు వ్రాసి ముగించితిని. తెలివిగల విద్యార్థిననుపించుకుని హృదయ దౌర్బల్యమువలన నందిగామలో చదువుకొనక పెద్దలదృష్టి నుండి పతనమైతిని. క్రమక్రమముగా ఇదికూడ నా హృదయముపైన పనిచేసినది. పశ్చాత్తాపము కలిగినది. సంవత్సరము వయస్సు పైబడుటవలన కొంత ధైర్యము వచ్చినది.

విళంబి సంవత్సర జ్యేష్ఠ మాసాంతమున మా రెండవ పినతండ్రి వెంకట్రామరావుగారికి చాతుర్థీజ్వరము వచ్చుచుండెను. వారికి చికిత్స

చేయించుటకు మా నాన్నగారు వారిని నందిగామ తీసుకొని వెళ్ళిరి. అప్పటికి నేను దృఢ మనస్కుడనైతిని. నందిగామవెళ్లి చదువుటకు నిశ్చయించుకుంటిని. ఒకటి మాబండియు ఇంకా కొందరు రైతుల బండ్లున్ను ప్రత్తివిత్తులు తెచ్చుటకు నందిగామ బయలుదేరినవి. బట్టలు తీసుకొని బండినెక్కి నందిగామ చేరితిని. అకస్మాత్తుగా నేను వచ్చినందుకు మా మేనత్తగారు సంతోషించినది. మా పినతండ్రిగారు నేను నీతో కొంతకాలము కలసిఉండెదను. గనుక నీకేమి భయములేదు. ధైర్యముగా నుండుమని నాకు బోధించిరి. నేను మరురోజు పాఠశాలలో చేరితిని. ఉపాధ్యాయులు నా చురుకు తనమును పిరికితనమును యెరుగుదురు. గాన మరల వెళ్లకుండ చదువుకొనుమని చెప్పిరి. ఆ పాఠశాలలో ఫారశి పాఠములు చదువుచున్న అమరవాది అనంత రామయ్యతోను నాతోపాటు ప్రవేశించి సాధ్యాయిగానున్న సుంకర దివాకరరావుతోను స్నేహము కలిసినది. తరువాత ఆదినారాయణ అనే ఇంకొక విద్యార్థి స్నేహితులైనారు. అనంతరామయ్యతండ్రి సుబ్బయ్యగారు మా మామగారికి చిరకాలమిత్రుడు. అనంతరామయ్య బావ యడవెల్లి రామలింగంగారు మా లక్ష్మయ్యగారింటి రాజాశ్రితుడు. కాబట్టి అనంతరామయ్య కొన్నిరోజులు యింటికివచ్చి నన్ను తీసుకొని పాఠశాలకు వెళ్లుచుండేవాడు. మా మేనవదినె శ్యామలాంబ వయసులో నాకన్నా 6 మాసములు మాత్రమే పెద్ద. కాబట్టి సీతారామశతకములోని పద్యములు ఆమెకు వినుపించితిని. మా ఇద్దరిలో ఎవరికి కవితాశక్తిలేదు. కాబట్టి ఆమె నాకేమి అభిప్రాయము యీయలేదు. తరువాత ఈ శతకము సంగతి అనంతరామయ్యకు చెప్పితిని. ఆయన వయసులో నాకంటె 4 సంవత్సరములు పెద్దవాడు. ఆయనకు కొంత శృతిపాండిత్యమున్నది. అనగా కవిత్వమునకు యతి, గణప్రాస లుండవలెనని మాత్రము ఆయనకు తెలుసును. యతులు, గణములు, ఆయనకు తెలియవు. నాకు ఏమి తెలియదు. పద్యములు ప్రాస యుక్తముగానే యున్నవి. యతి, గణప్రాసలులేని పద్యములవల్ల కవికే ముప్పు వచ్చునని 'ఏడింటను 'త' పెట్టిన వాడింటను పీనుగెళ్ళున్' అను ఒక సామ్యమును వినిపించెను. దీనితో నేను భయపడి కాగితములకు ఒక తాడు రాయికట్టి దొడ్డిభావిల పడవేసి మా మేనవదినె శ్యామలాంబకు చెప్పితిని – ఈ విధముగా ఈశ్వరునికి కృతిసమర్పణ జరిగినది. మా తలిదండ్రులు ప్రతినెల కొకసారియు, ముఖ్యముగా పండుగలకును నన్ను జుజ్జూరు రప్పించుకుంటూ ఉండెడివారు. కొంచెము ధైర్యము తెచ్చుకొనుచు ఉండి చదువుకుంటూ ఉంటిని. బడిలో పై

చెప్పినవారు హిందూ విద్యార్థులేగాక కొందరు ముస్లిం విద్యార్థులు కూడ స్నేహితులైరి. సూర్యోదయము మొదలు జాము ప్రొద్దుయెక్కువరకు (6 నుంచి 9 గం.) సాయంత్రం 2 నుంచి 5 గంటల వరకును పాఠశాల ఉండెడిది. మధ్యాహ్నము ఇంటిలో ఉండెడివాడను. సాయంత్రం అనంతరామయ్య ఇంటికి వెళ్లి మాటలు మాట్లాడుకుంటూ కాలం గడిపి అస్తమయముకు ఇంటికి వచ్చేవాడను.

మా లక్ష్మయ్యగారు మునగాల రాజాగారి తరపున ఏజంటుగా పనిచేసెడి వారు. ఎస్టేటు వ్యాజముకొరకు తరచుగా వరంగల్, బందరు మొదలగుచోట్లకు వెళ్ళేవారు. నెలలకో రెండునెలలకో ఇంటికి వచ్చేవారు.

వారికి నందిగామ జమీందారి కర్ణీకము ఉండెడిది. అప్పుడు శ్రీ కాళేశ్వర రావుగారు బందరులో ఎఫ్.ఏ. జ్యూనియరులో చదువుచుండేవారు. అయ్యదేవర లక్ష్మయ్యగారు మునగాల ఎస్టేటులో పనిచేయుచున్నందున నందిగామ కర్ణీకము చేయుటకు వీలులేకపోయినది. అందువలన కర్ణీకం పనికి మా నాన్నగారిని ఏర్పాటు చేయించిరి. ఆ కారణమున మానాన్నగారు నందిగామలో ఉండి పని చేయుచుండిరి. దీనితో నాకు పూర్తిగా దిగులు పోయినది.

మా మేనత్తగారు తల్లికంటె ఎక్కువశ్రద్ధతో నన్ను పోషించి చదువు చెప్పించినది. ఆమెగారు మధ్యమధ్యన వీడు చదువుకొని మంచివాడైతే నన్ను తలచుకుంటాడు అంటూ ఉండేది. ఆమె అభీష్టము, ఆశీర్వాదము సార్థకమైనది. నేనును చదువుకున్న వాడనయి విద్యవలననే ఉదరపోషణ చేసుకొనుచున్నాను. గనుక నేనామెను స్మరించుచు కృతజ్ఞుడనుగానుండుట నావిధిగాని అతిశయము గాదు. నందిగామలో చదివే రెండు సంవత్సరములలో తరచుగా మా పెద్దవదినె కోటమ్మ గారింటికి సాయంకాలము వెళ్ళేవాడను. ఆమె భర్త చేమర్తి మల్లికార్జునరావుగారు వ్యవహార దక్షుడు. ధైర్యముగలవాడు. ఖండితవాది. పరద్రవ్యమును తృణప్రాయముగా నెంచేవాడు. ఆయనగారు సాయంకాలము భారతము చదువుచుండేవాడు. కొందరు శ్రోతలు పరివేష్టించి యుండేవారు. వారే అర్థము చెప్పెడివారు. నేను భీష్మ, ద్రోణపర్వములను శ్రద్ధగావినినాను. భీష్మ అభిమన్య యుద్ధములను విని సంతోషించుచు, పద్మవ్యూహము అభిమన్య ఘటోత్కజ వధలను విని విచారపడుచుండేవాడను. కర్ణ భీమసేనుల యుద్ధము, కర్ణపరాజయము, సైంధవ వధ విని సంతోషపడితిని. బాల్యమున హృదయము నెంత ఆకర్షించెనో నేటికిని జ్ఞాపకమున్నది.

శ్రీ కాళేశ్వరరావుగారు సెలవులలో ఇంటికి వచ్చినప్పుడు బందరు శేషములతోపాటు నాకును మా మేనవదినె శ్యామలాంబగారికిని కొన్ని నీతిబోధలు చేయుచుండెడివారు. నందిగామ విద్యార్థి దశలో నేనును మా శ్యామలాంబగారును శ్రీ కాళేశ్వరరావుగారి బోధఫలితముగా ఏ విషయములలో కూడా అబద్ధమాడరాదని శపథముచేసి నడచితిమి. నేను ఈ అభ్యాసము వకీలు వృత్తిలో ప్రవేశించేవరకు తప్పకుండా పాటించితిని. ఇప్పటికిని స్వీయ విషయములలో పాటించుచునే ఉన్నాను.

రెండవది శ్రీ కాళేశ్వరరావుగారు భోగమువాండ్ల ఆటపాటలను చూడకూడదని నాకు చెప్పుటయేగాక తాను స్వయముగా పాటించేవారు. నా విద్యార్థి దశలో ఒకటిరెండు వివాహములలో వారు భోగము మేళమును చూడక నిరాకరించుట చూచితిని. అందొక వివాహము జములాపురం వెంకట్రామారావు (కేశవరావుగారి తండ్రి) గారికిని మాడపాటి వీరభద్రయ్యగారి కుమార్తెకును జరిగినది. సంధ్యలరేవు అయ్యదేవర లక్ష్మయ్య మామగారింటి వరండాలో జరిగినది. భోగమువాండ్ల పాటకచెహరి సాగుచున్నది. శ్రీ కాళేశ్వరరావుగారు తన గదిలోనే దాగినట్లు కూర్చునియుండెను. నేను యింట్లో తిరుగుచుంటిని. వారు నన్ను కూడా వెళ్లవద్దనిరి. వారి ఉపదేశ ప్రభావము యవ్వనదశలో చాలవరకు ఉపకరించినది. నేనుకూడ చూచుట మానివేసితిని.

సుంకర దివాకరరావు నాకు అత్యంత ప్రియమిత్రుడు. బడివేళలో బడిలోను తక్కినవేళలో అతనియింట్లోను అతనివెంట ఉండేవాడను. ఒకప్పుడు యిద్దరము కరీమా అనే పారశిపుస్తకమును చదువుట మొదలు పెట్టితిమి. ప్రతిరోజు 6 గీతములు వల్లించి ఉరుదు అర్థము చెప్పవలసియుంటుంది, నేను. ఆవిధముగా ఉపాధ్యాయుడు బోధించుచుండెను. రాత్రిపూట నేను 2 పర్యాయములే చదివి పాఠము రాజేయగలనని అహంకారపడుచుండేవాడను. నా వివాహమైనప్పటి నుండియు శ్రీరామకల్యాణమునకు మా మామగారు మా అమ్మగారిని నన్నును తీసుకొనివెళ్లి నూతన వస్త్రములిచ్చి పంపుచుండెడివారు. ఒక్కొక సంవత్సరము మా నాన్నగారుకూడ వచ్చేవారు. నేను నందిగామలోనున్న ఒక సంవత్సరం యెట్లో వెళ్ళితిని. గాని రెండవ సంవత్సరము శ్రీరామనవమికి జుజ్జూరు రమ్మని మా నాన్నగారు నావద్దకు జీతగాడిని పంపిరి. అతను నావద్దకు రాగానే నాపాఠములు పోవును గనుక రానని బదులుచెప్పి పంపివేసితిని. ఈ సంగతి

మా మామగారికి తెలిసినది. వారే స్వయముగా బండితీసుకొని నందిగామ వచ్చి నన్ను రమ్మనికోరిరి. వారితో నా ప్రయాణముకు కనీసము 5 రోజులు పట్టుననియును రోజు 1కి 6 చొప్పున 30 గీతములు చదవజాలక పోవుదుననియును ఆ కారణమున నేను దివాకరరావుకన్న వెనకపడవలసి వచ్చును గనుక నేను రాజాలనంటిని. నీవు వెళ్ళకుంటే జరిగే ఉత్సవములో అల్లుడు రాలేదని యింట్లో అనుకుంటారు. మీ మామగారు చిన్నపుచ్చుకుంటారు. కాబట్టి నాయనా వెళ్ళమని మా మేనత్తగారు సౌమ్యమార్గముగా యెన్నియో విధముల బోధించి చెప్పినది. గాని వెళ్లనంటిని. ఇంట్లో మొగవారెవ్వరులేరు. మా మామగారు చేయునదిలేక ఒక్కరే తిరిగి వెళ్ళిపోయిరి. ఆ సంవత్సరము ఎండకాలములో మా అమ్మగారికి నంజువ్యాధి వచ్చినది. మా మేనత్తగారి ఆదేశానుసారము మా అమ్మగారిని చికిత్సకొరకు నందిగామకు తీసుకొనివచ్చి ఆసుపత్రిలో డాక్టరువద్ద మందు యిప్పించుచుండిరి. జూన్ ఆరంభమువరకు నంజు తగ్గినది. ప్రాణభయము తప్పినది. ఇంకా కొన్నిరోజులు చికిత్స జరుగవలెనని బంధుమిత్రులు, డాక్టరు అభిప్రాయపడిరి.

ఆ సంవత్సరం కాళేశ్వరరావుగారు ఎఫ్.ఎ. రెండవ సంవత్సరములో కృతార్థులైరి. బి.ఎ.లో చేరవలసి ఉంటారు. శ్రీ కాళేశ్వరరావుగారు బందరులో ఇంకా 2 సంవత్సరములు చదువకతప్పదు. భోజన పానాదులకు కష్టము జరుగుచున్నది. ఈ రెండు సంవత్సరములు బందరులో కుటుంబయుక్తముగా నుండవలెనని పెద్దలు నిశ్చయించిరి. ఈ కారణమున మా మేనత్తగారి కుటుంబము నందిగామ నుంచి బందరుకు మార్చబడెను. నందిగామ కర్ణీకము మానాన్నగారు తాత్కాలికముగా చేయుచుండిరి. కాబట్టి నందిగామ నింటిలో మా తలిదండ్రులుండిరి. నేనుకూడ ఉండి పారశి చదువుచుంటిని. మా అమ్మగారికి మరు సంవత్సర వైశాఖ మాసమువరకు ఆరోగ్యము కుదిరినది. కాలేజీ సెలవులు రాగానే శ్రీ కాళేశ్వరరావుగారు తల్లి భార్యాయుక్తముగా నందిగామకు వచ్చిరి. వారంరోజుల తరువాత మా అమ్మగారు తమ్ముడు జుజ్జూరు వెళ్ళిరి. మా నాన్నగారు రెండు గ్రామముల మధ్యన కొన్నిరోజులు తిరుగుచుండిరి. మాపినతండ్రిగారి ఆరోగ్యము చెడిపోయినది. బహుశః అదే సంవత్సరము మదరాసు ప్రభుత్వ శాసనము ప్రకారము 2, 3 గ్రామముల కొక గ్రూపుచేసి ఒక గ్రామమున కుండతగినంత సిబ్బందిని మాత్రమే ఉంచి తక్కిన ఉద్యోగస్తులను తగ్గించే విధానము అమలులోనికి తేబడెను. ఆ ప్రకారము జగన్నాధపురం, పొన్నవరం,

పేరగలపాడు మూడు గ్రామముల కొక గ్రూపుచేసిరి. పొన్నవరం ఉద్యోగులనే నియమించుకొనిరి. పర్యవసానముగా జగన్నాథపుర కర్ణీకము చేయుచున్న మా పినతండ్రిగారు తగ్గించబడిరి. వారి తరువాత నాకు రాగలవనే లీష్టుదారి హక్కులు కూడ కొట్టుకొనిపోయినవి గనుక యిది నా దురదృష్టమని లోకోపవాదు వచ్చినది. భగవంతుడు ప్రతికార్యము మంచికే చేయునని ఆర్యోక్తికలదు. కాబట్టి ముందు వ్రాయు విధముగా దాని పరిణామము నాకొరకు అమృతోపమానమే అయినది. కర్ణీకముండినచో నేను దానిని చేయుచు జగన్నాథ పురం (పల్లెటూరు)లో వుండవలసి వచ్చేది. హైద్రాబాదు హైకోర్టు అడ్వొకేటు పట్టాను పొంది వరంగల్లు పట్టణములో ఉండజాలక పోయేవాడను.

నేను నందిగామలో మా మేనత్తగారింటనే ఉండి పారసీ ఉరుదు చదువు చుంటిని. గుల్‌సితార్ అనే పారసీ కావ్యపు ప్రథమాధ్యాయంలో కొంత చదివితిని. ఆ రోజులలో ఒక సమస్య చర్చనీయాంశమైనది. శ్రీ లక్ష్మయ్య మామగారు మునగాల ఎస్టేటు ఉద్యోగుము వదలి కర్ణీకము చేయుటకు రాజాలరు. శ్రీ కాళేశ్వరరావు బావగారి చదువుకొరకు బందరులో ఉండక తప్పదు. నందిగామ యింట్లో ఉండేవారును నందిగామ కర్ణీకము చేయువారును కావలసి వచ్చినది. గత సంవత్సరము మా నాయనగారు నందిగామలో ఉండుటచే ఈ పనులు నెరవేరినవి. మే నెలలో మా జుజ్జూరు ఇంటిలో దొంగలుపడి మా రామమ్మగారి బట్టలు, కొంత డబ్బు ఎత్తుకొనిపోయిరి. తరువాత ఒక నెలకు మా తండ్రి, పినతండ్రిగార్లు నందిగామలో నుండుట కనిపెట్టి ఒకరోజు రాత్రి ఊరి కావలివాడు ఎరుకల కోటాయ జగన్నాథపురం ఇంటిలో జొరబడెను. ఇంటిలో మా అమ్మగారున్ను చిన్నపిల్లలగు నా భార్య, నా పినతండ్రిభార్య, శారదాంబ మా తమ్ముడు నాగభూషణ రావుగారు నిద్రించుచుండగా వంటిపైనున్న బంగారు వస్తువులను నేర్పుగానే తీసుకొను ప్రయత్నము చేయుచుండెను. గట్టిగా పట్టుకొనుటచే గుండ్లపేరు తెగి కొన్ని మాత్రము దొంగకు దొరకెను. ఆముదపు దీపము మినుకు మినుకుమనుచుండగా ఆమె దొంగను గుర్తుపట్టి అరచినది. జీతగాడు నాయుడు పక్క ఇండ్లవారు వచ్చిరి. దొంగ పారిపోయెను. మా అమ్మగారు దొంగను గుర్తించినది గనుక ఎరుకుల కోటాయను పట్టుకొనివచ్చి గ్రామ మునసఫ్ పేరయ్యకును, మొహతాద్ మఖ్దాంకు వప్పగింత పెట్టిరి. కోడికూయగానే నందిగామలో నున్న మా నాన్నగారివద్దకు మనిషిని పంపవలె ననుకొనుచుండిరి. ఇంతలో మోహతాదును మోసముచేసి కోటాయ పారిపోయెను. వెంటనే ఇద్దరు

మనుష్యులు నందిగామకు వచ్చి మా నాయనగారి కీసంగతి తెలిపిరి. వారు వెంటనే బయలుదేరి జగన్నాధపురం వచ్చి రిపోర్టు చేయించిరి. అప్పుడు జుజ్జూరు పోలీసుస్టేషను ఆఫీసరు ఒక బ్రాహ్మణుడు. నాగభూషణం అనే ఆయన ఉండెను. ఆయనను సార్జంటు అనేవారు. ఆయన ఏమి శ్రద్ధచేయలేదు. సార్జంటు లేక జమాదారు అనగా యిప్పటి హెడ్‌కానిస్టేబులుతో సమానము. శ్రీ కొళందరెడ్డిగారు నందిగామ తాలూకాకు యినిస్పెక్టరుగా వచ్చి దొంగ కోటాయను పట్టుకొని శిక్షవేయించెను. శ్రీకొళందరెడ్డి గారు పోలీసు ఉద్యోగమును మాని I తరగతి ప్లీడరి పరీక్షలో ప్యాసయి విజయవాడలో వకీలుగా పనిచేసి దివంగతులైరి. మా నాన్నగారు యింటికి వచ్చి వ్యవసాయ పనులు చేయించవలసి వచ్చినది. మా పినతండ్రిగారు అనారోగ్యముతో నందిగామలోనే ఉండిపోయిరి. కాలేజీలు తీయగానే మా మేనత్తగారి కుటుంబము బందరు వెళ్ళినది. కొలది రోజులకే జగన్నాధపురం కర్ణీకపు చార్జీని గ్రూపు కరణం ఉవ్వా వెంకట్రామయ్య గారికి వప్పగింత పెట్టబడెను. మా పినతండ్రిగారికి ఉద్యోగము లేదు. అనారోగ్యముగా యింట్లోనే ఉండిరి. ఇప్పటికి నా ఫారశి చదువుకు తిలోదకములిచ్చినట్లే అయినది గాని మా తమ్ముడి చదువుకొరకు కాపురము జగన్నాధ పురం నుండి జుజ్జూరుకు మార్చబడినది. రామమ్మగారు మా అమ్మగారివెంటనే ఉంటూ వచ్చినది. 75 సంవత్సరముల వృద్ధురాలు చేతిలోని డబ్బు దొంగలపాలై మనోవ్యాధిలో పడిపోయినది.

పింగిలి రామమ్మగారు మా నాయనమ్మగారికి పినతల్లి యగుటచే మా నాయనమ్మగారి మరణానంతరం మా ఇంటనే ఉండి మాతండ్రి పినతండ్రులను మేనత్తలను తుదకు నన్నును పోషించి పెంచినదని పైన వ్రాసితిని. ఆమె ఆదిరాజు జోగయ్య ప్లీడరుగారి కూతురు – వితంతువు. కాశికి మూడు పర్యాయములు కాలినడకన వెళ్ళివచ్చినది. ఉత్తరమున బదరికాశ్రమము, దక్షిణమున అనంత శయనము వరకు ఆశేతు హిమాచల పర్యంతము గల యాత్రలను కాలినడకలను తిరిగి సేవించి వచ్చినది. ఎల్లప్పుడు స్ఫటికమాల త్రిప్పుచు శివరామ గోవింద నారాయణ మహదేవ అనే భగవన్నామమును స్మరించుచుండెడిది.

దీపావళి పండుగ వచ్చినది. ఆ రోజులలో పరిటాలలో ఒక ఫారశీబడి యుండెను. రౌషన్‌అలీగారు అనే ఆయనకు కొలది రోజుల క్రితమే పిలిపించిరి. నేను చదువుమాని యింటనే ఉంటిని గనుక ఆయన వద్ద చదువుకొనుటకు పంపమని మాతలిదండ్రులకు మా మామచెప్పిరి. నేను దీపావళి పండుగకు

పరిటాల వెళ్లి పాఠశాల చూచి ఉపాధ్యాయులతో మాట్లాడితిని. ఉరుదు పుస్తకములు చదివించుతానని ఆయన నాకు చెప్పెను. ఆయన ఫారశిలో దక్షుడుకాడు. ఆ ప్రకారము నేను బహుశః మార్గశిర మాసములో పరిటాల వెళ్లితిని. బడిలో చేరితిని. నందిగామలో ఫారశి పండితునివద్ద చదివితిని గనుక ఈ చదువు నాకు నచ్చెడిది కాదు. ఈ ఉపాధ్యాయుడు నాకు చహర్ దర్వేష్ అనే పుస్తకమును చెప్పుట ప్రారంభించెను. యింకొక పుస్తకము పేరు జ్ఞాపకములేదు. నా మిత్రుడు లక్ష్మీకాంతరావు అదివరకే వకాలతు చదువుటకు హైద్రాబాదు వెళ్ళెను. నాతో చదివే సమకాలిక విద్యార్థులెవ్వరు లేకుండిరి. తక్కిన విద్యార్థులు ప్రాథమిక పాఠములను చదువుచుండిరి. చదువు ప్రారంభించిన తరువాత రెండు మాసములు మాత్రమే చదవగలిగితిని.

ఇంతలో మా నాన్నగారికి యిదివరలో నా బాల్యమున లేచిన గడ్డ మరల పుట్టినది. ఆయనకు బాధ ఎక్కువైనది. అందువలన తప్పక యింటికి రావలసి వచ్చినది. జగన్నాథపురం వచ్చితిని. అంతకంతకు గడ్డ పెరుగుచు బాధ యెక్కువ కాజొచ్చినది. ఇదే రోజులలో మా నాయనగారిని పెంచి పెద్దవానినిగా చేసిన పింగిలి రామమ్మగారు మరణించెను. మా నాయనగారు మంచములో నుంచి లేవకుండిరి గనుక ఆమె అంత్యక్రియలు మా పినతండ్రిగారే చేసిరి. మా నాన్నగారి జబ్బు సంగతి చేమర్తి మల్లికార్జునరావుగారికి తెలిసినది. నాన్నగారిని తీసుకరమ్మని మా మేనబావ వెంకట నరసింహంగారిని పంపిరి. ఆయనగారు వచ్చి వారి ఆదేశము తెలిపి చికిత్స కొరకు నందిగామకు రమ్మని బలవంత పెట్టెను. అంతట మా నాయనగారు సవారిలోను మా అమ్మగారు నేను మా తమ్ముడు స్వంతబండిపైనను బయలుదేరి నందిగామ వెళ్లితిమి. అప్పుడు వెంకట నరసింహంగారు కుటుంబ యుక్తముగా లక్ష్మయ్యగారింట్లోనే ఉంటున్నందువలన మేమక్కడికే పోతిమి. ఈలోగా మల్లికార్జునరావుగారు శస్త్ర చికిత్సను గురించి విచారించి నందిగామ డాక్టరుకన్న జగ్గయ్యపేట డాక్టరు తెలివిగలవారని తెలుసుకొని వెంటనే జగ్గయ్యపేటకు వెళ్లమనియును మఠములో నుండమనియును చెప్పి మఠం మేనేజరుకు ఉత్తరం యిచ్చిరి. యింతలో మామగారు గుఱ్ఱమునెక్కి నందిగామ వచ్చి మాతో కలుసుకొనిరి. ఈలోగా గడ్డ పగిలినట్లు కనబడెను. అయినను తప్పక జగ్గయ్యపేట వెళ్లుమని మల్లికార్జునరావుగారు చెప్పిరి. మేము 2 గంటలకు బయలుదేరి రాత్రి 7, 8 గంటలకు గౌరవరంచేరి కరణం అయ్యదేవర సీతారామయ్య గారింట బసచేసితిమి. ఆరాత్రి అచ్చట ఉండి తెల్లవారు జామున

4 గంటలకు బయలుదేరి 7 గంటలకు జగ్గయ్యపేట మఠం వద్దకు చేరితిమి. మఠంలో మాకు గది దొరికినది. బండిని మఠం వద్ద ఉంచి సవారి మీద మానాన్నగారిని తీసుకొని నేను మామగారు ఆసుపత్రికి పోయితిమి. అచ్చట డాక్టరు వెంకటస్వామి నాయుడుగారు పనిచేయుచుండిరి. ఆయన చురుకు బుద్ధి, శాంతస్వభావము గలవాడు చాలా దయతో పరీక్షించెను. గడ్డ నందిగామలోనే పగిలినదీ గనుక ప్రయాణములో కొంత చీము పోయినది. అదిచూచి ఒక మూల చిన్న ఆపరేషన్ మత్తు ఈయకుండానే చేసెను. ఆ కత్తులను చూచి నేను కండ్లు మూసుకొంటిని. ఇంట్లోనే ఉండి ప్రతిరోజు కడిగి కట్టు కట్టించుకొన వచ్చునని చెప్పినందున మరల మా నాన్నగారిని యింటికి తీసుకొని వచ్చితిమి. మామగారు బండి సవారి బోయిలు తిరిగి వెళ్లిపోయిరి. మఠము నుంచి ఆసుపత్రికి 2 ఫర్లాంగుల దూరమేగనుక ప్రతిరోజు నెమ్మదిగా నేను మా నాన్నగారిని తీసుకొని వచ్చేవాడను. బజారు సామను తెచ్చేవాడను. అంతటనుంచి మా నాన్నగారికి ఒక నెలరోజుల వరకు ఆరోగ్యము చేకూరినది. వెళ్లుటకు సెలవైనది. ఇంటికి ఉత్తరము వ్రాసితిమి. ఇంటి నుండి బండి వచ్చినది. వెంటనే అందరము బయలుదేరి నందిగామ చేరితిమి. అచ్చటినుంచి మరురోజు జగన్నాధపురం వచ్చితిమి. మా పినతండ్రిగారు కుటుంబయుక్తముగా యరకవరం వెళ్లి అక్కడనే ఉండిరి.

ఆ రోజులలో మా జుజ్జూరు, జగన్నాధపురం గ్రామమలులో య. 60ల పట్టా మెరకభూమియున్ను, జుజ్జూరు, చట్టన్నవరం, గొట్టుముక్కల గ్రామములలో య. 30ల యినాం మెరకభూమియున్ను ఉండెను. వ్యవసాయము య. 40ల భూమిపైన 2 అరకలతో చేయుచుండెడివారు. వ్యవసాయము జగన్నాధపురంలోనే ఉండెడిది. జుజ్జూరులో మా తలిదండ్రులు నేను మాతమ్ముడు ఉంటూ ఉంటిమి. శ్రావణ మాసములో మా నాన్నగారికి సన్నిపాత జ్వరం ప్రారంభించెను. వ్యవసాయ నిగరానిభారము పూర్తిగా నా మీదనే పడెను. మొత్తం మీద ఆ సంవత్సరం జొన్న, ప్రత్తి, మిర్చి మొదలగు పైర్లను వేయించే కార్యము మా నాన్నగారి ఆదేశానుసారము నేనే నిగ్గించితిని. 12 రోజుల తరువాత మా నాన్నగారికి జ్వరం తగ్గినది. పత్యం పెట్టించినారు. గాని ఇంకను పైజ్వరం వచ్చుచునే యుండెను. ఆ విధముగా దసరా ఆఖరువరకు ఆయనగారు లేవలేని స్థితిలోనే ఉండిరి. నేను పగలంతయు భూములపైన తిరుగుచు వ్యవసాయము చూచుచుండెడి వాడను. మా నాయనగారు లేవలేని స్థితిలో నుండిరి గనుక సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు భారతము వినిపించుటకు

నన్ను నియోగించిరి. మా మేనమామగారు కూడ వినుటకు వచ్చేవారు. విరాట, ఉద్యోగ పర్వములు నేను చదివితిని. మా నాయనగారు పడుకొని అర్థము చెప్పెడివారు. మధ్యమధ్యన మా మేనమామగారు కొన్ని ప్రశ్నలు వేయుచు ఇంకా కొంత వ్యాఖ్యానము చేయుచుండెడివారు. ఈ విధముగా ముగ్గురము కాలము గడుపుచూ ఉండెడివారము. దీపావళి సమీపించినది. యధాప్రకారము పరిటాల నుండి నాకు ఆహ్వానము వచ్చెను. నేను ఒక్కడనే పరిటాల వెళ్ళితిని. దీపావళి పండుగ వేడుకల ఉత్సవములో 2, 3 రోజులే సరిపోయినవి గాని యింకా 10 రోజులు నన్ను అచ్చటనే ఉంచు కొనిరి.

గత సంవత్సరం మా మిత్రులు లక్ష్మీకాంతరావు వకాలతు చదువుటకు పట్నం వెళ్లినట్లు వ్రాసితిని. ఆయన పరీక్షలో ప్యాసుకాలేదు. వ్యాధిగ్రస్తుడైనందున తిరిగి పట్నం వెళ్లలేదు. నందిగామలో చికిత్సపొంది ఇంట్లోనే ఉండెను. గత సంవత్సరము రోషన్ అలీగారు ఉరుదు ఉపాధ్యాయుడుగా ఉండుటయు ఆయన వద్ద 2 మాసములు చదువుటయు మా నాన్నగారి జబ్బువలన ఇంటికి వచ్చుటయు తటస్థించినదని వ్రాసితిని. దానికి కొద్దిరోజుల తరువాత రోషన్‌అలీగారు కాలం చేసిరి. పరిటాలవారు విచారించి నాకు మొదట చదువు చెప్పిన మహమ్మదు గాలబ్ సాహెబుగారిని నందిగామ నుంచి పిలిపించుకొని ఉపాధ్యాయునిగా ఏర్పాటు చేసిరి. లక్ష్మీకాంతరావుగారి ప్రోత్సాహముచే నన్ను పరిటాలవచ్చి మహమ్మదు గాలబ్ సాహెబుగారి వద్ద ప్రభుత్వ పాఠశాల తెరచేవరకు అనగా జూన్ నెలవరకు ఇంకా కొంత చదివి విద్యాభివృద్ధి భాషాభివృద్ధి చేసుకొనమని మామగారు కోరిరి. ఆ ప్రకారం నేను మా తండ్రిగారికి చెప్పితిని. వారు వెళు ్ళటకు అంగీకరించిరి. కార్తీక మాసములో నేను వచ్చి పరిటాలలో ప్రవేసించితిని. ఆ రోజులలో మల్లవెల్లి గ్రామ కాపురస్తుడు అచ్చట దేశపాండ్య అయిన నండూరు సుదర్శనరావుగారు కానాత్ తాలూకా కచేరిలో మదద్‌గారు పెష్కారుగా పనిచేయుచుండిరి. వయస్సులో ఆయన నాకంటె 4, 5 సంవత్సరముల పెద్దవాడు. సుదర్శనరావుగారికి లక్ష్మీకాంతరావు నన్ను పరిచయము చేసి స్నేహము కల్పించెను. ఆయన పరిటాల సుబ్బారావుగారి యిల్లు అద్దెకు తీసుకొని ఉండేవాడు. ఆ యింటిలో ఆడవారెవరూ ఉండేవారు కారు. శ్రీ సుదర్శనరావు పర్యటన చేయుచుండేవారు. ఆ కారణమున నేను లక్ష్మీకాంతరావు మరికొందరు విద్యార్థులు సుదర్శనరావు గారింట్లోనే రాత్రుల యందు పడుకుండేవారము. తీరిక సమయములలో నన్ను కచహరికిపోయి ఆఫీసు పనికూడా నేర్చుకొనుమని

మామగారు చెప్పిరి. మా అత్తమామల దృష్టిలో నేను ఇంకా కొంత చదివి ఆఫీసు పని నేర్చుకొన్నట్లయితే పేష్కారి ఉద్యోగంలో ప్రవేశపెట్ట వచ్చునని వారి అభీష్టము. కావుననే నన్ను ఆఫీసు పనికి కూడ నియోగించిరి. లక్ష్మీకాంతరావు, సుదర్శనరావుగార్లు మంచివారు అనగా సదభ్యాసములు గలవారు. మా ముగ్గిరిలో స్నేహమేర్పడినది. సజ్జన సాంగత్యముగానే ఉంటూ వచ్చినది. కచ్చేరిలో వ్రాతపని యింటికి రాగానే భారత భాగవతములోని పద్యములను చదువుచు వాటికి అర్థము, అన్వయము చెప్పుకొనుచు పండితులము కాకున్నను భాషాచర్చలలో కాలము గడిపేవారము ఉపాధ్యాయడు ఉభయ భాషా (పారశి, ఉరుదు) పండితుడు. నాతో 1, 2 ఉరుదూ పుస్తకములు చదివించెను. తుదివరకు కూడ అట్లాగే సాగినది.

లక్ష్మీకాంతరావుకు నాకు చదువు భోజనములు మాత్రము వేరే యిండ్లలో ఉండేవి గాని సాధారణముగా లక్ష్మీకాంతరావు నేను ఒకచోటనే కాలము గడిపేవారము. పర్వదినములలో నేను లక్ష్మీకాంతరావు ఒక్కొక్కప్పుడు సుదర్శనరావు కలసి కృష్ణానదికి స్నానమునకు వెళ్ళుచుండేవారము. అవతలి ఒడ్డున అమరావతి ఉండెడిది. అమరేశ్వర స్వామి దేవాలయమునకు (దేవస్థానమునకు) నిజాం ప్రభుత్వము నుంచి నిత్యనైవేద్య దీపారాధనలకొరకు మధిర తాలూకా దెందుకూరు గ్రామమలో 500 యకరముల యినాంభూమి యిచ్చుటయే గాక భద్రాచలం దేవస్థానంకు యివ్వబడే ప్రభుత్వ విరాళం నుంచి ప్రతి సంవత్సరం 1000 రూపాయిలు హాలీలు నగదుగాను యిచ్చు చుండిరి.

ఆంధ్ర ప్రభుత్వము వచ్చిన తరువాత యినాములను రద్దుపరచి శిస్తు వసూలు చేయుచున్నారు. ఆ యినాములలో దేవాదాయ యినాములను మినహాయించలేదు. వాటిపైన కూడా శిస్తు వసూలు చేయుచున్నారని వినుటకు విచారపడుచున్నాను. హైద్రాబాదు రాష్ట్ర విచ్ఛిత్తికి పూర్వము ఎండోమెంటు సలహా సంఘమునకు నేను సభ్యుడుగా నుండి చిత్తు శాసనము తయారుచేసి సమర్పించితిని. మొదట శ్రీ రామకృష్ణారావు గారును తరువాత శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారును రివిన్యూ మంత్రి హోదాలో సలహా సంఘమునకు అధ్యక్షులుగా నుండిరి. వెంకట రంగారెడ్డిగారి అధ్యక్ష కాలమున యినాములరద్దు సమస్య కమిటీ ఎదుటికి వచ్చెను. మద్రూతుల్‌ఖిద్‌మత్ యినాములను ముఖ్యముగా దేవాదాయ యినాములను రద్దు చేయకూడదని మేము తీర్మానించితిమి.

ఇప్పటికిని తెలంగాణాలో అదే అమలు జరుగుచున్నది. సజ్జనులైన స్నేహితులతోను శాంత స్వభావము గలిగిన పండితుడైన ఉపాధ్యాయునితోను మేమాసాంతము వరకు చదువుచూ కాలము గడిపితిని. స్వల్పముగా పారశి కొంత ఉరుదు భాషా అభివృద్ధి చేసికొనుటయు తాలూకాఫీసులో కింది ఉద్యోగులకు వ్రాయవలసిన ఉత్తరముల విధివిధానము అధికార నిర్వహణము కొంత గ్రహించగలిగితిని. నాకు విద్యాభివృద్ధి చేసికోవలెనని కాంక్ష ఎక్కువగా నుండెడిది. అందు ఖమ్మంగాని వరంగల్‌గాని వెళ్లి పాఠశాలలో చేరవలసి ఉంటుంది. స్థల నిర్ణయమింకా కాలేదు. నేను ఆతురత పడుచునే యుంటిని. ఈ మధ్యకాలములో మా పినతండ్రిగారు యెరకవరము నుండి వచ్చుటయు వారికి క్రమేణ రుగ్మత యెక్కువగుటయు తటస్థించినది. పాఠశాల తెరచే రోజులు కూడ సమీపించినవి. ఆ కారణమున పరిటాల నుంచి వెళ్ళుటకు నిశ్చయించుకున్నాను. కష్టముపైన స్నేహితులనుంచి సెలవు తీసుకొని జగన్నాధపురము చేరితిని. గాని మా పినతండ్రిగారికి రుగ్మత హెచ్చుగుచుండెను.

మా పినతండ్రిగారు తన రుగ్మత అతిశయించుటను గ్రహించి జీవితాశ వదలి ఒకరోజు సాయంత్రం 3 గంటల వేళ బాజారులో నున్న మా నాన్నగారిని పిలిచి నీతో నా మనోభీష్టము చెప్పదలచితిని. అన్యధా తలంచవద్దు అనిరి. ఇంతలో ఇంట్లోనివారందరు అనగా మా పినతల్లి మా మేనత్త మా అమ్మగారలు మంచము వద్దకు భయాందోళనతో వచ్చిరి. పల్లెటూరు గనుక పక్క యిండ్ల వారలు కూడ వచ్చి గుమికూడిరి. వారందరి ఎదుట నాకు వ్యాధి హెచ్చుచున్నది. నెమ్మదించి జీవించుతాననే ఆశలేదు. జీవించినను సంతానము కలుగదు. నాకు మొగ సంతానము లేదు. 3రు ఆడపిల్లలున్నారు. ఈ పిల్లలను నీ పిల్లగను నీ రెండవ పిల్లవాడు నాగభూషణము నా పిల్లవాడుగాను ఉండెదరు. అంగీకరించి నా చేతిలో చేయి వేయుమని మా తలిదండ్రులను కోరెను. అందరు దుఃఖపడిరి. నీ అభీష్టప్రకారమే జరుగునని మా నాన్నగారు వారి చేతిలో చేయివేసిరి. అంతట మా పినతండ్రిగారు 8 సంవత్సరముల మాతమ్మునిని దగ్గరకు పిలిచి మంచము మీద కూర్చుండ బెట్టుకొనెను.

మరురోజు సాయంత్రము నన్ను దగ్గరకు పిలచి నీవు పెద్దవాడవు. చెల్లెండ్రను తిన్నగా చూచే భారము నీదని చెప్పి ప్రతిరోజు నావద్ద కూర్చొని రుక్మాంగద చరిత్ర చదివి వినిపించుమని చెప్పిరి. వారు స్వయముగా నారాయణ

కవచము వల్లించు చుండిరి. నేను ప్రతిరోజు ఏకాదశి మహాత్మ్యము (రుక్మాంగద చరిత్ర) చదివి వినుపించు చుంటిని. వ్యాధి వృద్ధి అగుచు వచ్చినది. చదివే చరిత్ర కూడా పూర్తి అయినది. నాకు ఏకాదశి మరణము తటస్థించునాయని అనుకొనుచుండిరి. అతిసార గుణము ఎక్కువ అయినది. గొంతుగుడుమాట పడినది. జీవితాశ సన్నగిల్లినది. తుదకు వారు ఆషాఢ శు 11 రోజున 14 జూలై 1902 తేదీన నారాయణ నారాయణ అని బిగ్గరగా పలుకుచు దేహమును విసర్జించి దివంగతులైరి. అప్పటివరకు కుటుంబ నిర్వహణ కార్యములు మా పినతండ్రిగారే నిర్వహించుచుండుటచేత వారి మరణము వలన కలిగిన కొరతకు మా తండ్రిగారు దుఃఖముతో చాల నిస్పృహ జెందుచుండిరి. వ్యవసాయమునకు నన్నే నియోగించు చుండిరి.

రెండవ పినతండ్రి వెంకట రామారావుగారు నీలికుర్తికి పటేలుగా యేర్పాటు కాబడిరి. ఆ కారణమున అంతకుపూర్వము 5, 6 సంవత్సరముల నుంచి వెంకట్రామా రావుగారు నీలికుర్తిలోనే ఉంటూ వచ్చిరి. నరసింహారావుగారి ఆధ్వర్యమున వారిద్దరి పేర 4, 5 వందల ఎకరముల భూమి సంపాదించబడినది. ఇంకా కొందరితో కలిసి బావాజీగూడెం బంజరు సంపాదించి స్థిరపడిపోయిరి. మా పినతండ్రి గారి మరణ కారణమున మా నాయినగారు చదువు నిమిత్తము ఎచ్చటికిని పంపలేక పోయిరి. ఇది నా దురదృష్టము.

* * *

*ప్రకరణము - 2*

# విద్యాభంగము

కర్మల తరువాత నాగభూషణరావు చికిత్సకొరకును, చదువుకొరకును జగన్నాధపురము వదలి మేము జుజ్జూరు చేరితిమి. జగన్నాధపురములో వైధవ్య దశలోనున్న మా పినతల్లి ఉండవలసి వచ్చినది. ఆమెవెంట ఆమె పినతండ్రి నరసింహరావుగారు కొన్ని మాసములుండిరి. గాని ఆమె నాయనమ్మ రాజమ్మగారు ఈ దుఃఖ పరంపరల్ని చూచి మరణించెను. కర్మ పూర్తి చేసికొని మా తాత గండేపల్లి నరసింహారావుగారు వెళ్ళిపోయిరి. అదే రోజులలో ప్రక్క గ్రామములో నున్న పెద్దనాయని చెఱువు మరమ్మతు చేయబడుచుండెను. సబ్ ఓవర్సీయరు నారాయణరావుగారు యద్దనపూడి వెంకట సుబ్బయ్యగారింట్లో ఉండెడివారు. వెంకటసుబ్బయ్యగారు తన వ్యాజ్యముయొక్క డిక్రీ జడ్జిమెంటు యితర రికార్డులను తెలుగులో తర్జుమాచేసి పెట్టుమని ఓవర్సీయరును ఆయన కోరెను. సబ్ ఓవర్సీయరు తెలుగులో చెప్పుచుండుటయు నేను వ్రాయుచుండుటయు జరిగినందున వ్రాయుట పూర్తిగా అభ్యాసము అయినది. తరువాత కొద్దిరోజులలో నందిగామకు సర్వే ట్రయినింగు స్కూలు వచ్చినందున వెంకట నరసింహంగారు నన్ను ప్రేరేపించి ఆ స్కూలులో ప్రవేశపెట్టెను. నేను ఆ స్కూలులో శిక్షణపొంది సర్వే పరీక్షలో ప్యాసైతిని. మరల కొన్ని రోజులకు మేదు కొండూరు రంగయ్యగారి కోరికపైన నందిగామలో ఉండి. సెటెల్‌మెంటు లెఖ్ఖలు వ్రాసితిని. సర్వే చేయుటలోను గ్రామ రెవిన్యూ జమాబంది సెటెల్‌మెంటు శిస్తూ వసూలు మొదలగు అన్ని లెఖ్ఖలు వ్రాయుటలోను నేను కొంత అనుభవము సంపాదించ గలిగితిని. భూమిని సర్వేచేసి ప్లాను సిద్ధము చేయగలిగెడివాడను.

ఈ విధము (1313 ఫ) శ్రీరామనవమి వరకు గడచినది. శ్రీరామ నవమికి యధాప్రకారము నేను పరిటాల మా అత్తవారింటికి వెళ్ళితిని. శ్రీరామనవతి వుత్సవములో మా ముఖ్యబంధువు ఆదిరాజు తిరుమలరావు గారితో నాకు పరిచయము కలిగినది. తిరుమలరావుగారు బాగా పారశి చదివినవాడు. బొల్లారంలో ఆయనకు శిష్యవర్గముకూడ ఉండెడిది. ఆయన గారు పరిటాలలో మా మామగారి యింటిలోని ఉత్సవముల సందర్భమున 3, 4 రోజులు అతిథిగా నుండెను. ఆయన నాతో పారశీభాష మాట్లాడుచుండెడివాడు. చిన్న వాక్యములతో నేను పారశీలో కొంత సంభాషణ చేయగలిగెడివాడను. అది తిరుమలరావుగారికి సంతోషకరము. గత సంవత్సరములో మాకు తటస్థించిన యీతిబాధలు ఆర్థిక చిక్కులవలన నా విద్యాభివృద్ధి భంగము. తద్వారా నాకు కలిగిన నిరాశ వారికి తెలిపితిని. ఆయన నాకు కొంత ధైర్యము చెప్పెను. నన్ను తీసుకొనివెళ్ళి హైదరాబాదులోని పాఠశాలలో ప్రవేశపెట్టెదననియును భోజన వసతి ఏర్పాటు జేసెదననియును చెప్పి మా మామగారితో డబ్బుసహాయము చేయుమని ప్రోత్సాహము చేసెను. మా మామగారు తిరుమలరావుగారి ప్రబోధములవలన నాకు ద్రవ్యసహాయము చేసెదనని అంగీకరించెను. తిరుమలరావు గారు ప్రక్కనున్న గని ఆత్కూరులో ఉండెడివారు. వారికి కొన్ని భూములుండెడివి. భూముల పొందుబాటు చేసుకొని వెళ్ళేటప్పుడు నన్ను తీసుకొని వెళ్ళుతానని చెప్పెను. అది త్వరలో నెగ్గలేదు. 3 మాసములు పట్టినది. నాకును నిరాశకలిగినది. ఆ రోజులలో లక్ష్మీకాంతరావు హైదరాబాదు వెళ్ళి వకాలతు చదువుచుండెను. ఇంకొక మా బంధువు పరిటాల హనుమంతరావు అనే ఆయన నాకంటె పెద్దవాడు. ఆయన హైదరాబాదు ఒక జాగీరుకచ్చేరిలో ఉద్యోగిగా నుండెను. ఆయన నన్ను పట్నం తీసుకొని వెళ్ళి పాఠశాలలో ప్రవేశపెట్టెదనని చెప్పెను. ప్రయాణమునకు సిద్ధపడితిని. మా నాయనగారు ఆర్థిక సహాయము చేయలేని స్థితిలోనే ఉండిరి. మా మాగారిని డబ్బు యివ్వమని కోరితిని. రూ.25లు మా మామగారో లేక అత్తగారో ఎవరో ఒకరు నాకు యిచ్చిరి. నేను హనుమంత రావుగారితో బయలు దేరితిని. ఉభయులము హైదరాబాదు సిద్దిఅంబర్ బజారులో మాదిరాజు కోటేశ్వర రావుగారి యింటికి వెళ్ళితిమి. 2, 3 రోజులు యిద్దరము అక్కడనే బసచేసితిమి. నేను అదివరకు పారశి, ఉరుదు భాషలలో విద్య నభ్యసించితిని. అవి ప్రయివేటు పాఠశాలలు గనుక ప్రభుత్వ విధివిధానం ప్రకారం శిక్షణయిచ్చి యుండలేదు. ప్రాచీన విధానాను సారము సాహిత్యమే బోధించిరి. నా భాషా జ్ఞానమునుబట్టి

నేను నా మిత్రులును మిడిల్ క్లాసు (III Form)లో చేరవలెనని అనుకొనుచుంటిమి. కాని 2, 3 రోజులు మేము విచారించినను ఉరుదు తెలుగులో శిక్షణ యిచ్చే సెకండరీ పాఠశాల హైద్రాబాదులో లేకుండెను. నాకు ఇంగ్లీషురాదు. హైదరాబాదు పాఠశాలలో తెలుగులేదు. కొంత నిరాశ కలిగినది. నేనును హనుమంతరావుగారును బాలాగంజ్‌కు వచ్చితిమి. అచ్చట మా గ్రామ బ్రాహ్మణులున్నారు. మకరాల లక్ష్మీకాంతయ్యగారి భార్య మా గ్రామ బ్రాహ్మణుడు నాగయ్యగారి కుమార్తెయే. కాంతయ్యగారితో నేను వచ్చిన విషయమును చెప్పితిని. ఆయన పచ్చబావి వీధిలోని ఒక పాఠశాలకు తీసికొని వెళ్ళెను. అక్కడ ఒక కాయస్థుడు ఉపాధ్యాయుడుగా నుండెను. అదికూడ సర్కారి పాఠశాల కాదు. ప్రయివేటు పాఠశాలయే. అచ్చట మున్షీ, ఆలిం మున్షీఫాజల్ తరగతులకు పారశీలో శిక్షణయిచ్చి పంజాబు యూనివర్సిటీలో పరీక్షలకు పంపుచుండెడివారు. నన్ను కొంత పరీక్షించి మున్షీ ఆలింలో చేర్చుకుంటానన్నాడు. ఈ పారశీ పరీక్షలు, సంస్కృత భాషాప్రవీణ, విద్యాప్రవీణ, శిరోమణి, పరీక్షలకు పోలిఉండెడివి. భాషాభివృద్ధియే వారి లక్ష్యము. నేను మకరాల లక్ష్మీకాంతయ్యగారింట్లో నుండి భోజనము చేయునట్లును పై జెప్పిన పాఠశాలలో మున్షీఆలిం ఫారశీభాషను చదువునట్లును ఏర్పాటు చేసుకుంటిమి.

మున్షీఆలిం హిందీ సంస్కృత విశారద ఎంట్రన్సు పరీక్షలు లేక మెట్రిక్యులేషనుకు సమానముగా నుండెడివి. అదికూడ యూనివర్సిటీ పరీక్షయే. అయినను ముందు చెప్పబోయెడి విధముగా అట్టి సాహితీ పరీక్షా పట్టమును సంపాదించే ప్రాప్తముకూడా నాకు లేకపోయినది. నాకు అన్వర్ సహిలీ అనే ఒక పారశీ గ్రంథమును ఉపాధ్యాయుడు తెప్పించి చదివించుటకు ప్రారంభించెను. నాకు నెల 1కి రు. 25/–లు భోజనమునకు, పుస్తకములకు పాఠశాల జీతము మొదలగు ఖర్చులకు వ్యయమగునని మేము అంచనా వేసుకుంటిమి. తెచ్చుకున్న రూపాయలు దాదాపు ఖర్చు అయినవి. ఈ సంగతులన్నిటిని మా మామగారికి తెలిపి కొంత డబ్బు ప్రస్తుతము పంపి తరువాత ప్రతినెలలో రూ. 25 చొప్పున పంపుమని కోరితిని. అందుకు వారేమి ప్రత్యుత్తర మీయలేదు. 20 రోజులు నిరీక్షించితిని. లక్ష్మీకాంతరావు మకరాల లక్ష్మీకాంతయ్యగారల సలహావెంట యింటికివెళ్లి ఖర్చులను గురించి యేర్పాటు చేసుకొని రావడమే ఉచితమని అను కుంటిని. ఆ ప్రకారము ఇంటికివచ్చి మామగారికి సంగతులన్ని తెలుపగా వారు నాకు

సహాయము చేయుటకు నిరాకరించిరి. అంతటితో నేను మరల హైద్రాబాదు నకు వెళ్లజాలక పోతిని. తరువాత కొన్ని మాసములకు స్న 1313 ఫసలీ కార్తీక మాసములో నాకొక కుమార్తె కలిగెను. దానికి మంగమ్మ అని పేరు పెట్టితిమి. నేను నిరుద్యోగిగా నుండుటయు భార్యాభర్తల పోషణాభారము నాన్నగారిపై బడుటయు నాకొక అవమానముగా నుండెను. సేవకావృత్తికై పలు ప్రయత్నములు చేసితిని. దైవనిర్ణయము వేరగుటచే ఏ ఉద్యోగము లభించి యుండలేదు.

నా స్నేహితుడు లక్ష్మీకాంతారావుగారు ఆ సంవత్సరము వకాలత్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యెను. తరువాత 5, 6 మాసములు హనుమకొండలో శ్రీ కరీంహుస్సేన్ సాహెబు అనే సుప్రసిద్ధ వకీలువద్ద జూనియర్‌గా నుండి పని నేర్చుకొనెను. ఆతరువాత ఆయన స్వగ్రామమగు పరిటాలయందే ఉండి జాగీరు అదాలత్ (కోర్టు)లోనే ప్రాక్టీసు చేయసాగెను. శ్రీ నండూరు సుదర్శనరావుగారికిని వకాలత్ చదువవలెనని సంకల్పము కలిగెను. వారును రిక్తహస్తులే. శ్రీ తుర్లపాటి సుందరశివరావుగారు గని ఆత్కూరు వగైరా ఐదు గ్రామాలకు దేశపాండ్యా; నందిగామా తాలూకా అడవిరావులపాడు అనే గ్రామమునకు అగ్రహారీకుడు. ఎక్కువ భూవసతి వ్యవసాయము కలవాడు. మా బంధువున్ను అయి యుండెను. ఆయన విద్యాభిమాని అయి యుండెను. వారి ద్రవ్య సహాయముతో సుదర్శనరావు గారు 1314 ఫసలీలో పట్నం వెళ్లి వకాలత్ చదివి పరీక్ష యిచ్చెను.

నైజాం ప్రభుత్వములో పాయగా:లు సంస్థానములు జాగీరులు ఉండెడివి. వాటి లోపాయగా:లకు సంస్థానములకు కొంద్రరు పెద్ద జాగీర్దార్లకు సివిల్ క్రిమినల్ అధికారములు సెషన్‌కోర్టు అధికారము వరకు తరగతుల వారిగా అధికారము లుండెడివి. స్న 1313 ఫసలీలో శాసనసభచే అంగీకరింపబడిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ననుసరించి జాగీర్లలోని జుడిషల్ అధికారములు లా పరీక్షలలో పరీక్ష యిచ్చినవారికే యుండవలెననెడి ఉత్తర్వు నిజాం గవర్నమెంటుచే జారికాబడెను. నవాబ్ హిసాముల్ ముల్కుఖాన్ ఖానాన్ బహద్దూర్ జాగీరుదారుకు ప్రత్యేక స్థలములలో కొన్ని గ్రూపు గ్రామములుండెను. అందు పరిటాల మొదలగు 7 గ్రామముల గ్రూపుకు కానాత్ తాలూకా అనిపేరు.

కానాత్ తాలూకా పరిపాలించుటకు ఒక అధికారి తహశీల్దారు మున్సిఫ్ మేజిస్ట్రేటు పనులు నెరవేర్చుటకు ఉండేవాడు. ఆయన లా పరీక్ష ప్యాసు కాలేదు.

మొట్టమొదట అప్పటివరకు తాలూకా గుమాస్తాగా నుండి దేశపాండ్య కర్ణీకము వతనులున్న సుదర్శనరావుగారు వకీలు పరీక్ష యిచ్చినందున ఆయనను మున్సిఫ్ మేజిస్ట్రేటుగా (రెండవక్లాసు మేజిస్ట్రేటు ఐదు వందల సివిల్ పవర్) రూ. 30ల జీతముతో నియమించిరి. ఈ విధముగా నాయిరువురు మిత్రులు లా పరీక్షలు యిచ్చి ఒకరు జుడిషల్ అధికారికాను రెండవవారు వకీలుగాను పని చేయసాగిరి. ముందు చదువలేక అభాగ్యుడనైతినని విచారపడుచుంటిని.

* * *

*ప్రకరణము - 3*

# శేవకావృత్తి - పేష్కారి ఉద్యోగము

మా వెంకటనరసింహం బావగారు నాకంటె వయసున పదేండ్లు పెద్దవాడయి నను నాతో ప్రేమగాను కలిసిమెలసి యుండెడివారు. ఆయన నన్ను ఉత్తరంవ్రాసి నూజివీటి జమీందారు శ్రీ రాజారంగయ్యప్పారావు గారి ఉయ్యూరుస్టేటులో అక్కౌంటెంటుగా పనిచేయుచున్న తన పినతండ్రి శ్రీ సీతారామనరసింహ్వంగారి వద్దకు పంపెను. ఆయన ఒక ఉత్తరమిచ్చి నన్ను గన్నవరం మేజస్ట్రీటుగా పనిచేయుచున్న శ్రీ కస్తల పూర్ణయ్యగారి వద్దకు పంపిరి. వారు సీతారామనరసింహం గారికి బంధువు. బంధుత్వమేగాక చిరకాల పరిచితులు గనుక కస్తల పూర్ణయ్య పంతులు మేజస్ట్రేటుగారు మీర్జాపురం జమీందారు శ్రీ రాజా వెంకటనరసింహ్వప్పా రావు గారికి సిఫారసు ఉత్తరం (నాకు ఉద్యోగమిప్పించుమని) యిచ్చి నూజివీడు పంపిరి. మీర్జాపురం ఎస్టేటు అక్కౌంటెంటు వైద్యుల నారాయణరావు గారు. సీతారామనరసింహ్వంగారికి స్నేహితులగుటచే నన్ను పరిచయము కలుగచేసిరి. మేజస్ట్రీటుగారు సిఫారసు సంగతి చెప్పిరి. నారాయణరావుగారు నా తెలివితేటలు తెలిసికొని శ్రీ రాజాగారితో నేను రివిన్యూ జమాబంది శెటిల్‌మెంటు లెఖ్ఖలు వ్రాయ గలుగుదుననియును సర్వే ప్యాసయితిననియు చెప్పిరి. మీర్జాపురం ఎస్టేటులో 1) మీర్జాపురం 2) ఎలమర్రు అనే రెండు తాణాలుండెడివి. మీర్జాపురం తాణాలో 40 గ్రామములుండెడివి. వసూలు 60వేలు బకాయి 215000 ఉండెను. పేష్కారు ఉద్యోగము 3 మాసములనుండి ఖాలిగా నుండెను. లెఖ్ఖలు అట్లే పడియున్నవి గనుక రాజాగారు నన్ను మీర్జాపురం

ఠాణాకు పేష్కారుగా నియమించిరి. ఇది బహుశః 1905 సంవత్సరం జులైనెల అయియుంటుంది. నేనుగాక ఠాణాలో ఠాణెదారు శ్రీదామరాజు రామయ్యగారు, భండారు సత్యనారాయణ గుమాస్తాగాను ఉండేవారు. నెల 1 కి రు 10 లు మాత్రమే దొరకెడిది.

ఎస్టేటు హెడ్డాఫీసు ఠాణా ఆఫీసు ఒకే యింటిలో విడివిడి భాగములలో ఉండి ఉద్యోగస్థులు వేరువేరుగా కూర్చుని పనిచేసేవారు. కుర్చీలుండేవికావు. చాపలపైననే కూర్చునేవారు. ఉద్యోగస్థుల ముందొక బల్ల ఉండెడిది. దస్తరములుండెడివి.

ఠాణా పేష్కారునైన నేనును నా గుమాస్తాయు, ఒక భాగములో కూర్చుండెడివా రము. ఠాణేదారు ఎక్కువగా గ్రామములో సంచారము చేసి భూముల అమరకము డబ్బు వసూలు పనులు కనుక్కుంటూ ఉండేవారు. ఠాణేదారు అనగా తహశీల్దారు వంటి అధికారి కనుక వీరుగాక కొన్ని గ్రామములకొక సముతుదారు (సముద్దారు) ఉండెడివారు. ఆ ఠాణాలో 4 సముతుదారులుండేవారు. వారు ఠాణాకు లోబడి పనిచేసేవారు. కరణములు గ్రామాధికారులు. సముతుదారులు అనగా రివిన్యూ యినస్పెక్టర్ల వంటివారు.

నేను చార్జి తీసుకున్న కొలదిరోజులకే ఒక రోజున కుటుంబరావు అనే హెడ్డాఫీసు ఉద్యోగి మా ఠాణేదారును చూచి మీ పేష్కారు వేషాలు వేసుకొని తిరగే పిల్లవాడు. అతనితో ఠాణాలెఖ్ఖ పని నెగ్గుతుందా? అని హేళనగా ప్రశ్నించెను. ఠాణేదారు రామయ్యగారు మంచి లెఖ్ఖవాడు, శాంతస్వభావుడు. కొన్ని రోజులు చూచెదనని వారికి జవాబు చెప్పెను. దానిని దూరము నుంచి వింటిని. నేను దగ్గరకు రాగానే ఠాణేదారు నాతో 3 మాసముల నుంచి పేష్కారు లేనందున లెఖ్ఖపని ఆగియున్నది. నేను సంచారము వెళ్ళి వారం పదిరోజులకు రాగలను. ఈలోగా మీరు డి.సి.బి. తయారు చేయవలెనని ఆదేశించెను. నేను విని సరేనంటిని. నేను గ్రామకర్ణీకము లెఖ్ఖలు వ్రాసితినిగాని డి.సి.బి. లెఖ్ఖ వ్రాయలేదు. డి.సి.బి. అనగా రావలసినట్టియు వసూలైనట్టియు బాకియున్నటువంటియు డబ్బు మొత్తము తెలియచేయు లెఖ్ఖ. అంతట పాత లెఖ్ఖలను తీసిచూచి అర్థము చేసుకొంటిని ఖాతాలు తీసి 3, 4 నెలల నుంచి వాటిలో అంకెలు పడలేదని తెలుసుకొని హెడ్డాఫీసు నుంచి చిఠాలు తెప్పించి ఖాతా పూర్తి చేసుకొని డి.సి.బి. మొదలుపెట్టితిని. దానిలో 50కి పైగా కాలములుంటవి. దానిపొడవు గజము ఉండెడిది. దానిని అరటావు సైజు పుస్తకరూపమునమార్చి 54, 55 కాలములను

మూడు పేజీల మీద యిమిడ్చి పూర్తి చేసితిని. 1292 ఫసలీ నుంచి 1314 ఫసలీ వరకు సాలియాన బకాయదానిలో వివరముగా వ్రాయవలసి వచ్చెడిది. 10 రోజుల తరువాత ఠాణేదారు రామయ్యగారువచ్చి లెఖ్ఖ సిద్ధము చేసితిరా? అని ప్రశ్నించిరి. అందుకు చిత్తుతయారైనది. సాపు వ్రాయవలసి యున్నది. నే వొక్కడనే గనుక సాపు వ్రాయజాలక పోయితినని బదులు చెప్పితిని. అందుకు వారు చిత్తు అయినను చాలును తెమ్మని కోరిరి. చిత్తు పుస్తకమిచ్చితిని. ఎఖ్ఖ సిరా రూళ్ళు నల్ల అక్షరములు అంకెలతో పుస్తకము నిండియుండుటయు సైజు మార్చుటయు చూచెను. కొంచెము సరిచూచి నా పనికి సంతోషించెను. సైజు పూర్వపుది కాదే అనిరి. అంతట నేను గవర్నమెంటు గ్రామములోని 12వ నెంబరు లెఖ్ఖ కొన్ని సంవత్సరముల క్రితము ఇట్లే హనుమంతుని వాలమువలె ఉండెడిదనియును దాని సైజు తగ్గించుటకు అచ్చటి కరణములు ఈ పద్ధతి అవలంబించిరి. గనుక నేనును అట్లే చేసితి ననియును యిందులో కావలసిన అన్ని బాబతులు ఉండుననియును ధృవపరచితిని. అందుకు ఆయన నవ్వుచు దగ్గరనే ఉన్న కుటుంబరావుగారితో మా పేష్కారుగారు పనిలో నలిగినవాడే. తండ్రి ఆయనను బాగా లెఖ్ఖ తరిబియ్యతు చేసినాడు. మా ఆఫీసు పనికి లోటు ఉండదని లెఖ్ఖ ఆయన చేతికిచ్చెను. కుటుంబరావుగారు సంతోషించి మా కుటుంబ వివరములను విచారించెను. ఈ విచారణలో ఉభయుల మధ్య బంధుత్వము కూడా బయటపడెను. ఠాణా నౌకర్ల శలవులు జీతముల బిల్లులు రివిన్యూ వసూలు లెఖ్ఖలు కరణములు సముద్దారులతో ఉత్తర ప్రత్యుత్తరములు నేనే చేయుండెడివాడను. ఇంతేగాక రివిన్యూ బాకీల జబ్తుకాగితములను తహశీలుదారునకు పంపి ధృవపరిపించుచు సబ్‌కలెక్టర్‌కు పంపి వేలం ఉత్తర్వులు రాయించుటకు కావలసిన చర్యను నేనే జరుపుచుండెడివాడను. శ్రీరాజాగారు సంతకము చేయుచుండెడివారు.

ఠాణేదారు ప్రతి నెలలో 2 పర్యాయములువచ్చి ఆఫీసు పనిని తెలుసుకుంటూ ఉండెడివాడు. ఆయనకు నాయందు ప్రేమ నమ్మకము కలిగినది. ఆయన నన్ను సోదరునివలె భావించుచూ మీరును నాతమ్ముడు సీతారామయ్యయు నాకు సమానులు అనేవారు. ఈ విధముగా 15 మాసములు నూజీవీడులో రు. 10ల జీతము పుచ్చుకొనుచు పేష్కారి ఉద్యోగము సమర్యాదగా నెరవేర్చగలిగితిని. 1906 సంవత్సరములో శ్రీ కాళేశ్వరరావు పంతులులగారు ప్లీడరు పట్టాపొంది విజయవాడలో పనిచేయ మొదలుపెట్టిరి. కొలది రోజులలోనే మా మేనత్త

వరలక్ష్మమ్మగారు వ్యాధిగ్రస్తురా లయ్యెను. చూచుటకు విజయవాడ వచ్చితిని. నెమ్మది కనుపడలేదు. మత్తు అయోమయ స్థితికూడా వచ్చినది. రెండు రోజులుండి ఇంటికివెళ్ళి మా నాయనగారిని పంపెదనని జగన్నాధపురం వచ్చితిని. ఈ సంగతి తెలియగానే మా నాయనగారు విజయవాడ వెళ్ళిరి. నా భార్య కూతురు పరిటాలలో నుండినందున చూచివచ్చుటకై పరిటాల వెళ్ళితిని. అప్పుడు మా మిత్రుడు లక్ష్మీకాంతరావుగారు వికాలతు చేయుచుండిరి. మే మిద్దరము కలిసి కొంచెముసేపు మాట్లాడితిమి. ఉద్యోగము వదలిపెట్టి వికాలతు చదువ వలసినదని ఆయన నన్ను ఎన్నో విధముల ప్రోత్సాహపెట్టెను. కాని 3, 4 సంవత్సరముల నుంచి పారశీ, ఉర్దూ భాషల పరిచయము మారినందున వికాలత్ చదువలేనని బలహీనతను తెలిపితిని. అదేరోజు యింటికివచ్చి మరురోజు నందిగామ వెళ్ళితిని. మూడవ రోజు ఉదయమునకు మా మేనత్తగారు కాలము చేసినట్లు టెలిగ్రాము ద్వారా తెలుపబడెను. ఆ వార్త విని నేను నందిగామ నుంచి యింటికి వచ్చితిని. ఆ క్రిందటి రోజునే నా కూతురు మంగమ్మ చనిపోయినదనే వార్త వచ్చెను. ఈ రెండు దుఃఖవార్తలు పెద్ద కష్టము కలుగచేసినవి. నా కుమార్తె చనిపోయిన నాల్గవరోజు ఉదయమున నూతక స్నానముచేసి పరిటాల వెళ్ళితిని. అచ్చట 7 రోజులుంటిని. లక్ష్మీ కాంతరావు ప్రోత్సాహ మెక్కువయినది. ఆరోజులలో నేను ఒక్కడనే నూజివీడు వెళ్ళకూడదని నిశ్చయించుకుంటిని. వచ్చే జీతము భార్యభర్తలకు భుక్తికి కూడ చాలదు. సందిగ్దావస్థలో పడిపోతిని. లక్ష్మీకాంతరావుగారు నాకు కొన్ని ఉర్దూ వార్తాపత్రికలు కొని లా పుస్తకములు చదువుకొనుటకు యిచ్చిరి. నాలో మరచిపోగా మిగిలిన భాషాజ్ఞానము తెలిసికొని నీవు వికాలత్ చదువగలవు. తప్పక ప్రయత్నము చేయుమని ప్రోత్సాహపరచెను. వారం రోజుల తరువాత యింటికి వచ్చితిని. నేను చిన్నప్పటి నుండియు మా నాయనగారి ఎడల భయభక్తులు కలిగి మాట్లాడుటకు కూడ జడిసేవాడను. కాని అవుసర విషయములలో వారికి సలహా యిచ్చేవాడను. వారు వాటిని పాటించేవారు. దుఃఖములోనున్న భార్యను వదలి నూజివీడు వెళ్ళకూడదనియు వికాలత్ పరీక్షను చదువ వలెననియును నిశ్చయమునకు వచ్చితిని. వయస్సు 20 సంవత్సరములు.

యద్దనపూడి వెంకటసుబ్బయ్యగారు నాయందు ప్రేమగలవాడని పైన వ్రాసియే ఉన్నాను. ఆయన లోకులకు కొంత పెట్టుబడి పెట్టేవారు. స్థితిగలవాడు. మా నాయన గారికి ఆయనకు కొంచెము లావాదేవీలు ఉండెడివి. నేను ఆయనతో

చనువు చేసుకొని నేను వికాలత్ చదువవలయుని అనుకుంటు ఉన్నాను. రు. 150, 200లు వడ్డీలేకుండా ఋణముగా ఇవ్వవలసినదని కోరితిని. ఆయన సంతోషముతో అంగీకరించెను. ఇంత మాత్రము నమ్మకము కుదిరిన తరువాత ఒకరోజు రాత్రి మా నాయనగారు ప్రశాంతముగా నున్నప్పుడు నూజవీటి ఉద్యోగము లాభములేదు. ఇంటి నుంచి తీసుకొని వెళ్ళుట మంచిదికాదు. గనుక నేను హైద్రాబాదు వెళ్ళి వికాలతు చదివి ప్యాసుకాగలను. ఖర్చును గురించి వెంకటసుబ్బయ్యగారు ఋణపూర్వకముగా సహాయము చేస్తానన్నారు. పరీక్ష అయిన తరువాత దానిని నేనే తీర్చుకుంటాను. అని నెమ్మదిగా మా అమ్మగారి ఎదుట మా నాన్నగారికి చెప్పితిని. ఆ శుభముహూర్తమున అందుకు వారు అంగీకరించిరి.

* * *

*ప్రకరణము - 4*

# ఉద్యోగ విరమణ

దీనిని పురస్కరించుకొని నేను నూజివీడు వెళ్ళి నన్ను సర్వవిధముల కనిపెట్టుచున్న నా శ్రేయోభిలాషి అయ్యదేవర సీతారామనరసింహంగారికి ఈ సంగతి చెప్పితిని. ఆయన అర్ధాంగీకారముతో నీవు ఉద్యోగముకు యిచ్చే రాజీనామాలో నేను ఉర్దూ పారశీ భాషలు చదివినాను. అనిన్ని 15 మాసములు పేష్కారు ఉద్యోగము నిరాక్షేపణము నెరవేర్చితినని న్ని నేను హైద్రాబాదు వెళ్ళి వికాలత్ చదువదలచితినని న్నీ ఒకవేళ తాము రు. 15 జీతము యిచ్చినచో యింకా కొంతకాలము ఉండెదని న్నీ వ్రాయుమని సలహా యిచ్చెను. ఈ విషయము నాకిష్టములేదు. అయినను ఆయన మాటను త్రోసిబుచ్చజాలక రాజీనామాలో ఇవే విషయము వ్రాసి జమీందారు వద్దకు పంపితిని. శ్రీ రాజా వెంకట నరసింహరావు జమీందారుగారు 70 సంవత్సరముల వయోవృద్ధుడు. ఆయన మంచము మీద పరుండేవాడు. హుజూరు గుమాస్తా కాగితములను తీసుకొని వెళ్ళి ఆయనకు చదివి వినిపించుటయు అందుపైన ఆయన చెప్పినట్లు ఆర్డరు వ్రాసి సంతకము తీసుకొనే ఆచారముండెడిది. నా రాజీనామా దరఖాస్తును వంగీపురము నరసింహా చార్యులుగారనే హుజూరు గుమాస్తా రాజాగారికి చదివి వినిపించినాడు. రాజాగారు కూడ పాతకాలపు వాడే గనుక తన చిన్నతనములో కొంత పారసీ చదివిఉండెను. నా దరఖాస్తు అందిన తరువాత మన పేష్కారుకు పారసీ, ఉర్దూ వచ్చునని చెప్పలేదేమని అనెనట. ఆరోజున ఏమి ఆర్డరు కాలేదు. మరురోజు పైన ఉంచబడెను. మరురోజున హుజూరు గుమాస్తా గారు మరల రాజాగారికి జ్ఞప్తితెచ్చిరి. మరురోజు ఆయనయిట్లని నాదరఖాస్తును అంగీకరించెను.

"మన పేష్కారు పారసీ, ఉర్దూ చదువుకున్నవాడు. ఆయనకు రు. 5 జాస్తి జీతం యివ్వడము నాకు యిష్టమే. అయినను ఆయన వికాలత్ చదివి వృద్ధి కాదలచుకున్నాడు. కావున ఆయనను ఆపడము మంచికాదు. దరఖాస్తు అంగీకరించి రావలసిన జీతము యివ్వవలసినది."

శ్రీ రాజాగారికి దైవికముగా యిలాటి సద్బుద్ధి కలుగుట నా భావి శుభ సూచకము అని నేటికిని జ్ఞాపక ముంచుకొనుచున్నాను. మరురోజు పేష్కారి హెూదాతో సంబంధించిన యావత్తు రికార్డు నూతన నియమితులు అయ్యామాచార్యుల గారికి వప్పగింతపెట్టి రావలసిన జీతము తీసుకొని సీతారామ నరసింహగారి సెలవుపొంది యింటికి ప్రవేశించితిని. ఇది బహుశా 1906 సంవత్సరము అక్టోబరు నెల అయి ఉంటుంది. ఇంటికి ప్రవేశించిన తరువాత భాషాభివృద్ధికొరకు లక్ష్మీకాంతరావుగారివల్ల కొన్ని ఉర్దూ పుస్తకములు తెప్పించుకొనుటయేగాక మొఖబిర్ దక్కన్ అనే వారపత్రికను తెప్పించి చూచేవాడను. వారం రోజులకు ఒక పర్యాయము పరిటాలవెళ్ళి శబ్దార్థములను సందేహములను తెలుసుకొని వచ్చెడివాడను. నేను రోజు అంతయు భాషాభివృద్ధికే వినియోగించుచుంటిని. సాధారణముగా హైద్రాబాదులో వికాలత్ పరీక్ష డిశంబరు నెలలో జరుగుచుండెడిది. లా కమిటీ జనవరి నెలాఖరు నుంచి ప్రారంభించ బడెడివి. 2 మాసములే నాకు అవకాశమున్న దనుకొని ప్రయత్నము చేయుచుంటిని. కాని దైవికముగా ఆ సంవత్సరము పరీక్షలు డిశంబరుకు బదులు జనవరి నెలాఖరులోనో ఫిబ్రవరి మొదటి వారములోనో జరిగెను. మా బంధువు ఆల్లూరు వెంకటసుబ్బారావు గారు నాకంటె వయస్సులో 2 సంవత్సరములు చిన్నవాడు. అంతను ఆ సంవత్సరము వకాలత్ చదివి పరీక్షయిచ్చి యింటికివచ్చెను. నేను వెళ్ళి అతనిని కలిసితిని. ఒకరోజు శిక్షణలను గురించి అనగా లా చదువుటకు కావలసిన భాషాజ్ఞానము బోధనాపద్ధతులు, పుస్తకములు, ఫీజులు మొదలగు విషయములన్నియు సాకల్యముగా మాట్లాడితిని. మా యిద్దరి సంభాషణల అనంతరము నేను చదువగలనని అతను సదభిప్రాయమిచ్చి ధైర్యము చెప్పెను. అతనుకూడ పరీక్షానంతరము అల్లూరులోనే ఉంటూ ఉండెను. గనుక మేముభయులము ఒకరివద్ద రొకరము వచ్చి వెళ్ళుచు భాషా విషయములను మాట్లాడుకొనుచు కాలము గడుపుచుంటిమి. కొలది రోజులకే లా కమిటీ ప్రారంభింప బడినది. వెంకటసుబ్బారావు ఉత్తరము తెప్పించి నాకు చెప్పెను. నేను హైద్రాబాదు వెళ్లి చదువుట కుద్యుక్తడనైతి.

* * *

# మూడవ అధ్యాయము

*ప్రకరణము - 1*

## న్యాయశాస్త్ర విద్య

1316 ఫసలీ (1917) సంవత్సరము ఫిబ్రవరిలో నేను హైద్రాబాదు వెళ్ళి వకాలతు చదువుటకు దృఢసంకల్పము చేసితి. ధివార నక్షత్ర యుక్తమగు ఒకతేదీని ముందుగానే నిర్ణయించుకొంటిని. ఆ తేదీవరకు వెంకటసుబ్బయ్యగారు రూపాయలు అందజేయజాలకపోయిరి. అంతట మా తండ్రిగారికి స్నేహితుడును, మా భూమిని కౌలుకు తీసుకొని సేద్యముచేయు, ఒక పెద్దమనిషి పొన్నవరం కాపురస్తుడు చావా కోటయ్య అనే ఆయనతో ప్రయాణసంకల్పము, వెంకట సుబ్బయ్యగారి వాగ్దానభంగము చెప్పి ప్రస్తుతము కొంతడబ్బు అప్పు పూర్వకముగా సహాయము చేయుమని కోరితిని అందులకు ఆయన అంగీకరించి రు. 60లు తెచ్చి నాకు యిచ్చెను. అంతకుపూర్వము కొన్నిదినముల నుండి మా నాయనగారికి జ్వరము వచ్చుచుండెను. కామీలావ్యాధి కూడా కనిపించెను. ఆరోజున ఆయన చికిత్సకొరకు వెల్లంకి అనే గ్రామమునకు వెళ్ళెను. నేను మంచిరోజును నిర్ణయించుకొన్నాను. గనుక దైవముమీద భారమువేసి ప్రయాణము సాగించితిని. యెర్రపాలెం వచ్చి, రైలెక్కి మరునా డుదయముకు హైద్రాబాదు రైలుస్టేషనులో దిగితిని. ఆనాడు మా నాయనగారు ఇంటలేనప్పుడు ప్రయాణము ఆపుకొనలేక సాగించితిని. గనుక మా నాయనగారు కొంచెము అసమ్మతి జూపిరని తెలిసినది. తరువాత వ్యాధి తగ్గిపోయినది. ఆయనకు ఆరోగ్యము చేకూరినది.

నేను హైద్రాబాదు రైలుస్టేషనునుండి బాలాగంజు వెళ్ళితిని. అక్కడ మధిర నందిగామ తాలూకా మొదలగు తూర్పు బ్రాహ్మణులు చాలా మంది ఉంటారు. వారు ధర్మశాలలో పడుకుంటారు. వారిలో కొందరు స్మార్తకర్మలు చేయించుచు, కొందరు పురాణములు చెప్పుచు, కొందరు వంటలు చేయుచు, డబ్బు సంపాదించుకొని వెళ్ళు చుండెడివారు. బాలాగంజు అప్పటిదివాన్ మహారాజా సర్‌కిషన్ ప్రసాదుగారి స్వంతజాగీరుకు సంబంధించినదై యుండెను. ఆ గంజులో బియ్యము మొదలగు ధాన్యముల వ్యాపారములు విరివిగా జరుగుచుండెడివి. నాగర్ కర్నూలు మొదలగు చోట్లనుంచి లంబాడీలు ఆవులపైన జొన్నలు బియ్యము మొదలగు ధాన్యముల సంచులు వేసికొని బాలాగంజు (మార్కెటు)కు అమ్మకమునకు తెచ్చెడివారు. వేలాది పల్లాలక్రయ విక్రయలు జరుగుచుండెడివి. నాగర్ కర్నూలు (మహబూబ్‌నగరం) ప్రాంతముల నుండి సన్నని బియ్యము ఆరేకాటీలు చాలా ప్రశస్తమైనవి వచ్చుచుండెడివి. పూర్వము మహరాజా చందూలాలు దివానుగా పనిచేసెను. తరువాత వారి దౌహిత్రుడు మహరాజా కిషన్‌ప్రసాదు బహదూరుగారు రెండు పర్యాయములు దివానుగా పనిచేసిరి. రాజాచందూలాలు తోడరుమల్ వంశీకుడు. ఈ తోడరుమల్ వంశీకులను మొదటి ఆసఫీజా నిజాముల్‌ముల్కు ఢిల్లీనుండి హైద్రాబాదుకు తీసికొనివచ్చెను. పైన చెప్పినట్లు బాలాగంజు మహరాజా కిషన్‌ప్రసాదు స్వంతమునకు చెందినదైనందువలన దానిప్రక్కనే వారి దేవిడీ సమీపముగా ఉండెడిది. బాలాగంజుకు చుట్టు ప్రాకారముకలిగి రెండు ద్వారములు (గేట్లు) ఉండెడివి. గేట్లు సాధారణముగా రాత్రులందు మూయబడెడివి. ఆ బాలాగంజులో తిరువూరు తాలూకా చిట్యాల గ్రామకాపురస్తులు మా గ్రామ కాపురస్తుడు విందమూరి నాగయ్యగారి అల్లుడు మకరాల లక్ష్మికాంతయ్యగారు వంటలు చేసుకొని జీవించుచుండెడివాడు. మొదట ఆయన నందిగామ తాలూకా మునగాలపల్లె అగ్రహారీకుడు. అమరవాది వెంకటప్పయ్యశాస్త్రిగారికి దానముగా దొరికిన ఒక యింటిలో ఉండెడివారు. పరిమి మీనమ్మ, ఆమె కుమార్తె మణెమ్మలు బీదవారు. వితంతువులు అగుటచే పై చెప్పిన యింటిలోనే ఉండెడివారు. మణెమ్మ దివానుగారి భార్యకు తెలుగు చెప్పుచుండెడిది. నేను లోగడ వెళ్ళి మున్షిఆలంలో చేరి వారం పది రోజులు గడిపినదీ ఈ యింటిలోనే. ఆ రోజులలో హైద్రాబాదులో హోటళ్ళు, వసతిగృహములు లేవు. దేవాలయములు, ధర్మశాలలు ఉండెడివి. హైద్రబాదు వెళ్లే కార్యార్థులు ధర్మశాలలో వంట చేసుకొని భోజనము చేసేవారు. కనీసము 2, 3 వీధులకొకటయినను అన్నదాన సత్రములుండెడివి. అచట బీద

బ్రాహ్మణులకు భోజనము దొరికెడిది. నేను ఈ తరగతిలో చేరినవాడను కాను గనుక బాలాగంజు వెళ్ళితిని. పైచెప్పినవారు నాకుపూర్వ పరిచితులే కాబట్టి నా ఖర్చుపైన నాకు అన్నము వండి పెట్టించమని కోరితిని. నేను స్వగ్రామస్తుడను, పూర్వపరిచితుడను అయియుంటిని. ఆ కారణమున వారు నాకు వండి పెట్టుటకు అంగీకరించిరి. అంతకుపూర్వము లక్ష్మీకాంతయ్యగారు స్థలం సంపాదించి స్వంత యిల్లు కట్టుటకు ప్రారంభించెను. అంది చాలా భాగము పూర్తి అయినందున వారు దానిలో ప్రవేశించిరి. అమరవాది వెంకటప్పయ్య శాస్త్రిగారు ఇల్లు కాంతయ్యగారి ఆధీనములోనే ఉండెడిది. ఆ యిల్లు ఖాలిగా ఉన్నందువలన ఉ ండుటకు నాకు యిచ్చిరి. అద్దె లేదు. పనిమనిషి జీతము, దీపపు ఖర్చు నేను పెట్టుకొనేవాడను. నేను వచ్చిన మరురోజు కాంతయ్యగారు నన్ను వెంటపెట్టుకొని కోకాతట్టి బజారులో ఉన్న మౌల్వీమీర్ యిబ్రాహింఅలీ సాహెబు హైకోర్టు వకీలుగారి లా కమిటీకి తీసుకొని వెళ్లెను.

కమిటీ కార్యదర్శి ప్రవేశ రుసుము 2 రూపాయలు. నెల జీతము ఒక రూపాయి పుచ్చుకొని నన్ను లా కమిటీలో ప్రవేశ పెట్టుకొనెను. అది 23 పర్వర్ధీ 1316 ఫసలీ (28-2-1917) సోమవారం కావచ్చునని నా జ్ఞాపకము. లా కమిటీలో ఇబ్రహీంఅలీ సాహెబుగారు ఒక్కరే అద్వితీయమగు లా లెక్చరర్. ఆయన పవిత్రనామము నేను ఆజన్మాంతము మరువజాలను. నాకు కమిటీలో 35వ స్థానము దొరికినది. అప్పుడు పీనల్‌కోడ్ స్టాంపు ఆక్టుపైన లెక్చరు జరుగు చుండెను.

ఆ రోజులలో పాత పద్ధతులపైననే శిక్షణ యిచ్చుచుండెడివారు. ప్రతి శుక్రవారము రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆ వారముతో చదివిన పాఠములను గురించి వ్రాతమూలకముగా పరీక్ష తీసుకొని మార్కులు ప్రకటించే వారు. ప్రతిరోజు ప్రశ్నలువేసి జవాబులు తీసుకొనుచుండెడివారు. తప్పకుండా హాజరు అయినందుకు 4 మార్కులున్ను ప్రశ్నలకు సరియైన సమాధానమిచ్చినం దుకు 6 మార్కులున్ను మొత్తం 10 మార్కులు ఉండెడివి. ఆ మార్కులునోటు చేయబడెడివి. ఈమార్కుల మొత్తమునుబట్టి స్థానములో మార్పు జరుగుచుండెడిది. నాజ్ఞాతి తిరుమలరావు నాకంటే 4, 5 రోజులు ముందే కమిటీలో చేరెను. అతనిది 25వ స్థానము. ఆ వారములో పరీక్ష జరిగినది. కాపీలు అందచేసితిమి. విద్యార్థులసంఖ్య స్వల్పమే గనుక అప్పుడే లెక్చరర్‌గారు మా ఎదుటనే దిద్ది మార్కులు తెలిపెను. నాకు 64 మార్కులున్ను తిరుమరావునకు 27 మార్కులున్ను వచ్చెను.

నాకు సంతోషము, ధైర్యము కలిగెను. నెలాఖరున నాకు 14 లేక 15వ స్థానము లభించెను. నేను శ్రద్ధగా చదువుచుంటిని. కేవలము శాస్త్ర జ్ఞానమునకే కాక భాషా జ్ఞానమునకు ప్రయత్నము చేయుచుంటిని. కేవలం లాపుస్తకములు ఉర్దూ లోనే ఉన్నవి. మా లెక్చరర్‌గారు చదివి గ్రహించుట కనువగునటుల ప్రతి చట్టమునకు తేటతెల్లమగు సంగ్రహమును వ్రాసి అచ్చువేయించి ముఖ్యముగా విద్యార్థులకు విక్రయించేవారు. ఆకమేటీలో ఒక ముద్రణా యంత్రము కూడా ఉండెను. చదివినంతవరకు చిలుక పాఠమువలెగాక తాత్పార్య యుక్తముగా గ్రహించి గట్టిగా చదువుచుంటిని. ఏప్రియల్ మాసాంతమువరకు విద్యార్థుల సంఖ్య 300 వరకు పెరిగెను. నేను 2వ స్థానము నాక్రమించగలిగితిని. దీనివలన నేను చదివి పరీక్షలో గెలుపొంద గలుగుదుననెడి ధైర్యము నాకు కలిగినది. నేను లెక్చరర్‌గారి దృష్టిలోకూడా మంచిస్థానమును సంపాదించగలిగితిని. ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక మహమ్మదీయ సజ్జన విద్యార్థులెందరో స్నేహితులయిరి. నేను ఎక్కువమార్కులు సంపాదించుచు 2వ స్థానమునందుటచే వారందరు నన్ను మర్యాదగాను ప్రేమతోను సంబోధించి మాట్లాడుచుండిరి. సామాజిక కట్టుబాటు లనుబట్టి నాకు భాషలోనేకాక వేషములోకూడా మర్పు చెందవలసి వచ్చినది. 3 నెలలలో పెద్దమార్పు గలుగచేసికొన గలిగితిని. రూమి టోపిని మాత్రము ధరించుటకు నా ప్రకృతి అంగీకరించనందున ఎప్పుడును రూమి టోపినిమాత్రము ధరించలేదు.

నేను చదివే లా పరీక్షకు వకాలత్ దర్జెసువ్వం (III వ తరగతి ప్లీడరి) అంటారు. విద్యార్థి ఏ విద్యా పరీక్షలో ఉత్తీర్ణుడు కావలసిన అవసరము లేదు. భాషాజ్ఞానము ఉంటే చాలు. యిదిగాక యింకా రెండు పై తరగతులుంటవి. వాటిని వకాలతు దర్జెదువ్వం, వకాలతు దర్జెఅవ్వల్ అంటారు. రెండు తరగతులకు నియమములు సమానమే. గాని విద్యార్థి మెట్రిక్యులేషన్ లేక తత్సమానమైనవి ద్యాపరీక్షలోగాని వకాలతు దర్జెసువ్వంలోగాని ప్యాసయి ఉండవలయును. రెండు సంవత్సరములు గౌర్నమెంటు కాలేజీలో లెక్చర్లు వినవలయును. లేదా 7 సంవత్సర ములు మూడవ తరగతి ప్లీడరుగా పనిచేయవలెను. 1, 2, 3 తరగతుల వకాలతు పరీక్షలు ఒకే పర్యాయము, ఒకే తేదీలలో ఒకే కేంద్రములో ప్రారంభించబడేవి. 3వ తరగతి పరీక్షలో 4 రోజులు (8 పేపర్లు) 1, 2 తరగతి పరీక్షలు 6 రోజులను (12 పేపర్లు) జరిగేవి. మొదటి 8 పేపర్లు ఒకే విషయమును గురించి సామాన్య ముగా నుండెడివి. 1, 2తరగతుల ప్రశ్నాపత్రుల స్థాయి ఉన్నతముగా నుండెడిది.

3వ తరగతి అభ్యర్థి ప్రతి పేపరులో నూటికి 30 చొప్పున రెండవ తరగతి అభ్యర్థి నూటికి 40 చొప్పునను మొదటి తరగతి అభ్యర్థి నూటికి 50 చొప్పునను మార్కులు తెచ్చుకొన వలయును. ఒకదానిలో తప్పినను సాంతము తప్పినట్లు అగును. అనగా కంపార్టుమెంటు పద్ధతి లేదు.

ఇదిగాక జుడిషల్ పరీక్ష అని ఒక న్యాయశాస్త్ర పరీక్ష యుండెడిది. యిది జడిషలణ ఉద్యోగముల కొరకు ఏర్పడినది. దీనికిని ఏ విద్యాపరీక్షలలో ప్యాసు కానవసరములేదు గాని లా కాలేజీలో రెండు సంవత్సరములు హాజరు విధిగా నుండవలయును. దీనిలో కూడా మార్కులనుబట్టి మొదటి తరగతి, రెండవ తరగతి ఉండెడివి. ఉత్తీర్ణులయినవారు కోరినచో అదేతరగతి ప్లీడరు పట్టా యిచ్చే వారు. వకాలతు 1, 2 తరగతుల పరీక్షులకును జుడిషల్ పరీక్షకును భేదము వుండేది.

1. వకాలతు పరీక్షలో చేరువారు పై జెప్పినవిధముగా మెట్రిక్యులేషను 3వ తరగతి ప్లీడరు పరీక్షలో ప్యాసయి ఉండవలయును.

2. వకాలతు పరీక్షలలోని అన్ని ప్రశ్నా పత్రములకు జవాబు యిచ్చి ఒకేసారి ఉత్తీర్ణులు కావలయును. జడిషనల్ పరీక్షలో 5 భాగములు కావింపబడి 5 పర్యాయములు పరీక్షయిచ్చి ఉత్తీర్ణులు కావచ్చును.

3. జుడిషల్ పరీక్షలో సివిల్ క్రిమినల్ తీర్పులు వ్రాయవలసి ఉండెడివి. వకాలతులో తీర్పులు వ్రాసేప్రశ్న ఉండెడిదిగాదు. కొన్ని పుస్తకములు మాత్రము జాస్తి ఉండేవి.

ఉస్మానియా యూనివర్సిటీ ఏర్పడి ఎల్.ఎల్.బి. పరీక్షలు ఏర్పడే వరకును దానితరువాత కొన్ని సంవత్సరముల వరకును కూడా వకాలతు పరీక్షలు జరుగు చుండెడివి. జుడిషల్ పరీక్షలు మాత్రము 1335 ఫసలీ (1926) సంవత్సరములో తీసివేయబడెను. ప్రభుత్వమునకు తీసివేయు సంకల్పము 1332 ఫసలీ నుండియే కలిగినను పొడిగించు నియమ నిబంధనలను సవరించుచు వచ్చినందున ఈ మహోదయ పర్వము చాలామందికి పరీక్ష యిచ్చుటకు అవకాశము లభించి యుండెను.

హైద్రాబాదు 1, 2 తరగతుల న్యాయవాదులలో 100కి 90 మంది జుడిషల్ పరీక్ష యిచ్చి పట్టా పొందినవారే. వకాలతు పరీక్షలు బహుకఠినముగాను, ఉత్తీర్ణుల సంఖ్య బహుస్వల్పముగాను ఉండెడిది. 3వ తరగతి పరీక్ష 1319

ఫసలీతోను, 1, 2 తరగతుల పరీక్షలు 1360 ఫసలీలోను తీసివేయబడెను. 3వ తరగతిలో నూటికి ముగ్గురు చొప్పునను 20 తరగతిలో నూటికి 1, 2 చొప్పునను 1వ తరగతిలో ఎప్పుడో ఒక్కరును ఉత్తీర్ణుడయితే కావడము ఉండేది. ఈ కారణ మున గత్యంతరము లేని కొందరు తప్ప సాధారణముగా తక్కినవారు ఈ పరీక్షలో చేరలేక పోవుచుండిరి. నేను ప్రవేశించిన లా కమిటీలో మూడవ తరగతి పరీక్షకు వెళ్లే విద్యార్థులేగాక 1వ 2వ తరగతి లా పరీక్షలకును జుడిషల్ పరీక్షలకు వెళ్ళే విద్యార్థులు 18 లా పుస్తకములపైన యిచ్చేలా లెక్చరులకు వచ్చి శిక్షణ పొందుచుం డెడివారు. నేను మాత్రము ఈ కఠిన నియమమునకు లోనై 1వ తరగతి పరీక్షలో ప్యాసయితిని. దానిని ముందు వ్రాసెదను.

నేను పట్నం ప్రవేశించిన 2 నెలలకు లక్ష్మీనారాయణ అనే కాన్‌కుబ్జ బ్రాహ్మణ విద్యార్థి పరిటాల నుండి వచ్చి తానుకూడా లా కమిటీలో ప్రవేశించి చదివెను. అతని తండ్రి గులాబ్‌సింగు. పరిటాల జాగిర్దారు తరపున ఉద్యోగి. ఏదో బజారులో పరిచితులవద్దనే ఉండి చదువుకొనుచు సాయంత్రము నావెంట కమీటీకి వచ్చేవాడు. లెక్చరు పూర్తికాగానే ఎవరి బసకువారు వెళ్లేవారము. లెక్చరు కాలము సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 10 వరకు ఉండెడిది. కాబట్టి చాలామంది ఉద్యోగస్తులు ఆఫీసులు మూసిన తరువాతవచ్చి చేరుటకవకాశ ముండెడిది. లక్ష్మినారాయణ మాతృ భాష ఉరుదు గనుక అతనితో పగలంతయు ఉరుదులోనే ప్రసంగము చేసెడివాడను. ఇది కూడా భాషాభివృద్ధికి దోహదమ యినది. ఎప్రియల్ మాసాంతమున మున్సఫ్ మేజస్ట్రేటు సుదర్శనరావుగారు జాగీరు పెద్ద ఉద్యోగస్తులతో మాట్లాడుటకు పట్నంవచ్చి నా కృషి నా మార్కులు చూచి సంతృప్తిని వెల్లడించి తప్పక ప్యాసు కాగలనని ఆశీర్వదించెను.

3 సంవత్సరములు ఉరుదు, పారశి భాషలకు దూరమై నిరాశచెంది కృషించిన నాకు 3 మాసములల కొంత భాషాజ్ఞానము శాస్త్ర పరిచయము సద్గోష్ఠికృషి ఫలితముగా లభించినది. అనగా యెండినచెట్టు చిగిర్చినట్లయినది.

300 మంది విద్యార్థులలో 2వ స్థానమాక్రమించి లెక్చరర్‌గారి దయకు పాత్రుడ నైనందుకు నాలో నవజీవము నూతనోత్సాహము కలిగెను. మే నెలారంభ మున మా బావమరిది హనుమంతారావు వివాహము తటస్థించినందున వివాహ మునకు పరిటాల వెళ్ళితిని. సేవకా వృత్తి నవలంబించి మానసిక బాధ పడుట మాని తెలివి తేటలతో వకాలత్ చదువుచున్న నన్ను చూచి బంధుమిత్రులు సంతోషించిరి. కన్యకు పినతండ్రి మాదిరాజు కామేశ్వరరావుగారు. వరుసక

సహోదరుడు. అనగా ముత్తాత ఒక్కరే. ఆయన తహాశీల్దార్లకు సలహా యివ్వగల వ్యవహార దక్షుడు. నాయందు ప్రేమగలవాడు. నన్ను ఒక నిమిషము కూడ విడిచిపెట్టక ప్రశ్నలు వేయుచు తన అనుభవములను తెలుపుచు నా ఉత్తరములకు తృప్తిపడుచు నీవు మన శాఖ, మాదిరాజువారిలో వకీలు పరీక్ష యిచ్చి కుటుంబ గౌరవమును కాపాడవలెనని ఆదేశించెను.

వివాహానంతరము 6 వ రోజున బయలుదేర నిశ్చయించుకుంటిని. 7 మాసముల గర్భిణితోనున్న నా భార్య పుట్టినింటనే ఉండెను. నేను తీసుకొని వెళ్ళిన రు. 60/– కమిటీ ఫీజులు, పుస్తకములు, బట్టలు కొనుటకును భోజనమున కును ఖర్చు అయిపోయెను. యద్దనపూడి వెంకటసుబ్బయ్య గారిని డబ్బు అడిగితిని. ఆయన రు. 30/–లు యిచ్చిరి. తక్కినవి మనియార్డరు చేయుచుందునని నమ్మకముగా జెప్పెను.

ఈ మధ్య మా నాయనగారు పూర్ణారోగ్యమును పొందిరి. గాని పినతండ్రి గారి మరణానంతరము వారికి తటస్థించిన ఉదాసీనత, పిరికితనము నేను చేతి క్రింద నుండుటవలన కొంతతగ్గెను. గాని నేను పట్టం వెళ్ళగానే తన పూర్వా భిప్రాయానుసారము కుటుంబమును నీలికుర్తికి మార్చుటకే దృఢనిశ్చయము చేసికొనెను. ఎద్దులను అమ్మివేసి ఆవులను నీలకుర్తికి పంపి, భూములను కౌళ్ళకు యిచ్చి ప్రయాణమునకు సిద్ధముగానే ఉండెను. గాని నా భార్య ప్రసవమగుటయు యిత్యాది ఈతిబాధలు తటస్థించినందున ప్రయాణము వాయిదాలు వేయబడు చుండెను.

కారణాంతరములచే కొన్ని రోజులు పట్నంలో నేనే వంటచేసికొని తినే వాడను. ఉదయం 9 గంటలకు వంటచేసికొని, భోజనముచేసి చదువుకొనుట మొదలుపెట్టి సాయంత్రము 4 గంటల రాత్రికి వచ్చి పరుండెడి వాడను.

నాభార్య జ్యేష్ఠ మాసాంతమున ప్రసవమైనది. ఒక మగశిశువు కలిగినాడు. బారసాలకు రమ్మని మా మామగారు నన్ను కోరిరి. గాని పాఠములు పోవునని నేను పరిటాల వెళ్ళలేదు. ఆ పిల్లవానికి సత్యనారాయణ అని నామకరణము చేసిరి. పట్నములో లక్ష్మీనారాయణ నేను చదువుచుంటిమి.

సెప్టెంబరు నెలాఖరు వరకు విద్యార్థుల సంఖ్య 600ల వరకు పెరిగినది. మొదటి స్థానమున మాణిక్యరావను మహారాష్ట్ర బ్రాహ్మణుడును, రెండవ స్థానమున

నేనుంటూ ఉంటిమి. వార పరీక్షలు జరుగుచునే ఉండెడివి. ఒక వారములో నాకు 95 మార్కులు కాపీపైన వేసి కమిటీలో అందజేసిరి. వానిని చూచి గర్వపడి పొంగిపోతిని. మరురోజు బోర్డుపైన రిజల్టు కాగితము అంటించబడెను. అందులో మొదట రామచంద్ర త్రయింబకరావనే విద్యార్థి పేరు వ్రాయబడి ఆయన సంపాదించిన మార్కులు 97 వ్రాసియుండుట జూచి గర్వముమాని సిగ్గుపడితిని. కాని ఈశ్వరసృష్టిలో ఒకరిని మించిన సమర్థులు మరియొకరుంటారని గ్రహించి సిగ్గును మానితిని.

ఆ సంవత్సరం జూన్ నెల తరువాత కొన్ని నూతన రాజ్యాంగ విషయములను గ్రహించ గలిగితిని. లార్డుకర్జన్ బెంగాలు విభజన చేసినందున ప్రజలు తీవ్రాందోళనము చేయుచున్నారనియును దాదాభాయి నౌరోజి ఇండియాకు స్వరాజ్యము రావలెనని చెప్పినాడు గనుక ప్రజలు స్వరాజ్యమును కోరుచున్నారనియును, బాలగంగాధర తిలక్ ప్రజలకు విదేశ వస్తు బహిష్కరణము, స్వదేశ వస్తు ప్రోత్సాహము బోధించినాడనియును బెంగాలులో రహస్య సంఘముల ద్వారా ఆంగ్లేయులకు విరుద్ధ ప్రచారమే గాక మారోఫరంగి (ఆంగ్లేయునికొట్టు) అనే నినాదము, వందేమాతర నినాదము చేయచున్నారనియును ఖదీరాంబోస్ అనే బెంగాలు దేశభక్తుని ఉరితీసినారనియు వార్తలు వింటిని. విద్యార్థులు ఈ వార్తలను బాగుగా చెప్పుకొనుచు ప్రబోధము సాగించిరి. ప్రజలలో ముఖ్యముగా విద్యార్థులలో రాజకీయ చైతన్యము కలిగినది. కమిటీ 5 నుంచి 10 వరకు జరుగుచుండునని పైన వ్రాసితినిగదా. లెక్చరరుగారు 8 గంటల రాత్రివేళ అర గంట కాలము లెక్చర్ ఆపి బ్రాహ్మణునితో హిందువులకును ముస్లిములతో ముస్లిములకును తేనీరు చేయించి యిప్పించెడివారు. ఈ ఆందోళన అనంతరము తేనీరులో విదేశ పంచదార వేయకూడదని విద్యార్థులు కోరినందున స్వదేశీ యెఱ్ఱ పంచదార తెప్పించి వినియోగించడము ప్రారంభము చేయబడెను. విదేశి టోపీలను, ఉన్ని మిల్లుబట్టలను, పెన్సిళ్లను కొనుట మానివేసితిమి. మకరాల కాంతయ్య ఉత్సాహి, తీవ్రవాది. ఆయనయు మరికొందరు బ్రాహ్మణులును ఏదో వేళకు నావద్దకు వచ్చి వార్తలు వినిపించుటయు మనోభావముల తెలుపుటయు చేసెడివారు. ఆంధ్రకేసరి లేక దేశమాత అనే ఒక పత్రికను కూడ తెప్పించి చదివెడివారము. అదే రోజులలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి మీద వచ్చిన స్వరాజ్యపత్రిక కేసు, లజపతిరాయ నిర్బంధము యిత్యాది విషయములను వినుచు చర్చించుకొనుచు బ్రిటీషు గవర్నమెంటు యెడల ద్వేషభావములను వెల్లడించుకొను

చునుంటిమి. మౌల్వియిబ్రాహీం అలీ సాహెబుగారు లాయరువృత్తిలో అంత ప్రముఖుడుగా చెప్పుకొనబడలేదు. గాని బోధనా విషయములో మాత్రము మంచి ప్రతిష్ఠ సంపాదించెను. ఆయనకు మత పక్షపాతము బొత్తిగా నుండెడిది కాదు. శిష్యవర్గములో హిందువుల సంఖ్యయే యెక్కువ. శిష్యులను కన్నబిడ్డలవలె చూచెడి స్వభావముగల గురువు.

ఆబాన్ (సెప్టెంబర్) నెలాంతమున పరీక్ష దరఖాస్తులు పంపవలెను. నియమానుసారము ఫీజుసహా దరఖాస్తు యిచ్చితిని. పరీక్ష తేది సమీపించినది. వార పరీక్షలు మంచికట్టుబాట్లలో జరిగెడివి. అనగా కాపీ జరిగేదికాదు. అందు నేను భయస్తుడను. కాపీ చేయుటకును, చేయించుటకును యిష్టపడెడి వాడనుకాను. గాని పరీక్షకు వారము రోజులముందు నాతోను యింకొక 8–10 మంది తెలివిగల విద్యార్థులతోను మా లెక్చరర్ ఏకాంతమున పిలిచి పరీక్షలో తోడి సోదర విద్యార్థులను కూడా తీసికొనివెళ్లుట మానవ ధర్మమని సూత్రప్రాయముగా నుపదేశించెను.

1, 2, 3 తరగతుల పరీక్షలు హైకోర్టులో జరిగెడివి. హైకోర్టు ముందు మైదానములో మా లెక్చరర్‌గారు ఒక డేరావేసి విద్యార్థులను కూర్చుండబెట్టి పరీక్ష విషయము బోధించుచు కనీసము 50 ప్రశ్నలు వాటి ఉత్తర్వులు చెప్పినాడు. ఆ బోధ, ఆ పరిశ్రమ చాలా లాభకారిగ నుండెడిది. 4, 5 ప్రశ్నలు అయినను ప్రస్తావించిన వాటి నుండి వచ్చెడివి. ఫీజును రు 3/– లు యివ్వవలసి వచ్చెడిది. నేను కూడా అందులో జేరితిని. పరీక్ష హాలులో నాలైనులోనే గంగాధరరావు అనే విద్యార్థి కూర్చొనియుండెను. ఆయనకూడ మా కమిటీ విద్యార్థియే. పినల్‌కోడ్ పేపరు చాల కఠినముగా నీయబడెను. నేను నిర్లక్ష్యముగా వ్రాయుచుంటిని. అతడు బాగుగా చదివినవాడే. అతనికి నా సంగతి బాగుగా తెలియును. గద్గద స్వరముతో కోటేశ్వర్‌కి జ్వరం వచ్చినది. మౌల్విసాహెబు మాట జ్ఞాపకము చేసికొని నన్ను బచాయించు (కాపాడు) అనెను. అది నా హృదయమును కరిగించినది. పేపరు త్వరలో వ్రాసి ముగించితిని. అతని మాటవిని పేపరులోని ప్రతిఉత్తరమును నెమ్మదిగా అతనికి వినబడునట్లుగా చదువనారంభించితిని. అతను కూడ తెలివి గలవాడే గనుక గ్రహించి జవాబులు వ్రాసుకొనెను. గడువులోపల కాపీని యిచ్చివేసి బయటికి వచ్చితిని. 4వ పేపరు (గష్తియాత్ మాల్గుజారి)తో సంబం ధించినది ఒకేఒక రివిన్యూ విషయప్రశ్న 50 మార్కులు గలదియు 1, 2 ప్రశ్నలు స్టాంపు

యాక్టు ఆర్డినల్సుతో సంబంధించినదియు ఉండెను. ఏమో వ్రాసితిని. నమ్మకము పోయినది. కోర్టు ఫీయాక్టులో ఫీ ఫెనాల్టి ఎట్లా వసూలు చేయబడును అనే ప్రశ్నయుండెను. దానికి 8 మార్కులు. దాని సమాధానము మొదట కోర్టు ఫీ స్టాంపు రూపముగాను, పినాల్టి నగదు రూపముగాను చెల్లించబడును అని వ్రాసితిని. గాని పేపరు సరిచూచుకొనుచుంటిని. ఇంతలో పైజెప్పిన గంగాధరరావు అతని స్నేహితుడు హనుమంతరావున్ను ప్రశ్నకు సమాధానము యీ రెంటిని జుర్మానావలె నగదు రూపమున వసూలు చేయుదురని వ్రాసి వినిపించుకొనుచుండిరి. అది నాకు వినబడినది. దురదృష్టవశాత్తు నా బుద్ధి తిరిగిపోయినది. మొదటి సమాధానము కొట్టివేసి ఈ సమాధానము వ్రాసి కాపి యిచ్చివేసితిని. హాలు నుంచి బయటికి రాగానే మా లెక్చరర్ ప్రశ్నలకు సమాధానములు వినిపించెను. నా తప్పును నేను గ్రహించగలిగితిని. అన్ని పేపర్లలో 50కు మించిన మార్కులు వచ్చునని గట్టి నమ్మకముండెను. గాని ఈ పేపరులో 34 వరకు ఆశపెట్టుకొని ప్యాసు కాగలనని అనుకొనుచుంటిని.

పరీక్షానంతరము మరురోజే బయలుదేరి పరిటాల వచ్చితిని. అచ్చట రెండు రోజులు మాత్రముండి నా భార్య కుమారుని తీసుకొని జగన్నాధపురము వచ్చితిని. వారం రోజులలోనే మా పినతండ్రిగారి కోరికపై నీలికుర్తి వచ్చితిని. నీలికుర్తిలో 10 రోజులుంటిని. మా నాన్నగారు అదివరకే కొన్నాళ్ల నుండి నీలికుర్తిలో నుండిరి. ఉభయులము జగన్నాధపురము వచ్చితిమి. అంతకు వారం రోజుల క్రితము నా భార్యకు మూర్ఛలవ్యాధి ప్రారంభమాయెను. అపాయకరమైన వ్యాధియని భయపడసాగిరి. తుదకు మా అత్తగారు వచ్చి పరిటాలకు తీసికొని పోయెను. మంగలి వైద్యులు చికిత్స ప్రారంభించిరి. వాతపైత్య వ్యాధియని నిదానము చేసిరి. మందులు పథ్యము ప్రారంభించబడెను. ప్రతిరోజు 1 మొదలు 6 పర్యాయముల వరకు మూర్ఛలు వచ్చుచుండుటచే కమ్మలు లేక కొమ్మలు అనిన్ని ప్రాణభయము లేదనిన్ని వైద్యులు చెప్పినందున నేను ఆమెను వదలి యింటికి వచ్చితిని.

తరువాత మా తమ్ముడి ఉపనయనము వివాహము తటస్థించినది. అది కుంటముక్కలలో జరిగెను. శ్రీ కాళేశ్వరరావుగారు అంతకు 3 సంవత్సరముల క్రిందటి నుంచి బెజవాడలో ఉంటూ ప్లీడరి చేయుచుండిరి. వివాహమునకు వారును 3వ రోజున కొండపల్లిలో దిగి కుంటముక్కలకు ఒంటెద్దు బండిపైన

వచ్చిరి. కొండపల్లికి కుంటముక్కల 6 మైళ్ళ దూరముగానుండెడిది. మా తమ్ముని వివాహము తరువాత 4వ రోజున బండిపైన నేను శ్రీ కాళేశ్వరరావుగారు బెజవాడకు బయలుదేరితిమి. మార్గమధ్యమున సుమారు 16 మైళ్ళు ఉన్నది. మధ్య తాడేపల్లిలో 15 నిమిషములు మాత్రము నిలచి మరల బయలుదేరితిమి. అప్పటికింకను టీ, కాఫీలు వ్యాపించనందున మేము అట్టి అనుష్ఠానములు చేయకనే బయలుదేరితిమి. దారిలో నేను హైదరాబాదు సంగతులు నా చదువు కార్యక్రమము, స్వదేశోద్యమ ప్రచారమును గురించి కొన్ని మాటలు చెప్పితిని. వారు అప్పటివరకు భరత ఖండమందంతటను వ్యాపించియున్న స్వతంత్ర వాంఛ విదేశ ప్రభుత్వము వలన కలుగుచున్న బాధలు స్వరాజ్య పత్రికా కేసు స్వదేశ వస్తు ప్రోత్సాహము మొదలగునవి ఎన్నియో అమూల్యములగు విషయములు నాకు బోధించిరి. సురాజ్యమునకును స్వరాజ్యమునకు గల తారతమ్యమును నాకు చక్కగా బోధించిరి. శ్రీ కాళేశ్వరరావుగారి హితవాక్యములలో కొన్నిటిని యిప్పటికిని యథాతథముగా జ్ఞాపక ముంచుకున్నాను. నేను బెజవాడ చేరి మా నాయనగారు చెప్పిన కొన్ని వస్తువులను బట్టలను కొనుక్కొని మరునాడు కుంట ముక్కల చేరితిని. వివాహానంతర మందరము జగన్నాధపురము వచ్చి గృహ ప్రవేశము, 16 రోజుల పండుగ తరువాత నా భార్యను మరల చికిత్స కొరకు పరిటాల పంపితిని. రోగము నెమ్మదించలేదు. ఆయుర్వేద వైద్యుడు పెన్నా సత్యనారాయణగారి సలహాపైన నా భార్యను బెజవాడ తీసికొని కాళేశ్వరరావు గారింటికి వచ్చితిని. అచ్చట పూర్వ పరచితుడైన డాక్టరు వెంకటస్వామి నాయుడు గారికి చూపించితిని. వారు ఈ రోగము హిస్టీరియా అనియు ప్రాణభయము లేదనియును చెప్పెను. బీదవాడను విద్యార్థిని అని చెప్పినందు రు. 25/–ల కట్నముకు ఒప్పుకొనెను. గాని నేను ఉరుదు వచ్చిన వాడను గనుక ప్రతిరోజు ఉదయము 9 గంటల నుంచి తన బండిపైన తనతో తిరుగుచు తనతో ఉరుదు భాషనే మాట్లాడమని కోరెను. నేనట్లే చేసితిని. వారు చికిత్స ప్రారంభించిరి. నెల రోజులలో నా భార్యకు రోగము నెమ్మదించినది. డాక్టరుగారికి అనుకున్న ప్రకారము డబ్బు యిచ్చితిని. వెళ్లే సంకల్పములో నుండగానే మా బావమరది, హనుమంతరావు వచ్చి నీవు పరీక్షలో తప్పినావని చెప్పెను. ఈవిషాద వార్త వినుటచే కొంచెం శాంతించుచున్న మనస్సు మరల చెదరిపోయెను.

* * *

*ప్రకరణము - 2*

# పునఃప్రయత్నము

బెజవాడ గ్రామములో తీవ్రముగా కలరా వ్యాపించెను. రెండు ఒంటెద్దుల బండ్లను తీసికొని బయలుదేరి పరిటాల చేరితిమి. ముందు కర్తవ్యమూహించ జాలక దిగులుతో 2 మాసములు గడిపితిని. నిరుద్యోగిగానున్న నన్ను గురించి మా నాయనగారు విచారపడుచుండిరి. నేను మా పినతండ్రిగారి సహాయము కోరుటకు నీలికుర్తి వెళ్ళితిని. అక్కడ ఒక మాసముండి వారిని డబ్బు అడిగితిని. వారు విచారించెదను ఉండుమనిరి. ఇంతలో ఒక రోజున ఆ తాలూకా పోలీసు ఇన్‌స్పెక్టరు శ్రీ పాపిరెడ్డి అనే ఆయన అదే పురములో మకాము చేసెను. అచ్చటికి మా పినతండ్రిగారితో నేనుకూడ వెళ్ళితిని. మా బంజరులో హిస్సాదారు రావుల లచ్చయ్య అనే రెడ్డి దేశముఖ్ కూడ వచ్చెను. పాపిరెడ్డిగారితో చెప్పి నాకు ఏదైనా నౌకరిప్పించుమని మా పినతండ్రిగారు లచ్చయ్యగారినికోరిరి. లచ్చయ్యగారు పాపిరెడ్డిగారికి సిఫారస్సు చేసిరి. పాపిరెడ్డిగారు కూడ నావలెనే లా కమిటీలో చదివి 3వ తరగతి వకీలుఅయి తరువాత పోలీసు యినిస్పెక్టరుగా నియమింప బడెను. ఆయన నన్ను పిలిచి నాచదువు, విశేషమును మార్కులను గురించి విచారించెను. ఆయన నీవు యింత తెలివిగా చదివి దురదృష్టవశాత్తు ఒకసారి తప్పినంత మాత్రమున నిరాశ జెందకూడదనిన్నీ మరల చదువవ లసినదని చెప్పెను.

మఱియు మా పినతండ్రిగారితో నిట్లనెను. ఈయనకు నేను ఎక్కువలో యెక్కువ 9, 10 రూపాయల జీతముతో దఫేదారు ఉద్యోగము ఈయగలుగుదు ననియును అందువలన యీయన ఆశలు అడుగంటి జీవితము చెడిపోవునని

యును కొంచెము కష్టపడి చదివించుమనియును చెప్పెను. అందుపైన మా పిన తండ్రి గారు తాను డబ్బు సహాయము చేసెదనని చెప్పి రు. 35/– హాలీలు నాకు యిచ్చిరి. నేను జగన్నాథపురమువచ్చి 8, 10 రోజులలో అనగా సెప్టెంబరు మాసములో హైద్రాబాదు వెళ్ళితిని. బాలాగంజు చేరి ఎప్పటి యింటిలోనే ఉంటిని. రెండవ సంవత్సరము కాంతయ్యగారింటిలో భోజనము చేయుచుంటిని. కమిటీలో ప్రవేశించి చదువ ప్రారంభించితిని. ఆ సంవత్సరము చాలమంది స్నేహితులు కూడ కమిటీలో చేరిరి. వారిలో సోదరుడు తిరుమలరావు, మా నీలికుర్తి సమీప గ్రామస్థుడు. కొమర్రాజు సదాశివరావు అనే విద్యార్థులుండిరి. శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారు కూడా ఆ సంవత్సరము అదే కమిటీలోచేరి చదువుచుండెను. కొమర్రాజు సదాశివరావుతో ఆయన తల్లికూడ ఉండెను. ఆయన సుప్రసిద్ధ భాషాసేవకుడగు కొమర్రాజు లక్ష్మణరావుగారి జ్ఞాతికూడ అయిఉండెను. ఆయనతో నాకు స్నేహము దినదినాభివృద్ధి కాజొచ్చెను.

1317 ఫసలీ 27 ఆబాన్ తేది సాయంకాలము లెక్చర్ సమయమున పరీక్ష దరఖాస్తు రేపు దాఖలు చేయవలసి ఉంటుంది. కాబట్టి దరఖాస్తున్ను ఫీజు రూపాయలున్ను రేపు నాకిచ్చినట్టులయితే నేను నెలాఖరులోగా హైకోర్టులో మీ దరఖాస్తులు దాఖలు చేసెదనని లెక్చరరుగారు చెప్పిరి. 28వ తేదీన సాయంకాలం 4 గంటలకు రూపాయలు తీసుకొని కమిటీకి వెళ్లవలెనని బయలుదేరితిని. కమిటీకి మాలాగంజు మధ్య 3 మైళ్ల దూరముంటుంది. ప్రతిరోజు నేను కాలినడకన వెళ్లుచు యేదేని 1, 2 పుస్తకములను చేతబట్టుకొని దారిలో వల్లెవేయుచు వెళ్లెడివాడను. కమిటీ నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి 11 గంటలకు బాలాగంజు వచ్చెడివాడను. షాహఅలి బండవరకు లాంతరు దీపములుండెడివి. అచ్చటనుంచి లాల్‌దర్వాజవైపు 4 ఫర్లాంగులు చీకటిమార్గమున వెళ్ళవలసి ఉండెడిది. ఆపైన బాలాగంజు గేటు తెరిపించుకొని లోపలికి పోవలసి వచ్చెడిది. మార్గమధ్యమున ఆయుధములతో నన్ను అరబులు త్రాగి ఊగుతూ దారిలో కలిసేవారు. ఒకా నొకప్పుడు గోడప్రక్కన ప్రియురాండ్రతో సరససల్లాపాలాడుతూ ఉండెడివారు. ఇది క్రూరమృగములలో చేరిన ఘోరారణ్యముగా కనబడెడిది. దైవానుగ్రహము వలన వారు నాకేమి బాధ కలిగించి యుండలేదు. 28 ఆబాన్ రోజున ఉదయము నుండియు ముసరు పడుచుండెను. అవి దసరా రోజులు. ఆశ్వయుజ శు 2 అని జ్ఞాపకము. ఆ వర్షముచే కాంతయ్యగారు కట్టుకొనుచున్న డాబా యిల్లు కొంత పడిపోయినది. ఇంట్లోవారు విచారపడు చుండిరి. రాత్రి భోజనముకై వారిని శ్రమపెట్టుటకు నా అంతరాత్మ ఒప్పుకొనలేదు. నేను కమిటీ

నుంచి బయలుదేరిన తరువాత ఆ రాత్రి కొమర్రాజు సదాశివరావు వద్ద పరుండి మరునాటి ఉదయం స్వస్థానమునకు రావలెనని అనుకొంటిని. యథాప్రకారము సాయంత్రం 4 గంటలకు యింటి తలుపు మూయుచుంటిని. ఆ యింటికి యెదురుగా ఒకయింటి వరండాలో నందిగామ, మధిరె, సత్తెనపల్లి, గుంటూరు, తాలూకాల యొక్కయు జుజ్జూరు, పరిటాల వాస్తవ్యులగు బ్రాహ్మణులు నవరాత్రులు గనుక ఎచ్చటనో విందు భోజనములుచేసి, నశ్యము పీల్చుచూ కూర్చొని హాస్య ప్రసంగములు చేసికొనుచుండిరి. వారు నన్ను చూచి వర్షము గనుక యీరోజు వెళ్ళవద్దనిరి. గాని నేను వినక హేళనము చేసితిని. వారిలో కొందరు పరిహాస ముగా మాట్లాడిరి. నాకు కోపము రాసాగినది. అయినా వీధిలోనికి వెళ్ళి గొడుగు విప్పితిని. ఆ గొడుగు నాదికాదు. నా క్రొత్త గొడుగును కాంతయ్యగారు తీసికొని ఎక్కడనో వంటచేయుటకు వెళ్ళినాడు. తన పాతగొడుగు అక్కడ పడవేసినాడు. దాని కక్కడక్కడ రంధ్రములుండుటచే కురువసాగినది. నేను తడిసిపోవుచుంటిని. నా సంకల్పమిక్కడనే వికల్పమైనది. గత్యంతరములేక మరల యింటిలో ప్రవేశిం చితిని. అంతకంతకు వర్షము అధికముగాజొచ్చినది. దీపముమాత్రము వెలిగిం చుకొని కూర్చుంటిని. రాత్రి 8 గంటలకు పురాణం వెంకటప్పయ్యగారనే మా ఊరి బ్రాహ్మణుడు నా వద్దకు వచ్చి నీవు యిచ్చట పడుకొనవద్దనిన్ని, మేము పడుకున్న చోటికి రమ్మనిన్ని పిలిచెను. సామాను వదిలిపెట్టి రానంటిని. అందుపైన ఆయన నా పెట్టెను తన నెత్తిన పెట్టుకొని నాపక్కచుట్టను చంకన పెట్టుకొని నన్ను కూడ రమ్మనెను. నేను యింటికి తాళం వేసి ఆయనతో ప్రక్కన ఉన్న ఇంటి మేడమీదికి వెళ్ళితిని. ఆ యింటిని భాస్కరభట్ల లచ్చయ్య ధర్మశాల అంటారు. 9 గంటలరాత్రి అయిన తరువాత మకరాల కాంతయ్యగారు నావద్దకు వచ్చి భోజనమునకు రమ్మని పిలిచెను. వర్షము జోరుగా పడుచున్నది. కాంతయ్యగారిల్లు పడిపోవుచున్నందు వారు విచారముతో నున్నారు. ఈ పరిస్థితులను గ్రహించి నేను తిండి తినుటకై వారింటికి పోవుటకు సిగ్గుపడితిని. గాని పరదేశములో ఆ సమయమున నన్ను పిలిచి ఆయన భోజనము పెట్టదలచుకున్నపుడు నిరాకరిం చుట మంచిది కాదని గ్రహించి ఆయనతో వెళ్ళి భోజనముచేసి వచ్చి పరుంటిని. ఆ రాత్రి 30, 40 అంగుళముల వర్షము పడినదని గ్రహించక తప్పదు. నాకు నిద్రపట్టలేదు. సమీపమున నున్న యిండ్లు, మేడలు, గోడలు పడి పోవుచుండెను. వాటిధ్వని తుపాకి ఫిరంగి మోతవలె వినబడుచుండెను. మేము పడుకున్న మేడ కూడ పడునేమోనని భయముతో నుంటిమి. ఎటులనో తెల్లవారినది.

* * *

*ప్రకరణము - 3*

# మూసీనది వరద బీభత్సము

ఆశ్వయుజ శు 2 (28 ఆబాన్ 1317; 1908 అక్టోబరు మొదటి వారము) ఫసలీ రోజున పగలంతయు బాగుగా వర్షము పడినది. సాయంత్రము 4 గంటల నుంచి వర్షము చాలయెక్కువైనది. 4 గంటల సమయమున కొంత భీతావహము ఎక్కువ కాజొచ్చినది. మూసీనది భాగ్యనగర మధ్యభాగము నుండి ప్రవహించుచున్నది. పూర్వము ఆ నదిని పురస్కరించుకొనియే భాగ్యనగరము వృద్ధి చేయబడినది. ఆనగరములో రాజుగారి భవనము పాయగాః జాగీరుదార్ల దేవిడీలును చార్‌మినార్, మక్కామసీద్ మొదలగు అపూర్వ సౌధములు కట్టబడినవి. ఆ పట్టణమునకు ఎత్తయిన ప్రాకారము ఉండి ఆ ప్రాకారమునకు అచ్చుటచ్చుట 12 పెద్ద పెద్ద దర్వాజాలు గేట్లు గలవు. ఒక భాగపు ప్రాకారము మూసీనదికి వాయవ్య దిక్కు మొదలు దక్షిణ దిక్కువరకును యివతల పట్టణము కట్టబడినది. ఆ కారణమున మూసీనది ఆ మహానగరము మధ్యభాగము నుండి ప్రవహించుచున్నది. దానిపై రాకపోకల నిమిత్తం 3 వంతెనలు నిర్మించబడినవి. వాయవ్యమున పాత వంతెనయు, మధ్య క్రొత్తవంతెనయు, ఆగ్నేయమున చాదర్‌ఘాట్ వంతెనయు నిర్మించబడినది. క్రొత్త వంతెనను ఆనుకొనియున్న దర్వాజాకు ఢిల్లీ దర్వాజ అని పిలచెదరు. పట్టణ మధ్యభాగమున చార్‌మినార్ నిర్మించబడినదని వ్రాసితిని. అనగా దానికి నాలుగు వైపులను నాలుగు ఎత్తయిన స్థూపములు కలవు. ఈ స్థూపములు కేవలము గచ్చుతోనే కట్టబడినవి. దాని మధ్యన భాగ్యనగర లక్ష్మి నివాస స్థానమంటారు. అచ్చట ఎప్పుడును రక్షకభటులు

కాపలా చేయుచుందురు. దానికి నాలుగు వైపుల నాలుగు కమానులుండెడివి. వాటిని చార్‌కమాన్ అంటారు. అవి ఇప్పుడు తీసివేయబడినవి. చార్‌మినార్ తూర్పు భాగమున నున్న కమాన్‌ను ఆనుకొని ఒక పెద్ద నీళ్ళహవుజున్నది. దానిని గుల్జారు హవుజు అంటారు. దానికి అనతిదూరమున రాజవీధికి దక్షిణపు వైపున దీవాన్ సర్ సాలార్‌జంగ్ బహద్దుర్ దేవిడీయు, ఉత్తరభాగమున పాత హైకోర్టు భవనమున్నూ చరిత్రాత్మక సౌధములుండెడివి. ఇప్పుడా హైకోర్టు భవనములేదు. ఆ చోట మదీనా బిల్డింగు అనే సౌధము కట్టబడినది. దాని ఆదాను మదీనాకు పంప వలెనని రాజుగారి సంకల్పమయియుండెను. దానికి కొంచెము దూరములో ఢిల్లీ దర్వాజ మూసీనది ఉన్నది. నదికి తూర్పుభాగమున అఫ్జల్‌గంజ్‌లోని సుప్రసిద్ధ వైద్యశాల యున్నది. ప్రాకార మధ్యముననున్న పట్టణమునకు అందరూ నెబల్దా (లోపలి నగరము) ప్రాకారముల వెలుపల తయారుకాబడిన పట్టణమునకు బేరూ నెబల్దా (వెలుపలి నగరము) అని వాడుకపేర్లు. 28 ఆబాన్ నాటి సాయంకాలము మూసీనది పొంగి పారుచుండెను. ఆ రాత్రి ప్రవాహముఎక్కువ కావచ్చునని అనుభవజ్ఞులు గ్రహించుచుండిరి. అప్పుడు హయిద్రాబాదు రాజ్యమును ఆరవ ఆసఫ్‌జాః మీర్ మహబూబు అలిఖాన్ పాలించుచుండెను. ఈయన ధార్మికుడు, మత పక్షపాతములేని రాజనీతి విశారదుడు. అప్పుడప్పుడే బెంగాలు దురంతములు మొదలగునవి చెలరేగి బ్రిటిష్ ప్రభుత్వంపైన అసూయ హెచ్చుచుండెను. ఆ సందర్భమున నైజాం ప్రభువు బ్రిటిష్ ప్రభుత్వమునకు ఈ క్రిందివిధంగా సలహా నిచ్చెను.

"నా ప్రజలలో హిందువులు, మహమ్మదీయులు రెండు పెద్ద మతముల వారున్నారు. వారుభయులను రెండు కండ్లవలె చూచుచున్నాను. నేను అనువంశీకముగా మహమ్మదీయుడను. సున్నీ మతమునకు చెందినవాడను. అయినను నేను రాజును గనుక యేమతమునకు చెందినవాడనుగాను. అన్ని మతములకును చెందినవాడనయి యున్నాను. రాజు (మోయదుల్ మిల్లతుద్దీన్) మతరక్షకుడు, మత పోషకుడుగా నుండగలడు గనుక నేను అన్ని మతములకును సమానుడను. నా రాజ్యము నాలుగు సూబాలుగా విభజంచి నలుగురు సుబేదార్ల ద్వారా పాలించుచున్నాను. అందిద్దరు సుబేదార్లు హిందువులు, ఇద్దరు మహమ్మదీయు లున్నారు. నా ప్రజలలో నాకెవ్వ దప్రియుడుగాని, ద్వేషిగాని లేడు. కాబట్టి మీరు యేద్వేషములేక ప్రజాహితముగా రాజ్యపాలనము చేసినచో మీకెవ్వరును ద్వేషులుండ జాలరు."

28 ఆబాన్ సాయంత్రం 5 గంటలకు నది వరద వార్తలు తెలిసికొని రాజుగారు వచ్చెను. నది పొంగి పారుచుండుట చూచెను. ఆయనకు ఎవ్వరో మతవిశ్వాసముగల హిందూ ఉద్యోగులు కొబ్బరికాయలు, పసుపుకుంకుమ పూలు, రెవికబట్ట మూసీనదిలో వేయించినచో నదీమాత సంతసించి అపకారము చేయక నగరమును కాపాడునని చెప్పిరి. అన్ని మతములయందు విశ్వాసముగల ప్రభువు అట్లు చేయుట కంగీకరించి నదిలో కొబ్బరికాయలు పై వస్తువులను హిందువుల చేత వేయించి నగర రక్షకులతో నప్రమత్తతో నుండుడని చెప్పి వెళ్ళిపోయెను.

అస్తమయ సమయము నుండియు వర్షము అధికము కాసాగినది. మూసీ నదికి నీరు యెక్కువై మోరీలు మొదలగు జలమార్గములద్వారా పాత పట్టణములో కో కాతట్టి కసారుఘట్ల చౌకువరకును; దివాను దేవుడీ వరకును ముంచెను. అంతేగాక మూసీకి ఉత్తర, తూర్పుభాగములలో బేగంబజారు అఫ్జల్‌గంజ్, గౌలిగూడెం, రెసిడెన్సి, చాదర్‌ఘాట్ మున్నగు వీధులను ముంచివేసెను. దీవాన్‌దేవుడీ వద్ద 10 అడుగుల నీరున్ను రెసిడెన్సి బురుజుగోడ వద్ద 12 అడుగుల నీరున్ను నిలిచెనని జ్ఞాపకము. కోకతట్టిబజారులో 15, 16 అడుగుల నీరు నిలిచెను. ఈ వీధులలో నిండ్లన్నియు చాలా భాగము కూలిపోయినవి. ధన ధాన్యములు గృహోపకరణములు నేలమట్టమైనవి. 40, 50 వేల యిండ్లు, 10వేల జనము కొన్ని లక్షల ధన కనక వస్తువులు మూసీనది పొట్టలో పెట్టుకున్నది. పిల్లలకు పాలిచ్చుచున్న ఒక స్త్రీ మునిగిపోయెను. అదే స్థితిలో ఒకరినొకరు కౌగలించుకున్న మాతాశిశువుల శవములు కనబడినవి. కోకతట్టిబజారులో పౌరోహితుడు వకీలు అయిన విశ్వనాథం యిల్లుండెను. ఆ యింటిప్రక్కన హను మంతునిగుడి (డాబా) ఉండెను. ఇంటిలోనికి నీరురాగానే విశ్వనాథం తమ్ముడు విఠల్‌రావు విశ్వనాథం భార్య, ఇద్దరు కుమారులు, కొమర్రాజు సదాశివ రావున్ను ఆయన తల్లియు మరికొందరు గుడిపైకెక్కిరి. అదే యింటిలో నా స్నేహితుడు ఉస్తెపల్లకాపురస్తుడు పబ్బరాజు సీతారామరావు కూడ ఉండెను. అతడు నావంటి విద్యార్థియే. అచటికి నీరు వచ్చుచుండుట జూచి కొందరు ప్రక్కనున్న రావిచెట్టుపై కెక్కిరి. కొమ్మల వరకు నీరు పెరిగెను. అందులో సదాశివరావు ఆయన తల్లియు అన్నకుమారులిద్దరు బాలురను చేత పట్టుకొని విఠల్‌రావున్ను, సీతారామరావున్ను మరికొందరున్ను ఉండి చెట్టుకొమ్మపై కెక్కిరి. డాబాపైకి ప్రవాహము వెంట ఒక ఈతమొద్దువచ్చి డాబా మీదనున్న షుమారు 10, 15 మందిని రావిచెట్టు మొదట పడవేసి ఆ మొద్దు పైనబడెను. వారలట్లు మునిగి చచ్చిరి. అందులో విశ్వనాథం

అతని భార్యయు ఉండిరి. చెట్లకొమ్మలపైకి నీరు వచ్చుచుండుట చూచి సీతారాం రావు పైకొమ్మకెక్కబోయెను. విఠల్‌రావు ఒక పిల్లవానిని పైకందజేయజూచెను. ఆ పిల్లవాడు నీళ్ళలో పడి చనిపోయెను. తరువాత విఠల్‌రావు రెండవ పిల్లవానితో సహా బ్రతుకలిగెను. కొమఱ్రాజు సదాశివరావు పైకెక్కజాలక ఉత్తరీయముతో చెట్టుకు తనను కట్టుకొనెను. ప్రవాహము అక్కడికి వచ్చుటచే కట్టుముడి ఊడక అతను తలక్రిందై అశువుల బాసెను. తల్లి నీటిలో బడి కొంతదూరము కొట్టుకొని పోయెను. ఎవరో బయటకు లాగిరి. ఆమె బ్రతికెను. ఇట్టి కథలు అసంఖ్యాకము లుగా నున్నవి. అవి ఇప్పుడు జ్ఞాపకము లేవు. వ్రాయుటయు అనవసరము. కాంతయ్య నా కొత్తగొడుగు తీసికొని పోవుటచే నేను కమిటీకి పోజాలకపోవుట తటస్థించినది. కమిటీకి పోయి యుండినచో నేనును నా మిత్రుడు సదాశివరావు వెంట దీర్ఘకాల యాత్రకు వెళ్లవలసిన వాడనయ్యేవాడను. ఈశ్వర సంకల్పము గ్రహించుట యెవరికిని సాధ్యముకాదు. అతడు ప్రతి కార్యము మంచికొఱకే చేయుచుండునని వేరే చెప్పనక్కరలేదు.

29వ తేది ఉదయము 9 గంటలవరకు మాకీవిషయములు తెలియవు. గత సాయంత్రము కమిటీకివెళ్ళి పరీక్ష దరఖాస్తు యిచ్చియుండలేదు. గనుక ఆ పనిని పూర్తి చేసికొనవలెనని త్వరగా మీనమ్మగారిచేత వంట జేయించుకొని భోజనము చేసి డబ్బుతో సహా బయలుదేరి బాలాగంజ్ వెలుపలకు వచ్చితిని. కొందరు గుమిగూడి పట్టణములోనికి వరద వచ్చినట్లు చెప్పుకొనుచుండిరి. షాహలి బండమీదనున్న రాజా రాయ రాయాన్ దేవుడివద్దకు వచ్చితిని. అప్పుడు చార్‌మినార్ వైపునుండి టాంగాలు, జట్కాలు మనుష్యులతోను, సామానులతోను వచ్చుచుండెను. చాలమంది కాలినడకన పోవుచుండిరి. షాహఅలిబండ చాల ఎత్తయిన ప్రదేశము. ఆ రోడ్డు పడమరదిశ నున్న చెన్నారాయుని గుట్ట వరకు పోయెడిది. అది ఇంకా ఎత్తయిన ప్రదేశము. బస్తి అంతవరకున్నది. కొందరితో మాట్లాడితిని. రాత్రి మూసి పొంగి పట్టం మునిగిపోయినదని వారు చెప్పిరి. నీటి ప్రదేశము యింకా మైలుకన్నా యెక్కువ దూరముంటుంది. మామూలినడకతో కోకాతట్టివైపు వెళ్ళితిని దారిలో జట్కాలు, టాంగాలు, పిల్లలు పెద్దలు అసంఖ్యాక ములుగా కనబడిరి. దుకాణములు మూసియుండెను. పోలీసు బందోబస్తు యెక్కువగా కనుపించలేదు. చౌకువరకు వెళ్ళితిని. అక్కడివరకు నీరు వ్యాపించి యుండెను. చినుకులు పడుచునే యుండెను. మౌల్వియిబ్రాహీం అలీసాహెబు లెక్చరర్‌గారు గొడుగు వేసికొని పాదరక్షలు లేకుండా లాగు పైకియెత్తుకొని కనబడిరి. ఆయన అయోమయావస్థలో నుండెను. మాట్లాడకుండగా నా సలాముకు

జవాబు యిచ్చే స్థితిలో కూడా లేకుండిరి. స్వల్ప మేఘము కమ్మియుండెను. కొందరు నీరు పొంగుచున్నదనియును కొందరు నీరు నిలిచి యున్నదనియును అనుకొనుచుండిరి. పోలీసులు కొందరు కనబడి మనుష్యులను నీటివైపుకు పోకుండా ఆపుచుండిరి. అచ్చటినుంచి మరలి ఢిల్లీ దర్వాజావైపునకు వచ్చితిని. దివాను దేవుడివరకు నీరు వ్యాపించి యుండెను. ఆ వైపునకూడ జనసమూహ మెక్కువగానే ఉండెను. నది పొంగుటను గురించి వరద వ్యాప్తిని గురించి ధన ప్రాణ నష్టములను గురించి పూర్తి వార్తలేమియు తెలియలేదు. సాయంత్రం 2, 3 గంటల వరకు తిరిగి ఏమియు తెలిసికొనలేక మూఢుడనుగానుండి వెనుకకు మరలితిని. విద్యార్థి సోదరులు కొందరు కలిసినను వారును నావలెనే నిజస్థితి గ్రహించనందున చెప్పజాలకపోయిరి. చార్‌మినార్ ప్రాంతములకు 4 గంటల వేళకు చేరితిని. నీరు తీయుచున్నదని వార్తలు వినబడెను. నెమ్మది నెమ్మదిగా సాయంకాలమునకు బాలాగంజు చేరితిని. అచ్చటి పచ్చబావి మొదలగు నిరపాయ వీధులలోని గృహస్తుల యిండ్లలో సమారాధనలలో షడ్రసోపేతముగా భోజనము చేసి లోకాభిరామాయణము చెప్పుకొను బ్రాహ్మణ బృందము కలిసినది. రాజారాయ రాయాన్ బహద్దూర్ బ్రాహ్మణుడు దేవి నవరాత్రములు చేసి వందలాది బ్రాహ్మణులకు మృష్టాన్నమిడెడి అన్నదాత. వారి దేవిడి షాహఅలి బండమీదనే ఉన్నది. బ్రాహ్మణులు చాలామంది ఆ సమారాధనకు వెళ్ళెడివారు. వారుకూడ వినిన పరస్పర విరుద్ధమైన సమాచారములనే జెప్పిరి. అవియు ఆకర్షణీయములుగా నున్నను వదంతులే గనుక పూర్తిగా నమ్ముటకు వీలులేదు. సాయంత్రము 6 గంటలకు ప్రవాహము తగ్గినందున నీరుతీసి మూసీనది తన హద్దులలో ప్రవహించుచుండెను. నిజాంప్రభువు ఆశ్వారూఢుడై ఢిల్లీ దర్వాజా వద్దకు వచ్చి శ్మశానవాటికగా నున్న పట్టణముజూచి కన్నీరుగార్చెను. అక్కడకు వచ్చియున్న సిటీ పోలీసు కమిషనర్ అక్బర్ జంగును జూచి దుఃఖావేశముతో నీవును బ్రతికి యున్నావా అని ప్రశ్నించి ఉన్నతాధికారులతో బందోబస్తు నిమిత్తము చెప్పి వెళ్ళిపోయెను.

30వ తేదీ ఉదయమున 10 గంటలకు భోజనముచేసి నేను ఢిల్లీ దర్వాజా వద్దకు వచ్చితిని. నదిలో గజము గజమున్నర లోతున నీరు పారుచుండెను. క్రొత్త వంతెన కొంతవరకు పడిపోయినందున రాకపోకలు తగ్గిపోయెను. కొందరిని మనుష్యులు పట్టుకొని నదిని దాటించుచుండిరి. బేగం బజారు ఆఫ్జల్‌గంజు, గౌలిగూడెం చాదర్‌గట్ వంతెనవరకు ఇండ్లు, మిద్దెలు, మేడలు కూలి పడిపోయినవి. అంతటితో ముందుపోజాలక కోకాతట్టివైపు తిరిగితిని. చౌకు వసార్‌గట్లకు

చేరితిని. కాని చాలాదూరము వరకు ఇండ్లు, మిద్దెలు, మేడలు కూలిపోయినవి. ఒకరిద్దరు విద్యార్థి సోదరులు మార్గమధ్యమున కలిసిరి. మేము ఈ వీధులలో తిరుగుచు ముందుకు సాగిపోవుచుంటిమి. తడిసిపోయిన ధాన్యకుప్పలు యితర పదార్థములు పడియుండెను. వాటిలో కొన్ని మురిగిపోయినవి. కొన్ని శవములను కూడ చూచితిమి. కొన్ని అంగవైకల్యముగా బయటికి కనబడుచుండెను. కొన్ని శవములు మట్టిలో కొంతభాగము, బయటికి కొంతభాగము కనబడుచుండెను. బంధు మిత్రులు వెదకి బయటకుతీసి యెత్తుకొని పోవుచుండిరి. హుస్సేని ఆలం దాటి కోకాతట్టికిపోయి సోదరుడు తిరుమలరావు మిత్రుడు సదాశివరావు శవమును జూచివిచారపడితిని. కట్టుకున్న పట్టంచుధోవతి జుట్టుముడి పచ్చని శరీరము చెట్టుకు కట్టుకొనియున్న ఉత్తరీయమును జూచితిని. ముఖము బోర్లపడియున్న సదాశివరావు మృతదేహమని గ్రహించగలిగితిని.

దానికి కొంతదూరమున మా తిరుమలరావు, రామసహాయము, కేశవరెడ్డి మరికొందరు కలిసిరి. వారు పడిన బాధలన్నియు యిట్లు చెప్పిరి. కేశవరెడ్డి సహాయమున తిరుమలరావు ఒకచెట్టుపైకెక్కెను. ప్రవాహము రాకమునుపు పుట్టలలో గోడల నెర్రెలలో దాగియున్న పాములు, తేళ్లు మొదలగునవి కూడ చెట్టుపైకెక్కెను. చెట్టుయెక్కకుంటే నదిలోపడి చావవలెను. చెట్టు పైకెక్కితే పాములచేత కరవబడి చావవలెను. ఈ క్లిష్టపరిస్థితిలో ఆ రాత్రియంతయు మరురోజు 12 గంటలవరకును చెట్టుమీదనే గడిపి ప్రాణములను దక్కించుకొనిరి. నీరు కాలినడకవరకు తగ్గిన తరువాత తడిబట్టలతో చెట్టుదిగిరి. కేశవరెడ్డి, తిరుమల రావులు చెన్నారాయుడి గుట్టకు పోయిరి. అక్కడ పెద్ద దేవాలయముండుటయే గాక మాతో చదువుచున్న విద్యార్థి చిన్నమాచారిల్లు కూడ ఉండెను. వీరుభయులు చిన్నమాచారి యింటనే అతిథులుగా నుండిరి. అంతట నేను ఆరోజు సాయంత్రం 5 గంటలవేళకు మౌల్విసాహెబు లెక్చరర్‌గారింటికి పోయితిని. కమిటీయు ఆయన నివాస గృహము మొదలగు నిండ్లన్నియు పడిపోయినవి. మౌలిసాహెబు ఒక కుర్చీపైన ఒక్కడే కూర్చుండియుండెను. 30, 40 గజముల నుండియే వంగి విధేయతగా సలాము చేసితిని. ఆయన జవాబిచ్చుటయే గాక వెంటనే లేచి యెదురుగావచ్చి కౌగలించుకొని "కోటేశ్వర్ కైసె బచ్‌కర్ ఆయె" (కోటేశ్వర్ నీవెట్లు కాపాడబడి వచ్చితివి) అని నిండు ప్రేమతో సాదరముగా నడిగి నన్ను చేయి పట్టుకొని తీసికొనిపోయి ప్రక్కనున్న కుర్చీపైన కూర్చుండబెట్టి వివరములు తెలిసికొనెను. ఆయనయే నిజమైన గురువు. తండ్రి సమానుడు. నేనాయనను

ఆమరణాంతము మరవజాలను. హైద్రాబాదు రాజ్యములోని న్యాయవాదులలో పెక్కురు ఆయన శిష్యవర్గములోనివారే.

హైకోర్టు పడిపోయినందున పరీక్షలతేదీ 2, 3 నెలల వరకు పొడగించ బడినదని రూఢిగా తెలిసినది. లా కమిటీ పడిపోయినది. దానిని బాగు చేయించి శిక్షణ సాగించుటకు కనీసం ఒకనెల అయినను పట్టవచ్చునని కూడ తెలిసినది. ఇక పరగ్రామస్తులగు విద్యార్థులుండి చేయునది యేమిలేదని స్పష్టమైనది. వర్షపాతము కేవలము హైద్రాబాదు పట్టణమువరకే గాక నల్లగొండ, వరంగల్ జిల్లాలో కూడ కొంత బీభత్సము కలిగించినది. అప్పుడు పడిన వర్షములోగా 50 యేండ్ల క్రిందటివరకు కూడ కురవలేదని వృద్ధులు చెప్పుచుండిరి. చాల చెరువులు తెగిపోయినవి. వాడి, బెజవాడలైను డోర్నకల్, హైద్రాబాదు మధ్య కొన్నిచోట్ల గండ్లుపడి తెగిపోయినవి. టెలిగ్రాము స్థంభములు పడిపోయినవి. కాబట్టి ప్రయాణమునకు రైలు లేకుండుటయే గాక టెలిగ్రాము సౌకర్యము కూడ లేదు. పోస్టు టెలిగ్రాములు ఆగిపోయినవి. తటస్థించిన క్లిష్ట పరిస్థితులను గురించి ఆలోచించుకొనుచుంటిని. ఆ సంవత్సరము నేను 2వ సంవత్సరము వాడనగుటచే ఆబాన్ (సెప్టెంబర్) నెలలో చేరితిని. అంతకుపూర్వమే జములాపురము వెంకటేశ్వర రావుగారు జనవరినుండియే చదువుచుండిరి. మాలో కొందరు బంధువులము. కొందరు పూర్వపరిచితులము గనుక మేము అయిదుగురము కాలి నడకన బయలు దేరి నల్లగొండమార్గముగా వెళ్ళుటకు సంకల్పించుకొంటిమి. గాని దగ్గర డబ్బులేదు. ఇంటినుండి మనియార్డరు వచ్చే అవకాశములేదు. మేము మౌల్విసాహెబు సహాయము ఆపేక్షించవలయుననుకొంటిమి. పరీక్ష ఫీజుకొరకు మూటగట్టియే యుంచితిమి. సంతకముచేసిన దరఖాస్తులు అదివరకే ఉండెను. కాబట్టి మాలో పరీక్ష దరఖాస్తులు దాఖల్ చేయనివారము పరీక్ష దరఖాస్తుఫీజు మౌల్విసాహెబుకు గడువుతేదీలోగా దాఖలు చేయుటకు యిచ్చితిమి. గాని ప్రయాణ కర్చులకొరకు కొంత డబ్బు యిప్పించుమని కోరితిమి. విద్యార్థి 1 కి 5-0-0 రూపాయల చొప్పున ఆయన యిచ్చి మరల కమిటీ తెరచినప్పుడు యీ డబ్బు తెచ్చియివ్వండి అని చెప్పెను. ఆ ప్రకారము ఆయనవల్ల రూపాయలు తీసికొంటిమి. ఆశ్వయుజ శు 10 (దసరా) రోజు సాయంత్రము 5 గంటల నుండి ప్రయాణము చేయుటకు నిశ్చయించుకొని నిర్ణీతస్థలమునకు అందరము చేరితిమి. పుస్తకములు సామాన్లు పట్ణములోనే ఉంచితిమి. రెండు ధోవతులు, రెండుచొక్కాలు, ఒక కోటు, వుత్తరీ యము తువాలలను మాత్రము చిన్నమూటగా గట్టుకొని బయలుదేరితిమి. మూసీ

నదిలోనికి వచ్చేవరదకు క్రొత్త పాదరక్షలుండుటచే నాకు నడవటమునకు కష్టముగా తోచినది. వాటిని మూసీలో పారవేసితిని. రాత్రి 7 గంటలవరకు సరోనగరుకు చేరితిమి. విజయదశిమి అగుటచే కొన్ని వాయిద్యములు మ్రోగుచుండెను. రోడ్డు ప్రక్కన పరుంటిమి. మా మిత్రులు పరిటాల సీతారామారావు దుకాణమునకు వెళ్ళి కొంత గోధుమ పిండి, పంచదార వేడిపాలు తెచ్చెను. అవికలిపి తలా ఒక ముద్ద భుజించితిమి. రాత్రియంతయు వెన్నెలలో నేలమీద పరుండి తెల్లవారుజాము నల్లగొండవైపుకు వెళ్ళే బండ్లమీదనెక్కి ఉదయం 10 గంటల వరకు ప్రయాణము సాగించితిమి. అచ్చట ఒక పెద్దవూరిలో బావి దగ్గర స్నానముచేసి వంటచేసికొని భోజనము చేయుటకు నిశ్చయించుకుంటిమి. ఆమార్గము సీతారామారావుకు తెలిసినదే కనుక ఒక వర్తకునింటికి వెళ్ళి భోజన పదార్థములు పాత్ర సామాగ్రి తెచ్చెను. వంట చేసుకొని భోజనము చేసితిమి. ఇట్లే రెండు రోజుల ప్రయాణముచేసి నల్లగొండ చేరితిమి. మార్గమధ్యమున ఉదయానంతరము కొంతసేపు కాలినడక కూడ తటస్థించుచుండెడిది. దారిలో అందరము తోక పద్యములు చదువుచు వెళ్ళెడివారము. తోక పద్యములనగా అంత్యక్షరముతో ప్రారంభింపబడి క్రొత్త పద్యమును జదువుట. ఇది ఆ కాలపు విద్యార్థులకు అలవాటుండెడిది. నల్లగొండలో మా మిత్రులు పరిటాల సీతారామారావు అన్నగారు శ్రీ పరిటాల అప్పారావుగారు పేష్కారుగా నుండెను. రాత్రి ఆయన యింటికి వెళ్ళితిమి. ఆయన మా రాకకు సంతసించి స్నానము చేయించి తెల్లబట్టలు యిచ్చి భోజనము పెట్టించెను. మరు రోజు మాకు విందు భోజనము పెట్టెను. నల్లగొండంతా తిరిగి చూచితిమి. నల్గొండకు కొంతదూరమున కరికల్లు గ్రామముండెను. అచ్చట పోలీసుస్టేషన్‌లో జములాపురపు వెంకటేశ్వరరావు అన్న సుబ్బారావుగారు రైటరుగా పనిచేయు చుండిరి. ఆయన హోదా చిన్నదేగాని మాటలలోను పలుకుబడిలోను యినిస్పెక్టరు కన్న యెక్కువ అధికారము చలాయించెడివాడు. ఆయన అకస్మాత్తుగా కోర్టుపనిమీద నల్లగొండకు వచ్చి మమ్ములను జూచెను. తన తమ్ముడు వెంకటేశ్వరరావున్ను నేనున్ను బ్రతికివచ్చి కనబడినందుకు సంతసించెను. నాకు నల్గొండ నుంచి సూర్యాపేట తాలూకా ఎరకవరము చేరవలెనని ఉండెను. ఎరకవరము నకరికంటికి 8 మైళ్ళ దూరములో ఉంటుంది. సుబ్బారావుగారు తన తమ్మునితోపాటు నన్ను కూడద నకరికంటికి రమ్మని పిలిచెను. నేను అట్లే ఆయనతో బండిపైన నకరికంటికి వెళ్ళితిని. సీతారామారావు నల్గొండలోనే ఉండెను. శ్రీరాము, మంత్ర ప్రగడ వెంకటేశ్వరరావు కోదాడ వెళ్ళిరి. నేను నకరికల్లులో రెండు రోజులుంటిని. అటుతరువాత ఆయన నాకు ఒక మనిషిని తోడుగానిచ్చెను. నేను మనిషిని

వెంటబెట్టుకొని ఎరకవరము వెళ్ళితిని. ఎరకవరములో గండేపల్లి నరసింహారావు (మా తాతగారు) ఉండిరి. వారివద్దకు వెళ్ళితిని. ఆయన కూడ నా రాకకు సంతోషించెను. మరురోజు ఆయన నాకు గుఱ్ఱమును మనిషిని యిచ్చెను. నేను గుఱ్ఱమునెక్కి రాత్రి 8 గంటలకు నీలికుర్తి వెళ్ళితిని. ఎరకవరమునుంచి నీలికుర్తికి 35 మైళ్ళ దూరము. నీలికుర్తిలో మా పినతండ్రిగారికి పట్నంలోని ఉదంతము తెలిసిన తరువాత నా సంగతి తెలిసికొనుటకు అంతకుముందే ఒక మనిషిని జగన్నాధపురము పంపెను.

హైద్రాబాదు మునిగిపోయిన వార్త 2, 3 రోజులలో దేశమంతటను ముఖ్యముగా బెజవాడ ప్రాంతమున వ్యాపించెను. ఉత్తరము రానందున మా నాన్నగారు 4, 5 రోజుల తరువాత సంగతి తెలిసికొనుటకు నందిగామ వెళ్ళెను. మునిగిపోయిన జనములో నేనుకూడ నున్నానని మా తలిదండ్రులు నా భార్యయు విచారపడుచుండిరి. నందిగామలో మా నాయనగారికి పరస్పర విరుద్ధమైన వార్తలు వినవచ్చెను. కొందరు బాలాగంజ్ ఎత్తయిన ప్రదేశము గనుక అక్కడికి నీరు రాదు. అక్కడనున్న మీ కుమారునకు భయములేదు అని చెప్పిరి. మరికొందరు పట్టము సాంతము మునిగినదని చెప్పిరి. టెలిగ్రాము లేదని చెప్పిరి. చేయునదిలేక ఉదయము 9 గంటలకు బయలుదేరి యింటికి వచ్చుచుండిరి. ఆ రోజులలో బెజవాడ నుంచి నందిగామకు మోటారులేదు. గనుక కాళేశ్వరరావుగారు జట్కాబండిపైన నందిగామకు వచ్చుచుండిరి. రోడ్డుపైన నడచి వచ్చుచున్న మా నాన్నగారిని చూచి జట్కాదిగి మాట్లాడ ప్రయత్నించెను. గాని మా నాయనగారు దుఃకించుచు నా జాడ తెలియలేదని చెప్పిరి. నేను పట్టం మునిగిన తరువాత 3వ రోజున కాళేశ్వరరావుగారి పేర ఒక ఉత్తరము వ్రాసితిని. అందులో బీభత్స విశేషములన్నియు వ్రాసితిని. అది వాడి, మద్రాసు వైపు నుండి బెజవాడకు 3, 4 రోజులకు చేరినది. ఆ ఉత్తరము వారికి అందినది. గనుక వారికి నేను బ్రతికియున్నాని తెలిసియుండెను. గనుక వాడు బాగుగనే ఉన్నాడు. నాకుత్తరము వ్రాసినాడని చెప్పిరి. అంతట మా నాన్నగారు ధైర్యముతో యింటికివచ్చి మా తల్లిగారికిని నా భార్యకును సంతోష వార్త వినిపించెను. బంధువులందరు సంతోషించిరి.

ఇదే సందర్భమున నీలికుర్తి నుంచి వచ్చిన మనిషికి యీ సంగతి చెప్పిరి. మా నాన్నగారిచ్చిన ఉత్తరము తీసికొని ఆ మనిషి నీలికుర్తికి వచ్చెను. జుజ్జూరు నుంచి ఆ మనిషియు ఎరకవరమునుంచి నేనును ఒకేసారి నీలికుర్తి చేరితిమి.

మా పినతండ్రిగారు చాలా సంతోషించిరి. అచ్చట రెండు రోజులుండి నేను జగన్నాధపురము వెళ్ళవలెననుకొంటిని. రైలుకట్ట తెగిపోయినందున రైళ్ళు సాగుట లేదని పైన వ్రాసియేయుంటిని. మానుకోట నుంచి డోర్నకల్‌కు 12 రోజుల నుంచి మాత్రము గూడ్సుబండ్లు నడుచుచున్నవని తెలిసినది. నేను మానుకోట వెళ్ళితిని. అచ్చట నుంచి గూడ్సుబండిలో నెక్కి డోర్నకల్‌పోయి డోర్నకల్ నుంచి రైలులో ఎఱ్ఱుపాలెం చేరితిని. అచ్చట నుంచి యింటికి పోయితిని. అక్కడను పరిటాలలలోను ఒక నెలరోజులుంటిని. ఇంతలో రైళ్ళు సాగుచున్నట్లును, లా కమీటీహాలు రిపేరు అయినట్లును నాకుత్తరము వచ్చెను. వెళ్ళుటకు సిద్ధపడితిని. గాని వెళ్లి 3 మాసములైనను చదువుటకు డబ్బు కావలసివచ్చెను. అదేరోజులో మా అత్తగారు నా భార్యకు యిచ్చిన ఆవును అమ్మివేసిరి. దాని పైకము కొంత రావలసియుండగా దానిలోనుంచి కొంత డబ్బు యిచ్చునట్లును మరికొంత వెనుక నుంచి మనియార్డరుద్వారా పంపునట్లును యేర్పాటు చేసికుంటిని. ఈ విధముగా డబ్బు యేర్పాటు చేసికొని బయలుదేరి నవంబరు నెలలో పట్ణం చేరి లా కమిటీలో ప్రవేశించితిని.

* * *

*ప్రకరణము - 4*

# న్యాయశిక్షణ రెండవ ఘట్టము

బాలాగంజ్‌లో నుండి చదివే సౌకర్యమంతగా కనుపించలేదు. పరిటాల సీతారామారావు వెంట ఆయన మేనత్త సూరమ్మగారుండెను. సీతారామారావు చాల మంచివాడు. చాల మొగమాటి. గనుక తనయింట్లో నన్ను కూడ చేర్చుకొనుమని నేను ఆయనను కోరితిని. అందు కాయనంగీకరించెను. నేను బాలాగంజ్ నుంచి లేచి హుసేన్ ఆలంలో ప్రవేశించితిని. ఈ బసలో ఒకరివెంట ఒకరు 5, 6 విద్యార్థులు చేరినందున వృద్ధురాలగు సూరమ్మగారికి భారమెక్కువైనది. ఆమె యింతమందికి వండి పెట్టుటకు చేతకాదనెను. నేను మళ్ళీ యత్నం చేసికొనవలసి వచ్చినది. పబ్బరాజు సీతారామారావుకు కూడ బస దొరకలేదు. మేముభయులము ఒక యిల్లు అద్దెకు తీసికొని వంట చేసికొనవలెనని అనుకుంటిమి. ఆ ప్రకారం వేరొక యిల్లు తీసికొని వంట ప్రారంభించితిమి. విష్ణుదాసు గిరిధరరావు అనే విద్యార్థితో వెంకటేశ్వరరావుకు స్నేహముండెను. గిరిధర రావుకు కూడ బస యేర్పాటు కాలేదు. వెంకటేశ్వరరావు అతనిని చేర్చుకొనుమని నాతో చెప్పెను. నేనందుకంగీకరించితిని. మేముగ్గురము ఒకేచోట ఉండి వంటచేసికొని భోజనము చేసికొనుచుండెడివారము. వారుభయులు సజ్జనులే గనుక మా సంఘటన చాల ఆనందముగా నుండెను. లెక్చరరుగారు ఒక రాత్రి పాఠశాల నడుపుచూ ఉండెడివారు. గాని దానికి కూడ ఫీజుకట్టి నేను 5, 6 రోజులు వెళ్ళితిని. ఆయన

నాయందు ప్రేమగలవాడు. శ్రేయోభిలాషి గనుక నన్ను దగ్గరకు పిలిచి ఈ రాత్రిపాఠశాల నీవంటి తెలివిగల విద్యార్థుల కొరకు కాదు. నీవు వచ్చినట్లయితె నీ ఆరోగ్యము చెడిపోగలదు. రావలదని చెప్పెను. గత సంవత్సరము తప్పితిని. గనుక వచ్చుచున్నాని చెప్పితిని. అందుకువారు ప్యాసు కావడములో అదృష్టము కూడ ఉండవలెను. గనుక నీవు రావలదని చెప్పెను. ఆ ప్రకారము రాత్రి పాఠశాలకు వెళ్ళుట మానవలసి వచ్చెను. మేము 5 గంటలకే రెండవసారి భోజనముచేసి కమిటీకి పోయి రాత్రి 10 గంటలకు బసకు చేరెడివారము. నేను వెంటనే పరుండి మ రల 3 గంటల రాత్రికిలేచి తెల్లవారే వరకు చదివెడివాడను. తక్కినవారిద్దరు 1 గంటదాక ఊగుతూ చదువు కొనుచూ నిద్రపోయెడివారు. శుక్రవారము హైద్రాబాదు రాష్ట్రములో సెలవు దినము. ఆ రోజున మా కమిటీలో వారపరీక్ష 2 గంటల నుంచి 5 గంటలవరకు జరిగెడిది. ప్రశ్నోత్తరములకు జవాబులిచ్చిన తరువాత నేనును జములాపురము వెంకటేశ్వరరావు, గిరిధరరావు, సీతారామారావు గార్లు నారాయణగూడెములో నున్న ఆర్యసమాజ మందిరములోకి వెళ్ళెడివారము. అచ్చట పండిత కేశవరావు మొదలగు ప్రముఖులగు ఆర్యసమాజ నాయకుల ఉపన్యాసములు అవుచుండెడివి. ఆ ఉపన్యాసములు విని యింటికి వచ్చి భోజనముచేసి పరుండెడివారము. కొన్ని ఆర్యసమాజ గ్రంథములు కూడ చదువుచుంటిమి. విష్ణుదాసు గిరిధరరావు పారశీ, ఉరుదులో మంచి భాషాజ్ఞానము కలవాడు. తెలుగులో కొంచెము కవిత్వము వ్రాసెడివాడు. శ్రావ్యముగా పాడెడి వాడు. అతను యెన్నియో భాషా విషయములను భక్తి విషయములను చెప్పుచుండెడి వాడు. సీతారామారావుకు యెక్కువ భాషాజ్ఞాన ముండెడిదికాదు. జములాపురం వెంకటేశ్వరరావు కూడ ఉరుదు, తెలుగు భాషా సాహిత్య విషయము లలో పరిశ్రమ చేసినవాడు. వ్యాసములు మొదలగునవి వ్రాయగలడు. నేను రెండవ సంవత్సరము కూడా 600మంది విద్యార్థులలో 2వ స్థానముననే ఉంటిని. మొదటి స్థానము ఔరంగాబాదు కాపురస్తుడు రేణుకా దాసురావుది. గిరిధరరావు కొంచెము సుస్తీమనిషి. లెక్చరు సమయమున నిద్రపోయె డివాడు. నిద్రరాకుండ వుండవలెనని లెక్చరర్‌గారి బల్లవద్ద నిల్చొని గురుక పెట్టెడివాడు. అతను తలగుడ్డ చుట్టుకొనెడి వాడు. ఈ గురుకను జూచి లెక్చరర్‌గారు ఒక నిమిషము లెక్చరునాపి విద్యార్థులలో

యెవరైనా వచ్చి గిరిధరరావు తలగుడ్డపైన కూర్చొనుమని పరిహాసముగా ననెడివాడు. అందరు నవ్వెడివారము. అప్పుడు గిరధరరావుకు మెలకువ వచ్చెడిది. గిరిధరరావు నిష్కల్మష హృదయుడు. నాయం దతని కంతకంతకు ప్రేమ హెచ్చుచు వచ్చినది. షుమారు నేటికి 12 సంవత్సరము లకు పూర్వము దివంగతుడైనాడు. ఆ మరణాంతము గిరిధరరావు నాతో నదేవిధముగా నుండెను. ఫిబ్రవరి మాసాంతమున పరీక్ష జరిగినది. ఆ పరీక్ష బాగ్‌ఆలంలో జరిగినది. యధా ప్రకారము మౌల్విసాహెబుగారు అత్యవసర ఉపన్యాసములకు డేరా వేయించెను. అక్కడొక వంట బ్రాహ్మణుని పెట్టుకొని పైజెప్పిన మిత్రులే గాక మరిద్దరిని కలుపుకొని 7, 8 మంది విద్యార్థులము వంట చేయించుకొని భోజనము చేయుచు పరీక్షలు పూర్తి చేసితిమి. పరీక్ష పత్రములలో 3, 4 పత్రములు చాల కఠినముగా నుండెను. అయినను నేను సరిగా వ్రాసితిననే నా నమ్మకము. పేపరువ్రాసి బయటకు రాగానే ప్రశ్నలకు జవాబులు మా లెక్చరరు గారు తన అనుభవమును బట్టి చెప్పుచుండెడివారని పైన వ్రాసితిని. అది విని విద్యార్థులు తమ ఫలితములను తాము గ్రహించు చుండెడివారు. నాకు సివిల్, క్రిమినల్ ప్రొసేజర్ల ప్రశ్నలలో కొన్నిటికి నేను వ్రాసిన ఉత్తరములు లెక్చరరుగారు చెప్పిన దానికి భిన్నముగా నుండెను. అయినను అప్పటికిని యిప్పటికిని నేను వ్రాసిన ఉత్తరములే సరియైన వని నా విశ్వాసము. జములాపురం వెంకటేశ్వర రావు ప్యాసు కాగలనని నమ్మక ముగా చెప్పెడివాడు. నాకు అట్టి నమ్మకమున్నను గత సంవత్సరము తప్పిపోవుటచే కలిగిన పిరికితనముతో నేను యేమియు ప్రగల్భముగా మాట్లాడలేకుంటిని. దైవాదీనమనుకుండెడివాడను. తక్కిన నా మిత్రులు తమ ఫలితముల నప్పుడే గ్రహించి నిరాశచెందిరి. పై విధముగా పరీక్షలు పూర్తి చేసికొని విద్యార్థులు గృహోన్ముఖులైరి. నేను బయలుదేరి ఎఱ్ఱుపాలెములో దిగితిని.

ఆరోజు మా సోదరుడు లక్ష్మీకాంతరావు యింట అతిథిగానుంటిని. సాయంత్రము యింటికి వెళ్ళవలెనని అనుకొనుచుంటిని. ఇంతలో పరిటాల నుంచి మా బంధువు ఆదిరాజు సుందరరామయ్యగారు బండినెక్కి ఎఱ్ఱుపాలెము వచ్చిరి. ఆయనకూడ లక్ష్మీకాంతరావు యింటికే వచ్చెను. కొంచెము సేపటికి వనము రామచంద్రయ్యగారి మనుమడు చనిపోయినాడనిన్నీ, కుమార్తె ప్రసవించిన

దనిన్ని ఆడపిల్ల పుట్టినదనిన్ని చెప్పెను. ఆ చనిపోయిన పిల్లవాడు నా కుమారుడు సత్యనారాయణ అయియుండెను. పరీక్ష యిచ్చి కొంచెము సంతోషముతో విశ్రాంతికై వచ్చుచున్న నాకు పిడుగువంటి వార్త వినబడెను. కొంతసేపు విచారపడి తరువాత స్నానము చేసి సుందర రామయ్యగారి బండిమీదనే జగన్నాధపురము వచ్చి మా తలితండ్రులను కలిసికొంటిని.

మాడపాటి వెంకటేశ్వరరావు పంతులుగారు అభినవ యుగంధరుడని పేరుగాంచిన ఆంధ్రనియోగి బ్రాహ్మణుడు. ఆయన నూజివీడు సంస్థానములో రు. 5/–ల వేతనము గల గుమాస్తాగా ప్రవేశించి శ్రీరంగయ్య అప్పారావుగారి ఉయ్యూరు ఎస్టేటునకును పాపమ్మారావుగారి నిడుదవోలు ఎస్టేటునకును దివానుగా పని చేసెను. నెలకు రు. 500/–ల వరకు జీతము తీసికొనెను. కపిలేశ్వరపురము ఏస్టేటు జమీందారు వెంకట రంగయ్యప్పారావుగారు కూడా ఆయన పలుకుబడికి లోబడినవాడే. ఆయన రంగాపురముగ్రామము జమీందారిని, ఉయ్యూరులో 500 యకరాల మాగాణి భూమిని, నూజివీడు బెజవాడలో మేడలు యింకా కొన్ని భూములను, ఇండ్లను సంపాదించెను. ఆయన చనిపోయినప్పుడు కృష్ణా పత్రికలో యిట్లు వ్రాయబడెను.

"ఆంధ్రదేశములో ఒక అద్భుతమైన పాత్ర అస్తమించినది. గాని ఆయన జీవితము లోకులకు అనుకరణీయము గాదు."

పైన చెప్పినట్లు పరీక్షనిచ్చి యింటికి వచ్చినప్పుడాయన సజీవుడుగనే యుండెను. ఆయన మేనల్లుడు పబ్బరాజు సుబ్బారావుగారికిని దూర బంధుత్వము, పూర్వమునుండియే యుండెను. మా కాళేశ్వరరావు బావగారు వకీలు అయినప్పటి నుండి వెంకటేశ్వరరావు గారియొక్కయు, వారి పలుకుబడిలోనున్న వారియొక్కయు కేసులలో కాళేశ్వరరావుగారే పని చేయుచుండిరి. కాళేశ్వరరావుగారును, వెంకటేశ్వరరావుగారును ఆలోచించుకొని చనిపోయిన మా పినతండ్రి లక్ష్మీకాంత రావు గారి రెండవ కుమార్తె దుర్గాంబను సుబ్బారావుకిచ్చి వివాహము చేయుమని మా నాయనగారిని కోరిరి. మరికొందరు నందిగామ బంధువులు కూడ యదే సలహా యిచ్చుటచే మా నాయనగారు అందుకు అంగీకరించిరి. నేను వెళ్ళిన 15 రోజులలోగానే వివాహలగ్నము వచ్చెను. పరిటాల గ్రామములో అదివరకు 10

సంవత్సరములకు పూర్వము పరిటాల చెన్న కృష్ణయ్యగారును మరికొందరు కలిసి శ్రీ హనుమత్సీతా లక్ష్మణ సహిత రామచంద్రస్వామి దేవాలయము నిర్మించుటకు యేర్పాటు చేసికొనిరి. చందాల మూలముగా కొంత ధనము ప్రోగుచేసి దేవాలయ నిర్మాణము చాలవరకు పూర్తి చేసిరి. వారు ఇక ముందు చేయజాలక పోయిరి. మాడపాటి వెంకటేశ్వరరావుగారు అనువంశీకముగా జాగీరు కావాత్‌లో చేరిన కొడవటికల్లు కరణము కుటుంబమునకు చెందిన వాడగుటచే పరిటాల పెద్దలు దేవాలయ నిర్మాణమునకు వెంకటేశ్వరరావు గారి సహాయమును కోరిరి. వారు తాను ధర్మకర్తగా నుండుటకు అంగీకరించినచో దేవాలయ నిర్మాణము పూర్తి చేసి రామచంద్రస్వామి ప్రతిష్ట చేసి నిత్య నైవేద్య దీపారాధన ఖర్చులకు కావలసిన యేర్పాట్లన్నియు చేసెదనని చెప్పిరి. అందులకు మొదటి ప్రారంభకులు శ్రీ పరిటాల చెన్నకృష్ణయ్య మొదలగువారు అంగీకరించిరి. ఆ కారణమున దేవాలయ నిర్మాణము పూర్తి చేసి రామచంద్రమూర్తి మొదలగు విగ్రహములను ప్రతిష్ఠచేసి తాను ధర్మకర్త నుండి వెంకటేశ్వరరావు గారే కొంతకాలము నుండి నడుపుచుండిరి. ఆ అభిమానముతో పై జెప్పిన వివాహము పరిటాల దేవాలయములో నేర్పాటుచేయ బడినది. మా చెల్లెలి కన్యాదానము నేనేచేసితిని. 5, 6 రోజులలో నేనును నా భార్యయు యింటికి వచ్చితిమి. అప్పటినుంచి నా జీవనము కొరకు నేను విచారించు కొనవలసియే యుండెను. పూర్వపు వ్యవసాయము నేను హైద్రాబాదు వెళ్లగానే తీసివేయబడినదని పైన వ్రాసితిని. ఈ రెండు సంవత్సరముల మధ్యకాలములో తటస్థించిన పరిస్థితులనుబట్టి మా నాయనగారు అనుకున్న ప్రకారము నీలికుర్తి వెళ్లలేదు. వారు ఎప్పటికప్పుడు ప్రయాణమగుచునే యుండిరి. నా పరీక్ష ఫలితములు తేలుటకు ఇంకా 1, 2 మాసములు పట్టవచ్చునని అనుకొను చుండిరి. గత సంవత్సరము తప్పిన కారణమున మనస్సులో పిరికితనము బాధించుచుండెను. ఎదేని ఉద్యోగము సంపాదించుకొనుట మంచిదని అనుకొంటిని. మధ్య మధ్య నందిగామ వెళ్లుచుంటిని. మే నెలాఖారున నా ఉద్యోగమును గురించి మా ముఖ్యబంధువు చేమర్తి మల్లికార్జునరావుగారితో సంప్రదించితిని. వారు అదివరకు కొంతకాలము నుండి మునగాల ఎస్టేటులో పని చేయుచుండిరి. మల్లికార్జునరావు గారు యదార్థవాది, నిష్కల్మష సలహాకర్త యగుటచే రాజాగారు ఆయనను చాల గౌరవించు చుండెడివారు.

రాజాగారు తన వితంతు మరదలు యగ్రసాని రుక్కమ్మగారి వ్యవహారములను కనిపెట్టు చుండెడివారు. రుక్కమ్మగారి తరఫున ఒక మనిషిని ఏజెంటుగా నుంచవలెనని రాజాగారికభిలాషయుండెను. ఆ సంగతి మల్లికార్జునరావుగారికి తెలిసి ఉండుట చేత నాకు ఒక ఉత్తరము యిచ్చి రాజాగారి దగ్గరకు పంపెను. నేను జూన్ నెలలో హైద్రాబాదు వెళ్లితిని. మునగాల రాజాగారు మురళీధరబాగ్‌లో ఒక యింటిని అద్దెకు తీసికొని కుటుంబయుక్తముగానే బసచేసి యుండిరి. నేనుత్తర మీయగానే పూర్వ చరిత్రయంతయు ఆయన విచారించెను. నీవు పరీక్షలో తప్పక ప్యాసుకాగలవు. వకీలు కాగలవు. మా ప్రయివేటుద్యోగములో నుండలేవు గనుక నిన్ను నియామకము చేసియుంటే లాభములేదని చెప్పిరి. నేను అదృష్టవంతుడను కాను. గనుక పరీక్షలో ప్యాసుకాగలననే ఆశలేదు. ఒకవేళ నేను ప్యాసు అయినను కనీసము ఒక సంవత్సరము వరకైన తమ ఉద్యోగములో నుండెదనని చెప్పితిని. మా ఉభయులలో యేనిర్ణయము జరుగలేదు. ప్రతిరోజు వారివద్దకు నేను వెళ్లుచుండెడివాడను.

నాకు యేవో కొన్ని ఉరుదు కాగితములిచ్చి తెలుగు తర్జుమా చేయుటయో లేక నకళ్లు వ్రాయించుటయో చేయుచుండెడివారు. వారివద్దకు హైద్రాబాదు విద్యార్థి సంఘములో నుంచి చాలమంది వచ్చిపోవుచుండెడివారు. మునగాల రాజాగారు విజ్ఞాన చంద్రికామండలి మరియు కృష్ణదేవరాయాంధ్ర భాషా స్థాపకులలో నొకరని ఆంధ్రులకందరకు తెలియును. వారి వద్దకు వచ్చెడివారిలో ఒకరు రావిచెట్టు రంగారావుగారు కూడ యుండిరి. వారిపేరు నేను అదివరకే వినియుంటిని. రాజాగారు నాకు వారితో పరిచయము కలిగించిరి. వారుదార స్వభావులు. స్నేహపాత్రుడగనుక వారు రాజాగారి వద్దకు వచ్చినప్పుడెల్లను నాతో కూడ మాట్లాడుచుండెడివారు. జూలై మొదటివారము పరీక్ష ఫలితములు బయటపడునని ఒక వదంతి వినపడెను. ఆ సంగతి రాజాగారికి చెప్పితిని. తెలిసికొనుటకు నన్ను హైకోర్టుకు వెళ్ళుమని రాజాగారు చెప్పిరి. 10 గంటలకు భోజనము చేసి బయలుదేరితిని. దారిలో నాకదివరకు కమిటీలో సహాధ్యాయిగా నుండిన శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారు కూడ హైకోర్టుకు వెళ్ళుచూ నాతో కలిసిరి. ఉభయులము హైకోర్టుకు పోయితిమి. కొంతసేపటిలో ఒక చిన్నకాగితము తెచ్చి హైకోర్టు గుమాస్తా దర్వాజకు అతికించెను. వందలాది విద్యార్థులు పరీక్షా

ఫలితములను నిరీక్షించుచుండిరి. కాగితము చిన్నది. దానిలో 34 పేర్లుండెను. అది యెత్తుప్రదేశమున అతికించబడెను. పరీక్షలో చేరిన విద్యార్థుల సంఖ్య దాదాపు 1050 ఉండగా వారిలో 34 పేర్లు మాత్రమే కనబడుటచే నేను నిరాశచెంది నీరైతిని. ఎక్కిచూచుటకు సాహసించలేకపోతిని. ఇంతలో మా మిత్రులు పింగలి మాధవరావుగారు పైకిఎక్కి పేర్లు చదివెను. అందులో నాయన నాపేరు గట్టిగా చదివెను. రంగారెడ్డిగారిపేరు కూడ తెలిసికొంటిని. సంతోషించితిమి. మేముభయు లము యింకా ఒకరిద్దరు గెలుపొందిన విద్యార్థులు అమితోత్సాహముతో మౌల్వి సాహెబుగారిని దర్శించుటకు కమిటీకి వచ్చితిమి.

ఆయన రిజల్టుకాపీని తెప్పించుకొని తన ముద్రణాలయములో కొన్ని ప్రతులను ముద్రించెను. అందులో తన శిష్యవర్గము పేర్లను ఎఱ్ఱసిరాతోను తక్కినవి నల్లసిరాతోను ముద్రింపించెను. నేనును రంగారెడ్డిగారున్ను వారికి కృతజ్ఞతా వందనము చేసితిమి. వారు మాకు అభినందన ఆశీర్వాము తెలిపిరి. కొంత దూరము కలిసిపోయి ఒకరి నొకరము కౌగలించుకొని ఎవరి బసకు వారు వెళ్లి పోతిమి. నా చేతిలోనున్న మా కమిటీలో ముద్రింపబడిన రిజల్టుకాపీని శ్రీ రాజాగారికి చూపించితిని. రాజాగారు నవ్వుతూ యీ జ్యోతిష్యమును నేను మొదలే చెప్పితిననిరి. ఆ రాత్రి బసకు వెళ్ళితిని. అచ్చట వారి అన్న నరసింహారెడ్డిగారు కూడ ఉండిరి. నరసింహారెడ్డిగారు రాజాగారికి జనకస్థానమున జ్యేష్టసోదరుడు. రాజాగారు తొర్రూరు పరగణా భూముల పొందుబాటు వగైరాలు చేయుచుండెడి వాడు. మేమందరము సమావేశమై సంతోషముగా మాట్లాడుకొనుచుంటిమి. రాజా గారు మరల వకీలు అయిన నన్ను తాను ఉద్యోగిగా నుంచుకొనుటకు సందేహ మును వెళ్ళబుచ్చుతూ తాను నన్ను నిన్నటివరకు తల్లంపాడు పరగణాకే గాక తొర్రూరు పరగణాకు కూడ ఏజంటుగా నుంచవలెనని అనుకొనుచుంటి ననియును ఆయన వకీలు అయినాడు గనుక ఆ సంకల్పము విరమించుకుంటున్నా ననియును చెప్పెను. అంతట వారి అన్నగారు అక్కడనే వుండి వరంగల్లులో మనకు పరిమినెంటు వకీలుగా కొంతకాలము నుండి ఉదయరాజు వెంకటేశ్వర రావు పనిచేయుచుండి రనియును వారు బహుళ కార్యనిమగ్నులగుటచే మన పనుల యందు శ్రద్ధ చూపుటలేదనియును వీరు వరంగల్లు లోనుండి మన పనులను చూచునట్లును వారికి నెల ఫీజుగా ఏదైన యేర్పాటు చేయుట యుచిత మనియును

చెప్పిరి. అందుకు శ్రీ రాజాగారు అంగీకరించిరి. వారప్పుడు వరంగల్లులో నడుచుచున్న యరసాని రుక్కమ్మగారి తాలూకు కొన్ని ఫైళ్ళను కొన్ని రూపాయిలను నాకిచ్చి వరంగల్ వెళ్ళి మకాం పెట్టి పని ప్రారంభించుమనిరి. ఇంతటితో ఆశాజనక జీవితము ప్రారంభించుటకు దారి లభించెను.

శ్లో. మూకం కరోతి వాచాలం పంగుం లం యతేగిరిం
యత్కృపాత మహం వందే పరమానంద మాధవం..

* * *

# నాలుగవ అధ్యాయము

*ప్రకరణము - 1*

## స్వతంత్ర జీవనారంభము

వకాలత్ పరీక్షలో గెలుపొందిన తరువాత జులై నెలలో శ్రీ మునగాల రాజాగారి శలవు తీసికొని పరిటాల వచ్చితిని. పాత స్నేహితులందరిని కలిసితిని. నేను ప్యాసైనందుకు అందరును సంతసించిరి. జీవితములో మార్పు వచ్చినది. కాని సర్వవిధముల విద్యార్థి దశకన్న నాలో యేమి ఆధిక్యత లేదని చెప్పక తప్పదు. జగన్నాధపురం వచ్చి తలిదండ్రులను సందర్శించి శుభవార్త తెలిపితిని. నేను పరీక్షలో గెలుపొంది న్యాయవాది నగుటయు వరంగల్‌లో నుండి పని నేర్చుకొని వృత్తి నవలంభించుటకు శ్రీ మునగాల రాజాగారి ఆశ్రయము దొరుకుటయు శుభసూచకములైనవి. వెంటనే నేను హనుమకొండ వచ్చితిని. అక్కడ నాకు యెవ్వరును పరిచితులు లేరు. మాడపాటి హనుమంతరావుగారి పేరు మా స్నేహితులవల్ల వినియుంటిని. బహుశః ఒక పర్యాయము యెచ్చటనో దర్శనము చేసితిని. కాని అంతగా పరిచయము లేదు. నేను హనుమకొండ వెళ్ళి వారిని దర్శించి నా సంకల్పము చెప్పితిని. వారు నాతో చాలా ఆదరముగా మాట్లాడి వరంగల్‌లో నుండి పని నేర్చుకొని ప్రాక్టీసు చేయుమని నాకు సలహాచెప్పి ధైర్యము నిచ్చిరి. వారుండే ఇంటికి కొంచెము దూరములో వారు నాకు ఒక ఇంటిలోని రెండు గదులను అద్దెకు యిప్పించిరి. మరికొందరితో పరిచయము కలుగజేసిరి. వారిలో ముఖ్యాతిముఖ్యులు ఆలూరు గురురాజరావుగారు. ఆయన సుగుణ సంపత్తిని, త్యాగశీలతను ఎంత వ్రాసినను తక్కువయే యనవచ్చును. చింతలపూడి గోపాలరావుగారు ముద్గవి శ్రీనివాసరావుగారు ఆయన తమ్ముడు

వాసుదేవరావు గజరాజసింగు గార్లు నుండిరి. మరియు అంతకు పూర్వము నుంచి పనిచేయుచున్న కొండపల్లి సీతారామారావుగారితో కూడా పరిచయము కలిగెను. ఆయన నన్ను సోదరునికన్న ఎక్కువ ప్రేమతో చూచుచు వకీలు వృత్తికి కావలసిన విషయములు తెలుపుచూ సహాయము చేయుచుండెను. 4 రోజులు మాత్రము ఉండి మరల ఇంటికివెళ్ళి నాసోదరుడు నాగభూషణరావును చదువు నిమిత్తం తీసికొని వచ్చితిని. ఇద్దరము వంట చేసుకొని భోజనము చేయుచుండే వారము. హనుమకొండలో ఎక్కువ హోటళ్లులేవు. తుంగమ్మ అనే కర్నాటక వితంతువు ఒక హోటలు పెట్టి మితముగా కొందరికి మాత్రము భోజనము పెట్టుచుండెడిది. నాగభూషణరావు వచ్చిన వారం పది రోజులలోనే నా భార్య నా కుమార్తె వచ్చిరి. మేము నలుగురము చిట్లపొట్ల అమ్మక్కగారి గదులలో ఉండే వారము. అప్పుడు ఆగస్టు మాసము అగుటచే పట్టాతీసుకొనే సమయము కాదు గనుక పట్టా తీసుకొనలేదు. సనదు తీసుకొనుటకును కోర్టు డ్రస్ కొఱకును మా నాయనగారు రు. 50 పంపిరి. నాకు ఎఱ్ఱసాని రుక్కమ్మగారి కొన్ని ఫైళ్ళు ఇవ్వబడినవని చెప్పితిని. అదివరకు పని చేయుచున్న వకీళ్ళపైన తృప్తిలేకుండెను. నేను యూసూఫ్ హుసేన్ సాహెబు అనే వకీలు దగ్గరకు వెళ్ళి మాట్లాడితిని. ఆయనకు వకాలతునామా యిప్పించితిని. ఆ సందర్భములో నాకు ఆయనకు కలిగిన పరిచయము వల్ల నన్ను జూనియరుగా ఉంచుకొని పని చేయించమని నేను కోరుటయు ఆయన అంగీకరించుటయు జరిగినది. తరువాత అక్టోబరు నెల (ఆజుర్) వచ్చినది. పాత సనదులు మార్చి కొత్త సనదులు తీసుకొనేవారును, నూతన సనదులు సంపాదించేవారును, ఆ సమయముననే దరఖాస్తులు యివ్వ వలసి ఉంటుంది.

* * *

ప్రకరణము - 2

# సనదులు తీసుకొనుటలో కష్టము

అప్పుడు సనదుకొరకు హైద్రాబాదు వెళ్ళి హైకోర్టులో దరఖాస్తు పెట్టి కొన్ని రోజులు పైరవిచేసి సనదు సంపాదించు కొనవలసి ఉండెడిది. ఈ పనికి వారం రోజులైనను హైదరాబాదులో ఉండవలసి వచ్చెడిది. స్టాంపులు మొదలగు ఖర్చులేగాక ప్రయాణమునకు తిరుగుటకును హోటళ్ళకును ప్రతి వకీలునకును కొన్ని రూపాయలు ఖర్చు పెట్టవలసి వచ్చెడిది. నేను ఈ పనికొరకు కొండపల్లి సీతారామారావుగారి వెంట హయిద్రాబాదు వెళ్ళి ఒక హోటలులో ఉంటిని. ఒకటిరెండు పర్యాయములు రావిచెట్టు రంగారావుగారి ఇంటికి వెళ్ళితిని. నాది మొదటి సనదు అగుట వలన ఆలస్యము జరిగినది. భోజనములో అవకతవకలు జరిగినందు వలన సనదు తీసికొని హనుమకొండకు వచ్చేటప్పుడు అజీర్ణవ్యాధిని కూడా తెచ్చుకొంటిని. ఈ వ్యాధితో హనుమకొండలో బాధపడవలసి వచ్చెను. ఆ రోజులలో డాక్టరు శివలెంక రామలింగంగారు అనే ఆయన వైద్యుడుగా నుండెను. చాలా మంది ఆయన వద్దనే మందు తీసుకొనుచుండెడివారు. నేను కూడా ఆయన వద్దకే వెళ్లితిని. కొన్ని రోజులు మందులిచ్చెను. కాని నెమ్మదించ లేదు. 15 రోజుల తర్వాత శ్రీ మాడపాటి హనుమంతరావుగారు తానున్న యింటిలో కొంతభాగమును నాకు అద్దెకు ఇప్పించిరి. నేను ఆ యింటిలో ప్రవేశించితిని. అక్కడ నుంచి నేనును శ్రీ హనుమంతరావుగారును యేక కుటుంబీ కులవలె స్నేహమును పెంపొందించుకొనుచు ఉండసాగితిమి. యూసుఫ్ హుసేను గారి దగ్గర జూనియర్‌గా పనిచేయసాగితిని. కొండపల్లి సీతారామారావుగారు

కూడా తనవద్దనున్న ఫైళ్లను చదువుటకు నాకు యిచ్చుచు వ్యాజ్యస్వభావములను ఆయన నాకు బోధించు చుండెను. కాని వ్యాధి నెమ్మదించనందున గత్యంతరము లేక నేను పరిటాల జగన్నాధపురం వెళ్ళుటకు నిశ్చయించుకొని నా తమ్ముడిని నీలికుర్తికి పంపితిని. నేను పరిటాల వచ్చితిని గాని నేను మామగారి ఇంటియందు ఉండుటకు యిష్టములేక జగన్నాధపురం స్వగృహములో చేరితిని. అంతకుముందే అనగా నేను వరంగల్ ప్రవేశించగానే మా నాన్నగారు జగన్నాధపురం వదలి అమ్మగారితో సహా నీలికుర్తి కేగిరి. ఖాలిగానున్న యింటిలో నేనును నా భార్యయు ప్రవేశించి గ్రామీణ వైద్యులవద్ద చికిత్స చేయించుకొంటిని.

లాభములేకపోయినది. నా శ్రేయోభిలాషి యద్దనపూడి వెంకటసుబ్బయ్య గారు చదువుకొనుటకు కొంత అప్పుగానిచ్చి యుండిరని పైన వ్రాసితిని. వెంకట సుబ్బయ్య గారు వైద్యములో కొంత ప్రావీణ్యత కలవాడు. ఆయన నా వ్యాధిని తెలిసికొని ఆయన షడ్డకుడికొరకు తయారిచేసిన సుగంధపాల వేళ్ళ లేహ్యమును నాకు యిచ్చెను. ఒక నెలరోజులు జుజ్జూరులో నుండి ఔషధము సేవించి ఆరోగ్యము పొందితిని. మరల కుటుంబ యుక్తముగా హనుమకొండ చేరి శ్రీ హనుమంతరావుగారి ప్రక్క భాగపు యింటనే ప్రవేశించితిని.

* * *

*ప్రకరణము - 3*

# గ్రంథాలయ సేవ

మునగాల రాజా శ్రీ నాయని వెంకటరంగారావు గారి దీవాన్ కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, అయ్యదేవర కాళేశ్వరరావు రావిచెట్టు రంగారావు గార్లు మద్రాసులో విజ్ఞాన చంద్రికా మండలిని ఏర్పాటుచేసి ఆధునిక విజ్ఞానమును ప్రసరింపజేయుటకు బూనుకొనిన సంగతి ఆంధ్రులందరికి తెలిసిన విషయమే. కొలది రోజులలో శ్రీ మునగాల రాజా, లక్ష్మణరావు ప్రభృతులు మొదట హయిద్రాబాదు నందు కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయమును స్థాపించిరి. తర్వాత శ్రీ మునగాల రాజాగారును వారి దివాన్ కొమర్రాజు లక్ష్మణరావుగారును హనుమకొండలో కూడా ఒక గ్రంథాలయమును స్థాపించ సంకల్పించి, 1904 సం. ఫిబ్రవరి 2వ తారీఖున అప్పటి సుబేదారు రాయమురళీధర్ గారి ఆధ్వర్యమున సభచేసి శ్రీ రాజరాజనరేంద్రాంధ్ర భాషా నిలయమనుపేర ఒక గ్రంథాలయమును స్థాపించిరి. ఆ భాషా నిలయమునకు శ్రీ రాయమురళీధర్ సుబేదారుగారు అధ్యక్షులుగాను దోషకులుగాను ఉండిరి. దానికి స్థానిక ఆంధ్ర విద్యాధికులలో కొందరు శ్రద్ధతీసుకొని పనిచేసిరి. వారిలో శ్రీ అదాలతు వెంకట్రావు, కొమరగిరి సీతారామారావుగార్లు కార్యదర్శులుగా నుండి పనిచేసిన చిరస్మరణీయులు. వారు సర్కారు ఉద్యోగములలో నుండిరి గనుక స్థలాంతరమునకు వెళ్ళవలసి వచ్చెను. అట్లే మురళీధర్ గారు కూడా హయిద్రాబాదుకు వెళ్లిపోయిరి. ఇక మిగిలిన వారిలో శ్రీ మాడపాటి హనుమంతరావుగారే గ్రంథాలయ నిర్వహణమునకు బాధ్యత వహించవలసివచ్చెను. నేను హనుమకొండ ప్రవేశించి నప్పుడు శ్రీ యల్.పి. కన్నయ్యగారు అధ్యక్షులుగాను తుంగతుర్తి నరసింహ్మారావు గారు

వుపాధ్యక్షులుగాను మాడపాటి హనుమంతరావుగారు కార్యదర్శిగాను పని చేయుచుండిరి. నైజాం ప్రభుత్వములో హిందువులకు రాజకీయ సామాజిక విద్యా వైజ్ఞానికాభివృద్ధికి స్థానము లేకుండెను. తీయని మాటలతో సాధ్యమైనన్ని అవరోధములు కల్పింపబడుచుండెను. శ్రీ హనుమంతరావుగారు వరంగల్ సూబా విద్యాశాఖ ఇన్స్‌పెక్టర్ గారి ఆఫీసులో మీర్ మున్షీగానుండిరి. అప్పుడు శ్రీనివాసాచారి అనే ఒక విద్యాశాఖ ఇన్స్‌పెక్టర్ పనిచేయుచుండెను. పోలీసువారు రహస్యముగా విద్యాశాఖాధికారికి చెప్పుటచే ఇన్‌స్పెక్టరు హనుమంతరావుగారితో నీవు గ్రంధాలయ కార్యదర్శి పదవికి రాజీనామా యీయమని నిర్బంధించెను. ఆ కారణమున హనుమంతరావుగారు నిమిత్తమాత్రముగా తొలగి అప్పుడు స్థానిక వకీలుగా పని చేయుచున్న కొండపల్లి సీతారామారావుగారిని కార్యదర్శిగా ఏర్పాటు చేయించి పనియంతయు హనుమంతరావు గారే చూచుచుండిరి. నేను రాగానే భాషా నిలయములో సభ్యుడుగా చేరితిని. ప్రతిరోజు పత్రికలను, గ్రంథములను శ్రద్ధగా చదువుచుంటిని. హనుమంతరావుగారికి నాయందు ప్రేమవిశ్వాసము అంతకంతకు యెక్కువ కాజొచ్చినది. కొలది రోజులలోనే యెన్నికలు జరిపించి వారు నన్ను కార్యదర్శిగా యేర్పాటు చేయించిరి. ఆనాటినుండి నేటివరకు కూడా శక్త్యానుసారము భాషానిలయమునకు సేవచేయుచునే ఉన్నాను. నేను కార్యదర్శిగా పని చేయుట మొదలు పెట్టిన తరువాత విజ్ఞానచంద్రికా మండలి పక్షమున కూడా పని చేయసాగితిని. సభ్యులను చేర్పించుచు ప్రచురించబడిన గ్రంథములు సభ్యులకు అందచేయుచుండెడివాడను. బహుశః నేను ఈ ఉద్యమములో ప్రవేశించే వరకు గ్రంధాలయములో 300 గ్రంధములు మాత్రమే ఉండెను. విజ్ఞాన చంద్రికా మండలి పక్షమున మాహమ్మదీయ మహాయుగము ప్రచురించబడి యుండ వచ్చును. ఆంధ్రుల చరిత్ర మొదటిభాగమును నేనే సభ్యులకు అందజేసినట్లు జ్ఞాపకము. విజ్ఞానచంద్రికా మండలి కార్యస్థానము మద్రాసునందుండెను. అందులో ఆదిరాజు వీరభద్రరావుగారు ఉద్యోగిగా పనిచేయుచుండిరి. నేను సభ్యుల కందజేసిన పుస్తకముల వెలను రావిచెట్టు రంగారావుగారి దగ్గరకు పంపుచుండే వాడను. ఈ విధముగా నాకు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, ఆదిరాజు వీరభద్రరావుగార్లతోను చాలా మంది గ్రంథకర్తలతోను పత్రికాధిపతుల తోను ఉత్తర ప్రత్యుత్తరములు జరుగుచుండెడివి. ఇదియంతయు హనుమంతరావు గారి సలహా వెంటనే జరుపుచుండేవాడను. వేసవి శలవులలో మునగాల రాజాగారిని దర్శించు టకు నడిగూడెం వెళ్లుచుండెడివాడను. అచ్చట కొమర్రాజు లక్ష్మణరావు గారితో రెండు మూడు రోజులు కలిసి ఉండుటయు వారితొ యెన్నియో

క్రొత్తవిషయములు తెలుసుకొనుటయు తటస్థించు చుండెను. ఇట్లే పండిత మిత్ర స్నేహము అధికము కాసాగినది. నేను ఈ మధ్య ఒకటి రెండు పర్యాయములు హైదరాబాదు వెళ్లితిని. హైదరాబాదు ఆంధ్రులలో రావిచెట్టు రంగారావుగారు ఉదారస్వభావుడు. బంధు మిత్రప్రియుడు. ఆయన ఇంట సాధారణముగా వరంగల్, కృష్ణా, నల్లగొండ జిల్లాల వాస్తవ్యులు యెందరో మిత్రులు భోజనము చేయుచుండేవారు. నేను కూడా వారి ఇంటనే 1, 2 పర్యాయములు అతిథిగా నుంటిని. రావిచెట్టు రంగారావురావు గారు వరంగల్ తాలూకా మడికొండ కాపురస్తుడు. ములుగు తాలూకాలో ఆయనకు కొన్ని భూములు దేశపాండ్యాగిరి రుసుములు ఉండెడివి. వారికి రావలసిన రుసుమును గురించి పనిచేయుటకు నాకు వకాలతునామా కూడా యిచ్చిరి. నేను పని మొదలుపెట్టితిని. 1911 సంవత్సరం జూన్ నెలలో వారు ఆకస్మికముగా అకాల మృత్యువు వాతబడిరి. ఇట్టి మహనీయులు దివంగతులై నందుకు నే నొక్కడనే కాదు అనేక మంది మిత్రులు విచారపడిరి. తరువాత వారి భార్య లక్ష్మినరసమ్మగారు భర్త పేరుప్రతిష్టలు కాపాడుచూ ఎన్నియో దానధర్మములు చేసెను. కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ మందిరము ఆమెగారి వలననే పూర్తి కాబడినది. నేను రంగారావుగారు చనిపోయిన తరువాత వారి దేశపాండ్యా గిరి వారసత్వమును వారి భార్య పేర మంజూరి చేయించితిని. ఇట్లే వారికి సంబంధించిన కొన్ని చిన్న చిన్న వ్యవహారము లలో పనిచేసితిని. ఇంతకన్న వారికి యేమిసేవ చేయజాలకబోతిని. హనుమకొండ భాషా నిలయము రాగన్న దరవాజా వద్దనున్న పింగిలి వెంకట్రామరెడ్డిగారి యింటి ఉపరిభాగమున దాదాపు 30 సంవత్సరములు ఉండెను. యింతకాలము ప్రతిఫల శూన్యముగా తమ యింటి నిచ్చిన ఆశ్రయదాత శ్రీ పింగిలి వెంకట్రామారెడ్డిగారి ఔదార్యము ప్రశంసనీయము. ఏదేని ఒక యింటినికొని అందులో గ్రంథముల నుంచవలెనని నేనును హనుమంతరావు గారును ఆలోచించితిమి. ఒక వెయ్యి రూపాయలలో యిల్లు దొరకవచ్చునని మా అభిప్రాయము. కొద్దిగా చందాలు ప్రారంభించితిమి. 100/– లేక 150/– కన్న యెక్కువ వచ్చియుండలేదు. తరువాత 1912 సంవత్సరం మే నెలలో నిడుదవోలు కాన్ఫరెన్సుకు వెళ్లితిమి. అక్కడ రెండు సభలు జరిగెను. ఒక సభకు కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు అధ్యక్షత వహించిరి. మరియొక సారస్వత సభకు శ్రీ వేదం వెంకటరాయశాస్త్రీగారు అధ్యక్షత వహించిరి. ఈ సభ గ్రామ్య భాషను గురించి వాదోపదవాదములు జరిగెను. సభ పూర్తి కాగానే నేనును శ్రీ హనుమంత రావు గారును రాజమండ్రి వెళ్ళి గౌతమీ గ్రంథాలయము చిలకమర్తి లక్ష్మి నరసింహంగారి యిల్లు చూచితిమి.

అచ్చటనే నాకు రసాయన శాస్త్ర రచయిత శ్రీ వేమూరి విశ్వనాధశర్మగారితోను మంగిపూడి వెంకటశర్మగారితోను పరిచయము కలిగెను. ఆ రోజులలో నా కుమార్తె సరస్వతి చనిపోయెను. నాకు అనారోగ్యము సంభవించుటచే నేను బహుశః 1912 జనవరి మాసములో హనుమకొండ వదలి జుజ్జూరు వెళ్లవలసి వచ్చెను. నాతో మా తల్లిదండ్రులు నా భార్యయు వుండిరి. నందిగామలో 2 మాసములుండి ఔషధసేవ చేసితిని. ఏమియూ లాభించ లేదు. యింతలో తల్లంపాడు వ్యాజ్యం వాయిదా ఉండుటచే మునగాల రాజాగారు నన్ను తప్పక పట్ణం రమ్మని వ్రాసిరి. నేను బహుప్రయాస మీద హైదరాబాదు చేరితిని. వ్యాజ్యములో వాయిదా పడినది గాని నేను అనారోగ్యముగా నుండుటచే మరికొన్ని రోజులు పట్ణంలోనే ఉంటిని. డాక్టరు కెకలోస్కరుతో పరీక్ష చేయించుకొని ఔషధము సేవించ నారంభించితిని. అప్పుడు రాజాగారి చిన్నవాటి ఉపాధ్యాయులు వెలగపూడి రామకృష్ణయ్యగారు పట్ణంలోనే ఉన్నందున నాకు వారి యింటనే భోజన వసతి యేర్పాటు చేసిరి. వారం రోజులలో చాలా భాగము వ్యాధి నెమ్మదించినది. మరల నందిగామ వచ్చితిని. 10, 15 రోజులలోనే రాజాగారి పెంపుడు కుమార్తె రాధమ్మ వివాహము తటస్థించినందున నేను నడిగూడెం వెళ్లితిని. మద్రాసు హైదరాబాదుల మధ్యగల రాజాగారి బంధువులు చాలామంది వచ్చిరి. డాక్టరు లక్ష్మిపతిగారు కూడా వివాహమునకు వచ్చిరి. డాక్టరు ఆచంట లక్ష్మిపతిగారికి ప్రథమ భార్యా వియోగము తటస్థించెను. వారు రజస్వలానంతర కన్యనే వివాహము చేసికొందునని చెప్పి కొన్నిరోజులు ఊరకుండిరి. తుదకు తుమ్మలపల్లి వారింటి ఆడబిడ్డ కాలేజీలో చదువుకొనుచున్న శ్రీమతి రుక్మిణమ్మను వివాహము చేసుకొనెను. అప్పటి ఆచారమునుబట్టి సనాతన పక్ష బ్రాహ్మణులు వారికి పంక్తిలో భోజనము పెట్టేవారుకారు. నడిగూడెం వివాహములో సనాతనులు సంస్కారప్రియులును చాలామంది బ్రాహ్మణులు వచ్చియుండిరి. ఒకరోజు భోజన సమయమున శ్రీ డాక్టరు లక్ష్మిపతిగారు పట్టుబట్టలు కట్టుకొని లడ్డూల పళ్లెము చేతపుచ్చుకొని వచ్చి బ్రాహ్మణులందరికిని లడ్డూలు వడ్డించిరి. యెవరును లేచి పోలేదు. అందరును భోజనము చేసిరి. అప్పటినుండియు డాక్టరు లక్ష్మిపతిరావు గారితో బాగా పరిచయము ఏర్పడినది. తరువాత ఒకటి, రెండు పబ్లికు వుద్యమాలలో కూడా సంబంధము తటస్థించినది. దానిని యింకొకచోట వ్రాసితిని.

అప్పటివరకు నేను శ్రీ యూసూఫ్ హుసేన్‌గారిదగ్గర జూనియర్‌గా నుండి పని నేర్చుకొనుచుంటిని. నాకు యేమి స్వంత కేసులులేవు. నేను నడిగూడెం వివాహము పూర్తికాగానే వెనుకకు మరలితిని. మధిర స్టేషన్‌లో దిగితిని. అప్పుడు

యూసుఫ్ హుస్సేనుగారి వద్ద జ్యూనియర్‌గా నుండుటవలన కొంచెము పరిచయం గల ఒక పెద్దమనిషి నన్ను తన తరపున ఒక చోరీకేసులో పనిచేయుమని కోరెను. అందుకు అంగీకరించి తాలూకా మేజిస్ట్రేటు (జీవన్‌రావుగారి) కోర్టులో వకాలత్‌నామా దాఖల్ చేసి పని ప్రారంభించితిని. కొంత ఫీజు దొరికినది. అదియే నా ఆదాయములో మొదటి మొత్తము. తరువాత 4, 5 వాయిదాలకు వెళ్లి పనిచేసి ఆ కేసును కొట్టివేయించితిని. మధిరలో కొంతమందికి నేను వకీలుగా పనిచేయగలనని తెలియవచ్చెను. నందిగామకు వెళ్లితిని. ఆ రోజులలో అనగా విరోధికృతి సంవత్సర చైత్ర శు 11 రోజున యిప్పుడున్న కుమారులలో జేష్ఠుడు వెంకట సుబ్బారావు పుట్టెను. నందిగామలోనే నామకరణాది సంస్కారములు పూర్తి చేసి జుజ్జూరు వచ్చి జూన్ నెలలో మరల హనుమకొండ చేరితిని. అప్పటి నుంచి క్రమక్రమముగా నాకు పనిదొరక నారంభించినది. కారణాంతరములచే హనుమంతరావు గారి సహనివాసము వదలి మరియొక యింటికి కాపురము మార్చుకొన వలసివచ్చెను.

హనుమంతరావుగారు గ్రంథాలయ విషయములో నాకు పూర్తిగా స్వాతంత్ర మిచ్చిరి. సభలు సమావేశములు వార్షికోత్సవములు ఇత్యాది ఆకర్షణీయమగు కార్యములు జరిపి ప్రజలలో కొంత ఉత్సాహము కలిగించితిని. బ్రిటిష్ ప్రభుత్వములోని రాజకీయ విషయములను గురించి నేను వ్రాయవలసిన పనిలేదు. గాని నైజాములో మాత్రము ప్రజాహిత సంస్థలు నడపుటకు వీలుండెడిది కాదు. చిన్న చిన్న సమావేశములను కూడా అనుమానాస్పదముగా చూచుచుండెడివారు. పత్రికలలోని వార్తలు బహిరంగముగా మాట్లాడుకొనకూడదు. ఆ కారణమున మా ఉత్సాహకరమైన సంభాషణలకు భాషా నిలయమే శరణ్యమైనది. గ్రంథాలయ ములను అచ్చటచ్చట స్థాపించవలెనని మేము అనుకొనుచుంటిమి. వరంగల్‌లో ఒక గ్రంథాలయము స్థాపించబడినది. రాజరాజ నరేంద్రునకును, నన్నయ్య భట్టారకునకునుగల సాన్నిధ్యమును గ్రహించుచు వరంగల్‌లోని గ్రంథాలయము నకు శబ్దాను శాసన గ్రంథాలయమని పేరు పెట్టవలెనని నిశ్చయించిరి. ఆ ప్రకారము నామకరణం చేయబడినది. దాని స్థాపకులలో ముఖ్యులు నా మిత్రులు కీర్తిశేషులైన శ్రీ తూము రంగయ్యగారు వారి సోదరులు వరదరాజగారును అయి యుండిరి. శ్రీ వరదరాజగారు స్వంత బాధ్యతతోనే దాదాపు 30 సంవత్సరములు పనిచేసిరి. ఇప్పటికిని వారి సహాయము ఉన్నది. దీని తరువాత మా మిత్రులు జమలాపురపు వెంకటేశ్వరరావు గారును, హరి బాపయ్యగారును వేముగంటి రామకృష్ణారావుగారును ఖమ్మంలో జ్ఞాన విద్యుత్ప్రవాహినీ భాషానిలయమనే

పేరుతో గ్రంథాలయమును స్థాపించిరి. దాని తరువాత యెర్రుపాలెమునందు మహబూబియా గ్రంథాలయమున్ను, రేమిడిచెర్లలో మల్లేశ్వర గ్రంథాలయమున్ను స్థాపించబడినవి. ఇవన్నియు శ్రీ హనుమంతరావు పంతులుగారి సలహాపైననే స్థాపించబడి నడుపుచుండెడివి. నేనును కించిత్ సలహా సహాయములు చేయుచు మధ్యమధ్య పై గ్రంథాలయముల సభలు సమావేశములకు వెళ్లుచుండెడివాడను. ఇంకను నేలకొండపల్లి, ఇల్లెందు, మడికొండ మొదలగుచోట్ల గ్రంథాలయములు స్థాపించబడెను. స్థానికులు నడుపుచున్నను మేము చందాలు ఇవ్వకున్నను ప్రతీ విషయములోను మా సలహాలు వారికి అవసర ముండెడివి. పోలీసువారు విద్యాశాఖాధికారులు మొదలగు ప్రభుత్వోద్యోగులు భాషానిలయముల ద్వారా రాజకీయ చర్చలు జరుగుచున్నవనిన్ని ప్రజలలో ఉత్సాహము రేకెత్తుచున్న దనిన్ని వారు భయపడుచుండెడివారు. వార్షికోత్సవాది మహా సభలకు ముందుగానే అనుమతి పొందవలసి ఉండెడిది. దానికి కలక్టరువద్ద ప్రయత్నము చేసి అనుజ్ఞ యిప్పించు చుండెడివాడను. సాధారణముగా ఏ విద్యాశాఖాధికారినో, ఏ రివిన్యూ అధికారినో అధ్యక్షుడిగా ఏర్పాటు చేసేవారము. వారు సంతోషముగా అంగీకరించేవారు. అట్లయిన అవరోధములు కలిగెడివికావు. కొన్ని వారిషక సభలలో రేమిడిచెర్ల, యిల్లెందు గ్రంథాలయములకు వెళ్లి అధ్యక్షత వహించితిని. హనుమకొండ భాషానిలయమునకు యెక్కువ ఆదా ఉండెడిది కాదు. పొదుపుగా వాడుచు పత్రికలను నూతన గ్రంథములను తెప్పించుచు కొంచము నిలవకూడా చేసి ఉండెడివారము. ప్రభుత్వ సహాయము కోరగూడదని మా దీక్ష. అట్లా మేము కోరితిమేని ప్రతిరోజు సి.ఐ.డి. పోలీసులు వచ్చి తనఖీ చేయచుండునని మా భయము. మరియు హనుమకొండ సమావేశములలో పాల్గొని మేము ప్రశాంతముగా నడిపించెడివారము. హనుమకొండ భాషా నిలయమునకు శాశ్వత గృహ నిర్మాణ సమస్య ఎప్పటికప్పుడు మాకు కష్టముగానే కనబడుచుండెను. శ్రీ హనుమంతరావు గారును, నేనును కలిసి భాషా నిలయ పోషకుడగు మునగాల రాజాగారిని దర్శించుటకు నడిగూడెము వెళ్లితిమి. రెండు రోజులుంటిమి. మా అంచనా రు. 1000/- లే గనుక రాజాగారు రు. 200/- యిచ్చెదనని వాగ్దానము చేసిరి. మేము బండిమీద ఖమ్మంకు బయలుదేరితిమి. మేము గ్రామాంతము వరకు వచ్చితిమి. ఇంతలో రాణీగారు ప్రసవమై ఒక కుమారుని గనెను. మేముభయులము వచ్చిన కార్యమును దృష్టియందుంచుకొని ఆ చిన్నకుమారునికి రాజాగారు రాజరాజ నరేంద్రారెడ్డి అని నామకరణం చేసిరి.

* * *

*ప్రకరణము - 4*

# వకాలత్ వృత్తి దినదినాభివృద్ధి

స్న 1321 ఫసలీకి పూర్వము ఇల్లెందు బొగ్గుగనుల కంట్రాక్టు యూరోపియన్ కంపినీకి వుండెడిది. ఆ కంపినీవారికి నిజాం ప్రభుత్వము స్థానిక పరిపాలనాధి కారములోను లేబరు కేసుల విచారణ కొరకు మేజిస్ట్రేటు నియమించు టకును అధికారమును తాత్కాలికముగా యిచ్చియుండిరి. తరువాత ప్రభుత్వము వారు తామే ఒక స్పెషల్ మెజిస్ట్రేట్‌ను నియామకము చేసిరి. స్న 1321 ఫసిలీలో ఒక స్పెషల్ మెజస్ట్రీట్‌లో యేర్పాటు చేయబడిన వ్యక్తి గతముగా ఖమ్మం, మధిర, ఇల్లెందు పాలవంచ నాలుగు తాలూకాల యొక్క జుడిషియల్ అధికారము ఆయన కీయబడెను. ఆయనకు 1వ తరగతి మెజీస్ట్రీట్ అధికారమున్ను 2000/-ల సివిలు అధికారమున్ను వుండెడిది. నాకు మధిర తాలూకాలో ఎక్కువ సంబంధముండెడిది. కాబట్టి నేను వెళ్లుచుండేవాడను. మరియు వరంగల్ నుంచి కొండపల్లి సీతారామా రావుగారు కూడా వచ్చేవారు. యింకను ఖమ్మం, మధిర వకీళ్లు కూడా వచ్చెడివారు. ఈ కారణమున శ్రీ కొలిపాక శ్రీ రామరావుగారితోనూ, దివాకరుని పురుషోత్తమ శాస్రి గారితోనూ నాకు స్నేహము అధికము కాజొచ్చినది. కాపురము ఇల్లెందులో యేర్పాటు చేసుకొనలేదు గాని మేము వారమునకు 3, 4 రోజులు ఇల్లెందులో ఉండవలసి వచ్చెడిది. ఆ రోజులలో వరంగల్‌లో దాదాపు 30 మంది వకీళ్లు పని చేయుచుండిరి. వారిలో 20 మంది ముస్లింలును పదిమంది మాత్రమే హిందువులును ఉండిరి.

1912 సంవత్సరం జులై నెల నుండి నా వకాలతులో కొంచెము ఆదాయము వచ్చుచుండెను. శ్రీ హనుమంతరావు గారి జ్యేష్ఠ సోదరుడు తిరుమల రావుగారు సదయహృదయుడు. యెర్రుపాలెములో యిల్లు కట్టుకొని ఉండెడివారు. గాని తరుచుగా హనుమకొండ వచ్చుచుండెడివారు. హనుమంతరావుగారి సహవాసము వలన వారి అన్నగారితోకూడా పరిచయము మైత్రి గాఢముగా జొచ్చెను. వారు సర్వవిధముల నన్నును సోదరునివలెనే ప్రేమతో చూచేవారు. ఆమరణానంతము ఆయన నాకు శ్రేయోభిలాషిగానే ఉండిరి. వారి ఉపకారమును యెప్పటికిని మరువజాలను. హనుమంతరావుగారు యింగ్లీషు, పారసి, ఉరుదు, తెలుగు భాషలలో పాండిత్యము కలిగియున్నను వారికి 40 రూపాయిలు మాత్రమే జీతము లభించుచుండెను. నేను వారిని లా (వకాలత్‌ను) చదువమని ప్రోత్సాహ పెట్టుచుంటిని. వారి అన్నగారితో కూడా చెప్పితిని. వారును అంగీకరించిరి. హైదరాబాదు వెళ్లి లా క్లాసులో చేరి ప్రథమ తరగతి పరీక్షకు వెళ్లవలెనని వారి అభిప్రాయమై యుండెను. ఉద్యోగము వదులుట కిష్టములేదు. యింతలో యినస్పెక్టరు శ్రీనివాసచారిగారు హైద్రాబాదుకు మార్చబడిరి. వారి సహాయముచే హనుమంతరావు గారు కూడా హైద్రాబాదునకు మార్చబడి లా క్లాసులో చేరిరి. యిది 1913 సంవత్సరం జూన్ నెల (1322 ఫసలీ అమర్దాదు) అని జ్ఞాపకము. తరువాత వారు శాసనసభ కార్యస్థానములో తెలుగు ట్రాంసులేటరుగా నియమించ బడిరి. దానికి జీతము నెల 100/–లు లభించుచుండెను.

1915 (1324 ఫసలీ) సంవత్సరంలో మూడవ తరగతి వకాలత్ పరీక్షలో శ్రీ మాడపాటి హనుమంతరావు, తిరుమలరావు గార్లు (సోదర ద్వయం) జమలాపురం వెంకటేశ్వరరావు గోపాలరావుగార్లు (సోదర ద్వయం) ఉత్తీర్ణులయిరి. హనుమంతరావుగారు హనుమకొండ విడచి వెళ్లిన తరువాత ఒకరి వెంట మరియొకరు ముద్దవి శ్రీనివాసరావు, వాసుదేవరావు, చింతలపూడి గోపాలరావు గార్లు హనుమకొండ వదలి స్థలాంతరములకు వెళ్ళిరి. నేను నిస్సహాయుడనైతిని. మా యిరువురికి మిత్రులును యదార్ధవాదియు అయిన ఆలూరు గురు రాజారావు గారు మాత్రము సర్వవిధముల నాకు అండగా నుండిరి. భాషానిలయ కార్యము

లలో సహాయము చేయువారు మరెవ్వరూ లేకుండిరి. మూసివేయలేక విద్యార్థి బృందముతోనే భాషా నిలయమును నడుపుచుంటిమి. తుదకొక పర్యాయము విద్యాశాఖ సహాయాధికారి (డిప్యూటి డైరెక్టర్ శ్రీ వెలింకర్ గారు పర్యటనార్థము వరంగల్‌కు వచ్చిరి. నేను వారిని దర్శించి భాషానిలయమునకు తీసుకొనివచ్చి చూపించితిని. ఆర్థిక సహాయము యిప్పించుటకు కోరితిని. వారు నెల 1కి రు. 10/- చొప్పున గ్రాంటు యిచ్చునటుల ఏర్పాటు చేయించిరి. నాకు వృత్తి పనులలో క్రమాభివృద్ధి కలుగుచుండెను. మధిర, ఖమ్మం తాలూకాలోని బంధుమిత్రులు అభిమానముతో కేసులను పంపుచుండిరి. వారి పేర్లను కేసుల వివరములను వ్రాయుట అనవసరము. కాని కీ.శే. మాడపాటి తిరుమలరావుగారి పేరును మాత్రము స్మరించుట నా కర్తవ్యము కాగలదు. వారు ఆమరణాంతము సర్వదా నా పురోభివృద్ధినే కోరుచుండెడివారు. నేను వరంగల్‌నందే గాక పాఖాల మహబూబాబాద్, ఖమ్మం, మధిర కానాత్ తాలూకాలకును జాగీరు యిలాకా నారసింగికిని సివిల్ క్రిమినల్ రివిన్యూ కేసులలో వెళ్లుచుండెడివాడను. మధిర తాలూకాలో వెంసూరు పట్టి కొంత అరణ్య ప్రదేశమునకు చెందియున్నది. అచ్చట అలవాల శేషగిరిరావు, కోళ్ళూరు జోగారావుగార్లు చాల పలుకుబడి గలవారు. అధికార వర్గము భృత్యాన భృత్యులు. ప్రజలు దాసదాసీలుగా నుండెడివారు. జోగారావుగారి యిజారా గ్రామమగు అమ్మపాలెములోని కొంత భూమిని వెంకటాపురము కాపురస్తుడు పుచ్చకాయల చెన్నారెడ్డి అనే పెద్ద రైతు సేద్యం చేసెడివాడు. అతని బంధుమిత్రులు ఆ గ్రామములోనే 20 ఇండ్ల వారుండెడివారు. శిస్తుల విషయములో రైతులకు జోగారావుగారి మధ్య భేదాభిప్రాయము వచ్చెను. స్థానిక పైజమీందారి ప్రముఖు లేకమైరి. కోళ్ళూరి జోగారావు జమీందార్ల ప్రభృతుల పార్టీ ఒకటిన్ని, చెన్నారెడ్డి రైతుపార్టీ ఒకటిన్ని యేర్పడినవి. నేను రైతు పార్టీ తరపున వకీలుగా నేర్పడితిని. రివిన్యూలోను, క్రిమినల్ లోను కేసుల సంఖ్య పెరుగుచు వచ్చినది. తుదకు ఒక చెఱువు వద్ద పెద్ద పోరాటము జరిగినది. పోలీసువారు ఉభయ పార్టీలలోని 50 మందిపైన బల్వా (రైటింగ్) కేసు పెట్టిరి. నా వద్ద వారి కేసుల సంఖ్య 30 వరకుండవచ్చునని నాకు జ్ఞాపకము. ఆ

రోజులలో తహశ్శీలుదార్లకు డివిజనల్ ఆఫీసర్లు, కలెక్టర్లకు క్రిమినల్ పవర్సు ఉండెడివి. ఈ కేసున్ను మరికొన్ని కేసులున్ను విచారణ కొరకు అప్పటి మధిర డివిజనల్ సబ్‌కలెక్టరు జియావుల్ హుస్సేన్ అనే ఆయన విచారణకు బయలుదేరెను. ఆయన చాల సత్ప్రవర్తన గలవాడు. లంచము తినేవాడు కాడు. సిఫారసు వినేవాడు కాడు. నిష్పక్షపాతిగానుండెను. నిందితులు సాక్షులు చాల మంది ఉండిరి. పోలీసువారి కోరికపై వెంకటాపురములోనే విచారణకు తేది నిర్ణయించబడెను. రైతుల పక్షమున నేను బయలుదేరితిని. నాకు తోడుగా కొండపల్లి సీతారామారావు, కొమర్రాజు వెంకటప్పారావుగార్లు కూడ ఉండిరి. మా పార్టీ నాయకుడు చెన్నారెడ్డి స్థితిగలవాడు. చాలమందికి పెట్టుబడి పెట్టెడివాడు. అసత్యము కలలో ఎరుగడు. చాలా పెద్దమనిషి. జమీందార్ల ప్రయత్నముచే ఆయనపైన బ్రిటిషు పోలీసువారు ఒక డాకా కేసు పెట్టిరి. అందువలన ఆయన ప్రచ్ఛన్నముగా నుండవలసి వచ్చినది. కేసు విచారణ సందర్భములో ఆయన ఉంటే మా పార్టీలకు లాభము. బ్రిటిషు మేజస్ట్రేట్ల వద్ద వకీళ్ళు పనిచేసిరి. కాని లాభములేక పోయెను. నేను మధిర సబ్‌కలెక్టరుగారి వద్దకు వెళ్లి ఆయనవల్ల జమానతు తీసికొని అరెస్టు చేయకుండ పోలీసు కుత్తరువు యిప్పించుమని కోరితిని. ఆయన పోలీసులకు సంగతి తెలుపుమని వ్రాసెను. మేజస్ట్రేటు రివిన్యూ సబ్ డివిజనల్ ఆఫీసరు గనుక పర్యటనలో బకాయ వసూలు పనికూడా చేయుచుండెను. బాకీదారులు వచ్చి మా సాహుకారు చెన్నారెడ్డి లేదు. ఆయన వచ్చేవరకు గడువివ్వుమని కోరుచుండెడివారు. పైజెప్పిన రైటింగు కేసు విచారణలో ప్రభుత్వ పక్షమున పని చేయుటకు ప్రత్యేకముగా నొక డిప్యూటి సూపరింటెండెంటు పంపబడెను. ఆయన అనుభవజ్ఞుడు యోగ్యుడు. ఆయన చెన్నారెడ్డి దరఖాస్తును గురించి నిజమైన సంగతిని తెలిపి కేసు కల్పితమైనదిగా చూపించెను. మేజస్ట్రేటుగారు కోర్టులో చెన్నారెడ్డి ఎటువంటివాడని అడిగిరి. ప్రత్యర్థియైనను కేసు సందర్భములో కోర్టుకు వచ్చియున్న జోగారావుగారు లేచి చెన్నారెడ్డి చాల సత్యవంతుడు. అతనిని అరెస్టుచేసినచోట 12 సంవత్సరములు క్షామము రావచ్చునని చెప్పెను. రిపోర్టు కూడ యదార్థముగానే యుండెను. అది చూచి నాతో వకీలుగారు 200 రూపాయిల జమానతు యిప్పించుమని చెప్పెను. అట్లే

జమానతు యిప్పించితిని. అందుపైన చెన్నారెడ్డిని అరెస్టు చేయవద్దని పోలీసువారికి ఆర్డరిచ్చి ఈ కేసు బ్రిటిషు యిలాకాది గనుక పొలిటికల్ డిపార్టుమెంటు ద్వారా కృష్ణాజిల్లా మేజస్ట్రేటుగారికి తెలియజేసెను. చెన్నారెడ్డి బయటపడినందుకు రైతులు చాల సంతోషించిరి. చాల విషయములలో సబ్‌కలెక్టరుగారు చెన్నారెడ్డిని విచారించుటయు ఆయన సత్యము జెప్పుటయు జరుగుచుండెడిది. సబ్‌కలెక్టరు గారు తాము వినినట్లు చెన్నారెడ్డిని సత్యవంతుడనియే భావించిరి.

ఆ కేసు మొత్తం 17 రోజులు నడచినది. గవర్నమెంటు తరపున పని చేయుటకు వచ్చిన డిప్యూటి సూపరింటెండెంటు నాయెడల చాల స్నేహభావము, గౌరవముగా నుండెడివాడు. ఆయన తాను పోలీసులో పన్నెండు రూపాయిల వేతనముపైన ఉద్యోగిగాచేరి లంచము తినుటమాని క్రమక్రమముగా డిప్యూటి సూపరింటెండెంటు పదవివరకు వచ్చితి ననియును ఇందుకు తన దైవభీతి సత్యవర్తనయే కారణమనియును చెప్పెడివాడు. ఆయన పేరు అబ్దుర్రహమాన్ సాహెబు అని జ్ఞాపకము. స్థానిక సబ్‌ఇనిస్పెక్టరు జమీందారి పార్టీకిలోనై రైతుల పైన రెండు మూడు కేసులు పెట్టెను. పూర్వపు డివిజనల్ మేజస్ట్రేటు రైతులపైన చార్జీచేసిరి (పర్దుజురుం వినిపించెను). డిప్యూటి సూపరింటెండెంటుగారు కేసులలోని వాస్తవమును గ్రహించి సబ్‌యినస్పెక్టరును స్థలాంతరమునకు మార్చుమనియును కేసులను ఎత్తివేసికొనుటకు అనుజ్ఞ యిప్పించుమనియు సూపరింటెండెంట్‌కు వ్రాసి, ఆ సంగతి మేజస్ట్రేటుకు చెప్పెను. మేజస్ట్రేటు గారు నేను తప్పు చేయకుండ కాపాడితినని ఆయనను అభినందించెను. విచారణ పూర్తియైన తరువాత ప్రదేశము చూడుమని నేను మేజస్ట్రేటుగారిని కోరితిని. చెరువునిండ నీరున్నదని సాక్షులు చెప్పినారు. ఏ చెట్ల వద్దనైతె దెబ్బలాట జరిగినదని చెప్పబడుచున్నదో ఆ చెట్లు నీటిలో మునిగి ఉంటవని నిరూపించితిని. ప్రదేశము పైన నీటి పట్టుదల స్థానమును జూపి నావాదనను దృఢపరచుకుంటిని. గాని సబ్‌కలెక్టరుగారికి అది నచ్చలేదు. నా వెంటనున్న చెన్నారెడ్డిని పిలిచి ఆరోజున నీరెక్కడ నున్నదని ప్రశ్నించెను. చెన్నారెడ్డికి నేను చేయువాదన తెలియును. నా వాదన నెగ్గితే కేసు అప్పుడే పోగలదని తెలియును. నిందితులలో కొడుకులు

తమ్ములు యితర బంధువులున్నారు. అయినను అందుకాయన చెట్ల ప్రదేశమును అనగా నేరము జరిగిన ప్రదేశము నీటికి బైటనున్నట్లే చూపించెను. అందుపైన మీ క్లైంటు చెన్నారెడ్డి సత్యవంతుడు. ఆయన చెప్పిన మాటలు యేల నమ్మకూడదని నన్ను ప్రశ్నించెను. నేను ఆయన సత్యవాదియని అగీకరించుచు దీనికి జవాబు తుది సమయమున చెప్పెదనని అంటిని. చెన్నారెడ్డి సత్యము చెప్పినందువలన మేజస్ట్రేటు భావము తిరుగక పోయినది. చెన్నారెడ్డి నా బండిపైన ప్రదేశముపైకి తీసికొని వచ్చుట పొరపాటని ఆయన బంధుమిత్రులు నిందితులును అసమ్మతి తెలిపిరి. చెన్నారెడ్డి తలవంచుకొని నేనెట్లా అబద్ధము చెప్పగలను. అట్లా అబద్ధము చెప్పినట్లయితే నన్ను పుండాఖోరు ముండాకొడుకు అంటారు అనెను. ఆయన సత్యవాక్యము చెప్పినందుకు నేను సంతోషించిన వాడను. గనుక ఆయనను నేను కూడ అభినందించి కేసు రికార్డుపైన వాదించి కొట్టివేయించెదని ధైర్యము చెప్పితిని. సబ్‌కలెక్టరు గారు స్థానిక పరిస్థితులను బాగుగా తెలిసికొని పోలీసు క్రిమినల్ కేసుల వలన శాంతి జరుగదనిన్ని సంధిమూలమున శాశ్వితమగు శాంతి కుదుర్చ వచ్చుననియును చెప్పి నన్ను ప్రయత్నము చేయుమని చెప్పిరి. నేనా సంగతిని ప్రత్యర్థులగు ప్రఖ్యాత పలుకుబడి గలవారైన కాళ్ళూరి జోగారావు, అలవాల శేషగిరిరావుగార్లతో చెప్పితిని. నేను కాళ్ళూరి జోగారావు, అలవాల శేషగిరిరావు గార్లు కలిసి వివాదమును పరిష్కరించుమని కలెక్టరుగారు మాకు చెప్పిరి. ఉభయపార్టీలు మా మధ్యవర్తిత్వము అంగీకరించిరి. క్రిమినల్ కేసులో విచారణ చాలభాగము పూర్తియైనందున వాయిదా మార్పించి రాజీ ప్రయత్నము ప్రారంభించితిమి. రాజీకొరకు 3 రోజులు వరుసగా పని చేసితిమి. షుమారు 70 వివాదములను పరిష్కారము చేయగలిగితిమి. దీనికి ముఖ్య కారణము పార్టీలలో ఎవరును మా ఎదుట అసత్యము మాట్లాడలేదు. అందువలన పరిష్కార ములో మాకు ఎక్కువ ఆలస్యము పట్టినదికాదు. ఇన్ని వివాదములు పరిష్కారము చేసినందువలన అచ్చట 3, 4 గ్రామములలోని కరుణములు జమీందారుల పార్టీకిని, రైతు పార్టీకిని శాశ్వితమైన రాజీ కుదిరి శాంతి స్థాపన జరిగినది. ఈ 3 రోజులు కలెక్టరుగారు కూడ అచ్చటనే ఉండి ఏ రోజు కారోజు సంగతులను

తెలిసికొనుచుండిరి. ఈ విధముగా శాంతిస్థాపనన చేసి బయలుదేరి రాగలిగితిని. ఆ ఫిర్కాలోగల గ్రామోద్యోగులు, రైతులకు నాయందు విశ్వాసము సద్భావ మేర్పడెను. తరువాత ప్రజాహిత కార్యములలోను, రాజకీయములలోను ఆ ఫిర్కాలోని వారసులు నాయెడల ప్రేమ సద్భావము కలిగియున్నారని నేను గట్టిగా చెప్పగలుగుచున్నను. శ్రీ జియావుల్ హసన్ సబ్‌కలెక్టరు గారు మరియొక వుద్యోగమునకు మార్చబడినను హైకోర్టు ఉత్తర్వు ప్రకారం మరల ప్రత్యేకముగా వచ్చి విచారణ పూర్తి చేసి ఆ రైటింగు కేసును అదే మేజస్ట్రేటుగారు విని కొట్టివేసిరి. ఆ కలెక్టరు సత్యవాదియగు చెన్నారెడ్డిని ఎప్పటికిని జ్ఞాపకము చేయుచుండెడివాడు. సిరిసంపదలు పుత్రమిత్రాదులు కలిగి సంపన్నుడైన చెన్నారెడ్డి నిజమగు రైతు అని నే నిప్పటికిని విశ్వాసము కలిగి జ్ఞాపకము చేసికొనుచున్నాను. ఇది 1324వ ఫసలీ పర్ వర్ది నెల (1915 మార్చి) అయి యుండవచ్చును. నేను ఏబది సంవత్సరములలో పనిచేసిన కేసులనేకమున్నను 1925 సంవత్సరమున రైతులలో గల సత్యము, విశ్వాసము, సద్వర్తనను తెలుపుటకే ఈ కేసు సంగతులు మాత్రము వ్రాసితిని.

నేను పరీక్ష అయినప్పటి నుండియు మునగాల రాజాగారి తరపున వకీలుగా నుండి నైజాం యిలాకాలో పనిచేయు చుంటినని పైన చెప్పియున్నాను. వారికి నందిగామ తాలూకాలో మునగాల ఎస్టేటుండెను. అది వారి మాతామహార్జితము. మాతామహులు కీసరవారు. తల్లి కీసరవారి ఆడబిడ్డయగు లచ్చమ్మగారు, మునగాల యెస్టేటు జమీందారిణిగా నుండెను. ఆమె భర్త ఈ జిల్లాలో తొర్రూరుపట్టీకి దేశముఖు. భర్తగారి అనుజ్ఞ ప్రకారము లచ్చమ్మగారు నాయిని వెంకటరంగారావు గారిని దత్తు చేసికొనిరి. ఆ దత్తును గురిం౦ం అతియాత్ రూల్సు ప్రకారము లచ్చమ్మగారు యిచ్చిన దరఖాస్తును నైజాం ప్రభుత్వమువారు విచారించి అంగీకరించిరి. మాతా మహుని జ్ఞాతులగు కీసరవారు నైజాములో ఎన్నియో వ్యవహారములు జరిపిరి. గాని వాటన్నిటిలో వారు గెలువలేకపోయిరి. కృష్ణా డిస్ట్రిక్టు కోర్టులో రెండు వ్యాజ్యములు దాఖలుచేసిరి. అవి చాలకాలము బందరు జిల్లా కోర్టులో పడియుండెను. కోల్‌రెడ్డి అనే డిస్ట్రిక్టు జడ్జి ప్రత్యేక శ్రద్ధవలన

1915 విచారణకు వచ్చెను. ఆ కేసులో అంతకుముందు నైజాము కోర్టులో కమీషనరు విచారణపైన అనేక దస్తావేజులు 60 మంది సాక్షులు విచారింపబడిరి. బందరు కోర్టులో విచారణ ప్రారంభమాయెను. కె.వి లక్ష్మణరావు గారు మునగాల యెస్టేటకు దివానుగానుండిరి. రాజాగారి పక్షమున దివాన్ బహద్దూర్ టి. రంగాచారిగారు స్థానిక ప్రముఖ న్యాయవాదులు కీ. శే. శెడించి హనుమంతరావుగారు, జంర్యాల గౌరీనాధశాస్త్రీగారు పనిచేయుచుండిరి. కీసరవారి తరఫున ప్రఖ్యాత న్యాయవాది కె.శ్రీనివాస అయ్యంగారు బందరువచ్చి పనిచేయుచుండిరి. నైజాం గవర్నమెంటు దస్తావేజులు సాక్షులు. ఈ వ్యాజ్యమునకు మూలాధారము గనుక రాజాగారు నన్ను ప్రత్యేకముగా పిలిపించిరి. బందరులో విచారణ దాదాపు 20 రోజులు వరుసగా జరిగినది. నేను కూడా విచారణ ముగిసేవరకు బందరులోనే ఉంటిని. నైజాం యిలాకా రివిన్యూ సివిల్ కోర్టులలో జరిగిన వ్యవహారములోని పబ్లికు నకళ్ళు చాల ఉండెను. గనుక వాటిని గురించి నావల్ల తెలసికొనుటయు నా అభిప్రాయము తీసికొనుటయు జరుగుచుండెడిది. చాలా దస్తావేజులుండెడివి. కేసు చాల పెద్దది. మద్రాసునుంచి వచ్చిన ప్రముఖ న్యాయవాదులు పనిచేయుచుండిరి. కనుక నేను ఎన్నియో క్రొత్త సంగతులను గ్రహించగలిగితిని. ఒక గదిలో దస్తావేజులన్నియు పరచి పెట్టబడి ఉండెడివి. ఆ గదిలోనికి రాజాగారు దివాను లక్ష్మణరావు గారు నేను తప్ప మరెవ్వరు వెళ్ళకుండెవారు. విచారణ మధ్యకాలమున ముఖ్యాతి ముఖ్యమైన పది పన్నెండు నైజాం పబ్లికు కాపీలను దాఖలు చేయవలెనని నేను లక్ష్మణరావుగారును అనుకుంటిమి. కాని వాటిపైన హైదరాబాదు రెసిడెంటు సర్టిఫికేషన్ కాలేదు. ఈ దస్తావేజులు దాఖలు చేయుటకు వీలు లేదని లక్ష్మణరావుగారు ఆందోళన పడుచుండిరి. ఇప్పటివరకు కొన్ని వందల పబ్లికు కాపీలపైన రెసిడెంటుగారితో సర్టిఫై చేయించి దాఖలు చేసి యుండియు వీటిని సర్టిఫై చేయించుట మరచితి మనుకొనిరి. దేశీయ గవర్నమెంటు దస్తావేజులు గనుక రెసిడెంటు సర్టిఫై లేకున్నను దాఖలు చేయవచ్చునని నేను సలహా ఇచ్చితిని. నేను నైజాం చిన్నవకీలును గనుక న్యాయశాస్త్ర జ్ఞానమును గురించి వారికి అంతగా విశ్వాసములేదు. వేయేల నేడు తెలంగాణావాసుల

విజ్ఞానమును గురించి ఆంధ్రమండలి వాసులు ఇదే అభిప్రాయమును కలిగి యున్నారు. నేనును శ్రీ లక్ష్మణరావుగారును దివాన్ బహద్దూర్ శ్రీరంగాచార్యుల వారి వద్దకు వెళ్ళితిమి. మేము తెచ్చిన దస్తావేజుల ప్రాముఖ్యత వాటి నిప్పటివరకు దాఖలు చేయుటలో జరిగిన పొరపాటును గురించియు రెసిడెంటు సర్టిఫైలేని లోపమును చెప్పి ముందు కర్తవ్యమును గురించి సలహానడిగిరి. మరియునన్ను వారికి పరిచయము కలుగజేసి ఈయన దాకలు చేయవచ్చునని సలహా ఇచ్చుచున్నాడనెను. వారు నాకైచూచి తెలిసికొను భావమును సూచించిరి. నేను సాక్ష్యశాస్త్రములోని రెండు సెక్షన్‌లను చూపించి ఒకదానినిబట్టి దేశీయ గవర్నమెంటు యగు నైజాం యిలాకా పబ్లికు కాపీలను సర్టిఫై అవసరము లేదనియును రెండవ దానినిబట్టి విదేశ ప్రభుత్వముయొక్క పబ్లికు కాపీలను గురించి మాత్రమే రెసిడెంటు లేక పొలిటికల్ ఏజంటు సర్టిఫై అవసరమనియును చెప్పితిని. వెంటనే వారి వద్ద పని చేయుచున్న ఒకరిద్దరు జూనియర్ వకీళ్లు సాక్షశాస్త్రములోని రెండు సెక్షన్లను చదివి వాదనను బలపరచిరి. రంగాచార్యులు గారు కూడా ఆమోదించిరి. తరువాత శ్రీ రంగాచార్యులుగారు నేను వీరిని కోర్టులో ప్రతిరోజు చూచుచుంటిని. గాని వకీలు అనే సంగతి నాకు తెలియదని చెప్పుచున్నా స్థితిగతులను గురించి మరికొంతసేపు మాట్లాడిరి. పూజ్యులును నా శ్రేయోభిలాషియునగు లక్ష్మణరావు గారు నన్ను గురించి చెప్పి తన సంతోషమును వెలిబుచ్చిరి. తరువాత ఆ కేసులోని కొన్ని విషయములను గురించి ప్రఖ్యాత న్యాయవాదియు హైదరాబాదు శాసనసభా సభ్యుడును అయిన గిరిరావుగారిని తీసికొనివచ్చి న్యాయశాస్త్ర నిపుణుడుగా సాక్ష్య మిప్పించితిని. తుదకు ఆ వ్యాజ్యము రాజాగారికి అనుకూలముగా పరిష్కారమ య్యెను. హైకోర్టులోను ప్రి.వి. కౌన్సెలులోను రాజాగారె గెలిచిరి. ఆ కేసులో శ్రీ కాళేశ్వరరావుగారు సాక్షులను పరిశీలించేపని పెట్టుకొనిరి.

1324వ ఫసలీలో జములాపురపు వెంకటేశ్వరరావు, గోపాల రావుగార్లు 3వ తరగతి వికాలత్ పరీక్షలో నుత్తీర్ణులైనారని పైనవ్రాసితిని. తరువాత కొలది రోజులకు గోపాలరావుగారి అన్న సుబ్బారావుగారు గోపాలరావుగారిని నా వద్దకు

తీసికొనివచ్చి నా వద్ద జూనియరుగానుంచెను. శ్రీ గోపాలరావుగారి కుటుంబము నకు మా కుటుంబమునకును తరతరముల నుంచి బంధుత్వమున్ను, గోపాలరావు గారి  అన్న వెంకటేశ్వరరావుగారు నా సహాధ్యాయిగనుక గోపాలరావు గారు నాయెడల ప్రేమతోను గౌరవముతోను నా వద్దనే పనిచేయుచుండిరి. హనుమకొండలోనే నివాసమేర్పరుచుకొనిరి. 4 సంవత్సరములు నావద్ద జూనియరుగా పనిచేసి 1328వ ఫసలీ నుంచి ఆయన స్వతంత్రముగా తన వృత్తిని నెరవేర్చుకొనుచు హనుమకొండ న్యాయవాద ముఖ్యులలో ఒకరుగా నుండి పనిచేయుచున్నారు. 1324వ ఫసలీలో మా చెల్లెలు వివాహము తటస్థించినది. అప్పటివరకు నా వికాలత్ కొంత అభివృద్ధిగానే ఉండినదిగనుక మా తండ్రి పినతండ్రిగార్లు పెద్దలున్నారు గనుక వారికృతముగానే వివాహము పూర్తి కాబడినది.

* * *

*ప్రకరణము - 5*

# మొదటి తరగతి

# వకాలత్ పరీక్ష కొరకు ప్రయత్నము

నేను నా వృత్తి విషయములలో క్రమక్రమముగా అభివృద్ధికి వచ్చుచుంటి నని వ్రాసియున్నాను. నేను 1325 ఫసలీ ఆకరులో 7 సంవత్సరముల అనుభవమును పూర్తి చేసికొంటిని. 1326వ ఫసలీ 1వ తరగతి న్యాయవాది పరీక్షలో చేరవలెనని సంకల్పించితిని. గాని అందులో 3వ తరగతి పరీక్షకన్న కొన్ని పుస్తకములు అధికముగానుండెను. వాటిలో కొన్నిటిని నేను కొందరు వకీళ్ల సహాయముతో చదువగలిగితిని. గాని 1) ఉసూలెపిక్కా (ముస్లిం శాస్త్రము), 2) మెడికల్ జూరిస్ ప్రూడెన్సు గురుముఖతా చదువవలసి వచ్చెను. రెండవ గ్రంథమును చదువుటలో నాకు అప్పుడు వరంగల్లులో సివిల్ సర్జన్‌గా నున్న డాక్టరు వికాజీగారు అప్పుడప్పుడు సందేహాలను నివర్తిచేయుచు చాల సహాయము చేసెను. మొదటి గ్రంథము ముస్లింశాస్త్రము. అది మహమ్మదన్‌లాతో సంబంధము లేనిదని చెప్పవచ్చును. మూలము అరబ్బీ భాషలోనుండెను. అప్పటివరకు దానిని ఉర్దూలో తర్జుమా చేసియుండలేదు. ముస్లిం న్యాయవాదులలో చాలమంది అరబ్బీభాషలో ప్రావీణ్యత లేనివారేగనుగ వారు నాకేమియు సహాయము చేయజాలక పోయిరి. గాని మౌల్విహఫీజుల్ హఖ్ అనే వృద్ధన్యాయవాది అరబ్బీ పండితుడొకరుండెను. వారిని నేను బోధించుటకు ప్రార్థించితిని. వారు చాల సంతోషముతో నంగీకరించిరి. వారు 3, 4 మాసములు ప్రతిరోజు నాకుకొంత

నోట్సు వ్రాయించిరి. నేను దానిని శ్రద్ధగా చదివితిని. అందుఒకచోట శాస్త్రవేత్తకు 4 విశేషము లుండవలెనని వ్రాయబడి యున్నది. 1. అఖల్ (బుద్ధి) పిచ్చివాడు గాకుండా నుండుట. 2. జబ్తు అనగా ధారణాశక్తి, వినిన దానిని, చదివిన దానిని మరువకుండుట. 3. అదాలత్ న్యాయవర్తన. 4. ఇస్లాం... దీనికి ఆ గ్రంథములో చేయబడిన నిర్వచన మేమనగా ఈశ్వరునియొక్క నామములు. గుణములను గురించి వాచా స్మరించుటయు ఆత్మీయమైన విశ్వాసముంచుటయు అని వ్రాయబడినది. దీనిని గురించి ఆస్తికుడైన ప్రతి మానవుడును ముస్లిం అని పిలుపించు కొనవచ్చునుగదా అని మౌల్వీ సాహెబుతో అంటిని. ఆయన చాల బుద్ధిమంతుడు. గనుక వాస్తవమేగాని ముస్లిములలో రెండు విశేషము లుండవలెను. 1. ఏకమేవా ద్వితీయం బ్రహ్మ (లాయిలాహ యిల్లిల్లా) ఈశ్వరుడు తప్ప మరియొక దైవములేదు. 2. మహమ్మద్ రసూలెల్లా అనగా మహమ్మదే ప్రవక్త. రెండవ దానిని మతాంతరులు అంగీకరించరు. గనుక దీనివలన మహమ్మదీయ మతమునకు ప్రత్యేకత యేర్పడినదని ఆయన బదులు చెప్పెను. ఆయన మత పక్షపాతములేని బుద్ధిమంతుడు. పై జెప్పిన రెండు ప్రత్యేక గ్రంథము లలో నాకు జ్ఞానబోధము చేసిన డాక్టరు వికాజిని మౌల్వీహఫీజుల్ హఖ్‌ను నేటికిని స్మరించుచున్నాను. 1326 ఫసలీ అవ్వల్ దర్జా వికాలత్ పరీక్ష (మొదటి తరగతి న్యాయవాది పరీక్ష)లో నేను చేరితిని. నాకు 9 పేపర్లలో ఒక్కొక్కదానికి 50కి మించిన మార్కులును రెండు పేపర్లలో 40కి మించిన మార్కులును వచ్చెను. గాని సివిల్ ప్రొసీజరుకు సమానముగా నున్న గిష్తినిషాన్ 2 దివానిలో పేపరులో 22 మాత్రమే ఈయబడెను. అనగా పరీక్షకుడుగా నున్న నవాబుసాద్ జంగు బహుద్దూర్ గారు యిచ్చిరి. వా రేసమయమునన పేపరు చూచిరో చెప్పజాలను. ఎగ్జామినర్సుబోర్డు (పరీక్షకుల సంఘు) సమావేశమైనది. 40, 50 మంది విద్యార్థు లలో ఒకరిద్దరికంటె ఎక్కువ మంది ప్యాసుకాలేదు. హైకోర్టు రిజస్ట్రారుగారు నా పేరును అధ్యక్షుడును, ప్రధాన న్యాయమూర్తియు నైన నవ్వాబ్ నిజామత్‌జంగు బహదూర్ ఎదుట పెట్టి ఈ విద్యార్థి 11 పేపర్లలో ఎక్కువమార్కులు తీసికున్నాడు. ఈ పేపరులోమాత్రము అన్యాయం జరిగినట్లున్నదని చెప్పెను. నాకు మొత్తం దాదాపు 700 మార్కులు వచ్చినవి. నేను ప్రతిరోజు పనిచేయునట్టి సివిల్ ప్రొసీజరు పేపరులో 22 మార్కులు మాత్రమే వచ్చినవి. దానిని ప్రధాన న్యాయమూర్తి గమనించి పరీక్షకుడు (ఎగ్జామినర్) గారితో ఈ విషయమును గమనించుమని నా పేరును వారికిచ్చెను కాగితములు త్రిప్పి సరిగా యిచ్చితినని బదులు చెప్పెను. దగ్గర నున్న పండిత కేశవరావుగారు మార్కులుకూడి చూడుమని

హెచ్చరించిరి. చూచితినని సరిగా నున్నదని అనెను. దానిపైనను మరల ప్రధాన న్యాయమూర్తిగారు యితనికి చాల మార్కులు వచ్చినవి. ఈ ఒక్క పేపరులో మాత్రము హీనముగా నుండుట ఆశ్చర్యముగా నున్నది. కాబట్టి మీరు కొన్ని మార్కులు యిస్తే నేను కొన్ని యిచ్చి రెండవ తరగతిలో ప్యాసు చేయించవచ్చునని చెప్పిరి. అందుకు నేనెక్కడనుంచి తెచ్చియివ్వగలనని ఆయన బదులు చెప్పెను. దానిపైన రిజల్టు యింత కఠినముగా తీయవలసి వచ్చినందుకు విచార పడుచున్నాను. ఈశ్వరునివద్ద మనమే ఉత్తరవాదులము కాగలమని విసుగుతో రిజల్టు ప్రకటించుమని చెప్పి ప్రధాన న్యాయమూర్తి నీలగిరికి వెళ్ళిపోయేను. అకస్మాత్తుగా నేను ఆరోజున అక్కడే ఉండినందున హైకోర్టుకు వెళ్ళుట తటస్థించినది. రిజల్టువిని నేనంతగా ఆశ్చర్యపడకుంటిని. ఏమనగా ఉసూలెఫిక్కా మెడికల్ జూరిస్ ప్రొడెన్సు కఠినమైనవి గనుక వాటిలో తప్పియుండవచ్చునని అనుకొంటిని. గాని వెంటనే మార్కుల స్టేటుమెంటు నకలు తీసికొంటిని. పైజెప్పిన సివిల్ ప్రొసీజరులో 22 మార్కులే యిచ్చినందుకు చాల విచారపడితిని. నేను 7 సంవత్సరముల నుండి సివిలు పనిచేయు న్యాయవాదిని. సివిల్ ప్రొసీజరు కోడులో 22 మార్కులే వచ్చినందుకు ఆశ్చర్యపడితిని. సాయంత్రము ఏమియు తోచక గిరిరావుగారింటికి వెళ్ళితిని. వారికి మార్కుల స్టేట్‌మెంట్ చూపించితిని. వారు ఆశ్చర్యపడిరి. ఉభయులము కలిసి కేశవరావుగారింటికి వెళ్ళితిమి. ఆయన ప్రఖ్యాత న్యాయవాదియేగాక పరీక్షకుడుగా (Examiner) కూడ నుండెను. మా మాటలువిని నీవు అభాగ్యుడవు నీకొరకు ప్రధాన న్యాయమూర్తియు నేనును ప్రయత్నించితిమి గాని లాభము లేకపోయెనని పైన వ్రాసిన సంగతులు పూర్ణముగా తెలిపెను. మరియు ఈ పరీక్షకు పునర్విమర్శ కూడ లేదని చెప్పెను. అంతటితో మా ప్రయత్నము ముగిసినది. గాని తృప్తి చెందక మౌలి గులాం అక్బర్‌ఖాన్ (తరువాత జస్టిస్ అక్బర్‌యార్‌జంగ్) ఆయెనను కలిసితిమి. ఆయన కూడా ఒక ఎగ్జామినరే గనుక పండిత కేశవరావుగారు చెప్పిన మాటలనే ఉద్ఘాటించెను. దాని తరువాత మౌల్వి అబ్దుల్ బాకర్‌ఖాన్ వృద్ధ వకీలును కలిసితిని. ఆయన ఆశ్చర్యపడి దరఖాస్తు వ్రాసి నన్ను ప్రధాన న్యాయమూర్తి రాయ్ బాలముకుందు గారి దగ్గరకు తీసుకొని వెళ్ళెను. మా వెంట గిరిరావుగారు కూడ వచ్చిరి. న్యాయమూర్తిగారు దరఖాస్తు చూచి నవ్వుచు ఇది దురదృష్టము గనుక నేనేమి చేయజాలను. పునర్విమర్శకు ఈ పరీక్షలో అవకాశమున్నచో నేను ఈయనను పరీక్షలో ప్యాసైనట్లు ప్రకటించగలిగేవాడను. గాని అట్టి అధికారము బోర్డుకులేదని చెప్పెను. దానిపైన నేను శ్రీ హనుమంతరావుగారు సంప్రదించి ఒక దరఖాస్తు

తయారుచేసితిమి. దానిని మార్కుల స్టేటుమెంటు సహా న్యాయశాఖా మాత్యుడు నవ్వాబ్ ఫఖరుల్ ముల్కు బహద్దూర్ గారికిచ్చితిని. ఆయన అనువంశీకముగా పెద్ద నవ్వాబ్ దయాశీలుడు. నా దరఖాస్తును, నా మార్కులను చూచి సానుభూతి తెలిపి యితనికి న్యాయము కలిగించుటకు హైకోర్టుకు వ్రాయుమని ఆర్డరిచ్చెను. నేను ఆఫీసులో మేనేజరును కలిసితిని. మేనేజర్ ఆశ్చర్యముతో హైకోర్టుకు పునర్విమర్శకు అధికారములేదు గనుక ఈ ఆర్డరువలన నీకేమి లాభములేదని చెప్పెను. అంతటితో వెనుకకు మరలితిని. అదే సంవత్సరము శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు జుడిషియల్ దర్జే అవ్వల్ పరీక్షలో నుండిరి. వారికి నిట్టి సంఘటనయే ఘటించెను. గాని ప్రధాన న్యాయమూర్తిగారు ఈ సంఘటనను బహు జాగ్రత్తతో తొలగించి వారిని మొదటి తరగతిలో ప్యాసయినట్లు ప్రకటించిరి. దాని వివరము యిచ్చట వ్రాయుట నవసరము. ఈ విషయములు అంతగా చెప్పతగినవికావు. గాని ఆ కాలమున హైదరాబాదు లా పరీక్షలలోని కాఠిన్యము తెలుపుటకే వ్రాసియున్నాను.

నేను మరల 1327వ ఫసలీ మొదటి తరగతి న్యాయవాద పరీక్షలో చేరితిని. దాదాపు 40 అభ్యర్థులు పరీక్షలో నుండిరి. గాని నేనును యింకొక మహమ్మదీయ న్యాయవాద మిత్రుడును రెండవ తరగతిలో నుత్తీర్ణులమైతిమి. కఠినముగా నున్న ఈ పరీక్షలో మొదటి తరగతిలో ఎవరును ఉత్తీర్ణులై యుండలేదు. మేమిద్దర ముత్తీర్ణులగుట ఘనకార్యముగనే యుండెను. శ్రీ గిరిరావుగారు నాకు టెలిగ్రాము ద్వారా ఈ పరీక్షలో నీ వుత్తీర్ణుడగుట చాల విశేషమని నాకు ప్రోత్సాహ కరముగా అభినందనలను తెలిపిరి.

* * *

ప్రకరణము - *6*

# సదర్ అదాలత్ వకీలుపట్టా పొందితిని

మూడవ తరగతి న్యాయవాది సదర్ అదాలత్ సెషన్‌కోర్టులకు వెళ్ళ వీలు లేదు. జిల్లా కోర్టులో కూడ వేయి రూపాయలకు మించిన సివిలు కేసులో పని చేయుటకు వీలులేకుండెను. అందువలన ప్రజానురాగము పొందగలుగుచున్న నేను చాల కేసులలో పనిచేయలేకపోవుటయు క్లయింట్లను మరియొకరి దగ్గరకు పొమ్మనుటయు తటస్థించు చుండెను. నేను రెండవ తరగతి న్యాయవాది పట్టమును పొందిన తరువాత యిట్టి నిరోధములు తొలగిపోయినవి. సదర్ అదాలత్‌లోని అప్పీళ్లలోను విలువలేని ఒరిజనల్ కేసులలోను సెషన్సు కేసులలోను సుబేదారిలోను పని చేయుటకు నాకు అధికారము దొరికినది, ఇంతేగాక ఏడు సంవత్సరముల తరువాత నేను స్వతాహాగా (పరీక్ష యివ్వకున్నను) హైకోర్టు పట్టాను పొందగలిగే హక్కు దొరికినది. అయినను నా గౌరవ మిత్రుడు మాడపాటి హనుమంతరావుగారు రెండవ తరగతి కృతార్థతకు సంతోషించక మొదటి తరగతి పట్టాను. సంపాదించవలెనని దీక్షతో పట్టుబట్టి వికాలత్ పరీక్ష మార్గమును వదిలిపెట్టి జుడిషియల్ మొదటి తరగతిలో పరీక్ష యిచ్చిరి. నాకును అట్టి పట్టుదలయే బాధించినది. గాని 1వ తరగతి వకాలత్ పరీక్షలో నుత్తీర్ణుడు కావడము ఇనుప గుగ్గిళ్ళను నమలుట వంటిది. కాని కార్యదీక్షతో 1328 ఫసలీ మొదటి తరగతి న్యాయవాద పరీక్షలో మరల చేరితిని. 12 పేపర్లలోను నాకు మొత్తం 930 మార్కులు వచ్చినవి. గాని సివిల్ ప్రొసీజర్ కోడులో 45 మార్కులు

మాత్రమే వచ్చినవి. ఈ కారణమున రిజల్టులో రామకోటేశ్వరరావు వకీలు దర్జె దువ్వం కామియాబ్ (జయము) బదర్జె దువ్వం అని ప్రకటించబడెను. అనగా రెండవ తరగతి వకీలు రామకోటేశ్వరరావు రెండవ తరగతిలో నుత్తీర్ణుడయినాడు. అనగా హైకోర్టువారు నన్ను దర్జె దువ్వం వకీలుగా రెండుమారులు ప్రకటించినారని అర్థము. ఈ సందర్భమున ఒక విచిత్ర స్వప్న వృత్తాంతమును వ్రాసి చదువరులకు శ్రమ యిచ్చుచున్నాను.

నేను జుజ్జూరు యింటిలో నిద్రించుచుంటిని. హైదరాబాదు గౌలిగూడెము లోని ముషీరెదక్కన్ ప్రెస్ ప్రక్కగా పోవుచుంటిననియును ప్రెస్‌లో నా పేరు ఉచ్చరింప బడుటయు విని లోపలికిపోయి ఏమి చెప్పుకొనుచున్నారని అడిగితి ననియును అందుకు వారు 1వ తరగతి వకాలత్ పరీక్షా రిజల్టు ప్రకటించు చున్నామని బదులు చెప్పిరనియును కలలో తెలిసికొంటిని. అంతట మేల్కొంచి నేనడిగిన ప్రశ్న అప్రస్తుతము. నేనప్పటికే 2వ తరగతి వకీలును గనుక 1వ తరగతిలోనే పేరుండును గనుక ప్రశ్నకు తావుండదే అని ఆశ్చర్యపడితిని.

సాయంత్రము యెల్లుపాలెము చేరి తిరుమలరావుగారిని కలిసితిని. పత్రికలో రిజల్టు వచ్చినదని నీపేరు ఏ తరగతిలో చూచితినో జ్ఞాపకములేదని పత్రిక తెప్పించెను. నా పేరు 2వ తరగతిలో నుండుట చూచి స్వప్న వృత్తాంతమును తలుచుకొని విస్మయ పడితిని. దీనివలన నా పట్టుదల యితోధికమైనది. మొదటి తరగతిలో నుత్తీర్ణుడను కాగలను అనే ఉత్సాహము రేకెత్తినది. మరల పరీక్షకు వెళ్లితిని. 1329వ ఫసలీ పరీక్షలో 40 మంది విద్యార్థులు చేరిరి. నేనొక్కడనే మొదటి తరగతిలో జయమొందితిని. మరెవ్వరు మొదటి తరగతిలో గెలుపొంది యుండలేదు. ఇది చాల విశేషమని శ్రేయోభిలాషులగు శ్రీ పండిత కేశవరావు, గిరిరావు, హనుమంతరావు, విశ్వేశ్వరనాథ్‌గార్లు నాకు అభినందనములు, ఆశీర్వాద ములను తెలిపిరి. 1329 ఫసలీ పరీక్షకు నేను వెళ్ళునపుడు ఇతర జిల్లాల నుండి వచ్చిన మూడవ తరగతి న్యాయవాదమిత్రులు కలిసి నీకు పిచ్చిఎత్తినదా ఏమి నీవు మొదటి తరగతిలో పరీక్ష ఈయగలవా? నీవు వరంగల్లులో వుండేవాడవు గనుక అన్ని కోర్టులలో యిప్పటికే పనిచేయుచున్నావు. మరియు 7 సంవత్సరముల తరువాత స్వయముగానే హైకోర్టు వకీలువు కాగలవు కదా? ఎందుకు కాలము

వ్యర్థముచేసి పరీక్షకు వచ్చుచున్నావని ప్రశ్నించు చుండెడివారు. నేను పరీక్ష యిచ్చి యే హైకోర్టు వకీలును కావలెననుకొంటిని కాని హైకోర్టువారి దయాధర్మము వెంట యిచ్చే పట్టా నాకక్కరలేదని చలోక్తిగా చెప్పెడివాడను.

* * *

ప్రకరణము - 7

# హైకోర్టు వకీలునైతిని

1329 ఫసలీ తరువాత జుడిషియల్ కమిటీ హైకోర్టు, అందరు మంత్రులు సెక్రటరీలవద్ద పనిచేయుటకు నా కధికారము లభించెను. అటుతరువాత నా వికాలత్ దినదినాభివృద్ధి పొందసాగినది. కానాత్ జాగీరు మధిర తాలూకాలతో సంబంధించిన కొంచె మెంచుమించు ప్రతి వ్యాజ్యములోను నేను ఒక పార్టీకి వకీలుగా నుండెడివాడను. వరంగల్ జిల్లాలోని ఖమ్మం, మధిర, ఇల్లెందు, మహబూబాబాద్ (మానుకోట) పాఖాల, ములుగు తాలూకాలలో ప్రజానురాగము పొందగలిగితిని. వరంగల్లు జిల్లాలోని రివెన్యూ తాలూకాలు డివిజన్‌లలోనికి కూడ వెళ్ళి పనిచేసెడివాడను. వరంగల్లు సుబాగా నుండుటచే దానిక్రింద కరీంనగర్, అదిలాబాదు జిల్లాలుండెడివి. నేను కరీంనగర్ జిల్లా హుజురాబాదు, పరకాల తాలూకాలకును, కరీంనగర్, ఆసిఫాబాద్ జిల్లాల అధికారుల వద్దకును వెళ్లెడివాడను.

నేను కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల జుడిషియల్ అప్పీళ్లు సదర్ అదాలతు వరంగల్‌లోను రివిన్యూ అప్పీళ్లు వరంగల్ సూబేదారు వద్దను దాఖలగు చుండెడివి. వాటిలో పనిచేసెడివాడను. కొంత కాలము వరంగల్‌లో తెలంగాణ ప్రాంతీయ కమీషనర్ ఉండెడివాడు. ఆయనను సదర్ నాజంసిమ్తు తెలంగాణ అనెడివారు. ఆయన వద్దకు 8 తెలంగాణా జిల్లాల రివెన్యూ అప్పీళ్లు వచ్చెడివి. వాటిలో కూడ పనిచేసెడివాడను.

* * *

*ప్రకరణము - 8*

# న్యాయశాఖ విభజన

1331వ ఫసలీవరకు రివిన్యూ అధికారులకే సివిల్ క్రిమినల్ అధికారము లుండెడివి. తహశీలుదార్లకు ఒక వందరూపాయల సివిల్ వినుటకును, మూడవ తరగతి మేజస్ట్రేటు అధికారము లుండెడివి. రివిన్యూ డివిజనల్ ఆఫీసరుకు సాధారణముగా రెండవ తరగతి మేజస్ట్రేటు అధికారములున్ను అసాధారణముగా ఒకటవ తరగతి మేజస్ట్రేటు అధికారములున్ను ఉండెడివి. గాని సివిల్ అధికారము లుండెడివికావు. కలెక్టరుకు డిస్ట్రిక్టు మేజస్ట్రేటు అధికారము లుండెడివి. మొదట రు. 5000/-ల వరకు సివిల్ కేసులు వినెడివారు. సుబేదారు సెషన్సు జడ్జిగాను, సివిల్‌లో విలువలేని కేసులను వినుటకును అధికార ముండెడివి. కొన్ని రోజుల తరువాత ప్రతి జిల్లాలో మదద్‌గారు అదాలత్ అనే అధికారిని నియమించి ఆయనను జాయింటు మేజస్ట్రేటుగాను సివిల్‌లో రు. 5000/-ల కేసులు వినే సివిల్ జడ్జిగాను అధికారమిచ్చిరి. దీనితో కలెక్టరుకు సివిల్ అధికారము పోయినది. అట్లే సుబేదార్లక్రింద ఒక మదద్‌గారును నియమించి ఆయనకు సివిల్ అధికారము లన్నియును అసిస్టెంటు సెషన్సు జడ్జి అధికారములును యిచ్చిరి. దీని తరువాత సుబేదారుకు జుడిషియల్ అధికారములు పోయినవి. కొన్ని పెద్దటవున్లలో, కొన్ని మునిసిఫ్ కోర్టులు యేర్పాటు చేయబడెను. వరంగల్లులో ఒక మునిసిఫ్ కోర్టుండెడిది. ఆయన రు. 500/-ల సివిల్ వ్యాజ్యములను వినెడివాడు. రెండవ తరగతి మేజస్ట్రేటుగా పనిచేసెడివాడు.

1330 ఫసలీలో హైద్రాబాదు రాజ్యమునకు ప్రఖ్యాత కాంగ్రెసువాది సర్ అలి యిమాం దివానుగాను మిర్జా సమీవుల్లాబేగ్ అనే యు.పి. వకీలు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగాను నియమింపబడిరి. వీరి కాలములో అపూర్వమైన సంస్కారము జరుపబడి న్యాయశాఖను రివిన్యూ అధికారుల నుంచి తొలగించుటకు సంకల్పించుకొని సమాలోచనలు జరిపిరి. ప్రధాన న్యాయమూర్తి జిల్లాలలో పర్యటన చేసి వకీళ్ల అభిప్రాయమును కూడ తీసికొనెను. వరంగల్లు పర్యటన సందర్భములో న్యాయవాద సంఘు పక్షమున కార్యదర్శిగా నున్న నేనున్ను మరికొందరు వకీళ్లము వెళ్లితిమి. ఆయన ప్రతి తాలూకాకును ఒక మునిసిఫ్ మేజస్ట్రేటు నేర్పాటు చేసెద ననియును ప్రతి జిల్లాకును ఒక అధికారి డిస్ట్రిక్టు మేజస్ట్రేటుగాను రు. 10,000/- అధికారముగల సివిల్ జడ్జిగాను ప్రతి సూబాకును ఒక సెషన్సు జడ్జి యుండుననియును ఆయనకు విలువలేని సివిలు అధికారముండు ననియును తమ అభిప్రాయమును తెలిపి మాకు ప్రశ్నలిచ్చి లిఖితాభిప్రాయములను తీసికొనెను. నేను తెలంగాణాలో కొన్ని అరణ్య తాలూకా లున్నవి కనుక అచ్చోట ఒక మేజస్ట్రేటును మాత్రముంచి రెండు మూడు తాలూకాల కొక మునిసిఫ్ కోర్టుంచిన చాలుననియును, జాగీరుదార్లకు జుడిషియల్ అధికార ముంచకూడదనియును చెప్పితిని. దానికి వారు ఏకీభవించజాలననిరి.

ఈ సందర్భమున ఒక విషయము చెప్పవలసి యున్నది. రివిన్యూ అధికారులకు జడిషియల్ అధికారములున్నను ఆ రోజులలో వారి సిబ్బంది నేరుగా హైకోర్టుకు లోబడియుండెడిది.

ప్రధాన న్యాయమూర్తి పర్యటనానంతరము కొలది రోజులకే రివిన్యూ అధికారుల నుంచి జుడిషియల్ అధికారములను తొలగించి పైజెప్పిన విధముగా ప్రతి తాలూకాకొక మున్సిఫ్‌కోర్టును పెట్టి మున్సిఫ్‌లకును జిల్లానాజం (జిల్లా జడ్జి)లకు సదర్ అదాలతులకును పూర్తిగా ఒప్పగింత పెట్టివేసిరి.

1331వ ఫసలీ వరకు వరంగల్లు మున్సిఫ్ కోర్టులో నాకు పని ఉండెడిది. గాని అప్పటికి నేను మొదటి తరగతి వకీలునగుటయు దానివెంటనే జుడిషియల్ అధికారములు వేరు చేయబడుటయు తటస్థించినందున నాకు వరంగల్ జిల్లా అదాలత్‌లోను, సదర్ అదాలత్‌లోను కేసులు బాగుగా దొరుకుచు వచ్చినవి. తీరికలేక మున్సిఫ్ కోర్టుకు జూనియర్ వకీళ్లను పంపుచుండెడివాడను. ఆ కారణమున మున్సిఫ్‌కోర్టు ఫైలె తగ్గినది గాని ఆదా తగ్గలేదు. తాలూక్దారి సుబేదారిలోని రివిన్యూ కేసులున్ను అదాలత్ జిల్లా సదర్ అదాలతులోని సివిల్

క్రిమినల్ కేసులున్ను యెక్కువగా ఉంటూ వచ్చినవి.

నేను మొదటి తరగతి పరీక్షలో నుత్తీర్ణుడనై హైకోర్టు వకీలు పట్టాను సంపాదించి గౌరవ ప్రతిష్టలలోను ఆదాలోను క్రమాభివృద్ధిని పొందగలిగి వృత్తి గౌరవము కొరకు 1330 ఫసలీలో 4 చక్రముల ల్యాండోబాడి గుర్రపు బగ్గీనిపెట్టి దానిపైన తిరుగుచుండెడివాడను. 10 సంవత్సరముల తరువాత మోటారు కొనవలెనని స్నేహితుల ప్రోత్సాహము యెక్కువ కాజొచ్చినది. ఆ కారణమున 1340 ఫసలీ (1931)లో నేను స్వయముగా బొంబాయివెళ్లి 1929 సంవత్సరపు చివరలెట్ మోటారును ఖరీదుచేసి తెచ్చితిని. యిప్పటికిని అదే మోటారు నా సవారిలో నున్నది.

హైద్రాబాదు రాష్ట్రమున పౌరహక్కులను గ్రహించుటకు ప్రభుత్వ మనుకూలముగా లేకున్నను కొందరు యోగ్యులగు అధికారులు ప్రజాస్వామ్యమును బయటి నాయకుల సేవా కార్యములను గ్రహించి మనస్సా సానుభూతి చూపించుచునే యుండెడివారు. అసహాయోద్యమములో 1922 శ్రీకాళేశ్వరరావు పంతులుగారు వికాలతు మానివేసి జైలుకు వెళ్ళుటకు సిద్ధపడియుండిరి. గాని అప్పటికే కొన్ని నెలల నుంచి బెజవాడలో ఒక జాతీయ పాఠశాలను నడుపు చుండిరి. దాని చందాలకొరకు వరంగల్‌కు విచ్చేసి వారము రోజులు నావద్దనే యుండిరి. ఆ సందర్భమున సి.ఐ.డి. పోలీసుద్యోగులు ప్రతిరోజు మా యింటికి వచ్చి విచారించి పోవుచుండిరి. అది అసభ్యతగా నుండెను. ఆ విషయమును అప్పుడు వరంగల్లులో డిస్ట్రిక్టు మేజస్ట్రేటుగా నున్న నూరుల్ హుసేన్ గారికి చెప్పితిని. వారు స్వయముగా మాయింటికివచ్చి శ్రీ కాళేశ్వరరావుగారిని సందర్శించి వారితో చాల సంగతులు తెలిసికొని సంతోషించిరి. మరు రోజున నేను శ్రీ కాళేశ్వరరావుగారును నూరుల్ హుసేన్‌గారింటికి వెళ్లితిమి. ఆయన నవాబు కుటుంబమునకు చెందినవాడు గనుక చాల గౌరవముతోనూ, ఆదరణ తోను వారితో సంభాషించిరి. బహుశః యివికూడ సి.ఐ.డి. పోలీసులకు తెలిసి యుండవచ్చును. వారు శ్రీ కాళేశ్వరరావుగారు గౌరవముగల దేశభక్తుడని గ్రహించి యుండవచ్చును.

హైద్రాబాదు న్యాయవాద శాసనమునుబట్టి హైకోర్టు జుడిషియల్ కమిటీలో పని చేయుటకు హైద్రాబాదు హైకోర్టు పరీక్షలలో ప్యాసైన మొదటి తరగతి వకీళ్ళకును యూనివర్సిటీలో ప్యాసైన B.A.L.L.B., B.A.B.L లకును బారిస్టర్లకును అధికార ముండెడిది. వీరందరికి సమానాధికారము గల అవ్వల్‌దర్జా

వకీలు సనదు యివ్వబడుచుండెడిది. తరువాత 1340 ఫసలీలో హైకోర్టువారు ఒక నియమావళిని ప్రకటించి తద్వారా పైచెప్పిన వకీళ్లలో కొందరికి వేరే పరీక్ష లేకుండ గౌరవముగా అడ్వకేటు పట్టాను ప్రసాదించుటకు ఉత్తర్వు యిచ్చుచు అడ్వకేటుకు ప్రత్యేక ఉన్నతాధికారము లీయబడెను. అంతేగాక వారి క్లార్కులకు కూడ ప్రత్యేకాధికారము లీయబడెను. నేడట్టి అధికారములు అంతర్థానములైనవి. న్యాయస్థానములలో నేడు అడ్వకేట్లకు అట్టి గౌరవస్థానము లేదు. వారి క్లార్కులకు అధికారమేమి లేదు. అడ్వకేటు పట్టా పొందుటకు యే వకీలు కోరగూడదు. ఆయన కొరకు యెవ్వరు సిఫారసు చేయకూడదు. అట్లా చేయడము అనర్హతా సూచకమని చెప్పబడినది. అడ్వకేటు పట్టాపొందే వకీలు 12 సంవత్సరములకన్న ఎక్కువ కాలము పనిచేసి యుండవలెను. శాశ్విత పట్టాను తీసికొని యుండవలెను. హైకోర్టు లా లైబ్రరీకిన్ని, బార్ అసోసియేషన్‌కున్నూ మెంబరుగా నుండవలెను. ఈ ప్రకటనానంతరము పరీక్షలో ప్యాసైనంత మాత్రముననే గాక సీనియర్ వకీలు దగ్గర కనీసం 1 సంవత్సరము పనిచేసి ఆయనవల్ల అతని యోగ్యతను గురించి ధృవపత్రము పొందవలెనని, చ 28 ఆబాన్ 1341 ఫసలీ తారీఖున హైకోర్టువారు ఒక ప్రకటన చేయుచు రాష్ట్రములోని 55 రు సీనియర్ వకీళ్ల లీస్టును ప్రకటించిరి. ఆ లీస్టులో నేను కూడ సీనియర్ వకీలునని ప్రకటన చేసిరి. యిట్లు ధృవపత్రము సంపాదించిన తరువాతనే హైకోర్టులో పని చేయుటకు అనుమతి నీయబడునని ఉత్తర్వుయిచ్చిరి. మొదట హైద్రాబాదు హైకోర్టులో ప్రాక్టీసుచేయు కొందరు (27గురు) వకీళ్లు ఎల్.ఎల్.బి.లు బారిష్టర్లకు మాత్రమే అడ్వకేటు పట్టాలు యిచ్చిరి. దాని తరువాత 1352 ఫసలీ నుండి జిల్లాలలో కూడ కొందరు సీనియర్ వకీళ్లను అడ్వకేట్లు చేయవలెనని నిశ్చయించి గుల్బర్గాలో యిద్దరికిని, ఔరంగాబాదులో యిద్దరికిని, వరంగల్‌లో నాకును నా మిత్రులు కీర్తిశేషులైన ఫజల్ హుసేన్ గారికిని అడ్వకేటు పట్టా యిచ్చుటకు నిశ్చయించిరి. మాకు మొదటనే నోటీసు ద్వారా హైకోర్టువారు యిచ్చెడి గౌరవ పట్టాను స్వీకరించెదరా? నియమములను పాటించెదరా అని తెలిపిరి. నేను అప్పటివరకు మొదటి తరగతి వకీలుగా 24 సంవత్సరములు పనిచేసియుంటిని. గాని శాశ్విత పట్టామాత్రము తీసుకొనక యే సంవత్సరమున కా సంవత్సరము రు. 50లు చొప్పున యిచ్చి సనదు మార్పు చేయించుకొనుచుంటిని. అనగా అప్పటికి రు. 1200/–లు చెల్లించి యుంటిని. ఈ నోటీసును బట్టి రు.500/–లు చెల్లించి శాశ్విత సనదును తీసికొనవలసి వచ్చెను. నేను గౌరవమునకు ఆశించి రు.500/–లు చెల్లించి శాశ్విత సనదును తీసికొంటిని. తరువాత నన్ను హైకోర్టువారు అడ్వకేటుగా ప్రకటన చేసిరి.

అడ్వకేట్లకు ప్రత్యేక ఉన్నతాధికారములు ఈయబడినవని పైన వ్రాసియున్నాను. అడ్వకేటు కావడము హైద్రాబాద్ రాష్ట్రమున గౌరవముగా ఎంచబడినది. గనుక మాకు 1352 ఫసలీ ఆజూర్ నెలలో బార్ అండ్ బెంచి తరఫున సభచేసి సన్మానము చేసిరి. ఆ సన్మాన సభలో నా బాల్యస్నేహితుడును నన్ను వకాలత్ చదువుటకు ప్రేరేపించిన వాడున్ను అయిన మాదిరాజు లక్ష్మీకాంతరావుగారు వకీలుకూడ ఉండెను. సభానంతరము పూలమాలలతో మోటారుపైన యింటికివచ్చి మా నాయన గారికి పాదాభివందనము చేసితిని. ఆయన ఆనంద భాష్పములతో నన్ను కౌగలించుకొని ఆశీర్వదించెను. ఇదియే వారి తుది ఆశీర్వాదము. తరువాత కొలది దినములకే వారు దివంగతులైరి. నా మిత్రుడు లక్ష్మీకాంతరావు యెక్కువ ప్రోత్సహించి వకాలతు చదువుటకు ప్రేరేపించెనని రెండవ అధ్యాయములో వ్రాసియుంటిని. ఆయన నాకు జరిగిన యీ గౌరవ సన్మానమును చూచి ఎండిన వృక్షములో తన ప్రేరేపణచే ఉత్తేజము కలిగినదని సంతోషించెను.

నేను యింగ్లీషు చదువలేదు. యూనివర్సిటీ పరీక్షలలో ప్యాసుకాలేదు. లా పరీక్షలు మాత్రమే ఉరుదు భాషలో చదివి పరీక్ష యిచ్చితిని. ఇట్టి నేను బారిస్టర్లు L.L.B లతో పాటు అడ్వకేటుగా గౌరవమును పొందుట కేవలము ఈశ్వరేచ్ఛయేగాని నా అర్హత కాదు.

నా వద్ద శ్రీ జములాపురము గోపాలరావు, వెంకటరెడ్డి, నరసింగరావు, పెగళ్లపాటి సత్యనారాయణ, చక్రపాణి, ఉదయరాజు రాజేశ్వరరావు, పరిటాల సూర్యప్రకాశరావు, సర్వదేవభట్ల వెంకట్రామయ్య, తాండ్ర వెంకట్రామ నర్సయ్య గార్లు వేరువేరు సంవత్సరములలో జూనియర్లుగా పనిచేసి మంచి స్థితికి వచ్చినారు. ఇట్లే నా కుమారులు వెంకట సుబ్బారావు, లక్ష్మీకాంతరావు నా అల్లుడు వాసుదేవరావులు జూనియర్లుగా పనిచేసినారు. పై జెప్పిన వకీళ్లలో శ్రీ ఉదయరాజు రాజేశ్వరరావుగారు ఉత్తమ వంశ సంభూతులు ఆగర్భ శ్రీమంతులు బి.ఎ.ఎల్.ఎల్.బి. ప్యాసై రెండు సంవత్సరములు కాలేజిలో అధ్యాపకుడుగా పనిచేసిరి. ఆయన నావద్ద 4 సంవత్సరములు జూనియరుగా నుండి బహు శ్రద్ధా భక్తులతో పనిచేసెను. గ్రంథములను చదువుటలోను కేసులను తయారు చేయుటలోను ఆయన చేసిన కృషి వర్ణనాతీతము. అట్టి శిష్యోత్తముడు నన్ను వదలి ముందే దివంగతుడైనాడని వ్రాయుటకు విచారపడుచున్నాను. అట్లే చక్రపాణి నిమ్నజాతికి చెందినవాడైనను, మూడవ తరగతి వకీలుగా నుండి బహుశ్రద్ధా భక్తులతో నాకు సహాయము చేయుచు పని నేర్చుకొనెడివారు. వీరుభయులు నన్ను సశాస్త్రీయమైన గురువుగా భావించి గౌరవించెడివారు. ఈయనకూడ స్వర్గస్తు

డైనాడు. వీరుభయులు నాకంటే 20 సంవత్సరములు చిన్నవారైనను నన్ను వదలి దివంగతులైనారు. వారు నాకు చిరస్మరణీయులు. కొన్ని అనధికార సభ్యులతో కూడిన సంస్థలు అనగా లోకల్ ఫండ్ మునిసిపాలిటీలు, ఆహార కమిటీ, శాంతి కమిటీ మొదలగు కొన్నిటిలో నన్ను సభ్యుడుగా అధికారులు నియమించు చుండిరి. నేను సహకారము చేయుచు ప్రజాహిత కార్యములను సానుకూలము చేయించు చుంటిని. సాధారణముగా వరంగల్లుతో సంబంధించిన ప్రజాయుత సంస్థలన్నిటిలో నాకు సంబంధముండెడిది. ముఖ్యమైన కొన్ని సంస్థలను గురించి యీ పుస్తకము లోని అయిదవ అధ్యాయములో వివరించితిని. గాని ఆంధ్ర మహాసభ తీర్మానాను సారము రాజ్యాంగ సంస్కరణలను బహిష్కరించితిమి. గనుక జిల్లా కమిటీలకును వెళ్లలేదు. ఉన్నతాధికారులు యింటికి వచ్చి శాసనసభలకు అభ్యర్థిగ నుండు మనియు ఏకగ్రీవముగా ఎన్నిక కాగలవని చెప్పుచుండిరి. అయినను పట్టుదలతో వాటిని నిరాకరించితిని.

అడ్వకేటు అయిన వారిలో వరంగల్లులో నేనే మొదటివాడనుగాను. తెలంగాణ వకీళ్లలో మూడవవాడుగా నుండవచ్చునని మిత్రులనుచుండిరి. హైద్రాబాదు శాసనముల ప్రకారము రివిన్యూ అధికారులకు భూములను గురించియు అతియాతు, మాషులు, పాయగాః జాగీర్లు, సంస్థానములు, మక్తా అగ్రహారములు, ఈనాములు, రుసుములు యితర నగదు బహూకరణములను గురించియు వతన్లు (పటేలు, పట్వారిగిరీలు) గురించి వారసత్వము, దత్తత స్వాధీనములు మొదలగు వివాదములను పరిష్కరించుటకును, భూమి పన్నులు, శిస్తులు, అపరాధములు యితర జమాబంది సెటిల్‌మెంటు, ఫారెస్టు, ఆబ్కారి శాఖలలో గలిగెడు వివాదములను గురించియు రివిన్యూ డిపార్టుమెంటుకు అధికార ముండెడిది. ఆ వ్యాజ్యముల సంఖ్య సివిల్‌కోర్టులలోని వ్యాజ్యముల సంఖ్యకంటె మించియుండెడిది. రివిన్యూబోర్డు లేక సెక్రటరీ వరకు 2, 3 అప్పీళ్ళు మరియు ఒక రివిజను చేసికొనవచ్చును. అసాధారణ పరిస్థితులలో రివిన్యూ మంత్రిగారు కూడ వినుచుండెడివారు. అదిగాక ఒక అతియాతు కమిటీ యుండెడిది. అందులో రివిన్యూ మంత్రి ప్రధాన న్యాయమూర్తి సంయుక్త బెంచిగా నుండి అప్పీళ్ళను వినుచుండెడివారు. వకీళ్లకు రివిన్యూ కేసుల వల్ల బాగా ఆదా ఉండెడిది. ఆ రోజులలో శ్రీ ఫైజుద్దీన్ గారనే ప్రఖ్యాత న్యాయవాది రివిన్యూ అప్పీళ్లలోనే పనిచేసెడివారు. వారి ఆదా దాదాపు నెల 1కి రు. 600/-ల వరకుండెడిది. నాకు సివిల్ పని యెక్కువగా నున్నను జిల్లా కలెక్టరు వద్దను, సుబేదారు వద్దను రివిన్యూ కేసులుండెడివి. సాధారణముగా వరంగల్లులోను, హైద్రాబాదులోను

రివిన్యూ కేసులు ప్రతిరోజు 2 గంటల నుండి వినుచుండెడి వారు. కాబట్టి చాలమంది వకీళ్లు ఒకటిన్నర గంటలవరకు సివిల్ కోర్టులలో పని చేసికొని రివిన్యూ మహకమాకువెళ్లి సులభముగా పనిచేయు చుండెడివారు. నేను 2వ తరగతి న్యాయవాది నైన తరువాత సివిల్‌పని యెక్కువైన కొలదియు క్రిమినలుపని తగ్గుచూ వచ్చినది. ఇతర స్థలములకు వెళ్ళుట తక్కువ చేసికొంటిని. నా వద్ద డబ్బును గురించియు స్థిరచరాస్తులను గురించియు అన్నిస్వభావములుగల వ్యాజ్య ములుండెడివి. సదర్ అదాలత్, సుబేదారి మూడు జిల్లాలతో సంబంధించినది గనుక నావద్ద పని ఎక్కువగా నుండెడిది. జూనియర్లు కూడ పనిచేసెడివారు. నేను కొన్ని కేసులలో హైకోర్టునకును, రివిన్యూ సెక్రటరీ వద్దకును అప్పుడప్పుడు వెళ్లెడివాడను. గాని అక్కడి వకీళ్లనుకూడ నుంచుమనియే సలహా నిచ్చెడివాడను. ఏలననగా బయట కేసులలో అందు ముఖ్యముగా ఉన్నతాధికారుల వద్ద స్వీయబాధ్యత వహించుట వలన నేను అందజాలకుంటె కక్షిదారులకు నష్టము కలుగ వచ్చునని నా భావము. అయినను పరిటాల దేశముఖి, దేశాపాండ్యాగిరి మా వంశములోనిదేనని పరిటాల మొదలగు ఏడు గ్రామములకు నవ్వాబ్‌ఖాన్ ఖానాన్ బహుద్దుర్ జాగీర్దారనిన్ని పైన వ్రాసియుంటిని. పరిటాలలో జాగీర్ యిలాకాకు మున్సిఫ్ కోర్టున్ను, తహశీల్దారు కచహరియున్నూ యుండెడిది. జాగీర్దారు హుజూరు ఆఫీసు హైద్రాబాదులో నుండెడిది. నాకు ఆ గ్రామములలో గల సంబంధమునుబట్టి పరిటాల మున్సిఫ్ మేజస్ట్రేటు వద్దకును హైద్రాబాదులోని జాగీర్దారువారి సెక్రటరీ వగైరా అధికారుల వద్దకును వెళ్లెడివాడను. జాగీర్దారు (ఖాన్ ఖానాన్ బహుద్దర్ కుమారుడు) కమాల్ యార్జంగు బహుద్దుర్‌కు నాయందు గౌరవ విశ్వాసము లుండెడివి. 1, 2 సంవత్సరములు విద్యా మహాసభకు ఆయన అధ్యక్షుడుగాను, నేను సభ్యుడుగాను పని చేసితిమి.

నాకు శ్రీ మునగాల రాజానాయన వెంకట రంగారావుగారు నెలవారి ఎడ్వయిజరుఫీజు యిచ్చుటయేగాక నాయోగ క్షేమములను విచారించు చుండెడి వారు. ఆయన నైజాం యిలాకా అన్ని వ్యవహారములలొ నా సలహాను తీసుకొను చుండెడివారు. నేను పనిచేసిన అన్ని కేసులలోను వారికి జయమవుచుండెడిది. నా హస్తవాసియని వారును, వారి పేరు ఫలములని నేనును భావించుచుంటిమి. ఒకప్పుడు వారి భార్యగారి పితృ సంబంధమైన ఒక మఖ్తా వ్యాజ్యమున్ను వారి మనుమడికి వనపర్తి ఎస్టేటుతో సంబంధించిన అప్పీళ్ళు బాబు హుకుమత్ అత్యాల్ కమిటీలొ నుండెను. వాటిలో హైద్రాబాదు వకీలు శ్రీ విశ్వేశ్వరనాథ్ గారు పని చేయుచుండిరి. సలహా సంప్రతింపులకు నేనుకూడ పట్టం వెళ్ళుచుండెడి వాడను.

## సర్‌తేజ్ బహద్దుర్ సప్రూ, మోతీలాల్ నెహ్రూగారి సందర్శనము

శ్రీ మునగాల రాజాగారి అప్పీళ్లలో సర్ తేజ్ బహద్దుర్ సప్రూగారిని తీసికొని రావలెనని నిశ్చయించుకొంటిమి. నేను వారి వద్దకు వెళ్లి వచ్చుటకు విశ్వేశ్వరనాథ్‌గారు సలహానిచ్చిరి. ఆ ప్రకారము శ్రీ రాజాగారు నన్ను అలహాబాద్ పంపిరి. ఇది బహుశః 1926, 27 సంవత్సరములలో జరిగినదని జ్ఞాపకము. నేను ప్రయాగవెళ్లి ఒక పండాయింట్లో బసచేసి త్రివేణి సంగములో స్నానముచేసి సాయంత్రము సర్ సప్రూగారింటికి వెళ్లితిని. వారు నాతో చాల ప్రేమతోను, గౌరవముతోను కలిసి మాట్లాడిరి. వ్యాజ్యము సంగతులను క్లుప్తముగా చెప్పితి. వారు ఫైలు చదువుటకు రు. 2000/–ల ఫీజున్నూ అలహాబాదునుంచి బయలుదేరి మరల అలహాబాదుకు వచ్చేవరకు రోజు 1కి రు. 1600/–లు తన కొరకును, రు. 80/–లు జూనియరు వకీలుకును ఫీజులు యిప్పించుమనిరి. ప్రయాణ ఖర్చులు కక్షిదారుడే భరించవలననుట అందరు ఎరిగిన విషయమే. మరియు నేను చెప్పిన వాయిదాకు రాజాలను. టెలిగ్రాము పంపెదమనిరి. ఈ విషయములను శ్రీ విశ్వేశ్వరనాథ్‌గారికి తెలిపి వారి జవాబు తెప్పించుకొనుట ఉచిత మనుకొంటిమి. ఆ ప్రకారం హైద్రాబాదుకు టెలిగ్రాము యిచ్చితిని. దాని నిరీక్షణలో నేను 2 రోజులుండవలసి వచ్చెను. సర్ సప్రూగారు నన్ను చూచి నీవు పండావద్ద వుంటే యిబ్బంది పడతావు. నావద్దనే యుండుమనియు నీ కిష్టమున్నచో నా వద్దనే భోజనము చేయవచ్చుననియును చెప్పిరి. భోజన పదార్థములను పంపెదమనిరి. మరియు మీరు రేపు కాశీవెళ్లి గంగాస్నానము, శ్రీ విశ్వేశ్వరస్వామి దర్శనము చేసికొని రావచ్చునని కూడ సలహానిచ్చిరి. నేను మరురోజు కాశీ వెళ్లితిని. ఒక పండాయింట్లో నుండి ఆయన సహాయముతో గంగా స్నానము, విశ్వేశ్వర దర్శనము, ఇంకా 200 దేవాలయములను తిరిగి చూచితిని. అది వర్షాకాలము. కాశీ పట్టణములో గల్లీలు చాల యెక్కువ. ఆ గల్లీలలో యిద్దరు మనుష్యులు గొడుగులు వేసికొని నడుచుటకు కష్టముగా నుండెడిది. ఒక మోటారు తీసికొని యూనివర్సిటీకి వెళ్లి భవనముల నన్నిటిని చూచితిని. అవి బస్తీకి దూరముగా 600 ఎకరముల విస్తీర్ణముగల భూమిలో కట్టబడి యుండెను. కాశీ నుండి మరల అలహాబాదు చేరితిని. అలహాబాదులో మరి రెండు రోజులుండి హైకోర్టును, యితర స్థానిక కోర్టులు చూచితిని. సర్ సప్రూగారు నూతనముగా కట్టబడిన వకీలు వాడలో విశాలమైన స్థలములో యిల్లు కట్టుకొనియుండిరి. అలహాబాదు బస్తీ అంతయు పాతదే కనుక వీధులు

యిరుకుగా నుండెడివి. హైకోర్టు భవనముకూడ పాతదిగా నుండెను. నాకు అంత ఆకర్షణీయముగా కనబడలేదు. కోర్టులలో పనివిధానముకూడ హైద్రాబాదు పనివలెనే యుండెను. ఆ రోజులలో శ్రీ మోతీలాల్ నెహ్రూగారు మరల వికాలత్ చేయుచున్నారని వింటిని. వారిని దర్శించుటకు కుతూహలపడితిని. అంత పెద్దమనిషితో అల్పుడనగు నేను ప్రమేయములేనిదే కలువజాలనని గ్రహించితిని. అయినను సాహసించి ఆనంద భవనమునకు వెళ్లితిని. హైద్రాబాదు నుంచి వచ్చిన వకీలును గనుక నాకు వారు సులభముగా దర్శనమిచ్చిరి. తాము హైద్రాబాదుకు వచ్చి అక్కడ కేసులలో పనిచేయగలరా అని ప్రశ్నించితిని. వారు వచ్చెదమనిరి. సంగ్రహముగా కేసు సంగతులు చెప్పితిని. వారు ఫైలు చదువుటకు రు. 5000/–లున్నూ డైలీ ఫీజు రు. 2000/–లున్నూ యివ్వమని కోరిరి. మరియు నీవు వారము రోజులు అలహాబాదులో నుండి అత్యాతు శాసనములను నియమములను నాకు తెలుపుమని చెప్పిరి. హైద్రాబాదుకు వెళ్లి పార్టీతో విచారించి ప్రత్యుత్తర మిచ్చెదనని వారివద్ద సెలవు తీసికొంటిని. ఉర్దూ మాతృభాషయు, పారశీ, అరబ్బీలలో పాండిత్యముగల సప్రూ, నెహ్రూగార్ల సంభాషణ చాల మధురముగా నుండెను. నేను అలహాబాదు నుంచి బయలుదేరి నాగపూరు వచ్చితిని. అక్కడోరోజుండి పట్టణమును హైకోర్టును చూచితిని. దానికన్నా హైద్రాబాదు హైకోర్టు భవనము చాల సుందరముగా నున్నదని భావించితిని. అక్కడి నుంచి వరంగల్లుకు వచ్చి తర్వాత హైద్రాబాదు వెళ్లీ శ్రీ విశ్వేశ్వరనాథ్ గారితో చెప్పితిని. శ్రీ సప్రూగారు మునగాల రాణిగారి వరంగల్లు కేసులోను, వనపర్తి ఎస్టేటు కేసులోను హైద్రాబాదువచ్చి పనిచేసిరి. ఖాజీపేటలోను, హైద్రాబాదులోను సర్ సప్రూగారితో కొన్ని పర్యాయములు దర్శించి మాట్లాడితిని.

నాకు కొన్ని కేసులలో తెలంగాణా బయట వకీళ్లతోకూడ కలిసి పని చేయుటకును అవకాశము తటస్థించెడిది. అనగా కొన్ని కేసులకు నైజాం, బ్రిటిష్ గవర్నమెంటు యిలాకాలతో సంబంధ ముండెడిది. మునగాల కేసును గురించి వ్రాసియే యున్నాను. ఆకారపువారి కుటుంబమునకు రెండు గవర్నమెంటు యిలాకాలలో ఆస్తులుండెను. పంపిడి వ్యాజ్యం మద్రాసు హైకోర్టులో ఆకారపు వెంకన్నగారి పక్షమున దాఖలు చేయబడెను. ఆ కేసులోని ప్రతివాది ఆకారపు చన్నయ్య వరంగల్లులోని ప్రముఖ వర్తకుడు. వ్యాజము మదింపును రు. 35,00,000ల వరకు చేయబడెను. వరంగల్లులో కూడ వ్యాజ్యం వచ్చునని చెన్నయ్యగారు 1922 సంవత్సరములో నన్ను వకీలుగా నేర్పాటు చేసికొనెను.

ఆ కేసులో నేను మద్రాసు వెళ్లి శ్రీ వరదాచారిగారితో సంప్రదించి వచ్చితిని. అంతకు పూర్వము శ్రీ వాసిరెడ్డి జ్ఞాన ప్రసూనాంబగారి దత్తత మంజూరి దరఖాస్తులో నేను శ్రీ కాళేశ్వరరావుగారున్ను పరిటాల కచేరిలో పనిచేసితిమి. ఇట్లే యింకెన్నియో సివిల్ క్రిమినల్ కేసులలో బయట వకీళ్లతో కలిసి పనిచేయుటకు అవకాశము లభించెను. తరువాత కొన్ని నాళ్లకు మా బంధువులు బారిష్టరు వెంకటేశ్వరరావుగారి యొక్కయు వారి సోదరులు సంగమేశ్వరరావు, వీరభద్రరావుగార్ల దేశపాండ్యాగిరి రుసుము ఈనాముల గురించి జాగీర్దారు వద్ద పనిచేసితిమి.

నేను అక్టోబరు 1909వ సంవత్సరమునుంచి అనగా 50 సంవత్సరములపై కాలము నుంచి వకీలుగా పని చేయుచున్నాను. అమరావతి, భద్రాచల దేవస్థాన ములకు బ్రిటిషు, నిజాం ఉభయ గవర్నమెంట్లలో సంబంధము కలిగియున్నది. ఆ దేవస్థానముల కొన్ని వ్యవహారములలో నేను పనిచేసి యున్నాను. అప్పుడు ఉభయ గవర్నమెంటులల శాసనములను న్యాయవాదుల సంప్రదింపులను గమనించ వలసి వచ్చినది. బ్రిటిషు గవర్నమెంటు కాలములో నైజాం రాజ్యము పర రాజ్యముగా పరిగణింపబడుచుండెను. వరంగల్, కృష్ణా జిల్లాలో ముఖ్యముగా పరస్పర సంబంధములుండెడివి. అనగా రెండు గవర్నమెంట్లలో వర్తక వ్యాపార ములు ఆస్తులు ఒకేవ్యక్తికి చెందియుండెడివి. ఒకే స్వభావము గలవి అందువలన నాకు అక్కడి వ్యాజ్యములలోను అక్కడి కక్షిదారులతోను సలహా సంప్రదింపు లుండెడివి. అప్పుడు రెండు వేరువేరు రాజ్యములు గనుక ఒక గవర్నమెంటులో డిక్రీనిబట్టి రెండవ గవర్నమెంటులో దావా చేయవలసి వచ్చేడిది. అప్పుడు అంతర్జాతీయ నియమ నిబంధనలను ఆలోచించవలసి వచ్చెడిది. అట్లే క్రిమినల్, సివిల్ కేసులలోని నిందితులను పట్టియిచ్చుటను గురించి ఆలోచనలు జరుగుచుండెడివి. గనుక నాకు బ్రిటిషు లాయర్లతో సమాలోచనలు జరుపుటకు అవకాశము లభించెడిది. ఒకటి రెండు వ్యవహారములలో కమీషనర్లు అక్కడి వారక్కడ యిక్కడి వారక్కడ పనిచేయుచుండిరి. వారివద్ద నేను పనిచేసెడివాడను. ఉభయ గవర్నమెంట్లతో సంబంధము కలిగియున్న మునగాల ఎస్టేటు వ్యవహారమును పైన వ్రాసితిని. మరియొక చిన్న అంతర్జాతీయ వ్యవహారంను వ్రాయుట ఉచితమనుకొనుచున్నాను. కొన్ని ఆంధ్ర తాలూకాలు, గ్రామములు గోదావరికి ఉత్తరపువైపున బ్రిటిషు పాలనకు చెందిన నాగపూరు రాష్ట్రములో చేరియుండెను. ఇప్పటికిని బస్తర్, చాందా, శిరవంచ తాలూకాలు నాగపూరు

రాష్ట్రములోనే యున్నవి. ఒకప్పుడు నూగూరు తాలూకాకూడ నాగపూరు రాష్ట్రమునకే చెందియుండెను. ఉత్తరమున గోదావరి నదిలో నైజాం బ్రిటిష్ సరిహద్దు ఏర్పాటు కాబడెను. ఒకప్పుడు అనగా 1314వ ఫసలీ (1905 సం.)లో నాగపూరు కమీషనర్ ఛోటాలాల్, నైజాం సుబేదారు షోహరాబ్‌జి సరిహద్దును గురించి ఒక నిర్ణయము చేసికొనిరి. అదేమనగా మే నెలలో గోదావరిలోతు ప్రవాహము ఎటుల ప్రవహించునో అదియే సరిహద్దు. ఇది వినుటకు విచిత్రముగా నున్న విషయము. ఇది అస్థిరమైన విషయము. గనుక కొంతకాలము క్రితము నూగూరు తాలూకా వెంకటాపురము ఎస్టేటు జమీందారు శ్రీ రాజా రాఘవరాజు యెఱ్ఱం రాజుగారి లంకభూములు బ్రిటిష్ హద్దులలో నుంచి తొలగింపబడి నైజాం పాలనలో నున్న ములుగు తాలూకాకు చేరిపోయెను. దానిని కనీసము పట్టాపైన నైనను సంపాదించుటకు ప్రయత్నము చేయవలసి వచ్చెను. నేను శ్రీ రాజాగారి తరఫున 1323వ ఫసలీ (1914 సం.) నుంచి వకీలుగా నుండి పని చేయుచున్నాను. దీనిలో కూడ నాకు ఉభయ గవర్నమెంట్ల శాసనములను దృష్టి యందుంచుకొని వ్యవహరించవలసి వచ్చినది. బ్రిటిష్ యిలాకాలో పై జెప్పిన జమీందారుగారికి నూటికి రు.60/-లు శిస్తు చెల్లించే పద్ధతిపైన జమీందారీ హక్కులీయబడెను. ఆ హక్కులను యథాతథాగా నుంచవలసినదని నిజాం గవర్నమెంటులో వాదించితిని. అప్పుడు కలెక్టరు తమ సెటిల్‌మెంటు శిస్తు ఆదాను గమనించుచు నా వాదన శ్రీరాయ జగన్మోహన్‌లాలు గారు అంగీకరించినచో తమ గవర్నమెంటుకు కూడ నష్టములేదని గ్రహించుచు నాతో ఏకీభవించిరి. గాని పై అధికార్లు తమకుగల ప్రభుత్వ గౌరవ లాంఛనముల దృష్ట్యా రాజాగారికి జమీందారీ హక్కులకు ఈయజాలమనిన్నీ సెటిల్‌మెంటు శిస్తుపైన యావత్తు లంకభూమిని పట్టాపై నిచ్చెదమనిన్ని 1327వ ఫసలీ 23 ఫర్వర్దీ తారీఖున రివిన్యూ డిపార్టుమెంటువారు తీర్మానము చేసిరి. ఆ ప్రకారము నైజాంకు మార్చబడిన ఏటూరునాగారం వగైరా గ్రామాదులలోని లంకభూములను సెటిల్‌మెంటు శిస్తుపైన పట్టానీయబడెను. నేను రివిన్యూ, సివిల్, క్రిమినల్ కేసులలో అన్నిరకముల వ్యాజ్యములలో పనిచేసితిని. నేను మొదటి తరగతి వకీలు పరీక్షకు చదివినప్పుడు మెడికల్ జూరిస్ ప్రొడెన్స్ చదువవలసి వచ్చినందున దానిని నేను శ్రద్ధగా చదివితిని. ఆ విజ్ఞానమునుబట్టి కొన్ని సివిల్ క్రిమినల్ కేసులలో డాక్టర్లపైన బాగుగా ప్రతి పరీక్ష (క్రాసు ఎగ్జామినేషన్) చేయగలిగితిని. దైవానుగ్రహము వలన నాకు స్త్రీలను చెరచిన కేసులలో మాత్రము పనిచేయుటకు

అవకాశము లభించి యుండలేదు. నేను సంపాదించిన విజ్ఞానము యిందుకు వినియోగ పడకపోవుటకు సంతోషించుచున్నాను. రివిన్యూలో భూసంబంధమైన భాగములు టెనన్సీలు, అక్రమ స్వాధీనములు, వారసత్వములు యిట్లే వతన్‌దారి, మాష్‌దారితో (అనగా గ్రామోద్యోగస్థుల యొక్కయు దేశముఖి దేశపాండ్యా యినాందార్ల యొక్కయు) దత్తత వారసత్వము మొదలగు విషయము లన్నిటిలో బాగుగా పనిచేసితిని. పరీక్ష యిచ్చితిని. ఆ కారణమున భూముల కొలతలు బౌండరీలు మొదలగు వాటిలో నేను సంపాదించిన విజ్ఞానముతో లాభము సంపాదించితిని. నేనుభయ గవర్నమెంట్ల (నిజాం, బ్రిటిష్) గ్రామకరణముల లెఖ్ఖలు వ్రాసి జమీందారి ఎస్టేటు పేష్కారి ఉద్యోగమును నెరవేర్చితిని. గనుక యిచ్చట జమాబంది అప్పీళ్లలో బాగుగా పనిచేయగలిగితిని. ఈ విషయము అనుభవ జ్ఞాన ప్రకరణమున వివరముగా వ్రాసితిని. మొత్తము మీద రివిన్యూతో సంబంధించిన అన్ని శాఖలలో సమర్థతతో పనిచేయ గలిగితిని. వేలాది సివిల్ కేసులలో లక్షలాది విలువగల పలు రకముల వ్యాజ్యములలో పనిచేసితిని. గనుక నాకు ప్లీడింగ్సు వ్రాయుటలోను పరీక్షా ప్రతి పరీక్షలు చేయుటలోను రోజులకొలది వాదోపవాదములు చేయుటలోను పిరికితన ముండెడిదికాదు. అనగా మా హైద్రాబాదు రాష్ట్రములో నాకన్న తెలివిగలవారు లేరని చెప్పుట నా ఉద్దేశము కాదు. తెలంగాణాలోని ప్రముఖ న్యాయవాదులు శ్రీ బి. రామకృష్ణారావు, ఎం.హను మంతరావు, కె. వి. రంగారెడ్డిగార్ల వెనువెంట నుండేవాడనని చెప్పుకొనగలుగు చున్నాను. నేను పనిచేసిన వేలాది కేసుల లీస్టును చెప్పుట అనవసరముగాని హైద్రాబాదు మద్రాసుల మధ్యన జరిగిన ఒక అపూర్వమైన కేసు సంగ్రహ చరిత్రను మాత్రమిందుహరించుచున్నాను.

## ప్రత్యేక ఒక కేసు

1326 ఫసలీ యినగాల బాబురెడ్డి ఉనే ఒకరు పి.డబ్ల్యు.డి. శాఖలో గుమాష్తాగా నుండెను. ఆయన విద్యావంతుడు. గ్రంథాలయ కార్యవర్గ సభ్యుడు కూడ అయియుండెను. ఆయన ఆత్మకూరు జమీందారునకు ఔరస పుత్రుడని యును, యావదాస్తికి తానే కర్తననియును రు. 6,00,000ల వ్యాజ్యము విలువకట్టి పాపరుసూటు దాఖలుచేసెను. దానిని శ్రీ తాజుద్దీన్ అనే ప్రముఖ న్యాయవాది వ్రాసెను. దానిలో వాది ఔరస పుత్రుడు కాడనియును, వేశ్యా పుత్రుడనియును తాను దత్తుడననియును ప్రతివాది ధర్మారెడ్డిగారి వాదన అయియుండెను. శ్రీ

తాజుద్దీన్‌గారు చనిపోయిన తరువాత బాబురెడ్డి స్నేహితరీత్యా సహాయము చేయ వలెననికోరి నేను రెండవ తరగతి వకీలును అయిన తరువాత నన్ను వకీలుగానే నేర్పాటు చేసికొనెను. పాపరు మంజూరు అయినది. అసలు కేసులో రీజాయండరు నేను వ్రాసి దాఖలు చేసితిని. అందులో వాది తల్లిని వెంకట్రామ నర్సయ్యగారు గాంధర్వ విధానముగా వివాహము చేసికొని నాడనియును ఒకవేళ వివాహము శాస్త్రీయముగాకున్నను వాది తల్లిని వెంకట్రామ నరసయ్య దేశాయిగారు భార్యవలె ఉంచుకున్నాడు గనుక వాది కనీసము దాసి పుత్రుడుగా యెంచబడుననియును అప్పుడు అతనికి పావు భాగము వచ్చుననియును గాని ప్రతివాది దత్తు కల్పితము అయినది గనుక వాది యావదాస్తికి కర్త కాగలడనియును వ్రాసితిని. వ్యాజ్యము కనీసం 12 సంవత్సరములు నడచినది. షుమారు 200 దస్తావేజులు, 60 మంది సాక్షులు విచారించబడిరి. నేను 11 రోజులు వరుసగా మొట్టమొదటను ప్రతి జవాబుగా 3 రోజులును మొత్తము 14 రోజులు ఆర్గ్యుమెంటు చెప్పితిని. శ్రీ రాయ్ విశ్వేశ్వరనాథ్‌గారి (అప్పటి వకీలుగా నున్న) సహాయముచే లభించిన 60, 70 తీర్పులను చూపించగలిగితిని. అందొక తీర్పులో శ్రీహనుమంతుని జన్మను గురించి చర్చ జరుపబడెను. అనగా "మారుతస్య ఔరస పుత్రః" అనగా కేసరి భార్య అంజనీదేవికి వాయుదేవునివలన కలిగినవాడు గనుక హనుమంతుడు వాయుదేవునకు ఔరసు డనియును కేసరికి క్షేత్రజు డనియును అనిపించుకొను నని చర్చ చేయబడెను. వాల్మీకి రామాయణములో హనుమంతుడు సీతతో తన జీవిత వృత్తాంతమిట్లే చెప్పెను. ఆ కేసులో వాదికి పావు భాగముకు డిక్రీ దొరికెను. ఈ డిక్రీ జుడిషయల్ కమిటీలో ఖాయపర్చబడెను. హైద్రాబాదు మద్రాసుల మధ్యన దానికి అదియే ఉదాహరణముగా నుండెను. నేను అధికారులకు జడిసిగాని, ఆశ్రయించి గాని, ప్రసన్నులను చేసికొనలేదు. అందరు రివిన్యూ జుడిషియల్ అధికారులు నాయందు నమ్మకము గలిగి గౌరవముగానే చూచుచుం డెడివారు. హైకోర్టు జడ్జీలలో చాలమంది నాయెడల గౌరవదృష్టి నుంచెడివారు. హైకోర్టు జడ్జీలలో చాలమంది నాయెడల గౌరవదృష్టి నుంచెడివారు. వారిలో ముఖ్యులు. 1. పండిత కేశవరావు, 2. పండిత గిరిరావు, 3. నవ్వాబు అక్బయార్ జంగ్ బహద్దుర్, 4. రాజా బహద్దుర్ విశ్వేశ్వరనాథ్, 5. రామచంద్ర నాయకు, చిరస్మరణీయులు. యింకను మరికొందరు న్యాయమూర్తులు రివిన్యూ సెక్రటరీలు, సుబేదారులు, మంత్రులు వుండిరి. వున్నారు. వారి శుభనామములను గ్రంథవిస్తర భీతిచే ఉదహరించలేదు. హైద్రాబాదు ఎసెంబ్లీ ప్రథమ స్పీకర్ కీర్తిశేషులైన శ్రీ కాశీనాథరావు వైదయగారు నాయడల గౌరవము, ఆదరము స్నేహభావములు

వుంచెడివారు. ఆయన న్యాయవర్తన గలవాడు. నిష్కల్మష హృదయుడు ధీరోదాత్తుడు. రెండు పర్యాయములు అసహాయోద్యమములో పాల్గొని కారాగారమునకు వెళ్లిన దేశభక్తుడు. ఆయనను నేను మరవజాలను – ఆయన మహారాష్ట్ర బ్రాహ్మణుడు. ఔరంగాబాద్ జిల్లా కాపురస్తుడు గాని తెలంగాణా ముఖ్య పట్టణమగు హైద్రాబాదులో వుండి వికాలత్ ప్రాక్టీస్ చేయుచుండెను. ధర్మవరములో జరిగిన 9వ ఆంధ్ర మహాసభకు నేను అధ్యక్షుడుగా నుంటిని. ఆ సభకు వైద్యాగారు వచ్చిరి. "రామకోటేశ్వరరావు" ఆంధ్ర మహాసభాధ్యక్షుడు కావున 80 లక్షల ఆంధ్రులకు ప్రతినిధిగా పనిచేయగలడు. నేను 15 సంవత్సరములకన్నా ఎక్కువ కాలము నుండి హైద్రాబాదులో స్థిరనివాసము యేర్పరచుకొని వున్నాను. గనుక నన్ను ముల్కీ నియమానుసారము నిజామాంధ్రుడుగా అధ్యక్షుడు పరిగణించవలెనని కోరెను. మహాసభలో వారి కోరిక ఏకగ్రీవముగా అంగీకరించబడినది.

* * *

*ప్రకరణము – 9*

# అనుభవ జ్ఞానముచే సంపాదించిన ప్రయోజనములు

నేను 3వ తరగతి న్యాయవాది నగుటకు కావలసిన శాస్త్రజ్ఞానము ప్రఖ్యాత గురువువద్దనే సక్రమముగాను, శ్రద్ధగాను సంపాదించితిని. 1వ తరగతి న్యాయవాద పరీక్షల కొరకు స్వయముగాను, పండితుల యొద్దను కృషిచేసి శాస్త్రజ్ఞానము సంపాదించి కఠినమగు పరీక్షలలో ఉత్తీర్ణుడనైతిని. ఆ వివరములను ఈ చరిత్రలోని 3వ, 4వ అధ్యాయములలో వ్రాసియేయున్నాను. ఒకవేళ అందు కొన్ని దేశకాలమానములను బట్టి గ్రహించవలసిన చరిత్రాంశము లున్నను వుత్తమోత్తమ న్యాయవాద పరీక్షలకును యితర పండిత పరీక్షలకును కృషిచేసి, ఉత్తీర్ణులయిన వారియొక్క స్వోత్కర్ష అనిపించు కొనవచ్చునని గ్రహించుచున్నాను. గాని పండితవర్యులు చారిత్రక విషయములనే గమనించెదరని కోరుచున్నాను. ఈ విషయ మటుండనిచ్చి నేను న్యాయవాదినైన తరువాత నాకు ఉపకరించిన కొన్ని చరిత్రాత్మక విషయములను అనగా అదృష్టవశాత్తేగాని, దురదృష్టవశాత్తే గాని నాకు ఘటించుటయు కష్టకాలమున అట్టి ఘట్టములను దాటగలుగుటయు తటస్థించి అవి భవిష్యత్తులో శుభదాయకము లయినవని చెప్పుట అవసర మనుకొనుచున్నాను. న్యాయవాదికి శాస్త్రీయమగు గ్రాంధిక జ్ఞానమేగాక యితర విజ్ఞానమును, లోకజ్ఞానమును, అనుభవ జ్ఞానమును సంపాదించుట ప్రయోజనకారి కాగలదని నిరూపించుటకే ఈ క్రింది నా జీవిత విశేషములను వ్రాయుటకు సాహించుచున్నాను.

1. 1901 సంవత్సరములో నన్ను పారశీ చదువుటకు పరిటాలకు పంపిరి. గాని నన్ను పేష్కారుగా చేయించగోరు మా మామగారు తాలూకా కచహరికి మధ్య మధ్యవెళ్లి పని నేర్చుకొనమనిరి. ఆ కారణమున నేను తహశీలు కానాత్, జాగీర్ కచహరికి వెళ్లేవాడను. అక్కడ కర్ణములకు వ్రాసే లెఖ్ఖలు, దరఖాస్తులు మవుసూలా మజారియా మిసల్‌బందు చిఠాఖాతా ఖజానా ఉండే పద్ధతి అధికారులు ఉద్యోగస్తులు జవానులు కూర్చొన వలసిన విధానమును గ్రహించితిని.

2. తరువాత మా పినతండ్రిగారు కాలం చేసినందున మా నాన్నగారు నన్ను యింట్లోనే వుంచిరి. ఆ కారణము 1) యద్దనపూడి వెంకటసుబ్బయ్యగారి పెద్ద వ్యాజ్యపు కాగితములను దస్తావేజులను సాక్షులను వాజ్మూలములను డిక్రి జడ్జిమెంట్లను వ్రాసి కోర్టు రికార్డు సంగతులను తెలుసుకొంటిని.

3. శ్రీ మేదుకొండూరి రంగయ్యగారి కోరికపైన చెన్నారావు పాలెం, తిమ్మాపురం గ్రామ లెఖ్ఖలను మా తాత మే,, వెంకటరత్నంగారి కోరికపైన జుజ్జూరు అమరకం వసూలు జమాబంది లెఖ్ఖలను వ్రాసితిని.

4. మా బావగారు వెంకటనరసింహంగారు మున్సఫ్ కరణములతో సంబంధించిన యావత్తు లెఖ్ఖలను వ్రాయించిరి.

5. సర్వే ట్రయినింగు స్కూలులో తహశీలుదార్లు రివిన్యూ యినస్పెక్టర్లు కరణములతో చేరి చదివి పరీక్ష యిచ్చితిని.

6. రివిన్యూ సెటల్‌మెంటు లెఖ్ఖలు తయారుచేసి భూములనుకొల్చి పంచి ప్లానులు తయారు చేసితిని.

7. నీలికుర్తి గ్రామ లెఖ్ఖలను వ్రాసి హైద్రాబాదు జమాబంది లెఖ్ఖ పద్ధతులను గ్రహించితిని.

8. నీలికుర్తిలోని మా స్వంత భూముల హద్దులను అనుభవము వలన నిరూపించుకొన గలిగితిని.

9. 1903 సంవత్సరములో (నా 19వ సంవత్సరం వయసులో) మిర్జాపురం యస్టేటుకు పేష్కారుగా నియమింపబడి 40 గ్రామముల తాలూకా ఆదాయ లెఖ్ఖలను తయారు చేయుచు వసూళ్ల కొరకు కరణములు, సమ్తుదార్లు (రివిన్యూ యిన్సుపెక్టర్) వల్ల జబ్తులు చేయించి తహశీల్దారు కలెక్టరు ద్వారా వేలం వేయించి రివిన్యూశాఖ పనిని నిర్వహించుటకు సమర్థత సంపాదించితిని. ఆ శాఖా సంబంధమగు నియమ నిబంధనలను తెలుసుకొంటిని.

10. ఫారెస్టు ఆబ్కారి డిపార్టుమెంటుల విషయములు జలాధారములు వాటి మరమ్మతులు వాటికింద విధించవలసిన పన్నుల విషయములను తెలిసికొంటిని.

* * *

*ప్రకరణము - 10*

# వృత్తి నిర్వహణలో తటస్థించిన విషయములు

1. నైజాములోని బంజరు యిజారాల నియమములను వాటి స్వభావములను తెలిసికొని అనగా పరిశోధనచేసి పురాతన ఫర్మానులను దివాను ఉత్తర్వులను సంపాదించి శ్రీమునగాల రాజాగారి యిజారా గ్రామములలో వారిపై నున్న అక్రమ పన్నుల భారమును తప్పించి వారి హక్కులు వారికి స్థిరపరిపించ గలిగితిని. వారివంటి యితర యిజాదారుల కట్టి సౌకర్యములు దొరికియుండలేదు. నేను సాధించిన పర్మాను వగైరాలను యెందరో ఉపయోగించుకొనిరి.

2. వారి యిజారాల భూమి గౌవర్నమెంటువారు ఆక్రమించుకొని వారిని భుక్తపరచుకొననీయకుండా నిరోధించుచు శిస్తులు వసూలు చేయుటకు జమాబందీలలో ప్రతి సంవత్సరము ఉత్తర్వులు ఈయబడుచుండెడివి. వాటిని గురించి జిల్లా కలెక్టరు, సుబేదారు, రివిన్యూ మంత్రి వరకు అప్పీళ్ళు అగుచుండెడివి. ఆ కేసులో ఫారెస్టు, షికారుగాః, రివిన్యూ డిపార్టుమెంటుల ప్రత్యేక ఉత్తర్వులనేకాక సెటల్‌మెంటు ప్లానులు లెఖ్ఖలను పట్టికూడా వాదన జరుగుచుండెడిది. నేను శ్రీ రాజానాయన వెంకటరంగారావు గారి తరఫున వకీలుగా 50 సంవత్సరములు పనిచేసితిని. ఈ కేసులో నేను సంపాదించిన రివిన్యూ సెటిల్‌మెంటు అనుభవము విజ్ఞానము సహాయకారి అయినది. ప్రతి కేసులోను శ్రీ రాజాగారికే జయము కలుగుచు వచ్చినది.

3. నేటికి 20 సంవత్సరములకు పూర్వము ఒక పర్యాయము శ్రీ రాజా నాయన వెంకటరంగారావుగారిపైన పదహారు వేల రూపాయిల అపరాధ శిస్తు విధించిరి. అందులో రివిన్యూ స్థానికాధికారులు శ్రీ రాజాగారు తమకు సంబంధము లేని భూమిని ఆక్రమించుకొని జలాధారములకు నీరు రాకుండా ఆపివేసిరని నేరము ఆపాదింపబడెను. అప్పీలు చేసినమీదట కలక్టరుగారు దానిని సబ్ కలెక్టరుకు విచారణ నిమిత్తము పంపిరి. నేను వెంట ఉండి బొల్లెపల్లి, గాదెలఘట్టు, అయోధ్యపురము గ్రామముల సెటిల్‌మెంటు ప్లానులను బట్టి స్థానికాధికారులు యిచ్చిన రిపోర్టు సరియైనది కాదని ధృవపరచ గలిగితిని. సబ్ కలక్టరరు ఖాజా ఆల్తాఫ్ హుసేన్‌గారు నా సెటిల్‌మెంటు అనుభవమునకు సంతోషించెను. పదహారు వేల రూపాయిల అపరాధ శిస్తు తీసివేయుటకు నిర్ణయించిరి.

4. తుంగతుర్తి నరసింహరావుగారి తాలూకు కర్లపల్లి యిజారా గ్రామములో షుమారు మూడు నాలుగువేల ఎకరముల భూమిని తీసి రిజర్వు ఫారెస్టులో చేర్చుకొన వలయునని వాదన జరుగుచుండెను. దానిలో రివిన్యూ సెటల్‌మెంటు కాగితములు ప్లానులపైన వాదన యుండెను. నేను నరసింహరావుగారి ప క్షమునను వారి కుమారుల పక్షమునను సెటిల్‌మెంటు కమీషనర్‌గారి వద్ద వాదించి పార్టీకి న్యాయము కలిగించితిని.

5. ప్రతి సంవత్సరము నావద్ద జమాబంది అప్పీళ్ళు వందలాది వచ్చుచుం డెడివి. వాటిలో సెటిల్‌మెంటు రికార్డులు నీటి తీరులు జలాధారములు మొదలగు విషయములు చర్చనీయాంశములుగా నుండెడివి. ఆ కేసులు నడుపునప్పుడు నేను సంపాదించిన గ్రామీణ లెఖ్ఖజ్ఞానము కూడా సహాయకారి అగుచుండెడిది.

6. పరిటాల మొదలగు ఏడు గ్రామములు కృష్ణాజిల్లా మధ్యభాగమున నవాబుఖాన్ ఖానాను బహద్దూరుకు జాగీరు ఈయబడెను. ఆయన ఆ స్టేటుకు సర్వాధికారి. ఆయన తన ఎస్టేటును సర్వే సెటిల్‌మెంట్ చేయించెను. అత్యధికమైన రేట్లు విధించి సెటిల్‌మెంటు చేయించినానని చెప్పుకొను చుండెను. రైతులకు పన్నుల భారము అధికముగా నుండెను. నేను రైతుల తరపున వకీలుగానుండి రివిన్యూ మంత్రివద్ద అత్యధిక రేటును తగ్గించమని అర్జీ పెట్టితిని. నేను మద్రాసు గవర్నమెంటువారు ప్రచురించిన వాటిని తీసుకొని వెళ్లి నవాబు ఫసేజంగు బహద్దుర్ రివిన్యూ సెక్రటరీకి చూపించితిని. వాటిలో మెట్టపల్లపు భూముల తరగతులు, తరముల రేట్లు ఉదహరించబడి యుండెను. అవి అన్నియు

అచ్చుప్రతులు. వాటినిచూచి ఆయన తన హర్షమును ప్రకటించుచు జాగీరు సెటిల్‌మెంటును ఆపుచేయుటకు ఉత్తర్వు యిచ్చెను. అందుపైన నవాబు కమాల్‌యార్‌జంగ్ నన్ను పిలిచి శిస్తు నీవే తగ్గించమనుటయు, నేను పదివేల రూపాయలు సూచించుటయు, కొన్ని మార్పులతో అంగీకరించుటయు జరిగినది.

7. నిజామాబాదు జిల్లాలో నిజాముసాగర్ ప్రాజెక్టున్నూ వరంగల్ జిల్లాలో వైరా, పాలేరు ప్రాజెక్టులున్నూ ముప్పది సంవత్సరములకు పూర్వము నిర్మాణము చేయించిరి. క్రింది భూములపైన య 1కి ముప్పది, యిరవై నాలుగు, యిరవై రూపాయల వరకు పల్లపురేట్లు విధించిరి. అందుపైన ఆంధ్రోద్యమము పక్షమున మేము రేట్లు తగ్గించుమని ప్రతిఘటించు చుండెడివారము. ఈ తీర్మానమును గురించి తరుచుగా నేనే మాట్లాడెడివాడను. ఈ వాదనను ధృవపరచుకొనుటకు నేను కృష్ణా డిస్ట్రిక్టు కృష్ణా డెల్టా మరియు చెరువుల క్రింది భూములయొక్క రేట్లను నిరూపించుటకు ఎన్నియో గ్రామముల రీసెటిల్‌మెంటు అచ్చు రిజిష్టర్లను తెప్పించి సుబేదారుకు చూపించితిని. కొన్ని సంవత్సరముల తరువాత మా వాదన కొంతవరకు అంగీకరించబడెను. రేట్లు తగ్గింపబడినవి. రీ సెటిల్‌మెంటు చేయబడినది.

8. వైరా ప్రాజెక్టు క్రింద రీ సెటిల్‌మెంట్ ప్రకారము రేట్లు ఎకరము ఒక్కంటికి యిరవై నుంచి పన్నెండు వరకు తగ్గింపబడెను. గాని ఆ ప్రకటన మార్చి మొదటి వారమున అందబడెను. అది అమలు జరిగినచో కొన్నివేల రూపాయిలు రివిన్యూ శిస్తు తగ్గింపవలసి వచ్చును. దానివలన ప్రతి రైతునకు లాభము కలిగెడిది. కాని లెఖ్ఖలు పూర్తి అయినవి. జమాబంది త్వరగా కావలసియున్న దనే మిషతో కరణములు ఆ సంవత్సరము లెఖ్ఖలను మార్చజాల మనిరి. ప్రాజెక్టు రైతుల సమూహము నా వద్దకు వచ్చెను.నేను బదురుద్దీన్ సుబేదారు గారితో ఎన్నియో విధములచెప్పి లెఖ్ఖలను మరల తయారు చేయుటకును రిమిషన్ అమలులో పెట్టుటకు ఉత్తర్వులిప్పించితిని. ఆ ప్రకారము పాతలెఖ్ఖలు చించివేయబడి కొత్త లెఖ్ఖలు కుట్టబడినవి. నేను ఫీజుగాని ప్రతిఫలముగాని రైతుల వల్ల తీసుకొని యుండలేదు.

9. మొదట మధ్యప్రదేశ్‌లో నుండి తరువాత మద్రాసు యిలాకా తూర్పు గోదావరి జిల్లాలో చేరిన వెంకటాపురం ఎస్టేటు జమీందారు శ్రీ రాజా రాఘవరాజు ఎఖ్ఖం రాజుగారి లంకభూములు గోదావరి ప్రవాహపు మార్పువలన వరంగల్ జిల్లాలో చేరిపోయిన తరువాత వారి తరఫున నేను వకీలుగా నుండి 1323

ఫసలీ (1914) లగాయతు పనిచేయుచున్నాను. ఆ లంకభూముల మార్పులో నైజాం బ్రిటిష్ గవర్నమెంటుల సరిహద్దుల తగాదాలేగాక నైజాంలోని గ్రామగ్రామముల మధ్యను రైతుల మధ్యను సరిహద్దు తగాదాలు ఏ సంవత్సరమున కా సంవత్సరము ఉద్భవించుచునే ఉన్నవి. ఆ కేసులన్నిటిలో చట్టములు శాసన ములలోని విషయముల నటుండనిచ్చి సర్వే సెటిల్‌మెంటు జమాబందీ విషయములలో నా అనుభవ జ్ఞానమును వినియోగించి దాని ప్రయోజనమును పార్టీకి లభింపచేయ గలుగుచున్నాను.

నేను అనువంశీకముగా భూస్వామిని, వ్యవసాయకుడను. గనుక వ్యవసాయ వృత్తితో సంబంధించిన ఎన్నియో విషయములు, అనగా పైర్ల స్వభావములు – వాటిని విత్త తగిన తరుణములు నాకు తెలిసి యుండుటచే ఆ సంబంధమైన వ్యాజ్యములలో నా అనుభవమునుబట్టి వాదించి నా కక్షిదారుకు లాభము కలుగచేసేవాడను.

* * *

*ప్రకరణము - 11*

# రాష్ట్రేతర ఉద్యమంలో సహకారం

హైద్రాబాదు రాష్ట్రములో రాజకీయములకు తావుండెడిది కాదు. ఆంధ్రోద్యమము యే రూపముగా జన్మించి రాజకీయముగా యే విధముగా మారినదో అయిదవ అధ్యాయమున వివరముగా వ్రాయబడినది. భారతదేశమున కాంగ్రెస్ ఖిలాఫత్ ఉద్యమములు ప్రారంభింపబడిన వెంటనే హైద్రాబాదులో మేముకూడ ప్రారంభించితిమి. అది అణచివేయబడిన సంగతి అయిదవ అధ్యాయములో వ్రాయుచున్నాను. అయినను ప్రజా హృదయమును మార్చుటకు యే ప్రభుత్వము పనిచేయజాలదు. కాబట్టి హైద్రాబాదు రాష్ట్రమున భారత కాంగ్రెసుకు సభ్యునిగాచేరి కాంగ్రెసు మహాసభలకు వెళ్లి తీర్మానములు విని సంతోషించు చుండేవారము. ఈ అభ్యాసానుసారము మేము 1924వ సంవత్సరమున కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభకు సభ్యులముగా వెళ్లితిమి. శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారు ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా నుండిరి. వేద మంత్రములతోను ఖురాను ఆయతులతోను సభ ప్రారంభింపబడెను. నేడు అవి తీసివేయబడినవి. సంఘాధ్యక్షులు ఆంధ్రులయ్యును హిందీలో స్వాగతో పన్యాసమును జదివిరి. ఆ సమయమున హైద్రాబాదు నుంచి వెళ్లిన 60 మంది ప్రతినిధులము శ్రీ ధర్మవీర్ వామన్నాయర్‌గారి అధ్యక్షతన సభ జరిపితిమి. సభకు పూర్వము ఊరేగింపు చేసితిమి. సభలో హైద్రాబాదు రాష్ట్రమున సత్వరముగా మాంట్ పర్డు సంస్కరణలను అమలులో పెట్టుమని తీర్మానించి ప్రభువుగారికి మా పేర్లతో టెలిగ్రాము పంపితిమి. మాలో కొందరు మిత్రులు దారిలోనే అరెస్టు

కావచ్చుననియును యింటికి వెళ్లేవరకే ఆస్తులు జప్తులు కాబడుననియును భయపెట్టు చుండిరి. అట్లు జరుగలేదు. కొత్వాల్ వెంకట్రామరెడ్డిగారు నిజాం ప్రభువుగారికి యింత మాత్రముతో భయము లేదనియును టెలిగ్రాములను అర్జీలను – లక్ష్యపెట్ట నక్కర లేదనియును నచ్చజెప్పిరి. దీని పర్యవసానముగా విచారణ తతంగమును జరపక మా మిత్రులు రాఘవేంద్రరావుశర్మ బారిస్టరు గారి పట్టాను రద్దుచేసినట్లు ఫర్మాన్ జారి చేయబడినది. ఇంతటితో యిచ్చటి ప్రతీకారచర్య తతంగము ముగిసినది. గాని రాఘవేంద్రరావు శర్మగారు మాత్రమే హైదరాబాదును వదిలి ప్రభుత్వమునకు వ్యతిరేకముగా యెంతో కృషిచేసెను. తోక కాల్చిన హనుమతండు లంకగాల్చిన విషయము విజ్ఞులందరికి తెలిసిన విషయమే.

శ్రీ కాళేశ్వరావుగారు 1922 ఫిబ్రవరిలో రాజమహేంద్రవరము జైలుకు పంపబడిరి. గాని కొలది రోజులకే కడలూరి జైలుకు మార్చబడిరి. ఆ సంవత్సరము మే నెలలో మునగాల రాజాగారి రెండవ కుమార్తె సరళాదేవిని వనపర్తి మహారాజా రామేశ్వరరావుగారి జ్యేష్ఠ పుత్రుడు కృష్ణదేవరావునకిచ్చి మదరాసులో వివాహము చేసిరి. ఆ వివాహమునకు నేనును బారిష్టర్ తొర్లపాటి వెంకటేశ్వరరావుగారును వెళ్లితిమి. వివాహానంతరము మే ముభయులము కడలూరు వెళ్లితిమి. శ్రీ కాళేశ్వరరావుగారితో మాట్లాడుటకు అనుజ్ఞకోరి సూపరింటెండెంటు కుత్తరము వ్రాసితిమి. అరగంట నిరీక్షించవలసి వచ్చెను. నేను ఖద్దరు బట్టలతోను వెంకటేశ్వర రావు విదేశీ బట్టల సూటుతో నుంటిమి. వెంకటేశ్వరరావు కూడ ఖద్దరు కట్టేవాడే. యిద్దరము ఖద్దరు డ్రస్సులోనుంటే అనుజ్ఞ దొరకదనియును విదేశి బట్టల వాడికి అయినా అనుజ్ఞ దొరకవచ్చుననియును అట్లా జరుపబడెను. గేటు ప్రక్క గదిలో రాజకీయ నూతన ఖైదీలను ఆరోగ్య పరీక్షకై నుంచిరి. వారు మమ్ములను జూచి "ఒకడు బుద్ధిలేక యింకా విదేశి బట్టలు కుట్టుకొని వచ్చినాడే అని హేళన చేసిరి." మేము వారితో మాట్లాడజాలము గనుక నమస్కారము చేసితిమి. ఆ కాలమున కడలూరులో ఖద్దరు వ్యాపకము లేకుండెను. ఖద్దరు దారులమగు మమ్ములనుజూచి వారు సంతోషమును వెలిబుచ్చిరి.

మే ముభయులము విడివిడిగా కాళేశ్వరరావుగారిని సందర్శించి వారి క్షేమములను తెలిసికొని మరలితిమి. సుబ్బయ్య నాయుడనే జైలర్ మాతో కొంత దూరమెవచ్చి కాళేశ్వరరావుకు మీకెట్టి భక్తి ప్రేమలున్నవో మాకును అట్లాగే వున్నవి. మీరు భయపడవద్దు. మేము సర్వవిధముల వారిని కనిపెట్టు చుండెదమని చెప్పిరి.

తరువాత నేను బెజవాడ ఆరుకొలను వెళ్లి వారి అక్కచెల్లెండ్లు భార్యావార్లందరికి క్షేమవార్త దెలిపి హనుమకొండ వచ్చితిని.

శ్రీ కాళేశ్వరరావుగారు జైలు నుంచి వచ్చిన తరువాత 1923 సంవత్సరములో ప్రఖ్యాత కాంగ్రెస్ నాయకుడు ఆజాద్ సుబహానిగారును శ్రీ కాళేశ్వరరావుగారును వరంగల్లు వచ్చిరి. ఉభయులు మూడు రోజులు నావద్దనే యుండిరి. మౌల్వి ఆజాద్ సుబహానిగారు ఉరబ్బి, పారశీ భాషలలో అసమాన పాండిత్యము గలవాడు. మతపక్షపాతము లేని (సూఫి) వేదాంతి. గాంధి అనుయాయులలో ముఖ్యుడగు జాతీయవాది. చొక్కా నాగు తొడగక ఒక ఖాదిబట్ట లుంగీగాను ఒక ఖాదీబట్ట ఉత్తరీయముగానే వాడెడివాడు. 5 వేళల నమాజు చేసెడివాడు. వీ రుభయులు యిచ్చటి ముస్లిములతో కలిసి జాతీయోద్యమముల పట్ల వారి మనోభావములను తెలిసికొన వలెనని విచ్చేసిరి. నేను వా రుభయులను యిచ్చటి పెద్ద అధికారులతోను వకీళ్లతోను పరిచయము చేయించితిని. సంభాషణ జరిగిన తరువాత అప్పటివరకు పాకిస్తాను ప్రమేయము లేకుండా యావద్భారత హిందూ ముస్లిముల ఐక్యతయే దేశవిముక్తికి మార్గమనుకొనుచున్న రోజులు గనుక యిచ్చటి వారందరు నాయకులను గౌరవించి తమ ఆదరమును వుత్సాహమును కనుపరచిరి. తరువాత 1924 సంవత్సరములో శ్రీ ప్రకాశంగారు తాము నడపించుచున్న స్వరాజ్య పత్రిక చందాకొరకు హైద్రాబాదు వచ్చి కొంత ధనసహాయము సంపాదించి నేను నా భార్య చికిత్స కొరకు ఖమ్మంలో నుండుట తెలిసికొని ఖమ్మం విచ్చేసిరి. ఖమ్మంలో కొంత ప్రయత్నము చేసిన తరువాత నాకు యెక్కువ పరిచయముగల వేంసూరు పట్టికి వెళ్లదలచితిమి. బెజవాడ నుంచి నూజివీడు విస్సన్నపేట వచ్చి బండిమీద వెంకటాపురము వెళ్లితిమి. అచ్చట నా ముఖ్య మిత్రుడు మాదిరాజు వెంకటేశ్వరరావు గారింటికి వెళ్లితిమి. గ్రామరైతులు నా క్లయింట్లు గనుక ఆ గ్రామములో కొంత డబ్బు యిచ్చిరి. అచ్చటికే చుట్టుప్రక్కల గ్రామములోని కొందరిని పిలిపించితిని. వారిలో ముఖ్యుడు శ్రీ కాళ్లూరు రాజేశ్వర రావు విద్యావంతుడు జమీందారు అయియుండెను. ఆయన తన యింటికి అమ్మపాలెం మమ్ములను తీసికొనివెళ్లి విందుచేసి ఉచితరీతిని ఆర్థిక సహాయము చేసెను. అచటినుంచి ఒకరోజు వేంసూరు వెళ్లితిమి. అచ్చట శ్రీ అలవాల లక్ష్మినరసింహరావు వకీలు వారి అన్నగారు శేషగిరి రావులు యింకా కొందరు రైతులు డబ్బు సహాయము చేసిరి. వసూలు అయిన మొత్తము జ్ఞాపకము లేదు. ముగ్గురము బండిమీదనే విస్సన్నపేట వచ్చితిమి. విస్సన్నపేటకు శ్రీ

ప్రకాశంగారి కారు వచ్చియుండెను. దానిపైన ముగ్గురము బెజవాడ వచ్చితిమి. నేను బెజవాడ నుంచి వరంగల్లు వచ్చితిని. ఈ మధ్య అనగా 1921, 1923 సంవత్సరముల మధ్య నొకసారి 800 రూపాయిల విలువగల ఖాదిబట్టను బెజవాడ పంపితిని.

## శ్రీ కార్వేపండితుని ఆగమనము

పూనాలో భార్యాభర్తలు స్వయముగా కష్టించి గుడిసెలో ప్రాథమిక బాలికా పాఠశాల పెట్టి దానిని వృద్ధిపరచి కళాశాల చేసిన సంగతియు శరణాలయము స్థాపించిన సంగతియు భారతీయులందరికి తెలిసిన విషయమే. తుదకు మహిళా విశ్వవిద్యాలయము స్థాపించి అన్ని ప్రాంతముల విద్యార్థినులు చేరి తమతమ మాతృభాషలో చదివి పరీక్ష నీయవచ్చునని ప్రణాళిక సిద్ధము చేసెను. దానికి ఒకకోటి రూపాయిలు అవుసరముండెను. ఆయనలో ఒక పారశి ధనికవర్తకుడు కలిసి తాను 30 లక్షల భూరి దానమిచ్చుటకు వాగ్దానముచేసి యీ క్రింది నియమములను ఏర్పాటు చేసెను.

1. మొదట 15 లక్షల రూపాయీలు బ్యాంకులో పెట్టబడును. దాని వడ్డీని వాడు కొనవచ్చును. శ్రీ కార్వేగారు 15 లక్షలు వసూలు చేయవలయును. అటు తరువాత తానిచ్చిన 15 లక్షలు యూనివర్సిటీకి సర్వాధికారముతో చెందిపోగలవు. ముప్పది లక్షల ద్రవ్యముతో మందిరములు ప్రారంభించవచ్చును.

2. రెండవసారి మరల 15 లక్షల రూపాయీలు పైవిధముగా నీయబడును. శ్రీ కార్వేగారు 15 లక్షలు వసూలు చేయగానే ఈ డబ్బు యూనివర్సిటీకి యిచ్చివేయ బడును. మరల 30 లక్షలు కాగలవు. పర్యవసానముగా 60 లక్షల ద్రవ్యము యూనివర్సిటీకి శాశ్విత మూలధనము కాగలదు.

మొదటి మొత్తము యిచ్చిన తరువాత కార్వేగారు హైద్రాబాదు వచ్చి కొంత డబ్బు ప్రోగుచేసిరి. తరువాత వరంగల్లుకు విచ్చేసిరి. నా యింట్లో ఒక వారము రోజులుండి బియ్యపన్నము ఆంధ్ర వంటకములు తినుచుండిరి. అది వానకాలము. అయినను ప్రతిరోజు సాయంత్రము ఒక మైలుదూరము గొడుగు వేసుకొని తిరిగి వచ్చెడివారు. వారికి 4గురు కుమారులు. వారిలో యిద్దరు ఎం.ఎ.లు యిద్దరు బి.ఏలు. 4గురు కోడళ్ళు బి.ఏలు. ఈ యెనమండుగురును ఖర్చుల మందము స్వల్పజీతములు తీసుకొని కళాశాలలో అధ్యాపకులుగా పని చేసెడి వారు. పూనాలోని ఫర్గుసన్ కాలేజిలో కూడ శ్రీ గోఖలేగారు స్వల్పజీతము

లిచ్చెడివారు. నేను స్థానికులతో చెప్పి కొన్ని చందాలు చేయించి ఒక వెయ్యి రూపాయీలు యిప్పించినట్లు జ్ఞాపకము.

శ్రీ కార్వేగారు నా యింట్లోనున్న వారం రోజులలో యెన్నియో విషయములు వారితో మాట్లాడి తెలిసికుంటిని. రజస్వలానంతర వివాహములను గురించి మాట్లాడితిని. వారు చెప్పిన దేమనగా మహారాష్ట్రులు సనాతన ధర్మప్రియులగు బ్రాహ్మణులు కూడా. అతి బాల్యవివాహములు చేయుటలేదు. బుద్ధిపూర్వకముగా కావలెనని రజస్వలానంతర వివాహములును చేయుటలేదు. కన్యకు 13, 14 సంవత్సరముల వరకు వరాన్వేషణలోనే ఉంచి వివాహము చేయుదురు. రజస్వల అయినచో దానిని లక్ష్యపెట్టరు. సంఘ బహిష్కారము చేయరు గాని రజస్వలానంతర వివాహము చేయుచున్నామని ఆధిక్యత చెప్పుకొనుచు ప్రకటించరు.

నా పెద్దకుమార్తె వరలక్ష్మమ్మ వివాహము 1929వ సంవత్సరంలో జరిగియుండెను. ఆ వివాహ సందర్భమున నా మిత్రులు పింగళి లక్ష్మినారాయణగారు ఆశ్రమ స్వీకారము చేసిన తరువాత మా యింటికి వచ్చిరి. వివాహ దక్షిణగా కాంగ్రెస్‌కు చందా యిప్పించుమనికోరిరి. నా పెద్దతల్లి కుమారుడు తాడేపల్లి వేణుగోపాలరావు కూడా మా వియ్యంకులు మాదిరాజు (అన్యగోత్రం) వెంకటేశ్వర రావుగారిని ప్రోత్సాహపెట్టిరి. ఇద్దరు వియ్యంకులము చెరి రు. 25/–లు చందాల నిచ్చితిమి. ఆ కాలమున జుజ్జూరులో నా స్వంత భూమిలో కుంట వేసుకొనుటకు అనుజ్ఞ యిప్పించుమని సబ్ కలెక్టరువద్ద దరఖాస్తు పెట్టితిని. నందిగామ తాలూకా తహశీల్దారు శ్రీ లక్ష్మణరావు నాయుడు విచారణకు వచ్చి నేను వేయుచున్న కుంటను చూచి సెలవు పొందనిదే వేసినావేమనెను. ఆక్షేపణలేని విషయము గనుక వేసితినని చెప్పితిని. నేను కాంగ్రెసువాడను. సహాయ నిరాకరణ వాదిని గనుక అనుజ్ఞ ఈయకూడదని సబ్‌కలెక్టరుకు రహస్యముగా వ్రాసెను. సబ్‌కలెక్టరు శ్రీ హిజ్మాడిగారు నా దరఖాస్తును నామంజూరి చేసెను. మరల దరఖాస్తుపెట్టి ప్రదేశము చూడుమని కోరితిని. వచ్చి నా పరోక్షమునచూచి నామంజూరు చేసెను. జిల్లా కలెక్టరు వద్ద అప్పీలు చేసితిని. ఈ సబ్‌కలెక్టరు శ్రీ హిజ్మాడి ఆక్టింగు కలెక్టరుగా వచ్చి అప్పీలు నామంజూరి చేసెను. నేను తుర్లపాటి వెంకటేశ్వరరావు గారును యెదురుగావెళ్లి మాట్లాడినప్పుడు నవ్వేవాడు. వెనుకనుంచి వ్యతిరేక ఆర్డరు పంపెడివాడు. పై రహస్యము తరువాత ఎట్లనో బయటపడినది. తరువాత శ్రీ పత్తిపాటి సత్యనారాయణరావు పంతులు (రిటైర్డు న్యాయమూర్తి) గారి ద్వారా రివిన్యూబోర్డులో అప్పీలు చేసితిని. అప్పటికి గాంధి యిర్విన్‌సంధి కుదిరి నాన్‌కో

పరేటర్లకు చేసిన అపకారములు ఉపసంహరించుకొని న్యాయమైన సౌకర్యములను కలిగించుటకు అంగీకరించిరి. ఈ వరుసలో నాయెడల ప్రతీకార దృష్టితొలగి పోయినది. గనుక రివిన్యూ బోర్డు నుంచి నా కుంట ఉండవచ్చునని ఉత్తర్వు యిచ్చిరి. ఈ కుంటలో తట్టు నీటిమట్టమును నా బంధువున్ను ప్రఖ్యాత యింజనీయర్ అయిన డాక్టర్ కానూరు వెంకట లక్ష్మణరావుగారు లివిల్ తీసి ప్లాను తయారుచేసిరి. ఆ ప్లాను కూడా రివిన్యూ అధికారులకు పంపితిని. ఆ ప్లానును బట్టి యెవరికిని ఆక్షేపణ లేకుండెను. అయినను ప్రభుత్వోద్యోగులు అంగీకరించలేదు. నన్ను సహాయ నిరాకరణ వాదియని అకారణ గౌరవమొసంగిరి.

* * *

*ప్రకరణము - 12*

# మద్యపాన నిషేధ ప్రయత్నము

# (జగన్నాథ పల్మేరా యిండస్ట్రీస్ కంపెనీ)

హైద్రాబాదు రాజ్యములో కల్లు గ్రామ గ్రామములుగాను, తాలూకాలుగాను, జిల్లాలుగాను, ఒక సంవత్సరమునకే గాని లేక 3, 5, 10 సంవత్సరముల దీర్ఘ కాలమునకే యిజారాలు యిచ్చుచుండెడివారు. అందు పలుకుబడి కలవారు ధనవంతులు హెచ్చుపాటపాడి యిజారా తమపేరున తీసుకొని విడివిడిగా గ్రామములను కలాలీలకు పొందుబాటు చేసేవారు. ఈ యిజారాల మూలమున తెలంగాణమున పింగళి వెంకట్రామారెడ్డి, కోదండరామరెడ్డి, సిద్ధం శెట్టి చంద్రయ్య వామన్నాయక్, ఘాంశీరాం మొదలగువారు ఎందరో మహదైశ్వర్య వంతులయినారు. కాలానుసారముగా ఈ యిజారా యిచ్చే సమయమున డబ్బు ప్రభుత్వమువారు కంట్రాక్టర్లపైన పెంచుటయు కంట్రాక్టర్లు కలాలీలపైన పెంచుటయు జరుగుచు వచ్చినది. దుకాణములు పాటపాడుటగాని తాటి ఈతచెట్లపైన నెంబరు వేయుటగాని ఉండెడిది కాదు. 1929వ సంవత్సరములో వరంగల్ కలాలీలపైన ఎక్కువ పన్నుల భారము వేసిరనిన్ని దానిని వారు భరించ జాలరనిన్నీ ఒక ఆందోళన లేవదీయబడియె. అదేకాలమున మహాత్మాగాంధి మద్యపాన నిషేధమును ప్రచారము చేయుచు ప్రభుత్వ ఆబ్కారి ఆదాయమునకు భంగము కలిగించిరి. వరంగల్ కలాలీలు నాతో సంప్రదించిరి. నాకు కూడా

మద్యపాన నిషేధము యిష్టమే గనుక అంతట నేను కొందరి మిత్రుల సహాయముతో రూపాంతరముగా ఒక ఉద్యమమును తయారుచేసితిని. తదనుసారము –

1. వరంగల్ జిల్లాలో ఉత్పత్తి అయ్యే ఈత, తాటిచెట్ల రసము (కల్లును) తాగుడుకు వినియోగపరచకూడదు. దానివలన సామర్లకోటలోని ప్యారీ కంపినీవలె బెల్లం, పంచదార తీసి విక్రయించవలెను.

2. వరంగల్ జిల్లా కలాలీల సమాజమువారు నాలుగు లక్షల రూపాయిలతో "జగన్నాధ పల్మేరా యిండస్ట్రీయల్ కంపిని" అనే పేరుతో ఒక సొసైటీని స్థాపించి దానిని కో–ఆపరేటివు శాసనముల ప్రకారము రిజిష్టరి చేయించుట.

3. పెట్టుబడికి భాగముల డబ్బేగాక వ్యక్తిగతముగా అప్పులిచ్చుటయు కో–ఆపరేటివు బ్యాంకు ద్వారా అప్పు తీసుకొనుటయు జరుపుట.

4. వరంగల్ జిల్లాలోని ఆబ్కారి వృక్షములను గౌర్నమెంటువారు ఈ కంపినీకి వప్పగింతపెట్టి తమరు కాంట్రాక్టర్లకు ఏర్పాటుచేసిన యిజారా మొత్తమును కంపినీవలన తీసుకొనవలయును. యిందువలన మద్యపాన నిషేధము, మత్తు పదార్థము సద్వినియోగము కావడము, ప్రభుత్వ ఆదాయము యథాతథాగా వుండడము, కలాలీల పారిశ్రామికవృత్తి నడవడము జరుగుటయే ప్రధానోద్దేశ్యమని ప్రకటించితిమి.

5. యీ కంపెనీకి నేను లీగల్ ఎడ్వయిజరుగా నియమింపబడితిని. నియమ నిబంధనలను తయారు చేసితిని. కావలసిన ఫారములన్నిటిని అచ్చు వేయించితిని. కంపినీని సహకార నియమానుసారము రిజిష్టరు చేయించితిని. భాగస్వాముల వలన వచ్చిన భాగలబ్ధములు డిపాజిట్లు వసూలుచేయించి కో–ఆప రేటివు సెంట్రల్ బ్యాంకు వరంగల్‌లో జమకట్టించితిని. భాగస్తులందరు సశాస్త్రీయముగ సభచేసి అధ్యక్ష కార్యదర్శులను నియామకము చేసుకొనిరి.

6. నేను కంపెనీ పక్షమున న్యాయవాదిగానుండి జిల్లా కలెక్టరు వద్దను ఆబ్కారి శాఖాధికారుల వద్దను తుదకు రివిన్యూ శాఖామాత్యుడు వేక్‌ఫీల్డుగారి వద్దను పని చేసితిని. ఆ వ్యవహారములో త్రాగుడు మాన్పించుటకు ప్రస్తుత విధానము మార్పించి ఆ కంట్రాక్టును ప్రభుత్వమునకు ఆర్థికముగా నష్టములేని పద్ధతితో కంపెనీకి యిప్పించినట్లయిన త్రాగుడుపోయి యిండస్ట్రీస్ వృద్ధికాగలదని నా వాదన. గాని అత్యధిక పలుకుబడిగల ధనికులు, కంట్రాక్టర్లు మాకు వ్యతిరేకులు. కాబట్టి మా వాదనను ప్రతిఘటించుటయేగాక మాకును బ్రిటిష్‌లోని

రాజకీయ అసహాయోద్యమమునకును, సంబంధ మున్నదని నిందారోపణలు చేయుచుండిరి.

7. అధికారవర్గములో కొందరు పూర్తిగా కంట్రాక్టర్ల అడుగుజాడలలో నడిచేవారు కొందరు స్వాతంత్ర్య ప్రియులు. సత్ప్రవర్తనకలవారు. ప్రజాభ్యుదయ మునే ఆకాంక్షించేవారు ఉండిరి. ఈ విషయము అధికారవర్గము వద్ద చర్చకు వచ్చినప్పుడు మొదటి తరగతి అధికారులు యిది రాజకీయోద్యమమని ప్రభుత్వ మును భయపెట్టుచు వ్యతిరేకించిరి. రెండవ తరగతివారు యీ రాజ్యమున గల హిందూ మహమ్మదీయ శాస్త్రముల ప్రకారము మద్యపానము నిషిద్ధమనియును, యీ వుద్యమమునకు ప్రభుత్వ ఆదరము కలిగినచో శాస్త్ర నిషిద్ధమగు మద్యపానము అంతరించుననియును అభిప్రాయ మిచ్చిరి. వారిలో ముఖ్యులు ఆబ్కారీశాఖ కార్యదర్శి సమద్‌యార్‌జంగ్ చిరస్మరణీయులు.

8. యీ విషయము రివిన్యూ ఆబ్కారీశాఖామాత్యుడుగా నున్న వేక్‌ఫీల్డు అనే ఆంగ్లేయుని వద్దకు విచారణకు వచ్చెను. ఆయనకు మద్యపాన నిషేధమువంటి అపూర్వ సంస్కారము బ్రిటిష్‌వారు చేయలేకపోవుటయు దానిని హైద్రాబాదు వంటి చిన్న రాజ్యములో కోరుటయు అది అంగీకరింప బడుటచే బ్రిటిష్ ప్రభుత్వమునకు, అప్రతిష్ట కలుగుననియును ఆయన పట్టుదల. ఆయన ఎదుట నేను ప్రజాక్షేమమును ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనమును నిరూపించి మతధర్మముల ద్వారా నిషిద్ధమనిన్నీ ఆరోగ్య శాస్త్రమురీత్యా ఆరోగ్య భంగమనిన్నీ బీదలకు దరిద్ర కారణ మనిన్నీ వాదించితిని. కొంత చర్చ మా యిద్దరిమధ్య జరిగెను. వాటిని వ్రాయుట అనవసరము. కాని సారా త్రాగుటవలన ఆరోగ్యభంగము గాని కల్లు త్రాగుట వలన ఆరోగ్య భంగము కాదని ఆయన నాకు చెప్పెను. అంతట నేను బ్రాహ్మణుడను కల్లు,సారా మొదలగు మత్తు పదార్థములన్నియు శాస్త్ర విరుద్ధము లనియు ఇహపర ప్రయోజనములకు భంగకరమనియు గ్రహించ గలుగుదును. యింతకన్న నేను మీతో వ్యర్థవాదన చేయనని అంటిని. ఆ రోజు తీర్పు చెప్పలేదు. కాని తరువాత మా కోరికలకు విరుద్ధముగా తీర్పుచెప్పి మా దరఖాస్తును త్రోసి వేసెను. యింతటితో యీ కంపెని నిలచిపోయినది. తరువాత కొంత కాలమునకు హైద్రాబాదు హైకోర్టునకు ప్రధాన న్యాయమూర్తిగా నున్న మీర్జాయార్ జంగ్ బహద్దుర్ "తరక్ ముసక్కి రాత్" మత్తుపదార్థ విసర్జనము అనే ఉద్యమమును లేవదీసెను. ఆ ఉద్యమమునకు ప్రభుత్వ అంగీకారము కూడా యుండెడిది. యిదే పేరుతో ఒక మాసపత్రిక తెలుగు, కర్ణాటక, మహారాష్ట్ర ఉరుదూ భాషలలో

ప్రకటించుచుండెను. హైదరాబాదులోను జిల్లాలోను ప్రచారము కొరకు సంఘములు యేర్పాటు చేయబడెను. వరంగల్ జిల్లా సంఘమునకు నేను కార్యదర్శిగా పనిచేసితిని. రెండు మహాసభలు ఇచ్చట చేయించితిని. అందు వొకదానికి పూర్వపు కొత్వాల్ బల్దా రాజాబహద్దుర్ వెంకట్రామారెడ్డిగారు అధ్యక్షత వహించియుండిరి. వరంగల్ కార్యక్రమములో నాతో నా మిత్రులు కీ.శే. ఉదయరాజు రాజేశ్వరరావు గారు నాతో కలిసి పనిచేసిరి. మరియు వరంగల్ ఉరుసు, కరీమాబాదు వుత్సాహ వంతులగు యువకులు సహకార మొనర్చిరి. నిజాం ప్రభుత్వ కాలమున జాతీయోద్యముతో సంబంధించిన మత్తుపదార్థ విసర్జన ఉద్యమమునకు అత్యంత రాజభక్తి పరాయణుడైన శ్రీ రాజాబహుద్దుర్ అధ్యక్షుడుగా నుండుటయు, ప్రధాన న్యాయమూర్తి శ్రీ నవ్వాబ్ మిర్జాయార్ జంగ్ స్థాపకుడుగా నుండుటయు తటస్థించినందున కార్యకర్తలమగు అస్మదాదులము రాజద్రోహులుగా పరిగణింపబడక ప్రజా సేవకులముగాను అభ్యుదయ వాంఛకులుగానే పరిగణింప బడితిమి.

శ్రీ రాజా బహుద్దుర్ వెంకట్రామారెడ్డిగారు దివంగతులగుటయు, శ్రీ మిర్జాయార్ జంగ్ హైద్రాబాదు వదలిపోవుటయు తటస్థించినందున ఆ ఉద్యమము అంతటనే ఆగిపోయెను. ఆంధ్రమహాసభ వేదికనుండి నినాదములు మాత్రము జరుగుచుండెను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము (ప్రజారాజ్యము) వచ్చినను తెలంగాణములో మద్యపాన నిషేధము జరిగియుండెను. ఒకే ప్రభుత్వమున పరస్పర విరుద్ధములగు రెండు విధానములు కొనసాగుచునే యున్నవి.

* * *

*ప్రకరణము - 13*

# ఆర్థిక సంపాద్యము (ద్రవ్యార్జనము)

నేను మూడవ తరగతి వకీలుగా ప్రవేశించిన తరువాత 21వ ఫసలీ వరకు ద్రవ్యార్జన లేకుండనుంటినని పైన వ్రాసియున్నాను. మా కుటుంబమునకు జుజ్జూరు ప్రాంతములో పల్లపు భూమిలేదు. మెరకభూమి 90 ఎకరములు మాత్ర ముండెడిది. నాకు పల్లపు భూమి సంపాదింప వలెనని కోరిక కలిగినది. ఆ రోజులలో నాతో పనిచేయుచున్న కొండపల్లి సీతారామారావుగారు ఆదిలోనుంచి కొంత మిగిల్చుకొని బొమ్మకంటిలో భూములు సంపాదించుటకు ప్రారంభించెను. ఆయన నన్నుకూడ ప్రోత్సహించుచుండెను. మధిర కాపురస్తులు వెల్లంకి లక్ష్మీనర సింహరావుగారికి మా పినతండ్రి కూతురునిచ్చి వివాహము చేయుటచే బాంధవ్యము తటస్థించెను. అంతేగాక వికాలతు పనులకుకూడ తరచుగా మధిర వెళ్లుచుండెడివాడను. గడ్డమడుగు రామారావుగారనే ఒక బంధువు మధిర చెఱువు క్రింద 3 ఎకరముల భూమిని నాకొరకు బేరముచేసెను. కాని నా వద్ద డబ్బు కొద్దిగానే యుండెను. అయ్యదేవర శేషగిరిరావు అదివరకే నా క్లయింటు గనుక ఋణపూర్వకముగా కొంత డబ్బు నిచ్చిరి. నేను ఆ భూమిని 1324 ఫసలీలో కొనగలిగితిని. దాని తరువాత 1327 ఫసలీలో పరిటాల గ్రామములో నా బావమరది వనం సీతారామారావువద్ద 4 ఎకరముల మెట్టబాబతు పల్లపు భూమిని ఖరీదు చేసినితి. ఈ విధముగా కొంత స్వార్జితభూమి లభించెను. 1326, 27 ఫసలీలలో అత్యధిక వర్షములు కురియుటవలన మెట్టభూములలో పంటలు

చెడిపోయినవి. లోగా మా నాయనగారిచ్చిన కౌల్ల గడువు 1326 ఫసలీతో తీరిపోయెను. 27వ ఫసలీలో మునాఫాలు చాల తగ్గిపోయినవి. కొన్ని భూములు పాళ్లకిచ్చి సేద్యము చేయించితిని. రావలసిన డబ్బు వసూలు కాలేదు. 1328వ ఫసలీలో కొంత మంచి భూమి దున్నేవారేలేక బీడుపడి పోయెను. కొంత భూమి స్వల్పశిస్తుకు కౌలు కీయగలిగితిని. అందువలన గత్యంతరములేక 1329 ఫసలీలో నా స్వంత డబ్బుతో ఎడ్లనుకొని వ్యవసాయము పెట్టితిని. అందులో మా నాయనగారి సహాయము లేకున్నను వ్యతిరేకత మాత్రము లేకుండెను. అంతకుముందే మా తమ్ముడు నాగభూషణరావు మొదటిభార్య గతించినది. ఆ రోజులలో మా నాయనగారు పూర్తిగా నీలికుర్తిలోనే భూముల పొందుబాటు చేయుచు ఉంటూ ఉండిరి. జుజ్జూరు భూముల పొందుబాటు వ్యవసాయమును నేను స్వీకరించ వలసివచ్చెను. మా తమ్ముడికి రెండవ వివాహము తటస్థించెను. జములాపురం విశ్వనాథరావుగారి రెండవ కుమార్తె రాఘవమ్మను యిచ్చుటకు ఏర్పాటు జరిగెను. ఆరు రోజులలో లగ్ననిశ్చయముచేసి ఆ వివాహము నేనే చేసితిని. అందుకు దాదాపు రెండువంతుల డబ్బు నేనే భరించితిని. తక్కినది అప్పు తెచ్చితిని. 1330 ఫసలీ మొదటినుండి నేను స్వంత వ్యవసాయమును ప్రారంభించితిని. 1331వ ఫసలీలో 6 ఎకరముల శెరీ మెరకభూమిని మొదట కొంటిని. దాని తరువాత మా మేనమామగారి వలన నివేశన స్థలమును తోటకొరకు 6 ఎకరముల యినాం మెరకభూమిని ఖరీదుకు తీసికొంటిని. తరువాత 1331 ఫసలీ ఆఖరున ఇంకొక 5 ఎకరముల మెట్టబాబతు మాగాణి భూమిని తీసికొంటిని. వ్యవసాయములో మరికొంత అభివృద్ధి చేయగలిగితిని. అదే సంవత్సరము నీలికుర్తిలో గన్నంరాజు కేశవరావు గారివలన జాయింటు బంజరులో 5 ఎకరముల భూమిని ఖరీదు చేసి దస్తావేజు మా నాయనగారి పేరనే వ్రాయించితిని. దాని తరువాత జుజ్జూరులో మన్నెం రామయ్య అనే రైతువద్ద 8 ఎకరముల భూమిని తీసికొని ఆయనకు నోటు వ్రాసి యిచ్చితిని. దాని క్రయధనము కొన్ని సంవత్సరముల తరువాత తీర్మానము చేయగలిగితిని. దాని తరువాత శేషమాన్ అనే ఒక బొందిలి రైతు వలన 5 ఎకరముల మెరకభూమిని తీసికొంటిని. పెద్దనాయని చెఱువు క్రింద తీసికొనిన భూమిలో దాదాపు 10 ఎకరములు మెరకయే యున్నది. కనుక దానిని పల్లముగా తయారు చేయుటకు చాల డబ్బు ఖర్చు పెట్టవలసి వచ్చెను. దీని తరువాత పరిటాల

మహాలక్ష్మితో 6 ఎకరముల బీటి భూమిని షుమారు 600 తాటిచెట్లసహా తీసికొంటిని. అటుతర్వాత ఫఖరుద్దిన్ అనే రైతు వలన యింకొక 5 ఎకరముల మెరకభూమిని తీసకొని బీడుగా నుంచితిని. 1932 ఫసలీలో పై జెప్పిన మా మేనమామగారి వలన తీసుకొనబడినభూమిలో బావి త్రవ్వించి మామిడితోట వేయనారంభించితిని. ఇపుడా బావికి గచ్చుతో రాయికట్ట బడినది. మామిడితోట క్రమేణ వృద్ధి చేయబడినది. ఇపుడు అందులో షుమారు 100 మామిడిచెట్లు 150 తాటిచెట్లు మరికొన్ని యితర ఫలవృక్షములున్నవి.

వ్యవసాయ మంతకంతకు వృద్ధి చేయగలిగితిని. మా నాయనగారు నీలికురితలోనే ఉంటూ అప్పుడప్పుడు ఏదేని కార్యములకు జుజ్జూరు వచ్చి చూచి సంతోషించు చుండెడివాడు. 1334 ఫసలీ (1925 సం.)లో పెద్దనాయని చెరువు తెగిపోయినది. అందువలన నేను సంపాదించిన 12 ఎకరముల భూమి పల్లము సాగుచేయుటకు వీలులేక పోయినది. ప్రబల నష్టము సంభవించినది. తరువాత జుజ్జూరులో పాత నివేశస్థల ప్రాంతము నిర్మానుష్యమగుటయు కాపురముమార్చవలసి వచ్చుటయు తటస్థించినది. 1932వ ఫసలీ వరకు జగన్నాథపురములో కాపుర ముండెడివారము. అచ్చటనే సుబ్బారావు ఉపనయనము జరిగినది. కాని అక్కడ విద్యావంతుల సమాజము లేకపోవుటయు జుజ్జూరులో నేను సంపాదించిన భూములలో జగన్నాథపురములో నుండి వ్యవసాయాభివృద్ధి చేయుట కనుకూలము లేకపోవుటయు తటస్థించుటచే జుజ్జూరులో స్థిరనివాస మేర్పరచుకొనుటకు దృఢ సంకల్పము చేసికొంటిని. గ్రామ మధ్యముని స్థలము సంపాదించ గలిగితిని. అందువలన 1333వ ఫసలీ నుండి గృహనిర్మాణమున కుద్యుక్తుడనైతిని. ప్రభవ సంవత్సర శ్రావణ మాసమున నిర్మాణము ప్రారంభించి 1, 2 సంవత్సరములలో డాబాయింటిని వేయగలిగితిని. అంతవరకు ఒక పూరిల్లు తయారువేసికొని అప్పుడప్పుడు పోయి ఉంటూ యుంటిమి. బహుశా 1337వ ఫసలీలో ఈ డాబా యింటిలో గృహప్రవేశము చేసినట్లు జ్ఞాపకము. బహుశా అదే రోజులలో గానుగపాటిలో 30 ఎకరముల భూమిని సంపాదించగలిగితిని. ఇందులో చాల భాగము రైతుల స్వాధీనములోనే యుండెను.

1939, 40 ఫసలీలలో నా పెద్దకుమార్తె వరలక్ష్మికిని, నా పెద్దకుమారుడు సుబ్బారావుకును వివాహములు చేసితిని. అటు తరువాత వ్యవసాయము ఎక్కువ

కాబడినను ఆదా మాత్రము తగ్గిపోయినది. దాని కారణము ధరల మాంద్యమే (depression) ఆ రోజులలో వడ్లు నూరు రూపాయలకు 4 పుట్లు, వేరుశనగ కాయ పుట్టి 1కి రు. 13/–లును నెయ్యిమణుగు 1కి 12/–లును అమ్మబడు చుండెడివి. భూముల ధరలు ఎకరము 1 కి రు. 50/–ల వరకు దిగిపోయినవి. కౌలుశిస్తు ఎకరము 1కి రు. 10/–లు వచ్చిన భూమికి ఒక రూపాయికన్న ఎక్కువ మునాఫా రాకుండెను. ఇట్టి స్థితిలో బహు ప్రయాసముపైన వ్యవసాయము నడుపవలసి వచ్చెను. నా వ్యవసాయము నడుపుటకు కరణము చెలమయ్య అనే ఒక కమ్మ యువకుడు పనిచేయుచుండెను. అతను 10 సంవత్సరముల వయస్సు నుండి కొన్ని సంవత్సరములు మా నాయనగారివద్ద కొలువు చేసెను. మరల 1330 ఫసలీలో నా వద్ద నౌకరుగా ప్రవేశించి తరువాత 20 సంవత్సరములు పాలికాపుగా పనిచేసెను. అట్టి న్యాయవర్తకుడు మరియొకడు లేడని చెప్పవచ్చును. అతను మా ఊరినుంచి లేచిపోయెను. సజీవుగా నున్నాడో లేడో తెలియదుగాని అతనిని జ్ఞాపకము చేయుచునే యున్నాను. ఇకముందు కూడ మరువజాలను. తరువాత పయిడిమఱ్ఱి నారాయణవద్ద ఏడున్నర ఎకరముల భూమిన్నీ, దద్దళంభూమి భాగస్థుల వద్ద షుమారు 6 ఎకరములున్నూ, పురాణం వారి యినాంబాబు ఆరున్నర ఎకరములున్నూ కొనగలిగితిని. వ్యవసాయములో వృద్ధి కాజొచ్చెను. తరువాత నా రెండవ కుమారుడు లక్ష్మీకాంతరావు, రెండవ కుమార్తె రుక్మిణికి వివాహముచేసితిని. నీలికుర్తిలో కౌలూరి శ్రీహరిరావు గారి వలన 17 ఎకరముల పల్లము 40 ఎకరముల మెట్ట ఖరీదు చేసితిని. పరిటాల భూమిని, మధిర గానుగుపాడు భూములను అమ్మివేసితిని. గొట్టుముక్కల, చట్టన్నవరము గ్రామములోని యినాముల భాగములను అమ్మివేసితిని. మార్తి పురుషోత్తము వలన 6 ఎకరముల మెట్ట, వెంకాయ వగైరాల వలన 5 ఎకరముల పల్లపుభూమిని, బూదామవలన ఒకటిన్నర ఎకరముల పల్లపు భూమిని తరువాత మాదిరాజు శేషగిరిరావుగారి వలన 8.75 ఎకరముల పల్లపు భూమిని ఖరీదు చేసితిని. అందొక బావి త్రవ్వించితిని. హనుమకొండ సుబేదారి వీధిలో స్థలము సంపాదించి డాబా యిల్లు కట్టి ఒక బావి త్రవ్వించితిని. ఇప్పటికిని జుజ్జూరులో 4 అరకల ఎడ్లు 3 అరకల దున్నలతో వ్యవసాయము చేయించుచున్నాను. 20 గోజాతి పశువులున్నవి. అట్లే నీలికుర్తిలో నేను నా కుమారులు వేరువేరుగా 10 అరకలతో వ్యవసాయము చేయించుకొనుచున్నాము. భూమిని సంపాదించుటకు

కోరిక ఉండెను. గాని యింకా గృహరూపమైన ఆస్తులను గాని లేక నగదు రూపకముగా గాని ఉంచలేక పోయినందుకు అప్పుడప్పుడు మనసులో ఆందోళన పడుచుంటిని.

జుజ్జూరు గ్రామములోని మా స్వంతభూమిలో కుంట వేయించితిని. ఆ రోజులలో అసహాయోద్యమము చెలరేగుచుండెను. గనుక స్థానికాధికారులు ఆ కుంట నుంచుటకు అంగీకరించమనిరి. తరువాత మద్రాసు రివిన్యూ బోర్డులో అప్పీలు చేసితిని. ఆ వ్యవహారములో శ్రీశ్రీ ప్రత్తిపాటి సత్యనారాయణరావు గారు (రిటైర్డు జడ్జి) నా తరఫున పనిచేసిరి. ఆ సందర్భమున గాంధి ఇర్విసుల సంధి కుదిరనది. బ్రిటిష్ ప్రభుత్వమువారు ద్వేషమును మాని నా కుంటకు అంగీకార మొసంగిరి. ఆ కుంట పశువులు మనుష్యులు నీరు త్రాగుటకును, 2 ఎకరముల భూమి సాగుచేయుటకు నుపయోగబడుచున్నది. తరువాత దద్దళం భూమిలో యింకొక చిన్న కుంటను నిర్మాణం చేసితిని. దానిలో కొన్ని రోజులు మాత్రము మనుష్యులు నీరు త్రాగుచుంటారు. నీలికుర్తి గ్రామములో ప్రైమరి పాఠశాల కొరకు 60×16.5 వైశాల్యముగల ఒక భవంతిని కట్టించి ఒప్పజెప్పితిని. అందొక బావి త్రవ్వించితిని. జుజ్జూరుగ్రామములో 2 బావులు 2 కుంటలు నిర్మాణు చేసితిని. మామిడితోట సంగతి వ్రాసియేయున్నాను. హనుమకొండలో ఒక యింటిని నిర్మాణము చేసియున్నాను. నీలికుర్తి భూములను పంచి పెద్ద కుమారుడు వెంకటసుబ్బారావు భాగము లక్ష్మీకాంతరావు (దత్తు ఈయబడిన కుమారుడు) రెండవ కుమారుడి భాగము వేరుచేసి యిచ్చినాను. ఆగ్రామములో వ్యవసాయములు వేరుగా జరుగుచున్నవి. జుజ్జూరు భూములను పంచి కుమారుల కుమాళ్ళకు శాస్త్రీయభాగములు నిర్మించితిని. నాకొరకు ఉంచుకున్న ఆస్తులను గురించి వీలునామా వ్రాసియున్నాను.

## నీలికుర్తి పాఠశాల నిర్మాణ

1951 సంవత్సరమున నీలికుర్తి గ్రామములో ప్రైమరి పాఠశాల నిర్మాణమునకు సంకల్పించితిని. అప్పటి కలెక్టరు శ్రీ పళనియప్పన్‌గారు శంకుస్థాపన చేసిరి. చాలామంది అధికార అనధికార సభ్యులు విచ్చేసిరి. తుదకా భవనము యిప్పటికి వాసయోగ్యమయినందున ది. 26 జనవరి 1960 సంవత్సరం తేదీన నిరాడంబరముగా ఉపాధ్యాయులకు వప్పగింతపెట్టితిని. స్వల్ప

పనులు కావలసియున్నవి. సజీవుడుగానుండిన త్వరలోనే పూర్తి చేయించెదను. భవను 60×16 ఉన్నది. ముందు వరండా ఆఫీసుగది గ్రంథాలయ గదికూడా వేరే ఏర్పాటు కాబడినవి. దాదాపు మూడువేలు కాయకష్టముగాక (యెడ్లబండ్ల కష్టము) స్వంతం నుంచి వ్యయపెట్టితిని.

* * *

*ప్రకరణము - 14*

# శుభకార్యములు - యాత్రలు

నా పెద్దకుమారుడు వెంకట సుబ్బారావుకు 1923వ సంవత్సరములో శ్రీ జమలాపురము వెంకటేశ్వర స్వామివారి సన్నిధిన పితృపితామహ సాంప్ర దాయానుసారము ఉపనయనము చేసితిని.

నాకు ఆరుగురు సంతానము నష్టమై పోయినందున రామేశ్వరములో నాగప్రతిష్ఠ చేయుమని పెద్దలు చెప్పిరి. నా భార్య గర్భిణితో నుండెను. 1925 సంవత్సర ఫిబ్రవరి నెలలో రామేశ్వరయాత్రకు సంకల్పించితిని. మా తలిదండ్రులను మా పినతండ్రి భార్య శారదాంబగారిని నా భార్యను తీసుకొని బయలుదేరితిని. మాతో నా బావమరది వనం సీతారామారావు పరిటాల కాపురస్తురాలు మంగల అనంతమ్మయు బయలుదేరిరి. బెజవాడ స్టేషన్‌లోనే రామేశ్వరంపండా, కోడూరు సుబ్రమణ్యశాస్త్రి గుమాస్తా వెంకట్రామయ్యర్ కలిసి వెంటనంటెను. అతను యాత్రికులను తీసికొని వెళ్ళే కమీషన్ ఏజంటు అయియుండెను. మాతో కొందరు కృష్ణాజిల్లా కమ్మవారు 20 మంది ఉండిరి. అనుభవము గల వెంకట్రామయ్యర్ నేను వ్రాసుకొని వచ్చిన కార్యక్రమము ప్రకారము కమ్మ యాత్రికులను కూడ జట్టుగా నుంచెడివారు. మొదట చిదంబరము వెళ్లి స్వర్ణ దేవాలయమును మహదేవునిచూచి చిదంబర రహస్యమును తెలిసికుంటిమి. చిదంబరము నుంచి శ్రీరంగంచేరి కావేరి స్నానము చేసి రంగనాథస్వామిని సేవించితిమి. మధుర మీనాక్షిని సేవించి కుంభకోణము చూచి దర్భశైవము నవపాషాణాలు చూచి రామనాథపురముకు వచ్చితిమి. రామనాథ

స్వామిని శ్రీరామచంద్రుడు రావణ సంహారానంతరము ప్రతిష్ఠ చేసినాడని యితిహాసము గనుక ఆ స్వామిని సేవించితిమి. తరువాత రామేశ్వరము వచ్చితిమి. అచ్చట 4 రోజులుంటిమి. రత్నాకర మహోదధి సంగమ స్నానముచేసి వారధి – సువేలాద్రి మొదలగు పురాతన చిహ్నములను చూచితిమి. వెనుకకు మరలివచ్చేటప్పుడు తిరుచునాపల్లి తంజపూరులలో ఒక్కొక్క రోజు మకాంచేసి స్థానిక విశేషములను చూచితిమి. తంజాపూరు కోటలో రెండు రాతిగుండ్లు పడియుండెను. వాటిని ప్రతిరోజు యిద్దరు జట్టీలు త్రిప్పెడివారట. అందొకడు సుబ్బయ్య ఆంధ్రుడుండెను. కోటలోనే సరస్వతి భాండాగారమనే ఆంధ్ర గ్రంథాలయముండెను. అందు కొన్నివేల పురాతన తెలుగు పుస్తకములుండెను. విచారించగా కృష్ణదేవరాయల ప్రభుత్వము అంతవరకు వ్యాపించి యుండెనని తెలియవచ్చెను. 16 రోజులకు యింటికి చేరితిమి. ఆ సంవత్సరము మే నెలలో నా రెండవ కుమార్తె రుక్మిణి పుట్టినది. ఆమె బాలారిష్టములకులోను గాక రామేశ్వరస్వామి అనుగ్రహముచే జీవించి సంతానవంతు రాలయినది. తరువాత 1927 సంవత్సరములో నా రెండవ కుమారునికి తిరుపతిలో ఉపనయనము చేయదలచి బంధుమిత్రులసహా వెళ్లి వచ్చితిమి. అచ్చటి స్థానాచార్యులు ప్రతివాది భయంకర శ్రీరంగాచారిగారికి వరంగల్లు జిల్లాలోని ఈనాములు అగ్రహారములను గురించిన వ్యవహారములో నేను వకీలుగానుండి పని చేయుటయు తటస్థించినందున శ్రీరంగాచార్యులుగారు మా కన్నివిధముల సౌకర్యముల నేర్పాటు చేసిరి. ఎగువ తిరుపతి, దిగువ తిరుపతి, పాపనాశనము, కాళహస్తి సేవించుకుంటు తిరుపతికొండపైకి నేను కాలినడకనే యెక్కితిని. అటుతరువాత 2 సంవత్సరము లకు మరల కేవలము నా భార్యా పిల్లలతో మాత్రమే తిరుపతి యాత్ర వెళ్లి వెంకటేశ్వరస్వామి మొక్కు తీరుకొని వచ్చితిని.

## వివాహములు

నా కుమారులు కుమార్తెలకు నా అనుభవమును బట్టి నావలె అతిబాల్య వివాహములు చేయకూడదనుకుంటిని. మగపిల్లలకు 19వ ఏటను, ఆడపిల్లలకు 12వ యేటను వివాహము చేసితిని.

మొదట 1929వ సంవత్సరము మార్చి నెలలో నా పెద్దకుమార్తెను మాదిరాజు వెంకటేశ్వరరావుగారి కుమారుడు శ్రీనివాసరావునకిచ్చి జుజ్జూరు యింటిలోనే వివాహము చేసితిని. దీని 6వ రోజున నా పెద్దకుమారుని వివాహము యెర్రుపాలెములో జరిగినది. జములాపురము మార్కండేశ్వర రావుగారి 3వ

కుమార్తె రామబాయిని కన్యాదానము చేసిరి. నా కుమార్తె వివాహము మొదట జరిగినది. చాల మంది బంధుమిత్రులు వచ్చిరి. జుజ్జూరు జగన్నాధపురములలో అన్ని కులములవారును భోజనమునకు వచ్చిరి. జగన్నాధపురము హరిజనులు (మాలలు) 30 యిండ్లవారు చిరకాలము నుండి మాకు అండగా నుండెడివారు. మేము ప్రతి శుభకార్యములలో రెడ్డి, కమ్మ రైతులకువలె వారికిని మంచి వంటకములతో భోజనము పెట్టెడివారము. నేనట్లే వారికి భోజనము పెట్టితిని.

నా రెండవ కుమారుడు లక్ష్మీకాంతరావుకు మానపరాజు గురురాజుగారి కుమార్తె లలితను యిచ్చినందున 1936లో వివాహము బొమ్మకంటిలో జరిగెను. 1936వ సంవత్సరములో నా రెండవ కుమార్తె రుక్మిణిని అలవాల లక్ష్మినరసింహ రావు వకీలుగారి నాలగవ కుమారుడు వాసుదేవరావున కిచ్చి వివాహము చేసితిని. నా కుమార్తె 12వ సంవత్సరమున రజస్వల అయినది. 14 యేండ్లు నిండనందున శారదా యాక్టుకు భయపడి యెర్రుపాలెంలో వివాహము చేసితిని. వివాహమునాటికి నా రెండవ అల్లుడు వాసుదేవరావు ఫోర్త్ ఫారము పూర్తి చేసెను. తరువాత ఆయన ఫిఫ్త్ ఫారము వరకు ఖమ్మములోను ఇంటర్ హనుమకొండలోను బి.ఏ. మరియు ఎల్ఎల్.బి. హైద్రాబాదునందును చదివి విద్యా పారంగతుడయ్యెను.

* * *



గ్రంథకర్త కుటుంబము

*ప్రకరణము - 15*

# నా మతవిశ్వాసము

నేను బ్రాహ్మణుడను. ఆత్రేయసగోత్రకుడను. కృష్ణయజుశ్శాఖకు చెందినవాడను. స్మార్తకర్మను ఆచరించుచున్నాను. ఉపనయన సంస్కారము, జరిగినప్పటి నుంచి మౌఢ్యకాలములు కొన్ని గడచినను మొత్తంమీద సంధ్యావందనము, విధి యనుకొని ఆచరించు చున్నాను. ఇప్పుడు ప్రతిరోజు పురుషసూక్తము, విష్ణు సహస్రనామములు పారాయణ చేయుచుంటాను. తరుచుగా గీతా శాస్త్రమును చదువుచుంటాను. మంత్రపుష్పమును చదివి అందలి ఏకేశ్వరోపాసనకు ఆనందించుతాను. వేదము చదువలేదు. ద్వాదశోప నిషత్తుల అనువాదమును చదివినాను. కొద్దిగా ముస్లిం శాస్త్రముల పరిచయము కూడా నున్నది. కొన్ని ఆర్యసమాజ గ్రంథములను చదివితిని. బుద్ధ జీవితమును చదివి కొన్ని ఆదేశములను తెలిసికొంటిని. క్రైస్తవ, బ్రహ్మసమాజ గ్రంథములను చదువలేదు గాని కొన్ని విషయములను మాత్రము మిత్రుల వల్ల గ్రహించితిని. హిందూమత తద్భవములగు అనేక శాఖలు నెలకొల్పబడియున్నవి. వాటికన్నిటికి ప్రమాణములు వేదములు, ఉపనిషత్తులు అయియున్నవి. ఉపనిషత్తులు అతీతము లైన బ్రహ్మజ్ఞానము బోధించుటకు ఉపకరించు చున్నవి. మా పూర్వులు స్వరూప ధారులు అనగా నిలువుబొట్టు బెట్టెడివారు. వైష్ణవ భక్తిగలవారు అయినను స్మార్త కర్మనే ఆచరించెడివారు. నేను తదనుసారముగా వైదిక కర్మలను స్మార్త పద్ధతినే ఆచరించుచున్నాను. నేను ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత సిద్ధాంతములను భిన్న మతములుగా యెంచను. నా కధికారము లేకున్నను యిస్లాం సిద్ధాంతములను కూడా ద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతములకు తోడు జోడుగా నుండునని గ్రహించు

చున్నాను. శైవ వైష్ణవ మతములలోని ఉత్కృష్ట భక్తిభావములను తలంచుకొని ఆనందించుచుంటాను. ముక్తినిగోరు మానవుడు సేవ్య సేవకభావముతో ఆరాధించక తప్పదు. అప్పుడు మనము ద్వైత భావముతోనే ఉండెదము. తదుపరి భక్తి ప్రపత్తుల మూలమున శ్రీమన్నారాయణ సాయుజ్య పదవిని గోరువాడు విశిష్టాద్వైత భావముగల వాడనుపించుకొనును. బ్రహ్మజ్ఞాని ఆత్మయే పరమాత్మగాను సర్వం బ్రహ్మార్పణమనియును, బ్రహ్మ సత్యం జగన్మిధ్యా "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అహం బ్రహ్మాస్మి" అనే భావములు ద్వైత భావములు గనుక ఈమూడును ముక్తిని గోరువారికి ఆవశ్యకములు. ఈ మూడును మోక్షలబ్ధికి సోపానములుగా నుండగలవని నా భావము. మరియు బ్రహ్మ, విష్ణు, శివుడు నామ భేదములచే ఒకే ఒక సర్వేశ్వరుని నామములని చెప్పవలెను. లేదా యీ ముగ్గురు వ్యక్త సృష్టిలో ముగ్గురు దేవతలని చెప్పవలసి ఉండును. అప్పుడు నామరూప గుణరహితుడగు ఆ వాఙ్మోనస గోచరమగు ఆ మహాశక్తి ఒక్కటే ననియును, ఆ శక్తినే శ్రవణ, మనన ధ్యానముల ద్వారా ఆరాధించవలసి యుండునని నా భావము. పై చెప్పిన మూడు సిద్ధాంతములు మతములు కావనిన్ని, ప్రతిదియు విశ్వసించదగిన సిద్ధాంతమనిన్ని, నా భావము. ఇస్లాంలో చెప్పినట్లు లాయిలాహి యిల్లల్లా (ఏకమేవా, ద్వితీయం బ్రహ్మ) అనే వాక్యము సర్వవిధముల సత్యమును ప్రకటించుచున్నదని కూడా నా దృఢ విశ్వాసము. ఈ చెప్పిన శక్తినితప్ప తదితరములగు యే శక్తిని ఆరాధించ కూడదనే ముస్లిం సిద్ధాంతమును హృదయ పూర్వకముగా విశ్వసించు చున్నాను. కాబట్టి మానవుడు స్వయం ప్రకాశమగు 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అనే మహాశక్తియందే విశ్వాసముంచ వలెననియును నిర్గుణేతరేశ్వరో పాసన మహోత్కృష్టమైన దనియును నా విశ్వాసము. గాని సగుణోపాసనను నిరసించను, బహు దేవతారాధకులగు భక్తులను దూషించను. వీరందరి లక్ష్యము ఈశ్వరుని చెందుటయే అయియున్నది. నిత్య నైమిత్తికాది విద్యుక్త సేవాధర్మములను వదలి భక్తిదూరులై నాస్తికులు, నిరీశ్వర వాదులు అయియుండెడి పండితుల కన్నను, సగుణోపాసకులు, బహుదేవతారాధకులు భౌతిక పదార్థములను, పూజించి మూఢ భక్తులే అధికులనియును వందనీయులని యును నా యభిప్రాయము.

శో. నాస్థాధర్మే, నవసునిచయై నైనీకామోపభోగే
యద్యధ్యవ్యం భవతు, భగవన్ పూర్మ కర్మానురూపం
ఏతత్ప్రాస్త్యం మమ బహుమతం జన్మ జన్మాంతరేపి
త్వత్పాదాం భోరుహయుగ గతానిశ్చలా భక్తిరస్తు
"అన్యదా శరణం నాస్తి త్వమేవ శరణం వ్రజా"

* * *

# ఐదవ అధ్యాయము

ఇప్పటివరకు నా జీవితచరిత్రలో నాల్గు అధ్యాయములు వ్రాసి ముగించితిని. మొదటి అధ్యాయము వంశానుక్రమణ. రెండవ అధ్యాయములో బాల్య కౌమారదశలున్ను, యౌవన ప్రారంభదశలున్ను వ్రాసితిని. మూడవ అధ్యాయములో న్యాయశాస్త్రాభ్యాసమును గురించి వ్రాసితిని. నాలుగవ అధ్యాయములో వకీలు వృత్తిలో ప్రవేశించి వ్యవహారికముగా ద్రవ్యార్జనాది ఆర్థిక విషయములను మత విశ్వాసమును వ్రాసితిని. వాస్తవముగా కేవలము నా స్వంతము కొరకు చెప్పుకొనవలసిన విషయము పూర్తియైనవని అనుకొనుచున్నాను. గాని ప్రజాహిత సమాజముతో సంబంధించిన చరిత్రాత్మక విషయములను వ్రాసి ప్రజానీకమునకు అందు ముఖ్యముగా తెలంగాణ వాసులకు అందచేయుట నా విద్యుక్త ధర్మమని తలచుచున్నాను. విషయ బాహుళ్యములను – రచనలను బట్టి ఈ అయిదవ అధ్యాయమును గ్రంథ బాహుళ్యమున కూర్చబడినది. ఇందు అభ్యుదయ తెలంగాణాతో సంబంధించిన ఎన్నియో విషయములు తేటపడగలవు. యిది 21 ప్రకరణములుగా విభజించబడి తెలంగాణాలో అభ్యుదయ వాంఛ ప్రారంభింపబడినప్పటి నుండి స్వతంత్ర ప్రభుత్వ స్థాపన అయ్యే వరకు నాతో సంబంధించినట్టియు, వినినట్టియు శేవావిశేషములు వ్రాసితిని. యిది శ్రీ హనుమంతరావుగారిచే రచింపబడిన ఆంధ్రోద్యమ చరిత్రకు అనుబంధముగా గ్రహించవలెనని చదువరులను వేడుచున్నాను.

* * *

*ప్రకరణము - 1*

# గ్రంథాలయ స్థల సంపాద్యము

శ్రీ మాడపాటి హనుమంతరావుగారు హనుమకొండ వదలి వెళ్లినప్పటి నుండియు గ్రంథాలయమునకు శాశ్వత భవన నిర్మాణమును గురించిన సమస్య మేము మరచిపోలేదు. ఎన్నియో ఇండ్లను చూచి బేరముచేసితిమి. అవి అనుకూల పడలేదు. గాని పింజర్లలోని మునిసిపాలిటి వారిచే కట్టబడిన హిందువుల సత్రము శిథిలమైపోయెను. ఆ స్థలమును వేలం వేయించిరి. దానిని శ్రీ ఉదయరాజు వెంకటేశ్వరరావుగారు రూ. 640లకు ఖరీదుచేసిరి. దానిని భాషానిలయమున కిప్పించమని వారిని కోరితిని. అందులకు వారంగీకరించిరి. అంతకు పూర్వము నుంచి షుమారు రు. 1000లు నిలవచేసి హైద్రాబాదు ఇంపీరియల్ పోస్టాఫీసు సేవింగు బ్యాంకులో నిలువపెట్టితిని. అందులో నుంచి ఈ మొత్తమును ఖర్చు చేయవలెనని నా సంకల్పము. ఒకటి రెండు పర్యాయములు ప్రయత్నము చేసితిని. గాని కార్యవర్గ సమావేశములు జరిగియుండలేదు. అందుపైన సర్క్యులేషను ద్వారా అంగీకారము పొందగోరి అభిప్రాయముల కొరకు సభ్యుల వద్దకు పంపితిని. శ్రీ కొలిపాక శ్రీ రామారావుగారు కార్యనిర్వాహక సభ్యులు కాబట్టి వారివద్దకు కూడా పంపితిని. ఆ కాగితమును ఒకటి రెండు రోజుల వరకు మరల వారు నా వద్దకు పంపలేదు. శ్రీ వెంకటేశ్వరరావుగారి కుమారుని దత్తతను గురించి ఒక వ్యవహారము జరుగుచుండెను. దానిలో శ్రీరాంరావుగారు పని చేయుచుండిరి. స్థలము సంగతి శ్రీరాంరావు గార్కి తెలుసు గనుక దానిని తానే కొన్నానని సంకల్పించుకొని వెంకటేశ్వరరావుగారితో ఒడంబడిక చేసుకొనెను. తరువాత

సర్క్యులేషన్ కాగితమును నా వద్దకు వాపసు పంపి ఆ స్థలమును తానే కొన్నాని శ్రీరాంరావుగారు నాతో చెప్పిరి. మిత్రులు భాషాభిమానులు అయిన శ్రీరాం రావుగారును వెంకటేశ్వరరావుగార్లు ఇలా చేసినందుకు విచారపడితిమి. ఈ విషయమును వార్షిక నివేదికలో కూడ వ్రాసినట్లు నాకు జ్ఞాపకమున్నది. దీనిని కొన్ని రోజుల తర్వాత హనుమకొండ పోలీసు పటేలు జయరాంసింగు అనే ఆయనకు ఒక స్థలము, మోటబావి ఉండెను. అది మొదట ఇనాంగా ఉండెను. దానిని మున్సిపాలిటివారు నగరాభివృద్ధికి తీసుకొనిరి. దానికి ప్రతిఫలము భూ రూపముగా ఇప్పించుమని ఆయన కోరుచుండెను. సంవత్సరములు గడచినను పర్యవసానము యేమి తేలలేదు. దీనికొరకు జయరాంసింగు నన్ను వకీలుగా ఏర్పాటు చేసుకొనెను. నేను పనిచేయు చుంటిని. జయరాంసింగు మున్సిపాలిటి వారు తీసికొన్న తన పూర్వపుస్థలము విక్రయించెదనని తన సంకల్పము వెలిబుచ్చెను. నేనా స్థలమును చూచితిని. అది పెంజర్ల చివరి భాగమున రాజపుత్ర వాడలో రామస్వామి దేవాలయము ఆనుకొని ఉండి యుండుటచే కట్టబోయే తెలుగు గ్రంథాలయమునకు ముస్లింల వల్ల భయము ఉండదని అనుకొని భాషా నిలయము కొరకు తీసికొన నిశ్చయించితిని. నా స్వంతమునకు అనియే చెప్పి 1400 గజముల స్థలమును 250/– బేరము చేసికొంటిని. నా పేరనే ఎగ్రిమెంటు వ్రాయించుకొంటిని. ఆయన వద్ద ఉన్న దస్తావేజును చూచితిని. ఈ స్థలమున కుత్తరమున రాధాకిషన్ అనే ఆయనకు ఇల్లు స్థలము ఉన్నది. ఈ స్థలమును మున్సిపాలిటివారు తీసికొన్నప్పుడు రాధాకిషన్ గిర్దావరుగాను, ఫరామర్‌జంగు అనే పారిశీ ఆయన వరంగల్ కలెక్టరుగా నుండిరి. ఆయన వద్ద రాధాకిషన్‌కు మాట సాగుచుండెను. ఈ కారణమున మున్సిపాలిటీలోనికి తీసికోబడిన ఈ స్థలమును రాధాకిషన్‌కు యిచ్చునటుల అనుజ్ఞ సంపాదించెను. వెంటనే రాధా కిషన్ ఇంటిపునాదులు ప్రారంభించెను. దానిపైన జయరామసింగు తన ఆక్షేపణ లను తెలుపుచు ఈ స్థలమును ఇల్లు కట్టించుటకు తనకు ఇప్పించుమని కోరెను. తుదకు ఈ వ్యవహారము రివిన్యూబోర్డుకు పోయెను. అందులో రివిన్యూ బోర్డులో రాయమురళీధర్ మొఖ్దర్ జంగు బహద్దర్ గార్లు మెంబర్లుగా నుండిరి. స్థలమును జయరాంసింగునకే ఇవ్వమని తీర్మానించిరి. తరువాత రాధాకిషన్ సివిల్ వ్యాజ్యము వేసెను. అది హైకోర్టు వరకు నడచినది. హైకోర్టువారు జయరామ సింగునకే ఇవ్వమని తీర్మానించిరి. తరువాత రాధాకిషన్ సివిల్ వ్యాజ్యము వేసెను. అది హైకోర్టు వరకు నడచినది. హైకోర్టువారు జయరామసింగు హక్కులనే ఒప్పుకొనిరి. ఈ రికార్డునంతయు తెలిసికొని స్థలము తీసికొంటిని.

హైద్రాబాదు రాష్ట్రములో ఒక భూమి క్రయమైనప్పుడు పక్క యింటివాడు తీసికొనుటకు హంసాయీ హక్కు (ప్రయంషన్) ఉండేది. దీనినిబట్టి రాధాకిషన్‌కు యీ క్రయము తరువాత మరల హక్కు కలుగుననే భయముతో క్రయదస్తావేజు వ్రాయించక భాషానిలయము పేర దానపత్రం వ్రాయించి అప్పుడు ఉపాధ్యక్షుడుగానున్న శ్రీ తుంగతుర్తి నర్సింహారావు గారికి స్వాధీనమిచ్చినట్లు వ్రాయించితిని. రూ. 250/- మింజుమలె 200/- మాత్రమే ఆయనకు ఇచ్చితిని. 50/- వ్యవహార ఖర్చు కొరకు ఉంచితిని. లైబ్రరీ లెక్కలలో మందిర నిర్మాణము కొరకు గురురాజరావు గారి పరంగా యిచ్చినట్లు ఖర్చు వ్రాసితిని. మందిర నిర్మాణమునకు అప్పుడు మున్సిపల్ ఇంజనీరుగా ఉన్న బాలకిషన్ గారిచేత ఒక ప్లాను తయారు చేయించి అనుజ్ఞకొరకు మున్సిపాలిటీలో దరఖాస్తు దాఖల్ చేసితిని. మున్సిపాలిటీకి అధ్యక్షుడు కలెక్టరే ఉండేవాడు. రాధాకిషన్ ఒక ఆక్షేపణ పిటిషన్ కలెక్టరు వద్ద దాఖలు చేసెను. అప్పుడు కలెక్టరు శ్రీ రాయజ్‌మోహనలాల్ ఉండెను. ఆయన భాషా నిలయ స్థాపకుడగు రాయమురళీధర్ గారి కుమారుడు. ఆయన కూడా భాషా నిలయమునకు పోషకుడు ఉండెను. ఈ పిటిషన్ విచారించుటకు వరంగల్ దువ్వం తాలూకాదారు (సబ్‌కలెక్టరు) వద్దకు పంపెను. ఆయన మా గౌరవమిత్రుడు అబ్దుల్ బాఖర్‌ఖానుగారి కుమారుడు అబ్దుల్ బాసిత్‌ఖాను అయిఉండెను. ఆయన ప్రదేశమునకు వచ్చెను. రాధాకిషన్ క్రయమునకు బదులు దానపత్రమును వ్రాయించినాననే మొదలగు విషయములు చెప్పి తనకు యిప్పించుమని కోరెను. గ్రామ లెక్కలతో సహా కరణముకూడా ప్రదేశమునకు వచ్చియుండెను. రివిన్యూ సెటల్‌మెంటు లెక్కలలో ఈ స్థలము పోరంబోకు అని వ్రాయబడి ఉండెను. నేను రివిన్యూబోర్డు హైకోర్టు తీర్పులను చూపించితిని. వీటన్నిటిని ఉద్ఘాటించుటయే గాక రివిన్యూ లెక్కలలో ఇది పోరంబోకుగా వ్రాయబడి యున్నది గనుక విద్యాభివృద్ధి దృష్ట్యా ఈ స్థలమును నేను భాషానిలయమునకు యిచ్చి వేయు చున్నానని ఆయన పరిష్కారము చేసి కలెక్టరుకు తన రిపోర్టును పంపెను. కలెక్టరు వద్ద రాధాకిషన్ మరల తన ఆక్షేపణలను చెప్పెను. కలెక్టరు దానిని అంగీకరించక త్రోసివేసెను. అందుపైన రాధాకిషన్ సుబేదారువద్ద అప్పీలు చేసెను. సుబేదారు మహమ్మదాలీగారు - మా సంగతులను వినెను. ఆయన రాధాకిషన్‌తో "నీవు భాషానిలయము ప్రక్కన ఉండుటకు అర్హుడవుకావు కాబట్టి యింజనీరుద్వారా నీ స్థలమును ఇంటిని వాల్యుయేషన్ చేయించి భాషానిలయంనకు ఇప్పించెద"నని చెప్పెను. స్థలము భాషానిలయమునకు యిచ్చేవిషయములో దిగువ అధికారులతో ఏకీభవించెదనని చెప్పెను. దానిపై రాధాకిషన్ రివిన్యూ సెక్రటరీవద్ద అప్పీలు

చేసెను. గాని కొలదిరోజులకే ఆయన మరణించెను. ఆయన కుమారుడు చమన్‌సింగు ఉండెను. రాధాకిషన్ ఈ స్థలము తనదేననుకొని దీనిలోకి వచ్చిపోవుటకు తన స్థలములో నుండి ఒక దర్వాజా పెట్టెను. నేను చమన్‌సింగుతో రాజీమాటలు మాట్లాడితిని. అప్పీలు యెత్తివేసికొని ఆ దర్వాజాను తీసివేసినట్టయితే నావద్దనున్న రు. 50/–లు అతనికిచ్చెదనని చెప్పితిని. అతడు అంగీకరించి అట్లే చేసెను. ఈ విధము భాషా నిలయమునకు స్థలము సంపాదించగలిగితినని నేటికిని నేను గర్వించుచున్నాను. ఇందులో నా లౌక్య ప్రయోగములు కొన్ని వున్నవి. వీటిని నేను సదుద్దేశముతో వినియోగించినందుకు మా మిత్రులు ముఖ్యంగా అధ్యక్షులు నన్ను క్షమించిరి.

హనుమకొండలో గ్రంథాలయ మాజీ సెక్రెటరీగా పనిచేసినట్టి శ్రీ నారాయణాచారిగారు నాయందు అకారణముగా కినుక వహించి యుండిరి. కోకల సీతారామశర్మ ఆయనతో ఏకీభవించి యుండెను. వీరుభయులు అక్రమముగా నేను రూ. 200/–లు భాషా నిలయ లెక్కలో ఖర్చు వ్రాసితినని అధ్యక్షునకు లేఖ వ్రాసిరి. అప్పుడు శ్రీ పింగిలి వెంకట్రామరెడ్డి అధ్యక్షులుగాను, శ్రీ తుంగతుర్తి నర్సింహరావుగారు ఉపాధ్యక్షులుగాను వుండిరి. జరిగిన విషయములు యెప్పటికప్పుడు నేను వారికి చెప్పుచుండుటయేగాక రికార్డు కూడా చూపించితిని. కార్యవర్గసభ సమావేశమైనది. సభ్యులు అధ్యక్ష ఉపాధ్యక్షులు సభకు విచ్చేసిరి. వారందరు యీ విషయమును గురించి చర్చించుట కెవరికిని వీలులేదని తీర్మానము చేసిరి.

## రాజరాజ నరేంద్రాంధ్ర గ్రంథాలయ మందిర నిర్మాణము

శ్రీ హనుమంత పంతులుగారు హనుమకొండ వదలి వెళ్ళినప్పటి నుండియు అన్ని విషయములలోను ముఖ్యముగా గ్రంథాలయ అభివృద్ధి కొరకును, నాకు సర్వ విధముల చేదోడువాదోడుగా నుండెడి శ్రీ ఆలూరు గురురాజరావుగారు 1328 ఫసలీలో అకాలమృత్యువు వాతబడిరి. నేను 10 సం.లు కార్యదర్శిగా నుండి వరసగా పనిచేసితిని. మార్పులేకుండా ఉండటం మంచిదికాదని శ్రీ కాకిరాల సుదర్శనరావుగారిని కార్యదర్శిగా ఎన్నిక చేసితిమి. వారు సహృదయులు, విద్యాప్రియులు కాని వారికి దేశసేవ, భాషాసేవ విధానము తెలియదు. ఆ కారణమున వారు నిమిత్తమాత్రముగా కార్యదర్శిగా ఉండుటయు పనిచేయుట తటస్థించెను. తరువాత శ్రీ దివాకరుని పురుషోత్తమశాస్త్రి గారిని కార్యదర్శిగా యేర్పాటు చేసితిమి. వారికిని, సభ్యులకును భేదాభిప్రాయము కలిగి అధ్యక్షుడు

విచారించవలసి వచ్చెను. అధ్యక్షుడు వెంకట్రామారెడ్డిగారు శ్రీ శాస్త్రిగారి వల్ల రాజీనామా పుచ్చుకొని కార్యనిర్వాహకవర్గ ఆమోదము వెంట మరల నన్నే నియమించిరి. నేను మరల కొన్ని సంవత్సరములు కార్యదర్శిగా నుంటిని. తరువాత చతుర్వేది వెంకట్రావుగారు కార్యదర్శిగా యెన్నుకోబడిరి. వారిని కూడా నిమిత్త మాత్రముగా నుంచి నేనే పనిచేయవలసి వచ్చెను. గ్రంథాలయము కొఱకు స్థలము సంపాదించబడినట్లు పైన వ్రాసితిని. కాని 3, 4 సంవత్సరములు యేమిపని చేయజాలకపోతిని. తుదకు అప్పుడు సహాయ కార్యదర్శిగా పని చేయుచున్న శివలెంక సదాశివరావుగారి ప్రోత్సాహము యెక్కువగుటచే బాలకృష్ణా మొదలియార్ తయారుచేసిన ప్లాను ననుసరించి ఒక శుభ ముహూర్తమున సమంత్రణముగా నేనును శ్రీ సదాశివరావుగారును విఘ్నేశ్వరపూజ చేసి ఈశాన్యమూలన శంకుస్థాపన చేసితిమి. తర్వాత నేను మందిర నిర్మాణ కార్యదర్శిగా ఎన్నుకొన బడితిని. పని ప్రారంభించితిని. ఆ స్థలము ఒకప్పుడు కుంటలో దట్టుభూమిగా నుండెను. ఆ కారణమున సుమారు 7 అడుగుల లోతు కందకములు త్రవ్వించవలసి వచ్చెను. అప్పటికిని మొరుము దొరుకలేదు. ఇంజనీర్ల సలహావెంట మొదట ఇసుక, తరువాత సున్నంతో కలిపిన కంకరవేసి, దట్టించి, రాయి సున్నంతో కట్టనారంభించితిమి. శంకుస్థాపన జరిగిన తరువాత ప్లానులో కొన్ని మార్పులు చేయవలసి వచ్చెను. ఈ భవనము కొంచెము యించుమించు హైద్రాబాదులోని కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయమునకు సమానముగానే యున్నది. శ్రీ మునగాల రాజాగారి సవరణ ప్రకారము మరియొక 10 అడుగులు వరండా లోపలిభాగముననే కలిపితిమి. అది నేరుగా నుండునట్లును, అవసరము వచ్చినప్పుడు ఒకేహాలుగా వినియోగించుటకును వీలుగా నుండునట్లును కట్టబడినది. ప్లానులో లేకున్నను స్త్రీల కొరకు బాలకనీ యేర్పాటు చేయబడినది. బేసుమెంటు పూర్తి అయిన తరువాత కొన్ని పగుళ్లు వచ్చినందున నిపుణుల అభిప్రాయము ప్రకారము రెండు సంవత్సరములు వానలో తడవనిచ్చి ఆ పగుళ్ళను భర్తీ చేయించి బేస్‌మెంటుపైన ఖనీరాళ్లను వేయించి యిటుకగోడ ప్రారంభించ బడెను. ఆ రోజులలో యెవరి యిళ్లకును పెద్దకిటికీలు ఉండేవి కావు. అయినను వడ్రంగిని నియమించి యెత్తయిన కిటికీలను దర్వాజాలను నాయింటనే వుంచి చేయించితిని. దర్వాజాలు కిటికీలు స్థాపన చేసిన తరువాత కూడా కొన్నాళ్లు ఆపవలసి వచ్చెను. నేను దాదాపు 8000/- రూపాయిలు వసూలుచేసి దర్వాజాల పైమట్టం వరకు పని చేయించగలిగితిని. ఇందుకు చాలారోజులు పట్టెను. స్వర్గీయ వామన్ నాయకుగారు యినుప దూలములు యిచ్చుటకు వాగ్దానముచేసిరి. పని



రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషానిలయము ప్రవేశోత్సవము

పూర్తియగుటకు చాల కాలము పట్టుచుండుటచే మీరిద్దరు కోటీశ్వర్లు ఉండియు నిర్మాణము పూర్తి చేయలేకపోతిరే అని పరిహాసముతో మాట్లాడేవారు. లక్ష్మీ సంపన్నుడైన అధ్యక్షులు వెంకట్రామిరెడ్డిగారు ఒక కోటీశ్వరుడు. పేరులోను, అక్షరములను బట్టి నేను కోటీశ్వరుడను అని వారి భావము. పని ఆగిపోవుటకు సభ్యులలోని భేదభావములు కూడా కారణములైనవి. తుదకు మా పరిటాల కాపురస్తులు నా మిత్రుడు అయిన పాలపర్తి సత్యనారాయణగారు సూపరింటెండింగ్ యింజనీరు ఆఫీసులో పి.ఎ.గా వచ్చెను. ఆయనను మేము మందిర నిర్మాణ కార్యదర్శిగా ఎన్నిక చేసితిమి. ఆయన లంచము తినేవాడు కాడు. కాబట్టి ధనికులగు యెందరో కంట్రాక్టర్లు వారి కోరికపై నగదు రూపకముగాను, వస్తు రూపకముగాను, నిర్మాణమునకు సహాయము చేసిరి. శ్రీ రామలింగం అనే ఇంజనీర్ తన పర్యవేక్షణలో పని పూర్తిచేయించెను. మొత్తంమీద మందిరమును పూర్తి చేయించిన కీర్తి సత్యనారాయణగారిదే అని నేను కూడా అంగీకరించెదను. భవన నిర్మాణము పూర్తి అయిన తరువాత వైభవముగా ప్రవేశ ఉత్సవము జరిపితిమి. దేది మొదట ఇక్కడ దువ్వం తాలుక్దారు (డిప్యూటీ కలెక్టరు)గా నుండి స్థలమును ప్రసాదించిన శ్రీ అబ్దుల్ బాసిత్‌కాన్ గారు కలెక్టరుగా వరంగల్ వచ్చిరి. వారే ప్రవేశోత్సవమున కధ్యక్షులుగా నుండిరి. ఈ ప్రవేశోత్సవము ది. 19-2-1344 ఫసలీ తేదీన జరుపబడినది. తరువాత కొలది రోజులకు భాషానిలయ రజితోత్సవము కావాడ సత్యనారాయణగారి ఆధ్వర్యమున వైభవముగా ది. 13-1-1350 ఫసలీ తేదీన జరుపబడెను. యీ రెండు సభల సమయమున నేను ఉపాధ్యక్షుడుగా నుండి పనిచేసితిని. మా మిత్రులు నాయందుగల ప్రేమతో నా ఫోటోను భాషానిలయమున ఉంచునట్లు చేసిరి. తరువాత నేటివరకును భాషా నిలయమునకు కార్యవర్గ సభ్యుడుగానో, అధ్యక్షుడు గానో ఉండి పని చేయుచున్నాను. సభలకు సమావేశములకు నిషేధమున్న రోజులలో యీ భాషా నిలయమే మాకు శరణాలయముగా నుండెడిది. విద్యా నైతిక రాజకీయ విషయములు యేదో పేరుతో చర్చింపబడు చుండెడివి. ఈ భాషా నిలయమున పండితోపన్యాసములు కవి గానములు, అష్టావధాన శతావధాన ములు, జయంత్యుత్సవములు జరుపబడు చుండెడివి. మొత్తంమీద సర్వ విధముల ప్రజాహిత కార్యములలో ఈ మందిరము సహాయకారి యగుచున్నది. ఈ మందిరము తెలంగాణములోని హైదరాబాదు కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయము తరువాత రెండవదిగా విరాజిల్లు చున్నది. ఇది పురమధ్యమున రు. 30000/- విలువగల ఆస్తియై ఉన్నది. ఇటీవలనే

ప్రభుత్వము వారు దీనిని తమకు ఒప్పగింత పెట్టుమని కోరుటయు అందుకు నేనును ఎక్కువమంది నా మిత్రులు అంగీకరించనందున ఈ మందిరము ప్రభుత్వ అధీనము చేయబడలేదు.

* * *

*ప్రకరణము - 2*

# వరంగల్ మొదటి దురంతము 1325 ఫసలీ-గోకులాష్టమి శేవా సందర్భమున

వరంగల్ ఆంధ్రప్రదేశమంతటలోనూ, ముఖ్యముగా తెలంగాణ యందును, వర్తకములో అగ్రస్థానమును చెందినది. యీ పట్టణమున దక్షణమున కాకతీయుల ఓరుగల్లుకోట మొదలుకొని ఖాజీపేట స్టేషన్ వరకును పొడవుగా వ్యాపించి యున్నది. యీ ఓరుగల్ కోటయందే పోతానామాత్యుడు భాగవత రచన కాలమున కూర్చుండిన ఒక తిప్ప యున్నది. దీనినే ఓరుగల్లు ఏకశిల అని అంటారు. విడివిడిగా వున్న ఈ నగర రాజమున గల వీధులకు అనేకపేర్లు చెప్పుచుంటారు. అందులో కొన్ని నాటికిని నేటికిని గ్రామములుగానే వున్నవి. అందొకటి మట్టెవాడ. ఈ మట్టెవాడ పెద్ద వర్తక స్థానము కనుక అచ్చట పెక్కువర్గములకు చెందిన వర్తకులున్నారు. అందులో యెక్కువమంది ఆంధ్రులు. కొందరు మార్వాడీలు. కొందరు గుజరాతీలు. కచ్చీమైమనులు, ముస్లింలు, మద్రాసు లబ్బె ముస్లింలు వున్నారు. అందరును ఐకమత్యముతోనే తమ వర్తకమును నడుపుచుండేవారు. పురమధ్యమున రోడ్డుపైన 4 దేవాలయములు వున్నవి. హైదరాబాదు నుండి ఖమ్మంకు పోయే పెద్దరోడ్డు పురమధ్యము నుండియే పోవుచుండును. దానికొక శాఖగా వరంగల్ స్టేషన్ వరకు ఒక రోడ్డు వేయబడినది. మట్టెవాడకు వుత్తరపు వైపున ఒక పెద్ద పోలీసుస్టేషన్ వున్నది. అక్కడ సబ్‌యిన్స్‌పెక్టరు వుంటాడు. స్టేషన్ రోడ్డుపైన ఒక నాకా నల్గురు కానిస్టేబుల్స్‌తో యేర్పాటు చేయబడినది. ఆ

నాకావద్ద రోడ్డుప్రక్కన వున్న ఒక రావిచెట్టును ఆనుకొని కూర్చుండుటకు పోలీసు జవానులు ఒక అరుగు వేసుకొనిరి. తరువాత ఆ అరుగుమీద ముస్లిం జవానులు అప్పుడప్పుడు నమాజు చేయుచుండేవారు. వారి అభ్యాసానుసారం రావిచెట్టుపైన ఒక జండాగా కట్టిరి. యిందువలన యెవరికి యేమి ఆక్షేపణ లేకుండెను. రోడ్డుపైన ఊరేగింపులు, ఉత్సవములు మేళ తాళములతో పోవుచుండేవి. గాని 1324 ఫసలీలో ఒక ముస్లిం సబిన్స్‌పెక్టర్ అక్కడ యేర్పాటు చేయబడెను.

ఆ కాలమున శ్రీ బొల్లం నాగలింగం వర్తక వ్యాపారంలో పేరు ప్రతిష్టలు గలిగి ఉండెను. అధికారుల వద్దకు కూడా పోయి వచ్చేవాడు. ఆయనకును ఈ సబ్‌ఇన్స్‌పెక్టరుకును భేదభావములు కలిగెను. నాగలింగము గారు పెద్ద అధికార్ల దగ్గరకు వెళ్లేవాడు గనుక సబ్‌ఇన్స్‌పెక్టరును లక్ష్యపెట్టక లొంగకపోయెను. నాగలింగం గారు నాకాకు తూర్పువేపున వున్న ఆకారపు వెంకన్నగారి కుమారుడు భద్రయ్యకు తన కుమార్తెను యిచ్చి యుండెను. ఒకరోజున నాగలింగంగారు తన బిడ్డ యింటికి మేళముతో సారె పంపెను. వెళ్ళేటప్పుడు ఎవ్వరు అభ్యంతర పెట్టి ఉండలేదు. ఈ లోపల సబిన్స్‌పెక్టరు నాకా జవానులతో కలిసివచ్చేటప్పుడు పై చెప్పిన వాయిద్యమును నాకాముందర ఆపు చేయుమని చెప్పెను. మరియు నాకా ముందర వున్న అరుగు ప్రదేశమును మసీదు అనియును దానిముందర నుండి యెవరును వాయిద్యములతో వెళ్ళకూడదని చెప్పుమని పోలీసు జవానులకు బోధించెను. పోలీసు జవానులు నాగలింగంగారి మనుష్యులను వాయిద్యములను ఆపి మసీదు ముందరగా వాయిద్యములను తీసుకపోకూడదని కూడా చెప్పిరి. గాని నాగలింగం లక్ష్యపెట్టక వాయిద్యములను ఆపక వెళ్లిన విధముగానే తన యింటికి ప్రవేశించెను. ఆయన నూతనముగా కల్పింపబడిన ఈ మతవాదనను గురించి తమతోడి వర్తకులతో చెప్పి ఈ విషయములలో మనము ప్రయత్నం చేయవలెనని చెప్పెను. వర్తకులందరు ఏకాభిప్రాయులైరి. శ్రీ నాగలింగం మొదట ఈ విషయమును అప్పుడు తాలూకాదారుగా నున్న నవ్వాబు రఫత్‌యార్ జంగు బహదుర్ గారికి చెప్పెను. మసీదు లేదనే సంగతి ఆయన కూడా తెలిసినవాడే గనుక మీకట్టి భయములేదని చెప్పెను. దీనికి కొలదిరోజుల తరువాత భాద్రపద బ. అష్టమి రోజున గోకులాష్టమి వచ్చినది. ఆ రోజు రామన్నపేటలోని శ్రీ వెంటేశ్వర స్వామిని రథము పైన వేంచేపుచేసి, రామలింగేశ్వరస్వామి దేవాలయము వైపు స్టేషనురోడ్డు పైన ఊరేగింపుతో కొంతదూరము పోయి తిరిగి దేవాలయమునకు వచ్చుచుండేవారు. ఉత్సవములో త్రిమతముల హిందువులు

పాల్గొనేవారు. అందు ముఖ్యముగా వైష్ణవ సాంప్రదాయకులు కొంతడబ్బు వ్యయపెట్టి ఎక్కువ భక్తి విశ్వాసములు చూపుచుండేవారు. వరంగల్ పట్టణ ప్రజలే గాక చుట్టుపట్టు గ్రామముల నుండి ప్రజలు వచ్చేవారు. వారిలో గొల్లలు ఎక్కువమంది ఉండేవారు. వారికి గరిమెళ్ల వెంకయ్య సూరి అనే వైష్ణవ భక్తుడు కొంతడబ్బు బహూకరణ చేయుచుండేవాడు. గోకులాష్టమిని ఉట్ల పండగ అని కూడా అంటారు. అనగా శేవకుముందుర కఱ్ఱలు పాతి, దానికి తాడుగట్టి కొబ్బరికాయను ఒక ఉట్టిలో నుంచి అడ్డముగా కట్టెగట్టి ఉట్టిని అడ్డకర్రమీదుగా కిందికి లాగుచుండుటయు, దానిని కొందరు ఉత్సాహవంతులు ఎగిరి అందుకొనుటకు ప్రయత్నించి కొంత సేపటిలో అందుకొనుటయు అచ్చటచ్చట ఒక వినోదముగా జరుగుచుండెడిది. వరంగల్ గోకులాష్టమి శేవాసందర్భములో రైల్వేస్టేషనులోని మహారాష్ట్ర హమ్మాలీలు సుమారు 100 మంది ఒక బండిపైన గడకట్టి (దానిని మలకం అంటారు) దానిపైకి ఎక్కి పల్టీలు కొట్టుచు, శేవకు యెదురువచ్చి కలిసికూడ నడిచేవారు. యీ విధముగా ఆరోజు స్టేషన్ నుండి కొందరు తూర్పునుండి పడమర వచ్చుటకు బండిసహా బయలుదేరిరి. వెంకటేశ్వరాలయము నుండి రథము బయలుదేరి దక్షణాభిముఖముగా వచ్చుచుండెను. రథము రామలింగేశ్వరస్వామి దేవాలయము వరకు వచ్చి స్టేషనులో రోడ్డుపైన తూర్పుముఖంగా బయలుదేరవలసి యుండెను. గాని ఆపుకొనిరి. ఉత్సవములకు ఊరేగింపులకు రోడ్డుపై నున్న నాకాముందర నుంచి వెళ్లుటకు ఎట్టి నిరోధములు లేకుండెనని పైన వ్రాసితిని. కలహప్రియుడగు పోలీసు సబిన్సుపెక్టరు వచ్చిన తరువాత మత ఉద్రేకమును రెచ్చగొట్టు చున్నారని ప్రముఖ వర్తకులకు తెలిసి వారు కలెక్టరును వారం పదిరోజుల ముందుగానే కలిసి ఆయన వల్ల అభయము తీసుకున్నారని కూడా వ్రాసితిని. అంతటితో తృప్తిజెందక, రథోత్సవమును ఊరేగింపుతో సాగించుటకు అనుజ్ఞ యిప్పించుమని కూడా తాలూకుదారు గారి వద్ద దరఖాస్తు యిచ్చిరి. దానిని పోలీసుకు పంపబడెను. డి.ఎస్.పి. గారి దగ్గర విచారణలో నుండెను. వర్తకులు దురాశాపరుడైన సబిన్సుపెక్టరు కలహములను రెచ్చగొట్టుచున్నాడనియును లంచములు అడుగు చున్నాడనియును డి.ఎస్.పి. దగ్గర దరఖాస్తు యిచ్చిరి. ఈ రెండు విషయములను గురించి డి.ఎస్.పి. విచారించెను. నూతనముగా మసీదు యొక్క అస్థిత్వమును కలిపించి కలహములకు ముస్లింలు సిద్ధపడుచున్నా రనియును యిది పూర్వాచారమునకు విరుద్ధమనియును డి.ఎస్.పి. గులాం హుసేన్, బి.ఎ. గారు గ్రహించిరి. ఆయన సబ్ఇన్స్పెక్టరును బాగా మందలించి, ముస్లింలకు

ఆటంకపరచవద్దని చెప్పి వెనుక తాను కూడా వచ్చెదనని చెప్పెను. యీ కారణమున హిందూ ప్రజలకు యెట్టి సంకోచము కలుగకుండెను. గాని సబిన్సుపెక్టరుకును, ముస్లిం మతావేశపరులకును ఆవేదన హెచ్చిపోయెను. అంతకుముందే సబిన్సుపెక్టరు ప్రోత్సాహముచే కొందరు ముస్లింలు ఏకమై స్టేషను రోడ్డుపైనున్న నాకాలో సుమారు ఒక వంద మంది అకస్మాత్తుగా దౌర్జన్యముతో శేవను ఆపవలెనని లాఠీల యుక్తముగా నాకాలోచేరి యుండిరి. యీ సంగతి హిందువులకు తెలియదు. యింతలో హసన్ మహ్మదు అనే వర్తకుడు ఒక డాగుకాట్టు (గుర్రంబండి)పై వచ్చి నాకావద్ద నున్న ముస్లింలకు ఏదో తిరు మంత్రము చెప్పి వెళ్ళిపోయెను. తూర్పునుంచి వచ్చుచున్న మహారాష్ట్ర హమ్మాలీల బండి నాకా దగ్గరకు వచ్చెను. ఈ మధ్యనే దురదృష్టవశాత్తు రోడ్డు మరమ్మతు చేయుటకు కంకరకుప్పలు అక్కడక్కడ పోయబడి వుండెను. నాకాలో దాగియున్న ముస్లింలు బయటికి వచ్చి రోడ్డుపైనున్న కంకరరాళ్ళను తూర్పునుంచి వచ్చే మహారాష్ట్ర హమ్మాలీల పైనను పడమర నుంచి వచ్చే ప్రజలపైననూ రువ్వసాగిరి. యిది అకస్మాత్తుగా తటస్థించుటచే ఆలోచించి ప్రతిఘటించుటకు అవకాశము చిక్కినది కాదు. ఆ కారణమున రథమును రామలింగేశ్వరాలయము వద్దనే ఆపుకొనిరి. ప్రజలు నాకావైపుకు వెళ్లిరి. అవతల నుంచి హమ్మాలీలు కూడా వచ్చి కలిసిరి. సాయంత్రము 5 గంటలవేళ హిందూ ముస్లింలలో పెద్ద సంఘర్షణ దెబ్బలాట జరిగెను. ఉభయ పార్టీలలో చాలామందికి దెబ్బలు గాయములు తగిలెను. హిందువులు అరుగును త్రవ్వివేసిరి. జండాను చింపిరి. ఘర్షణ జరుగుచునే యుండెను. ఈవార్త వరంగల్ నందును హనుమకొండలోని అనధికారులకును తెలియవచ్చెను. వరంగల్‌లోని ముస్లిం ప్రజలు కొందరు గిర్మాజిపేట వైపునను, ఉరుసు కరీమాబాదు నుంచి వచ్చిన ముస్లింలు గేటువైపునను గుమిగూడిరి. హిందువుల గుంపు చీలి చాలామంది ఎవరిత్రోవను వారు చూచుకొనిరి. కొందరు రామలింగేశ్వర స్వామి దేవాలయమునకు పైకి ఎక్కి తలుపులు మూసి దేవాలయమును రక్షించుచుండిరి. అందులో ధర్మకర్త కొమరవెల్లి శ్రీశైలంగారు కూడా వున్నారని విన్నాను. వీధిలో కలహములను ఆపుటకై శ్రీ తూము వరదరాజు, చక్రపాణి మరికొందరు విద్యావంతులు నడివీధిలో వుండి ప్రయత్నము చేయుచుండిరి. యిచ్చట ఒక విషయమును వ్రాయుట ఉచితమనుకొనుచున్నాను. హనుమకొండ నుంచి కొందరు ముస్లింలు స్టేషన్‌వైపు వెళ్ళుటకును ఉదంతమును చూచుటకును వచ్చు చుండేవారు. వారిని పైచెప్పిన విద్యావంతులు నిరపాయముగా ఆదరముతో పోనిచ్చి సాధారణ ఐక్యతను

చూపించేవారు. అనగా శేవను నిరోధించిన వరంగల్ ముస్లింలతోనే గాని ముస్లిలందరితో విరోధము లేదని వారు నిరూపించుచుండిరి. కొందరు ముస్లింలు సబిన్స్‌పెక్టరు డి.ఎస్.పి. దగ్గరకు వెళ్ళి హిందువులపైన ప్రబల దోషములు చెప్పి తీసికొని వచ్చిరి. ఆయన వచ్చుసరికి అరుగులేదు – జండాలేదు. ఖురాన్ షరీఫ్ ఒక మోరీలో పడి యున్నది. గాయపడిన కొందరు ముస్లింలు రోదన చేయుచున్నారు. యిది చూచి చర్య తీసుకొనుటకు పోలీసులకు చెప్పి వెళ్లిపోయెను. సబిన్సుపెక్టరుకు అవకాశము దొరికినది. అరష్టులు ప్రారంభించెను. బజారులో నున్న విద్యావంతులగు కొందరు బొల్లం నాగలింగం వద్దకు వెళ్లి జరిగిన సంగతులు చెప్పిరి. అక్కడి నుండి టెలిగ్రాంలు వ్రాయించి, పోలీసు కమీషనరుకున్ను, ప్రధానమంత్రి గారికిన్ని తెలిపిరి. ఆ రాత్రి పోలీసు వారు బొల్లం నాగలింగం, సిద్దంశెట్టి లింగయ్య, అడ్డగూడు బసవలింగం, కొండూరు రాజయ్య, రామిని మల్లయ్య యింకా మరి ముగ్గురు ప్రముఖ వర్తకులున్ను, ఒక వంద మంది తదితర ప్రజలకు అరష్టుచేసిరి. ఈ పోలీసు దౌర్జన్యములను చూచి తెలివిగలవారు వరంగల్ నుండి తప్పించుకొని సికింద్రాబాదు, హైద్రాబాదు, బెజవాడ మరియు యితర గ్రామములకు వెళ్లి తలదాచుకొనిరి.

వర్తకులలో చాలామందికి సికింద్రాబాదులోను, హైద్రాబాదులోను ధనికులగు బంధువులున్నారు. వరంగలు నుంచి సికింద్రాబాదుకు పోయిన వర్తకుల వలన ఈ సంగతిని విని సికింద్రబాదులోని చీనాయి బారిష్టరును వకీలుగా యేర్పాటు చేసిరి. అంతేకాక హైద్రాబాదులోని సుప్రసిద్ధ వకీలు పండిత కేశవరావు గారిని కూడా ఏర్పాటు చేసిరి. అంతటితో తృప్తిజెందక నార్టన్ బారిష్టరును కూడా పెద్ద ఫీజుయిచ్చి ఏర్పాటు చేసిరి. రెండవ రోజు పోలీసువారు ఎఫ్.ఐ.ఆర్. రిపోర్టును డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు గారికి అందజేసి అరష్టయిన వారిని పోలీసు విచారణములలో నిర్బంధములో నుంచుటకు అనుజ్ఞ పొందిరి. మూడవ రోజు ప్రయత్నముచేసి రిపోర్టులోని సంగతులను మోపబడిన ఆరోపణలను తెలుసుకొంటిమి. అందులో అరష్టయిన వారి పేర్లేగాక మరికొందరి పేర్లుకూడా తెలుపుచు విచారణలో తెలిసినట్లయిన వారి పేర్లను ముందు చేర్చబడునని వ్రాయబడి యుండెను. దాని విచారణకు వెంటనే తేదీ ఏర్పాటు చేయబడెను. ఆ తేదీన చీనాయి, కేశవరావుగార్లు ముందే వచ్చిరి. తర్వాత స్పెషల్ రైలుబండిలో బారిష్టర్ నార్టన్ వచ్చెను. వారివెంట నేను పెండెల గోపాలరావు, వెలిదె నరసింహా రావు, ఉదయరాజు వెంకటేశ్వరరావుగార్లు ఉంటిమి. ప్రభుత్వ పక్షమున పయిరవికి డి.ఎస్.పి. గారే వచ్చిరి. నార్టన్‌గారు తన వాదనలో హత్యానేరముల లోను

బందిపోటు నేరములలోను నిందితులను మొదటి విచారణ మధ్యనే గాక అప్పీలు సమయమున కూడా జమానతు మీద వదలి పెట్టినట్లు హైకోర్టు తీర్పులున్నవి. అట్టి స్థితిలో పెద్ద సాహుకార్లు మోతెబర్లపైన మతావేశముతో పోట్లాడిన కేసు పెట్టి వారిని నిర్బంధించుట న్యాయవిరుద్ధమనిరి. సూపరింటెండెంటుగారు నిందితులను విడువకూడదనియు, నార్టన్‌గారు చూపిన తీర్పులు జమానతు తీసుకొనదగిన కేసులలో అయి వుండవచ్చునని వాదించిరి. అంతట నార్టన్‌గారు హత్య, డకేతి, కేసులు జమానతు తీసుకోబడిన నేరములలోనివి కావనియును మీ సూపరింటెండెంటు గారు లా చదివినాడా? అని ఆశ్చర్యము ప్రదర్శించుచూ మాట్లాడెను. ఉభయ వాదములు వినిన తరువాత అప్పటి కలెక్టరును డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు అయిన నవ్వాబు దఫత్ యార్జంగు బహదుర్ గారు జామీన్ పిటిషన్ అంగీకరించి నిందితులను విడుదల చేయుటకు ఉత్తర్వు నిచ్చిరి. అంతట సాహుకార్లు మరికొందరు జమానత్ యిచ్చి విడుదల అయిరి. అరెష్టు అయిన వారిలో మంగిలాల్ అనే బ్రహ్మచారి యుండెను. అతను మంచి తీవ్రవాది. తరువాత అరష్టు అయినవారి పక్షమునకు ఎఫ్.ఐ.ఆర్.లో పేర్కొనబడి, అరష్టు కానివారి పక్షమునను నేను వకాలతు నామాలు దాఖల్‌చేసి జామీన్ పిటీషన్ యిచ్చితిని. జమానతు తీసుకొని అరెష్టయిన వారిని వదిలిపెట్టుటకును అరెష్టు కానివారిని అరెష్టు చేయకుండుటకును మేజిస్ట్రేటు ఉత్తర్వు యిచ్చెను. నేను సిద్దంశెట్టి నరసింహ్వంగారితో కలిసిన నాటి యుండియు చాలామంది పెద్దవర్తకుల యిండ్లకుపోయి ధైర్యము చెప్పి వారు తిరుగునట్లును వ్యాపారము చేసుకొనుట్లును చెప్పితిని. వారట్లనే తిరుగుచు వ్యాపారములను సాగించుకొనుచుండిరి. ఎఫ్.ఐ.ఆర్.లో నిందితుల సంఖ్య చాలా ఎక్కువగా నుండెను. వారిలో వర్తక ప్రముఖులు అరెస్టుకాబడి విడుదలైన వారేకాక కొమరవెల్లి కాశయ్య, సిద్దంశెట్టి మల్లయ్య, ఆకారపు చెన్నయ్య మొదలగు వర్తకులును శ్రీ తూము రంగయ్య, ఉదయరాజు వెంకటేశ్వరరావు వకీలుగార్ల పేర్లుకూడా ఉండెను. ఒకరోజు వెంకటేశ్వరరావుగారు కోర్టు నుంచి యింటికి వెళ్ళుచుండగా పోలీసు హెడ్‌క్వార్టరు వద్దకు వారి బండిని రాగానే దానిని ఆపి వారిని లోపలికి పిలిపించి అరెస్టు చేసినాము వెళ్లవద్దని పోలీసువారు చెప్పిరి. వారివెంటనే శ్రీ పురుషోత్తమ శాస్త్రి వకీలుగారి బండి కూడా వచ్చుచుండెను. వెంకటేశ్వరరావుగారి గుమస్తా వలన శాస్త్రిగారి కాసంగతి తెలిపినందున శాస్త్రీగారు హెడ్‌క్వార్టర్‌లో నున్న వెంకటేశ్వర రావు గారి వద్దకు వెళ్లి, వకాలతునామాపైన సంతకము చేయించుకొని డిస్టిక్టు మేజిస్ట్రేటుగారి వద్దకు వెళ్ళి జామీను పిటిషన్ దాఖల్ చేసిరి. మేజిస్ట్రేటుగారికి

కేసు సంగతులు తెలుసును గనుక వెంకటేశ్వరరావుగారిని విడుదల చేయుటకు ఉత్తర్వు యిచ్చిరి. అప్పుడే ఆర్డరు అందజేయబడెను. వెంకటేశ్వరరావు గారు విడుదల చేయబడిరి. తరువాత పోలీసువారు చాలాన్ (చార్జిషీటు) ను డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు వద్ద దాఖలు చేసిరి. మరియు విడుదల అయిన నిందితులను మరల అరెస్టు చేయుటకు వారంటు జారీ చేయమని కోరిరి. డిస్ట్రిక్టు మేజిస్ట్రేటుగారు అసలు కేసును వరంగల్ మున్సిప్ మేజిస్ట్రేటు వద్దకు విచారణకు పంపిరి. అరెస్టు కొరకు పోలీసు వారిచ్చిన దరఖాస్తును నామంజూరుచేసిరి. ఆ కాలమున స్థానికముగా 35 మంది వకీళ్ళు పని చేయుచుండిరి. అందులో దాదాపు 20 మంది ముస్లిం వకీళ్ళే యుండిరి. తక్కిన హిందువులలో కొందరు మతకలహముల కేసులో పనిచేయుటకు సందేహపడిరి. తుదకు ఆ కాలమున బాగా పనిచేయగల సీనియరు వకీలు పెండెం గోపాలరావుగారిని ఏర్పాటుచేసిరి. వారి వెంట నేనును విలిదె నరసింహారావు, గంగు రాధాకిషన్ రావుగార్లు జూనియర్లుగా ఏర్పరచ బడితిమి. మాకు నకళ్ళు దొరికినవి. ప్రతిరోజు గోపాలరావు గారింట్లో మేము నలువురము సమావేశమై కాయితములను చదివేవారము. గోపాలరావుగారు మాకు ఆదేశములనిచ్చుచు ప్రతి విషయముపైనను దీర్ఘమైన నోట్సు వ్రాయించు చుండిరి. పోలీసు వారు కేసును మున్సిఫ్ కోర్టుకు ట్రాన్సుఫరు చేయవద్దని హైకోర్టులో పిటిషను పెట్టిరి. అందుపైన సిటి మొదటి తరగతి మేజిస్ట్రేటుగా పనిచేయుచున్న శ్రీ ఆస్కరలీ గారిని, స్పెషల్ మేజిస్ట్రేటుగా ఏర్పాటు చేసినారు. వరంగల్ వెళ్ళి వరసగా ప్రతిరోజు విచారించి, పరిష్కరించవలెనని ఉత్తర్విచ్చిరి.

శ్రీ ఆస్కరలీగారు లంచం తినే వాడుకాదు. మత, పక్షపాతము లేనివాడు. షియాశాఖకు చెందినవాడు గనుక ఆయన వద్ద తమ మాటసాగదని పోలీసువారు భయపడుచుండిరి. కేసు విచారణకు రాకమునుపే సంధి రాయభారములతో వివాదము పరిష్కరించుకొనవలె ననుకొనుచుండిరి. దానిని నెరవేర్చుటకు పోలీసు పక్షమున వరంగల్ సెషన్సుకోర్టులో జమానతు ఉత్తర్వు రద్దు చేయుమని పిటిషన్ పెట్టిరి. ఈ కేసు హిందూ మహమ్మదీయుల మతకలహముతో సంబంధించినది కనుక ఈ వార్తలు హైద్రాబాదు రాష్ట్రమంతటయు వ్యాపించి పోయెను. పోలీసు అధికారుల్లో ముస్లిములే విశేష సంఖ్యయో నుండిరి. అప్పుడు హ్యాంకిన్‌గారు పోలీసు కమీషనరుగాను మిస్టర్‌గేల్ అనే ఆయన సి.ఐ.డి. డిప్యూటి కమీషనర్‌గా నుండిరి. వీరుభయులు ఆంగ్లేయులే. హ్యాంకిన్ శెలవు మీద నున్నందున గేల్ గారు కమీషనర్‌గా పనిచేయుచుండిరి. ఆయన వరంగల్‌కు వచ్చి కేసు సంగతులు తెలుసుకొని ఈ తగవులకు కారకుడైన పోలీసు సబిన్సుపెక్టరును ఉద్యోగము

నుండి తొలగించెను. నాకాలో నున్న ముస్లిం కానిస్టేబుల్సను మార్చి సిక్కు కానిస్టేబుల్సును నియమించెను. ఆయన ఆదేశానుసారము సిక్కు పోలీసులు నాకా వద్దకు ముస్లింలు వచ్చి నమాజు చేయవద్దని నిషేధించిరి. యింతలో అసలు కమీషనరు హ్యాంకెనుగారు తిరిగివచ్చి పదవిలో ప్రవేశించిరి. ఆయన రాగానే ఈ రికార్డు తెప్పించి పరిశీలించిరి. మసీదు ఆస్తిత్వము నూతనముగా గల్పించి అనవసరముగా ముస్లిములే కలహము కలిగించినారని దీనికి స్థానిక పోలీసువారు వారిలో ప్రోత్సాహము ఉపేక్ష కారణమని యాగ్రహించిరి. వెంటనే కేసు రుజువు చేయు బాధ్యత వరంగల్ పోలీసు పైననే యుండుననియును రుజువు పరచుటకు తగినంత బలము లేనట్టయితె కేసు ఎత్తివేసుకొనుటయే మంచిదనియును, ఉత్తర్విచ్చిరి. వరంగల్‌లోను సికింద్రాబాద్‌లోను, హైదరాబాదులోను కొంతమంది ముస్లింలు పెద్ద వర్తకులుగా నుండిరి. వారికిని వరంగల్ వర్తకులకును వ్యాపార సంబంధముంటూ ఉండేది. వారు ఉభయులలో రాజీపెట్టవలెనని ప్రయత్నము చేసిరి. దెబ్బలుతిన్న ముస్లిమ్‌లకు నగదు పరిహార మిచ్చుటకును యిదివరకు నాకా ఉన్నచోట హిందువుల డబ్బుతో మసీదు కట్టించి యివ్వవలెననియును కోరుచుండిరి. యిందు పోలీసు అధికారులు కూడా పాల్గొనుచు ముస్లింలకు సహాయము చేయుచుండిరి. హిందువులు దానికి నిరాకరించు చుండిరి. తుదకు కనీసము పరిహారము లేకుండా, హిందువులను మసీదు మాత్రము కట్టించి యివ్వమని కోరిరి. అందుకును హిందువులు సమ్మతించలేదు.

సెషన్సుకోర్టులో పోలీసువారు చేసిన నిగరాని (రివిజన్) విచారించుటకు ఒక తేది ఏర్పాటు చేయబడెను. ఆరోజు చీనాయి బారిష్టర్ మాత్రమే వచ్చియుండెను. కేశవరావుగారు రాలేదు. నేను 3వ తరగతి వకీలును గనుక నాకు సెషన్సు కోర్టులో పనిచేయుటకు అధికారముండెడిది కాదు. వర్తకులందరికి కేశవరావుగారి యందు విశ్వాస మెక్కువ గనుక వారు రాలేదని కొఱతయుండెను. వాయిదా వేయించుకొన వలెనని చాలా మంది అనుకొనుచుండిరి. కేసు గెలవ జాలదనియును కమీషనర్‌తో మాట దక్కదనియును పోలీసువారికి భయముండెను. నయభయములతో రాజి పెట్టి మాట దక్కించు కొనవలెననుకొను చుండిరి. ఆ రోజు పోలీసు సబ్‌యిన్‌స్పెక్టర్లు, సర్కల్ యిన్స్‌పెక్టర్లు డిప్యూటీ సూపరిండెంటు 30, 40 మంది పోలీసు జవానులు అక్కడనే అరస్టు చేయుటకు వచ్చినట్లు ప్రదర్శనము చేయుచుండిరి. ముస్లిం వర్తకులు రాజీపడితే కేసు పోవునను చుండిరి. జరిగితే యిప్పుడే రాజీ జరుగవలెనుగాని అవకాశము యిచ్చుటకు వీలులేదని

పోలీసు అధికారులు భయపెట్టుచుండిరి. హిందువులకది యిష్టము లేదు. అవమాన పూరితమగు రాజీపనికి రాదని నేను కూడా అభిప్రాయమిచ్చుచుంటిని. బొల్లం నాగలింగం గారిని పిలిచి రాజీనామాపైన దస్కతు చేయకుండా ముందుగానే, మా వకీలు కేశవరావుగారు రాలేదు వారితో సంప్రదించిగాని సంతకము చేయజాల నని జడ్జిగారితో చెప్పుమంటిని. నా మనోభావములను బహిరంగముగా చెప్పజాలక సాంకేతికము చెప్పుచుంటిని. అచ్చట కొందరు వర్తకులు నా ప్రక్కనున్న గరిమెళ్ల వెంకయ్య గారితో అయ్యగారు (రామకోటేశ్వరరావు) ఏమి చెప్పుచున్నారు అని అడిగిరి. దానికి మీరు హిందువులయితే రాజీపడవద్దు. ముస్లింలయితే రాజీ పడవచ్చునని వారి అభిప్రాయమని వెంకయ్యగారు చెప్పెను. ముస్లింల పక్షమున ఒక రాజీనామా సిద్ధముచేసి తీసుకొని రాబడెను. అందులో మసీదు కట్టించి యిచ్చుటకు అంగీకరించినట్లును కేసు యెత్తి వేసుకొనుటకు పోలీసువారు కోరుచున్నట్లును వ్రాయబడి యుండెను. పెద్ద వర్తకుడైన ఆకారపు వెంకన్నగారును ఉదయరాజు వెంకటేశ్వరరావు గారును మొదటనే సంతకము చేసిరి. మరికొందరు మధ్యతరగతి వారుకూడా సంతకము చేసిరి. బొల్లం నాగలింగం మొదలగు పెద్దలు కొందరు దస్కతు చేయలేదు. ఆ పిటిషనును గవర్నమెంటు ప్లీడరు జడ్జిగారి యెదుటపెట్టి సంతకము చేయుటకు అందరు సిద్ధముగానే యున్నారు. వారిని కోర్టులోనికి పిలిపించి తమ యెదుటనే సంతకము చేయించుకొనమని చెప్పిరి. చినాయిగారు వాయిదా వేయుటయే మంచిదని చెప్పిరి. అందరిని జడ్జీగారి ఎదుటకు పిలిచిరి. జడ్జీ మానికుషా అనే పార్సీకులస్తుడుండెను. ఆయన నిష్పక్షపాతుడు. ఆయన పార్టీలను చూచి, మీపైన దౌర్జన్యము లేదు మీరు నిండు మనస్సుతో ఆలోచించి సంతకము చేయవచ్చుననిరి. బయట ఉన్న పోలీసువారు పార్టీలు లోపటికి వచ్చేటప్పుడు త్వరగా సంతకం పెట్టమని చెప్పుచుండిరి. లోపలనున్న వెంకన్న పార్టీవారు సంతకము చేస్తే కేసు పోతుంది. తిరిగే బాధ పోతుంది అని ప్రోత్సహించుచుండిరి. అందువలన ఒకరివెంట ఒకరు సంతకములు చేసిరి. బొల్లం నాగలింగంగారు నేను చెప్పిన మాటలను ముందే జడ్జిగారితో చెప్పక సంతకము చేసిన తరువాత ఆవేదనగానే విషయమంతయు చెప్పి వాయిదా వేయమని కోరెను. గాని లాభము లేకపోయెను. జడ్జిగారు తమ ఎదుటనున్న నిగరానీని కొట్టివేసి అసలు కేసును పోలీసువారి కోరిక ప్రకారము ఉపసంహరించు కొనుటకు అనుజ్ఞ యిచ్చిరి. ఆ ప్రకారము కేసు కొట్టివేయబడెను. ఆ రోజు ఒక ఊరేగింపుతో ముస్లిం పెద్దలు వెంకన్న పార్టీవారు జై జై ధ్వానములు చేయుచు బయలుదేరిరి. మధ్యమ తరగతి రెండవపార్టీవారు సిగ్గు సిగ్గు ఆకారపు వెంకన్న

ముర్దాబాదు మొదలగు వ్యతిరేక నినాదములతో తిట్టుచు బయలుదేరిరి. ఆకారపు వెంకన్న, చెన్నయ్య గార్లను గురించి దుర్భాషలతో కొన్ని కరపత్రములు కూడా పంచిపెట్టబడెను. కేసు పోయినది, వరంగల్ నగరములో కలవరము బయలు దేరెను. గ్రామాంతరమునకు వెళ్లిన వారందరును స్వగృహములకు వచ్చిరి. హిందువులకు అవమానకరముగ రాజీ జరిగినదని విచారపడుచుండిరి. మసీదు నిర్వహణమునకు డబ్బు యివ్వమని నిరాకరించిరి. మసీదు నిర్మాణము జరిగినచో శాశ్వితముగా ఊరేగింపులకు నిషేధము వచ్చునని భయపడుచుండిరి. అయినను ముస్లిముల ప్రయత్నము వలన ప్రభుత్వ మతశాఖవారు ప్రభుత్వ వ్యయముతోనే మసీదు కట్టుటకు నిర్ణయించి ప్లాను తీయించి కంట్రాక్టు యిచ్చివేసిరి.

మరల అందరము ఆలోచించి హైదరాబాదు వెళ్లి రాజును దర్శించి దరఖాస్తు యివ్వవలెనని అభిప్రాయమునకు వచ్చితిమి. శ్రీ పెండెం గోపాలరావు, పింగిలి రంగారావుగారలు దరఖాస్తు తయారుచేసిరి. దాని వెంట స్థానిక పరిస్థితులు తెలియగల ఒక ప్లానుగూడా తీయించి జతపరచిరి. దానివలన హిందువుల ఉత్సవములు ఊరేగింపులకు అవరోధములు కలుగునని తేలుచుండెను.

పట్నం ప్రయాణమునకును అక్కడ పైరవీ ఖర్చులకును డబ్బు అవసరమని తెలిసిన విషయమే. అది చందామూలముగా వసూలు చేయుటకు ప్రయత్నం జరుగుచుండెను. గాని ఆకారపు వారును వారి అనుయాయులును సాహసము చేయక భయపడుచు కాలహరణము చేయుచుండిరి. సిద్దంశెట్టి నరసింహంగారు త్యాగధనియని చెప్పియే యున్నాను. ఆయన తన స్వంత ఖర్చుతో రెండు స్పెషల్ డబ్బాలను రిజర్వు చేయించుతాను రాదలచిన వారు బయలుదేరమని ప్రోత్సహించెను. అందుకు పెద్దలు, చిన్నలు షుమారు 400 మంది సిద్ధపడిరి. వారికిని మార్గదర్శకుడు కీర్తిశేషులైన శ్రీ ముదిగొండ శంకరయ్యగా రుండిరి. వారు ధర్మసత్రమును నడిపేవారు. వారియందు వర్తకులకు గురుభావ ముండెడిది. అందు చాలామంది వారి శిష్యవర్గములోనివారే. వారు ప్రయాణము సాగించిరి. వర్తకులలో ముఖ్యులు బొల్లం నాగలింగం, కొమరవెల్లి కాశయ్య, రామిని మల్లయ్య, కొండూరు రాజయ్య, గరిమెళ్ళ వెంకయ్య మొదలగు ప్రముఖ వర్తకులుండిరి. ఆ రోజులలో నేడు అడ్వకేటుగా నున్న తూము వరదరాజు, కీ.శే. చక్రపాణి గార్లు పట్నంలో విద్యనభ్యసించుచుండిరి. వరంగల్ వర్తకుల రాక వారికి తెలిసి వారుభయులు వచ్చి యీ వర్తకులతో కలిసికొనిరి. వచ్చిన వర్తకులు రెసిడెన్సీ బజారులోని కందస్వామితోటలో బసచేసిరి. బొల్లం నాగలింగం గారికిని అప్పుడు

ఏదో శాఖకు కార్యదర్శిగా పనిచేయుచున్న ఫరీదు జంగు గారికిని పూర్వ పరిచయ ముండెను. ఆ కారణమున వీరందరిని తీసుకొని నాగలింగంగారు ఆయన దగ్గరకు వెళ్ళెను. ఆయన కీసంగతులన్ని చెప్పి తమ ఆర్జీని రాజుగారికి అందచేయవలెనని కోరిరి. ఆయన పార్సీవాడయినను భయపడి సహాయము చేయుటకు నిరాకరించెను. అంతట వీరందరు నిరాశతో స్వస్థానమును చేరుటకై బయలుదేరి వచ్చుచుండిరి. హుసేన్ సాగర్ చెరువుకట్ట చివరిభాగమున రాజుగారి సాన్నిధ్య మున పని చేయు ఒక ముస్లిం జవానును కలిసి వీరిసంగతి విచారించి ప్రభువు దగ్గరికి వెళ్ళుటకు భయపడనవసరము లేదు. నేను స్వయముగా తీసుకొని వెళ్ళెదనని చెప్పి కింగ్ కోఠీ మార్గమునకు త్రిప్పెను. వచ్చిన వరంగల్ ప్రజలు ఒకపక్కీన వరుసగా నడచుచుండిరి. అదే వీధి ప్రక్కన రాజుగారి ఆంతరంగిక కార్యదర్శి నవాబ్ యిమ్మాదు జంగు బహదూరు ఆఫీసు ఉండెను. ఆయన మేడపైన పనిచేసుకొనుచు ఈ గుంపును చూచెను. తాను మేడమీది నుంచి దిగి తన జవానును పంపి గుంపును అక్కడ ఆపి వారెవరో తెలిసికొని రమ్మని చెప్పెను. అంతట రాజుగారి జవాను వెళ్ళి వరంగల్‌లో హిందూ ముస్లింల మధ్య కొట్లాట జరిగినది, నాలుగువేల మంది ప్రజలు రాజుగారి దర్శనమునకు వచ్చి యున్నారు అని చెప్పెను. ఆయన వచ్చిన ప్రజలలో నుంచి కొందరు ముఖ్యులను రమ్మని చెప్పి తన జవానును పంపెను. ఎనిమిది మంది వారి బంగళాకు వెళ్లిరి. ఆయన సంగతులు తెలుసుకొన గోరగా గురుముఖ్యులు శ్రీ శంకరయ్య గారును న్యాయశాస్త్ర విద్యార్థి వరదరాజు గారును విషయములు జెప్పి దరఖాస్తును వారికిచ్చిరి. వారు మరురోజు కింగుకోఠీ వద్దకు కొందరు ముఖ్యులను మాత్రము రమ్మనమని చెప్పిరి. ఆ ప్రకారము మరురోజు కొందరు ముఖ్యులు వెళ్లి యిమాదుజంగు బహదూరు గారిని కలిసిరి. ఈలోగానే యిమాదుజంగు బహదూరు రాజుగారిని కలిసి దరఖాస్తు యిచ్చి విషయము లన్నియు రాజుగారికి బోధించెను. రాజుగారు మసీదు కట్టే పనిని ఆపు చేసిరి. స్థానిక విచారణ కొరకు ఒక కమీషను నియమించెను. అందులో హిందువులైన రాజా యింద్రకరన్ బహదూరు (ఒక సుబేదారు) ఆక్రమలి మతశాఖాధికారి, వరంగల్ జిల్లా కలెక్టరు నవాబు రఫత్‌యార్‌జంగు బహదూర్ ఉండిరి. ఈ సందర్భమున ఒక విషయమును వ్రాయుట సమంజసముగా నుండ గలదు. అదేమనగా హైద్రాబాదు ప్రభుత్వ ఉద్యోగులలో ఎక్కువమంది ముస్లింలు న్నారు. వారిలో ఎక్కువ భాగము ఉత్తర హిందూ స్థానమునుంచి వచ్చినవారే. వారికి మతావేశము ఎక్కువ. దక్కన్ ముస్లింలకు మతావేశము తక్కువ. గనుక హైద్రాబాదు హిందూ ప్రజలయందు

వారు సానుభూతి కలిగియుండేవారు. దక్కను ముస్లింల పార్టీకి ముల్కీ పార్టీ అంటారు. అందులో హిందువులు కూడా ఉన్నారు. ఈ పార్టీకి చెందినవారిలో యిమాదుజంగుగారొకరు. వారి కుటుంబము మతపక్షపాతము లేదనిదని ప్రఖ్యాతి జెందియుండెను. ఈ కుటుంబము వారు చాలామంది పెద్ద ఉద్యోగములలో వుండి హిందువుల యెడ సానుభూతి కలిగి యుండేవారు.

వరంగల్ వర్తకులకు నేనును తూము రంగయ్యగారును సలహా ఇచ్చుచుండే వారము. వరంగల్ పట్టణమున హైదరాబాదు నుంచి ఖమ్మం వెళ్లే రోడ్డుపైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయమున్ను మధ్యన అనగా స్టేషన్ రోడ్డుకు పశ్చిమ భాగమున శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయమున్నూ స్టేషన్ సమీపమున శ్రీ గోవింద రాజస్వామి దేవాలయమును కలవు. ఉత్సవములు సేవలు ఎక్కువగా జరుగుచుంటవి. యింతేగాక యిదేరోడ్డుపైన వివాహాది శుభకార్యముల ఊరేగింపులు జరుగుచుంటవి. ఈ ఉత్సవ ఊరేగింపులలో తాళమేళములు బాజాలు భజంత్రీలు వుంటవి. గనుక ముస్లింలు కోరిన స్థలమునందు నూతనముగా మసీదు కట్టినచో యిట్టి ఉత్సవములకు నిరోధములు కలుగుటయు హిందూ ముస్లింలలోనే తీరని మతకలహములకు కారణమగు ననియును హిందువుల వాదన. పూర్వము నుండి పోలీసు నాకాను అచ్చటి చెట్టుక్రింది అరుగును మస్జీదుగా వాడుచున్నాము గనుక ఆచోటనే పక్కా మరమ్మతుతో మసీదు కావలెనని ముస్లింల కోరిక అయియుండెను. ఏర్పాటుకాబడిన కమీషను సభ్యులు వరంగల్లు వచ్చి విచారించిరి. ముస్లిముల పక్షమున పూర్వం నుంచి మసీదు ఉన్నదని సాక్ష్యమిప్పించిరి. హిందువుల పక్షమున ఆ ప్రదేశము నాకా యుండెనేకాని మసీదు స్వరూపము లేదని సాక్ష్యమిచ్చిరి. నాకా శాఖాధికారియైన అక్రాంఅలిగారు ఆ ప్రదేశమును ముస్లింలు నమాజు చేయుచున్నారు గనుక మసీదుగానే ఎంచబడు ననియును అందువలన మసీదు పురాతనమైనదే ననియును అభిప్రాయ మిచ్చిరి. రాజా యింద్రకరన్ బహదూరుగారు కాశీలో విశ్వేశ్వరాలయం వద్ద కూడా మశీదు ఉన్నది కనుక యీ స్థలమున మసీదు కట్టుటకు అభ్యంతరము లేదనియు వరంగల్ కలక్టరు నవ్వాబు ఫరత్ యార్జంగ్ బహదుర్ గారు మా తండ్రి వరంగల్‌లో సుమేదారుగా నున్నప్పుడు నేను పిల్లవాడుగా నుండి వరంగల్ తిరిగితిని కాని మసీదును చూడలేదు. నేను సుమేదారు, మదద్‌గారుగా నుండి వరంగల్‌లో ఉంటిని. మసీదు చూడలేదు. కలహమునకు పూర్వము తాలూకుదారు (కలెక్టరు)గా నుంటిని గాని మసీదును చూడలేదు. ఇప్పుడు చెప్పబోయే మసీదు నూతన కల్పితము కాబట్టి మసీదు

నిర్మాణము అనవసరమని అభిప్రాయమిచ్చెను. ఆయనతో ఒక పెద్దమనిషి కలిసి నీ అభిప్రాయము రాజుగారికి వ్యతిరేకముగా తోచకలదు అని చెప్పగా ఆయన నేను సత్యము చెప్పకుంటే ఈశ్వరునికి వ్యతిరేకిని కావచ్చును అని జవాబిచ్చెను. ఆ రిపోర్టుపైన పున్నమచందు అనే ఒక వర్తకుని కొట్టును తీసుకొని (అనగా రోడ్డుకు కొంచెము స్వల్పదూరములో) అచ్చట మసీదుకట్టి బజారువైపు ఎత్తైనగోడ కట్టమనియును హిందువుల ఉత్సవములు వాయిద్యములు నిరభ్యంతరముగా పోవచ్చు ననియును యిటులయిన హిందూ ముస్లిం ప్రజలు సంతోషించెద రనియును ఫర్మాన్ జారీ చేసెను. ఈ గాథ 1325 (1916) ఫసలీలో జరిగినదని నాకు జ్ఞాపకము.

* * *

*ప్రకరణము – 3*

# హైద్రాబాద్ విద్యాసభలు

హైద్రాబాదులో విద్యాధికుల సంఖ్య చాలా తక్కువ. దీనికి కారణము విద్యాభివృద్ధికి ప్రభుత్వము శ్రద్ధ తీసుకొనక పోవుటయే. హైద్రాబాదు మూడు భాషలకు చెందిన రాష్ట్రమై యుండెను. తెలంగాణ ప్రదేశము ఎక్కువది. ఇంతేగాక తెలుగువారు మహారాష్ట్ర కర్నాటక జిల్లాలో కూడా అనేకమంది ఉండేవారు. హైద్రాబాదులో మద్రాసు యూనివర్సిటీకి లోబడిన నిజాం కాలేజి అనే ఒక కళాశాల హైద్రాబాదులో ఉండెను. అదిగాక వరంగల్, ఔరంగాబాదు గుల్బర్గాలలో మూడు హైస్కూళ్ళు ఉండేవి. హైద్రాబాదులో చాదర్‌ఘాట్ హైస్కూలు అనే ఒక హైస్కూలు ఉండేది. అవన్నియు మద్రాసు విధానమును అనుకరించినవి. విద్యాభివృద్ధి విరివిగా చేయవలెననియును, ఇంగ్లీషుకు బదులు ఉర్దూ భాషకు ప్రాధాన్యమివ్వ వలెనని ప్రభుత్వాధికారులు కోరుచుండిరి. హైదరీ గారి శ్రద్ధవలన ప్రతి సంవత్సరమును ఒకచోట విద్యాసభ చేసి కొన్ని తీర్మానములు ప్రభుత్వమువారికి పంపబడేవి. హైదరీగారు ఆ రోజులలో గృహవిద్యాశాఖలకు కార్యదర్శిగా నుండేవారు. ఆయన ఒక విద్యాభివృద్ధి ఉద్యమమును లేవదీసెను. అందు ఉద్యోగులు అనుద్యోగులు పాల్గొనేవారు. 1325వ ఫసలీలో ఒకసభ హబీబుద్దీన్ అప్పటి అకౌంటెంటు జనరల్‌గారి యాజమాన్యమున ఔరంగాబాదు నందు జరుపబడెను. అందుకు స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేటుగారి ప్రోత్సాహముతో నేను, వెలది నరసింహ్మారావు గారు, తూము రంగయ్యగారు, మహమ్మద్ జహూర్ గారు తాజుద్దీన్ గారు, మునీరుద్దిన్ గారు వెళ్ళితిమి. ఆ సభకు శ్రీ పండిత్

కేశవరావుగారు, వామన్ నాయకు గారు ఇంకా కొంతమంది పెద్దలు వచ్చిరి. విద్యాభివృద్ధికి ఎక్కువగా పాటుపడవలెనని తీర్మానములు చేయబడెను. ఆ సందర్భమున దౌలతాబాదు నందు దేవగిరి దుర్గము, ఎల్లోరాగుహలు చూడగలిగితిని. ఆ గుహలలో అందు చెక్కచెదరకుండ ఉన్న కైలాస మహాసభ వర్ణనాతీతము. ఔరంగాబాదులో ఔరంగజేబు నాడు కట్టించిన కొన్ని (నల్లాలు) కొళాయిలు చూచితిని. వాటికి నీరు కొండమీద నుండి వచ్చు సెలయేళ్ళలాగున సప్లయి అగును. కట్టబడిన దిమ్మెలలో ఇనుపగొట్టములు లేవు. మట్టితో చేయబడిన గూనపెంకులు ఉండెను. అందులో పగిలిపోయిన వాటిని ఆధునిక ఇంజనీర్లు సవరించలేకపోయిరి. కొండలమీది నుంచి వచ్చే నీటితో ఒక పడ్‌చక్కీ నడుచు చుండేది. అనగా నీటిశక్తితో నడుపబడే విసరరాయి అనే అర్థము. అది పిండి విసురుచుండేది. ఇది ఆ కాలపు పరిశ్రమలలో ఒకటిగా నుండేది. అచటనే ఔరంగజేబు భార్య యొక్క సమాధి ఉండెను. అది తాజ్‌మహల్‌కు సమానముగ నుండెను. దాని తరువాత మలిక్కాఫరు కట్టించిన దర్గాను చూచితిని. అదికూడా పూర్వపు నైపుణ్యమును చాటుచున్నది.

విద్యాసభలు ఉస్మానియా యూనివర్సిటీ స్థాపించే వరకు జరుగుచుండేవి. ఒక పర్యాయము మహ్మదలి సుబేదారుగా నున్నప్పుడు వరంగల్లులో జరుపుటకు నిశ్చయించితిమి. ఆహ్వానసంఘమునకు హఫిజుల్ హక్కుగారు అధ్యక్షులుగాను నేను కార్యదర్శిగాను నియమించబడితిమి. కారణాంతరములచే జరుపబడలేదు. ఉస్మానియా యూనివర్సిటీ ఏర్పడిన తరువాత ప్రజాపక్ష సభలలో అధికార వర్గములలో ముస్లిములు పాల్గొనకపోయిరి. హిందువులు మాత్రము అప్పుడప్పుడు జరిపి మాతృభాషలో విద్యా జరుపవలెనని తీర్మానము చేయుచుండేవారు. హైద్రాబాదులోని ఒక సభకు హృదయనాధ కుంజ్రూగారు అధ్యక్షత వహించిరి. దీని చాలా కాలము తరువాత ఒక సభ పర్భిణీలో జరుపబడినది. హైద్రాబాదు వరంగల్ నుండి ఎందరమో వెళ్ళితిమి. ఆ సభకు వినాయకరావు విద్యాలంకారు గారు అధ్యక్షత వహించిరి. సభికులలో ఎక్కువమంది మహారాష్ట్రులుండుటచే ఉపన్యాసములు మహారాష్ట్రములో ప్రారంభింపబడెను. ఒక తీర్మానమును నేను బలపరుచవలసి వచ్చెను.

మూడు భాషలుగల హైద్రాబాదు రాష్ట్రమునకు సంబంధించిన సభ గనుక ఉరుదులోనే ప్రసంగము జరుపవలసి ఉండగా మహారాష్ట్రులు మహారాష్ట్రముననే వ్యాఖ్యానము చేయుచుండిరి. ఆంధ్రులమైన మాకు భాష తెలియకుండెను. అందుకు

నేను నా మిత్రులము ఏవగించుకొనుచుంటిమి. నా సమయము వచ్చినప్పుడు యిదివరకు మాట్లాడినవారిని మాతృభాషాభిమానము చూపించి నందుకు అభినందించుచు కాకతీయ సామ్రాజ్యమునకు ముఖ్య పట్టణము వరంగల్లు నుండి వచ్చిన నేను నా మాతృభాష విడనాడుట నా మాతృభాషను అగౌరవ పరిచినట్లగును. కావున మహారాష్ట్ర సోదరుల ననుకరించుచు ఆంధ్ర భాషలోనే మాట్లాడుట నా విద్యుక్త మనుకొనుచున్నానని తెలుగులో నేను ఉపన్యాసము ప్రారంభించితిని. నా ఉపన్యాసము జరిగినంతసేపు మహారాష్ట్రులలో కొందరు నవ్వేవారును, మరికొందరు ఒకరి మొఖము ఒకరు చూచుకొనేవారును కనపడిరి. మొత్తం మీద నేను తెలుగులోనే ఉపన్యాసము యిచ్చినందుకు నా తెలుగు మిత్రులే గాక నిష్పక్షపాతులగు అధికారులు కూడ మెచ్చుకొనిరి. ఆనాడు డిస్ట్రిక్టు సూపరింటెండెంటుగా నుండి పోలీసు కమీషనరుగా పనిచేసిన శివకుమారు లాల్‌గారు ఎన్నియో పర్యాయములు జ్ఞాపకం చేయుచుండేవారు. తుదకు అధ్యక్షుడు వినాయక్‌రావుగారు అందరిని ఉరుదులోనే మాటాడమని ఆజ్ఞాపించెను. విద్యావిష యములను గురించి ఆంధ్ర మహాసభలలో చర్చలు జరుగుచునే వుండెను. గనుక యిక ప్రత్యేక విద్యాసభలకు నేను ప్రయత్నము చేసి వుండలేదు. యిట్లే మహారాష్ట్ర కర్ణాటక సోదరులు కూడా తమతమ ప్రత్యేక పరిషత్తులలో చర్చలు జరుపుకొను చుండేవారు.

* * *

*ప్రకరణము - 4*

# భారత కాంగ్రెస్ ఖిలాఫత్ ఉద్యమము హిందు ముస్లిముల సంబంధము

1921వ సంవత్సరములో మహాత్మాగాంధి నాయకత్వమున కాంగ్రెస్ వుద్యమము తీవ్రరూపము దాల్చుటయు, దానివెంట హిందూ ముస్లిం ఐక్యత కొరకు ఖిలాఫత్ ఉద్యమము కూడ కొనసాగింప బడుటయు జగద్విదితమే. ఆ రోజులలో పై ఉద్యమము బలపరుచుటకు హైదరాబాదులో కూడా సంస్థలు స్థాపించబడెను. జిల్లాలో కూడ సంస్థలు స్థాపింప నుద్దేశించి కేశవరావుగారును మరియొక ముస్లిం నాయకుడును వరంగల్ విచ్చేసిరి. ఇచ్చట హిందూ ముస్లిం కొందరి పెద్దలను సమావేశపరచి రాజకీయ సంస్థ పేర ఒక సంఘమును స్థాపించి కొందరు కార్యకర్తలను నియమించిరి. రాజకీయ సంస్థకు పురుషోత్తమశాస్త్రి గారిని అధ్యక్షుడుగను నన్ను కార్యదర్శిగాను నియామకము చేసిరి. ఖిలాఫత్ సంస్థకు శ్రీహఫీజుల్‌హక్కు గారిని అధ్యక్షులుగను నన్ను ఉపాధ్యక్షుడుగాను నియామకము చేసిరి. ఈ రెండు సంస్థలు 3, 4 మాసములు పని చేసినవి. కొన్ని తీర్మానములను అఖిలభారత జాతీయ మహాసభకు పంపబడినవి. ఖిలాఫత్ సంస్థ పక్షమున ఒకరోజు హనుమకొండలోని అబ్దుల్ నబీషా దర్గాలో సభ సమావేశపరచబడెను. 5, 6 వందల మంది ముస్లింలు సభకు విచ్చేసిరి. దర్గాలో మసీదుకూడా నున్నది. మసీదులో మెహరాబ్, మెందరు అని రెండు నిర్మాణము లుండెడివి. ఉపన్యాసకుడు మెందరు మీద కూర్చొని ఉపన్యసించ వచ్చును. సభ

ప్రారంభించకముందు కొందరు ముస్లిం మిత్రులు లేచి యీ సభకు రామకోటేశ్వరరావుగారిని అధ్యక్షుడుగా ప్రతిపాదించు చున్నామనియు అట్లయిన హిందూ ముస్లిం సఖ్యతకు కారణమగుననియును చెప్పిరి. వారితో చాలమంది ఏకీభవించిరి. నేను ఉపాధ్యక్షుడను. నా గురుతుల్యుడగు అధ్యక్షుడు హాఫీజుల్‌హక్కుగారు సభలో నుండగా నేను అధ్యక్షత వహించుట సభాగౌరవమునకు విరుద్ధమనియును, ముస్లిం ప్రార్థనా మందిరమునకు మసీదులోని మెందరుపైన ముస్లిమేతరులు కూర్చొనుట మత సాంప్రదాయ విరుద్ధమనియును నాకు నా మతమెంత గౌరవమో ఇస్లాం మతము కూడా నాకు అంత గౌరవనీయమైన దనియును ఆ నియమములకు విరుద్ధముగా నేను అధ్యక్షుడుగా నుండజాలను క్షమించమని చెప్పితిని. వారందరును సంతసించి శ్రీ హాఫీజుల్‌హక్కు గారి ఆధ్వర్యముననే సభాకార్యక్రమమును నడిపించిరి. తరువాత అందరమును కలసి లష్కరు బజారులోని రామస్వామి దేవాలయమునకు వెళ్ళితిమి. అక్కడ అర్చకుడు మంత్రపుష్పమును పెట్టెను. హారతి వెలగించెను. ముస్లిములలో కొందరు దేముడికి నమస్కారము చేసి కొన్ని రూపాయిలు కానుకలు సమర్పించిరి. హిందువులు ముస్లిములు కౌగలించుకొని హిందు ముస్లింకు జయ్ అని జయధ్వానములు చేసిరి. కొలది రోజులలోనే యీ రెండు సంస్థలను గురించి ప్రభుత్వము వారు నిషేధాజ్ఞను ప్రకటించిరి. స్టేటు కాంగ్రెసు ఖిలాఫత్ సంస్థలు నిలిపి వేయబడినవేకాని హైద్రాబాదులో అఖిలభారత కాంగ్రెస్ ప్రతినిధి సంఘము ఒకటి ఉండేది. దాని పక్షమున ప్రయత్నము చేసి కాంగ్రెస్ మహాసభకు పంపు చుండేవారు.

## కాకినాడ, మదరాసు కాంగ్రెసు మహాసభలు

1923 సంవత్సరము డిశంబరులో కాకినాడ మహాసభకు మేము వరంగల్ హైద్రాబాదు మిత్రులు చాలమంది వెళ్లితిమి. ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక సభ్యుల సంఖ్య దాదాపు 100 వరకు ఉండెను. అచ్చట మేము హైద్రాబాదు జాతీయ మహాసభ పేరుతో శ్రీ వామన్ నాయక్‌గారి ఆధ్వర్యమున ఒక సభ జరిపితిమి. జండాలతో ఊరేగింపు చేసితిమి. మాకు బాధ్యతాయుత ప్రభుత్వ మీయవలెనని 60 మంది సంతకములతో నిజాం ప్రభువుకు దరఖాస్తు పంపితిమి. యీ విషయమును క్లుప్తముగా 4వ అధ్యాయంలో కూడా వ్రాసియున్నాను. ఇల్లు చేరగానే మేమందరము దేశభ్రష్టులము కావలసి వస్తుందని భయపడితిమి. కాని శ్రీకొత్వాల్ వెంట్రామిరెడ్డిగారి అనుగ్రహము, రాజనీతి చతురతమున నిజాం

ప్రభువుకు నచ్చజెప్పిరి. అనగా వెళ్ళిన పెద్దలపైన యేదేని ప్రతీకార చర్యచేసి నట్లయిన ఆవేశములు పెరిగి అగ్ని రగులునని భయపెట్టెను. అంతటితో ప్రభుత్వము వారు మాపైన చర్య తీసుకొనలేదు. గాని మా మిత్రులు రాఘవేంద్ర రావుశర్మగారిని మాత్రము సనదు లాక్కొనమని ఆజ్ఞ యివ్వబడెను. బెలగాం, మొదలగు చోట్లకు హైద్రాబాద్ సభ్యులు వెళ్లుచుండిరి. నేను శ్రీ హనుమంతరావు గారు కేశవరావుగారు మొదలగు వారము మద్రాసు కాంగ్రెస్ మహాసభకు వెళ్లితిమి. ఇంతకన్న భారత జాతీయ మహాసభలో సంబంధించిన కార్యక్రమమేమి నెరవేర్చ జాలకపోతిని. హైదరాబాద్ రాష్ట్రమున ముస్లింలకు అధికారములు పలుకుబడి ఎక్కువగా యున్నను హిందువులతో కలసిమెలసి యుండేవారు. కాని భారతమున హిందూ ముస్లిం కలహములు ప్రారంభమై ముస్లింలీగు జిన్నాగారి ఆధ్వర్యమున నడపుట ప్రారంభించిన తరువాత హైదరాబాద్ వాతావరణము కలుషితమయ్యెను. గాని ఖిలాఫత్ ఉద్యమము నాటి ఐకమత్యతయే స్థిరముగా నుండి, రజాకారు ఉద్యమము లేవదీయక ప్రజానీకముతో యథాప్రకారం ప్రవర్తించినచో, హైదరాబాద్ రాష్ట్రములో పోలీసు చర్య జరుపవలసిన ఆగత్యమే లేకుండెడిది. నిజాం ప్రభుత్వం యథాతథాగా బహుశా ఉండి యుండెడిది. యేమో 'బుద్ధిః కర్మానుసారిణిః' అని పెద్దల వాక్యము సార్ధకమైనది.

* * *

*ప్రకరణము - 5*

# త్రిలింజ్ఞాయుర్వేద విద్యాపీఠము

1920వ సంవత్సరములో బెజవాడలో వైద్యము చేయుచున్నదంటు సుబ్బావధాని అను ఒక వైద్యుడు శ్రీ కాళేశ్వరరావుగారి వద్ద నుండియు, శ్రీ డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారి వద్ద నుండియు ఉత్తరంలు తీసుకొని నా వద్దకు వచ్చెను. ఆయనకు వరంగల్లులో ఆయుర్వేద విద్యాప్రచారము చేయవలెననియును అందుకు ఒక పాఠశాల స్థాపించ వలెననియును సంకల్పముండెను. ఆయన తన భావములన్నింటిని నాతో చర్చించెను. మేముభయులము కలసి డాక్టరు శివలంక రామలింగంగారి వద్దకు వెళ్లిమాటలాడితిమి. వారును మాతో ఏకీభవించిరి. ఈ ఉద్యమము పెక్కుమంది అభిమానులతోను ఎక్కువ ద్రవ్య సహాయముతోను కొనసాగవలసినదిగా ఉండెను. మేము ముగ్గురము కలసి వరంగల్లులోని ప్రముఖ వర్తకులతోను, న్యాయవాది తూము రంగయ్యగారితోను సంప్రదించితిమి. అటు తర్వాత అప్పుడు ఇచ్చట కలెక్టర్‌గా పనిచేయుచున్న రాయజగన్ మోహనలాలు గారితోను సంప్రదించి ఒక నిర్ణయమునకు వచ్చితిమి. అదేమనగా వరంగల్లు బజారుకువచ్చే బండ్లపైన బండి ఒకటింటికి ఒక అణా చొప్పున ధర్మనిధి వసూలు చేయుటయు వానివలన ఒక ఆయుర్వేద పాఠశాలయు, ఒక సంస్కృత పాఠశాలయు, ఒక ధర్మ వైద్యశాలయు నడుపవలె ననుకుంటిమి.

ఈ పైవిధముగా బండ్ల నుంచి డబ్బు వసూలు చేయుటకు అడ్తీదారులు అనగా కమీషను వర్తకుల సహాయము చాలా అవసరమై యుంటుంది. కాబట్టి

వారి ఆమోదము చాల అవసరము గనుక వారిని విడివిడిగా చూచి వారి ఆమోదమును బడయుటకు ప్రతిదినము సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు హనుమకొండ నుండి వరంగల్లుకు వెళ్ళుచుంటిమి. అడ్తిదారులలో ఆంధ్రులేకాక కొందరు గుజరాతీ మార్వాడీలు కచ్చీమైనులు ఉండిరి. మేము మార్వాడి అడ్తిదార్లతో సంప్రదించితిమి. వారు మా ఉద్యమములో ఇంకొక ధర్మకార్యము చేర్చుకొనుటకు కోరిరి. అనగా గోరక్షణశాలను కూడా ఉంచి నడుప వలెననిరి. దానికి మేమంగీకరించితిమి. తుదకు రెండు మాసములు తిరిగి 150 మంది కమీషను వర్తకులతో లిఖిత ఆమోదము బడసితిమి. ఈ ఉద్యమమును స్థాపించి నడుపుటకును ధర్మనిధి వసూలు చేయుటకును ప్రభుత్వాజ్ఞ కొరకు చర్య జరిపితిమి. తాలూకుదారు గారి సిఫారసు ప్రకారము బాబె హుకూమత్ (Cabinet council) నుండి అంగీకార ఉత్తరువు పొందితిమి. ఈ మధ్యకాలములో మా ఆహ్వానముపైన ఒకటి రెండు పర్యాయములు డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారు వరంగల్లుకు వచ్చి కార్యక్రమమును గురించి సలహా నిచ్చుచుండిరి. మొత్తముమీద మా ఉద్యమమునకు ఒక విధమైన బలము వచ్చింది. వర్తకులందరు పూర్తిగా అభిమానముతో నుండిరి. ఉద్యమమునకు "త్రిలింజ్ఞా యుర్వేద విద్యాపీఠమ"ని నామకరణము చేసితిమి. దానికి ప్రధానముగా 1) ఒక సంస్కృత పాఠశాల, 2) ఒక ఆయుర్వేద ధర్మ వైద్యశాల, 3) ఆయుర్వే కర్మాగారము, 4) గోరక్షణశాల అను శాకలుండ వలెనని ఏర్పాటుచేసితిమి. ఈ ఉద్యమమునకు ఆకారపు చెన్నయ్యగారు అధ్యక్షుడుగాను, గరిమెళ్ళ వెంకయ్య ఉపాధ్యక్షుడుగాను, నేను జనరల్ సెక్రటరీగాను, డాక్టరు రామలింగంగారు వైద్యశాఖకును, దంటు సుబ్బావధానిగారు విద్యాశాఖకును, తూము రంగయ్యగారు నిధి శాఖకును, కామిశెట్టి లింగన్నగారు ఆర్థిక శాఖకును, సేటు రామనారాయణ గారు గోరక్షణ శాఖకును కార్యదర్శులుగా నియమించబడిరి. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారిని ధర్మవైద్యశాలలో పని చేయుటకును మందులను తయారు చేయుటకు నెల 1కి రు. 75/- జీతముతో నేర్పాటు చేసుకుంటిమి. శ్రీ ముదిగొండ చిన వీరభద్రయ్యగారు వైద్యశాలలో చికిత్సకుడుగా పనిచేయుచుండిరి. ఖండవల్లి రామకృష్ణ శాస్త్రిగారిని సంస్కృత పాఠశాలలో అధ్యాపకులుగా నియమిం చితిమి. నెల 1కి రు. 600/-ల చొప్పున నిధి వసూలయి ఖర్చగుచుండెను. ముగ్గురు

నలుగురు విద్యార్థులు సంస్కృత పాఠములు నేర్చుకొనుచుండిరి. మేము ప్రతిరోజు వధ్యశాలకు తీసుకొనిపోబోయెడి పశువులను కొనుటకు ప్రయత్నము చేసి అక్కడ ఒక మనిషిని ఏర్పాటు చేసితిమి. ఆ మనిషి కొంత డబ్బు ఖర్చు పెట్టి 18 బక్క పశువులను కొనెను. వాటి కొరకు పింగలి కోదండ రామరెడ్డి గారివద్ద ఒక దొడ్డిని కిరాయకు తీసుకొని కాపరిని నియమించి వాటికి కావలసిన మేతకొని మేపించుచు కాపాడుచుంటిమి. అవి ప్రాణాప్రాయము నుండి రక్షింపబడి బలము కలిగి తిరుగుచుండెను. స్టేషనుకు సమీపమున దిన్‌షాజి దాదాభాయి గారి ఒక యిల్లును అద్దెకు తీసుకొని ధర్మవైద్యశాల ఉచితముగా చికిత్స చేయించు చుంటిమి. అవి ప్రాణాప్రాయము నుండి రక్షింపబడి బలము కలిగి తిరుగుచుండెను. స్టేషనుకు సమీపమున దిన్‌షాజి దాదాభాయిగారి ఒక యిల్లును అద్దెకు తీసుకొని ధర్మ వైద్యశాల నుంచి ఉచితముగా చికిత్స చేయించు చుంటిమి. ప్రతిదినము 40, 50 మంది చికిత్స పొందుచుండిరి. ఇంతవరకు ఉద్యమము స్థిరపడిన తరువాత దంటు సుబ్బావధాని గారు వరంగల్లులో నివాస మేర్పరుచుకొ నిరి. వారును వారి తమ్ముడు రామయ్యగారును ఇచ్చటనే యుండిరి. సుబ్బావధాని గారు వరంగల్లులో నెల 1కి 3, 4 వందల రూపాయిలు వైద్యమువలన సంపాదించు చుండిరి. ఈ విధముగా షుమారు 8, 10 మాసముల కాలము గడచినది. ఈ మహోద్యమమును ఆంధ్రదేశమున స్థాపించ గలిగితిమని గర్వించుచుంటిమి. ఈ సందర్భమున దురదృష్టవశాత్తు డాక్టరు రామలింగం గారిలోను, సుబ్బావధాని గారిలోను వృత్తి సంబంధమైన మనోమలికితములు కలిగెను. ఇది విషప్రాయముగా ఎగప్రాకినది. వీరుభయులునునాకు ఆంతరంగిక మిత్రులు. వీరిద్దరికి నాయందు సద్భావము విశ్వాసము ఎక్కువగా నుండెడివి. వీరిలోని భేదములను మాన్పించు టకు శాయశక్తుల పనిచేయు చుంటిని. గాని పైకి సద్దుమణిగినను అంతర్యములు సాఫుకాలేదు. ఈ సందర్భములో ఒక క్లిష్టసమస్య ఉద్భవించినది. అదేమనగా ఆయుర్వేద విద్యాబోధన సంస్కృతభాషలో నుండవలెనా లేక తెలుగులో నుండవలెనా అనే విషయము. సంస్కృతములోనే వుండవలయు ననియును ఆయుర్వేద విద్యతోపాటు సంస్కృత భాషాభివృద్ధి కూడ చేయవచ్చు ననియును అవధానిగారి వాదము. ఈ దేశములో తెలుగు భాషయే సరిగా రాదు సంస్కృత ములో విద్యనభ్యసించు విద్యార్థులు దొరుకుట దుర్లభము. గనుక ఆంధ్రముననే

శిక్షణ ఇచ్చుట ఉచితమని రామలింగంగారి వాదన. ఒకసారి కార్యనిర్వాహక సభను పిలిచి మేము విషయములను చర్చించుచుంటిమి. అందు అకస్మాత్తుగా ఆంధ్ర పత్రికానుబంధ పత్రము ఒకటి మా ఎదుటకు తేబడినది. దానిలో త్రిలింజ్ఞాయుర్వేద విద్యాపీటము యొక్క విద్యా విధానమును ప్రకటింపబడి యుండెను. భాష సంస్కృతమే యుండుననియును శిక్షణా కాలము అయిదు సంవత్సరములనియును అందు ఆచార్య, తీర్థ విశారద అనే పేరుతో పరీక్షలు జరుగుననియును వ్రాయబడి యుండెను. మూడేండ్ల తరువాత విశారద, నాలుగు సంవత్సరముల తరువాత తీర్థ, అయిదు సంవత్సరముల తరువాత ఆచార్య పరీక్షలు జరుగవలెనని ఉండెను. ఈ పత్రిక సభలో మా కందజేయబడెను. ఈ విధానమును సంఘము యొక్క ఆమోదము లేకుండాను ప్రధాన కార్యదర్శినైన నా సంతకము లేకుండాను ఎట్లా ప్రకటింప బడినదని ప్రశ్నించితిని. అందుకు అవధానిగారు ఇది అవధాని విధానమని నాకు బదులు చెప్పెను. అట్లయినచో సంస్థపేర ప్రకటింపబడుట మంచిదికాదని సభ్యులెల్లరు గట్టిగా మాట్లాడిరి. అందుపైన అవధానిగారు తన ఆశు కవిత్వముతో ఒక పద్యమును చదివెను. దాని అర్థము తాను చేయుచున్న సదుద్యమమునకు భగ్నము కలుగచేయువారిని శంకరుడు తన మూడవ నేత్రముతో చూడవలెనని కోరబడి యుండెను. ఇందుకు రామలింగం గారును, తదితర సభ్యులు ఆవేశపరులైరి. ఆనాటికి విధిలేక సభను ఆపుచేసితిని. తరువాత మరల రామలింగం గారితోను, అవధానిగారితోను సంప్రదింపులు జరిపితిని. లాభము లేకపోయెను. పిమ్మట డాక్టరు లక్ష్మీపతిగారిని ఆహ్వానించి వారికీ వృత్తాంత మంతయు తెలిపితిని. వారు శిక్షణా విధానము ఆంధ్రమునను, సంస్కృతమునను రెండు భాగములుగా ఏర్పాటు చేయవచ్చు ననియును, మొదట ఆంధ్ర విధానమును ప్రారంభింప వచ్చుననియును సలహా ఇచ్చిరి. పాఠ్య ప్రణాళికను వైద్య పండితుల ద్వారా నిర్ణయింప చేయవలెని నాకు ఆదేశమిచ్చిరి. అంతట నేను వైద్యసమావేశము జరిపితిని. చాలమంది పండితు లను ఆహ్వానించితిని. వారిలో 1 శ్రీ ములుగు రామలింగయ్యగారు, 2 ప్రతివాది భయంకర కృష్ణమాచార్యులు గారు (బెజవాడ), 3 కోరుకొండభట్టరు వెంకట పెరుమాళ్ళాచార్యులుగారు (గోసవీడు) మొదలగు వారుండిరి. సభలో ప్రతివాది భయంకరాచార్యులుగారు, పెరుమాళ్ళాచార్యులుగారు, ఇంకొక జంగం పండితుడు,

స్థానిక వైద్యులు అవధానిగారు, డాక్టరు రామలింగం గారు పాల్గొనిరి. నాలుగైదు రోజులు వరుసగా సమావేశములు చర్చలు జరిపి ఆంధ్ర విధానమును తయారు చేసితిమి. అదంతయు నాచేతితోనే వ్రాసితిని. బహుశ ఆ పరీక్షకు విద్వాన్ పేరు పెట్టినట్లు జ్ఞాపకము. దీనికి లక్ష్మీపతిగారు కూడా ఆమోదించిరి. దీని తరువాత అవధానిగారు తన పట్టుదలను మానక విరుద్ధ ప్రచారమును ప్రారంభించిరి. ఇట్టి కలతలతో ఉద్యమము సాగించుట కష్టముగా తోచెను. కార్యవర్గ సమావేశము జరిపితిమి. అందులో నేను నా రాజీనామాను సమర్పించి తిని. నీవు భేదాభిప్రాయములను సమర్థించు కొనుచు ఇప్పటివరకు ఉద్యమమును నడిపి ఉన్నావు. నీవు తొలగినప్పుడు నేను కూడా ఉండజాలనని డాక్టరు రామ లింగంగారు కూడా రాజీనామాను సమర్పించిరి. మా ఉభయుల రాజీనామాలను చూచి మీరుభయులు నాకు ముఖ్యస్నేహితులు. మీరు లేనప్పుడు నేను పనిచేయజాలనని తూము రంగయ్యగారు కూడా రాజీనామాను సమర్పించిరి.

అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు వర్తకులే కాని కార్యనిర్వాహక దక్షులుకారు. వారికి ఈ వ్యవహారములో అనుభవము దూరవిచారము లేదు. ఆ కారణమున మా రాజీనామాలను అంగీకరించిరి. వాస్తవముగా మేము ముగ్గురము లేనిది ఆ వుద్యమము నడువజాలదని వారు గ్రహింపవలసి యుండెను. కాని వారు వెంటనే అవధానిగారి కోరికపైన ఉదయరాజు వెంకటేశ్వరరావుగారిని ప్రధాన కార్యదర్శిగా ఏర్పాటు చేసికొనిరి. అంతట నుంచి క్రమక్రమముగా ఉద్యమము మూలబడినవి. నౌకరులు తొలగిపోయిరి. వసూళ్ళు ఆగిపోయినవి. తుదకు శ్రీ రామకృష్ణ శాస్త్రీగారికిని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రీగారికిని జీతము లిచ్చువారే లేకపోయిరి. అడతీదారులలో కొందరు వసూలుచేసిన డబ్బును తామే హరించుచుండిరి. మరికొందరు వసూలు చేయుట మానివేసిరి. అవధానిగారికి వైద్యవృత్తి స్తంభించి పోయినది. కలెక్టరుగారు మరియొక చోటికి బదిలీ చేయబడిరి. ఈ దుర్ఘటనలన్నియు ఉద్యమ వినాశనమునకు కారణమయ్యెను. ఉద్యమము నిలచిపోయినది. అనాలోచన పరుడును తీవ్రవాదియు అయిన అవధాని తాను నాటిన మొక్కనుతానే పీకివేసి బెజవాడ వెళ్ళిపోయెను. దీనికి నేనే దోషినని జ్ఞాపకము వచ్చినప్పుడుల్లా దుఃఖించుచుంటిని. ఏలననగా పలుకుబడిగల నేను రాజీనామా నీయక ఒక్క సుబ్బావధానిగారిని తొలగించి పంపివేసినట్లయిన ఉద్యమము నిరాఘటాముగా

కొనసాగింప గలిగేవారము. ఒకప్పుడు సత్త్వగుణము అపాయకరముగా పరిగణింప బడవచ్చును. రజోగుణముచే కార్యసిద్ధి, శాంతి సంభవించవచ్చును. అందువలననే శ్రీకృష్ణ భగవానుడు ఒక్క శిశుపాలుని శిరచ్ఛేదము చేసి రాజసూయ యాగ ఆధ్వర్యమును కొనసాగింప చేసెను. ఈ విషయములు ఉద్యమ రికార్డును చూచినప్పుడుడెల్ల జ్ఞాపకము చేసుకొని విచార పడుచుండేవాడను. ఈ విషయమునే ఒక సందర్భమున మా పూజ్యమిత్రులు మాడపాటి హనుమంతరావు గారికిని జ్ఞాపకము చేసియుంటిని. నాకు మాత్రం సంస్కృత విద్యాభివృద్ధి, ఆయుర్వే విద్యాభివృద్ధి ప్రసక్తి మాత్రము హృదయమున అంతరించి పోలేదు. అది నలుబది సంవత్సరముల తర్వాత ఫలోన్ముఖియైనది. దానిని మరియొకచోట వ్రాసితిని.

* * *

ప్రకరణము - *6*

# స్థానిక పరిపాలనా వాంఛ
# లోకల్‌ఫండ్ మునిసిపాలిటీల సంస్కరణలు

హైద్రాబాదు రాష్ట్రములో చాలా కాలము వరకు మునిసిపాలిటీ లోకల్ ఫండ్ శాఖలు కలిసి యుండెడివి. జిల్లా కమిటీకి తాలూక్దారు (కలెక్టరు) అధ్యక్షుడుగా నుండి యేడుగురు అధికారేతర సభ్యులు నియామకము చేయబడేవారు. (నామినేటెడ్) 7 గురు అధికారవర్గము వారుండేవారు. 1330 ఫసలీకి పూర్వము తాజుద్దీన్‌గారు సభ్యులుగా నుండి చనిపోయిరి. వారి స్థానే అప్పుడు కలెక్టరుగానున్న శ్రీ రాయ జగ్‌మోహన్‌లాలు గారు నన్ను అనధికార సభ్యుడుగా నియామకము చేసిరి. ఆ కమిటీలో నేను 15 సంవత్సరములు సభ్యుడుగా నుండి పనిచేసితిని. నేను సభ్యడనుగా నుండి పనిచేయుచున్న కాలములో ఈ రెండు శాఖలను అనగా వరంగల్లు మునిసిపాలిటీని లోకల్ ఫండును విడతీయుమని ప్రతిపాదించితిని. అది ఆమోదింప బడినది. కాని కమిటీ ఒకటిగానే యుండెను. తాలూకాలలో కూడ యిదే విధముగా రెండు శాఖలు విభజింపబడెను. అనగా వ్యవహార పత్రములు లెఖ్ఖలు విడదీయబడెను. వరంగల్లు మునిసిపాలిటీ ఆదాయము ఖర్చులకు చాలనందున సంవత్సరం 1కి రూ. 24000/-ల చొప్పున లోకల్ ఫండు ఆదా నుండి తీసుకొని మునిసిపాలిటీ ఖర్చు పెట్టబడుచుండెను. లోకల్ ఫండు డబ్బును భూస్వాములు చెల్లించేవారు.

సఫాయి పన్నులను నగరవాసులు చెల్లించేవారు. బీదరైతుల డబ్బు నగరవాసుల సుఖమునకు వ్యయపెట్టకూడదని వాదించితిని. తక్కిన సభ్యులు నాతో ఏకీభవించిరి. గాని రు. 24000/–లు మునిసిపాలిటీ బడ్జెటులో ఆదాయము నుండి తీసినవేసినచో పనులు నెగ్గజాలవని సంశయము కలిగెను. అందుకు గాను సంవత్సరానికి రు. 8000/–లు చొప్పున తక్కువ చేయుచు 3 సంవత్సరముల అనంతరము లోకల్ ఫండు నుంచి యేమి యీయకూడదని నిర్ణయించితిమి. తరువాత ఖమ్మం రోడ్డును యితర ట్రంకురోడ్డుకును సమీపముగా నున్న గ్రామములకు విలేజి రోడ్డులు వేయుటకు తీర్మానము పెట్టితిమి. అది అంగీకరింప బడెను. కొన్ని ప్రయిమరీ పాఠశాలలు లోకల్ ఫండు డబ్బుతో నడుపబడు చుండేవి. వాటిలో మరికొన్ని అధికము చేయుటకు ప్రయత్నము చేసితిమి. సాధారణంగా తీర్మానములన్నింటిలో సభ్యులును అధ్యక్షుడును అయిన తాలూకుదారుగాను నాతో యేకీభవించుతూ ఉండేవారు. ఒకవేళ కోర్టుపని యుండుటనుబట్టి సభా మధ్యకాలముననే వెళ్లుటకు సెలవు గోరినట్లయితే తాలూకుదారు ముఖ్యముగా శ్రీ అబ్దుల్ బాసిత్‌ఖాన్‌గారు కమిటీ పనిని ఆపు చేసేవారు.

మాంటుఫర్డు సంస్కరణములు వచ్చిన తరువాత హైద్రాబాదు రాష్ట్రమునకు రివిన్యూ మంత్రిగా పనిచేయుచున్న వేక్‌ఫీల్డు అనే ఆంగ్లేయుడు జిల్లా బోర్డులకు మునిసిపల్ కౌన్సిళ్ళు ఉండవలసిన విధానమును గురించి అభిప్రాయము యీయమని జిల్లా కలెక్టరును కోరెను. అందు 1. లోకల్ ఫండు మున్సిపాల్టీల స్వరూప మెట్లుండవలెను? 2. సభ్యుల సంఖ్య ఎంత ఉండవలెను? 3. ఓటర్ల అర్హత ఎట్లుండవలెను? అని ప్రశ్నలు చేయబడెను. వరంగల్లు జిల్లాకు ఈ లేఖ అందిన తరువాత ఒక సబ్‌కమిటీ నేర్పాటు చేయబడెను. అందులో నేను, శ్రీసుదర్శన రావుగారు, అవులియా ఖాదిరిగారు అనే ముగ్గురము సభ్యుల ముంటిమి. నేను హైద్రాబాదు, వరంగల్లులో గల దేశాభిమానులగు సభ్యులతోను, శ్రీ కాళేశ్వర్రావుగారితోను సంప్రదించి మద్రాసు మునిసిపాలిటీ లోకల్ బోర్డు ఆక్టులను తెప్పించి చదివి నివేదికను తయారుచేసితిని. నా నివేదికలో ఓటర్సు అర్సత రు. 10/–లు పన్ను చెల్లించగల వారుండవలెనన్నీ మునిసిపాలిటీలకు జిల్లా బోర్డులకు సంబంధము లేకుండా వేరువేరుగా ఉండవలెనన్నీ, సభ్యులలో నాలుగవ వంతు నియామక పూర్వకముగా తక్కిన మూడువంతుల సభ్యులు ఎన్నిక పూర్వకముగాను నుండవలెనని నివేదికలో వ్రాసితిని. కొంచెం యించు

మించుగా నా నివేదిక ప్రకారం వరంగల్లు మున్సిపల్ బోర్డుకు 36 మంది సభ్యులుండవలసి వస్తుంది. అలాగే జిల్లా బోర్డులో 8, తాలూకాల పక్షమున 16 మందియు ప్రత్యేక నియోజకవర్గముల పక్షమున ఎన్నికల ద్వారా 16 మంది సభ్యులును మొత్తం 32 సభ్యులుండవలసి వచ్చేది. నా నివేదిక కొంచెం యించుమించుగా మాంటుఫర్డు సంస్కరణములకు అనుకూలముగా నుండెను. ఈ రిపోర్టుపైన మా మిత్రులు సుదర్శనరావుగారు నాతో పూర్తిగా నేకీభవించిరి. శ్రీ అవులాలియా ఖాదరీగారు నాతో వ్యతిరేకించిరి. ఇది స్వార్థభావము గల హిందువుల కోరికలని దీనివల్ల ముస్లిములకు నష్టమగునని అభిప్రాయమిచ్చెను. ఈ నివేదిక కమిటీ ఎదుట చర్చలోనిం తేబడినది. 2, 3 సభలలో చర్చించబడినది. కమిటీలో శ్రీ అవులియా ఖాదరీగారు ఒక్కడేగాక కొలిపాక శ్రీరామరావుగారును మరికొందరు అధికారేతర సభ్యులు కూడా వ్యతిరేకించిరి. నాతో శ్రీ దిన్షాజీయిటాలియా, ముర్తూజాసేటు, సుదర్శనరావుగారు యేకీభవించిరి. కలెక్టరు శ్రీ అబ్దుల్ బాసిత్‌ఖానుగారు సహకార శాఖ అధ్యక్షులుగా నుండి కలెక్టరు పదవికి వచ్చిన వాడగుటచే ప్రజారంజకమగు సంస్కారములు చేయవలెనని అభిప్రాయము గలవాడుగా నుండెను. గానీ ప్రభుత్వ పాలసీ వ్యతిరేకించుటకు జంకుచుండెను. ఈయన దూరాదూర విచారపరుడగటు చేతనే మరల మరల రెండు పర్యాయముల చర్చలకు అవకాశము యిచ్చెను. తుది పర్యాయము ఇంగ్లండులో విద్యనభ్యసించి వచ్చిన ఎగ్జిక్యూటివు యింజనీర్ శ్రీ జె. ఎం. ఖాన్ నాతో యేకీభవించుచు యింకా యెంత కాలము ప్రజలకు పౌరసత్వ హక్కులను యీయకుండా గడిపెదరు. ఈ నివేదిక యేల అంగీకరించకూడదని ఆయన గట్టిగా వాదించెను. అందుపైన అధ్యక్షుడు కలెక్టరు నాతో రాజీబేరములు పెట్టెను. 14 స్థానములకు బదులు 21 స్థానములు ఏర్పాటుచేసి అందు 14 అధికారేతర సభ్యులను నియామక పూర్వకముగా ఏర్పాటు చేసి తక్కిన 7 స్థానములు అధికార్లకు యిచ్చినచో ప్రజలకు ఆశాజనకముగా ఉండగలదు. అందుకు మీరు ఏకీభవించెదరా అని నన్ను అడిగెను. నేను వారిచ్చిన సదభిప్రాయమునకు వ్యక్తిగతముగా సంతసము తెలుపుచూ నా నివేదికను మాత్రము మార్చుటకు యిష్టపడజాలను గనుక మీరు మీ అభిప్రాయమిచ్చి సిఫారసు చేయవచ్చునని చెప్పితిని. నా నివేదికను మాత్రము ప్రభుత్వమునకు అందజేయవలెనని కోరుచున్నానని చెప్పితిని. ఈ సంధి పద్ధతికి మరికొందరు ఏకీభవించుటచే కలెక్టరుగారి అభిప్రాయము బలపడెను. ఆ ప్రకారం

కమిటి అభిప్రాయం నా నివేదిక యుక్తంగా సుబేదారికి పంపబడెను. దీనికి కొలది రోజులలోనే ఖమ్మంలో ఆంధ్రమహాసభ శ్రీ పులిజాల రంగారావుగారి అధ్యక్షతన జరుపబడెను. అందులో నేను ఈ తీర్మానమును ప్రవేశపెట్టితిని. నాతో అప్పుడు అత్రాఫు బల్దా జిల్లా బోర్డు సభ్యుడుగా నున్న శ్రీ రంగారెడ్డిగారు ఏకీభవించిరి. ఆ సభలో స్థానిక పరిపాలన సమస్యయే ప్రాముఖ్యము బొందియుండెను. ధైర్యముతో పౌరసత్వపు హక్కులను గురించి ప్రజావాణికి తెలుపుటకు అదే మొదటి పర్యాయము గానుండెను. ఇట్లే 1, 2 తీర్మానములు నేను ఆ సభలో ప్రవేశపెట్టితిని. వాటిని ముందు వివరించెదను. మరురోజుననే వ్యవసాయ ప్రదర్శన సభకు వెళ్ళుచుండగా సి.ఐ.డి. యినిస్పెక్టరు శ్రీ నరసింహాచారి నాతో కలిసెను. సభా విశేషము ఏమి అని నేను అడిగితిని. అందుకు వారు మా రెండు తీర్మానములు తీసివేసినచో సభలో చెప్పదగిన విశేష మేమిలేదని ఆయన బదులు చెప్పెను. అనగా ఒక తీర్మానము స్థానిక పరిపాలన గురించినది, రెండవది దేశములోని వర్తక సంఘముల ద్వారా వసూలగుచున్న ధర్మఖర్చును గురించి అయియుండెను. నా రెండవ తీర్మానము ధర్మాదాయ సొత్తును గురించి ఉ ండెను. ఇందులకు ప్రభుత్వమువారు అలజడి చెందవలసిన పని లేకుండెను. నేను నరసింహచారిగారితో మీ రిపోర్టు అంతయు నాపైననే వ్రాసియున్నారా? అని అడిగితిని. వారు అపూర్వమైనట్టియు, సహేతుకంగా మాంటుఫర్టు సంస్కరణములను పురస్కరించుకొని నిజవాంఛలను తెలుపుట రాజద్రోహము కాదని నేనెరుగుదును. నేనట్లే వ్రాయుచున్నాని తెలిపెను. మొత్తంమీద స్థానిక పరిపాలనా హక్కులను గురించి నా నివేదిక ప్రభుత్వమునకు సమర్పించి ఖమ్మం ఆంధ్ర మహాసభలో తీర్మానములు ప్రవేశపెట్టి ఏకగ్రీవముగా అంగీకరింప జేసిన భాగ్యము నాకే లభించినదని మనవి చేయుచున్నాను.

అప్పుడు సుబేదారు దారాబ్జీ చినాయిగారు ఉండిరి. వారి మదద్‌గారు రాయె ఏకనాథ ప్రసాదుగారుండిరి. ఏకనాథ ప్రసాదుగారు నా నివేదికను పూర్తిగా చదివి సంతోషించి మాంటుఫర్డు సంస్కార శాసనములను మద్రాసు లోకల్ బోర్డుల మునిసిపాలిటీ శాసనములను (ఇంగ్లీషు) తెప్పించి పెట్టుమని కోరెను. నేను అట్లే ఆ శాసనములను తెప్పించి యిచ్చితిని. వారు చదివి సుబేదారుగారికి నా రిపోర్టు వినిపించిరి. సుబేదారు నన్ను పిలిపించి సహృదయంతో కొంత మాట్లాడెను. ఆయన నా నివేదికను గురించి సంతోషము వెలిబుచ్చుతూ కమెటీ

అభిప్రాయముతో ఏకీభవించెద నని వ్రాసెదననియును మీ నివేదికను ప్రభుత్వమునకు పంపెమని కూడా చెప్పెను. తుదకు అదే ప్రకారం రెండు వంతులు నియామక సభ్యులతోకూడిన కమిటీలు యేర్పాటు చేయబడుతూ పోలీసు చర్య వరకు తరువాత కొన్ని సంవత్సరముల వరకు కూడ అట్లే జరుగుచుండెను. నేను ప్రతి ఆంధ్ర మహాసభలోను మరల మరల చర్చకు తీసుకొని వచ్చుచుంటిని. ఏకగ్రీవముగా తీర్మానించ బడుచుండెను.

నేను మునిసిపాలిటీలలో నున్నంత కాలము నిర్మోహమాటముగా ఆత్మ ప్రబోధకమైన విషయములనే నివేదించు చుండేవాడను. చాల భాగము నా తీర్మానములు ఫలోన్ముఖములగు చుండెడివి. ఒక సంవత్సరము టోలుగేటు వేలంలో దాదాభాయి భిక్కాజీకి యివ్వబడెను. గేట్లు అంతకుముందే నిర్ణయము కాబడి ప్రకటించబడెను. అయినను రైల్వేస్టేషను తరువాత టవున్ వెలుపల నూతనముగా ఒక టోల్‌గేటు పెట్టించ వలెనని కోరెను. అది ఒక కమిటీలోకి చర్చకు వచ్చెను. ఆ సభకు కలెక్టరు లేనందున ఖాజా అల్తాపు హుసెన్ దువ్వం తాలూకుదారు అధ్యక్షత వహించెను. ఆయన కంట్రాక్టర్ స్నేహితుడు. శ్రీ ఫరీదురజీ పి.డబ్ల్యు.డి. ఇంజనీరు కంట్రాక్టరు స్వజాతీయుడు. ఇంకొక తహశ్శీలుదారు అధ్యక్షునకు లోబడేవాడు. నేను ఆ తీర్మానమును వ్యతిరేకించితిని. ఆ స్థలమున గేటు పెట్టినచో వర్తకులకును యితర ప్రజలకును తీరని నష్టము వాటిల్లగలదని ఆచోట గేటు పెట్టుటకు వీలులేదనియును ఒకవేళ ప్రభుత్వమునకు అది యిష్టమున్నచో దాని కొరకు రెండవ వేలము పెట్టవలె ననియును వాదించితిని. నాతో మూర్తుజా సేటు అనే మెంబరు మాత్రము ఏకీభవించెను. వగల్వీ అనే పోలీసు సూపరింటెండెంటు స్థిరాభిప్రాయము లేకుండా నేను మాటాడినప్పుడు నాతోను అధ్యక్షుడు మాటాడినప్పుడు ఆయనతోను ఏకీభవించు చుండెను. ఎట్లయినను అధ్యక్షుని పక్షమున మెజార్టీ ఉన్నది. గనుక నా అభిప్రాయమును నెగ్గజాలదని గ్రహించి నా అభిప్రాయమును సహేతుకముగా వ్రాయించి దానిని పై అధికారుల వద్దకు పంపుమని కోరితిని. అట్లే చేయబడినది. అది ప్రభుత్వము నకు పోయిన తరువాత ప్రభుత్వ సెక్రటరీ నాతో ఏకీభవించెను. వారి మెజార్టీ అభిప్రాయము తోసివేసెను. నేను సభ్యుడుగా నున్న కాలములోనే వరంగల్లులో నూతనముగా సైడు కాలువలు యేర్పాటు చేయబడెను. దానికి బహుశా రు.35000/-లు ఖర్చు పెట్టినట్లు జ్ఞాపకం. అదే కంట్రాక్టరుకు కొంచెం

సదుపాయంగా కంట్రాక్టు యిచ్చిన కారణమున తక్కువ మొత్తంలో హనుమకొండ పురవనములో ఒక టవున్ హాల్‌ను అదే కంట్రాక్టరు ద్వారా నిర్మాణము చేయించ బడినది. బహుశా అప్పుడు నయీమ్‌యార్‌జంగ్ కలెక్టరుగా నుండేవాడు. తరువాత దానికి సమీపము ననే యిటీవల మహాత్మాగాంధి విగ్రహము శ్రీ ప్రకాశం పంతులు గారిచేత ఆవిష్కరణ చేయించితిమి. దీర్ఘకాల సభ్యత్వములో జరిగిన యితర విశేషములను గ్రంథ విస్తరణచేత వ్రాయలేదు. ఎన్నియో విషయములలో నేను అధికార వర్గమునకు లోబడక సత్యము కొరకే ప్రయత్నించు చుంటిని.

* * *


*ప్రకరణము - 7*

# వరంగల్ కాకతీయ కాన్ఫరెన్స్

ఆంధ్ర చారిత్రక పరిశోధన మండలియను పేర రాజమండ్రిలో ఒక సమాజము స్థాపించ బడినది. అందు ఆంధ్ర సామ్రాజ్య చరిత్రను పరిశోధన చేసి ప్రకటించ వలెనని వారి యుద్దేశ్యము. ఆ మండలికి రాజమహేంద్రవరపు ఆర్ట్సు కాలేజి ప్రొఫెసరు శ్రీ రాళ్ళబండి సుబ్బారావు గారు కార్యదర్శిగా నుండిరి. వారు కళింగ, కాకతీయ విజయనగర సామ్రాజ్యమునకు సంబంధించిన మహాసభను వరంగల్లులో జరుప దలచిరి. గాని సభను గురించి నైజాం ప్రభుత్వములో నున్న కఠిన నియమ నిబంధనలను గురించి తెలుసుకొనుటకు సుబ్బారావు గారు హైద్రాబాదు వెళ్ళిరి. శ్రీ ఖుర్షీద్ అలీ (నాజం తబ్జీకు అస్నాదు) వమవాహీర్ (సనదులను మొహర్లను, ధ్రువపరిచే అధికారి) గారు ఆయనకు స్నేహితులగుటచే ఆయన ద్వారా సభ జరుపుటకు హోం సెక్రటరీ వద్ద దరఖాస్తు యిచ్చి అనుజ్ఞ పొందెను. అంతేగాక హోం సెక్రటరీకే విద్యాశాఖతో సంబంధ ముందుటచే హైస్కూలు భవనములో సభ జరుపునటుల కూడ అనుజ్ఞ పొందెను. వారు శ్రీ మాడపాటి హనుమంతరావుగారితో సంప్రదించి నా వద్దకు హనుమతంరావు గారి లేఖను తెచ్చెను. దానిని నేను శిరసావహించి మహాసభను వరంగల్‌లో జరుపుటకు వాగ్దానము చేసి సంసిద్ధదనైతిని. విద్యావిషయము గనుక వరంగల్‌లోని విద్యాధికులు, ముఖ్యముగా న్యాయవాదులు నాతో సహకార మొనర్చిరి. కార్య నిర్వాహణమునకు శాఖలను విభజించి ప్రత్యేక ప్రత్యేక కార్యదర్శులుగాను, సహాయ కార్యదర్శులుగాను నియామకం చేసుకొని పని

చేసితిమి. నేను ప్రధాన కార్యదర్శిగా నుంటిని. ఆ సభలో కూడా నా మిత్రులు శ్రీ జమలాపురం గోపాలరావు, పరచ రంగారావు, శ్రీ ఆవంచ వెం(ట్రావు, శ్రీ గు(రావు, కౌలూరు రామచంద్రరావు, శ్రీ వరద రాజాగార్లును, ఉదయరాజు వెంకటేశ్వరరావు గారున్నూ సహకార మొనర్చి పనిచేసిరి. పెక్కుమంది విద్యార్థులు సేవాదళముగా చేరి పనిచేసిరి. ఆ దళమునకు శ్రీ ఉదయరాజు రాజేశ్వరరావు దళాధిపతిగా నుండెను. శ్రీ శ్రీ మాన్ దూపాటి రమణాచార్యులు గారు ఎన్నియో శాసనములను తాళపత్ర గ్రంథములను ఆయా కాలమునాటి గంటములను, నాణెములను సమకూర్చి యిచ్చిరి.

వేసవి సెలవులగుటచే విద్యాశాఖవారి అనుమతి ప్రకారం విశాలమైన బోర్డింగు భవనమునుకూడా తీసుకుంటిమి. మహాసభకు సిరుగూరు హనుమంత రావుగారు నిజాం కాలేజి ప్రొఫెసర్ అధ్యక్షుడుగా నుండుటకును, పింగిలి వెంక ట్రామరెడ్డిగారు ఆహ్వాన సంఘ కార్యదర్శులు 8గురున్నూ సహాయక కార్యదర్శులు 16 మందీ ఉండిరి. వీరందరు నావద్దకు వచ్చి సంప్రదింపులు చేసి పనులు నెరవేర్చుచుండిరి. సి.ఐ.డి. పోలీసులు ప్రతిరోజు యేదియో ఒక రిపోర్టును పంపుచునే యుండిరి. అది సుమారు రెండు మూడు వందల పేజీల వరకు వచ్చినదని విన్నాను. గోవిందరావు తహశ్శీలుదారు గారు విచారించిరి. వారివల్ల నాకు కొన్ని సంగతులు తెలియుచుండెడివి. వాటిని నేను లెఖ్ఖచేసేవాడిని కాను. ఒకరోజున నేనును, మహాసభ కార్యదర్శి రాళ్ళబండి సుబ్బారావుగారును కలెక్టరును చూచుటకు వెళ్ళితిమి. కలెక్టరుగారు ఆవేశముతో కలెక్టరుతో సంబంధము లేకుండ పైపైననే ప్రభుత్వ అనుజ్ఞ సంపాదించినారే అని హేళనము చేసెను. ఆయన నా స్నేహితుడైన ఖుర్షీద్అలి గారు, తీసుకొనివెళ్ళి అనుజ్ఞ యిప్పించినారని చెప్పెను. అటు తర్వాత నావైపు తిరిగి మీవద్ద ప్రతిరోజు రహస్య సమావేశములు జరుగు చున్నవని హెచ్చరించెను. నేను సమావేశములు జరుపుట సత్యమేనని చెప్పి రాజకీయములతో నాకు సంబంధము లేదని చెప్పితిని. మరియు నేను ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శిని గనుక నావద్దకు కార్యదర్శులు 25 మంది ఆహార పదార్థములు, వసతి గృహములు సభా మందిరములను గురించి నాతో సంప్రదించి నా ఆదేశమును గొనిపోవుటకు ప్రతి దినమును వచ్చెదరనియు, కర్తవ్యమును తెలియని మీ సి.ఐ.డి. పోలీసువారు లేనిపోని వార్తలను తెలిపి మీకు అపోహ కలుగచేయు చున్నారని తెలిపితిని. అంతేగాక సభయొక్క ఉద్దేశ్యములు మేము తయారు చేయుచున్న స్థానిక పరిశోధనల వివరములను తెలిపితిమి. ఆయన చారిత్రక సభ గనుక మీరు ఉత్సాహముతో పనిచేయుమని




ఆంధ్ర చరిత్ర పరిశోధక మండలి వారిచే జరుపబడిన కాకతీయ మహాసభ

చెప్పిరి. ఈ సభవల్ల ప్రభుత్వమునకు ఏదో వత్తిడి రావచ్చునని హైకమాండ్‌లో ఆందోళన కలిగెను. పోలీసు సూపరింటెండెంటు నిరంజన్‌సింగ్ అనే శిఖ్ఖు మతస్థుడును తాలూకుదారు శ్రీ అబ్దుల్ బాసిత్ ఖాన్ అనే మహమ్మదీయుడున్నూ సుబేదారు శ్రీ దారాబ్జి చినాయి అనే పారశీకుడున్నూ యీ విధముగా భిన్న మతములకు చెందిన ఉన్నతాధికారులు ఉండిరి. గనుక హైకమాండు వారికి భయము లేకుండెను. వీరందరిని సభకు వెళ్ళుమని ఆదేశించిరి. మేము హైస్కూలు బోర్డింగులోని ఒక గదిలో పురాతన గంటములను, నాణ్యములను తామ్రశాసనములను, తాళపత్ర గ్రంథములను ప్రదర్శన కొరకు అమర్చి పెట్టితిమి. దానిని చూచుటకు పోలీసు సూపరింటెండెంటు నిరంజనసింగ్‌గారు నన్ను తీసుకొని ఆ గదిలోనికి వచ్చిరి. ఈ ప్రదర్శనమును చూచిరి. వారు ఆశ్చర్యముతో మూర్ఖులు వృథా అపోహలను కలిగించు చున్నారు. ఇది చారిత్రాత్మక సభ (ఆంధ్ర హిస్టారికల్ రిసర్చ్ సొసైటీ) ఇది ఆంధ్ర కల్చరును విశదీకరించే వస్తు ప్రదర్శనము. దీనికి రాజకీయములకు సంబంధములేదు అని చెప్పి వెళ్ళిపోయెను.

దాదాపు 100 మంది విద్యార్థులు సేవాదళములో చేరి అధ్యక్షుని ఊరేగింపులో దళాధిపతి ఉదయరాజు రాజేశ్వరరావు సైనిక దుస్తులతో నడచు చుండెను. నేను వెంకటేశ్వరరావు గారిని చూచి మోతీలాల్ నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షుడుగా నుండుటయు జవహర్లాల్ నెహ్రూ సేవా దళాధిపతిగా నుండుటయు జరిగెనని జ్ఞాపకము చేసి మీ కుమారుని అదేవిధముగా చూచు చున్నారని చెప్పితిని. ఇది అంతయు నీవే జేయుచున్నావని నాకు బదులు చెప్పెను. ఈ మహాసభ 21-7-41 ఫసలీ తేదీ అనగా 27-4-1932 సంవత్సరము రోజున మహాసభ ప్రారంభమై రెండు రోజులు మహా వైభవముతో హైస్కూలు భవనమున శ్రీ సిరుగూరు హనుమంతరావు గారి అధ్యక్షతన జరుపబడినది. ఆ మహాసభలో దిగువ వ్రాయబడిన స్వాగత పద్యములు చదువ బడినవి.

ఓం.

## కాకతీయ సభా స్వాగత పద్యములు

ఉ. స్వాగత మాంధ్రులార! భుజశక్తి ధురంధర కాకతీయ రా
ట్ప్రాగన వద్యకీర్తి విభవప్రకటీకృత మోదబాష్పధా
రాగమనేత్రులార! మహితైక శిలానగరీ మహోత్సవా
భ్యాగతులార! మీకిదియు స్వాగత మిద్దిపరిగ్రహింపరే!!

సీ. ప్రసరించె నీవీటి ప్రస్తరాంచలముల జినదేవతాంకమౌ శిల్పలక్ష్మి
క్రాలె నీవీటి దుర్గద్వారములనుండి కాకతీయనృపాల కౌశలంబు
అలరె నీవీటి మహాసభాముఖమున సుకవి విద్యా నాథు సూక్తిసుధలు
తనరె నిచ్చటి మహిధర సానువులపయి ఆంధ్రజాతీయ ధ్వజాదికంబు

తే.గీ. ఇది త్రిలింగ మహారాజ్యపదవి యిదియ
విస్మృతాంధ్ర మహారాజ్య వీరభూమి
ఇదియ యా నాటియోరుగ ల్లిచ్చుమీకు
స్వాగతం బందుకొనుఁడు మహాంధ్రులార

సీ. పాడైన యీ కోటగోడలలో నెందుఁగను మొఱంగీనదొ మా కాకతమ్మ
భూగర్భమున నెందుఁబూడిపోయనొ దేశమేలినతల్లి మా యేకవీర
అవతార మెటవీడనాడెనో కాకతి భూపకల్పకము స్వయంభూవిభుండు
ఏమయ్యెనో దేశహితమెంచి యవతార ధారియైచనిన మైలారువిభుఁడు

తే.గీ. పూర్వ విఖ్యాతి చిహ్నముల్ భూమిగతము
లగుట నెచ్చటడాఁగెనో యాంధ్రమాత
శిథిలములఁగాంచి తెలియఁగాంక్షించు సో
దరాంధ్ర మణులార! మీకు సుస్వాగతంబు

సీ. నవలక్షధానుష్క నాథులు మ ండలాగ్రములెత్తి రాజమార్గములనడువ
కవిగృహాంగణములు కావ్యగీతములచే మాపుఠేఁ పోకతేవ మారుమ్రోయ
రత్నసింహాసనాగ్రమున రుద్రమదేవివసియించు విక్రమపటిననెఱప
ఆకాశమొరయుచు నాంధ్రసామ్రాజ్యప తాకిక లింటింటఁ దాండవింప
తే.గీ. మణిగణాలంకృత మనో వేమదగజాధి
రోహణుడుయై కాకతికుమార రుద్రదేవ
చక్రవర్తి చరించు నీస్థలమహత్త్వ
మరయు బుధలార మీకు సుస్వాగతంబు

సీ. కనుమాయలేదింకఁ గాకతీయనృపాల శేఖరకల్పిత శిల్పలక్ష్మి
మఱుపురాలేదింక మహితవిద్యానాధ కవిరాజగంభీర కావ్యగీతి
చెదరలేదింక లక్ష్మీభారతీవిలా సాకరద్వారా బంధాదికంబు
తరుగలేదింక సుధ్యచ్ఛిలాప్రాకార కల్పితదుర్గవర్గప్రశస్తి

తే.గీ. కలదు ప్రత్యణువున నిటఁ గాకతీయ
రాజకోటీరమణిఘృణి రక్తరేఖ
కనుఁకొనుం డాంధ్రసామ్రాజ్యగౌరవంబు
ఆంధ్రమణులార! మీకు సుస్వాగతంబు

**హనుమకొండ** **ఆహ్వాన సంఘము**
**21-7-41 ఫ.** **కాకతీయ సభ.**

అది వేసవికాలము. మహాసభ హైస్కూలు భవనములో జరుగుచుండెను. వాయువు స్తంభించెను. బయట జరిపించుమని అధ్యక్షుడు కోరెను. నేను విద్యార్థులకు చెప్పితిని. వారు ఒక్కసారి 70 బెంచీలను కుర్చీలను 200 మంది విద్యార్థులు వరుసగా తెచ్చుచుండిరి. వారి దృశ్యమును చూచి వారధిబంధన చేయుచున్న వానర సైన్యము జ్ఞప్తికి వచ్చెను. చారిత్ర పరిశోధకులగు కొందరు వరంగల్, పాఖాల్, రామప్ప మొదలగు చోట్లకు తిరిగి చారిత్రక విషయములను వ్రాసుకొని వెళ్ళిరి. సభానంతరము నిరతాన్నదాత, దేవసేకుడైన స్వర్గీయ వామన్ నాయకుగారు మీరు పిండివంటలతోను మంచి నెయ్యి, పెరుగు, పాలు, మజ్జిగతోను అతిథి సత్కారము చేసినారు. మీ వరంగల్లులోవలె మేము భోజన ఏర్పాట్లను చేయజాలమని అభినందన వాక్యములను చెప్పెను. వామన్ నాయకు వంటి మహాదాతి ఇట్లనుటకంటె వరంగల్లు కీర్తిదాయకమైన విషయము మరియొకటి ఉండదని నా విశ్వాసము. తరువాత బోర్డింగులోని కలెక్టరు అబ్దుల్ బాసిత్‌ఖాన్, ప్రిన్సిపాల్ అబ్దుల్ అజీజ్‌ఖాన్ తమంతట తామేవచ్చి మా వద్ద ఆంధ్ర భోజనముచేసి మెచ్చుకొనిరి. చరిత్రతో సంబంధించిన 1, 2 పుస్తకములు బాసిత్‌ఖాన్‌గారు మా సంస్థకు సమర్పించిరి. మేము వేసిన పందిళ్ళు, పాకశాలలు బోర్డింగు విద్యార్థుల సౌకర్యముకొరకు యిప్పించుమని కోరిరి. అందుకు నేను

సమ్మతించి వారికి ఒప్పగింత పెట్టితిని. ఆంధ్ర చారిత్ర పరిశోధక మండలివారు కాకతీయ మహాసభ అనే పేరుతో చారిత్ర పరిశోధక విషయములను, ఉపన్యాసములను విశదీకరించుచు షుమారు 300 పేజీలుగల గ్రంథమును ప్రకటించిరి. ఆ కాలమున ఆహ్వాన సంఘముయొక్కయు, మహాసభ యొక్కయు చిత్రపటములను యిందులో చేర్చనైనది. అందు ఎందరో తెలంగాణా నాయకులును దేశభక్తులను చూడవచ్చును.

* * *

*ప్రకరణము - 8*

# సహకారోద్యమము

హైద్రాబాదు రాష్ట్రములో 1326 ఫసలీలో సహకారోద్యమము ప్రారంభించ బడినది. వరంగలులో ఒక కేంద్ర సహకార బ్యాంకు స్థాపించ బడినది. దానికి కొలది రోజులలోనే కొలిపాక శ్రీరాంగారు కార్యదర్శిగా నుండి చాలకాలం పనిచేసిరి. అప్పుడు ఈ జిల్లాలో శ్రీ సౌందరాజన్ అయ్యంగార్ అనే ఆయన ఇన్స్‌పెక్టరుగా నుండెను. ఆయన మేధావి. వ్యూహ రచనా చతురుడు. ఆయన ఈ జిల్లాలో పలువిధములైన సహకార సంస్థలను స్థాపించెను. అందొకటి సహకార వస్తు విక్రయశాల కొంతకాలము జరిగిన పిమ్మట ముందు చెప్పబోయె విధముగా నాకును ఆయనకును పరిచయము కలిగెను. తర్వాత వచ్చే వస్తువిక్రయశాల ఎన్నికల సందర్భములో నన్ను కార్యదర్శిగాను, సదాశివరావుగారిని సహ కార్యదర్శిగాను ఎన్నిక చేయించెను. వెంటనే ఆయన శలవుమీద వెళ్ళిపోయెను. వస్తు విక్రయశాలను కొన్నిరోజులు నడపితిని. మామూలు ఉప్పు, మిర్చి, మొదలగు పదార్థములను విక్రయించుట వలన ప్రత్యేకత యేమి కనబడకపోయెను. లెఖ్ఖలు చూడగా చాలా నష్టము కనిపించెను. ఆడిట్ చేయించితిని. అది 1922 సంవత్సరము భారత దేశమంతయు మహాత్ముని ఆదేశానుసారం ఖద్దరు ప్రాముఖ్యము యెక్కువగుచుండెను. కాబట్టి వస్తువిక్రయశాలలో ప్రత్యేకత కల్పించుటకు రు. 2000/- ఖద్దరు బట్టను కొంటిని. దానిలో సుమారు 800/- రూపాయిల ఖద్దరును శ్రీ కాళేశ్వరరావుగారి ఆదేశానుసారం బెజవాడ పంపితిని.

ఇంకా కొంత బట్టను శాలువలుగాను, పక్కబట్టలుగాను, తువాలలుగాను, రుమాలలుగాను ఉంచుటకు అద్దకము చేయించితిని. తక్కిన సరుకులో చాలభాగము తీసివేసితిని. డబ్బు కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో కట్టివేసితిని. ఎన్ని పర్యాయములు కార్యవర్గ సమావేశ మేర్పాటు చేసినను సభ్యులు సమావేశమునకు రానందున కోరముకాక సభలు ఆపవలసి వచ్చెను. ఈ విధముగా నేను 2 సంవత్సరములు నడిపితిని. తుదకు అప్పుడు రిజిస్ట్రారుగా నున్న శ్రీ అబ్దుల్ బాసిత్‌ఖాన్ గారు వరంగల్ వచ్చిరి. వారికీ సంగతులన్ని చెప్పి నన్ను కార్యదర్శి పని నుండి విముక్తి చేయుమని కోరితిని. ఆయన సంఘము నిమిత్తము నావల్ల దరఖాస్తు తీసికొని సంఘమును రద్దుపరచెను. తరువాత రెండు సంవత్సర ములకు లిక్విడేటర్ రఫిమహమ్మద్‌కాన్ వచ్చి వస్తువు లన్నిటిని వేలం వేసెను. దాని వివరములు, లిక్విడేటర్ అవకతవకలు వ్రాయుట అనవసరము. ఈ మధ్య కాలములో వరంగల్ జిల్లా పక్షమున ఆహ్వాన సంఘము ఏర్పాటుచేసి సహకార మహాసభను జరిపించితిని. దానికి శ్రీ ఆర్‌మద్ అయ్యంగారు అధ్యక్షత వహించిరి. ఎందరో సహకారోద్యమ అధికారులు సంఘ సభ్యులు విచ్చేసిరి. దానికి నేనే కార్యదర్శిగా నుంటిని. ఆ సభలో చాలా తీర్మానములు ప్రజోపకరము లయినవి నివేదించితిని. అందు వడ్డీరేటు నూటికి నెల1కి 1-00/ చాలా ఎక్కువనియును 100కి 0-80 కన్నా ఎక్కువ ఉండకూడదని వడ్డీకి వడ్డి కట్టకూడదనియును, ఏ సందర్భమునను అసలు కన్న వడ్డి ఎక్కువ చేయకూడదనియును చెప్పబడిన తీర్మానములు ముఖ్యమైనవి. కొందరు మిత్రులు ప్రతిఘటించిరి. కాని తీర్మాన ములు ఆమోదించబడినట్లే నాకు జ్ఞాపకము. ఈ 40 సంవత్సరముల కాలములో మే 43 సంవత్సరములు తప్ప తక్కిన కాలములో వరంగల్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు డైరెక్టరుగానుండి పని చేసితిని. నేడును పని చేయుచున్నాను. బ్యాంకు అధికారరీత్యా కలెక్టరు అధ్యక్షుడుగా నుండుటయు, ఉపాధ్యక్షుడు మాత్రము ఎన్నుకొన బడుటయు జరుగుచుండెను. నేను కొన్ని సంవత్సరములు ఉపాధ్యక్షు డుగా పనిచేసితిని. 1953 మే సంవత్సరంలో కోపరేటివ్ జిల్లా మహాసభ నిశ్చయించితిమి. ఆ సభకు ఆహ్వాన సంఘము నేర్పాటు చేసితిమి. నేను అధ్యక్షుడుగను, శ్రీ జమలాపురము గోపాలరావు, వేముగంటి రత్నాకర్‌రావుగార్లు కార్యదర్శులుగ నియమింప బడితిమి. సభ్యుల కోరికపైన జిల్లా పర్యటన చేయుటకు నేను అంగీకరించితిని. ములుగు, మహబూబాబాద్, ఖమ్మం తాలూకాలు తిరిగితిని. ఒక ఆంబోతును కూడా వదలిపెట్టుటకు సెక్రటరీ జహీర్ అహమ్మద్ గారివల్ల అనుజ్ఞ పొందితిని. నేను ఖమ్మం వెళ్ళినప్పుడు కాంగ్రెస్ కార్యకర్త

రామకిషోరుగారు సెంట్రల్ బ్యాంకు కార్యదర్శిగా నుండిరి. వారు సమావేశము చేయించలేదు. కాని టాకా సంఘమును కమ్యూనిస్టు కార్యకర్తలు నడుపుచుండిరి. వారు నన్ను ఆహ్వానించి సభ సమావేశపరిచిరి. నేను ఒక విషయమును మనవి చేసితిని. నా పూర్వసేవ యెట్లున్నను నేను ఏ రాజకీయ పార్టీకి చెందిన వాడనైనను నేడు సహకార సంఘ కార్యకర్తనుగా వచ్చితిని. గనుక మానవులలో మానవత్వము విశ్వమానవ సౌభ్రాతృత్వము పరస్పర సహకారము గురించి మాత్రమే నేను ప్రచారము చేయుచున్నాను. మేము ములుగులో సభ జరిపి రాత్రి 9 గంటలకు జీపులో వచ్చుచుండగా దారిలో ఒక  పెద్దపులి రెండు పిల్లలతో సహా కూర్చొని ఉన్నదనియును మాకు మేము అహింస ప్రేమ సహకారము ప్రచారము చేయు వారము గనుక వారు ఏమి చెప్పలేపోయిరి. మహాసభ 20-5-1953, 19 తేదీ బుధవారం జరుపవలె ననియును ప్రారంభకులు ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారును, అధ్యక్షుడు శ్రీ మాధవరావు అన్వార్‌గారు ఉండెదర నియును ఏర్పాటు చేసికొంటిమి. పనులు ప్రారంభింపబడెను. కాని కారణాం తరములచే సభ ఆగిపోయెను.

నియమావళి సవరణ రుణముల అంగీకారము మొదలగు ముఖ్య విషయములు ఉపసంఘముల ద్వారా పరిష్కరింప బడుచుండెడివి. ఈ ఉప సంఘములకు నేను తరుచుగా సభ్యుడుగా ఉండి పనిచేసితిని. మరియు పని చేయుచున్నాను గాని సహకారోద్యమము వలన ఇప్పటివరకు ప్రజలకు తృప్తికరమగు సహాయము లభించి యుండలేదు. ఇంతేకాక ఈ డిపార్టుమెంటు అధికారులు తమ అధికారమును పలుకుబడిని సాగించుచునే యున్నారు. వాస్తవముగా ఈ శాఖను పూర్తిగా ప్రజలకు ఒప్పగింత పెట్టి తమరు వారికి సహకారము చేయవలసి యుండెను. ఇప్పటివరకును బాధ్యత తమదేనని కార్యకర్తలు గ్రహించుటలేరు. అట్టి అవకాశముకూడా వారికి కల్పించ బడలేదు. కాబట్టి ఇకముందైనను అధికారవర్గము తమ ఆధ్వర్యమును సడలించుకొని స్థానిక స్వపరిపాలనము వలె ప్రజాయుక్తము చేయుట ఉత్తమపక్షము.

* * *

*ప్రకరణము - 9*

# న్యాయవాది సంఘము

నేను దాదాపు 1330 ఫసలీ (1920-21)లో న్యాయవాద సంఘమునకు కార్యదర్శిగా ఎన్నుకోబడితిని. కొన్ని రోజుల వరకు సంఘము ఐకమత్యములో నడుపబడెను. హనుమకొండ గ్రామ మధ్యమున ఒక యిల్లు అద్దెకు తీసుకొని దానిని ప్లీడర్సు క్లబ్బుగా గడుపుచుంటిమి. గాని నిజాం ప్రభువుగారు వరంగల్‌కు వచ్చెదరనియును, ఆయనకు అధికారులు, అనధికారులు అందరు నజరానాలు యివ్వవలె ననియును యేర్పాటు జరుపబడెను. కరీంనగరంలో గోవిందరావు తాలూకుదారుగారు రు. 6,00,000/-లు వసూలుచేసిరి. వరంగల్లులో జగ్‌మోహన్ లాల్ గారు రు. 2,00,000/-లు మాత్రమే వసూలుచేసెను. వకీళ్ళు ఒక్కొక్కరు ఒక అష్రఫీ (రు. 30-00) విలువగలది. 5-00 నగదు యిచ్చుటకు యేర్పాటు చేసుకొంటిమి. దర్శనంచేసి నజరానా సమర్పించవలసి యుండేది. దర్శనమునకు వెళ్ళేవారు తెల్ల షేరువాని, తెల్ల దస్తారు లేక పాగ, నడుముకు జల్తారు బగులోసులో వెళ్ళవలసియుండును. మేమీ ప్రకారము తయారుగానుంటిమి. గాని యీ మధ్యన రాజుగారికి ఎవరో ఒకరు లేఖ వ్రాసిరి. అందులో వరంగల్లు మకాంలో మీకు అపాయము చేయుటకు కుట్ర జరుగుచున్నదని తెలిపిరి. ఆయన ప్రయాణము మానుకొనలేదు. గాని అధికార వర్గమునకు మాత్రమే నజరానా యిచ్చుటకు అవకాశము యిచ్చెదననియు తక్కినవారు యేదో ఒక శాఖాధిద్వారా సమర్పించ వలయునని సందేశము పంపిరి. మేము సెషన్సు జడ్జిగారి ద్వారా పంపవలసి వచ్చినది. సెషన్సు జడ్జిగారు సంఘ పక్షమున ప్రతినిధికి అవకాశము కల్పించెద

నని చెప్పిరి. మా సంఘాధ్యక్షుడు హఫీజుల్ హఖ్‌గారు తాను వెళ్ళుటకు గాని నజరానా యిచ్చుటకుగాని అంగీకరించక, నీవుగాని మరియెవరైనా గాని వెళ్ళ వలెనని కార్యదర్శి అయిన నాకు ఆజ్ఞాపించిరి. సంఘములో నాకంటె యింకా పెద్దలున్నారు. గనుక నేను సాహసించక కార్యవర్గసభ సమావేశ పరచితిని. ఆ సభలో శ్రీ మునీరుద్దీన్ గారికిని శ్రీ రామరావుగారికిని పోటీవచ్చెను. సర్వసభ్య సమావేశము పిలువ వలసి వచ్చెను. అక్కడను రెండు కక్షలు పనిచేసెను. తుదకు సంఘ విచ్ఛిత్తి ప్రారంభమయ్యెను. నేను మరికొందరము సెషన్సు జడ్జిగారి వద్దకు వెళ్ళి యిద్దరిని పంపుటకు అవకాశమివ్వమని కోరితిమి. అందుకు ఆయన అంగీకరించెను. అప్పుడు వారిద్దరి పేర్లను వ్రాసి సెషన్సు జడ్జిగారికి పంపితిమి. రాజుగారు ఖాజీపేట రైల్వేస్టేషన్‌లో బండిలో వుండిరి. ఒకడేరా (సమాన)లో కూర్చొని పోలీసు బందోబస్తుతో నజరానాలు తీసుకొనెను. వకీళ్ళు కూడా ప్రభుత్వమునకు అర్ధ అధికారులుగానే నుండెదరు. గనుక వారికి దర్శనమిచ్చి నజారానాలు తీసుకొనుట సమంజసమని శ్రీ జగన్‌మోహన్‌లాలు కలెక్టరుగారు సాహసముచేసి వారితో చెప్పిరి. మేమందరము సెషన్సు జడ్జిగారి దగ్గరనున్న మా డబ్బును తీసుకొని వెళ్లి నజారానా యిచ్చితిమి. నేను నజరానా యిచ్చునప్పుడు కలెక్టరుగారు నన్ను పరిచయము చేసి, ప్రసంగవశాత్తు తమ దర్శనము కొరకు అశేషజనం వేచి ఉన్నారని వారికి దర్శనమీయవలెనని రాజుగారితో మనవి చేసెను. అంతట నీవే బాధ్యుడవా అని రాజుగారు కలెక్టరును ప్రశ్నించెను. కలెక్టరు ధైర్యముతో నా జిల్లాలో శాంతికి నేనే బాధ్యుడను గనుక తమకొరకు నా తల యిచ్చెదనని జవాబు యిచ్చెను. రేపు 8 గంటలకు రాజభవనమునకు వచ్చెదమని రాజుగారు చెప్పిరి. తరువాత మా న్యాయవాదులు అందరు నజరానాలు చెల్లించిరి. మరురోజు రాజుగారు రాజభవనమునకు వచ్చెను. అనేకమంది వెళ్లి దర్శనము చేసుకొని నజరానాలు యిచ్చిరి. అది బహుశా 1332 ఫసలీ అని జ్ఞాపకము. తరువాత న్యాయవాద సంఘములో మనసులు కలవక చందాలను యీయమని, సంఘము లేదనియును మిత్రులు వాదించు చుండిరి. సంఘముండు ననియును చందాలు యీయకున్నను నడిపెద మనియును చెప్పుచు 2, 3 సంవత్సరములు సంఘము నడిపి అవసర విషయము చర్చకు పెట్టుచుంటిని. తరువాత మునీరుద్దీన్ గారిని అధ్యక్షునిగా చేసితిమి. సంఘములో నూతన బీజము వేయబడినది. చందాలు యిచ్చెదమనిరి. బకాయీ లుండినను చందాలు చెల్లించుతూనే ఉండిరి. అంతకుపూర్వమే శ్రీ పండిత కేశవరావు గారు హెచ్.సి. జడ్జి పదవి నుండి విరమింపబడి మరల న్యాయవాది

వృత్తి అవలంబించెను. ఆయన ఉద్దేశ్యము న్యాయవాది వృత్తి, న్యాయమూర్తి పదవికన్నా తక్కువ కాదని నిరూపించుటయే తమ అభీష్టమనిరి. వారా ప్రకారము మరల సనదు తీసుకొని పని ప్రారంభించిరి. ఆయన మొదట న్యాయవాద మహాసభను హైద్రాబాదులో జరుపనిశ్చయించెను. అందుకు ఆ సభకు ఆయనే అధ్యక్షుడుగా నుండెను. నేనును నా మిత్రులు వెళ్లి పనిచేసితిమి. తరువాత ఆయన అప్పటి శాసనసభకు న్యాయవాద సంఘపక్షమున అభ్యర్థిగా నిలుచుటకు ప్రయత్నించెను. మేము అందరము వెళ్లి ఓట్లునిచ్చితిమి. ఆయన మరల శాసన సభ్యుడుగా ఎన్నుకోబడిరి (మరల అనగా హైకోర్టు న్యాయమూర్తి పదవి స్వీకారమునకు ముందు కొన్ని సంవత్సరములు శాసనసభా సభ్యుడుగానుండెను).

నేను కార్యదర్శిగా నున్న కాలంలో హైద్రాబాదు మిత్రులతో ముఖ్యులగు అస్కరీ హసన్ బారిస్టరుగారి ప్రేరేపణచే వరంగల్లుకు న్యాయవాద మహాసభను ఆహ్వానించితిమి. అప్పటివరకు బారిస్టరు అక్బర్ అలీఖాన్ కార్యదర్శిగాను, అస్కరీహన్‌గారు అధ్యక్షుడుగా నుండిరి. నేను వరంగల్‌లో ఆహ్వాన సంఘం యేర్పాటు చేయుటకు సమావేశము జరిపితిని. సభికులలో చాలమంది ఆహ్వాన సంఘమునకు నేను కార్యదర్శిగా నుండవలెనని మునీరుద్దీన్ గారు అధ్యక్షుడుగా నుండ వలెనని అభిప్రాయపడిరి. గాని యువక మిత్రుడు ఫజల్ హుసేన్ గారికిని వారి కొలదిమంది అనుచరులకును ఫజల్ హుసేన్‌గారు కార్యదర్శిగా నుండవలె నని ఉండెను. బహు జనాభిప్రాయము నావైపు ఉండుటచే నేనే ప్రధాన కార్యదర్శి గాను జములాపురపు గోపాలరావుగారు నాకు సహాయ కార్యదర్శిగాను ఎన్నుకొన బడితిమి. మేము వరంగల్లులో కొన్ని ముఖ్యమైన సభలు జరిపితిమి. వాటిలో నేను అధ్యక్షుడుగాను లేక కార్యదర్శిగాను వుండి పని చేసితిని. నా కెప్పుడును సర్వాధికారములను నేనొకడనే గ్రహించ వలెననే భావన గలవాడనుగాను. కాబట్టి ఆహ్వాన సంఘ కార్యక్రమము 8 ప్రధాన శాఖలుగా విభజించి ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క కార్యదర్శిని ఆయనకు 3గురు సహాయ కార్యదర్శులను యేర్పాటు చేసితిమి. ఈ విధముగా పెక్కుమంది వకీళ్ళకు పదవులు లభించి పనిచేయుట కుత్సాహము కలిగెను. శ్రీ పరచా రంగారావుగారు వ్యవహారపత్ర కార్యదర్శిగాను, శ్రీ ఆవంచ వెంకట్రావుగారు ఆహార కార్యదర్శిగాను, శ్రీ గుర్రావు రామచందర్‌రావుగారు ఆర్థికశాఖ కార్యదర్శిగాను, శ్రీ వరద రాజాగారు సభా నిర్వాహణ కార్యదర్శిగాను యింకా కొందరు తదితర శాఖలలో నుండి పనిచేసినట్లు నాకు జ్ఞాపకము. ఈ మహాసభ తెలంగాణమునకే గాక, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతములతో కూడిన 16 జిల్లాలకు సంబంధించినదై యుండెను. సభకు శ్రీ దివాన్ బహద్దూర్

ఆర్.అయ్యంగారు అధ్యక్షత వహించిరి. స్థాయీ సంఘమువారు చేయవలసిన పనికూడ నేనే చేసితిని. అనగా చిత్తు తీర్మానములు తయారు చేసితిని. స్థాయీ సంఘ కార్యదర్శి నా గౌరవ మిత్రుడు అక్బరు అలీఖాన్ గారు (నేటి ఎం.పి.) నేను తయారు చేసిపెట్టిన కార్యక్రమము స్వీకరించి నా సంప్రదింపులతో నడిపెను. 16 జిల్లాల నుండి న్యాయవాద సంఘ ప్రతినిధులు విచ్చేసిరి. హిందువులకు వేరుగాను, మహమ్మదీయులకు వేరుగాను వసతులు యేర్పాటు చేసితిమి. అందరికి పక్వాన్నములతో భోజనము పెట్టితిమి. సభ శాంతముగాను మర్యాదగాను నెగ్గినది. వరంగల్ మిత్రులు ఐకమత్యముతోను అమితోత్సాహముతోను పనిచేసి ప్రతిష్ఠ సంపాదించుకొనిరి. వసూలైన డబ్బులో 900/- రూపాయిలు మిగిలినందున దానితో 64 సంపుటములు ఉరుదు ఇండియన్ లా రిపోర్టునుకొని కోర్టు లైబ్రరీలో నుంచితిని.

వరంగల్‌లో ఎంత వైభవముగా మహాసభ జరుపబడెనో ఆ మోస్తరుగా యిప్పటివరకు మరెక్కడను జరుపబడి యుండలేదు. నేను 14, 15 సంవత్సరములు కార్యదర్శిగా నుండుటయే గాక 2, 3 పర్యాయములు అధ్యక్షుడుగా ఎన్నుకోబడి కొన్ని సంవత్సరములు అధ్యక్షుడుగా పనిచేసితిని. రజాకారు వుద్యమ సమయములో నేనే అధ్యక్షుడిగా నుంటిని. కోర్టు బహిష్కారము చేసితిమి. ఆ విషయమును విపులముగా ముందు చెప్పెను.

## బార్ కౌన్సిల్

పోలీసుచర్య జరిగి గవర్నర్ పరిపాలన ప్రారంభించిన తరువాత బార్‌కౌన్సిలు ఏర్పాటు చేయుటకు నియమావళి తయారు చేయబడెను. హైకోర్టు న్యాయవాదుల పక్షమున 10 మంది ప్రతినిధుల ఎన్నికలు కావలసి ఉండెను. అందుకు హైకోర్టు బారులో సమావేశము జరుపబడి సిటీ హైద్రాబాదు సికింద్రాబాదు పక్షమున కొందరిని జిల్లాల పక్షమున కొందరిని అభ్యర్థులుగా నిరూపించబడిరి. అందు వరంగల్ సభా పక్షమున నా పేరు పేర్కొనబడెను. ఎన్నికలలో ఈ నిర్ణయముకు విరుద్ధముగా కొందరు పోటీచేసిరి. అందు శ్రీనివాస రావుగారు చేసిన ప్రచారము వర్ణనాతీతము. తత్ఫలితముగా ఓట్ల సంఖ్యను బట్టి ఆయన 10లో నుండడము నా పేరు 11వ నెంబరున రావడము తటస్థించినది. హైకోర్టు రిజిస్ట్రారుగారు నా పేరు రిజర్వు సీటు అని ప్రకటించిరి. తరువాత కొలది రోజులలోనే శ్రీ గోపాలరావు ఎక్బోటెగారు మంత్రి అయినందున మరల ఎన్నిక లేకుండానే నా స్థానమునకు రాగలిగితిని. అప్పటినుండి దాదాపు 4

సంవత్సరములు ఆంధ్రప్రదేశ్ వచ్చేవరకు హైద్రాబాదు బార్ కౌన్సిలుకు సభ్యుడనుగా నుండి పనిచేసితిని. 1, 2 బార్ కౌన్సిలు పరీక్షలు జరుపబడెను. హైద్రాబాదు హైకోర్టు న్యాయవాదుల చట్టము నియమావళి ననుసరించి అప్పటి వరకు హైకోర్టులో ప్రాక్టీసు చేయుటకు అర్హతగల వారినందరిని బార్ కౌన్సిలు పరీక్ష నుండి మినహాయింపబడి అడ్వొకేటు పట్టా పొందవచ్చునని తీర్మానించితి. ఆ తీర్మానము ప్రకారం 16 జిల్లాలలోని వందలాది న్యాయవాదులు అయిదేసి వందల రూపాయిల స్టాంపు పెట్టి శాశ్విత సనదు తీసుకొని అడ్వొకేటుగా ప్రకటింప జేసుకొనిరి.

ఇది తొలగిపోవుచున్న హైద్రాబాదు రాజ్యపు మహోపకారమని న్యాయవాద సోదరులు గ్రహించ గలుగుచున్నారు.

* * *

*ప్రకరణము - 10*

# వరంగల్ రెండవ దురంతము

# గజాననోత్సవము

మూగివాని ఎదుట ముక్కుగోక్కొనటం, వానికి తలనొప్పికి హేతువగుట లోకవిధితము. బ్రిటిష్ ప్రభుత్వము కాలమున లోకమాన్య తిలక్‌గారు పూనాలోను, మహారాష్ట్ర ప్రాంతము నందంతటను గజాననోత్సవములను విరివిగా సాగించిరి. అది కేవలము పారమార్థికమే గాక పారలౌకికముగాను, రాజకీయముగాను గణపతి నవరాత్రముల పేరిట జరుపబడుచుండెడివి. దానికి బ్రిటిష్ ప్రభుత్వము వారు ఆందోళన పడేవారు. నేను ఖిలాఫత్ ఉద్యమము యొక్క సందర్భమున చెప్పినట్లు హైద్రాబాదు వాతావరణము కలుషితమై హిందూ ముస్లింల మధ్యన భేదభావములు యేర్పడి అచ్చటచ్చట మత కలహములు యేర్పడుచుండెను. ఆర్యసమాజ్ ప్రబోధములకు ముస్లింలు అసూయాగ్రస్తు లయ్యేవారు. రానురాను ప్రతిఘటన, హింసాకాండ వరకు వచ్చినవి. అచ్చటచ్చట విరివిగా కొట్లాటలు జరుగుతూ వచ్చెను. ఆర్య సమాజము కూడా బలపడుచుండెను. రెండవ పక్షమున యిత్తెహాదుల్ ముస్లిమీన్ పేరుతో బహదురుయార్‌జంగ్ గారు ఒక ఉద్యమమును నడుపుచుండిరి. హిందూ ముస్లింల మధ్య భేదభావములు అధికమగుచుండెను. హైద్రాబాదు రాష్ట్రమున కూడా చిరకాలము నుండియు అచ్చటచ్చట నైతికముగా గణపతీ నవరాత్రములు జరుగుచుండెడివి. వాటిని ఆధునిక కార్యకర్తలు కొంచెము లౌక్యస్వరూపమిచ్చి, భజనలు, ఉపన్యాసములు కూడ చేయుచూ ఆఖరు రోజున

పెద్ద ఉత్సవముతో గణపతిని తీసికొని వెళ్ళి తటాకమున విసర్జించి వచ్చేవారు. హనుమకొండలో సెటిల్‌మెట్ ఆఫీసులో పనిచేయు మహారాష్ట్ర ఉద్యోగస్థులు గణపతి నవరాత్రులు వైభవముగా చేయుచుండెడివారు. అది వైదికముగా జరిగినంత వరకు ముస్లింలకు ఆందోళన కలుగలేదు.

తరువాత విద్యార్థుల పక్షమున గణపతి నవరాత్రులు ప్రారంభించబడెను. కొన్ని సంవత్సరములు నా అధ్వర్యమున భాషానిలయమున గణపతి నవరాత్రులు జరిగినవి. నేను విద్యార్థులతో రోజు 1, 2 అధ్యాయముల చొప్పున భగవద్గీతా పోటీ పరీక్షలు పెట్టుచుండేవాడను. ఒకానొకప్పుడు పెద్దలవల్లకూడా వుపన్యాసములు యిప్పించు చుండెడివారము. ఒక పర్యాయము శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారిని పిలిపించి వారితో ఉపన్యాసము యిప్పించితిమి. తరువాత విద్యాధికులు ఒకచోటను, కార్మికులు యింకొకచోటను, వర్తకులు మరియొకచోటను గణపతిని స్థాపించి నవరాత్రులు చేయించి అందరిచే స్థాపింప బడిన గణపతి విగ్రహములను ఊరేగింపుల ద్వారా తటాకమునకు తీసికొని వెళ్ళేవారు. పురజనులు దాదాపు 1000 వరకు ఉత్సవములో పాల్గొనేవారు. ఈ వైభవములను ముస్లింలు సహించలేక పోయిరి. పురమధ్యమున అబ్దుల్ నబీషాః దర్గా ఉన్నది. ఊరేగింపులు, ఉత్సవములు దర్గా ముందర నుంచి వెళ్ళుచుండేవి. గాని కొంత దూరము వరకు చప్పుడు ఆపవలసి యుండేది. గాని ఉత్సవమును పోనీయమని 1342 ఫసలీలో ప్రతిఘటించిరి. అందుపైన మేము ప్రభుత్వ అనుజ్ఞ కొఱకు ప్రయత్నము చేయవలసి వచ్చెను. బహు ప్రయాసపైన ఆ రోజులలో దివానుగా పని చేయుచున్న మహారాజా సర్ కిషన్ ప్రసాదు బహద్దురుగారి అనుజ్ఞను పొంది ఊరేగింపుతో గణపతి ఉత్సవమును సాగించ గలిగితిమి. అప్పటి నుండియు యిరుపక్షములలో పట్టుదలలు పెరిగిపోయినవి. ఉత్సవములకు హైద్రాబాదు నియమములను బట్టి అనుజ్ఞ పొందవలయును. గనుక ముందుగానే దరఖాస్తు యిచ్చి అనుజ్ఞ పొందుచుండేవారము. హనుమకొండ ప్రముఖులు శ్రీ జమలాపురం గోపాలరావుగారు, ఆవంచ వెంకట్రావుగారు, పరచా రంగారావుగారు, డాక్టర్ రామమోహన్‌రావుగారు, కాళోజీ రామేశ్వరరావు, నారాయణరావు యిత్యాది పెద్దలును, యువకులును కలిసి కార్యవర్గ సంఘముగా యేర్పడి గణపతి నవరాత్రములు, పూజలు, ఉపన్యాసములతో జయప్రథముగా జరిపించు చుండేవారము. విసర్జన రోజున పెద్ద ఊరేగింపుతో 3, 4 పార్టీల వినాయకులను మేళ తాళములు, భజనలతో వందలాది జనముకూడి నడవగా ఊరేగింపు లష్కరుబజారు హనుమకొండ మధ్యరోడ్డుపైన భాను సముద్రముకు

వెళ్ళేవారము. హిందూ ముస్లిములలో భేదాభిప్రాయము లేర్పడిన పిమ్మట శాంతి భద్రతలకు పోలీసు బందోబస్తు ఏర్పాటయినది. ప్రత్యేక పోలీసు దళములు, ఒక హిందూ ఇన్‌స్పెక్టరు, ఒక ముస్లిం ఇన్‌స్పెక్టరు తుదకు ఒకసారి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పోలీస్ ఉత్సవము రోజున వచ్చేవారు. డిస్ట్రిక్టు మేజస్ట్రేటు గారు ప్రత్యేకముగా పోలీస్ స్టేషన్‌లో అవసరమైనప్పుడు ఫైరు ఆర్డరు యిచ్చుటకు సిద్ధముగా నుండేవారు. కలెక్టరు, సుబేదారు కూడా ఉత్సవములో నుండేవారు. ఈ ఉత్సవమును ఉత్సాహవంతులగు యువకుల చేతులలో పెట్టక వయోవృద్ధుల మగు మేము ఉత్సవములో పాల్గొని ప్రశాంతముగా కొనసాగించేవారము. ఇది రాను రాను తీవ్రదశకు వచ్చినది. అయినను మేముకూడా ప్రభుత్వ ఆజ్ఞలను, మసీదు నియమములను పాటించి శాంతితో ఉత్సవమును తీసికొని వెళ్ళుచుండే వారము. మొత్తంమీద యీ విధంగా 7, 8 సంవత్సరములు హనుమకొండలో వేలాది జనులతో కూడిన గణపతి ఉత్సవము అహింసావాదులు విద్యాధికుల పర్యవేక్షణలో జరుపబడుటయు, పెద్దలయెడ ప్రభుత్వాధికారులకు విశ్వాసముండుట తటస్థించుచు వచ్చినది. గనుక దౌర్జన్యములకు ఏ పార్టీకినీ అవకాశము లభించక ప్రశాంతముగా ఉత్సవము జరుపబడినది.

## వరంగల్ గణపతి ఉత్సవములు

దేవి నవరాత్రముల వలెనే గణపతి నవరాత్రులు జరుపుట పాత సాంప్రదాయమే. హనుమకొండలో వలెనే వరంగల్లులో కూడా 1334వ ఫసలీ నుండి గణపతి నవరాత్రములు జరుపుచుండేవారు. గణపతి పలు స్థలములలో స్థాపింప బడుచుండెను. తుదకు 1344వ ఫసలీ నుండి గణపతి స్థాపన శ్రీ రామలింగేశ్వర దేవాలయమున జరుపబడుచుండెను. బజార్ యింతెసార్‌గంజులో నూతనముగా మసీదు నిర్మాణము చేయించుటయు దాని ముందర నుండి మేళ తాళములతో ఊరేగింపులు, ఉత్సవములు పోవచ్చునని 1326 ఫసలీలో ఫర్మాన్ (రాజాజ్ఞ) జారీ కాబడుటయు పైన వ్రాసియున్నాను. అప్పటినుండియు అన్ని ఉత్సవములు నిరాటంకముగా పోవుచునే యుండెను. అట్లే గజానోత్సవము కూడ ప్రతి సంవత్సరము సాగిపోవుచునే యుండెను. హనుమకొండలో అదికారవర్గము, విద్యాధికులు, వకీళ్ళు ఉండి నియమానుసారము పోలీసు రక్షణతో అతివైభవముగా ఉత్సవము సాగించబడుచుండెను. అందువలన ముస్లింలకు మనోరథసిద్ధి కలుగకపోయెను. అసూయాగ్రస్తులగు ముస్లిములు వరంగల్ ఉత్సవము ఆపుటకు ఏర్పాటు చేసికొని యుండవచ్చును. 1348వ ఫసలీలో కూడా నియమానుసారము

ఊరేగింపుకు అనుజ్ఞపొంది రథముపైన గణపతిని వేంచేపుచేసి 26-9-1939 సంవత్సరం సాయంత్రం శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయము నుండి (గల్లీలో నుంచి) రథము తాళ మేళములతో బయలుదేరతీసి నిరాయుధులగు వేలాది హిందువులు పరివేష్ఠించి యుండిరి. ఊరేగింపువేళకు కొందరు ముస్లింలు యింతెసార్ గంజు మసీదులో చేరి స్టేషనురోడ్డు మార్గమున ఊరేగింపు వెళ్ళగూడ దనిరి. హిందువులు పర్మాన్ ప్రకారం యెప్పటివలె ఊరేగింపులో వెళ్ళెదమనిరి.

ఆ సమయమున కొందఱు ముస్లిం గుండాలు కత్తులు కఱ్ఱలు చేతబట్టుకొని ఊరేగింపులో నున్న జనముపైబడి కత్తులు, కఱ్ఱలు విసిరి కొందరిని కత్తులతో గాయపరిచిరి. ఆ ఊరేగింపులో తహశీల్దారు కొందరు పోలీసులు కూడా వుండిరి. వారు మతాభిమానముతోనో కర్తవ్యమును మరిచియో దౌర్జన్యమును ఆపలేకపోయిరి. తుదకు హిందువులు చెల్లాచెదరై ప్రాణములను దక్కించుకొని వెడలిపోయి స్వస్థానములకు చేరిరి. గణపతి వేంచేసియున్న రథము శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయము ముందర గల్లీలో నిలిపి యుంచమని స్థానికాదులు ఏర్పాటు చేసిరి. అదేవిధము రథము నిలచిపోయెను.

విఘ్నేశ్వరోత్సవమునకు పైవిధముగ విఘ్నములు తటస్థించి విఘ్నేశ్వరుడు కాలమునకు నిరీక్షించుచు రథముపైననే నిలచియుండెను. ఆరాధకులు నైవేద్య దీపారాధనలు అచ్చట యిచ్చుచుండేవారు.

మరురోజునుండి గాయపడిన వారితరపు నుంచి పోలీసులో దరఖాస్తు యిప్పించితిని. తరువాత ఉత్సవమును తీయుంచుటకు తాలుక్దారువద్ద వకాలత్‌నామా దాఖల్‌చేసి పనిచేసితిమి. కాని వారు కాలము గడుపుచుండిరి. భయభ్రాంతిలో నున్న వరంగల్ పురజనులకు ప్రతిరోజు వెళ్ళి ధైర్యము చెప్పు చుంటిని. స్థానికాధికారుల వలన ఎట్టి సాయమును లభించియుండలేదు. తరువాత కొందరు వరంగల్ పురవాసులు హైద్రాబాదు వెళ్ళి దరఖాస్తులు యిచ్చిరి. దానిపైన 5-10-1939 తేదీరోజున ఇన్‌స్పెక్టర్ జనరల్ పోలీసు ఆరమ్సు స్ట్రాంగు గారు వరంగల్ వచ్చి తాలూక్దారు కచేరీలో ఒక సమావేశము నేర్పాటుచేసిరి. ఆ సమావేశ ములో మేము హిందువుల పక్షమున ఉత్సవమును యధాప్రకారము మసీదు, పోలీసుస్టేషన్ ప్రక్కరోడ్డు పైనుండి తీసికొని పోయెదమని చెప్పితిమి. మరియు ఫర్మాను విషయమును గూడా జ్ఞాపకము చేసితిమి. ముస్లింలు మసీదు ముందరగా గణపతి ఉత్సవములు వెళ్ళుటకు వీలులేదని, మా మత సిద్ధాంతమునకు విరుద్ధ మని చెప్పిరి. ముస్లింల పక్షమున ఫజల్‌హుస్సేను గారును, హిందువుల పక్షమున

నేను ఆయన ఎదుట వాదించితిమి. ఉత్సవము ఫర్మాను అనుసరించియే వుండును గనుక నేను ఊరేగింపు తీయించెదనని ఇన్‌స్పెక్టరు జనరల్‌గారు పోలీసు సిబ్బందితో గణపతి రధమున్న చోటికి వెళ్ళిరి. ఊరేగింపు సన్నాహములు చేయబడెను. వేలాది జనులు గుమికూడిరి. అప్పుడు నా కాళ్ళపైన గడ్డలుండుటచే నేను గుంపులోనికి పోక సమీపమున నున్న ఆకారపువారి బంగళాపైన కూర్చొని చూచు చుంటిని. ఆ ప్రదేశము పైనకూడ విద్యార్థికులగు ముస్లింలు అడ్డుపెట్టిరి. ఇన్‌స్పెక్టర్ జనరల్ పోలీసుగారు దానిని మన్నించలేదు. ఇంతలో ఫజల్ హుసేన్‌గారు ప్రధానమంత్రికి టెలిఫోను ద్వారా ఏవో సంగతులు తెలుపుటయు అప్పుడు ప్రధానమంత్రిగా నున్న అఖైల్‌జంగ్ బహుద్దురు ఆపుదల ఆర్డరు టెలిఫోన్ ద్వారా ఇన్‌స్పెక్టర్ జనరల్ పోలీసుకు తెలుపుటయు జరిగెను. చేయునదిలేక ఐ.జి.పి. తిరిగి పోవలసి వచ్చెను. గణపతి దేవుని రధము యథాస్థానములోనే నిలచిపోయెను. ఐనను మా పైరవి ఆపబడలేదు. కలెక్టరు మొదలుకొని ప్రధాన మంత్రి వరకు ప్రజల పక్షమున వకీళ్ళ సహాయముతోను, స్వతఃగాను పైరవీ జరుగుచునే యుండెను. కాలవ్యాపనతప్ప కార్యసాధన జరుగలేదు. "ఇత్తెహాదుల్ ముస్లిమీన్" ఉద్యమము బలపడుచుండెను. తద్వారా హిందువుల యెడ ద్వేష భావము ప్రతీకారవాంఛ పెరిగి పోవుచుండెను. పై ఉదంతము వెంటనే మరియొక సంఘటన జరిగినది.

## దసరా ఉత్సవము

హనుమకొండలో విజయదశిమి రోజున సాంప్రదాయానుసారము అనేక వివిధ వర్గములవారు తమ ఉత్సాహములతో శమీపూజకు వెళ్ళుచుండేవారు. అందులో కార్మికుల పార్టీ, శిల్పులపార్టీ, హరిజనుల పార్టీ, బోయీలపార్టీ నూతన వస్త్రధారులై పాటలు, పద్యములతో పద్మాక్షి దేవాలయము వద్దకు వెళ్ళేవారు. హనుమకొండ గ్రంథాలయ కార్యకర్తలమైన మేము కూడా సాయంత్రం 4 గంటలకు ఒక పార్టీగా బయలుదేరి వెళ్ళుచుండేవారము. మరికొందరు విద్యార్థికులు కూడా వ్యక్తిగతముగా బయలుదేరి వెళ్ళుచుండేవారు. మోటారులు, టాంగాలు, జట్కాలపైన తమ పిల్లలను కూడా తీసికొని వచ్చేవారు. సైకిళ్ళుకూడా ఉంటూ ఉండేవి. 1348వ ఫసలీ అనగా ప్రమాది సంవత్సర విజయదశిమి రోజున యథాప్రకారం శమీ పూజకొఅకు ఈ పార్టీలు బయలుదేరినవి. ఆ సంవత్సరము మా తల్లిగారు కాలంచేసి యుండుటచే నాకు సంవత్సర సూతకము. కనుక శు భకార్యములకు వెళ్ళుట మానుకొని శ్రీ పరచా రంగారావుగారింటికి వచ్చితిని.

అచట ఆవంచవెంకట్రావుగారు, జమలాపురం గోపాలరావుగార్లు కూడ ఉండిరి. నా సహవాసమును విడవలేకనో, మరే కారణముననో శమీ పూజకు వెళ్ళుట మానుకొనిరి. నలుగురమును రాత్రి 8 గంటల వరకు మాట్లాడుతూ కూర్చుంటిమి.

హనుమకొండలో కొన్ని సంవత్సరముల నుండి హరిజనోద్యమము సాగు చుండెను. దానికి ఆంధ్రోద్యమ కార్యకర్తలము సహాయ సహకారములు చేయు చుంటిమి. పెసర వీరన్న అనే ఒక విద్యావంతుడు హరిజన నాయకుడు వుండెను. ఆయన ముస్లింల సలహాల వెంట పనిచేయు చుండేవాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ వారు హరిజనులను మతములో కలుపుకొనుటకు కూడా తమ విద్యుక్తముగా నెంచుకొనుచుండిరి. ద్రవ్య సహాయముచేసి చాలమందిని తమ మతములోనికి మార్పించుకొను చుండిరి. అదే వరుసలో పెసర వీరన్నను కూడా మతములోనికి మార్చుకొని ఆయనకు వీరసర్దార్అలీ అని పేరుపెట్టిరి. వారు ప్రేరేపణ కలిగించుకొని కలహము పుట్టించగోరి ఈ వీరసర్దార్ అలీని మరికొందరు మతము మార్చబడిన హరిజనులను ఆసఫ్జాహీ జండాను యిచ్చి దసరా ఉత్సవములోనికి పంపిరి. ఇట్లా వచ్చినవారిపైన రాళ్ళురువ్వి, ఆసఫ్జాహి జండాను చించివేసి అగౌరవ పర్చినారని వదంతి బయలుదేరదీసిరి. దీనిని గోరంతను కొండంతలు చేసి పోలీసువారు ఇన్వెస్టిగేషన్ ప్రారంభించిరి. కొందరు హనుమకొండ పురవాసు లపైన కేసు మోపబడెను. వారిలో శ్రీ కాళోజి రామేశ్వరరావు, తూము వరదరాజా గారు కూడా ఉండిరి. ఈ కేసు వరంగల్ మునిసిఫ్ మేజిస్ట్రేటు కోర్టులో పెట్టబడెను. విచారణ జరుగలేదు. కాని వాయిదాలు పడుచుండెను. గాని వరంగల్లో గణపతి ఉత్సవములో దెబ్బలు కొట్టిన ముస్లింలపైన కేసు పెట్టలేదు. అది పోలీసువారి వద్ద ఇన్వెస్టిగేషన్లో ఉంచబడెను. మేము చేయుచున్న ఆందోళనను బట్టి తాలూక్దారు డి.యస్.పి. గార్లు పోలీసు ఇన్వెస్టిగేషన్ ఫైలును నాకిచ్చి నా సంప్రదింపులతో చాలాన్ (చార్జిషీట్) తయారు చేయుమని సర్కిల్ ఇన్స్పెక్టరుకు ఆదేశమిచ్చిరి. నేనును, చక్రపాణిగారున్ను ఒకరోజు పోలీసుస్టేషనులో కూర్చొని రికార్డును పరిశీలించి నిందితులను సాక్షులను దస్తావేజులను నిర్దేషించితిమి. సర్కిల్ ఇన్స్పెక్టరు ఆ ప్రకారమే ముస్లింల పైన కూడ వరంగల్ మునిసిఫ్ మేజిస్ట్రేటు కోర్టులో చాలాన్ దాఖల్ చేసెను. ఈ రెండు కేసులు మునిసిఫ్ మేజిస్ట్రేటుగారి ఎదుట విచారణలో ఉండెను. వరంగల్లో ముస్లింల దుండగములు అధికారుల పక్షపాత వర్తనము పూర్తిగ తెలిసిపోయినది. ప్రభుత్వము యెడల కూడా కొంత నిరాశయే ఉద్భవించినది. ఈ కారణములచేత ప్రజలు తమ శక్తిపైననే ఆధారపడి యుండుట అవసరమని గ్రహించిరి. అందరమును ఆలోచించి వరంగల్లో

వర్తకసంఘమును మంచి పద్ధతులతో ఉంచుటము అవసరమని నిర్ణయించితిమి. దానికి నేను సక్రమ విధానముగల (constition) నియమావళి వ్రాసియిచ్చితిని. అందులో 8 శాఖలు ఏర్పాటుచేసి ప్రధాన కార్యదర్శిగాక ప్రతి శాఖకో కార్యదర్శియు ఉండవలెనని వ్రాసితిని. ఆ నియమావళి ప్రకారము ఆరోగ్యము, పారిశుద్ధ్యము, వర్తక వివాదములు, విద్య మొదలగు విషయములు సంఘ కర్తవ్యమునకు చేర్చి యుంచబడెను. ఆ సంఘమునకు నేనును, శ్రీ ఉదయరాజు రాజేశ్వరరావు గారును సలహాదారు (లీగల్ ఎడ్వయిజర్స్) ఏర్పాటు కాబడితిమి. మరియొక సలహాదారు డాక్టర్ టి.వి.ఎస్. మూర్తిగారు కూడ ఉండిరి. మధ్య మధ్య సమావేశములు జరుగుచుండెడివి. ఈ సంఘమునకు కొంత నిధికూడ నుండ వలెననియును, తద్వారా సంఘాభివృద్ధి కార్యములే కాక వ్యవహారపైరవీ ఖర్చులకును, విద్యావృద్ధికిని, ద్రవ్యము అవసరమని గ్రహించితిని. ఇందుకొఱకు సరుకులపైన ఏదేని ధర్మఖర్చు ఏర్పాటు చేయించవలెనని తీర్మానించబడెను. ఆ ప్రకారమే కొందరు వర్తకులు ఇట్టి ధర్మనిధిని ప్రోగుచేసి కార్యదర్శికి నిచ్చుచుండేవారు. అప్పుడు శ్రీ కొమరవెల్లి లింగన్నగారు ప్రధాన కార్యదర్శిగాను కొండూరు రామలింగం గారు అధ్యక్షుడుగాను ఎన్నుకొనబడిరి. విద్యాభివృద్ధి ప్రయత్నము నాపైన పెట్టుకొంటిని. ఏలననగా పాఠశాలలు ఏర్పాటుచేసి విద్యాభివృద్ధి చేయవలెనని ఆంధ్రోద్యమములో ప్రధానోద్దేశ్యముగా నుండెను. వర్తక సంఘము ద్వారా సంవత్సరానికి పదివేల రూపాయలు వసూలగు ననియును, దానితో ఒక హైస్కూలును ఏర్పాటు చేయవలె ననియును నాకు సంకల్పముండెను. దానిని నెరవేర్చుటకు నేను చేసిన ప్రయత్నమును వరంగల్ ఖాన్గీ పాఠశాలలు అనే శీర్షిక క్రింద వ్రాసితిని.

దాదాపు ఒక సంవత్సర కాలము గడచినది. గణపతి ఉత్సవమును గురించిన పైరవి ఫలితముగ అప్పుడు హెూంశాఖా మాత్యులుగా నియమింపబడిన అబ్దుల్ అజీజ్‌గారు 1349వ ఫసలీ గణపతి ఉత్సవము కొన్ని రోజులు ముందు వరంగల్‌కు వచ్చిరి. గణపతి రథమును చూచిరి. హిందూ మహమ్మదీయ కలహ ములను గురించి తమ విచారమును తెలిపిరి. ముస్లింలు తమ పట్టుదలను వీడక మసీదు ప్రక్కగా సేవ పోవుటకు వీలులేదని పట్టుపట్టిరి. అప్పుడు ఆయన హిందువులకే హితబోధ చేయుచుండెను. ఒకరోజున ఒంటిగంట వరకు మేమందరము అభోజనముగా ఉండవలసి వచ్చెను. ఏదో నిర్ణయమునకు రావలె నని మంత్రిగారు గట్టిగా పట్టుబట్టిరి. తుదకు లాభము లేదనుకొని హిందువులే లోబడిరి. మామూలు మార్గమును వదలి ఉత్తరదిశగా వెంకటేశ్వరస్వామి

ఆలయము వైపు ఉత్సవమును సాగించి మరల తూర్పువైపుకు తిరిగి మొకరంజాహీ రోడ్డు మీదకి వచ్చి చౌరస్తాలో నుంచి బీటుబజారులో గుండా కరీమాబాద్‌వైపు వెళ్ళుటకు ఏర్పాటు కాబడినది. ఇట్టి అవమానపూరితమగు సంధికి కాలమహిమ యని హిందువులు గుర్తించిరి. ముస్లిం రాజ్యము గనుక అనుకొన్నట్లు సాగినవని ముస్లింలు సంతోషించిరి. మునిసిఫ్ కోర్టు మేజిస్ట్రేటు కోర్టులో ఉన్న పైన వుదహరించిన రెండు కేసులను ఎత్తివేసికొనిరి. పైచెప్పిన విధమున పూర్వపు మార్గమును వదలి వక్రమార్గముగా గణపతి ఉత్సవములను పోలీసు చర్యవరకు జరుగుచూ వచ్చినవి. తరువాత పూర్వపు తీరిగనే మసీదు ప్రక్కగా ఉత్సవము సాగించ బడుచున్నది. ఎవరును కాలప్రభావ మెరగజాలరుగదా!

* * *

*ప్రకరణము - 11*

# వరంగల్ ఖాన్గీ పాఠశాలలు

గణపతి రథము ఆగిపోయిన సంగతియు తద్వారా వరంగల్ ప్రజలలో జాగ్రత్త, ఉత్తేజము కలిగించిన దనియున్నూ ఒక వర్తక సంఘము ఏర్పాటు చేయబడిన దనియునువ్రాసియున్నాను. నాకు వర్తక సంఘములో పలుకుబడి కలిగియుండుటచే ఎట్లాగైనను వరంగలులో ప్రజాయుత్తామగు ఆంధ్రోన్నత పాఠశాలను (ఆంధ్రహైస్కూలు) స్థాపించవలెనని కోర్కె దృఢమగుచుండెను. అందుకొఱకు నేను వర్తకులలో అభిరుచిని కలిగింప గలనని ప్రయత్నము చేసితిని. ఆ కాలమున ఖాన్గీ పాఠశాలలకు ప్రభుత్వాదర ముండెడిది కాదు. పైగా కొన్ని నిర్బంధము లుండెడివి. తేపతేపకు విద్యాశాఖాధికారులే కాక పోలీసువారు కూడా బెదరించు చుండిరి. ఒక విధము గ్రంథాలయములను, ఖాన్గీ పాఠశాలలను మతధార్మిక సంస్థలను ప్రభుత్వమువారు అనుమానముగా చూచేవారు. సాధారణముగా పై చెప్పిన సంస్థలు నడిపేవారికి విద్యాధికుల యొక్కయు ప్రభుత్వమున పలుకుబడిగల వారియొక్కయు సహాయ మవసరముండెడిది. ఇట్లున్నను విశాలమైన ఓరుగల్లు నగరమున ఎన్నియో ప్రాథమిక, ఖాన్గీ పాఠశాలలున్నవని తెలిసికొంటిని. వాటిని గురించి కొంత గ్రంధము తయారుచేసి ఆంధ్రోద్యమమున ఒక శాఖగా ఉంచి ఒక కార్యకర్త పర్యవేక్షణలో వాటిని సక్రమ పద్ధతులతో నడిపించ వలెనని ఊహించితిని. విద్యా శాఖాదికారుల సహకారము సంపాదించి కొంత గ్రాంటు యిప్పించుటకు కూడా సాధ్యమని తలంచితిని. నేనా ప్రయత్నమును కొనసాగించుటకు కొన్ని రోజుల వరకు వీధివీధులలో నున్న ఈ క్రింద

నుదహరించిన పాఠశాలలను దర్శించితిని. నెం.32 పద్మశాలి సేవాసంఘ ధర్మశాలకు వెళ్ళినప్పుడు కార్యకర్తలు ఆర్యసమాజమునకు చెందిన వారగుటచే వారు సంధ్యావందనము హెూమము చేయు మొదలగు మంత్రములు నేర్చుకొని యుండిరి. కనుక నన్ను వేదమంత్రములతో ఆశీర్వదించిరి. నేను బ్రాహ్మణుడను వారు బ్రాహ్మణేతరులు. వేదమంత్రములచే ఆశీర్వదించుట తప్పనుకుంటిని. వెంటనే వారు అత్యుత్తమమైన పనిచేసినారని వివేకము తెచ్చుకొని ఆనందించితిని. ఈ విధముగా రెండు సంవత్సరములు పాఠశాలను చూచి సంగ్రహ చరిత్రను వ్రాసుకొంటిని. వీటిలో 12 పాఠశాలలకు మాత్రమే స్వల్పగ్రాంటు ఉండెడిది. 3వ తరగతికి పైన చెప్పకూడదని కూడా నిషేధము.

## వరంగల్ ఖాన్గీ పాఠశాలలు

## విక్రమ సంవత్సరం 1350 ఫసలీ.

| | | | |
|---|---|---|---|
| 1. మోటుపల్లి కృష్ణమాచార్యుల | | | |
| గోరక్షణ స్కూలు | రామన్నపేట | 70 | 16సం. |
| 2. ప్రతాపురం రాఘవాచారి | | | |
| గోరక్షణ పాఠశాల | రామన్నపేట | 80 | 14సం. |
| 3. ప్రతాపురం రామానుజాచార్యుల పాఠశాల | మట్టెవాడ | 106 | 0సం. |
| 4. ప్రతాప నరసింహచార్యుల పాఠశాల | మట్టెవాడ | 50 | 20సం. |
| 5. ప్రతాప నరసింహచార్యుల పాఠశాల | మట్టెవాడ | 40 | 20సం. |
| 6. తీగెల రాజన్న పాఠశాల | యల్లమ్మబజార్ | 40 | 3సం. |
| 7. మట్టి రామయ్య పాఠశాల | బొమ్మలకుంట | 35 | 5సం. |
| 8. సుల్తాన్‌గోరి పాఠశాల | | | |
| మెట్‌పల్లిశ్రీనివాసాచార్య | గిర్మాజిపేట | 40 | 16సం. |
| 9. డింగరి రామానుజాచార్యుల | | | |
| గోపాల పాఠశాల | గిర్మాజిపేట | 55 | 18 సం. |
| 10. కూర్మాచలం నరసయ్య పాఠశాల | | | |
| కరోడ్గిరి–మహసుల్ఖానావద్ద | | 40 | 12సం. |
| 11. వీరయోగుల నారాయణ పాఠశాల | గోవిందనగరం | 60 | 20సం. |

| | | | |
|---|---|---|---|
| 12. నాదముని రామయ్య పాఠశాలు | | | |
| లక్ష్మీపురం–గిర్మాజిపేట | | 50 | 6సం. |
| 13. జె.బుగులయ్య పాఠశాల | గిర్మాజిపేట | 40 | 4 సం. |
| 14. జగన్నాధం లక్ష్మయ్య పాఠశాల | లక్ష్మీపురం | 48 | 25సం. |
| 15. రేపెల్ల శ్రీనివాసరావు | | | |
| శారదా వినోదిని పాఠశాల | బషీర్‌గంజ్ | 15 | 3సం. |
| 16. టి. రాఘవయ్య | | | |
| ఉస్మానియా ప్రైవేట్ స్కూల్ | రైల్వేగేటు | 24 | 4సం. |
| 17. నూతి లక్ష్మయ్య పాఠశాల | మట్టెవాడ | 6వ | 4సం. |
| 18. డౌలాకర్ శంకర్‌రావు | | | |
| ఉస్మానియా మిడిల్ స్కూల్ | గిర్మాజిపేట | 30 | 3సం. |
| 19. కొరుపూరు జగన్నాధం | | | |
| జయభారతి పాఠశాల | రామన్నపేట | 50 | |
| 20. మచ్చూరి బుచ్చయ్య పాఠశాల | | | |
| గుండంవద్ద – రామన్నపేట | | 30 | 1సం. |
| 21. సంస్కృతాంధ్ర కళాశాల | | | |
| రామలింగేశ్వర దేవాలయం | | 30 | 15సం. |
| 22. బి. కృష్ణమాచారి | | | |
| అల్తాపియా మిడిల్‌స్కూల్ | ములుగురేంజి | 87 | 22సం. |
| 23. వరయోగుల రామయ్య పాఠశాల | మట్టెవాడ | 40 | 24 సం. |
| 24. నాదముని అయోధ్యరామయ్యపాఠశాల | మట్టెవాడ | 15 | 2సం. |
| 25. యన్. నరసయ్య పాఠశాల | మట్టెవాడ | 65 | 1సం. |
| 26. యాదగిరీశాంధ్రపాఠశాల | | | |
| నూతి రామకృష్ణయ్య | యల్లమ్మబజార్ | 40 | 12సం. |
| 27. కటుకూరి లక్ష్మయ్య పాఠశాల | గేటుక్రింద | 60 | 15సం. |
| 28. సీతారామస్వామి | | | |
| ఆంధ్రభాషాభివర్ధని పాఠశాల | యల్లమ్మబజార్ | 40 | 12సం. |

| | | | |
|---|---|---|---|
| 29. మోటుపల్లి వెంకటనరసింహచార్యుల పాఠశాల | ఉరుసుజాగీరు | 50 | 20సం. |
| 30. మోటుపల్లి వెంకటరామానుజాచారి పాఠశాల | గిర్మాజీపేట | 55 | 25సం. |
| 31. ప్రతాపురం కృష్ణమాచార్యుల శ్రీరంగనాధ పాఠశాల | కరీమాబాద్ | 80 | 40సం. |
| 32. పరిమళ వీరకనకయ్య పద్మశాలి సేవాసంఘ ధర్మపాఠశాల | కరీమాబాద్ | 70 | 5సం. |
| 33. కూరభోయిన వీరన్న శ్రీరామాంజనేయ పాఠశాల(పు. 30+స్త్రీలు15) | కరీమాబాద్ | 45 | 1సం. |
| 34. వరయోగుల లక్ష్మయ్య పాఠశాల | తెలగవాడఉరుసు | 50 | 33సం. |
| 35. నాతి బుచ్చన్న పాఠశాల | అలియాబాదు | 80 | 25సం. |
| 36. తిరునరహరి లక్ష్మయ్య రంగనాథస్వామి పాఠశాల | కాశిబుగ్గ | 30 | 3సం. |

## హనుమకొండ ఖాస్గీ పాఠశాలలు

| | | |
|---|---|---|
| 37. ఆకుల పురుషోత్తం పాఠశాల | రాగన్నదర్వాజ | 12 |
| 38. జానకిరామయ్య రాధస్వామి పాఠశాల | రాగన్నదర్వాజ | 10 |
| 39. కేశయ్య పాఠశాల | కుమారపల్లి | 50 |
| 40. వెంకటప్పయ్య పాఠశాల | మార్కెట్‌బజార్ | 35 |
| 41. పాపయ్య పాఠశాల | లష్కర్‌బజార్ | 45 |
| 42. నరసయ్య పాఠశాల | కొతూరు | 14 |
| 43. శ్రీరామనరసయ్య పాఠశాల | పైఖగారాన్ బజార్ | 10 |
| 44. బుచ్చన్న పాఠశాల | గుండంబజార్ | 15 |

పైన ఉదహరించిన పాఠశాలల సంగ్రహ చరిత్ర సంపాదించితిని. 44 పాఠశాలలో 1985 విద్యార్థులు విద్య నభ్యసించు చుండిరి. వీటికి వర్తక సంఘమున ఆదరణ కల్పించి ప్రోత్సాహమిచ్చుట ప్రథమ కర్తవ్యమనుకొంటిని. ఇట్టి పరస్పర సంబంధము కలిగిన తరువాత వర్తక సంఘము పక్షమున శ్రీ జమలాపురం గోపాలరావుగారిని ఇన్‌స్పెక్టరుగా నియమించి ఆయన సలహావెంట

క్రమబద్ధముగా నడిపించుచు ఆంధ్ర హైస్కూలును స్థాపించ వలెనని నాకు సంకల్ప ముండెను. 1349 ఫసలీ దేవీనవ రాత్రములలో వారంరోజులు ప్రతి దినము సాయంత్రము 3 గంటలవేళకు 300 మంది విద్యార్థులుగల కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు రామలింగేశ్వరస్వామి దేవాలయమునకు వచ్చునట్లును విద్యార్థులను వరుసగా కూర్చుండబెట్టి ఆయా తరగతులనుబట్టి ప్రశ్నలు వేసి వుత్తరములు గైకొనుచు విద్యార్థులకు బలపములు, పెన్సిళ్లు, కాపిబుక్కులు యిచ్చుటయు ఒక్కొక్క పాఠశాల ఉపాధ్యాయునకు ఒక ఖద్దరు ధోవతులచాపు యిచ్చుటయు ఒక మణుగు మిఠాయి తట్టపుచ్చుకొని గేటువద్ద ఉండి విద్యార్థులకు పంచి పెట్టుటయు చేయించితిమి. వర్తక ప్రముఖులు ఆకారపు నరసింగం, కొండూరు రామలింగం, సిద్దంశెట్టి లింగయ్య, కొమరవెల్లి కాశయ్య, బొల్లం లింగయ్య, చందా కాంతయ్య, కొనరవెల్లి లింగన్నకార్లు ఉత్సాహముతో ఈ వేడుకలో పాల్గొని బహుమతులు పంచిపెట్టేవారు. వర్తక సంఘము నుండి సంవత్సరానికి రు. 300/- ఖర్చు పెట్టుచుండేవారు. ఈ విధముగా రెండు సంవత్సరములు దసరా విద్యా ప్రదర్శనములు జరిగెను. హైస్కూలు స్థాపన సంకల్పమును గురించి మధ్యమధ్య సంప్రదించు చుండేవాడను. ఒకరోజు శ్రీ చందా కాంతయ్యగారు తన కాళ్ళపై నిలచి ఉద్యోగిగాను, బ్రోకరుగాను కొంత కాలము గడిపి అప్పుడప్పుడే కమీషన్ దుకాణమును స్థాపించుకొనెను. ఆయన నాతో నేను 10,000 రూపాయిల నిచ్చెదను. హైస్కూలు స్థాపించుమని చెప్పెను. నేను ఆనందభరితుడనైతిని. నేను ఆయనకు కృతజ్ఞత తెలిపితిని. పదివేల మూలధనముతో హైస్కూలు నడవజాలదని నాకు భయము ఉన్నది. ఈ విషయమును ధనికులగు వర్తక ప్రముఖులకు చెప్పితిని. కొందరు నమ్మజాలక పోయిరి. కొందరు హేళన చేసిరి. కొందరు వచ్చినదానిని పోనీయక తీసికొమ్మని సలహా యిచ్చిరి. వక్రమార్గము నా కిష్టములేదు. కాబట్టి హనుమకొండ వరంగల్లు లోని విద్యాధికులను వర్తకులను ఆహ్వానించి ఒక సభచేసి ఈ విషయమును నివేదించితిని. శ్రీ రాజలింగంగారు మాట్లాడుచు రామకోటేశ్వరరావుగారు వరంగలులోని షుమారు 40 పాఠశాలలను పరిశీలించి ఉపాధ్యాయులను విద్యార్థులను సమీకరించి యున్నారు. వారు వర్తక సంఘముచే నియమింపబడిన ఒక కేంద్ర సమితిని ఏర్పాటుచేసి సలహా సహకారములు చేయుచు ఒక హైస్కూలు గూడా స్థాపించ వలెనని సంకల్పించి యున్నారు. ప్రస్తుతం నేను మద్దాలి అనంత రావుగారు నడపుచున్న బాలికా పాఠశాలను ఈ సమితి తమ అధ్వర్యమునకు తీసికొని హైస్కూలుగా పెంపొందించుట మంచిదంటిని. శ్రీ పరచ రంగారావుగారు

మాట్లాడుచు సంకల్పము మంచిదేగాని ఆంధ్రమహాసభ కార్యభారము రామకోటే శ్వరరావుగారి మీదనే ఉన్నదిగనుక ఈ సమితికి తగిన అధ్యక్షుడు కార్యదర్శి ఒకరు ఉంటె మంచిదని చెప్పిరి. బహుశః ఈ సమావేశము ధర్మవరం మహాసభకు కొలది నెలలకు పూర్వమే జరిగి యుండవచ్చునని జ్ఞాపకము. సభలోని ఒకరిద్దరు వర్తకులు కూడా కొన్ని సంకోచములను తెలిపిరి. అంతట శ్రీ ఆకారపు నరసింగం గారు సభను ఆపి వాయిదా వేయుట మంచిదని చెప్పినందున ఏ నిర్ణయము చేయజాలక ఆ సభను ఆపివేసితిమి. నా మనసుకు చాలా కష్టము కలిగెను. సభానంతరము నేను శ్రీ జయలక్ష్మి నారాయణగారును శ్రీ కొండూరు రామలింగం గారింటికి వెళ్ళితిమి. నేనాయనతో మీరు శ్రద్ధతీసుకొని హైస్కూలు స్థాపనా కార్యమును నెగ్గించవలెనని కోరితిని. ఆ కాలమున రెండు పార్టీల మధ్యన వివాదములో నున్న ఒక సినిమా రామలింగంగారి అధ్వర్యమున నుండెను. అందువలన రామలింగంగారు ఆ సినిమాను మన సంస్థ పక్షమున కంట్రాక్టు తీసుకొని నడిపించినట్లయిన కొంత లాభము రాగలదనియును, ఆ లాభముతో హైస్కూలు నడుప వచ్చుననియును సలహానిచ్చిరి. అప్పుడే నా వద్ద నున్న ఒక పుస్తకములో హైస్కూలుకు ఆంధ్ర విద్యాభివృద్ధి హైస్కూలని నామకరణము చేసి ఆయనచేత కొంత చందా వేయించితిని. కొంతకాలము జరిగినను వర్తక ప్రముఖుల సహకారము లభించి యుండలేదు. చందా కాంతయ్యగారు వాగ్దానము చేసిన 10వేల రూపాయలతో భవన నిర్మాణమునకు స్థలము కొనవలెనని నేనును రాజేశ్వరరావుగారును కలెక్టరుగారితో సంప్రదించితిమి. ఆ పనికూడ నెరవేరలేదు. కాబట్టి హైస్కూలు స్థాపించలేకపోతిని. శ్రీ చందా కాంతయ్యగారు మధ్యమధ్య నాతో కలిసి నేనిచ్చే 10,000 రూపాయిలు మీరు తీసుకొనలేదు. నేను బీదవాడను నావద్ద డబ్బుండనేరదు. త్వరపడండని హెచ్చరించు చుండెను. మరికొంత కాలమునకు ఒకరోజు రాత్రి శ్రీ చందా కాంతమ్మ, తాంద్ర వెంకట్రామనర్సయ్య, బెల్దె ముకుందయ్య, ఖమ్మంపాటి రామనాథం గార్లు నా వద్దకువచ్చి మీ వద్ద ముదిగొండ నందయ్యగారి దొడ్డి విషయములో జరుగుచున్న వ్యాజ్యమున్నది. మీరు ప్రతివాదుల తరపున వకీలుగా నున్నారు. నేను ఆ స్థలమును పాఠశాల కొరకు 30,000 రూపాయిలకు బేరము చేసినాను. ప్రతివాదులకు 25,000లు ఇచ్చినట్టును వాదితో సంధి చేసుకొనుటకు రు. 5000/–లు అడ్వాన్సు ఉంచి నట్లును మాట్లాడినాను. వ్యాజ్యములో మీ పార్టీలు గెలవగలరా అని చందా కాంతయ్య గారు ప్రశ్నించిరి. వాస్తవములో చాల లోతు సమస్య. జయాపజయ ములు దైవాధీనములు. వ్యాజ్యము గెలుచునని పార్టీలకు చెప్పుట మా పాలసీకి

విరుద్ధమ అయినను ధర్మకార్యము గనుక నా పార్టీలకు జయము కలుగవచ్చునని చెప్పితిని. వారు క్రయ దస్తావేజు మసవిదా వ్రాయుమని కోరిరి. పాఠశాల సంస్థకు నామరూపములులేవు చట్టబద్ధము కాలేదు. ఇట్టి స్థితిలో దస్తావేజులు ఎవరిపేర వ్రాయవలెనను సమస్యకూడా ఎదుర్కొనెను. "ధర్మాన, త్వరితాగతిః" అను ఆర్యోక్తి ననుసరించి నామకరణం చేయ నిశ్చయించుకొంటిని. భగత్ప్రేరణగా ఆంధ్ర విద్యాభివర్ధిని హైస్కూలు వరంగల్ అని సంస్థకు పేరుపెట్టి ఆ సంస్థకు స్థలం నా క్లయింటు ముదిగొండ రామలింగయ్య వగైరాలు 30,000లకు విక్రయించినట్లును పాఠశాల ట్రస్టీ అయిన చందా కాంతయ్యగారి వల్ల క్రయధనములు పొంది, ఆస్తి వారి స్వాధీన పరచినట్లున్నూ క్రయ దస్తావేజు మసవిద వ్రాసియిచ్చితిని. తరువాత నాల్గు మూడు రోజులలో పై విధముకూ దస్తావేజు రిజిస్టరు కాబడినది. దాని తరువాత చందా కాంతయ్యగారు ముదిగొండ విశ్వనాధయ్యగారికి ప్రతిఫలమునిచ్చి కోర్టులో రాజీనామా దాఖలు చేయించెను. ఈ విధముగా సంస్థకు నామకరణ చేయు భాగ్యము నాకు లభించినది. అటు తర్వాత విద్యాదాత చందా కాంతయ్యగారు ఇంతమాత్రముతో హైస్కూలు స్థాపన కాజాలదని గ్రహించి పైదానిని కలుకొని రు. 1,00,000 రూపాయిలు భర్తీకి భూవిరాళ మిచ్చెదనని వాగ్దానము చేసెను. ఒక పాలకవర్గ సమితికూడ స్థాపించబడినది. దానికి ఉదయరాజు రాజేశ్వరావుగారు అధ్య6అడుగాను, నేనును, తాంద్ర వెంకట్రామనర్సయ్య గారును మరికొందరును పాలకవర్గ సభ్యులుగాను శ్రీ ఎం.ఎస్. రాజలింగంగారు కార్యదర్శిగాను నియమించబడితిమి. వెంటనే చందా కాంతయ్యగారు బ్యాంకు చెక్కు వ్రాసి రాజేశ్వరరావుగారికిచ్చిరి. బ్యాంకులో ఖాతా ఆంధ్ర విద్యాభివర్ధినీ సంఘాధ్యక్షుడు రాజేశ్వరరావుగారి పేర బెట్టబడినది. ఈ సంస్థకు నియమావళి తయారు చేయుటకును, సంస్థను రిజిష్టరు చేయించుట కును, ప్రభుత్వానుమతి పొందుటకును సర్వవిధముల మా మిత్రుడు స్వర్గీయ నాగులపల్లి కోదండ రామారావు అడ్వకేటుగారు సర్వవిధముల తోడ్పడిరి. వారి ప్రయత్నము వలన అప్పుడు విద్యామంత్రిగా నున్న శ్రీ ఆజంగారు వచ్చి ప్రారంభోత్సవము జరిపిరి. ఈ వార్త నిజాం ప్రభుగారికి తెలియవచ్చెను. వరంగలులో శ్రీ చందా కాంతయ్యా వంటి దాతలు విద్యాభిమానులున్నందుకు నిజాం ప్రభువు సంతోషము వెలిబుచ్చెను. ఆంధ్ర విద్యాభివర్ధిని పాఠశాల దినదినాభివృద్ధి గాంచుచున్నందుకు సంతోషించాను. అది శాశ్వితముగా వృద్ధి పొందవలెనని కోరుచున్నాను.

వరంగలులోని షుమారు 45 పాఠశాలలో 2000 మంది విద్యార్థులు విద్యనభ్యసించుచున్న విషయము ధర్మవరము నవమాంధ్ర మహాసభలో నా అధ్యక్షో పన్యాసమునను శ్రీ చందా కాంతయ్యగారి మహాధనముచే ఆంధ్ర విద్యాభివర్ధిని పాఠశాల స్థాపింపనున్న విషయమై మడికొండ పన్నెండవ ఆంధ్ర మహాసభలోనా స్వాగతోపన్యాసములోను ప్రకటించి యున్నాను. ఇప్పుడు వరంగలు నందును ఇతర స్థలములలోను ఖాన్గీ పాఠశాలలును, కళాశాలలును స్థాపించబడి, ప్రభుత్వాధీనముచే నడిపింపబడుచున్నవి. ఆకాలమున ఖమ్మంలో ఒక ప్రజాయత్త బాలికా పాఠశాలను శ్రీ వేముగంటి రామకృష్ణారావు, పరచా శ్రీనివాసరావు, కలవల రాజారాంగార్లు శ్రద్ధతో స్థాపించి నడుపుచుండేవారు. దాని పరిపాలనా విషయములో నా సలహాను తీసికొనుచుండేవారు. సభలకు నేనుకూడా వెళ్ళు చుండేవాడను. ఒక పర్యాయము లోకల్‌ఫండ్ శాఖ నుంచి ఖర్చు పెట్టుటకు రు. 500/–లు నాకిచ్చినందున దానిలో నుండి 200/–లు ఈ పాఠశాల కిప్పించితిని. తక్కిన 300 వరంగలు విద్యాసంస్థ కిప్పించితిని.

నా పరిశీలనానంతరము వరంగలులో శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో 50 మంది విద్యార్థులకును, సుశీలాదేవి ప్రాథమిక పాఠశాలలో 108 విద్యార్థులకును, అనంతలక్ష్మీ ఆయుర్వేద కళాశాలలో 128 మంది విద్యార్థులును సంస్కృత కళాశాలాను బంధముగాను నడుచుచున్న ఆయుర్వేద పాఠశాలలో 20మంది విద్యార్థులును విద్యనభ్యసించు చున్నారు. ఈ పాఠశాలలు విశ్వేశ్వరస్వామి దేవాలయావరణలో నడుచు చున్నవి. వీటిలో సేవసేయు భాగ్యము నాకు లభించు చున్నది. ప్రస్తుతము వరంగలులో యింకను ఖాన్గి పాఠశాల సంఖ్య యెక్కువగుటయే గాక ఆర్ట్సు కాలేజి, యింజనీరింగు కాలేజి, మెడికల్ కాలేజి, పాలిటెక్నికల్ కాలేజీలు స్థాపించబడి అభ్యుదయ తెలంగాణమున వరంగలు విద్యలో ప్రముఖ స్థానమునకు చెందుచున్నందుకు అందరమును సంతోషించ వలసిన విషయమని మనవి చేయుచున్నాను.

* * *

*ప్రకరణము - 12*

# ఆహారకమిటీ

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆహార సమస్య చాల క్లిష్టస్థితికి వచ్చిన సంగతి అందరు ఎరింగిన విషయమే. హైద్రాబాదు రాష్ట్రములో ప్రతి జిల్లాకును అనధికార సభ్యులలో కూడ ఆహార కమిటీలు ఏర్పాటు చేయబడినవి. హైద్రాబాదు రాష్ట్రములో వ్యవసాయకుల వద్ద లేని ధాన్యము, పర్చేస్ ధాన్యము వసూలుచేసి గోదాములలో నిలువ ఉంచి మిల్లులో మిల్లింగు చేయించి దుకాణములకు యిచ్చేవారు. దుకాణములలో ప్రజలకు రాతబ్ (మామూక) చీట్లద్వారా పంచి పెట్టించేవారు. ఇంతేగా బీదల కొరకు కొన్ని చౌక దుకాణములు ఏర్పాటు చేయబడినవి. కిరసనాయిలు, పంచదార, గోధుమలు, బియ్యం, జొన్నలు మొదలగు ఆహార ధాన్యములు, వస్త్రములు, ఇనుము వస్తువులను గురించి ఈ కమిటీలకు అధికారముండేది. ఇంతేగాక గ్రామీణ రైతులు తదితరులు, దుకాణదారులు, మిల్లు యజమానులు మొదలగు నిలువ సరుకుల యజమానులు నెల నెలకు స్టాకు రిపోర్టు పంపించే నియమములు కూడ ఉండేవి. దీనిని నడుపుటకు జిల్లా కమిటీలు పనిచేయు చుండెను. నన్ను అప్పటి జిల్లా కలెక్టరు జిల్లా కమిటీ సభ్యునిగా నియమించెను. 7, 8 సంవత్సరములు పనిచేసితిని. గోదాముకు మిల్లులకు వెళ్ళి తనిఖీ చేయుచు చుంటిమి. ఒకసారి ఒక మిల్లులో వాసనపట్టిన బియ్యంను చూచి సివిల్ సర్జన్‌తో పరిశీలింపజేసి దానిని దుకాణములకు యీయకూడదన నిషేధింప జేసితిని. లేవీని గురించి మొదట విచిత్రమైన ఉత్తరువులు జారి చేయబడినవి. ఒక యకరం నుండి 10

యకరములకు మెట్టుమెట్టుగా పెంచి తుదకు 10 ఎకరముల పట్టాదారు 70 మణుగుల ధాన్య మీయవలెనని ఉత్తరువులు జారీ కాబడెను. అప్పుడు మంత్రిగా నున్న శ్రీ గ్రీక్‌సన్ వరంగల్లుకు వచ్చెను. అప్పుడధికార వర్గము ఆహార సమితి అనధికార సభ్యులు, తదితర పెద్ద భూస్వాములు సభకు విచ్చేసిరి. నన్ను ప్రాతినిధ్యము వహించి అధికారేతర సభ్యుల పక్షమున మాట్లాడుటకు అవకాశ మిచ్చెను. విత్తనములు, నాటుకూళ్ళు, కలుపుకూళ్ళు, జీతగాళ్ళ కోతకూళ్ళు మొదలగు వాటిని ధాన్యరూపముగా ఇవ్వలసి ఉంటుందని అది మినహాపోగా మిగిలిన దానిలో సగము రైతులకు యిచ్చి సగము తీసుకొనవచ్చునని కూడ చెప్పితిని.

లెవీ నిబంధనలు న్యాయవిరుద్ధముగా నున్నవనిన్నీ చిన్నరైతు ఎంత పండించునో పెద్దరైతు అంత పండించలేడనిన్నీ భూ పరిమాణము పెరిగినంత మాత్రాన లెవీ స్కేలు పెంచకూడదని చెప్పితిని. మరియు 10 ఎకరములు మించిన పట్టాదారులు చాలామంది ఉంటారు. వారు 70 మణుగులు యిచ్చిన తరువాత మిగిలేది రైతు నిత్యావసరములకు జీవన జీవనమునకు చాలదని చెప్పితిని.

గ్రీక్సన్‌గారు నా మాట విని పని ఎట్లా సాగవలెనని ప్రశ్నించెను. నేను లెవీ యివ్వవలెనని చెప్పేవాడనే కాని వద్దని చెప్పేవాడినికాదు. కాని స్కేలు బాగాలేదని చెప్పితిని. అంతట వరంగల్ కలెక్టరు హబీబుద్దీన్ గారు నేనును కలిసి నివేదిక పంపవలెనని అధికార మిచ్చెను. అటు పిమ్మట నేను కలెక్టరు హబీబుద్దిన్, ఉదయరాజు రాజేశ్వరరావుగారు కలిసి చిన్న పెద్ద తారతమ్యము లేకుండా ఎకరానికి 3 మణుగుల చొప్పున లెవీ ఈయవలెననిన్నీ ఐచ్ఛికముగా 3 మణుగుల చొప్పున ప్రభుత్వమునకే అమ్ముకో వచ్చు ననియును నివేదికను పంపితిమి. ఆ ప్రకారం ప్రభుత్వము వారు అంగీకరించి అమలు చేయుటకు ఉత్తర్వునిచ్చిరి. అట్లే జరుగుచుండెను. వస్త్రముల కొరకును రేషన్ కార్డు యిచ్చుచుంటిమి. ఆ రోజులలో ప్రభుత్వము వారు వేరుశనగ మొదలగు నగదు ఆదాయము నిచ్చే పైర్లు వేయబడిన భూములపైన అపరాధములు కూడ విధించుచుండిరి. తరువాత 12వ ఆంధ్ర మహాసభకు శ్రీ మందుముల నర్సింగరావుగారు అధ్యక్షులైరి. వారును నేనును కరీంనగర్ జిల్లాలో పర్యటన జరిపి ప్రజా కష్టనిష్టురములగురించియు అవసరముల గురించి విచారించియు, తగు సలహాల నిచ్చియు కొన్ని విషయములను ప్రభుత్వమునకు నివేదించి ఆంధ్రోద్యమ ఉద్దేశములను నెరవేర్చుచుంటిమి. ఆ సందర్భములో సిరిసిల్ల తాలూకాలోని కొన్ని గ్రామముల

సంచార సందర్భమున ఉద్యోగస్థులు రైతుల వద్ద నుండి నిర్బంధముగా ఎకరానికి 6 మణుగుల చొప్పున (లేవీ పర్చేస్) వసూలు చేయుచుండిరనియు పంట మామూలు భూములలో 6, 7 మణుగులకన్న ఎక్కువ పండలేదనియు పైర్లను కూడా చూచి మేము తెలిసికుంటిమి. పర్యటన ముగించుకొని వరంగల్ వచ్చిన వెంటనే సుబేదారుగారిని కలిసితిమి. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధముగా బీద రైతుల నుండి తిండికి మిగలకుండా 6 మణుగుల చొప్పున గల్లా వసూలు చేయుచున్నారనియు నియమములకు వ్యతిరేకముగా నున్నంతవరకు కఠిన పద్ధతులను ఆపుచేయ వలసిన దనియు ఆపితిమి. సుబేదారుగారికి మా యందు నమ్మకమున్నది గనుక అధిక గల్లాను వసూలు చేయకూడదని ఉత్తర్వు జారీచేసిరి. ఆ రోజులలో సామాన్య శాసనములకు విరుద్ధముగా కంట్రోలు ఆర్డరులను తిరస్కరించివారనే నెపముపైన కేసులు పెట్టుచు ప్రజలకు శిక్షల నిచ్చుచుండేవారు. కంట్రోలు ఆర్డర్సు వల్ల సహజమైన ధర్మములు తారుమారగు చున్నవని ఒకప్పుడు అలహాబాదు హైకోర్టు జడ్జీగారు సెలివిచ్చి యున్నారు. అట్లే జరుగుచుండెను. అనగా 1) ఒక రైతు తన వద్దనున్న 10 మణుగులకు మించిన ధాన్యపు నిలువను చెప్పలేదని కొందరిపైనను 2) ఎక్కువ తక్కువయని కొందరిపైనను 3) స్టాకు రిపోర్టు తెలుగులో గాని ఉరుదులోగాని పంపించక గుజరాతి భాషలో పంపినారని కొందరి పైనను రేషన్ కన్న ఎక్కువ ఆహార పదార్థము లున్నావని కొందరి పైనను కేసులు పెట్టుచుండిరి. ఒకప్పుడు 12 మంది విద్యార్థులు హనుమకొండలో వంటచేసుకొని తినుటకై గ్రామం యింటి నుంచి బియ్యం తెచ్చుకొనుచున్నారని కేసులు పెట్టబడెను. ఒక వితంతువు భర్త శ్రార్థమునకై బియ్యము తెచ్చుకొనుచున్నదని కేసు పెట్టబడెను. ఇట్టి కేసులలో కొందరు రు.0-4-0, 0-8-0 స్వల్ప జుర్మానాలతో సరిపుచ్చుకునేవారు. కొందరు 1000 వరకు జుర్మానా ఖైదు శిక్ష కూడా యిచ్చేవారు. అధికారి దయాధర్మములపై ఆధారపడి యుండేది. వారికి హైకోర్టుగాని ప్రభుత్వముగాని సరియైన ఆదేశమును ఇవ్వకపోయిరి. నేను కొన్ని కేసులలో పని చేసి వారికి న్యాయమును కలుగచేయునటుల చేసితిని. అప్పుడప్పుడు ప్రభుత్వాధికారులతో చెప్పి కొన్ని సౌకర్యములను కలుగచేయుచుంటిని. ఒకప్పుడు అనగా 12వ ఆంధ్రమహాసభకు అనంతరము నేను శ్రీ మందుముల నర్సింగరావుగారు, కొండా వెంకటరంగారెడ్డిగారు, పరచ శ్రీనివాస రావుగారు ప్రభుత్వముతో మాట్లాడుటకు అవకాశమివ్వుమని కోరితిమి. అంతట ప్రధానమంత్రి నవాబు ఛత్తారి పజల్ నవాజ్ జంగ్, ల్యావేజి యింకొక మంత్రి సమావేశమై మా కవకాశమిచ్చిరి. ఈ అవకతవక ఆర్డర్లను, అమలును గురించి

కొన్ని గంటలసేపు మాట్లాడితిమి. ఆంధ్రోద్యమ తరపున నేనును, ప్రభుత్వ పక్షమున ఫజల్ నవాజ్ జంగ్ గారును సహృదయముతో మాట్లాడితిమి. ఫజల్ నవాజ్ జంగ్ గారు వరంగల్ డిప్యూటి కోఆపరేటివు రిజిస్ట్రారుగాను పనిచేయుట నేను వరంగల్ బ్యాంకు డైరెక్టరుగా పని చేసిందున మా ఉభయులకు చిరకాల పరిచయము ఉండెడిది. ఆయన చాలా సత్ప్రవర్తన గలవాడు. నిరాడంబరజీవి. సేవా శక్తిగలవాడైయుండెను. ఆయన సహకార శాఖలో రిజిస్ట్రారు వరకు ఉద్యోగములలో పని చేసేవాడు. బీదరైతుల యింఢ్ల వద్దకువెళ్ళేవాడు. ఒకప్పుడు ఆయన సేవను గ్రహించువారు లేరనవచ్చును. ఆయన మాటలు విన్న తరువాత కొన్ని విషయములను అంగీకరించి ఉత్తర్వులలో మార్పు చేయించెను. ఆ రోజులలో తెలివిగల ప్రజలుజన సంఖ్యను ఎక్కువగా చెప్పి ఎక్కువ రేషన్ కార్డులు సంపాదించు చుండేవారు. అధికారులు ఇతర ధనికులు తమ పలుకుబడిని వినియోగించి చాటుగా ధాన్యమును తెప్పించుకొని లోటులేకుండ భోజనము చేసేవారు. బియ్యం బస్తాలు, వడ్లబస్తాలు అధికార్లకు క్రింది ఉద్యోగస్థులు, పార్టీలు తెచ్చి యిచ్చేవారు. పెద్దలు లారీలలోని ఇతర సామాన్లలోను గడ్డిబండ్లలోను తెచ్చుకొని వినియోగించు చుండేవారు. శుభకార్యములలో, విందు భోజనములు యధావిధిగా జరుగుచుండేవి. కాని యే రోజు కారోజు పెద్దలకు చిన్నలకు దినగండము నూరేళ్ళ ఆయుస్సుగా గడచిపోతుండేది. పోలీసు చర్యానంతరం గౌరవనీయలగు కె.న్. మున్షీగారు కేంద్ర ప్రభుత్వాహార మంత్రిగా నియమింప బడిరి. పూర్వ పరిచయము (రజాకార్ మూమెంటు రోజులలో హైద్రాబాదుకు భారత ప్రభుత్వ ఏజంటు జనరల్ ఉన్న కాలమున) ననుసరించి వరంగల్‌కు విచ్చేసిరి. వారి వెంట బి. రామకృష్ణారావుగారు, రంగారెడ్డిగారు, చెన్నారెడ్డి మంత్రివర్యులు కూడా నుండిరి. మేము వారిని కోర్టులో ఆహ్వానించి స్వాగత పత్రము సమర్పించితిమి. ఆ సందర్భమున ఆహార రేషన్ నియమములు ఉండుట వలన ప్రజల సత్యముగా పొట్టనింపుకోవలసి వచ్చుచున్నది. దొంగతనము గాను ఎక్కువ ఖర్చుతోను పలుకుబడి వినియోగించియో అందరును భోజనము చేయుచున్నారు. ఇట్టి స్థితిలో యుద్ధము ముగిసి స్వాతంత్ర్య ప్రభుత్వ మేర్పడిన తరువాత ఆహార కంట్రోల్సు తీసివేయకుండ ఉంచటం మంచిది కాదనే విషయము నా ఉపన్యాసములో చెప్పితిని. నేను వరంగల్ న్యాయవాద సంఘమునకు అధ్యక్షుడుగా నుండి రజాకార్ రోజులలో 42 వకీళ్ళు సహా కోర్టు బహిష్కరింప చేసిన సంగతి అదివరకే హైద్రాబాదులో తెలిసియుండెను. వారు నా ఉ పన్యాసమును సాదరముగా వినిరి. తమకు చేతనైన విధముగా త్వరలోనే

కంట్రోల్సు తొలగించెదమని సెలవిచ్చిరి. అదే విధముగా కొలది రోజులలోనే కంట్రోల్సు ఆర్డర్సు తొలగించబడెను. నేను సత్యమైన విషయములన్నియు దాపరికము లేకుండ బైటపెట్టినందుకు అధికార అనధికార సభ్యులు సంతోషమును వెలిబుచ్చిరి. శ్రీ కె.ఎన్. మున్షీ, లీలావతి మున్షీ తదితర మంత్రివర్యులు హైద్రాబాదు వెళ్ళిపోయిరి.

* * *



ఆహారకమిటీ తరపున వరంగల్ సెషన్‌కోర్టులో కేంద్ర ఆహార శాఖ మంత్రి శ్రీ కె. ఎం. మున్షీకి సన్మానము

*ప్రకరణము - 13*

# నిజాం ఆంధ్రోద్యమము

నా జీవితంలో నిజామాంధ్ర దేశమునకు (తెలంగాణాకు) కొంత సేవచేయు భాగ్యము లభించినది. దానిని గ్రంథస్థము చేయుట నా విధియని భావించుచున్నాను. శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు వ్రాసిన ఆంధ్రోద్యమ చరిత్రలో కార్యకర్తల సేవా విశేషములను చరిత్రకు కావలసిన పద్ధతులలో వ్రాసియున్నారు. నేను నా జీవితముతో సంబంధించినంతవరకు వ్రాయుట అవసరమనుకున్నాను. కొంన్ని విషయములు ఆంధ్రోద్యమ చరిత్రయందు గ్రంథవిస్తరణ భీతిచే వ్రాయలేదనుకుంటాను.

హైద్రాబాదు దేశము ముఖ్యముగా తెలంగాణా మండలములు విద్యా విజ్ఞానములలో సర్వవిధముల వెనుకబడి యున్న వనుటలో సందేహములేదు. నాగరికత కూడలేక సామాన్య జనులు మోటుతనముతో ఉండిరి. ప్రభుత్వ స్థానమగు హైద్రాబాదు పట్టణము తెలంగాణా మధ్యముననే యున్నది. మదరాసు యూనివర్సిటీకి సంబంధించిన ఒక కాలేజి హైద్రాబాదులో నుండెడిది. సూబా స్థలములగు వరంగల్లు నందు ఒక హైస్కూలు మాత్రముండెడిది. ప్రజాయుత్త పాఠశాలలుండేవి కావు. పాఠశాలలను, గ్రంథాలయములను స్థాపించుటకును వాటి సభలు జరుపుటకును యెన్నియో కఠిన నియమములుండేవి. విశ్వప్రయత్న ముతో కొన్ని గ్రంథాలయములు స్థాపించబడి నడపించ బడుచుండెడివి. వాటి సంగతి పైన వ్రాసియే యున్నాను. హైద్రాబాదులో నిరతాన్నదాత అనియును శ్రీమంతులనియును ప్రభుత్వాదరము చూరగొన్న వారనియు చెప్పబడు

వామనాయకు కుటుంబము వారు బహుళ ప్రయత్నముతో వివేకవర్ధనీ పాఠశాలయనే పేరుతో ఒక హైస్కూలును స్థాపించిరి. వామనాయకు కుటుంబము వారి మాతృభాష మహారాష్ట్రము. అయినను నివాసము జాగీర్లు మొదలగువాటిని అభిమానమును బట్టి వారు ఆంధ్రులనియే అంగీకరించ వలెను.

తెలంగాణమున గద్వాల వనపర్తి మొదలగు సంస్థానములు, జాగీరులు ఉన్నవి. చిన్నచిన్న మక్తేదార్లు అగ్రహారము లున్నవి. పెద్ద పెద్ద దేశముఖులు దేశ పాండ్యాలు యెక్కువ గ్రామముల వతనులు గల పటేలు పటువారీలున్నారు. వీరందరు ప్రభువువారి రాజబంధువుల వలె ఉండేవారు. ఇదేవిధముగా ధనవంతు లగు ఆంధ్ర వైశ్య వర్తకులుండేవారు. వీరిలో ఎక్కువమంది పెద్ద చదువులు చదివిన వారులేరు. వీరందరికి దైవభక్తి దానధర్మాసక్తి విద్యావిజ్ఞాన ప్రచార ఆందోళన ఉండెడిది కాదు. వీరందరు యిదే స్థితిలో నుండుటయే నిరంకుశ ప్రభుత్వము యొక్క ముఖ్యోద్దేశమై యుండెను. బ్రిటిషు సామ్రాజ్యము కూడ దీనినే ఆమోదించుచుండెను.

హైద్రాబాదు రాజ్యమున నూటికి 87గురు హిందువులు, 13రు ముస్లిము జనులుండేవారు. ముస్లిములలో పాయగాహలు, జాగీర్దార్లు మొదలగు జమీందారీ వర్గముండెడిది. ఉద్యోగములో నూటికి 80 మంది ముస్లిములు 20 మంది హిందువులుండేవారు. ముస్లిములలో హైద్రాబాదు ముస్లిములు సంఖ్య తక్కువ, అలహాబాదు, పంజాబ్ ముస్లిములు ప్రతి సంవత్సరము కొంతమంది దిగుమతి అయ్యేవారు. వీరుగాక కలకత్తా మదరాసువారు కూడ ఉండేవారు.

హిందువులలో యు.పి. మదరాసు వారు చాలమంది ఉండేవారు. హైద్రాబాదీయులలో మహరాష్ట్రులు ప్రథముగాను, కర్నాటకులు రెండవవారుగాను, తెలుగువారు మూడవ వారుగాను నుండేవారు. వీరిలో తెలంగాణా బయట ఆంధ్రులు కూడా ఉండేవారు.

హైద్రాబాదు న్యాయవాద సంఘములో పండిత్ కేశవరావుగారు (మహరాష్ట్రులు) పండిత్ గిరిరావుగారు ప్రముఖ స్థానము నాక్రమించ గలిగిరి. వీరుభయులు హైకోర్టు న్యాయమూర్తులుగా కూడ పనిచేసి యశోవంతులైరి.

శ్రీ మాడపాటి హనుమంతరావుగారు 1912వ సంవత్సరములో వుద్యోగము బదిలీ చేయించుకొని హైద్రాబాదు ప్రవేశించిరి. పై సంగతులు శ్రీ హనుమంతరావుగారినే కాదు ప్రపంచ జ్ఞానము గలిగిన అస్మదాదులు గ్రహించు చునే యుంటిమి. హనుమంతరావుగారి వెంట వడ్లకొండ నరసింహరావుగారు,

ముద్గవి శ్రీనివాసరావు, వాసుదేవరావు గార్లుకూడ ఉద్యోగ రీత్యా హైద్రాబాదుచేరి హనుమంతరావుగారి అనుచరులైరి. శ్రీ హనుమంతరావుగారు న్యాయవాద పట్టమును పొందుటవరు (1918 సంవత్సరం వరకు) అనగా ఉద్యోగములో నుండునంతవరకు ఆందోళన పడుటపత్ప ఏమి చేయజాలకుండిరి. 1921 సంవత్సరములో భారతదేశమున చెలరేగిన అసహాయోద్యమ ప్రభావము హైద్రాబాదును కూడ కదలించినది. రాజకీయ సంఘములు నిషేధించబడుటయు సభలు ఊరేగింపులకు కఠిన ఉత్తర్వులు కాబడుటయు ప్రజలలో కొంత వుత్తేజము కలిగించినది.

మహారాష్ట్రులు ఆంధ్రులకు సహాయము చేయురనియును ఆంధ్రులు తమ శక్తిపైన నిలుచుట మంచిదనియు హనుమంతరావుగారికి విదితమై పోయినది. 1621 సంవత్సరం నుంచి సామాజిక పద్ధతులతో దేశమున ప్రబోధము కలిగించుటకు ఉత్సాహ పడుచుండిరి. గ్రంథాలయ వార్షికోత్సవముల పేరుతో ప్రభుత్వానుమతి పొంది వరంగల్లు, ఖమ్మం, ఎఋపాలయం, రెమిడిచెర్ల, కారేపల్లి మొదలగుచోట్ల సభలు జరిపి ఉపన్యాసము లిచ్చుచుంటిమి. ఒకసారి మధిరెలో ది. 21 పర్వర్ది 1334 ఫసలీ రోజున పింగిలి వెంకట్రామరెడ్డిగారి అధ్యక్షతన ఒక గ్రంథాలయసభ రెండు రోజులు జరిపితిమి. మధిరె పెద్దలలో కీ.శే. శ్రీ మాడపాటి తిరుమలరావుగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగాను, చతుర్వేది వెంకట కృష్ణయ్య, హరి సీతారామశాస్త్రిగారు మున్నగువారు కార్యకర్తలుగాను పనిచేసిరి. ఆ సభలోనే శేషాద్రి వెంకటరమణ కవులు వచ్చిరి. దాదాపు 200 మంది రెండు రోజులు సమావేశములకు వచ్చేవారు. ఒక వెయ్యి రూపాయిలు ఖర్చు పెట్టబడినది. వరంగల్లు నుండి ఒక పోలీసు సబ్ఇన్స్పెక్టరు పంపబడెను. ఆయన నా గదిలోనే మంచితనముతో నివసించెను. హనుమంతరావుగారు తమ హైద్రాబాదు మిత్ర బృందముతో విచ్చేసిరి. మే ముభయులము సంప్రదించుచు చర్చనీయాంశములను సభ ఎదుట పెట్టేవారము. ఇంకొక గ్రంథాలయ మహాసభ సూర్యాపేట యందు సమావేశ పరచబడినది. కీ.శే. శ్రీ వామన్ నాయక్‌గారు అధ్యక్షత వహించిరి. 75, 80 గ్రంథాలయములు స్థాపించబడి వరంగల్ నుండి నేను పరచ రంగారావు గారు, తూము వరద రాజుగారు మరికొందరు మధిర, ఎరుపాలయం ఖమ్మంలోని యువక విద్యాభిమానులు గ్రంథాలయకర్తలు విచ్చేసిరి.

కీ. శే. శ్రీ వామన నాయకుగారు విచ్చేసిరి. శ్రీ కొమరగిరి సీతా రామచంద్ర రావుగారింట అతిథులుగా నుంటిమి. కొందరు పండితులు, కవులు విచ్చేసిరి.

ఆ సభలో శ్రీ హనుమంతరావుగారు గష్తినిషాన్ 53ను మా దృష్టికి తెచ్చిరి. ప్రభుత్వమువారు విద్య విషయములలో కూడ విధించుచున్న నిర్బంధములను గురించి విచారమును ప్రకటించితిమి. సభకు చాలమంది వచ్చిరి, శ్రీమతి చొౖత్రాతి లక్ష్మీనర్సమ్మ గారి ఆధిపత్యమున మహిళా సభయు శ్రీ గాదేపల్లి సూర్యప్రకాశ రావుగారి ఆధిపత్యమున సంఘ సంస్కార సభయును జరుపబడెను. దాని తరువాత వరంగల్‌లో జరుపవలెనని నిశ్చయించుకుంటిని. గాని స్థానిక సహాయము లభించ నందున గ్రంథాలయ సభ జరుపలేకపోతిని.

## కేంద్ర ఆంధ్ర జనసంఘ స్థాపన

నిజాం రాజ్యము బయట జరుగుచున్న రాజకీయాందోళన చూచుచు వినుచు పత్రికలలో చదువుచుంటిమి. నాయకులతో కలియుచుంటిమి. బయటుద్య మములకు సహాయము చేయుచుంటిమి. గాని హైద్రాబాదీయులలో ప్రబోధము కలిగించ జాలకుంటిమి. హైద్రాదు (ముఖ్యముగా తెలంగాణా) లోని విద్యాధికులు విచార పడుచునే యుండిరి. కలిసినప్పుడల్లా ఆలోచనలు చేయుచుంటిమి. క్రియా రూపకమున సౌమ్యమార్గముల ఉత్తేజము కలిగించుటకు నిశ్చయించుకుంటిమి. పర్యవసానముగా హైద్రాబాదు నందు కేంద్ర ఆంధ్ర జన సంఘము 8 దై స్న 1331 (12-11-1921) తేదీన స్థాపించబడినది. నేను దాని సేవకుడుగా పని చేసితిని. దీనికి కొలది కాలములోనే హనుమకొండలో ది. 27-6-33 ఫసలీ (1-4-1923సం.) రోజున కేంద్ర సంఘ సభ జరిపితిమి. ఆ సభకు కీ. శే. శ్రీ చావల వెంకటరెడ్డిగారు అధ్యక్షత వహించి షుమారు 100 మంది సభ్యులుండిరి. ఆ సభలో చిత్తు నియమావళి తయారు జేయుపనిని నేను చేసితిని. శ్రీ జములాపురం వెంకటేశ్వరరావుగారి సహాయముతో ఆ సమావేశములోనే సిద్ధము చేసి సమర్పించితిని. అది అంగీకరించ బడియె. దాని తరువాత వరంగల్లులో జిల్లా తాలూకా సంఘములు ఏర్పాటు చేయుటకు మొదలు పెట్టితిమి. జిల్లా సంఘములకు నేనధ్యక్షుడుగాను శ్రీ జమలాపురం గోపాలరావుగారు ఉపాధ్యక్షుడు గాను ఇంకా కొందరు కార్యవర్గ సభ్యులుగా నియమించబడితిమి. శ్రీ పరచ రంగారావుగారు కార్యదర్శిగా నేను మహబూబాబాద్, ఇల్లెంద, ఖమ్మం, మధిరె, పరిటాలలకు వెళ్ళి సమావేశములు జరిపి తాలూకా సంఘములు ఏర్పాటు చేసితిమి. గాని జములాపురం వెంకటేశ్వరరావు సోదరులకును మాడపాటి హనుమంతరావు సోదరులకును ఒక భూమిని గురించి తగవు వచ్చుటచే హనుమంతరావుగారిచే స్థాపించబడిన ఆంధ్రోద్యమమునకు వారు విముఖులైరి.

ఆ కారణమున ఖమ్మంలో నేను రంగారావుగారి మిత్రులైన వెంకటేశ్వరరావు గారింట అతిథులుగా నుండలేకపోతిమి. తాలూకా సంఘములు ఏర్పాటైన తరువాత పింగిలి రంగారావుగారిని జిల్లా సంఘాధ్యక్షులుగా ఎన్నుకుంటిమి.

ప్రభుత్వాజ్ఞలు, అధికారుల ఆగ్రహావేశములు ప్రజలను భయభ్రాంతుల చేయుచుండెను. మహానగరమగు హైద్రాబాదులో శ్రీ హనుమంతరావుగారికి 5, 6రు తోడ్పడినారు. తక్కిన జిల్లాలో ఏమిలేదు. వరంగల్లులో ఏ ఒకరిద్దరోతప్ప సహకారము చేయువారు లేకుండిరి. ఇట్టి స్థితిలో కేంద్ర సంఘ సభ మరల 20-5-34 ఫసలీ (21-2-1925) రోజున శ్రీ చావల వెంకటరెడ్డిగారి అధ్యక్షతన సభ జరుపబడినది. శ్రీ మాడపాటి తిరుమలరావుగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా నుండిరి. ఖమ్మంలోని కొందరు యువక మిత్రులు తృతీయాంధ్ర మహాసభను ఖమ్మంలో జరుప నిశ్చయించితిమి. గాన ఖమ్మంలోని పెద్దలు అంతరాయము కల్పించుచుండిరి. సామరస్యము కలిగించుటకు ఖమ్మం బయలుదేర వలెనను కుంటిమి. శ్రీ హనుమంతరావుగారు హనుమకొండ వచ్చిరి. రైలు తప్పిపోయి నందున ఉదయముననే నా స్వంత మోటారులో హనుమంతరావు, పరచ రంగారావు, జములాపురం గోపాలరావుగార్లు నేను బయలుదేరితిమి. మార్గమధ్యవమున టయర్లు బద్దలయినందున అభోజనముగా మధ్యనే పడియుండి రాత్రి తిరుమలాయపాలెం చేరి భోజనముచేసి ఎడ్లబండిపైన శనివారం ఉదయంకు ఖమ్మం చేరితిమి. నేను శనివారము పూర్తిగా ఉండజాలక రైలులో తిరిగి వాపసు రావలసి వచ్చెను. స్వల్ప వ్యవధిలో సమాధానము కుదిరినది కాదు. నేను లేకపోవుటయు వెళ్ళిన వారికిని ఖమ్మంలోని వారికిని మనసులు కుదరక పోవుటయు తటస్థించినందున ఏ నిర్ణయము జరిగి యుండలేదు. తుదకు శ్రీ హనుమంతరావుగారు పట్టం వెళ్ళిపోయిరి. గోపాలరావు, రంగారావు గార్లు హనుమకొండకు వచ్చిరి.

మరల కొన్ని రోజులకు నేనును శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారును ఖమ్మం వెళ్ళి యిటికాల రాజేశ్వరరావుగారిని కలిసి ప్రభృతులను కొంతవరకు సమాధాన పరచి ఆహ్వాన సంఘ కార్యకర్తలకు ధైర్యము చెప్పి వచ్చితిమి. తరువాత డిశంబరు 1934లో శ్రీ పులిజాల రంగారావుగారి అధ్యక్షతన వైభవముగా మహాసభ జరిగినది. గత రెండు మహాసభలలో అతిస్వాతికమై నట్టియు ప్రభుత్వాందోళనకరము గానట్టియు లాంఛన ప్రాయమైన కొన్ని తీర్మానములు చేసియుండిరి.

వర్తకులు క్రయ విక్రయములు చేయునప్పుడు ధర్మఖర్చు పేరుతో కొంత డబ్బు వసూలుచేసి జమకట్టుకొను చుండిరి. వాటి వినియోగమును గురించి విచారించే వారులేరు. కొందరు అల్లుళ్ళ ఆడబిడ్డల కట్నములకును, కొందరు ఇంగ్లండుకు పంపిన తమ కుటుంబ విద్యార్థుల వ్యయము పేరను ఖర్చు వ్రాయు చుండేవారు. ఇది కొంత కాలము నుండియు నన్నూ బాధ పెట్టుచుండెను. ధర్మ ఖర్చులపేర తెలంగాణాలో వర్తకులు వసూలు చేయు ద్రవ్యము చాల కలదనియును లెఖ్ఖలను పరిశీలించినచో లక్షలాది ద్రవ్యము తేలుననియును అద్దానిని ప్రజోపయోగ కార్యములలో ముఖ్యముగా విద్యకొరకు వినియోగించవలె ననియును ఇందుకు ప్రభుత్వ పక్షమున తగు ఏర్పాటు చేయవలె ననియును నా ప్రతిపాదనలో చెప్పితిని. ధర్మఖర్చు విషయములో ప్రభుత్వమునకు వ్యతిరేక ముండజాలదు గనుకను లోకల్‌ఫండు మున్సిపాలిటీల విషయములో నేను వరంగల్ జిల్లా బోర్డు మునిసిపల్ కమిటీ సభ్యుడుగా నుండి ప్రభుత్వము వారడిగిన దానిని పురస్కరిం చుకొని అంతకుముందే బహిరంగముగా నివేదికను సమర్పించియుంటిని. గనుక ఈ రెండు విషయములను గురించి అధికారులు ఆక్షేపించ జాలరని గ్రహించి ఈ విషయములను ఖమ్మం మహాసభలో తీర్మాన రూపముగా ప్రవేశపెట్టితిని. ఆ విషయము ఆంధ్రోద్యమ చరిత్రలో వ్రాయబడియే యున్నది. మరియు స్థానిక స్వపరిపాలన విషయము గురించి విపులముగా వేరొకచోట వ్రాసియున్నాను గనుక పునరుక్తి దోషమునకు వెరచి ఇచట మరల వ్రాయలేదు. ధర్మనిధిని గురించి నేను చాలసేపు ఉపన్యసించితిని. సభ్యులు నిశ్శబ్దముగానే వినుచుండిరి. గాని నా తరువాత వారు మాట్లాడుచుండగా స్వార్థపరులగు కొందరు అల్లరి మొదలుపెట్టిరి. దానిని మేము శాంతి పద్ధతులతో సర్దుబాటు చేసుకుంటిమి.

ఖమ్మం మహాసభలో ఆంధ్రమహాసభకు చిత్తు నియమావళి సిద్ధము చేసి ప్రత్యేక సభద్వారా అంగీకారము తీసికొనుటకు ఉపసంఘము నేర్పాటుచేసిరి. దానికి నన్ను కార్యదర్శిగా నియమించిరి. నేనా పని పూర్తిచేసితిని. సిరిసిల్లలో శ్రీ మాడపాటి హనుమంతరావుగారి అధ్యక్షతన మహాసభ జరిగినది. ఆ సభలో నియమావళి నివేదించితిని. అది అంగీకరింపబడియెను. అంతటితో కేంద్ర జనసంఘము పేరు అంతరించి పోయినది. ఉద్యమమునకు "నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ" యని పేరు వచ్చినది. నడుపుటకు స్థాయిసంఘము, కార్యవర్గములు ఏర్పాటు చేయబడెను.

సిరిసిల్ల సభలో శారదా వయోజన వివాహ శాసనమువలె హైద్రాబాదు రాష్ట్రమున కూడ ఒక శాసనముండ వలెనని సురవరపు ప్రతాపరెడ్డిగారు తీర్మానము

ప్రవేశపెట్టిరి. ముస్లింలకు సంబంధము లేకుండ కొందరు హిందువులను మాత్రము నిర్బంధించు శాసనము వలదనియు ప్రజలు దీని ప్రాశస్త్యమును గ్రహించి స్వయముగా వయోజన వివాహములు చేయగలరనియును నేను వ్యతిరేకించితిని. స్థానిక స్వపరిపాలన తీర్మానము పునరుద్ఘాటించబడి అంగీకరించబడెను. శ్రీ హనుమంతరావుగారి అధ్యక్ష కాలమున నేను ఉపాధ్యక్షునిగా నియమింపబడితిని. మహాసభానంతరము ఆదాయ వ్యయ లెఖ్ఖలు రానందున వరంగల్ నుండి నేనును, పట్టం నుండి శ్రీ రంగారెడ్డిగారును మోటార్లపైన సిరిసిల్ల వెళ్ళి కార్యకర్తలను కలిసి లెక్కలు పంపు ఏర్పాటు చేసితిమి.

ఐదవ మహాసభ షాద్‌నగర్‌లో 1936 సంవత్సరములో జరుపబడెను. ఆ సభకు శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారు అధ్యక్షులయిరి. నిజాం ప్రభుత్వమున స్వంత భూములలోని తాటి ఈత చెట్లయందు భూస్వాములకు ఏమి హక్కుండేది కాదు. మదరాసు ప్రభుత్వములో వలె ఈ హక్కులు రైతుల గీయవలెనని నేను ప్రతిపాదించి సహకారముగా ఉపన్యసించితిని. తీర్మానము ఆమోదింపబడెను. ఆ సభలో రంగారెడ్డిగారనే డిప్యూటి కమీషనర్ ఆబ్కారి కూడ ఉండెను. సభానంతరము బయట నాతో కలిసి ఈ తీర్మానము రైతువర్గమునకు లాభకారియని తన సంతోషమును తెలిపెను. మరికొన్ని రైతు సమస్యలను కూడ ప్రతిపాదించితిని. దాని వివరము ఆంధ్రోద్యమ రెండవ భాగమునందు వ్రాయబడినది.

షాద్‌నగరం సభకు చాలమంది గ్రామీణ రైతులు వచ్చిరి. జరిగిన తీర్మానములు వారికి నచ్చక తిరిగి పోవుచుండిరి. పైనుండి వచ్చుచున్న శ్రీ మందుముల నర్సింగరావుగారు వారిని మరల సభకు వచ్చునట్లుచేసిరి. తరువాత వేళలో రైతు సమస్యలు అనగా ముఖ్యముగా పన్నులు, గ్రామోద్ధరణ, తాటిచెట్ల హక్కులు మొదలగు వాటిపైన నేను ప్రతిపాదించి ఉపన్యసించుటయు నర్సింగరావుగారు ఆమోదకులుగానుండి ఉపన్యసించుటయు జరిగినందున వారు సంతోషించిరి. శ్రీ రంగారెడ్డిగారి అధ్యక్ష కాలమున గూడ నేనుపాధ్యక్షునిగా నియమించబడితిని. ఐదవ సభానంతరము ప్రభుత్వమువారు సవతితల్లి ప్రేమతో కన్నీళ్ళు తుడిచి పేరు సంపాదించగోరి రాజ్యాంగ సంస్కరణల కొరకు 1937లో ఒక కమిటీని ఏర్పాటు చేసిరి. దానికి అయ్యంగారి కమిటీ అనేవారము. రాబోవు సంస్కరణము లెట్లుండవలెనో వివరించి నివేదించుటకు త్రయ ప్రాంతీయ సభ్యులుగల ఒక సంఘము నేర్పాటు చేయబడియెను. దానిలో నేను కూడ పాల్గొనుచుంటిని.

రాష్ట్రములోని విద్యాధికుల యొక్కయు అనుభవజ్ఞుల యొక్కయు లిఖితాభిప్రాయ ములను సేకరించ బడినవి. నిజామాబాద్ నందు 1937లో సభ జరుపబడెను. నాపేరు శ్రీ నర్సింగరావుగారి పేరు అధ్యక్ష పదవికి సూచింపబడెను. శ్రీ నర్సింగరావుగారే ఎన్నిక అయిరి. కావున నిజామాబాద్ మహాసభ శ్రీ మందుముల నర్సింగరావుగారి ఆధ్వర్యమున జరుపబడియెను. ఈ సభలో రాజ్యాంగ సంస్కరణలను గురించి పూర్తిగా చర్చలు జరిపి అసమ్మతి తెలుపబడినవి. సభాస్వరూపమునకు రాజ్యాంగ తేజమును కల్పింపబడియెను. ఈ సభలో యువకులు ఉరుదుభాషను ప్రసంగించకూడదని పట్టుబట్టిరి. అనుభవజ్ఞులగు పెద్దలు ఉరుదులో కూడ మాట్లాడవచ్చుననిరి. సభ కార్యక్రమము కొంతసేపు స్తంభింపబడినది. యువక ముఖ్యులలో శ్రీ వల్లూరు బసవరాజు, శ్రీ నందగిరి వెంకట్రావు ప్రభుతులుండిరి. నేను యువకులతో సౌమ్యముగా మాట్లాడి మధ్యమార్గమునకు తెచ్చితిని. విషయనిర్ణ సభాస్థలమున జేరితిమి. నేను చేసిన సమాధానమునకు శ్రీ రంగారెడ్డిగారు ఆక్షేపించిరి. మరల మహాసభలో చర్చవచ్చెను. అనుకూల వ్యతిరేక ఓట్లను లెక్కించవలసి వచ్చినప్పుడు అధ్యక్షుడు లెక్క పెట్టవద్దనియును నేను లెక్క పెట్టవలె ననియును యువకులు పట్టుబట్టిరి. అట్లే నేను లెక్కించితిని. శ్రీ నర్సింగరావుగారు విచారపడిరి.

తీర్మానములన్నియు ఆంధ్రోద్యమ చరిత్ర యందున్నవి. గనుక వాటిని వ్రాయుట నవసరము. శ్రీ మందుముల నర్సింగరావుగారి అధ్యక్ష కాలమున కూడ నేనుపాధ్యక్షునిగా నియమించబడితిని. రాజకీయ సంస్కరణల ఘర్షణ మర్షముతోనే కాలము గడిచినది. సంస్కరణల స్వరూపము బయటపడినది. ప్రత్యేక కమిటీలో బాగా చర్చింతిమి. సంస్కరణలు పౌరసత్వ హక్కులకును ప్రజా స్వాతంత్ర్యమును భిన్నముగాను పుట్టి దోషములతోకూడి యుండినవిగాను అయినందున అంగీకరించ జాలమని ఆంధ్ర, మరాట, కర్నాటక ప్రతినిధులతో కూడిన సభాపక్షమున విజ్ఞప్తిని పంపబడినది, అంతటినుంచి రాజకీయములలో జోక్యము కలుగజేసుకొనమని ప్రారంభించిన ఆంధ్రోద్యమము రాజకీయోద్యమ ముగా మారినది. ప్రభుత్వాధికారులు అనుమానపడుచుండిరి. గాని మా వ్యక్తిగత ప్రవర్తననుబట్టి మా యందు యితోధిక గౌరవభావముతోనే ఉంటూ వచ్చిరి. యువకులలో పరిపాలనా పద్ధతులు మారేవని(ర)నిరాశ హెచ్చినది. ఆ కారణము ఆంధ్రోద్యమముతో సంబంధం లేకుండా స్టేటు కాంగ్రెసు ఉద్యమము ప్రారంభించి సత్యాగ్రహము చేసి జైలులోనికి వెళ్ళుటకు జట్లుజట్లుగా సిద్ధపడిరి. మెదటిజట్టు

కీ. శే. శ్రీ గోవిందనాయకు వృద్ధ న్యాయవాదిగారిది. ఆఖరుది యువక సన్యాసి శ్రీరామానంద తీర్థగారిది. జైలు వెళ్ళిన వారిలో ముఖ్యులు కాశీనాథరావు వైద్య, జనార్థన్‌రావు దేశాయి, మందుముల రామచంద్రారావు, రావి నారాయణరెడ్డి గార్లు (పట్లమునుంచి) వరంగల్ నుంచి జములాపురం కేశవరావు, టి.హయిగ్రీవాచారి, కాళోజి నారాయణరావు ప్రభుతుల పేర్లు జ్ఞాపకమున్నవి. బీహార్, యు.పి.ల నుండికూడ జట్లు జట్లుగా వచ్చి సత్యాగ్రహముచేసి జైలుకేగు చుండిరి. ఇలా రెండుమాసములు సాగగానే మహాత్ముని ఆదేశానుసారం సత్యాగ్రహము ఆపివేయబడినది. ప్రభుత్వమువారు సత్యాగ్రహమును వదలివేసిరి. ఆ రోజులలో ఒక సి.ఐ.డి. పోలీసు జమాదారు మా వాకిటి కెదురుగా కూర్చుండేవాడు. కొన్నాళ్ళు చూచి సుబేదారు నారాయణరావుగారికి చెప్పితిని. వారి ఆదేశానుసారము కలెక్టరుకు చెప్పితిని. అతనిని తీసివేసిరి. నన్ను గురించి వరంగల్ పోలీసు పక్షమున నందిగామ తాలూకా పోలీసులను విచారించిరి. నేను స్వగ్రామ మగు జుజ్జూరునకు వ్యవసాయమును కనుక్కొనుటకు వచ్చి వెళ్ళే వాడననిన్నీ అచ్చటి అహింసోద్యమములో పాల్గొనలేదని అచ్చటి పోలీసువారు జవాబిచ్చినట్లు తెలియవచ్చినది.

ఈ మధ్యకాలమున అనగా 1939 సంవత్సరమున వరంగల్‌లో గణపతి ఉత్సవముల సందర్భము హిందూ మహమ్మదీయ కలహములు ప్రారంభమయి వాతావరణము కలుషితమాయెను. గజాననోత్సవ ప్రకరణములో వివరముగా వ్రాసియున్నాను. ఆ కారణమున ఏడవ మహాసభను వరంగల్‌లో జరుపలేక పోయితిమి.

ఏడవ మహాసభ అధ్యక్ష పదవిని గురించి కొన్ని చర్చలు జరిగినవి. శ్రీ మందుముల రామంచ్రదరావు, రావి నారాయణరెడ్డి గార్లు సత్యాగ్రహముచేసి జైలుకు వెళ్ళివచ్చిరి. గనుక వారుభయుల కవకాశమిచ్చుట న్యాయమనుకుంటిమి. ఆ ప్రకారము మల్కాపురమునందు జరిగిన ఏడవ మహాసభకు శ్రీ మందుముల రామచంద్రారావుగారు అధ్యక్షులుగా ఎన్నుకొనబడిరి. సభ వైభవముగా జరిగినది. నేనును పరిటాల సూర్యప్రకాశరావుగారును నా స్వంత మోటారుపైన వెళ్ళితిమి. రెండవరోజు రాత్రి విషయ నిర్ణయసభ ముగించుకొని రాత్రికి సికింద్రాబాదు వెళ్ళి కొంత ఆలస్యముగ ఆ మరురోజు సభకు వచ్చితిని. ఈలోగా రాజ్యాంగ సంస్కరణలను గురించిన చర్చ వచ్చినది. రాజ్యాంగ సంస్కరణలు అంగీకార యోగ్యములు కావని ఏకగ్రీవముగా అనుకొనియే వుంటిమి. గాని తీర్మానము విప్లవాత్మకముగాను తీవ్రవాద స్వరూపముగాను (సంస్కరణలను బహిష్కరించు

చున్నాము) ఉండెను. శ్రీ హనుమంతరావు పంతులుగారును మరికొందరు బహిష్కరణ శబ్ద మనవసర మనియును సామరస్యమునకు విరుద్ధమనియు యెన్నియో కారణములను చెప్పి తుదకు నాయందు విశ్వాసముంచి సవరణను అంగీకరించుమని కోరిరి. గాని తీవ్రవాదులగు శ్రీ రావి నారాయణరెడ్డి ప్రభృతులు గురువునకు మించిన శిష్యులయి పంతులుగారి మాటను వినక పట్టుబట్టిరి. తుదకు సవరణ వీగిపోయెను. ఈ ఘట్టము ఆంధ్రోద్యమ రథసారధి యనతగిన శ్రీ హనుమంతరావుగారికి ఆవేదన కలిగించినది. తార్కాణముగా వర్తమాన సంవత్సర కార్యసమితిలోను స్థాయిసంఘములోను పాల్గొన మనిరి. దానివలన మా కందరికిని ముఖ్యముగా అధ్యక్షుల వారికిని చాల విచారము కలుగజేసినది. సప్తమాంధ్ర మహాసభలో పటేలు పట్వారిగిరీల అనువంశీక హక్కులను గురించియు వారికిచ్చు ప్రతిఫలమును గురించియు ఒక తీర్మానమును ప్రతిపాదించితిని. గ్రామోద్యోగులకు సరిఅయిన జీతములు ప్రయాణ ఖర్చులు, భత్తాలు, కరువుభత్తాలు యిప్పించమనిన్నీ వారి హక్కులు అనువంశీకముగా నుండుట న్యాయమని చెప్పితిని. ఇంతేగాక వరంగల్ సుబేదారి సలహా సంఘములో సభ్యుడుగా నుండి కరువు భత్తాకొరకు సిఫారసు చేయించితినని కూడ చెప్పితిని అభ్యాసానుసారం పోలికంపల్లి వెంకట్రావుగారు పటేలు పట్వారీల కన్న దేశద్రోహులుండరు గనుక వారి ఎడల దయ అనవసరమనిరి. ఆ రాత్రి అపరిష్కారముగా ఉంచినందున ఆ రాత్రి నేనును శ్రీ రంగారెడ్డిగారును శ్రీ వెంకట్రామారావుకు నచ్చజెప్పి ఆక్షేపణ ఉపసంహరింప జేసితిమి. తీర్మాన మామోదించబడినది.

అధ్యక్షుడు శ్రీ రామచంద్రారావుగారు ఉద్యమాభిమాని. అంతవరకు కార్యదర్శిగా నుండి కార్యమును శ్రద్ధగా నెరవేర్చినవాడు గనుక ఆయన తన విద్యుక్త ధర్మమును చక్కగా నెరవేర్చెను. నేను స్థాయిసంఘములోను కార్యవర్గము లోను సభ్యుడనుగా నుంటిని. వరంగల్ జిల్లాలోని తాలూకా సంఘములను సక్రమ మార్గములో నుండునట్లు చేయుటకు నేను పరిటాల సూర్యప్రకాశరావు గారును మొదట ఖమ్మం వెళ్ళితిమి. అచ్చట తాలూకా సంఘ సభ్యులు శ్రీ జీడికంటి రామారావు, చావా వెంకటకోటయ్య గార్ల మధ్య కొన్ని భేదాభిప్రాయము లుద్భవించుటచే కార్యక్రమము స్తంభించిపోయెను. వారిలో సామరస్యము కుదుర్చుటకు ఒక రోజంతయు పాటుపడితిని. వారికి కొంత అవకాశమిచ్చి మధిర, ఇల్లెందు, పరిటాల పర్యటనలు ముగించుకొని మరల ఖమ్మం వచ్చితిని. నాయందు భక్తి విశ్వాసములు గల వేముగంటి రామకృష్ణారావు గారు సర్వవిధముల

సహాయము చేసిరి. మా కృషి ఫలితముగా కార్యకర్తలలో సామరస్యము కలుగుటయు ఖమ్మం తాలూకా ఏదేని గ్రామములలో తాలూకాసభ జరుపుటకు సంసిద్ధులగుటయు తటస్థించినది.

మరల కొన్ని రోజులకు నేను ఖమ్మం వెళ్ళి కార్యకర్తలను సమావేశపరచి ఆహ్వాన సంఘము నేర్పాటు చేయవలెనని కోరితిని. ఆ సమావేశములో శ్రీ జములాపురం కేశవరావు మొదలగు మధిరె కార్యకర్తలు కూడ నుండిరి. జిల్లా మహసభకు కేశవరావుగారిని అధ్యక్షునిగా ఎన్నుకొని అనుజ్ఞకొరకు దరఖాస్తు ఈయవలెనని కొందరును వ్యక్తిగతముగా పలుకుబడిగల ఒక వ్యక్తిని (అనగా వకీలు మొదలగు వారిని) అధ్యక్షుడుగా నుంటే గాని అనుజ్ఞ దొరకదని కొందరు వాదోపదవాదములు చేసుకొనిరి. రాత్రి 12 గంటలవరకు నిర్ణయమునకు రాలేక కార్యక్రమమునాపి రాత్రి రైలులో హనుమకొండ వచ్చితిని. ఆ మరురోజు మరల కొందరు బాధ్యులగు వారు సమావేశమై శ్రీ పరచ రంగారావుగారిని ఎన్నుకొని శ్రీ జీడికంటి రామారావు 3వ రోజు నా వద్దకు వచ్చెను. నేను శ్రీ రంగారావుగారి సమ్మతిని తీసుకొని ఆ ప్రకారము కలెక్టరు వద్ద దరఖాస్తు యిచ్చితిని. తదుపరి అంగీకారము దొరకినది. స్థానిక కార్యకర్తలు ఉత్సాహముతో సన్మాన కార్యక్రమమును పూర్తి చేసిరి. వారిలో కల్వల రాజారాంగారి సోదరులు వేముగంటి రామకృష్ణారావు, పరచ శ్రీనివాసరావు, జీడికంటి రామారావుగార్ల కృషి ప్రశంసనీయము.

ప్రధమ నగర సంఘమునకు నేనధ్యక్షుడుగాను శ్రీ పరిటాల సూర్యప్రకాశ రావుగారు కార్యదర్శిగాను ఎన్నుకొనబడతిమి. శ్రీ పరచ రంగారావుగారు జిల్లా అధ్యక్షులుగా నుండిరి. ఉభయులము సహకారముతో కొంత ప్రబోధము కలిగించ గలిగితిమి. శ్రీ మందుముల రామచంద్రారావు గారు పర్యటనచేయు సంకల్పమును సూచించిరి. వారికి మేము వరంగల్ పర్యటకు రమ్మని ఆహ్వానించితిమి. ఆ ప్రకారము వారును నర్సింగరావు గారును హనుమకొండ వచ్చిరి. హనుమకొండలో కార్యకర్తల సమావేశము జరిపి పరిస్థితులు విచారించుటయు వరంగల్‌లో వర్తక సంఘపక్షమున వారికి సన్మాన పత్రము సమర్పించుటయు జరిగినది. తర్వాత నర్సంపేట, మహబూబాబాద్, ఇల్లెందు, పాలవంచలకు వెళ్ళితిమి. పాలవంచ నుండి రామచంద్రారావు, నర్సింగరావుగార్లు నేను శ్రీ రంగారావుగారు భద్రాచలం వెళ్ళి శ్రీ రామంచంద్రాస్వామిని దర్శించితిమి. తరువాత ఖమ్మం, మధిర, రాయపట్నం, పరిటాలకు మేము నలుగురము వెళ్ళితిమి. ప్రతిచోటను

స్థాపించబడిన సంఘముల పక్షమున సమావేశములు జరుపబడి సన్మానపత్రములు సమర్పించుటయు అధ్యక్షులవారును మేమును వారికి కొన్ని సందేశములు యిచ్చుటయు జరిగినది. బహిరంగ సభలని చెప్పుటకు వీలులేదు. గాని యేదేని గృహావరయలో సమావేశములు జరుపుటయు ఉపన్యాసము లిచ్చుటయు జరుగుచునే ఉండెను. బహిరంగ సభలకు నిషేధములున్నవి గనుక గృహావరణలోనే జరుపుచూ మా మనోభీష్టముల నెరవేర్చు కొనుచుంటిమి. ఖమ్మం సమావేశములో వేముగంటి రామకృష్ణారావు, పరచ రంగారావు, కోదాటి నారాయణరావు, చావ కోటయ్యగారు, జీడికంటి రామారావుగారు ఎక్కువ శ్రద్ధతో పాల్గొనిరి. మధిర తాలూకా రాయపట్నంకు వెళ్ళితిమి. అచ్చట అధ్యక్షుని ఊరేగింపుతో తీసికొని వెళ్ళిరి. ప్రజలు చాలమంది సమావేశములో పాల్గొనిరి. అచ్చట నుంచి పరిటాల (జాగీరు)కు వెళ్ళితిమి. అచ్చట వకీలు మాదిరాజు లక్ష్మికాంతరావు ప్రభృతులు స్వాగతమిచ్చిరి. ఈ విధముగా శ్రీ రామచంద్రరావుగారి సప్తమ ఆంధ్ర మహాసభా కాలములో నాయకులు కార్యకర్తలు సహకారముతో పనిచేయుటయు జరిగినది. మల్కాపురములో మహాసభ సమయమున నేను ఒకరోజు ఉదయమున ఒక బావి దగ్గరకు వెళ్ళితిని. అచ్చట కొందరు రైతులు కలిసిరి. వారిని శిస్తుల విషయములో విచారించితిని. వారివలన పల్లపు భూములపైన యకరం 1కి రు.18లు మొదలుకొని 22 వరకు శిస్తు వసూలు చేయుచున్నట్లు తెలిసికొంటిని. ఇదే సందర్భమున ఒక విషయము వ్రాయుట కూడా ఉచితమనుకొనుచున్నాను. మహబూబ్‌నగరం జిల్లాలో ఒక రైతుకు బావి బంజరు కౌలు ఈయబడెను. అతను భీగా 1కి 35 చొప్పున 105 రూపాయిలు శిస్తు చెల్లించవలెనని షర్తుండెను. కౌలు ముద్దతు 30 సంవత్సరములు వెళ్ళిపోయినది. సెటిల్‌మెంటులో యకరం 1కి రూ. 10/- చొప్పున 30 శిస్తు నిర్ణయించి భావి మరమ్మతు 20/- మినహా యించి తక్కిన రు.10/- వసూలు చేయుటకు నిర్ణయించబడెను. గాని ఆ సంవత్సరము జమాబందీ ఆఫీసర్ సెటిల్‌మెంటు నిర్ణయము ప్రభుత్వమునకు నష్టదాయకమని చెప్పుచు పూర్వం వలెనే 105/- నిర్ణయించ వలెనని అందు బావి మరమ్మతు క్రింద 20/- మినహాయించి 80/- రూపాయిలు వసూలు చేయుమని ఉత్తర్వు చేసెను. ఆ కాలమున వరంగల్ సదరు నిజామతు సిజిత్ తెలంగాణా ఆఫీసుండెడిది. అనగా తెలంగాణా ప్రాంతీయ కమీషనర్ ఉండేవాడు. రైతుల పక్షమున కమీషనర్ వద్దకు నేను అప్పీలు చేసితిని. ఆ ఆఫీసు తీసివేయబడినందున అప్పీలు రివిన్యూ సెక్రటరీ వద్దకు పోయినది. ఈ విధముగా

తెలంగాణాలో పల్లపురేట్లు అత్యధికముగా నుండియు ఇది ఒక ముఖ్య సమస్యగా చర్చించబడుచుండేది. నేనును శ్రీ వెంకటరంగారెడ్డి గారు, నర్సింగరావు గారు ముఖ్యముగా ఈ తీర్మానముపై జరిగిన చర్చలలో పాల్గొను చుండేవారము. నూతనముగా నిర్మాణము చేయబడిన నిజామ్‌సాగర్, వైరా, పాలేరు ప్రాజెక్టుల క్రింద కూడ పల్లపురేట్లు అత్యధికముగా విధించబడినవి. నేను కృష్ణా ప్రాజెక్టుతో సంబంధించిన మద్రాసు సెటిల్‌మెంటు రిజిష్టర్లను తెప్పించి కలెక్టరుకు సుమేదార్లకు చూపించితిని. మా కృషి ఫలితముగా యీ ప్రాజెక్టు క్రింద పన్నుభారము కొంత తగ్గించబడెను. వీటిని నిర్ణయించుటకును అమలులో పెట్టుటకును అధికార్ల వద్ద పైరవీ చేయుచు న్యాయమైన తీర్పులను చేయించు చుండేవారము. జమాబంధి అప్పీళ్లలో ఫీజులేకుండ బీదరైతుల పక్షమున వకీలుగా పని చేసేవాడను. వరంగల్ నందుకూడ ఆంధ్రోద్యమ కృషి ఫలితముగా కొంత నూతన చైతన్యము కలిగినది. రాజకీయములతో సంబంధము పెట్టుకొనమని ప్రారంభించిన ఆంధ్రోద్యమము సభ పరచ రంగారావుగారి అధ్యక్షతన ప్రారంభమాయెను. లాంచన ప్రాయముగా సంతోష దాయకమగు విషయమనుకొని నేను "ఈ సంవత్సర పరిస్థితు లనుగ్రహించి రైతులకు రూ. 1కి రు. 0–3–0 చొప్పున శిస్తు మాఫియిచ్చినందున ఈ సభవారు ప్రభుత్వమునకు తమ కృతజ్ఞతను తెలుపుచున్నారు."

అనే తీర్మానమును ప్రతిపాదించి కొన్ని సంగతులను వివరించితిని. దీనిని శ్రీ కందిబండ పురుషోత్తమరావుగారు బలపరచిరి. తీర్మానము అంగీకరించ బడినదని అధ్యక్షులు ప్రకటన చేయుటయే తడవుగానుండెను. ఇంతలో పుచ్చల పల్లి సుందరయ్యగారి అనుచరులెవరో ఒకరులేచి ఈ తీర్మానముపైన ఆక్షేపించి కృతజ్ఞత తెలుపవలసిన పని లేదనిరి. మరల ఎన్నియో విధముల లోకమర్యాదలను వివరించి చెప్పితిని. కృతజ్ఞత తెలుపుట మానవ ధర్మముగాని అవమానము కాదని చెప్పితిని. తీర్మానము ఓటుకు పెట్టగా నా తీర్మానము ఓడిపోయెను. ప్రభుత్వాధికారులు తీవ్రవాదుల చర్యను బాగా వ్రాసుకొనిరి. దీని పరిణామముగా సుంకర వీరభద్రరావు మొదలగు కొందరిని ఈ రాజ్యములోనికి రాకూడదని నిషేధాజ్ఞను జారీచేసిరి. వెంకటాయపాలెం జిల్లా సభానంతరము ఈదుల పూసల పల్లెలో శ్రీ పరచా రంగారావుగారి అధ్యక్షతన సభ జరుపుట కేర్పాట్లు జరిగెను. గాని తుది సమయమున అనుజ్ఞలో విషమ నియమము లుండుటచే సభాస్థలికి వెళ్ళివచ్చిన ప్రతినిధులకు తెలిపి సభ మానుకుంటిమి.

### సప్తమ సభాధ్యక్షుని పర్యటన

సప్త మహాసభానంతరము వరంగల్ కొక పట్టణ సంఘు మేర్పాటు చేయ బడినది. నిజామాబాదులోని ఆరవ ఆంధ్ర మహాసభ నాటినుండియు రాజకీయోద్య మముగా మారినదనియును పౌరసత్వ హక్కులకొరకు ప్రజలు కోరు చుండుటయు సవతితల్లి ప్రేమతో నిరుపయోగమగు సంస్కరణల నిచ్చెదమని ప్రభుత్వం నిర్ణయించుటయు రాజ్యాంగ సంస్కరణల ద్వారా చట్టబద్ధమైన ప్రభుత్వ మేర్పడినచో హిందువులకు మెజార్టీ వచ్చి ముస్లింలు మైనార్టీగా నుండవలసి వచ్చును గనుక తామనుభవించు చున్న ఉద్యోగములు వాటిలో గల ఆధిక్యతకు భంగము వచ్చును. సంస్కరణలు వద్దనుటయు అంతేగాక ముస్లిం మతాభివృద్ధి ద్వారా ఆధిక్యత సంపాదించుటకు హింసాయుత మార్గములను ఆచరించుటయు దానిని నిరోధించు టకు ఆర్య సమాజమువారు విప్లవాత్మక ప్రబోధము చేయుటకు మరికొందరు హిందువులును ప్రయత్నము చేయుచుండిరి. మొత్తంమీద ఉద్దేశము యొక్కటేగాని పంథాలు వేరువేరుగా నుండి ఉద్యమమును నడపుచుండిరి. ఇందు కొంతమంది మతావేశపరులు కొందరు విధ్వంసక చర్యలవారు కొందరు దౌర్జన్యమును పసందు చేసేవారు కొందరు సత్యఅహింసావాదులుండిరి. కాబట్టి పరస్పర సంఘర్షణలు జరుగుచునే యుండెను.

సప్తమాంధ్ర మహాసభలో రాజ్యాంగ సంస్కరణల తీర్మానమును గురించి వృద్ధ నాయకులకును భేదాభిప్రాయములు వచ్చినవని పైన వ్రాసియున్నాను. గాని అవి కేవలము శబ్దభేదములే కానీ భావార్థ మొకటియే. గాంధేయ కాంగ్రెస్ వాదులకును, దాసు, నెహ్రూ స్వరాజ్య పార్టీవారిలోను ఇట్లే భేదాభిప్రాయములు వచ్చెను. కాని దీనికిని దానికిని చాల భేదమున్నది. సప్తమాంధ్ర మహాసభ తర్వాత ఉద్యమము యధావిధిగా సాగించబడినదని పైన వ్రాసిన సంగతులను బట్టి విశద పడగలదు.

అష్టమాంధ్ర మహాసభకు మొదటి నిర్ణయం ప్రకారం జైలుకు వెళ్ళివచ్చిన రావి నారాయణరెడ్డిగారు అధ్యక్షుడుగా ఎన్నుకొనబడిరి. ఆ సభ 3-6-1941వ తేదీన చిలుకూరులో జరుపబడెను. అనారోగ్య కారణమున నేను చిలుకూరు సభకు వెళ్ళజాలకపోతిని. శ్రీ నారాయణ రెడ్డిగారి కాలమున నా సహకారము అంత అవసరము లేకుండెను. శ్రీ రావి నారాయణరెడ్డిగారి యొక్కయు వారి గ్రూపువారి తత్వములు మేరుగా నుండెను. పరోక్షముగా కమ్యూనిజమును

ప్రేమించు చుండిరి. ప్రత్యక్షముగా మాతోబాటు ఆంధ్రోద్యమమున పనిచేయు చుండిరి. నన్నే వారుపాధ్యక్షునిగా నియమించినట్లు జ్ఞాపకము. గాని నవమాంధ్ర మహాసభను వరంగల్‌కు ఆహ్వానించిన కారణమున శ్రీ రావి నారాయణరెడ్డిగారు చాల పర్యాయములు వరంగల్‌కు వచ్చిరి. సాధారణముగా వారు నా వద్దనే ఉండేవారు. గాని తత్వములో మార్పువచ్చినది. ది. 6-5-51 ఫసలీ (మార్చి 1912)నాడు వరంగల్‌లో ఒక సమావేశము జరుపబడినది. అందు వరంగల్ తాలూకా ధర్మవరములో నవమాంధ్ర మహాసభ జరుపుటకు నిర్ణయించి ఆహ్వాన సంఘ మేర్పాటు చేయబడినది. దానికి నేనధ్యక్షుడుగను శ్రీ పరచ రంగారావుగారు ప్రధాన కార్యదర్శిగాను యింకా 11గురు ప్రత్యేక శాఖల సహకార కార్యదర్శులుగాను ఎన్నుకొనబడిరి. సభా సన్నాహములను ఉత్సాహముతోను కార్యదీక్షతతోను ప్రారంభించి పని చేయుచుంటిమి. నేను దాదాపు ప్రతిరోజు వరంగల్ వర్తకులు మొదలగు వారివలన విరాళముల వసూలు చేయుటకు ప్రత్యేకముగా తిరుగు చుంటిని. 80 బస్తాల బియ్యము తక్కిన భోజన పదార్థములు 3వేల రూపాయిలు నగదు వసూలుచేసితిని. నాతోపాటు శ్రీ కొమరవెల్లి లింగన్నగారు తిరుగుచుండిరి. ఉపాధ్యక్షుడు శ్రీ కొండూరు రామలింగంగారు నా మిత్రులు శిద్దం శెట్టి లింగయ్యగారు పదేశి బస్తాల బియ్యమిచ్చి ఎక్కువ సహకారము జూపిరి. మా మిత్రులు శ్రీ ఉదయరాజు రాజేశ్వరరావు, తూము వరదరాజులు గారలు పర్యటన జరిపి దాదాపు మూడువేల రూపాయీలు విరాళములు వసూలుచేసి తెచ్చి యిచ్చిరి. ప్రదేశమున ఇంజనీయర్ల సలహాతో ప్లాను తయారు చేయించితిమి. ఆ ప్రకారం శ్రీ జములాపురం కేశవరావు, కాళోజి నారాయణరావు, హయగ్రీవాచారి గార్లు ప్రదేశము నుండి పందిళ్ళు పాకలు అతిథి గృహములు, నీళ్ళ హవుజులు యిత్యాది పనులు నెరవేర్చుటలో నిమగ్నులయిరి. మొత్తం మీద వరంగల్ కార్యకర్తలు వర్ణనాతీతమైన ఉత్సాహముతో పనిచేసిరనుట అతిశయోక్తి కానేరదు.

అప్పటి నియమానుసారము అధ్యక్షుని ఎన్నిక కార్యవర్గ సభలోనే జరుపబడవలసి యుండెను. అందు ఏకగ్రీవముగా నేను మహాసభ కధ్యక్షుడుగా నుండవలెనని తీర్మానించిరి. వెంటనే శ్రీ రావి నారాయణరెడ్డి గారు నా వద్దకు వచ్చి ఈ సంగతిని తెలిపిరి. వరంగల్ సభకు నేనధ్యక్షుడుగా నుండుట "స్వగృహె పూజ్యతే మూర్ఖం" అనే సామెత సార్ధకముగుటయు ఆహ్వాన సంఘమునుండి తొలగుటచే ఆ పని కుంటుపడుట సంభవించుననియు చెప్పితిని. మా భేదాభిప్రాయములను నివర్తి చేసికొనుటకు నన్ను పట్నం వచ్చి శ్రీ హనుమంతరావుగారితో

మాట్లాడుమని కోరెను. ఆ ప్రకారము ఇరువురము పట్నం వచ్చితిమి. ప్రభుత్వ ప్రతిపక్ష తీవ్రవాదియని ఒక సి.ఐ.డి. నారాయణరెడ్డిగారి ననుసరించుచుండెను.

## రావివారి తత్వము

శ్రీ రావినారాయణరెడ్డిగారు యువక నాయకులు ఉత్సాహవ,తులు తీవ్రవాదులు. వీరి అనుచరులలో పేర్కొనవలసిన ముఖ్యులు శ్రీ పొత్కపల్లి వెంకట్రామారావు, బద్దం యల్లారెడ్డి, సర్వదేభట్ల రామనాధంగార్లు ఉండిరి. మల్కాపురం సభలో శబ్దములపై తీవ్ర వాదోపవాదములు చేయుటయు దానిచే ఉద్యమ స్థాపనాచార్యులు శ్రీ హనుమంతరావుగారిని మనస్తాపను లగుటయు పైన వ్రాసియే యున్నాను. అయినను శ్రీ రావినారాయణరెడ్డి ప్రభుతులు సప్తమ, అష్టమ సభ తరువాత మాతో కలిసి మెలసియే పనిచేయుచుండిరి. అది ప్రపంచ సంగ్రామ కాలమని నేను వ్రాయనక్కరలేదు. 1935 సంవత్సరపు భారత రాజ్యాంగ సంస్కరణల ననుసరించి రాష్ట్ర ప్రభుత్వములు ప్రజాయుత్తము చేయబడుటయు మదరాసు రాష్ట్రమునకు శ్రీమాన్ రాజగోపాలాచారిగారు ముఖ్యమంత్రియు, శ్రీ కాళేశ్వరరావుగారు చీఫ్ సెక్రటరీగా నుండి రాష్ట్ర ప్రభుత్వములకు కాంగ్రెసు మంత్రివర్గము రాజీనామాల నిచ్చుటయు లోక విధితము. ప్రపంచ సంగ్రామము సామ్రాజ్యవాదులదేనని కాంగ్రెసు నాయకులు తటస్థవిధాన మవలంభించుటయు, రష్యా, బ్రిటిషు మిత్రమండలిలో చేరుటచే ఇండియా కమ్యూనిష్టులపై నిషేధము లను తొలగించి జైళ్ళ నుంచి విడుదలచేసి సెబాస్ అని వెన్ను జరుచుటయు జరిగినందు కమ్యూనిష్టు వర్గములు తలయెత్తి ప్రజాయుద్ధం, ప్రజాయుద్ధమని నినాదములు చేయుచు కాంగ్రెసు సిద్ధాంతములకు విరుద్ధముగా ప్రచారములు చేయ మొదలుపెట్టిరి. దానిని పురస్కరించుకొని శ్రీ రావి నారాయణరెడ్డిగారి కొత్త పార్టీ పేరు లేకుండా ఏర్పాటు చేసుకొనబడినది. పైచెప్పిన వారేగాక విద్యాధికులైన డాక్టర్ ఆలం, రాజబహుద్దుర్ గౌడ్, ఆరుట్ల రామచంద్రారెడ్డి వారి భార్య కమలమ్మ, ఆరుట్ల లక్ష్మినరిసింహారెడ్డి, రామకృష్ణశాస్త్రి (ఆదిలాబాద్) మొదలగు ఇంకా కొందరు మఖ్దూమ్ మొహియుద్దిన్ గారలు కూడా చేరిరి. ఈ సంగతి నవమాంధ్ర మహాసభకు పూర్వమే అస్మదాది పాత కార్యకర్తలము గ్రహించితిమి. అయినను వారు ఆంధ్ర మహాసభ నుండి తొలగిపోక లోపలి నుండియే తమ ఉద్దేశ్యములను నెరవేర్చు ఆలోచనలో నుండిరి.

మహాసభానంతరం రాజబహుద్దుర్ గౌడ్గారితో ప్రచ్ఛన్న కమ్యూనిష్టులుగా నుండుటకన్న ప్రత్యక్షముగానే ఒక పార్టీని ఏర్పాటు చేసికొని వేరే ఉండరాదా?

మాతో ఎందుకు తగువులాడుచుంటారు అని ప్రశ్నించితిని. మాకు తగినంత బలము లేదనియు మీతో చేరియుండియే మా ప్రయత్నములు సాగించి బలము సంపాదించుకొనెద మనియును నాకు బదులు చెప్పెను. ముందు చెప్పబోయిన విధముగా పదకొండవ మహాసభ వరకు వీరు బురఖాలో నాటకమాడుచునే యుండిరి.

మే ముభయులము పట్టములో శ్రీ హనుమంతరావు గారివద్దకు వెళ్ళితిమి. నారాయణరెడ్డిగారు మా ఉభయుల సంప్రతింపుల సారాంశము చెప్పెను. హనుమంతరావు గారు మహాసభకు నన్ను అధ్యక్షుడుగా నుండుట కంగీకరించు మని శలవిచ్చెను. మరియు ఈలోగా ఆహ్వాన సంఘమునకు ఇంకొకరిని అధ్యక్షుడుగా ఏర్పాటుచేసి నీవు కూడా సలహాయిస్తూ ఉండమనిరి. వారి ఆజ్ఞను శిరసావహించి వరంగల్ వచ్చి మహాసభ కార్యవర్గ తీర్మానమును వినిపించితిని. అందరము నూతనాధ్యక్షుని కొఱకు ఆలోచనలు జరుపుచుంటిమి. మహాసభ జరుపుట కనుజ్ఞ యిప్పించకోరి సాంప్రదాయానుసారముగా కలెక్టరుగారి వద్ద దరఖాస్తు నిచ్చితిమి. వారు సలహా సంప్రదింతులలోనే కాలము గడుపుచుండిరి. దీనిని గ్రహించి నేనును శ్రీ హనుమంతరావు, నర్సింగరావుగార్లను కలసి హోం సెక్రటరీ శ్రీ అజహర్ హుస్సేన్ గారివద్దకు వెళ్ళి మాట్లాడితిమి. సన్నాహములు చేయుచున్నాము. తేది సమీపించుచున్నది. త్వరగా అనుజ్ఞ తెప్పించవలసిన దనిన్ని కనీసము నోటి మూలముగా శలవిచ్చినను పనులు పూర్తి చేసుకొందుమనియును చెప్పితిమి. అంతట ఆయన సభాధ్యక్షుని పేరడిగెను. శ్రీ నర్సింగరావుగారు నాపేరు చెప్పి 30 సంవత్సరముల నుండి పనిచేయు వరంగల్ వకీలు అని కూడా చెప్పెను. ఆయన వారిని నేనెరుగుదును అధ్యక్షుడు మనవాడే గనుక మీ ప్రయత్నములు పూర్తి చేసుకొనవచ్చును. ఉత్తర్వు తొందరగానే అందగలదు అని చెప్పెను. వరంగల్ వచ్చి నేనీసంగతి కలెక్టరుకును, సుబేదారుకును చెప్పితిని. వారు నేను అధ్యక్షుడనై నందుకు తమ సంతోషమును తెలిపి ప్రజావాంఛలను నిర్భయముగా వెలిబుచ్చు టకు సందేహించ నక్కరలేదు. ప్రభుత్వాధికారులను అసభ్యముగా తిట్టనీయ వద్దని మాత్రము నాకు చెప్పిరి. త్వరలోనే అనుజ్ఞ కొఱకు వ్రాసి అంగీకారము తెప్పించుటకు ప్రయత్నము చేయుదుమనిరి. కలెక్టరు శ్రీ గౌసుద్దీన్ గారున్నూ, సుమేదారు బదరుద్దీన్ గారున్ను ఉండిరి. ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొనబడిన శ్రీ పరచ రంగారావుగారు సమర్థుడు అభిమాని అనుటలో సందేహము లేదు. గాని వారికి మహాసభ జరపజాలమని సందేహము బాధించు చుండెను. ఆ కారణమున తాము ప్రధాన కార్యదర్శిగా నుండుట కంగీకరించమను చుండిరి.

నేను మిమ్ములను తొలగించజాలను మీరే ఉండవలె ననుచుంటిని. చాల భాగము ఆహ్వాన సంఘోద్దేశ్యములు పూర్తిగా జొచ్చినవి. నేను ఆహ్వాన సంఘాధ్యక్ష పదవిని వదలవలసి వచ్చినందున వారిని అధ్యక్షుడుగా నుండమని కోరితిని. వారు నాకొక షరతు విధించిరి. వరంగల్ విరాళములు వసూలు చేయుపని మీరే చేయవలెను. ఆఫీసు పనిని నేను చూచుచుండెదను. ఇది మా యిద్దరిలో జరిగిన అంతరంగిక నిర్ణయములై యుండెను. 17-7-15 తేదీ ఆహ్వాన సంఘమును సమావేశ పరచి నేను రాజీనామా నిచ్చితిని. శ్రీ పరచ రంగారావుగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా యెన్నుకొనబడిరి. అయినను నా వాగ్దాన ప్రకారము వరంగల్ విరాళములు వసూలు చేయుచునే ఉంటిని. సన్మాన కార్యక్రమములో పూర్వము వలె పాల్గొనుచుంటిని. మొత్తంమీద ఆహ్వాన సంఘ కార్యకర్తలు తమ విద్యుక్తమును గ్రహించి దీక్షతో పనిచేసిరి. 9వ ఆంధ్ర మహాసభలో వరంగల్‌కు ప్రత్యేక పేరు ప్రఖ్యాతులు కలిగిన వనుటలో సందేహము లేదు. చిరకాలము నుండి వచ్చుచున్న అచారములు అభ్యాసములే దీనికి కారణములని వేరుగా చెప్పనక్కరలేదు. 17 తీరు 1357 ఫసలీ తేదీన ఉత్సాహవంతులగు రైతు సోదరులు ఏనుగుల వంటి గుంటూరు జాతి 9 జతల యెడ్లను బండికి కట్టి బండిపైన అదివరకే ధర్మవరం గ్రామమునకు వచ్చియున్న ఆహ్వాన సంఘాధ్యక్షుడు పరచ రంగారావుగారిని పూర్వాధ్యక్షులు రావి నారాయణరెడ్డిగారిని నన్నును ఎక్కించి వేలాది జనులవెంట రాగా గీత వాద్యములతో ఆ శకటమును సభా మండపము వద్దకు తెచ్చుచుండిరి. రాజబహద్దుర్‌గౌడ్ వారి అనుచరులు కమ్యూనిష్టు గీతములను జాతీయవాదులు జాతీయ గీతములను పాడుచుండిరి. ఊరేగింపు పూర్తి చేసికొని శకటము సభాస్థలికి చేరినది. అధ్యక్షులను ఆహ్వాన సంఘ కార్యదర్శులు సేవా దళాధికారులు వేదికపైకి తీసికొని వెళ్ళిరి. జాతీయగీతములు వైదికాశీర్వాదముల అనంతరము పూర్వాధ్యక్షుడు శ్రీ రావి నారాయణరెడ్డిగారు నా యెన్నికను ప్రతిపాదించి సభామోదముతో పుష్పమాలతో పదవిని వప్పగించి వైదొలగిరి. ఆ సందర్భమున శ్రీ ఆకారపు నరసింగం, గుండా ముత్తిలింగం మొదలగు వర్తక ప్రముఖులు రాజలాంఛనముగా నజరానాలు (కానుకలు) యిచ్చిరి. వాటిని నేను అదే మర్యాదతో కరస్పర్శ చేసి కార్యదర్శికిచ్చితిని. సభా మంటపమున ప్రతినిధులు ప్రేక్షకులు పదివేలకు పైగా నుండేవారు. స్త్రీ పురుష సేవాదళము 4 వందల వరకు ఉండేవారు. ప్రతిపూట దాదాపు 5వేల మందికి ఉచిత భోజన మీయ బడుచుండేది. బావులకు మోటలు పెట్టి హవుజులకు నీళ్ళను నింపుచుండేవారు. కార్యదర్శులు సహకార్యదర్శులు యితర కార్యకర్తలు 50 మంది అహోరాత్రములు

నిమగ్నులయి యుండేవారు. స్త్రీ పురుష ప్రతినిధులకు వసతి గృహములు విరివిగా నుండెను. శ్రీమతి రంగమ్మగారి యాజమాన్యమున మహిళాసభ కూడా జరిగెను. ఆ కాలపు పరిస్థితులు విశదీకరించుటకై అధ్యక్షకోపన్యాసము యిందు పొందుపరచు చున్నాను.

ఓం.

## నిజాం రాష్ట్ర నవమాంధ్ర మహాసభ, ధర్మవరం

## అధ్యక్షోపన్యాసము

### మాదిరాజు రామకోటేశ్వరరావు (హైకోర్టు వకీలు) అధ్యక్షుడు.

### చిత్రభాను సం. అధికజ్యేష్ట శు. 7 -లు

ఆహ్వాన సంఘాధ్యక్షా! సోదర సోదరీమణులారా!

విశాలమగు నిజాం రాష్ట్రాంధ్రదేశమున విద్యావంతులును ధనవంతులును అనుభవజ్ఞులును పెక్కురుండ అల్పజ్ఞుడనగు నన్నీ పనికి నియోగించుట తమ అవ్యాజ ప్రేమగాని నా యోగ్యత కాదు.

ఎనుబదిలక్ష లాంధ్రుల అభ్యుదయమునకై నడపబడు ఈ ఆంధ్రోద్యమ రథమునకు ఆంగ్లాంధ్ర (ఉభయభాషా) ప్రవీణుడును రాజకీయ తంత్రనిపుణుడును అగు సారధిచే నడపవలసియుండ దీనిలో నేశక్తిలేని నన్నీ పనికి నియోగించుట పొరబాటని చెప్పవలసి యుండును. నే నాహ్వాన సంఘాధ్యక్షుడనుగా నియమింప బడిన పిమ్మట మహాసభ కధ్యక్షుడుగా మార్చబడిన ఉదాహరణము నిదియే మొదటిసారి ఈ జిల్లాలోనే తటస్థించినది. నేనిందున కనర్హుడనని గ్రహించియు తమ యాజ్ఞ నుల్లంగించజాలక దేశభక్తి నాయందలి అభిమానముగల మహా నాయకుల బలమును నా దేశ సోదరుల నమ్మకమును విశ్వసించి ఈ మహాభారమును తలకెత్తుకొనుటకు సాహసించు చున్నాను.

ప్రపంచ చరిత్రమున వర్తమాన సంవత్సరము కష్టభూయిష్టమైనది. ఈ దుష్కాలమున శాంతియుతముగా మన ఉద్యమమును నడిపింపగల బాధ్యత మనయందే గలదని జ్ఞాపకము చేయుచున్నాను.

నానా సంఘర్షణలతో అల్లాడుచున్న ఈ సందర్భమున మనలో యువకులను వృద్ధులను కక్షలెంచక దేశాభ్యుదయమే గమ్యస్థానమని ఎంచి



నవమాంధ్ర మహాసభ అధ్యక్షుడుగా గ్రంథకర్త ఊరేగింపు

తామందరు నాకు తోడ్పడి, నాచే దేశమాత సేవ చేయించవలెనను బాధ్యతను తెలుసుకొని దేశశాంతియే ప్రధానోద్దేశ్యమని యావదాంధ్ర ప్రతినిధులును, అందు కార్యభారము వహించి ప్రముఖులును, మరియు బాధ్యత వహించవలసిన నాయకులును, కొంత కాలమునుండి ప్రభుత్వము వద్దను ప్రజలలోను ప్రతిష్ఠ సంపాదించిన ఈ మహోద్యమ నాయకత్వమును నాయందుంచి నావలన లోటు కలిగినదను అప్రదిష్టకు నన్ను గురికానీయక, శాంతి సక్రమ పద్ధతులతో వర్తమాన సంవత్సర కార్యక్రమమును కొనసాగింపజేసి నన్ను కృతార్థునిగా చేయగలరని మిమ్ములను సవినయముగా కోరుచున్నాను.

## దేశరక్షణ

ప్రస్తుతము మన నెదుర్కొనియున్న ప్రపంచ ఘోర సంగ్రామము ప్రళయానిల ప్రేరేపితమై సముద్ర తరంగముల మధ్య తలక్రిందగుచున్న నావ వలె మన జీవితము చావుబ్రతుకుల మధ్య తారుమారు చేయబడుచున్నది. ఒక వ్యక్తికిగాని ఒక సంఘమునకు గాని ఒక రాజ్యమునకు గాని స్థిమితము లేదు. రేపటిస్థితి ఏమికానున్నదో ఎవరికిని తెలియదు. నియంతృత్వ సిద్ధాంతములపైన రాజ్యతృష్ణకు లోబడి, తోడి మానవులని బలి ఇచ్చుచు, వారి రక్తముచే తమ తృష్ణను చల్లార్చుకొన జూచుచున్నారు.

మానవునకు జన్మ హక్కను స్వాతంత్ర్య మనుభవించుటకు జాతి మతభేదములు, వర్ణ వివక్షతలు, రంగు మార్పులు, దేశకాలములు మొదలగు విభేదము లుండరాదనియును, సృష్టిలోని ప్రజలందరు ఒకే విధమగు స్వేచ్ఛా స్వాతంత్ర్యముల ననుభవించుటకు హక్కుగల వారనియును, పరిపాలించు ప్రభుత్వములు ఒకేవిధమగు రాజ్యాంగ పునాదులపై ఆధారపడి యుండుట క్షేమకర మనియును, ఒకే భూఖండము భిన్న రాజ్యాంగ తత్వములుండుట మానవునకు మానసిక ఖేదకారణ మగుననియును, దేశచరిత్రలు చాటుచున్నవి.

ప్రస్తుత యుద్ధమున మానవ స్వాతంత్రము జాతీయత, రక్షణ ప్రపంచ శాంతి, లోక కల్యాణము ఆదర్శమని చెప్పబడుచున్నను రాజ్య కాంక్ష పరస్పర ద్వేషము, అసహనము, ఆదర్శముగా నుంచుకొని తమ భౌతిక విజ్ఞానము యుద్ధ కళా కౌశల్యమును ప్రదర్శించి దేశములలో రక్తమును ప్రవహింప జేయుచున్నారు.

1914 నుంచి 1918 సంవత్సరముల వరకు జరిగిన ఐరోపా మహా సంగ్రామమున నూతన పద్ధతులను వినియున్నాము. నేటి ప్రపంచ ఘోర

సంగ్రామమున కని విని యెరుగని మారణాస్త్ర ప్రయోగ ఉపసంహార్వములు భూమ్యాకాశ జలయుద్ధములు అద్భుతముగా తెలుసుకొనుచున్నాము. ఈ పరిస్థితులలో మన విజ్ఞానము, మన యుద్ధ పరిశ్రమశక్తిని గ్రహించిన మనమెందుకు పనికి రానివారమని చెప్పక తప్పదు. మారణాస్త్రములు లేవు. ఆయుధములు లేవు. కత్తి కర్ర బాణము తుపాకి మొదలగు పాతరకములు వాడక అనేక సంవత్సరములయినది.

జపానుదాడి ఇండియా సరిహద్దులను సమీపించినది. దేశ రక్షణ ఆత్మరక్షణ ముఖ్య కర్తవ్యము.

"సంగ్రామే శస్త్రాభ్యాసే" అనినట్లు యిప్పుడు శస్త్రవిద్య నేర్చుకొనుటకును వ్యవధిలేదు. "తడిసిగాని గుడిసెకప్ప"దను సామెతను బట్టి అవసరము కష్టము సంభవించినప్పుడే సోమరితనము వదలి ఈశ్వరుని ధ్యానించుటకునుతన కర్తవ్యమును వెదకుటకును ప్రయత్నించును. ఆపత్తు తటస్థించినప్పుడు పశువులు తమ రక్షణ కర్తవ్యమును నిర్ణయించు కొనుచున్నవి. గాన మనము ఆత్మశక్తిని గ్రహించి దానిని మేల్కొలిపి మాతృదేశ రక్షణకును సోదరమానవుల ధన మాన ప్రాణ రక్షణకును సంసిద్ధులమై ప్రభుత్వముతో అవినాభావ సంబంధమగు సహకార మార్గమవలంబించ వలెను.

దురదృష్టవశమునను స్వార్థపరుల ప్రేరేపణ చేతను హిందువులకును, మహమ్మదీయులకును ద్వేషములు పెరిగి పరిష్కార దుస్సాధ్యమగు వ్యాజ్యమున పడియున్నారు. ఇందువలననే, చాంగ్ కై షేక్ వంటి చైనా జాతీయ యోధుడు వెనుకకు తిరిగివెళ్ళెను. సర్ స్టాఫర్డు క్రిప్సు వంటి రాజనీతిజ్ఞుడు సమస్యా పరిష్కార మొనర్చలేకపోయెను. భారతదేశమున జాతీయ ప్రభుత్వము నెలకొలప బడక పోవుటకు ఈ భేదమే కారణమయ్యెను. యిది భారతదేశ దురదృష్టము గాని ఎంత కాలమునకైనను పరిష్కారము గాక తప్పదు. ప్రభుత్వపు ఒత్తిడి వలనగాని రక్తపాతము వలనగాని, జరుగుట కన్న పట్టుదలలు వీడి, అందరము భారతమాత పుత్రులము, సోదరులము. యావద్భారత క్షేమమే మన క్షేమమని గ్రహించినట్లయిన అఖిల భారత పరిపాలనమును నడపగలవార మగుదుము. ఇట్టి ఐక్యము మన కొసంగవలెనని ఈశ్వరుని ప్రార్థించవలసి యున్నది. అమ్మశక్తియే ఈ భేదములను పోగొట్టి ఐకమత్యము నెలకొల్పగలదు.

రెండువందల సంవత్సరముల కన్న పై కాలమునుంచి ఆసఫ్‌జాహి వంశము వారిచే నడపబడుచున్న హైద్రాబాదు రాజ్యము భరతఖండమున తోడి

దేశీయ రాజ్యములలో ఎక్కువ ప్రాముఖ్యత చెందియున్నది. నేడు చెన్న రాజధానిలో నున్న ఉత్తర సర్కారులు, దత్తమండలములు, ఒకప్పుడీ రాజ్యమునకు చేరి యుండెను. వాటిని భూగోళ పటమున కలిపి చూచిన సమగ్రాంధ్ర దేశ మంతయు ఒకే పరిపాలనమున నున్నట్లు చూడగలము. కాని ప్రస్తుతము 8 జిల్లాలు మాత్రమే నిజామాంధ్ర దేశమున మిగిలి యున్నవి. ఆసఫ్‌జాహి వంశ ప్రభువులు, హిందూ మంత్రులు, హిందూ సామంతులు, హిందూ మాషుదారులు, హిందూ వతన్‌దారులను గౌరవించి వారి సహాయముతో ప్రజానురాగమగు ప్రభుత్వమును నడపుచు హిందూ మహమ్మదీయ విభేదములు లేక సమచిత్తమును ధృవపరచి యున్నారు. పూర్వపు రాజుల ఆదర్శప్రాయమగు సమత్వ ఉదాహరణము లెన్నియో కలవు. మన ప్రభువరేణ్యులు "నాకు (ప్రభువునకు) మతము లేదు. నా ప్రజల మతమే నా మతము నాకు హిందూ మహమ్మదీయు లనెడి ఇరుతెగలు రెండు నేత్రములని" సెలవిచ్చి యున్నారు.

మనమును జాతి మత ద్వేషము వైషమ్యములు లేక సంచరించి యున్నాము. గాని కొలది రోజుల నుంచి మనస్సులలో కొంచెము చీలికలు వుద్భవించినవి. అవియు ఆస్తులకొరకు గాదు వ్యాపారములలో లేదు, రాజకీయ హక్కుల సందర్భమున తటస్థించినవి. ఇట్టి భేదములను వదలు కొనవలెను. లేక కనీసము యుద్ధానంతరం వరకు తాత్కాలికముగా నైనను వదలుకొని దేశ రక్షణకు బద్ధకంకణులము కావలెను. ఇదివరకు అచ్చటచ్చట తటస్థించిన చిల్లర పోరాటములను జ్ఞాపకము చేసుకొని ఒకరివలన మరియొకరు భయపడుచున్నారు. అట్టి భయమును మాని పరస్పర విశ్వాసముతో మెలగవలెను. మన ఇరుతెగల కోరికలను న్యాయమార్గమున పరిష్కరించి ఉభయులను తృప్తిపరచ గలరని ధర్మ స్వరూపుడగు మహోఘనత వహించిన ప్రభువరేణ్యునియందే భారము ఉంచవలెను.

మన దేశమున 8 జిల్లాలకు సంబంధించిన ఆంధ్రోద్యమము 5 జిల్లాలతో సంబంధించిన మహరాష్ట్రోద్యమము 3 జిల్లాలకు సంబంధించిన కర్నాటకోద్య మము జాతిమత విచక్షణ లేకుండా సక్రమ పద్ధతుల వెంట పనిచేయుచున్నవి. ఇవి ఒకే ఉద్దేశ్యానుసారము పనిచేయుచున్నవి. ఈ ఉద్యమములలో పనిచేయు కార్యకర్త లలో పెక్కురు ప్రజానురాగము ప్రభుత్వాదరమును బడసియున్నారు. అట్టి వారియందు విశ్వాసముంచి దేశరక్షణ బాధ్యతను వారికి పంచి యిచ్చి దేశరక్షణా కర్తవ్యమును నెరవేర్పింప జేయవలెనని నేను మనవి చేయుచున్నాను.

ప్రజలు ప్రభుత్వమునకు సహకార మొనర్పవలెను. ప్రభుత్వము తమ ప్రజలయందు విశ్వాసముంచి శాంతియుతమగు రక్షణా కార్యభారమును ప్రత్యేకముగానో అధికార వర్గముతో కలిసియో పనిచేయునట్లు చూడవలెను. జిల్లా తాలూకా ఇతర ముఖ్యస్థలములలో దేశరక్షణ సంఘము లేర్పాటుచేసి అధికారుల సహకారమువెంట శాంతి సేవాదళమును నియమించి పనిచేయునట్లు ప్రభుత్వమువారు ఉత్తరువుల నీయవలెను. మొత్తము మీద పట్టణములలోను గ్రామములలోను భయభీతావహములను తొలగించి సమయము వచ్చినప్పుడు తోటిమానవుల మానప్రాణ ధనములను రక్షించుటకు ప్రతి ఆంధ్రుడును ఆత్మసమర్పణము చేయవలసి వచ్చును.

మన దేశమున ధాన్య సమృద్ధి కావలసియున్నది. యిందుకు కర్షకులను అధికముగా ప్రోత్సహించవలసి యున్నది. ఈమధ్య ఓరుగల్లునందు జరిగిన ఒక రక్షణాలోచన సమయమందు మా ఓరుగల్లు సుబేదారుగారు ధాన్యవృద్ధి కొరకు చేయు అధిక సాగుబడి భూములపైన సగముశిస్తు చేయనున్నారని శలవిచ్చి యున్నారు. కాబట్టి మెరక ధాన్యము పండించు భూములపైన సగము శిస్తు వరకును పల్లపు భూములపైన కనీసము మూడవవంతు వరకును తగ్గించుట అవసరమని మనవి చేయవలెను. మన జిల్లా సంఘముల ద్వారా ధనధాన్యోత్పత్తికి వలయు ప్రత్యేక ప్రయత్నముల చేయవలెనని కర్షకులకు ప్రోత్సాహ మొసంగ వలెను. వ్యవసాయ శాఖవారు గ్రామ గ్రామము సంచారముచేసి ఆముదపిండి వేరుశనగపిండి మొదలగు యెరువులు, మంచి విత్తనములు అరువు పూర్వకముగా సప్లయి చేయించవలెను. వీలున్నంతవరకు ఎట్టి శలవులేకుండా మెట్టభూములలో చెరువు నీటితో మెట్టపల్లం పైర్లు వేసి ధాన్యోత్పత్తి చేయవలెను. పడావపడియున్న పల్లపు భూములలో మెట్ట సాగు చేసుకొనుటకు అవసరమైనప్పుడు నిలవయున్న చెరువు వాగు నీటినుంచి ఒకటి రెండు తళ్ళు ఎట్టి అధికపన్ను లేకుండా తీసు కొనుటకు సౌకర్యమేర్పాటు చేయవలెను. ధనికులు తమ ద్రవ్యమును దాచుకొను టకు నిర్భయమగు తావుదొరకక సందేహ పడుచున్నారు. అట్టివారు భూస్వాముల కును, కర్షకులకును, పరిశ్రమలకును స్వల్ప వడ్డీపైన పెట్టుబడులు పెట్టవలె. సహకార శాఖవారు అనతికాలములో భూమి తాకట్టు బ్యాంకులను ప్రతి జిల్లాయందును స్థాపించవలెను. యుద్ధము సమాప్తిచెంది శాంతి సిద్ధించువరకు అన్ని రుణముల పైనను 0-4-0లకు మించిన వడ్డీని నిషేధించవలెను. దొరతనమువారు రైతులకు విరివిగా తకావిపద్ధతిపైన రుణములనిచ్చి ప్రోత్సహించ వలెను. పాత బకాయలు మొదలగు మతాలబాలను గురించి కఠినము చేయరాదు.

## ఆంధ్రోద్యమము

ఉత్తమ పితామహులగు శ్రీయుత మాడపాటి హన్మంతరావు పంతులుగారిచే స్థాపింపబడి, 20 సంవత్సరముల నుండి చల్లని నడకను పనిచేయుచున్నది. బాల్య విద్యాదిదశలు గడిపి స్వాతంత్రేచ్ఛ దశకుప్రాప్తించినది. ఇప్పటి వరకు వివిధ మండలములలోన మహాసభలు చేసి దేశావసరములను, ప్రజలకును ప్రభుత్వమునకును తెలిపియున్నారు. ముఖ్యముగా రైతుల కష్టనష్టములను విచారించి ప్రభుత్వమునకు నివేదించి యున్నాను. అందుముఖ్యముగా పాత బావుల క్రింద తీసుకొనబడుచున్న తరీ (పల్లపు) బాగాయితి పన్నుల తగ్గింపులు గమనించ తగినవి. ప్రస్తుతము బాగాయితి ధారాలలో 2/3 వంతు వరకు శిస్తు ఆపబడుచున్నది. తరీ (పల్లపు) శిస్తుల తగ్గింపును గురించి ఆలోచించుటకై ప్రభుత్వమువారు ఏర్పాటు చేసి కొందరి అభిప్రాయములను తీసుకొనియున్నారు. ఇంక నెన్నియో విషయములు ప్రభుత్వము వారికి స్పష్టముగా దెలిపి సౌకర్యములను పొందవలసి యున్నది. వాటిని ముందు మనవి చేసెదను. కాని అన్ని జిల్లాలలోను సక్రమ పద్ధతితో జిల్లా సంఘములు పనిచేయుటలేదు. కొన్ని తాలూకాలలో సంఘములే లేవు. గ్రామవాసుల స్థితి అధ్వాన్నముగానే యున్నది. మన రాజ్యమున 80 లక్షల ఆంధ్రులున్నారు. గాని ఉద్యమమునకు చేరిన ప్రాధమిక సభ్యుల సంఖ్య స్పష్టముగా నున్నది. ఈ లోకమున ప్రచారము ప్రబోధము బాగుగా జరుగకుండుటయే కారణము. గాన ఇకముందు జిల్లా తాలూకా సంఘముల కార్యకర్తలు ప్రచార భారము వహించి, విరివిగా సభ్యుల చేర్చవలెను.

## నియమావళి

మన ఉద్యమము నియమబద్ధముగానే నడుపబడు చున్నది. ఉద్యమారంభ మున కేంద్ర సంఘ నిబంధనలను పేర ఒక నియమావళిని హనుమకొండ సమావేశమునందే సిద్ధముచేసి యున్నాము. పిమ్మట సిరిసిల్లలోని చతుర్దాంధ్ర మహాసభలో మహాసభా నియమావళియను నొక నిబంధనను అంగీకరించి యున్నాము. చిల్కూరులోని అష్టమాంధ్ర మహాసభలో ప్రస్తుత నియమావళిని అంగీకరించి యున్నారు. అదియు అసమగ్రముగానే యున్నది. అందు ఆచరణ యోగ్యమగు నియమములు చేరవలసి యున్నవి. గాన వెంటనే ఉపసంఘము ద్వారా ఆ పని పూర్తి చేయించవలెను.

## జిల్ల తాలూకా సంఘ నియమములు

ఇప్పటివరకు జిల్లా సంఘముల కన్నిటికిని సరియగు నిబంధనలులేవు. ఆయా సంఘములు తమ ఇష్టానుసారమొక పుస్తకమును సిద్ధము చేసుకొన్నను అవియు సంకుచితముగా నుండుటయే గాక పరస్పర విరుద్ధములుగా నుండవచ్చును. గాన అన్ని జిల్లా తాలూకా సంఘములు ఒకే మార్గమున పని చేయుటకు ఓ సూత్రముపైన నియమావళిని సిద్ధము చేయించవలసి యున్నది.

## తాలూకా సంఘములు

ప్రతి తాలూకాకును ఒక సంఘముండుట విధియని మనము నిర్ణయించు కొనవలెను. తమ జిల్లాలోని ప్రతి తాలూకాకును సంఘస్థాపన జరుగనంత వరకు జిల్లా సంఘము అసగ్రముగా నెంచబడును. మండల సంఘ కార్యకర్తలు తమ కర్తవ్యమును నెరవేర్చినవారు కాజాలరు.

## పట్టి (ఫిర్కా) సంఘములు

దేశమున నాగరికత విజ్ఞానము జాగరూకత పెంపొందించుట మన ప్రథమ కర్తవ్యము. గనుక ఈ పని క్రింది సంఘముల ద్వారానే విరివిగా సాగించవలెను. చురుకుగా పని సాగుచున్న తాలూకాలలో పట్టిసంఘములు స్థాపించి ప్రబోధము కలిగించవలెను. సంఘముల సంఖ్య ఎక్కువ అయిన కొలది వేతనము పొందు ప్రచారకుల ఆవశ్యకత తక్కువ కాగలదు.

## ఉద్యమ తత్వము

ప్రతి ఉద్యమము దేశాభ్యుదయమునకై ఏర్పడి పనిచేయును. అవసరము లను బట్టి బాధ్యతలెరిగిన అనుభవజ్ఞులగు కార్యకర్తలు తత్వమును నిర్ణయించు చుందురు. అఖిల భారతాభ్యుదయమునకై కాంగ్రెసు మహాసభ 57 సంవత్సర ముల నుండి పని చేయుచున్నది. దాని చారిత్రాత్మకమగు తత్వమును గమనించి నట్లయిన లోకమాన్యులును రాజ్యాంగతత్వ నిపుణులును అగు కార్యకర్తలు దేశకాల పాత్రానుసారముగా వంపుదింపులను కనిపెట్టి ఘోర తరంగములకు గురికా నీయక సముద్ర మధ్యమున నావను నడుపు నావికులవలె అనురక్షణమున ముందు వెనుకలకు నడిపించుచున్నారు. ఏకైక నియంత రాజయోగి పుంగవులు పరమ భాగవతోత్తముడగు గాంధిమహాత్ముని ఆధ్వర్యమున భారత జాతీయోద్య మము

నడిపింపబడుచున్నది. ఉద్యమమును ఆయన వదలజాలడు. ఫార్వర్డుబ్లాకు ఒక పక్షమున, సోషలిష్టు లింకొకవైపున, జాతీయోద్యమ సౌధమును ఊపుచున్నారు. గాని మహానాయకుని సూక్ష్మగ్రహణశక్తి వాటి నన్నిటిని చేతులబట్టుకొని కాపాడుచున్నది. వాస్తవముగా ఉద్యమ నిర్మాతకు దూరాలోచన వ్యూహ నిర్మాణ కౌశలత్వము స్వభావముగా ఉండితీరును కనుక మన మీయంశమును దృష్టి యందుంచుకొని మన ఉద్యమ పితామహునియందు గౌరవముంచి యావజ్జీవ సలహాకర్తయని తీర్మానించుటకు మిమ్ములను కోరుచున్నాను. దాని లాభమును గ్రహించగలము. మన ఉద్యమమున జాతి మత వర్ణభేదములు లేవు. మన వలన ఏ మతమునకు గాని ఏ వర్ణముకుగాని కష్టము కలగకూడదు. ప్రతి వ్యక్తి తన మానసిక తత్వము ననుసరించి తన ఇష్టము వచ్చిన మతమునకు బద్ధుడు కావచ్చును. వకాని వ్యవహార రంగమున మత వర్ణ వంశ వృత్తులను బట్టి ఎట్టి తారతమ్యము లుండరాదు. మత సాంఘిక విషయములలో జోక్యము కలిగించుకొని పరస్పర ద్వేషములను పెంపొందించు కొనరాదు. మాతృదేశా రాధనకు అందరు సమానులే. సర్వమానవ సౌభ్రాతృత్వమే పరమాదర్శము. సత్య అహింసలు ముఖ్య ధర్మములు. ప్రజలు తమ హక్కుల కొరకు శాసనబద్ధమగు పద్ధతులతో శాంతియుతమగు సక్రమాందోళనము చేయవచ్చును. సభ్యులందరు సంఘము కొరకును నీతి విరుద్ధమగు కుట్ర పద్ధతులను నవలంభించరాదు. దేశ వ్యవహారమున కూడ బాహ్యాభ్యంతరము లందు భేదములుండరాదు. వేయేల నేటి జగద్గురువన దగు మాహాత్ముని నీతి ఉపదేశములను జ్ఞాపకముంచుకొనిన జాలును.

## ప్రస్తుత దృష్టి

ఒక విషయము అలౌక్యముగాను నిష్కాపట్యముగాను మనవిచేసి నందుకు భ్రాతృవిశ్వాసముతో నన్ను క్షమించవలెను. మనదేశమున స్వల్ప దినముల నుండి కొందరు యువకులు వృద్ధుల మందగమనమును గర్హించుచు నూతన పక్ష విజృంభణమునకు ప్రయత్నించు చున్నారు. ఇది నా పొరపాటయిన క్షమించవలెను. నిజమైనచో అనర్థదాయకమని మా యువక సోదరులతో మనవిచేయక తప్పదు. నేను వృద్ధుడనుగాని దేశాభివృద్ధి గమ్యస్థానము చేరుటకు యువకుల కన్నునునాకెక్కువ కోరికలున్నవి గాని వార్ధక్య ప్రభావమో? న్యాయశాస్త్ర పరిచయ ఫలితమగు పిరికితనమో? గాని వాటిని ఎల్లలో నుంచకతీరదని గ్రహించవలసి వచ్చినది.

సోదర సోదరీ మణులారా! నా జీవితములో ఆర్థికముగాను నైతికముగాను రాజకీయముగాను మిమ్ములను ఉన్నత స్థానమున చూచి సంతోషించ కోరుచున్నాను. ఇట్లే మీ జ్యేష్ఠ సోదరులగు వయోవృద్ధులు మీ కొరకు భవిష్యత్సం తానమునకును శ్రేయస్సునే కోరుచున్నారు. గాన విభేదములను చేరనీయక వారి అనుభవశక్తులను వృధాగానీయక వారిని ముందిడుకొని వారి సలహా వెంట వ్యవహార రంగమున మీ శక్తి సామర్థ్యములను ప్రదర్శింపవలెను. అట్లయిన వుద్యమము దుర్భేద్యమయిన పెట్టని కోటవలె నుండును.

## మన ఉద్యమ సంబంధము

ఆంధ్ర దేశమున మన నిజాం ప్రభుత్వములోని ఎనిమిది మండలములే గాక చాల విశాలమైనది. బ్రిటీషు పరిపాలన క్రింద 1కోటి 80 లక్షలు ప్రజలుగల 13 మండలములున్నవి. మైసూరు రాజ్యమున ఒక జిల్లాయున్నది. బస్తరు రాజ్యమున కొంత భాగమున్నది. నాగపూరు రాజధానిలో కూడా సిరవంచయను ఒక తాలూకా యున్నది. యివన్నిటితో చేరిన సమగ్రాంధ్ర దేశము చాల గొప్పది. యిదిగాక మన ఆంధ్రులు, తమిళ, కర్నాటక, మరాఠ మొదలగు యితర ప్రాంతము లలోను, బర్మాలోను స్థిర నివాసము లేర్పరుచుకొని యున్నారు. వీరందరి కొరకు మనమేమియు ప్రయత్నము చేయజాలము. మన ప్రయత్నము నిజామాంధ్ర మండలముల వరకనియే మనము స్పష్టపరచి యున్నాము. బ్రిటీషు ఆంధ్ర దేశీయులు ప్రత్యేక రాష్ట్ర నిర్మాణము కొరకు రాజకీయముగా చేయు ప్రయత్నములో మనము పాల్గొనజాలము. గాని నైతికముగాను, భ్రాతృభావముతోను మనము వారి అభివృద్ధినే కోరెదము. గనుక ప్రత్యేకాంధ్ర రాష్ట్రము లభించుట మనకును సంతోషదాయకము. మన ఓరుగల్లుకు సమీపమున ఉత్తర సర్కారులోని మధ్యాంధ్ర దేశమున నున్న బెజవాడలో రాజధానికి ముఖ్యపట్టణమై, మహబూబు నగరమున జిల్లాకు సమీపమున రాయలసీమలోని (దత్తమండలములలో) అనంతపురమున విశ్వవిద్యాలయము నెలకొల్పబడిన యావదాంధ్రులము సుహృద్భావముతో ఆనందించ వచ్చును. ప్రత్యేకాంధ్ర రాష్ట్రము కొరకు నిరంతర కృషి సల్పుచున్న మహాసభాధ్యక్షులు శ్రీ మహారాజకుమార సర్ విజయానంద గణపతి దేవుగారిని అభినందించవలసి యున్నది.

## ఆంధ్రదేశ నాగరికత

దేశ నాగరికతకు పరిపాలనతో సంబంధ ముండవలసిన పనిలేదు. విశాఖ పట్టణము నుండి నెల్లూరు వరకును మచలీ బందరు నుండి వికారాబాదు వరకును గల భూభాగమున నివసించెడి వారందరు ఆంధ్రులే అయినను ఒక్కొక్క మండల మునకు ఒక్కొక్క సాంప్రదాయములను కలిగి యున్నారు. సాధారణముగా మనిషిని చూచినప్పుడును, మాట్లాడినప్పుడును మనము తెలుసుకొనవచ్చును. సమమగు నాగరికతాభివృద్ధిని కలిగించుటకు మనము ప్రయత్నించవలసి యున్నది. నానా మండలములలో సమావేశ పరచబడుచున్న ఇమ్మహాసభలకు వచ్చెడి సభ్యుల కలయిక వలన యీ విషయము సక్రమముగా ఏకత్వ మేర్పడగలదు.

## ఆంధ్ర భాష

పై విధముగానే అనుదినముమాటలాడు భాష పశ్చిమ భాగమునకు పోను పోను భిన్నముగా నుండినను, వరంగల్లు మండలములోని తూర్పుపశ్చిమ తాలూకా లలోనే భేదము స్పష్టముగా గాన్పించును. యిట్లే వ్రాతలో కూడా విపరీత తారతమ్య ములు చూడగలము. అక్షరముల పోలిక దస్తూరీయోడీ, యివన్నియు సంకరముగా నున్నవి. మనము భాషను (లిఖిత హక్కు)లను బహువిధముల సంస్కారము చేయవలసి యున్నది.

## వ్యాపార పద్ధతులు

వేషభాషలలో ఎట్లు తారతమ్యము చూచు చున్నామో అట్లే వ్యాపార మానములు అనగా కొలతలు తూకములు స్థలభేదముల ననుసరించి ప్రత్యేక శబ్దములు వాక్యములలో ఉచ్చరింపబడు చున్నవి. ఒక పుట్టి ధాన్యమునకు ప్రత్యేక స్థలములలో ప్రత్యేక పరిమితిగా వాడుచున్నారు. గాన మనము నిజామాంధ్ర మండలములలో ఐక్యత స్థిరపరచుటకు ప్రయత్నించవలెను.

## ఆంధ్రత్వము

ఆంధ్రు లేభూభాగమందున్నను ఏకజాతివారనుటకు సందియముండదు. ఆంధ్రులు సంబంధ బాంధవ్యములను తరుచుగా తమ జాతివారితోనే చేయు చున్నారు. గాన వారి ప్రత్యేకత సర్వతోముఖాభివృద్ధికిని ప్రతి ఆంధ్రుడును కోరుచునే యున్నాడు.

## మన తెలంగాణా ప్రత్యేకత

పాకిస్థాన్ వంటి కోరిక మనము కోరకూడదు. గాని ప్రభుత్వము యొక్కయు ప్రజల యొక్కయు సౌకర్యముల కొరకు సాధ్యమైనంత వరకు ఆంధ్ర మండలము లన్నియు ఒకే ప్రాంతమున నుండి ఒకే ప్రాంతీయాధికారికి లోబడియుండుట శ్రేయోదాయకము. గాన యావదాంధ్ర మండలములలో రెండు సుమేదారీలకు బదులు సదర్ నిజామత్ సిమ్తే తెలంగాణా అను మహకమాను పూర్వమువలె నుంచి మరికొన్ని యితర సరిష్తాల ప్రాంతీయ కార్యస్థానములు కూడా ఓరుగల్లు నందు ఏర్పాటు చేసిన తెలంగాణా అనాది ప్రాముఖ్యతను కాపాడి ఆంధ్రుల ఆంధ్రత్వమునకు ప్రోత్సాహ మొసంగవలెనని దొరతనమువారిని కోరవలెను.

## విద్య

నిత్య జీవనమునకై ఎన్నియో సౌకర్యములను సమకూర్చుకొనవలసి యున్నది. అందు ముఖ్యమైనది విద్య. మన దేశము విద్యలో చాలా వెనుకబడి యున్నదనుటకు సందేహము లేదు. విశ్వవిద్యాలయము స్థాపించి విద్యకొరకు సాలానా దాదాపు 1 కోటి రూపాయలు వ్యయపెట్టుచున్నారు. యిందు విశేష భాగము ఉన్నత విద్యకై వ్యయపెట్ట బడుచున్నది. పెద్ద ఉపాధ్యాయుల, బోధకుల వేతనములు అధికముగానే యున్నవి. గనుక ముఖ్యముగా విద్యాశాఖ వరకైనను ప్రజాయుత్తముచేసి ప్రజల సహకారముతో వ్యయపెట్టబడు ద్రవ్యలాభమును ఇనుమడింప చేయవలెను. విద్యా వ్యాపాకమునకు ప్రస్తుత పాఠశాలలే కాక ప్రజాయత్తమగు ప్రాధమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు స్థాపించుకొనుటకు ఎట్టి నిబంధనలు లేకుండా ప్రజల కధికార మీయవలెను.

## నిర్బంధోచిత విద్య

ఇప్పటివరకు జరిగిన ఆంధ్ర మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతీయ మహాసభలే కాక ప్రభుత్వాయత్త ప్రజాయత్త విద్యా సభలలో కూడా ప్రాధమిక నిర్బంధోచిత విద్య సత్వరముగా కావలెనని కోరియున్నారు. గాన విద్యాపోషకులగు ప్రభుత్వము వారిని, ప్రాధమిక నిర్ధళిచిత విద్యను త్వరగా ప్రారంభించ వలెనని కోరవలెను.

## మాతృభాష

భరత ఖండమున ఆంగ్ల ప్రభుత్వము ప్రారంభించినది మొదలు భారతీయుల కెట్టి విద్య నేర్పవలయునో అను విషయము మాలోచనీయముగానే యుండి ప్రజలకు విద్యాదాన మొసంగుట యందు కూడ రాజకీయ రహస్య మిమిడి యుండియే వచ్చినది. దేశనాయకులు తమ ఆవశ్యకతను తాము గ్రహించ గల్గి మాతృభాషనే విద్య గరుపవలెనని కోరుచుండిరి. మొత్తంమీద విద్య మాతృభాష యందే గరుపుటత్యుత్తమ మని నిర్వివాదముగా అంగీకరించి యున్నారు. మన నిజాం రాష్ట్రము నందును ఆంధ్రులు తదితర తోటిసోదరులు అనేక మహాసభలలో ఎక్య కంఠముగా అభిప్రాయ మిచ్చియున్నారు. దీని ప్రాశస్త్యమున అనుభవజ్ఞులగు అధికారులు యోచించుచున్నారు. ఈ రాజ్యమున ఆంధ్ర మరాట, కర్నాట ప్రాంతీయ భాషలున్నవి. ప్రత్యేక ప్రాంతములలో ప్రత్యేక భాషలో బోధించవలసి వచ్చును. ఉర్దుకు ప్రాముఖ్యత నశించు ననెడి భయమువదులును. ప్రభుత్వమునకు మతముతో గాని భాషతోగాని ప్రత్యేకావశ్యకత లేదు. రాజు విద్య మతముల రక్షకుడు పోషకుడు అయినందున ప్రజాభిరుచి ననుసరించి ఉచితమగు భాషలోనే వ్యవహారములు నడపవచ్చును! జాతి మత భేదములేకుండా ప్రాథమిక విద్యతో ప్రాంతీయ భాష నిర్బంధముగా నుండునట్లు చేయవలెను. అట్లయిన ప్రజలందరకు స్థానిక భాషలో ప్రవేశముండి తీరగలదు. ఇంతకాలము నుండి ప్రజల మొరలాలకించి బాలురకు ప్రాథమిక విద్య మాతృభాషలో గడపుటకును బాలికలకు మాధ్యమిక విద్యవరకు మాతృభాషలో గరపుటకు అంగీకరించి యున్నారు. గాని బాలికలకు ఉర్దు చదవ వలసిన నిర్బంధముపెట్టి యున్నారు. బాలికలకు యీ నిర్బంధమును తొలగించి ఐచ్ఛికముగా నుండునట్లు చేయుటకు బాలబాలికలను భేదము లేకుండా ఉన్నత విద్య వరకు మాతృభాషలోనే బోధింపచేయుటకును దొరతనమువారిని కోరవలెను.

## విద్యాభివృద్ధికి స్వయంకృషి

దొరతనమువారు కోటి రూపాయలు వ్యయపెట్టుచున్నను ప్రజా సహకారము లేనిది అనుకున్నంత ప్రయోజనము లభించుటలేదు. పల్లెలో తమ పిల్లలను పాఠశాల కంపుటకు తలిదండ్రులు శ్రద్ధచేయుట లేదు. గనుక నిర్బంధ విధానములు లోనికి వచ్చువరకు గ్రామాలలోని విద్యావంతులు బోధించి పాఠశాలలో ఎక్కువ విద్యార్థులుచేరి లాభము పొందునట్లు చేయవలెను. తాలూకా

సంఘములవారు ఏఏ గ్రామములలో పాఠశాలలవసరమో, విద్యా శాఖాధికారులకు విజ్ఞప్తులు పంపుచుండ వలెను. గ్రామములలోను, తాలూకా జిల్లా ముఖ్య స్థలములలోను ఖాస్గి (ప్రయివేటు) పాఠశాలలు కొన్ని ఉన్నవి. అవన్నియు సాధారణముగా ప్రాథమిక పాఠశాలలుగానే ఉన్నవి. ఓరుగల్లు నగరమున ప్రాథమిక ఖాస్గీ పాఠశాలలు 45 వున్నవి. అందు షుమారు 2000ల మంది విద్య గరపబడుచున్నారు. ఇట్టి పాఠశాలలను విద్యావంతులు, ధనికులు చేయూత నొసంగి కాపాడవలెను. సాధారణముగా ఆదర్శప్రాయమగు ఒక ఉన్నత పాఠశాలను ప్రతి మండలముననను ప్రజలు స్థాపించి మాతృభాషకు ప్రాధాన్యత యిచ్చిన లాభమును ధృవపరచవలెను. యిక ముందు సంవత్సరములలో మన కార్యక్రమమున దీనిని ప్రాముఖ్యముగా నుంచుకొనవలయును.

## విద్యా పరిషత్తులు

దొరతనమువారు కొంతకాలము క్రిందట ప్రాథమిక మాధ్యమిక తరగతులలో ఉత్తీర్ణులైన వారలకు యోగ్యతా పత్రముల నిచ్చుచుండెడివారు. యిప్పుడా పద్ధతిని మాని ఉన్నత విద్యా పరీక్షలకే ఇచ్చుచున్నారు. మన ఉద్యమ పక్షమున పరిషత్సంఘము నొకదానిని స్థాపించి ఖాస్గీ పాఠశాలల విద్యార్థులకు ప్రాథమిక మాధ్యమిక యోగ్యతా పత్రములనిచ్చి ప్రోత్సహించవలెను.

## స్త్రీ విద్య

స్త్రీలలో విజ్ఞాన మభివృద్ధినొందించుటకు విద్య మిక్కిలి ఆవశ్యకమని అంగీకరించిన విషయమే. జన సంఖ్యలో పురుషులకన్న స్త్రీ జనసంఖ్య తక్కువగా లేదు. అయినను పురుషులకున్న విద్యా సౌకర్యములు స్త్రీలకు లేవు. బాలికా పాఠశాలల సంఖ్య చాలా తక్కువ. ఉన్నత విద్య బహుస్వల్పము. మన రాజ్యమున ఉర్దురాని బాలికలకు ఉన్నతవిద్య నభ్యసించుట కవకాశము లేదు. ఈ కారణమున ఉర్దు మాతృభాషగల బాలికలు ఎక్కువగా ఉన్నతవిద్య నభ్యసించ గల్గుచున్నారు. ప్రభుత్వము వారు ఉర్దు విధానపు పాఠశాలలను సమ్మేళనము చేయుచున్నారు. అదియు మన సౌకర్యములకు విరుద్ధమని తెలియవచ్చుచున్నది. ఇట్టి లోటులను తొలగించుటకు హైద్రాబాదు నగరమున శ్రీ రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డిగారి అనుగ్రహముచే శ్రీ హనుమంతరావుపంతులుగారి నిరంతర కృషివలన బాలికల ఉన్నత పాఠశాల దినదినాభివృద్ధి గాంచుచున్నందుకు మనమందరము వారల

నభినందించవలసి యున్నది. ఇట్లే ఖమ్మంలో సుమారొక సంవత్సరము క్రితము బాలికాపాఠశాలను స్థాపించి జయప్రదమముగా నడుపుచున్నందుకు శ్రీయుతులు వేముగంటి రామకృష్ణారావు, కల్వల రాజారాం రావుగారి యొక్కయు నల్లగొండలో నిట్టి సంస్థను నడుపుచున్న శ్రీయుత వెదిరె గోపాలరెడ్డిగారి యొక్కయు వారి మిత్రుల యొక్కయు ప్రయత్నములు ప్రశంసనీయములు.

## జాగీర్లు – సంస్థానములు

గైరుఖాల్సా అనగా జాగీరు సంస్థానముల భూభాగములు శ్రీశ్రీశ్రీ ఘనత వహించిన ప్రభువరేణ్యుని పరిపాలనము లోనైన భాగమమేననియు, అచ్చటి ప్రతిపౌరుడు నిజాం ప్రభుత్వ పౌరుడేననియు నిర్వివాదముగా చెప్పదగిన విషయము. కనుక తమ పౌరులెచ్చటనున్నను అతని యోగక్షేమమును ప్రభుత్వము వారు కనిపెట్టుచుండవలెను. గావున జాగీర్లు సంస్థానములలో ఖాల్సాతో సమానముగా విద్యాభివృద్ధి చేయునట్లు శాసించవలెను. మన దేశములోని నవాబులు రాజాలు పెక్కులు విద్యాధికులు విదేశయాత్ర చేసి వచ్చిన వారున్నారు. వారందరు తమ తమ యిలాకాలలో విధిగా పాఠశాలల నెలకొల్పి తమ పేరును చిరస్థాయిగా నుండునటుల చేయవలెను. వివేకవర్ధనీ ఉన్నత విద్యాలయమును స్మరించినపుడు కీ.శే. ధర్మవీర వామన నాయకుగారు జ్ఞాపకము రాకమానరు.

## వ్యవసాయము – పశు చికిత్స

మన రాజ్యమున వ్యవసాయ కళాశాల పశువైద్య విద్యాలయములు స్థాపించబడలేదు. ఈ రెండు విద్యలు రైతుల క్షేమమునకై చాలా అవసరమై యున్నవి.

## పరిశ్రమలు

మన దేశ పరిశ్రమలెన్నియో క్షీణించుచున్నవి. ఓరుగల్లు తివాచీలు, జంపఖానాలు, నవారు, జగిత్యాల పెంబర్తి గ్రామముల వెండిపని, కోరట్ల కాగితములు సిద్ధిపేట పట్టువస్త్రములు మొదలగు పరిశ్రమలు ప్రజాసహాయ్యమును కోరుచున్నవి. యింతకును ముఖ్యమైనవి ఖద్దరు. ఇది కావలసినంత దొరకుటలేదు. ఖద్దరు అంగడులు విరివిగా నుండవలెను. రాట్నములు, మగ్గములు, ఇంటింట నెలకొల్పబడవలెను. ఖద్దరు పరిశ్రమకు ప్రోత్సాహ మివ్వగలందులకు ప్రభుత్వము వారు ఒక స్కీము మంజూరు చేయించి యున్నారు. నేత పరిశ్రమకు 40 లక్షలు మంజూరీ అయివున్నది. ప్రభుత్వమువారి ఆదరము ప్రశంసనీయము.

## రైతు సమస్యలు

1. బందోబస్తు విధానము. మద్రాసు ప్రెసిడెన్సీ విధానమువలె నుండుటయు, అన్ని కాగితములకు రహస్యము లేకుండా నకళ్ళిప్పించుటకును వుత్తరువులు కావలసియున్నవి.

2. తరీధారల కొరకు ఏర్పాటు చేయబడియున్న కమిటీలలో ప్రాంతీయ మహాసభా సంఘముల పక్షమున పేర్కొనబడిన మరికొందరి అనుభవజ్ఞుల సాక్ష్యమును తీసికొని త్వరలో పల్లపు ధారాలను తగ్గించవలెను.

3. జమాబందిలో విధించు అధికపన్నులు, అపరాధములు వ్యవధి వెంట రైతులకు తెల్పి వారి జవాబులను విని విధించు చుండవలెను.

4. రైతులు తమ పట్టాభూములలోని తాటి యీత చెట్లు ఆకులు, మట్టలు, ఫలములు, ఎండినచెట్లు, మొదలైనవి స్వేచ్ఛగా అనుభవించుటకు నిరోధములను తొలగించి గీతహక్కును ప్రభుత్వముకొరకు వుంచుకొనవచ్చును.

5. అడవి తాలూకాలలో క్రూరమృగముల బాధవల్ల వ్యవసాయ పశువుల మనుష్యుల ప్రాణములు కోల్పోవ బడుచున్నవి. గాన షికార్ గాక నిబంధనల మార్పుచేసి క్రూరమృగములను చంపుట కెట్టి నిర్బంధము లేదని శాసించవలెను.

6. కరోడ్గిరీ అ. మనకు సముద్రములేదు. రేవు స్థానములేదు. గనుక జన సామాన్య మున కంతకును కొన్ని పశువులకును ఆహార ముఖ్య భాగమనదగు వుప్పు బయట నుండి రావలసియుండును. అట్టి వుప్పుపైన కరోడ్గిరీ చెల్లించవలసి యుండును. యీ కారణమున మన దేశములో వెలుపల కన్న ప్రియముగా తీసుకొనవలసి యుండును. గాన బీదసాదలకు కనువగునటుల ఉప్పు పైన కరోడ్గిరీ పన్నులు తీసివేసి ప్రజల కృతజ్ఞతకు పాత్రులు కావలెనని కోరుచున్నారు.

ఇ. సరిహద్దు గ్రామములలో ఉన్న దొరతనములకు సమిష్టి పౌరులు పట్టాదారులు పెక్కురున్నారు. ఒక ప్రభుత్వము నుండి మరియొక ప్రభుత్వము ప్రభుత్వములోనికి కర్షకులు తీసికొనిపోయెడి వ్యవసాయ పనిముట్లు పశుగ్రాసములపైన కరోడ్గిరీ పన్ను తొలగించిన రైతులకు కొంత సౌకర్యము కల్గునని మనవి చేయవలెను.

### గ్రామ పునర్నిర్మాణము

యీ సమస్య యందు సహకార శాఖవారు ఎక్కువ శ్రద్ధ వహించు చున్నారు. ఈ విషయమున ఒకటి రెండు గ్రామములలోనే గాక సర్వతోముఖముల లాభములు పొందవలెననిన మాలు లోకల్ ఫండువారు కూడా ఎక్కువగా శ్రద్ధవహించవలెను. మన ఆంధ్రోద్యమమున ఈ విధానమును ప్రభుత్వ సహకారముతో క్రియారూప ములో పెట్టుటకు ప్రయత్నించవలెను.

### గ్రామోద్యోగులు

వీరివలన రైతులకు ఉపకారములు విరివిగా జరుగుచునే యున్నవి. వీరి స్వార్థ పర్వతము ప్రజాభ్యుదయమునకు భంగకరముగా నున్నది. గాన మన సోదరులగు వీరిని ప్రోత్సహించి పాత పద్ధతులను మాని ప్రజల వద్దను, ప్రభుత్వము వద్దను తమ విశ్వాసమును స్థిరపరచుకొనవలెనని కోరవలెను.

### స్త్రీల హక్కులు

స్త్రీలు పురుషులతోపాటు వ్యవహార ప్రపంచమున హక్కుల ననుభవించ లేరనియు వారి హక్కులను పురుషులు నిరోధించు చున్నారనియు అనుకొనుట పొరపాటు. సనాతనమగు ధర్మశాస్త్రమును సవరింపమనుట భారత నారీమణుల చారిత్రక ప్రాముఖ్యమును తిరస్కరించుట. కోలుపోవుటయని వేరుగా చెప్పనక్కరలేదు. వారితో మనకు అవినాభావ సంబంధము స్త్రీల నుంచి వచ్చిన పుత్రులు వారి తోబుట్టువులు అయిన పురుషులు స్త్రీలను ఎంత గౌరవించుచున్నారో చెప్పనక్కరలేదు. తప్పత్రాగి తన్నుకొని న్యాయస్థానముల కెక్కెడి దుష్టదంపతులతో మనకు సామ్యమక్కరలేదు. సాధ్వియగు గృహిణియు, యోగ్యుడగు గృహస్తుడును గల దంపతుల సామ్యమును చూచిన భారతీయ ధర్మముల ప్రాశస్త్యతను పొగడక మానము. సీత, దమయంతి, చంద్రమతి, సావిత్రి మొదలగు సాధ్వీమణుల పావన చరిత్రలు అనుదినము స్మరించి మన భూమి ప్రతిభల గూర్చి గర్వించు చున్నాము. ఆ భారత పుత్రికలగు మీరు పరమ ప్రతివ్రతలనియు వీరమాతలనెడి ప్రఖ్యాతిని అజరామముగ కాపాడవలెనని ప్రార్థన. ప్రస్తుతావస్థలో విద్యా ప్రభావమున స్త్రీలు తమ శక్తిని, తమ ధర్మమును మరచియున్నారు. మన స్త్రీలను విద్యావంతులుగను, వ్యవహార జ్ఞాన సంపన్నులుగను, ధైర్య సాహసములుగల వారిగను చేసి వారిలోని పిరికితనమును పోగొట్టవలెను.

## హరిజనోద్ధరణ

హరిజనోద్ధరణ మొదటినుండియు మన ఉద్యమమున ఒక భాగముగానే నుంటు వచ్చినది. అందుకొరకు మన నిధినుండి కొంతడబ్బును, యిచ్చుచు వచ్చినాము. ఇకముందు కూడా హరిజనోద్ధరణను గురించి మనము మరువ కూడదు. హరిజనులతోపాటు ఎరికెల యానాది లంబాడీ మొదలగు కొందరు అనాగరిక కులముల వారున్నారు. చెంచు మొదలగు కొండజాతుల వారున్నారు. వీరందర కొరకు కూడా మనము ప్రయత్నించవలసి యున్నది.

## వార్తాపత్రికలు

మనదేశమున పుట్టి చచ్చిన వార్తాపత్రికలు కొన్ని యుండెను. గాని వాటితో మనకు పనిలేదు. ప్రస్తుతము గోల్కొండ అర్ధవార పత్రిక ఒక్కటియే పనిచేయు చున్నది. ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రికలను తెప్పించి చూచుచున్నారు. బ్రిటిషు దేశములోని ఆంధ్రపత్రికలు కూడా మన నిజామాంధ్ర దేశమును అన్యదేశముగానే భావించుచున్నారు. యిచ్చటి వార్తలకు తావెక్కువ దొరకుటలేదు. గాన యావ దాంధ్రదేశము సమానముగ చూచి ఏజంట్ల ద్వారా వార్తలను తెప్పించుకొని నిజామాంధ్ర దేశపు వార్తలనుకూడా ప్రకటించుటకు పత్రికాధిపతులను కోరుచున్నాము.

## రాజ్యాంగ సంస్కరణలు

భారతదేశమున మార్లేమింటో సంస్కరణల తర్వాత మన దేశీయు లెట్టి కోర్కెలను గల్గియుండిరో నాకు జ్ఞాపకములేదు. గాని మాంటుఫర్డు సంస్కరణలు అమలులోనికి వచ్చినప్పటి నుండియు మన దేశములోని విద్యాధికులు శ్రద్ధగా గ్రహించి సంస్కరణలను గురించి ప్రసంగించుచు ప్రభుత్వమునకు తెల్పుచునే యుండిరి. కీ. శే. సర్ అలీయిమాం ప్రధాన మంత్రి కాలముననే కొన్ని సంస్కరణలు జరుగునని చెప్పుకొనిరి. చుట్టుప్రక్కల మద్రాసు, బొంబాయి రాజధానులలోని స్థానిక స్వపరిపాలనము చట్టనిర్మాణ సభలలోని ఆర్థిక సంఖ్యాకులగు ప్రజా ప్రతినిధుల ఎన్నికలు అనధికార సభ్యులలో నుండి కొందరు మంత్రివర్గమున చేరుట, విద్య స్థానిక స్వపరిపాలనము ప్రజా ప్రతినిధి మంత్రుల యధీనము చేయుట కనివిని యున్నాము. సన్ 1335 ఫసలీ ఆ ప్రాంతము లోకల్ ఫండు, సఫాయి సంఘము లెట్లుండ వలెనని మన ప్రభుత్వము వారు కోరినప్పుడు

నేనును నా మిత్రులు కీ.శే. సుదర్శనరావుగారును ఒక నివేదికను సమర్పించి యున్నాము. గాని యిప్పటివరకేదియు పని జరిగియుండలేదు. భారతదేశమున మాంటుఫర్డు సంస్కరణముల అనుభవము తర్వాత సైమన్ కమిషన్ విచారణ చేయించి రౌండు టేబుల్ కాన్ఫరెన్సును లండనులో జరిపించియున్నారు. యీ విచారణలో ప్రజా ప్రతినిధులకు తమ అభిప్రాయములను తెలుపుటకు పూర్తిగా అవకాశ మియ్యబడినది. దానిపైన 1935 సంవత్సరపు భారత రాజ్యాంగ నిర్మాణ శాసనము ప్రచురించబడినది. అందు రాష్ట్రీయ స్వపరిపాలనము సిద్ధించినది. గాని మనకును మహమ్మదీయులకును సంధి కుదరనందున యిండియా ఫెడరేషను ఏర్పడి యుండలేదు. యీ ఘట్టములన్నియు జరిగిపోయినవి. అక్కడి రాజకీయ హక్కుల సౌపానములో దేనికిని మనము చేరలేదు. మనము శ్రీమాన్ దివాన్ బహద్దూర్ అరవముదు అయ్యంగారి కమిటీ విచారణతో రాజకీయ హక్కులను పొందవలెననెడి ఆశలోనికి దిగినాము. వారి రహస్య విచారణ నివేదిక ప్రచురించబడినది. దానిని మీలో పెక్కుమంది చూచియే యున్నారు. రాష్ట్ర ప్రజల పక్షమున ఒక నివేదిక ప్రభుత్వమునకు నివేదింపబడినది. అటు తర్వాతనే ప్రస్తుత 1348 సంస్కరణములు ప్రసాదింప బడినవి. యీ సంస్కరణములను బాగుగా పరిశీలించి ఆంధ్ర, మరాట, కర్నాట ప్రాంతీయ సభలు తమ అసమ్మతిని వెల్లడించి నిరాకరించినవి. యిత్తెహాదుల్ముసల్మీను సంఘమువారు నాపసందు చేసినారు ఇకెవరికొరకు? ఇన్ని అభిప్రాయములు చేరిన తర్వాత ప్రభుత్వము వారు అన్ని పక్షముల వారిని రప్పించి సంప్రతించి ఏదేని మార్గమునకు రావటము అత్యుత్తమ మార్గము. మన దేశములో కొందరు పాశ్చాత్య దేశములకేగి ఉత్తమ పరీక్షలనిచ్చి పరిపాలనా విధానముల చూచివచ్చినారు. భారత రాజ్యాంగ పరిపాలన సౌకర్య విశేషముగ చదివి, గ్రహించి చూచియున్నారు. దేశీయ రాజ్యాంగ విధానములను పరస్పర భేదములను కూడా తెలుసుకొని యున్నారు. చదువరు లెల్లరు దేశ చరిత్రలను వార్తా పత్రికలను చూచుచున్నారు. సర్వజనులు యింటింట ప్రతిధ్వ నించుచున్న రేడియో వార్తలు వినుచున్నారు. ఈ దేశ ప్రజలలో తమకెట్టి రాజ్యాంగ విధానమవసరమో ఎందు ప్రభుత్వమునకు ప్రజలకును లాభదాయకమో చెప్పగల సమర్థులున్నారు. దేశ ప్రజలు భక్తి విశ్వాసములు గలవారు. తమకు కావలసిన హక్కులు కొలది కాలములో దయగల ప్రభుత్వమువారే ప్రసాదించెదరని విశ్వసించి యున్నాము. సాధారణముగా ప్రక్కనున్న బ్రిటీషు రాష్ట్రములలో పరంపర ప్రసాదిం చబడిన హక్కులు వారి మెదడు నందున్నవి గనుక ప్రస్తుత సంస్కరణలు ఆచరణ యోగ్యములు కావని వారు తలచుచున్నారు. కావున సంస్కరణలు ఉన్నతస్థితిలోనే

ఆచరణలోనికి దింపుటకన్న అధికార అనధికార సభ్యులుగల సంఘము ద్వారా ప్రజాప్రతినిధుల అభిప్రాయము ధారాళముగా తెల్పుట కవకాశమిచ్చి ఎట్టి విధాన మవసరమో మరియొకసారి తెలిసికొనుట అవసరమని మనవి చేయుచున్నాను. యీ సంస్కరణల తర్వాతనే దురదృష్టవశమున ప్రపంచ యుద్ధము తటస్థించు టయు, అందు మన ప్రభుత్వమువారు గూడా పాల్గొనవలసి వచ్చుటయు తటస్థించి నది. గనుక నేటివరకు ఈ సంస్కరణలను గురించి ప్రజలెట్టి ఆందోళనకును బూనుకొని యుండలేదు. ఇప్పటికినీ, యుద్ధానంతరము వరకు ప్రజలు ప్రభుత్వమున కెట్టి తొందర కలుగచేయుట సంసిద్ధులుగాలేరు. ఈ యుద్ధకాలమున ప్రజలందరు వికల మనస్కులై యున్నారు. ఇట్టి స్థితిలో సంస్కరణలోని ఒక భాగమగు మండల కాన్ఫరెన్సులను ఈ మాసమున జరుపుటకు ప్రభుత్వము వారు నిర్ణయించియున్నారు. ఆంధ్రప్రదేశమున, ఓరుగల్లు, నల్లగొండ జిల్లాల సభలు మాసాంతమున జరుగనున్నవి. యీ సభలలోనికి వెళ్ళవలెనా లేదా అను విషయమును గురించి ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాట ప్రాంతీయ స్థాయి సంఘములు విచారించి వెళ్ళిన లాభము లేదని సభ్యులు పాల్గొన రాదనియు తీర్మానించి యున్నారు. అటుపిమ్మట మరికొందరు పెద్దలు ఏ కక్షకు సంబంధము లేకుండా స్వతంత్రమగు సమాలోచన జరిపియున్నారు. వారు కూడా ఇదే నిర్ణయమునకు వచ్చినారని మీతో మనవి చేయుచున్నాను. భారత భావి రాజ్యాంగ మార్పులను గురించి సర్ స్టాఫర్డుక్రిప్సుతో సంప్రదింపులు జరిగినవి. ప్రజానాయకులు తమ భావములను వెల్లడించి యున్నారు. యుద్ధానంతరము ప్రజలును ప్రభుత్వమును ఏదేని ఒక విధానమునకు రానున్నారని ఊహించక తప్పదు. ఇట్టి పరిస్థితులలో మనమును యుద్ధాంతము వరకు శాంతముగా నుండుటయే మంచిది. రాజ్య సాంప్రదాయానుసారము ప్రజలు బిడ్డల వలెను, ప్రభువు తండ్రివలెను పరస్పర ప్రేమ విశ్వాసములతో నుండవలెను. మన కోర్కెలను సాదరచిత్తములతో విని తీర్చగల బాధ్యత ప్రభుత్వము యందే వుండగలదు.

**ముగింపు**

దయామయులగు మ.ఘ.వ. ప్రభువరేణ్యులకును, వారి కుటుంబమున కును ఆయురారోగ్యముల నిచ్చుగాక యనియును, దేశము సుభిక్షముగానుండి ప్రజలు ధర్మనిరతులై సుఖజీవనమును చేయవలెనని ఈశ్వరుని వేడుచు నేను విరమించు చున్నాను.

ఓం శాంతిశ్శాంతిశ్శాంతి.

ధర్మవరం. ఇట్లు

జ్యేష్ఠ శు. 2లు మాదిరాజు రామకోటేశ్వర్రావు.

శుక్రవారము

మొదటి నుండియు సహకార మొనర్చుచున్న శ్రీ ప్రతాపరెడ్డిగారు సతీ సమేతముగా మహాసభకు వచ్చి గదిలోనుండెను. ఆమె గర్భవతి అనారోగ్యముగా నుండియు ఉత్సాహముతో సభకు వచ్చినది. గాని మండు వేసంగి వడగాల్పులకు తట్టుకొనలేక రెండవరోజున చనిపోయెను. ఇదియొక విషాద ఘట్టమని అందరము దుఃఖించితిమి. ఆంధ్రోద్యమము రాజకీయముగా మారినది. ప్రజాహిత సమస్యలలో అధికారులు ఆలస్యముగానైనను సహకారము చేయుచునే యుండిరి. గాని రాజకీయ సంస్కరణలు మేము వాంచించునవి వారికి నచ్చవు గనుక ఆ భాగము వరకు ప్రభుత్వాధికారులకు మేము విరోధవర్గముగానే పరిగణింపబడే వారము. గాని హనుమంతరావుగారు, రంగారెడ్డి, రామకృష్ణారావు మొదలగు మా అయిదారుగురి యందు అధికారులేగాక మంత్రులుకూడా గౌరవ విశ్వాసములతో ప్రవర్తించేవారు. ఆ కారణమున అప్పటి వరంగలు సూబేదారు శ్రీ బదరుద్దీన్ గారు మహాసభ రెండవ రోజు రాత్రి కార్యక్రమము ముగిసిన తరువాత సభా మంటపమునకొచ్చి నాతో కలసి తన అభినందనములను తెలిపి ధైర్యోత్సాహములతో పని చేయుమని కూడా చెప్పెను.

12వ తీర్మానము రాజ్యాంగ సంస్కరణలను గురించినదై యుండెను. గాని రావి నారాయణరెడ్డిగారి అనుచర వర్గములోను శ్రీ బూర్గుల రామకృష్ణారావు ప్రభృతులలోను విరుద్ధ వాదోపవాదములు చెలరేగెను. కొందరు యువక మహాశయులు కూడా రావివారితో నేకీభవించి బాలెట్ పద్ధతిలో ఓట్లు తీసికొనవలసి వచ్చెను. శ్రీ రామకృష్ణారావు పక్షమువారి వాదము ఓడిపోయినది. దీని పర్యవసానముగా సభానంతరము స్థాయిసంఘ సభ్యులలో నుండి 30 మంది సభ్యులు తమ రాజీనామాలను నా కందజేసిరి. అందులో ముఖ్యముగా శ్రీ రామకృష్ణారావు, మందముల రామచంద్రారావు, పరచ రంగారావు ప్రభృతులుండిరి. నాకు ముఖ్యాతి ముఖ్యులగు 30 మంది సభ్యులు వైతొలగినప్పుడు కమ్యూనిష్టువాదులు ఉద్రేక యువకులు మాత్రము మిగిలిరి. ఆ కారణమున

నేను వెంటనే కార్యవర్గము నియమించు కొనజాలక పోయితిని. నేను ప్రత్యేకంగా వారందరిని సమాధానపరచి రాజీనామాలను ఉపసంహరింప జేసితిని. తదుపరి షహరేవరు నెలలో శ్రీ రామకృష్ణారావు గారిని ఉపాధ్యక్షులుగాను, మరికొందరు అనుభవజ్ఞులను మా పార్టి నుండి నియమించుకొని కొన్ని స్థానములను రావి నారాయణరెడ్డి పార్టీవారికిని యిచ్చితిని. శ్రీ బిక్కెపల్లి రామచంద్రరావుగారు కార్యదర్శిగా నుండిరి. ఇంతటితో ముందడుగు వేయుటకు నాకు కొంత స్థిమితము కలిగినది.

అది 1942 సంవత్సరం. ఆ రోజులలోనే గాంధిమహాత్ముడు క్విట్ ఇండియా తీర్మానమును ఆమోదింపజేసెను. ఆ తీర్మానమును ధైర్యముతో మా కార్యవర్గ సమితిలో నివేదించి మేము బలపరచినట్లు తీర్మానించితిమి. అటు తరువాత వరంగల్ నుండి కొందరు మిత్రులు శ్రీ యం.యస్. రాజలింగం కాళోజి, కొనరగిరి నారాయణరావులు మొదలగువారు సత్యాగ్రహము చేసి కారాగారమునకేగిరి. గాని వారు వెంటనే విడుదల చేయబడిరి. తరువాత ది. 2 అక్టోబరునాడు మహాత్ముని జన్మదినోత్సవము పట్టం సుల్తాను బజారులో శ్రీ రామకృష్ణారావుగారి ఆధ్వర్యమున జరుపదలచిరి. గాని ప్రభుత్వములో ఆంగ్లేయ మంత్రి యొకరుండుటచే అనుజ్ఞ నిచ్చుటకు నిరాకరించిరి. ఎట్లయినను ఆజ్ఞను ఉల్లంఘించి సభ జరిపెదమనియు చెప్పి శ్రీ రామకృష్ణారావు, రామాచారిగారలు జైలుకు వెళ్లుటకు సిద్ధపడిరి. అప్పగింతలు జరిగినవి. ఇంకొక ఉపాధ్యక్షుని నియమించుకొనుమని శ్రీ రామకృష్ణారావు గారు నాతో చెప్పిరి. అక్టోబరు రెండవ తేదీకి పూర్వమే అనగా క్రిందటి సాయంత్రమో, ఆరోజు ఉదయమో పోలీసు అధికారులు పైనాయకులను తీసికొని వెళ్లి ఒక ఇంటిలో అతిధులవలె నుంచుకొనిరి. ఆ సభ మహిళా మండలి పక్షమున శ్రీమతి మేల్కోటేగారి ఆధ్వర్యమున ప్రారంభమైనది. పోలీసులు సభను చెదరగొట్టి ఆపివేసినారు. 3వ తేదీన పోలీసువారు ఉభయ నాయకులను మోటారుపైన తీసికొని వచ్చి వారివారి ఇండ్ల వద్ద ప్రవేశపెట్టిరి. కేసు పెట్టలేదేమని అడుగగా మంత్రి, పోలీసు కమీషనరు ఆంగ్లేయులే గనుక బ్రిటిషువారిని బిస్తర్లు కట్టుకొని ఇండియా వదలి పొమ్మనిన గాంధీ జయంతికి అనుజ్ఞ యివ్వకూడదని పట్టుబట్టిరి. కావున మేము సభ కాకుండుటకై ఆ దినమున మిమ్ములను ప్రభుత్వాతిధులుగా ఒకచోట నుంచితిమే గాని మీరు నేరస్తులుగా భావించి నిర్బంధములో నుంచలేదని అధికారులు ప్రత్యుత్తరమిచ్చిరి.

## పర్యటన కార్యక్రమము

ది. 12 ఆజూర్ 1352 ఫసలీ తేదీన ఖమ్మం వెళ్ళి జిల్లా తాలూకా కార్యస్థానములను ఖద్దరు షాపులను చూచితిని. శ్రీ సర్వదేవరభట్ల రామనాధం రాపూరి లక్ష్మినర్సయ్య, కొలిపాక వెంకటకిషన్ రావు, కోదాడ నారాయణరావు జిల్లా అధ్యక్షుడు జమలాపురం కేశవరావు గార్లతో సమావేశము జరిపి పర్యటన కార్యక్రమము నిర్ణయించితిని. ఆ ప్రకారము 24 ఆజురు 1352 ఫసలీ రాత్రి బయలుదేరి ఖమ్మం వచ్చితిని. 25వ తేది ఉదయం జిల్లా అధ్యక్షుడు జములాపురం కేశవరావు, కార్యదర్శి రామనాధం, కొలిపాక వెంకటకిషన్ రావుల యుక్తం మధ్యాహ్నం కల్లూరు వచ్చితిమి. కొండపల్లి వెంకట్రామారావుగారు మా కాతిథ్యమిచ్చెను. అచ్చటి కార్యకర్తలతోను రైతులతోను పరిస్థితులు తెలుసుకుంటిమి. వర్షాభావము వలన కల్లూరు చెరువుకు నీరు రానందున పైర్లు యెండిపోవుచున్న వనిరి. వైరా ప్రాజెక్టులో కూడా 10 అడుగులకన్న ఎక్కువ నీరులేదు. వేరుశనగ కాయ ఎగుమతి ఆపబడినందున ధర కొంత తగ్గిపోయినట్లు చెప్పిరి. వెంకట్రామా రావుగారు గృహస్థు. మర్యాదగా చేసిన విందు చూచి ధనవంతుడయ్యును శ్రీ రామనాధంగారిట్లనిరి.

"మీ రెక్కడకు వెళ్ళినను ధనవంతులవద్ద ఉండడము వారు మీకు జమీందారి బూర్జువా పద్ధతులతో విందులు చేయుటయు జరుగుతవి. మేము బీద చాకలింట బసచేసి బీద కుమ్మరింట తిని రావలసివస్తుంది."

ఈ మాటలు వారి కభ్యాసములే గనుక జవాబు చెప్పక ఊరకుంటిమి. రాత్రి టేకలపల్లిలో నుండి మరురోజు 26 తేదీన వేంసూరు చేరితిమి. వేంసూరు చుట్టుప్రక్కల గ్రామముల రైతుల పక్షమున చాలా కాలము నుండి వకీలుగా పని చేసినవాడనై నే డాంధ్ర మహా సభాధ్యక్షుడనుగా వేంసూరు వచ్చితిని గనుక వేంసూరు, వెంకటాపురం, రేజర్ల నుండి చాలామంది వచ్చి మధ్యాహ్నం సమావేశములో పాల్గొనిరి. సాయంత్రం వేణుగోపాలకృష్ణ పుస్తక భాండాగారమును దర్శించితిని. అచ్చట శ్రీ చంద్రమౌళిశాస్త్రి గారు రచించిన పద్యములతో సన్మాన పత్రము చదివిరి. ఆ రాత్రి అమ్మెపాలెంకు కాళ్ళూరు జోగారావుగారి ఆహ్వానముపై వెళ్ళితిమి. ఆ రాత్రి అక్కడ ఉండి ఉదయం వేంసూరు వచ్చితిమి. వేంసూరులో ఆ పట్టి రైతులు తమ కష్టములను చెప్పుకొనిరి. అందొకటి ఫారెష్టు సంబంధమైనది. అనగా యిప్పపువ్వు కంట్రాక్టరు బలవంతముగా పశువు 1కి ఒక అణాచొప్పున

వసూలు చేయుట, ఆకాశవాయి భూములపైన పల్లపురేట్లను వసూలు చేయుట ఉండెను. మేము 27వ తేదీ ఉదయం లంకపల్లికివచ్చి బస్సులో ప్రయాణము చేసితిమి. తల్లాడవద్దకు రాగానే బస్సు వద్దకు వెయ్యిమంది ప్రజలు తాళ మేళ వాయిద్యములతో బస్సును చుట్టివేసిరి. వారివెంట 9 జతల ఎడ్లను కట్టిన ఒక శకటముండెను. నన్ను నాతోడి వారలను దిగమనిరి. ప్రజానీకమును చూచి చాలామంది ప్రయాణీకులు దిగిరి. శ్రీ శ్యామపంతుల లక్ష్మణరావుగారును బస్సు దిగి నన్నాలింగనము చేసికొని ఆనంద భాష్పములను విడచెను. నా నమస్కృతులు తీసికొని ఆశీర్వదించెను. బస్సు 3, 4 గంటలకాలము కదలకపోయినది. బస్సులో డి.వై.యస్.పి. గారు కూడా ఉండిరి. ఆయన దిగ్భ్రమ చెందెను. చేయునదిలేక ఊరకుండెను. అమితోత్సాహముతో ప్రజానీకము ఊరేగింపుతో శ్రీ వేమిశెట్టి అనంత రామయ్య గుప్తగారింటికి నన్ను తీసికొనిపోయిరి. ఆ రాత్రి అక్కడనే యుండి పట్టి సంఘము నేర్పాటు చేసితిమి. మరురోజు ఉదయమున బయలు దేరితిమి. బస్సు వైరాకు చేరగానే మూడు నాలుగు వందల జనులు గుమిగూడి స్వాగత మిచ్చిరి. తేనీరు త్రాగించిరి. ప్రాజెక్టు క్రింద పల్లపు రేట్లు అధికముగా నున్నవని, ప్రాజెక్టులో నీరు లేదనియును చెప్పిరి. అక్కడ నుండి ఖమ్మం చేరితిమి. అంతకుముందే డి.వై.యస్.పి. ఖమ్మం చేరుకొనెను. బహుశః తన మనోవేదనను పై అధికారులకు తెలిపియుండ వచ్చును. గాని మాడపాటి రామచంద్రరావుతో కలిసి రామకోటేశ్వరరావు, శంకరాచారి, రామానుజాచారి ఇందరు గుంపులుగా చేరి బస్సును ఆపి శలవు లేకుండా పెద్ద ఊరేగింపు చేసినారే అని ప్రశ్నించినారట. అందుకు రామచంద్రారావు ప్రజలకు ఆంధ్రోద్యమమున గల భక్తియును, అధ్యక్షుడు ప్రముఖ వకీలు అయిన రామకోటేశ్వర రావుగారియందు విశ్వాస ప్రేమలును ప్రజలలో ఉత్సాహము రేకెత్తించినవి. దానిని యెవరును ఆపజాలరని బదులుచెప్పెను. తరువాత 3, 4 రోజులకు కలెక్టరు రామాలాల్ గారితో కలిసితిని. ఇప్పపువ్వు కంట్రాక్టరు అక్రమముగా తోకపుల్లరి వసూలు చేయుచున్నాడనియును దానిని ఆపమనియును చెప్పితిని. దానికి ఆయన ఆపెదనని వాగ్దానము చేసెను. మరియు తల్లాడ గ్రామములో శలవులేకుండా ఊరేగింపు చేయించినారా అని చిరునవ్వుతో నన్నడిగెను. ఇది ప్రజల ఉత్సాహము గాని నా కోరిక కాదని బదులు చెప్పితిని. ఒక విధముగా ఆయన ఇష్టమైన పనియే గనుక యింకేమియు మాట్లాడలేదు. ఆంధ్ర మహాసభ కార్యస్థానము మొదట హనుమంతరావుగారి ఇంటనే యుండెను. గాని రావి నారాయణరెడ్డిగారు వనపర్తి ఇంటికి మార్చిరి.

నేను ప్రతివారము లేక రెండు వారముల కొకసారి హైద్రాబాదు వెళ్ళి పనులు చూచుకుంటు ఉత్తర ప్రత్యుత్తరములకు జవాబిచ్చు చుండేవాడను. మా కార్యదర్శి చిక్కేపల్లి రామచంద్ర రావుగారు అచ్చటనే యుండేవారు. ఆఫీసులో పనిచేయు శ్రీ వట్టికొండ ఆళ్వారుస్వామిగారు, రావి నారాయణరెడ్డి కాలము నుండి పనిచేయుచు వారినే అనుకరించేవారు. వారును రావి నారాయణరెడ్డి పార్టీవారే. భోనగిరి సంఘమును నడిపేవారును రావి నారాయణరెడ్డి పార్టీవారే. ఒకసారి నేను అసమ్మతి తెలిపినను ఆపకుండా ప్రజాయుద్ధమని నినాదములతో భోనగిరిలో సభ జరిపిరి. మొత్తం మీద అధ్యక్షుని ఆజ్ఞలను ఆ పార్టీవారు అంతగా లక్ష్యపెట్టేవారుకాదు.

దై నెలలో హైద్రాబాదులో కార్యవర్గ సమావేశము జరిపి శ్రీమందుముల రామచంద్రరావుగారి అభిప్రాయానుసారము మహబూబ్‌నగరం పర్యటన చేసుకొంటిమి. 8 మహమన్ 1352 ఫసలీ తేదీన నేనును శ్రీ మందుముల రామచంద్రరావు, చిక్కేపల్లి రామచంద్రరావు గారల సహా మహబూబ్‌నగరం వెళ్ళితిమి. శ్రీ పల్లెర్ల హనుమంతరావు గారింట మా కాతిధ్యమీయబడెను. తాలూకాల నుండి కార్యకర్తలు ఆహ్వానింపబడిరి. ఆలంపూరు నుండి (1) సురవరం వెంకట్రామారెడ్డి (2) గడియారం రామకృష్ణశర్మ (3) యల్లారెడ్డి (4) బి.యస్. శెట్టిగార్లను కొల్హాపూరు (జట్ప్రోలు) నుండి రామచంద్రారెడ్డిగారలను కల్వకుర్తి నుండి నెరమెట్ల రామారావుగారున్ను నాగరకర్నూలు నుండి శ్రీ సుబ్బారావు, బి. రామచంద్రరావు, బి.నరసింగరావు గార్లున్ను, తిమ్మాజిపేట నుండి ఎ. రాములు గుప్తాగారును, కోడంగుల నుండి రాఘవేంద్రాచారిగారును, షాద్‌నగరం నుండి నారాయణరెడ్డి గారును, మహబూబ్‌నగరం నుండి అహమ్మద్ నసరలీ, నారాయణరావు, సిద్దం లింగప్పగార్లు సంఘముల ప్రతినిధులుగా వచ్చిరి. వారితో ఆ జిల్లాలో సంగతులను వివరముగా మాట్లాడుకొంటిమి. ఆ జిల్లాలో ఆ సంవత్సరము వర్షభావముచే పైర్లు చెడిపోవుటయే గాక, పశువులకు మేతకూడా లేకపోయెను. అడవులలో పశువులను మేపుకొనుటకు ఫారెస్టు డిపార్టుమెంటువారు అభ్యంతరములు చెప్పుచుండిరి. ఇవ్విషయములలో ప్రభుత్వమునకు కార్యవర్గ సమితి నుండి వ్రాయుటకు నిశ్చయించుకొంటిమి. 8-3-52 తేదీన శ్రీ సిద్దం లింగప్పగారిచే నడుపబడే హరిజన పాఠశాలను చూచితిమి. అందు 40 మంది బాలబాలికలు విద్య నభ్యసించు చుండిరి. సమీపమున నున్న హరిజనవాడలో ఊడ్చి శుద్ధిచేయవలెనని మేము ఉద్యుక్తులమైతిమి. గాని హరిజనులు

దానికంగీకరించక వలదని మమ్ముల బతిమిలాడిరి. అందువలన పని మేము చేయలేదు. మరురోజు ఉదయమున శ్రీ నారాయణరావు వకీలుగారింట మాకు విందు జరిగెను. మధ్యాహ్నం మోటారులో హైద్రాబాదు బయలుదేరితిమి. మోటరు బాదేపల్లి వద్దకు వచ్చెను. షుమారు 100 (వంద) మంది ప్రజలు బస్సు వద్దకు వచ్చి మాకు స్వాగతమిచ్చిరి. కొన్ని నిమిషములు మామూలుకన్న ఎక్కువగా బస్సు ఆపబడినది. ప్రజలు అటవీశాఖవారు పెట్టుచున్న బాధలు, కరువు విషయమున్ను మాతో చెప్పుకొనిరి. మేము ప్రభుత్వాధికారులతో కలసి తగు సౌకర్యముల నేర్పాటు చేసెదమని వారికి చెప్పితిమి. ఆ ప్రకారము అధికారులతో చెప్పితిమి. త్వరలో ప్రభుత్వము నుంచి తగిన సహకారము జరిగినట్లు జ్ఞాపకము లేదు. దాని తరువాత కాశీనాథరావువైద్య మొదలగువారు మరల నొకపర్యాయము మహబూబ్‌నగరం వెళ్ళివచ్చిరి. ఆ సమయమున నేను వెళ్ళకపోతిని.

మహబూబ్‌నగరం పర్యటనాంతరము నల్లగొండ పర్యటన చేయవలెనని నిర్ణయించుకొంటిమి. బహమన్ (డిశంబరు) మాసాంతమున నీలికుర్తి వెళ్ళి మా నాయనగారి తుదిదర్శనము చేసి పర్యటనకు శలవుపొంది వచ్చితిని. 5 యిస్పందారు 1352 (5-1-1943) ఉదయరాజు మనోహరరావును అంతరంగిక కార్యదర్శిగా వెంటనుంచుకొని బయలుదేరి భోనగిరిలో దిగితిమి. ఆ తాలూకా సంఘమును కమ్యూనిష్టు భావములుగల ఆరుట్ల లక్ష్మి నరసింహారెడ్డి ప్రభృతులు నడుపుచుండిరి. లక్ష్మినరసింహారెడ్డిగారు మాత్రము కలిసిరి. మరెవ్వరు రాలేదు. ఉదయము 4 గంటల బస్సులో నల్లగొండ చేరితిమి. అచ్చట శ్రీ పులిజాల రంగారావు మొదలగు న్యాయవాదులు ఆంధ్రోద్యమ కార్యకర్తలు, ఇతర ప్రజలు షుమారు 100 (నూరు) మంది బస్సు వద్దకు వచ్చి స్వాగతమిచ్చిరి. బయలుదేరిన జనానీకమును చూచి భయపడి ఒక పోలీసు అధికారియు కొందరు పోలీసులు కూడా బస్సు వద్దకు వచ్చిరి. ఆ పోసుసు అధికారి వరంగలులో కొన్ని సంవత్సరములు పోలీసు పయిరవికారుగా పనిచేయుచు ప్రతిరోజు కోర్టులో నాతో కలసిమెలసి తిరిగిన శ్రీ సోహన్‌లాలుపూరి గారు అయియుండిరి. వారు నన్ను ఆలింగనము చేసుకకొని నమస్కారముచేసి వచ్చినది మీరా! మా డిపార్టుమెంటు వారు వృధాగా అనుమానములు కల్పించుచుంటారని వెళ్ళిపోయెను. అంతన నేను శ్రీ పులిజాల రంగారావుగారింటికి వెళ్ళి వారివద్దనే అతిధిగా నుంటిని. జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి మరికొందరు వచ్చి కలిసిరి. కార్యకర్తల సమావేశము జరుపబడెను. నన్ను ఆర్యసమాజ మందిరమునకు

ఆహ్వానించిరి. అచ్చట ఒక సమావేశము జరిగి స్వాగతము కృతజ్ఞతతో సంబంధించిన ఉపన్యాసములు, అల్పాహార విందు జరిగెను. ఆర్య సమాజ పక్షమున ఒక బాలికాపాఠశాల నడుపబడుచుండెను. ఆ పాఠశాలకు గోపాల్‌రెడ్డి గారు అధ్యక్షుడుగాను, పులిజాల రంగారావుగారు ఉపాధ్యక్షులుగాను ఉండిరి. 80 మంది విద్యార్థులు విద్యనభ్యసించు చుండిరి. ఉపాధ్యాయులు 4గురుండిరి. గానము, వ్యాయామ విద్యకూడా నేర్పుచుండిరి. బాలికలు కర్రసాము చేసి చూపిరి. అందుకొందరు బాలికలు ఒక కత్తితోను, మరికొందరు బాలికలు రెండు కత్తులతోను సాముచేసి ప్రదర్శనము జరిపిరి. ఆ పాఠశాలను శ్రీ భద్రదేవిగారును, వారి సతీమణి వేదవతిగారును భక్తిశ్రద్ధలతో నడుపుచుండిరి. ఆ బాలికల ప్రదర్శన దృశ్యము నేటికిని మరువజాలకున్నాను. నేను రు. 3-0-0 మిఠాయి తెప్పించి పంచిపెట్టితిని. రు. 10లు విరాళ వాగ్దానము చేసితిని. అదే రోజు సాయంత్రం ఆంధ్రభారతీ గ్రంథాలయము చూచితిని. అదికూడా స్థానికుల ఆదరాభిమానము లతో నడచుచుండెను. అందు 856 గ్రంథములుండి 20 పత్రికలు వచ్చుచుండెను. 71 మంది చందాదార్లుండిరి. శాశ్విత మందిర నిర్మాణ ప్రయత్నము జరుగుచుండెను. అచ్చట కూడా సభ్యులతో మాట్లాడితిని. తరువాత హరిజన పాఠశాల చూచితిని. దాని కార్యదర్శి నట రాజలింగయ్య గారుండిరి. తరువాత రామగిరి పఠనాలయమును చూచితిని. దానిని కొమర్రాజు 6-4-1952 తేదీనకు ముందు పర్యటన కార్యక్రమము ప్రారంభింపబడెను. శ్రీ పులిజాల రంగారావుగారి స్వంత మోటరుపైననే బయలుదేరితిమి. నావెంట రంగారావుగారు బోయినపల్లి కంచనపల్లి వెంకట్రామారావుగారలు కూడా బయలుదేరిరి. నారాయణరెడ్డిగారు మిర్యాలగూడెం వచ్చి కలసి దేవరకొండ వరకు ఉండెదమనిరి. మొదట చందుపట్ల వెళ్ళి మధ్యాహ్నము వరకు ఉంటిమి. అచ్చట ఒక గ్రామసంఘముండెను. స్థానిక ప్రజలు కార్యకర్తలతో సమావేశము జరిపి సాయంత్రం 4 గంటలకు చెరుకుపల్లి సమీపమునకు చేరితిమి. అచ్చట ఒక గ్రామసంఘముండెను. దేశముఖు గద్దం నరసింహారెడ్డిగారు నాకు మిత్రులు. ఉద్యమాభిమాని ఆయన కుమారుడు నారాయణగారు 9 జతల యెడ్లు కట్టిన బండిని తెచ్చిరి. వారివెంట నూరు మంది ప్రజలుండిరి. ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు కూడా వచ్చి వారిని కొంత బెదరించెను. దానిపైన నారాయణరెడ్డిగారు మోటారువద్దకు వచ్చి, ఊరేగింపు చేయవద్దని పోలీసు వారంటున్నారు అని రంగారావుతో చెప్పెను. తుదకు మేము మోటారులోనే ఉండునట్లును, 9 జతల యెడ్లుగల శకటము ముందుండు నట్లును,

వాయిద్యములు లేకుండా ప్రజలు వెంటనడుచుచు తీసికొని వెళ్ళునట్లు ఏర్పాటు చేసిరి. అలాగే మేము వెళ్ళి ఆ రాత్రి చెరుకుపల్లిలో నుంటిమి. దేవాలయావరణలో సభ జరిగెను. శ్రీ రంగారావుగారు నేను ఉపన్యాస మిచ్చితిమి. ఇన్‌స్పెక్టరుకూడా అచ్చటనే ఉండెను. చెరుఅకపల్లి నుండి 7వ తేదీ ఉదయమున సూర్యా-ట వచ్చితిమి. చాలామంది ప్రజలు శ్రీ గవ్వా అమృతారెడ్డి గారి ఆధ్వర్యమున ఊరిబయట ఎదుర్కొని ఊరేగింపుతో బసకు తీసుకొని వెళ్ళిరి. ఆ జన సమూహ ములో కొందరు కమ్యూనిస్టు సోదరులుండిరి. వారు తమ ప్రజాయుద్ధాది నినాదములు, కమ్యూనిస్టు గీతములు పాడుచుండిరి. అధికసంఖ్య ఆంధ్రోద్యమ కార్యకర్తలదే అయియుండెను. అచ్చట ఆంధ్ర విజ్ఞాన ప్రకాశిని గ్రంథాలయమును చూచితిని. దానికి కుందూరు లక్ష్మీకాంతరెడ్డిగారు అధ్యక్షులుగను, డాక్టర్ విశ్వనాధ శర్మ కార్యదర్శిగా నుండిరి. గ్రంథములు 1500 చందాదారుల సంఖ్య 66 వుండెను. సభ్యులతో మాట్లాడితిని. తాలూకా ఆంధ్రజనసంఘముండెను. దానికి అధ్యక్షుడు వే. వేంకటకృష్ణయ్య, ఉపాధ్యక్షుడు గవ్వా అమృతరెడ్డిగారు కార్యదర్శి హనుమంతరావుగారుండిరి. 22 గ్రామ సంఘములుండెను. అందు 1500 సభ్యులుండిరి. తాలూకాలో 7 గ్రంథాలయములు 4 రాత్రి పాఠశాలలుండెను. సాయంత్రం కార్యకర్తల సమావేశములో పాల్గొని రాత్రి బేతవోలు వెళ్లి నుం.గోపాల రావుగారి ఆతిధ్యములో నుంటిమి. అచ్చట ఒక గ్రామసంఘ ముండెను. 8వ తేదీ ఉదయమున రైతులతో మాట్లాడి చిరుకూరు వచ్చితిమి. హుజూరునగరంలో తాలూకా సంఘముండెను. దానికి అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుగా లక్ష్మీనరసింహారెడ్డి, కార్యదర్శి బోయనపల్లి వెంకటరామారావు గారుండిరి. అచ్చట విజ్ఞాన నికేతనమను గ్రంథాలయ ముండెను. దానికి రామచంద్రారెడ్డిగారు అధ్యక్షులు, సీతారామరెడ్డిగారు కార్యదర్శిగానుండిరి. ఆ రోజు 2 గంటల వరకు హుజూరునగరంలో ఉండి సాయంత్రం మేళ్ళచెరువు అనే గ్రామమునకు వెళ్ళితిమి. అది కృష్ణాతీరమున చరిత్రాత్మకమైన ఒక పెద్ద గ్రామమై ఉండెను. దాని జనసంఖ్య 4256. అచ్చట దీనబంధు గ్రంథాలయము ఉండెను. దానికి అర్జున్‌రావుగారు అధ్యక్షులు, కోటిరెడ్డి కార్యదర్శిగా పని చేయుచుండిరి. సుప్రసిద్ధమైన ఒక శివాలయముండెను. దానిని కాశిబుగ్గ అనికూడా అంటారు. శివలింగం నెత్తిపైన గంగ ఉంటుంది. దానిని ఉద్ధరిణలతో గాని చెంచాలతోగాని తీసికొని గంగవలె వాడుచుంటారు. ఆ గంగ ఎప్పటికప్పుడే ఊరుచునే ఉంటుంది. అది ఎప్పుడును ఆగిపోదు. దాని నిర్మాణమును గురించి విచారించితిని. గాని దానిని ఆధునిక

వైజ్ఞాన పద్ధతిలో చెప్పలేకపోయిరి. లింగము స్వయంప్రభువు గనుక గంగ స్వభావ సిద్ధముగనే ఏర్పడినదని ఆధ్యాత్మిక పద్ధతిలో చెప్పిరి. నేను శివదర్శనము చేసికొని మరల మేళ్ళచెరువు గ్రామములోనికి వచ్చితిని. ఈలోగా అచ్చటి కార్యకర్తలు ఒక ఆవరణలో సమావేశ మేర్పాటు చేసిరి. ఆ సమావేశములో 300 మంది పురుషులును 100 మంది స్త్రీలును అత్యుత్సాహముతో పాల్గొనిరి. రైతు కుటుంబములకు చెందిన మహిళలు బహుశ్రద్ధగా చేతులు పట్టుకొని నిలుచుండి మా ఉపన్యాసములను వినుచుండిరి. వారికి అర్థమగునటుల శులభశైలిలో నేనును, శ్రీ పులిజాల రంగారావుగారును ఉపన్యాస రూపమున సందేశముల నిచ్చితిమి. గ్రామ పెద్దలకు గౌరవభావములే యుండెను. సభ నుండి బయటకు రాగానే మమ్ములను ఒక చోటకు పిలిచికొనిపోయి పరిస్థితులను గురించి ప్రశ్నలువేసి ఉద్యమ కార్యక్రమమును తెలుసుకొనిరి. 8 గంటల రాత్రివరకు మేము మేళ్ళచెరువులోనే ఉంటిమి. అచట మాకు భోజన వసతి కుదరనందున అభోజనముగనే రాత్రి 8 గంటలకు బండ్లమీద ప్రయాణముచేసి రాత్రి 11 గంటలకు హుజూరునగరం చేరితిమి. హుజూరునగర్ కొత్త గ్రామంపేరు ఇచటనే తాలూకా కచేరి మొదలగు ఆఫీసులున్నవి. పాత గ్రామమునకు పోచంచర్ల అంటారు. మేము ఆ రాత్రి బోయనపల్లి వెంకట్రామారావుగారింట పరుండి 9 యిస్పందారు 1352 ఫసలీ ఉదయం స్నాన సంధ్యాది ప్రాతఃకాల కృత్యములు తీసుకొని వచ్చినవారము మోటారుపైన మిరియాలగూడెం వచ్చితిమి. కొంతసేపు శ్రీ దేవులపల్లి రంగారావుగారింట ఆంధ్రోద్యమ కార్యకర్తల సమావేశము జరిపితిమి. హనుమకొండ కాపురస్తుడు ఒక రాజపుత్ర యువకుడు పోలీసు సబ్ఇన్స్పెక్టరు కూడా వినయము పరిచయము వెలిబుచ్చుచు ఆ సమావేశములో కూర్చుండెను. ఉద్యమాభి వృద్ధి విషయములను రైతుల కష్టములను గురించి మాట్లాడుకుంటిమి. అచ్చట ధర్మగ్రంథ భాండాగారము, ఒక ఖాస్గీ పాఠశాలయు ఉండెను. వాటిని వర్తకులే నడుపుచుండిరి. ఇంకొక బాలికా పాఠశాలయు, ఒక హిందూ పాఠశాలయు ఉండెను. అందు బీదబాలికలు 5వ తరగతి వరకు విద్య నభ్యసించుచుండిరి. బాలికలను పరీక్షించితిమి. శిక్షణ తృప్తికరముగానే ఉన్నది. వీటిని వర్తకులే నడుపుచుండిరి. శ్రీ గుప్త వకీలుగారు కార్యదర్శిగా పనిచేయు చుండిరి. ఈ తాలూకాలో తాలూకా సంఘముగాక ఒక పట్టి సంఘము 2 గ్రామ సంఘములు పనిచేయుచుండెను. తాలూకా సంఘమునకు శ్రీ దేవులపల్లి రంగారావుగారు అధ్యక్షుడుగాను శ్రీ రామలక్ష్మయ్యగారు కార్యదర్శిగాను పనిచేయు

చుండిరి. ఆంధ్రోద్యమాభిమానులు నిర్మాణ కార్యక్రమమునకు చెందిన ఖాది నిర్మాణాగారమును నడుపుచుండిరి. అందు 8 మగ్గములు 2 దూది రుంజాలు 10 పత్తి గిరకలు 150 రాట్నములతో ఉంచి పని సాగించుచుండిరి. దీనికి పెట్టుబడుదారు చీదెళ్ళ రాములు గారుండిరి. ఉత్పత్తి చేయబడు శుద్ధఖాది స్థానికముగా ఖర్చగునదిగాక తక్కినది హైద్రాబాదు పంపబడుచుండెను. అచ్చట పనిచేయు వారలతో ముడిసరుకు నేత మొదలగు విషయములను గురించి చాలాసేపు మాట్లాడితిని. వారు ప్రత్తిని, దూదిని నాందేడు నుంచి తెచ్చుచున్నామనిరి. వరంగల్లులో ప్రత్తిదూది వ్యాపారమున్నది. గనుక వరంగలు నుంచి ప్రత్తిని, దూదిని తెచ్చుకొనమని సలహా ఇచ్చితిని. మరియు వరంగల్‌లోని మిల్లు యజమానులు కమీషను వర్తకులు సరసముగా సరుకు సప్లయిచేయునట్లు చెప్పెదనంటిని. వారు అట్లే చేసెదమనిరి. నిజామాంధ్ర దేశమున జగిత్యాల తాలూకా మెట్టపల్లి మొదటి ఖాది ఉత్పత్తి స్థానముగా నున్నది. దానికి తరువాత మిరియాలగూడెంలోని ఖాది పరిశ్రమాగారము ప్రశంసనీయమని తెలుసుకొంటిని. ఆంధ్రదేశమున ఇంకాకొన్ని పారిశ్రామిక శాలలుంటె విరివిగా శుద్ధఖద్దరు లభించుటలో సందేహములేదు. మెట్టపల్లిలో 500 మందియు మిరియాలగూడెములో 175 మందియు ఖాది ఉత్పత్తి శ్రామికులుగా నుండి జీవించుచుండిరి.

అచ్చటి కార్యకర్తలు నన్ను ఖాదిమాలలువైచి సత్కరించిరి. వారి వద్ద నుండి శలవు తీసుకొని బయటకు వచ్చితిని.

మొదటి నిర్ణయం ప్రకారం ఆరోజు దేవరకొండకు వెళ్ళవలసియుండెను. గాని జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డిగారు వచ్చి మిరియాలగూడెములో కలవలేదు. దేవరకొండ తాలూకా అధ్యక్షుడు కొండలరావుగారి వద్ద నుంచి ఉత్తరం రాలేదు. నల్లగొండ నాయకలు (వకీళ్ళు) 4 రోజుల నుంచి నాతోనే తిరుగుచుండిరి. కాబట్టి వారు ఈ దఫాకు దేవరకొండ ప్రయాణము ఆపి నల్లగొండ వెళ్ళవలెనని సలహాయిచ్చిరి. విధిలేక వారి సలహా విని నేను నల్లగొండ వైపునకే తిరిగితిని. ఆ రోజు 12 గంటలకు నల్లగొండ జేరి శ్రీ రంగారావుగారింట భోజనము చేసి విశ్రమించితిమి. సాయంత్రము పానగల్లుకు వెళ్ళి మొదట అచ్చటి గ్రంథాలయమును చూచితిని. దానికి అధ్యక్షుడు రామలింగాచారి, కార్యదర్శి జగ్గయ్యగార్లు పని చేయుచుండిరి. అందు 400 తెలుగు, 100 ఇంగ్లీషు, 100 ఉరుదు మొత్తం 600 గ్రంథము లుండెను. 3 పత్రికలు వచ్చుచుండెను. ఒక సంఘము అంజుమన్ యెత్తహాదు హింది అనేదానిని నడుపుచుండిరి. పానగల్లు

ఆంధ్రదేశమున చరిత్రాత్మకమైన పురాతన పట్టణము సుప్రసిద్ధ పతివ్రతా శిరోమణి బాలనాగమ్మ ఇక్కడ పుట్టినదే. ఇప్పుడు శిథిలావస్థలో నున్నది. ఇండ్లు 922, జనసంఖ్య 3870 ఉండెను. అచ్చట అతిపురాతనమైన ఛాయా సోమేశ్వరస్వామి దేవాలయము 66 మండపములతో మిళితమై యుండెను. ఆ దేవాలయము హనుమకొండ వేయిస్థంభముల దేవాలయమునకు పోలియుండెను. బహుశః నిర్మాణకాలము ఒకటే అయి ఉండును. మనము ఆ దేవాలయములోని ఏ గోడవద్దకు వెళ్ళినను లింగమూర్తి ఛాయా ఆ గోడపైననే కనుపడుచుండును. లోపలికి ఎండ రాకున్నను, సూర్యుదేదిశగా నున్నను మనం వెళ్లిన గోడపైననే ఛాయ అగుపడును. పానుగల్లులో ఇంకొక విష్ణాలయము కూడా ఉన్నది. పానగల్లు నుంచి తిరిగి రాగానే సాయంత్రం జిల్లా సంఘాధ్యక్షులు నారాయణరెడ్డిగారు ఆంధ్రోద్యమ కార్యకర్తలకు అల్పాహార విందు చేసిరి. రాత్రి 9 గంటల వరకు ఆనందముగా అందరము మాట్లాడుకొనుచు గడిపి వారందరివల్ల శలవు తీసికొని మరల పులిజాల రంగారావు గారింటికి వచ్చితిని. రాత్రి వారివెంటనే భోజనము చేసి పరుంటిని. ఉదయం స్నానాది ప్రాతః కాలకృత్యములు తీర్చుకొని హనుమకొండకు బయలుదేరితిని. నా వెంట జిల్లా తాలూకా ఆంధ్రోద్యమ కార్యకర్తలు హిందూ ముస్లిం న్యాయవాద సోదరులు బస్సు వద్దకు వచ్చి సాగనంపి వెళ్లిపోయిరి. నేనును, నా సహచరుడు మనోహరరావుగారును బస్సుపైన భోనగిరి వచ్చి ఆరుట్ల లక్ష్మీనరసింహ్మారెడ్డి గారిని కలిసితిని. వారు లాంఛనప్రాయముగా తాలూకా సంఘ కార్యస్థానమునకు తీసికొని వెళ్లెను. అత్యవసర విషయములు మాట్లాడి హెూటలులో భోజనం చేసి ప్యాసింజరులో బయలుదేరి హనుమకొండ చేరితిని. సంక్రాంతికి హనుమకొండలో నుండి 3, 4 రోజులలో నిజామాబాదు వెళ్లవలె ననుకొంటిని. గాని ఇంటికి రాగానే మా నాయనగార్కి జబ్బుగా నుండెననియు, నన్ను వెంటనే నీలికుర్తికి రమ్మనియు మా తమ్ముడు వ్రాసిన పుత్తరము అందెను. ఉత్తరములో భయాందోళనము లేనియము లేనందున మరురోజు ఉదయం బస్సులో నేనున్ను, వెల్లెంకి లక్ష్మినరసింహారావు గారును బయలుదేరితిమి. బస్సు నాగారం స్టేజివరకు వచ్చెను. మరియు ఉదయం బస్సులోనే నా కొఱకు హనుమకొండకొక మనిషి పంపబడెను. బస్సు వద్ద నౌకరు కలసి గతరాత్రి మీ తండ్రిగారు దివంగతులైనారని వార్త వినిపించెను. వెంటనే నేను బస్సు దిగి నీలికుర్తి వెళ్ళితిని. నా నిరీక్షణములో నుంచబడిన మాతండ్రిగారి మృతకళేబరము చూచి దుఃఖించితిని. ఆక్బరు సమయమున దగ్గర ఉండకపోతినని

మనసులో బాధపడితిని. అయినను దైవానుగ్రహముచే అంత్యక్రియల రూపమున కించిత్ విద్యుక్త ధర్మమును నెరవేర్చుటకు అవకాశము దొరికినదని తృప్తి చెందితిని. నీలికుర్తిలోనే దహన సంస్కారము, సంచయలముచేసి, మూడవ రోజు హనుమ కొండకు వచ్చి మిగతా శ్రాద్ధకర్మలు పూర్తి చేసికొంటిని. అటుతరువాత హైద్రాబాదు వెళ్ళి తోడిసభ్యులతో సంప్రదించి నిజామాబాదు పర్యటన కార్యక్రమము నిర్ణయించి నిజామాబాదు స్థానికులకు తెలిపితిని. తరువాత 15-6-52 ఫసలీ తేదీన నేనును, కార్యదర్శి చిక్కేపల్లి రామచంద్రరావుగారును నిజామాబాదు రైలుమార్గమున వెళ్లితిమి. నిజామాబాదు ఆంధ్రోద్యమ కార్యకర్తలు, స్థానిక న్యాయవాదులు స్టేషను వద్దకు వచ్చి స్వాగత మిచ్చిరి. నిజామాబాదు జిల్లా కొంతకాలము వరంగల్ సూబాలో చేరియుండుటచే అప్పీళ్ళ కొరకు నిజామాబాదు వకీళ్ళు తదితర ప్రజలు కొందరు నావద్దకు వచ్చుచుండేవారు. ఆ కారణమున నిజామాబాదులో వకీలుగా నుండి పనిచేయుచున్న శ్రీ రామకిషన్‌రావుగారితో నాకు బాగా పరిచయ ముండెడిది. అందువలన వారు నన్ను తన ఇంటికి తీసికొని వెళ్ళిరి. నేనును, రామచంద్రరావుగారును వారి ఇంటనే అతిథులుగా నుంటిమి. జిల్లా సంఘము పనిచేయక నిద్రావస్థలో నుండెను. కార్యకర్తలను, సమావేశపరచి స్వల్ప భేదములను నిర్వర్తించి సమాధానపరచి పునస్థాపన చేసితిమి. అది ఈ క్రింది సభ్యులతో కూడియుండెను.

1. అధ్యక్షుడు : శ్రీ వెంకట భూమారెడ్డిగారు.
2. ఉపాధ్యక్షుడు : శ్రీ బి. కేశవరావుగారు
3. కార్యదర్శి : శ్రీ రుక్మారెడ్డిగారు
4. సహకార్యదర్శి శ్రీ జానపాడు సత్యనారాయణగారు
5. కోశాధ్యక్షుడు: శ్రీ మునుపల్లి గంగాధరరావుగారు.

సభ్యులు:

| | | |
|---|---|---|
| 1. | శ్రీ జి. నారాయణరెడ్డిగారు | నిజామాబాదు |
| 2. | శ్రీ లింగప్పశాస్త్రి | నిజామాబాదు |
| 3. | శ్రీ నల్లూరు వెంకటరెడ్డి | ఆరుమోలు |
| 4. | శ్రీ చవుటపల్లి హనుమంతరెడ్డి | ఆరుమోలు |
| 5. | శ్రీ కె. లక్ష్మణరావు (వకీలు) | కామారెడ్డి |
| 6. | శ్రీ నరసిహంహారావు (వకీలు) | కామారెడ్డి |

| | |
|---|---|
| 7. శ్రీ శాయిరెడ్డి | బాన్సువాడా |
| 8. శ్రీ బాలకిషన్‌రావు | బాన్సువాడా |
| 9. శ్రీ సుబ్బారెడ్డి | బోధన్ |
| 10. శ్రీ లక్ష్మణశాస్త్రీ | బోధన్ |

మరురోజు అనగా 17-6-52వ తేదీన బోధన్‌కు వెళ్ళితిమి. అచ్చట లక్ష్మణరావుగారింట ఉండి భోజనము చేసితిమి. మోటరు సౌకర్యము లేనందున నిజామ్‌సాగర్ డామ్‌వరకు వెళ్లలేకపోతిమి. బోధనులో ప్రభుత్వం వారు కంపెనీ పద్ధతిమీద స్థాపించిన ఒక పంచదార ఫ్యాక్టరీ ఉండెను. ఆ ఫ్యాక్టరీలో ప్రజలకు కూడా భాగములుండేవి. మేనేజ్‌మెంటు ప్రభుత్వ పక్షముననే జరుగుచుండేది. ఇదే సమయమున మరికొన్ని పరిశ్రమలు ప్రభుత్వము ప్రజాసహాయముతో స్థాపించబడినవని చెప్పుట సమజంసముగా నుండునని తలచుచున్నాను. అందు 1. సిర్‌పూర్ కాగితముల పరిశ్రమ, 2. వరంగల్ ఆజంజాహి బట్టలమిల్లు, 3. సికింద్రాబాదులోని మోజంజాహి బట్టలమిల్లు తెలంగాణమున స్థాపించబడినవి. నిజామ్‌సాగర్ నుంచి కాలువలు తీసి వరి, చెఱకు పండించుటకు అవకాశము కల్పించబడినది. 6వ ఆంధ్రమహాసభ రోజులలో ఈ ప్రాజెక్టువలన తమకు కష్టములు కలుగుచున్నవని ప్రజలు మొరపెట్టుకొనిరి. గాని దానిలాభమునుక్రమేణా ప్రజలు గ్రహించ గలిగిరి. అత్యాశతో ప్రభుత్వమువారు ఈ నూతన ప్రాజెక్టు క్రింద భూములపైన నీటిపన్ను ఎక్కువగా విధించిరి. అది వరి, చెఱకు పండించు భూములపైన ఎకరాకి రు. 20, 30 వరకు ఉండెను. మేము ఆంధ్రమహాసభ పక్షమున నిజాంసాగర్, వైరా, పాలేరు ప్రాజెక్టుల క్రింద వసూలు చేయుచున్న రేట్లను తగ్గించుమని మరల మరల ప్రభుత్వమును కోరుచుంటిమి. బోధన్‌లో ఒక పంచదార ఫ్యాక్టరి ఏర్పాటు చేయబడి యుండెను. దానిలో ప్రతిరోజు 1400 బస్తాల పంచదార తయారగుచుండెను. చెఱకు పండించుటకు కంపెనీపక్షమున రైతులకు ఋణములిచ్చేవారు. రైతులు తాము తయారుచేసిన చెఱకును ఫ్యాక్టరీకి విక్రయించు చుండేవారు. ఫ్యాక్టరీవారు సరియైన ధరలు తమకిచ్చుట లేదని రైతులు మాకు చెప్పిరి. నేను ఫ్యాక్టరీ అధికారులతో మాట్లాడితిని. వారు కొన్ని సాధకబాధకములను తెలియజేసిరి. ఈ విషయములను రాబోవు స్థాయి సంఘములో చర్చించి ఆ పరిష్కారమును ప్రభుత్వమునకు నివేదించి న్యాయము కలిగించెదమని రైతులతో చెప్పితిని. పంచదార ఫ్యాక్టరీ కంపెని పద్ధతిలో నడుప బడుచున్నదని పైన వ్రాసియున్నాను. 9వేల ఎకరములలో చెఱకు పంటకొరకు

నియమింపబడినవి, అందు మింజుమలె 3వేల ఎకరములు కంపెనీ తరఫునను 6వేల ఎకరములను రైతుల తరఫునను సేద్యము చేయవలసి వచ్చుచుండెను. రైతులు పండించిన చెఱకును కంపెనీ విధిగా తీసికొనవలసి వుంటుంది. నేను వెళ్ళినప్పుడు 3వేల ఎకరములలో పైరుకోయబడెను. 3వేల ఎకరముల భూమిపైన ముందు సంవత్సరము కొఱకు పెరుగుచున్న పైరు వుండెను. 3వేల ఎకరములు సేద్యముకొఱకు పడావు ఉంచిరి. చెఱకు సేద్యముకు ఈ క్రిందివిధముగా ఎ.1కి రు.250/– చొప్పున ఖర్చు కావలసి వచ్చును.

ఎరువుకు రు. 75, నాటుకూలి రు. 50, విత్తనము రు. 40, కోత రు.50, సర్కారుశిస్తు రు. 35, మొత్తం రు. 250.

పంట ధర రు. 500 ఎ.1కి లభించును. అందు రైతుకు ఎ.1కి రు. 250 చొప్పున నికరాదాయ ముండేది. ఆ రాత్రి నిజామాబాదు చేరితిమి. మరురోజు అనగా 18–6–1952 తేదీన ఆరుమోలు వెళ్లితిమి. ఆరుమోలులో శ్రీ వెంకటరెడ్డి వకీలుగారింట కొంతసేపు ఉండి అచటి కార్యకర్తలతో సమావేశము జరిపి ఉద్యమవ్యాప్తిని గురించి కార్యకర్తలకు కొన్ని సందేశముల నిచ్చితిని. ఆ రాత్రి తిరిగి నిజామాబాదు వచ్చితిమి. 19వ ఉదయము నిజామాబాదులోని గ్రంథాలయమును చూచితిమి. గ్రంథాలయమును శ్రీ జానపాడు సత్యనారాయణగారు నడపుచున్న ఖాది భాండారును చూచితిని. ఆ సాయంత్రం నేనును మరికొందరు స్నేహితులును కలిసి కామారెడ్డికి వెళ్లితిమి. అచట కె. లక్ష్మణరావుగారింట బసచేసితిమి. కార్యకర్తల సమావేశము జరిపి స్థానిక పరిస్థితులను తెలిసికొని ఉద్యమవ్యాప్తి కొఱకు తగు సలహానిచ్చితిని. కామారెడ్డి సమీపమున ఒక కొండపైన ఉన్మాద చికిత్సాలయము ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడి యుండెను. కామారెడ్డి వద్దకూడా చిరకాలము నుంచి చెఱకు సేద్యము చేయుచు చెఱకు వలన బెల్లము తీయుచుండేవారు. అచట బెల్లపు పరిశ్రమ భారీయెత్తునే ఉండేది. అచట పండించే బెల్లము చాలాచోట్లకు ఎగుమతి చేయబడుచుండేది. ఆ పరిశ్రమ ఇప్పటికిని సాగుచున్నది. తెలంగాణాలో కామారెడ్డి బెల్లము చాలావరకు వాడబడుచునే యున్నది. కామారెడ్డి చుట్టుపట్ల భూమి కృష్ణరేగడి న్యూనోన్నతములు లేక చాలాదూరము వరకు ఒకే విధమైన భూమిని పెద్ద విస్తీర్ణమైన దానిని చూడగలిగితిని. నేను కృష్ణా మహానదికి సమీపగ్రామ కాపురస్తుడ నయ్యును, సారవంతమైన రేగడి భూములు కలిగి యున్నను, కామారెడ్డి క్రింది భూములను చూచినప్పుడు నేనక్కడ పుట్టకపోతినని అనుకుంటిని.

కామారెడ్డి నుంచి రైలుమార్గమున హైద్రాబాదు చేరితిమి. ఒక రోజు హైద్రాబాదులో నుండి మరల హనుమకొండకు వచ్చితిమి. ఆ రోజులలో ప్రభుత్వమువారు ముస్లింలకు భూములనిచ్చి వారికి వృత్తి కల్పించ వలెనని ఆలోచనలో నుండిరి. ఆ సంకల్పముతో అలహాబాదు నుంచి కొందరు ముస్లింలను బోధనకు రప్పించి అచ్చట వారికి ఇండ్లు కట్టించుకొని వ్యవసాయము చేయుటకు కొంత డబ్బు తఖాని రూపముగానిచ్చిరి. వ్యవసాయమున కలవాటులేని ముస్లింలు ఇచ్చిన ఋణములను ఖర్చుల కుపయోగించుకొని వ్యవసాయము చేయజాలక స్వస్థానమున కేగిరి. ఆ రుణమును తీర్చుటకు ఒప్పుకొనినచో ఆ భూములు పట్టాపైన జరుపుమని వినియుంటిని. నాకు కొంత ఆకర్షణ కలిగియుండెను. పరస్థానికుడను కనుకను, నిలువడం లేనివాడను కనుకను నేనొక్కడను ఈ కార్యమును చేయజాలకపోతిని. గాని వరంగల్ జిల్లాలోని ఎందరో రైతు సోదరులతో ఈ సదవకాశమును వినియోగించుకొనుమని సలహానిచ్చితిని. గాని తెలంగాణ రైతులలో వ్యాపకత్వము లేనందువలన నా సలహా వారి నాకర్షించలేక పోయెను. ఇప్పుడు బోధన్, నిజాంసాగర్ ప్రాజెక్టు క్రింది భూములను కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి ఎందరో రైతులువెళ్ళి భూములను సంపాదించి లాభము పొందుచున్నారని వినుచున్నాను. వారిని చూచి కూడా తెలంగాణా రైతులలో వ్యాపకత్వము ఉత్సాహము రేకెత్తలేదని విచారపడుచున్నాను. కొంచె మెంచుమించుగా నా అధ్యక్ష కాలమును పూర్తి కావచ్చినది. పదియవ మహాసభకు కావలసిన యత్నములు జరుగవలసి యున్నవి. కాబట్టి నేను పర్యటన కార్యక్రమమును ఇకముందు సాగించదలచుకొనలేదు. గాని ఆంధ్ర మహాసభాధ్యక్షుడు కనీసము 2 సంవత్సరముల వరకైనను ఉన్నచో పూర్తి పర్యటన చేసి దేశావసరములను గ్రహించి ప్రజలకు కావలసిన సౌకర్యములను లభింపచేయవచ్చుననియును, ఒక సంవత్సరములో చేయజాలరనియును గ్రహించితిని. నా అధ్యక్ష కాలములో సర్వవిధముల తోడ్పడిన శ్రీ మందుముల రామచంద్రరావుగారి ఉపకారము మరువజాలను.

నా అధ్యక్ష కాలములో పూర్వమువలె ఏకాభిప్రాయముతో ఉద్యమము నడుపుటకు భేదభావము లుద్భవించెను. మొదటి నుండియు శ్రీమాడపాటి హనుమంతరావుగారు మాకు నాయకుడుగాను శ్రీ వెంకటరంగారెడ్డిగారు, శ్రీ రామకృష్ణారావు, మందుముల నర్సింగరావు, రామచంద్రరావు గార్లు నేనును వారికి అనుయాయులముగా నుండి అభేదముగా నడచుచుండేవారము. అందేమి

మార్పురాలేదు. గాని ఆంధ్రమహాసభ బురకాలో కమ్యూనిస్టు సిద్ధాంతముల ప్రచారముచేయు రావి నారాయణరెడ్డి గారి పార్టి బలపడుచుండెను. వారి సహాయము నాకు లభించుటకు బదులు ప్రతిఘటనకు సిద్ధపడుచుండిరి. శ్రీ వెంకటరంగారెడ్డిగారు పట్టుదలతోను తన పలుకుబడి వెంటను ఈ పార్టి వారికి వినిపించి అణగబెట్టునని మే మనుకొని దశమాంధ్ర మహాసభకు అధ్యక్షత వహించవలసినదని శ్రీ రంగారెడ్డి గారిని కోరితిమి. అనారోగ్యముగా నుండుటచే విశ్రాంతి తీసుకొను చుండిరి. అయినను పోటీకి నిలచి ప్రచారము చేయజాలననియును, లోగడ వలెనే ఏకగ్రీవముగా ఎన్నుకుంటే ఉండెదననియును బదులుచెప్పిరి. నియమావళి మారినది. ఎన్నికలు జరుగక తప్పదు. కనుక మేమా ప్రచారముచేసి గెలిపించెదమని నేనును, శ్రీ రామచంద్రరావు గారును బాధ్యత తీసికొంటిమి. ఎన్నికలలో యిదివరకు పోటీ ఉండేది కాదు. గాని ఈ సభ కొఱకు నారాయణరెడ్డి పార్టీవారు శ్రీ బద్దం యెల్లారెడ్డిని పోటీగా నిలువబెట్టిరి. మా వరంగలు జిల్లాలో కొందరు వారి అనుయాయులుండిరి. ఎన్నికల సంరంభము వచ్చినది. నేను బాలెట్ పద్ధతిలో ఓట్లు వేయించితిని. మొత్తం వరంగలులోనే కాదు తక్కిన జిల్లాలో కూడా శ్రీ రంగారెడ్డిగారికి అధికఓట్లు వచ్చుటచే దశమాంధ్ర మహాసభకు వారే అధ్యక్షులుగా ఎన్నుకోబడిరి.

ఆంధ్రోద్యమ చరిత్ర రెండవ భాగములో నవమాంధ్ర మహాసభ నివేదిక యందును వ్రాయబడిన విషయములను దృష్టియందుంచుకొనియే నాతో గురించిన కొన్ని విషయములను మాత్రము వ్రాసితిని. ఇంతకన్న ఎక్కువగా వ్రాయుట సోత్కర్షగా నుండగలదు.

## దశమాంధ్ర మహాసభ

నవమాంధ్ర మహాసభ తరువాత కమ్యూనిస్టు తత్వముతో ఆంధ్రోద్యమ ములో నుండి తేపతేపకు ప్రతిఘటించు నారాయణరెడ్డిగారి పార్టివారితో ఒక సంవత్సరముఆంధ్రోద్యమమును వెనుకబడనీయక నడపగలిగితిని గాని దశమాంధ్ర సభకు స్థాయిసంఘ సభ్యత్వమునకు అపేక్షించక విరమించితిని. దశమాంధ్ర మహాసభకు ఆహ్వానసంఘము నారాయణరెడ్డి పార్టివారిదే. శ్రీ డాక్టర్ జయసూర్యా ఆహ్వానసంఘ అధ్యక్షులుగా నుండిరి. సేవాదళము వారిచేతికిందిదే. వారి తత్వము మరలవ్రాయుట అనవసరము. మహాసభ రెడ్డి బోర్డింగు ఆవరణలో ఏర్పాటు చేయబడినది. విషయ నిర్ణయసభలో నివేదించవలసిన చిత్తు తీర్మానములను నేనే సిద్ధముచేసి యుంచితిని. 17వ తీరు స్న 1352 ఫసలీ

తేదీ ఉదయము 8 గంటలకు మోటారు తీసికొని సాంప్రదాయానుసారము నూతనాధ్యక్షుని తీసికొని రావడమునకు వెళ్ళితిని. ఊరేగింపు ఏర్పాటు లేదు. ఆహ్వానసంఘ అధ్యక్షుడు నాతో రాలేదు. నేనును శ్రీ వెంకటరంగారెడ్డిగారును రెడ్డి బోర్డింగు ఆవరణలోనికి వచ్చితిమి. షుమారు 200 మంది మహిళా మణులుండిరి. వారు మా కుభయులను కుంకుమ, మాలాంకృతులను జేసిరి. విషయ నిర్ణయసభలో అధ్యక్ష ఎన్నికను ప్రతిపాదించుచు మాతో పని చేయుటకు అభిమానులును, ఉత్సాహవంతులును అయిన 74రు స్థాయి సంఘ సభ్యులను ఎన్నిక చేయించి తెచ్చినాను. మహాసభను సభ్యపరివార సమేతముగా వప్పగించి విరమించు చున్నాని చెప్పితిని. ఇంతటితో నవమాంధ్ర మహాసభాధ్యక్షత కర్తవ్యము చేతనైనంత నెరవేరినదని తృప్తి చెందితిని. అదేరోజు మహాసభ సాంప్రదాయాను సారం ప్రారంభించబడినది. మరురోజు మహాసభలో చర్చల సందర్భమున వాలంటియర్లు జోక్యము కలుగజేసికొని తమ పార్టీకి ఓటు చేయుటకు ప్రోత్సహించుటయు శ్రీ రంగారెడ్డిగారు గమనించి యిది తగదు. మీ విద్యుక్తమునకు విరుద్ధమని మందలించిరి. అందుపైన సేవా సైనికులు ఆగ్రహావేశములతో సేవాదళ చిహ్నములను తెచ్చి అధ్యక్షపీఠము నందుంచి స్థబ్దులుగా కూర్చుండిరి. దీనిని కనిపెట్టి అధ్యక్షులవారితో మీ వాలంటియర్లు యువకులు వారు పని చేయలేమనుచున్నారు. నేను టెలిగ్రాం యిచ్చి వరంగలునుంచి సాయంత్రంకి అనుభవము గల 400 మంది వాలంటియర్లను రప్పించెదను. ప్రస్తుతము నాపేరు వాలంటియరుగా వ్రాయమని కోరితిని. అంతట శ్రీ హనుమంతరావు గారు వాలంటీయరుగా వచ్చెదనన్న వ్యక్తి నిన్నటి వరకు ఇదే పీఠమందు అధ్యక్షులు గానున్నాడని గ్రహించండి అనెను. ఈలోగా మా వరంగలు మిత్రులకు ఒక చీటీ పంపితిని. దానిపైన శ్రీ పరచా రంగారావు జమలాపురం కేశవరావు, హయగ్రీవాచారి, రాజలింగం ప్రభుతులు 60 మంది తమ పేర్లు నాకందజేసిరి. అంతట నేను లేచి మేము 60 మంది వరంగలు కార్యకర్తలము యిప్పుడే సిద్ధముగా నున్నాము వాలంటియర్ చిహ్నములు మాకిప్పించి మావల్ల సేవాదళ పనులు తీసుకొనుమని కోరితిని.

ఈ 60 మందిలో తాలూకా జిల్లాసంఘం అధ్యక్షులు, స్థాయి సంఘ సభ్యులు డెలిగేట్లు నుండిరి. ఇది కొంతకలవరము పుట్టించినది. అధ్యక్షుడు శ్రీ రంగారెడ్డిగారు వాలంటీయర్లను మరల మందలించి పూర్వాధ్యక్షుడు ఆయన మిత్రులు 60 మందితో వాలంటియర్లుగా పని చేయుటకు సిద్ధమైనప్పుడు నేను

అధికారం చలాయించడం మంచిదనుకొనను వారితో పాటు వాలంటీయరుగా పని చేయవలసినదే అనిరి. ఇంతలో ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ డాక్టర్ జయ సూర్యాగారు వేదికపైకి వచ్చి వాలంటియర్లను సంబోధించి తిరుగుబాటు మంచిది కాదనియు అధ్యక్షులవారి ఆజ్ఞలను పాటించవలసిన దనియును మీ కష్టములను నాకు తెలుపవలసిన దనియును చెప్పిరి. దానిపైన వాలంటియర్లు అధ్యక్ష పీఠము వద్దకు వచ్చి క్షమాపణకోరి మరల పని చేసెదమని నమ్మకము చెప్పి తమ చిహ్నములను యిప్పించమని కోరిరి. అధ్యక్షులవారు వారి చిహ్నములను తీసికొని వెళ్ళుటకు శలవిచ్చిరి. కొంతసేపటితో ఆపూట సభ ముగిసినది. వెంటనే వరంగలు ప్రతినిధులు గుడికూడి తమ సంసిద్ధతకు తృప్తిచెంది నాతో మీరీ విధముగా సాహసము చేయుదరని మేమనుకొనలేదు. 10వేల మందిగల ఈ మహాసభలో నేడు మన వరంగలు తల నిలచినది. గౌరవ ప్రతిష్టలు వచ్చినవి అని తమ ఆనందమును తెలిపిరి.

మూడవరోజు కమ్యూనిస్టు మిత్రులచే ఇన్‌కంటాక్సు తీర్మానము ప్రతిపాదించబడి, ధనికవర్గము పైనను వర్తకుల పైనను సుంకము ఉండవలెనని పట్టుబట్టిరి. దానికి నేను ప్రతిఘటించితిని. నిజామాంధ్ర దేశములో పెద్ద ధనవంతులు లేరు. వారి ఆదాలు కూడా సామాన్యమే. ఇన్‌కంటాక్సు శాఖవారి అక్రమ పద్ధతులు కూడా మన అమాయక ప్రజలను కష్టదాయకముగా నుండగలవంటిని. శ్రీ మిరియాల నారాయణగుప్త గారు లేచి పన్నులు ప్రత్యక్షములో వర్తకులపైన బడినను వారు ఈ భారము ప్రజలపైననే వేయుదురు. కాబట్టి ఈ పన్ను వలన ధనికులకును బీదలకును కూడా కష్టములు రావచ్చును. కాబట్టి ఈ పన్ను విధించరాదనిరి. ఈ తీర్మానంపైన రాత్రి 12 గంటలవరకు చర్చ జరిగినది. ఓట్లు తీసికొనగా 17 అధిక ఓట్లు నా సవరణకు అనుకూలముగా వచ్చినందున తీర్మానము ఓడిపోయెను. సభ ముగియగానే నేను బసకు వెళ్ళుటకు టాంగా వద్దకు వచ్చితిని. కమ్యూనిస్టు సోదరులు ఆంధ్ర మహాసభ ధనికులకును సాహుకారులకును అమ్ముడు బోయినదనే మొదలయయిన నినాదములతో నా టాంగా వద్ద గుమిగూడిరి. నా టాంగాపైన సర్దార్ కేశవరావు కూడా ఎక్కెను. ప్రశాంతముగా బసకు చేరి పరుంటిని. నా టాంగాపైన దౌర్జన్యమేమియు జరుగలేదు. తరువాత ఆ సంవత్సరము చెప్పదగిన విశేషములేమియు లేవు. గాని ఒక కార్యవర్గ సభ మాత్రము వరంగల్లులో శ్రీ ఉదయరాజు రాజేశ్వరరావు గారింట జరిగినది. నేను ప్రత్యేకాహ్వానము పైన సభకు వెళ్లితిని. నన్ను స్థాయి

సంఘమునకు ఎన్నుకొనబడలేదని శ్రీ రంగారెడ్డిగారు విచారమును తెలిపిరి. ఆ సభలో కాళోజి నారాయణరావుగారీ క్రింది గేయమును పాడిరి.

"ప్రతాపరెడ్డి, రామకృష్ణుడు, రంగారాయుడూ
పులిజాల రంగారాయుడూ – పితామహుడు
రంగారెడ్డి వీరు సుగామ వీరు – మందుములవారు,
రావివారు, మాదిరాజువారు, మన మాదిరాజువారూ
పదియవ సభకు రంగారెడ్డికి పట్టం కట్టేరు–"

శ్రీ రాజలింగం, హయగ్రీవాచారి, కోదాటి నారాయణరావు గార్లు మరి కొందరు ఆంధ్రోద్యమ మనే ఒక శాఖను వేరుగా ఏర్పాటు చేయదలచిరి. కార్యవర్గసభ జరిగే రోజులలో యువక కార్యకర్తలచే పైన పేర్కొనబడిన జాతీయపక్ష ఆంధ్రమహాసభ అనే ఒక వర్గము పేరు వింటిని. దాని ఉద్దేశ్యములు కేవలము నిర్మాణ కార్యక్రమమని చెప్పిరి. అధ్యక్షుడు రంగారెడ్డిగారు నిషేధించక అనుజ్ఞ ఇచ్చిరి. శ్రీ హనుమంతరావుగారు ఉపేక్షించిరి. నూతన పక్షము వలన కక్షలు స్పర్థలు బయలుదేరుటయు, ఐకమత్యము కుంటుపడుటయు తటస్థించుననియు నిర్మాణ కార్యక్రమము హరిజనోద్ధరణ ఆంధ్రమహాసభ ఉద్దేశ్యములోనివే ననియును చెప్పి నేనందు చేరుటకు నిరాకరించితిని. గాని మందుముల రామచంద్రరావుగారు నాయకత్వము వహించిరి. ఈ పార్టీలో ఆంధ్ర మహాసభ కార్యక్తరలలో నుంచి శ్రీ ఎం.ఎస్. రాజలింగం, కోదాటి నారాయణరావు, హయగ్రీవాచారి, కాళోజి నారాయణరావు, కొమరగిరి నారాయణరావు, జమలాపురం కేశవరావు మొదలగు ముఖ్యులగు వారుండిరి. జాతీయపక్ష స్థాపనతో ఆంధ్రమహాసభలో చీలికలు పుట్టెను. ఒకటి ప్రచ్ఛన్న కమ్యూనిస్టు పార్టీ, రెండవ పార్టీ యువక జాతీయపక్షము వారిది. మిగిలినది శ్రీ హనుమంతరావు మొదలగు వృద్ధమితవాద పార్టీ. అందు వారి అనుచరులమైన శ్రీ రామకృష్ణారావు, రంగారెడ్డి, నరసింగరావుగారు నేను ఉంటిమి.

వైరా ప్రాజెక్టు రైతులపైన తకావీ బాకీ ఉండెను. ఆ మొత్తము దాదాపు ఒక లక్షరూపాయీలు. అవి వసూలు చేయుటకు తహశీల్దారు, గిర్దావర్లను పంపి వత్తిడిచేయుట కారంభించిరి. అది శ్రావణమాసము అచ్చట ప్రచారము చేయుచున్న కమ్యూనిస్టు నాయకులు శ్రీ సర్వదేభట్ల రామనాధం, వాసిరెడ్డి వెంకటపతి, వట్టికొండ నాగేశ్వరరావుగార్లు ఆపుదల ఉత్తర్వులు చేయించుతామని రైతులకు చెప్పి హనుమకొండకు వచ్చిరి. తమ పాత సహకారమును బట్టి నావద్దకు

రావడముకు ఇష్టములేదు. తక్కిన వకీళ్ళు తమవల్ల పని కాదనిరి. అంతట వారు హైద్రాబాదు రంగారెడ్డి గారివద్దకు వెళ్లి చెప్పిరి. వారు నా వద్దకు పొమ్మనిరి. వారు మామీద కోపపడుతారు మీరే వారికి చెప్పుమని కోరిరి. అంతకుముందేదో పని కొఱకు పట్ణం వెళ్లి నాంపల్లి ధర్మశాలలో నుంటిని. అది వెంకటపతిగారికి తెలుసును గనుక శ్రీ రంగారెడ్డిగారిని నావద్దకు తీసుకొని వచ్చిరి. శ్రీ రంగారెడ్డిగారు నీవు ఈపనిచేసి ముల్తవిహుకుం యిప్పించమనియును నీవద్దకు రావడమునకు వచ్చిన నాయకులు భయపడుచున్నారనియును చెప్పిరి. ఇది ప్రజానీకముతో గురించిన పనిగాని పార్టీతోను, వ్యక్తులతోను సంబంధించినది కాదు. నాకు ఎవరియెడల ద్వేషములేదు గనుక పనిచేసెదనని ఒప్పుకుంటిని. అంతట రంగారెడ్డిగారు వచ్చిన వారిని నాతో కలిపి వెళ్లిపోయిరి. వెంకటపతిగారు వగైరాలు నాతో హనుమకొండ వచ్చిరి. మరురోజు దరఖాస్తు వ్రాసి సుబేదారుగారి వద్దకు తీసికొనివెళ్లి, ఇచ్చి వర్షాభావముచే ప్రాజెక్టుకు నీరురాక నార్లు ఎండిపోవుచుండుటచే రైతులు బాధపడు చున్నారు. పంట రోజులలో ఉపేక్షించి ఆ సమయములో పాతబాకీల కొఱకు రైతులను మీక్రింది అధికారులు వత్తిడి చేసి జప్తులు చేస్తామని బెదరించు చున్నారు. పంట తరుణము వరకు ఆపుచేయిం చుమని చెప్పితిని. ఉదార స్వభావముగల శ్రీ మహబూబల్లిఖాన్ సుబేదారుగారు నా మాటలను విశ్వసించి అదే ప్రకారము ఆపుదల కొఱకు ఉత్తరువిచ్చెను. రైతులు కృతజ్ఞత తెలిపిరి. కమ్యూనిస్టులు ప్రకటించిన కరపత్రములో తామే వుత్తరువును తీయించితిమని వ్రాసుకొనిరి. ఆ కరపత్రము శ్రీ రంగారెడ్డిగారి ఎదుటకు వచ్చెను. తరువాత వచ్చిన భోనగిరిలోని స్థాయిసంఘ సభలో ఈపనిని ఆంధ్రమహాసభ పక్షమున నా ఆదేశానుసారము రామకోటేశ్వరరావు చేసినాడు. ఇది ఆంధ్రమహాసభ కార్యక్రమములోనిదే ననియును, కమ్యూనిస్టుల ప్రకటన సరికాదనియు తెలిపిరి. రాజ్యాంగ సంస్కరణలు ప్రజాభీష్టమునకు విరుద్ధముగా నున్నను ప్రభుత్వముచే అంగీకరింపబడి ఆచరణలో పెట్టబడెను. వాటిలో మొట్టమొదటివి సుబేదారు ఆధ్వర్యమున జరుపబడెను. జిల్లా మహాసభలు నియమానుసారం తాలూక్దారుచే పేర్కొనబడిన కొందరు అనధికార సభ్యులును ఆయాశాఖల ప్రభుత్వాధికారులును ఆహ్వానింపబడెదరు. ప్రజావసరములను గురించి చర్చలు జరుపుతారు. ఉద్దేశ్యము మంచిదైనను రాజ్యాంగ సంస్కరణలలోని ఒక భాగము కనుక వాటిని మేము నిరాకరించి యుంటిమి. కాబట్టి అస్మదాదులము సభలో పాల్గొనలేదు. నా యెడల విశ్వాసము గల తాలూక్దారు, సుబేదారుగార్లు

ఎన్నియో విధముల నీవు శాసనసభల ఎన్నికలలో పాల్గొన మనియును, నీవు పోటీ లేకుండా ఎన్నుకోబడియెదవనియును చెప్పుచుండేవారు. అది వాస్తవమే. అయినను ఆంధ్రోద్యమ తీర్మానమునకు లోబడి శాసనసభల ఎన్నికలలో నేను పాల్గొనలేదు. ఆ కాలమున నాకు మంత్రి పదవి సులభముగా లభించబడేది. అయినను ఆశపడలేదు. మా మిత్రులు మా పార్టీవారును అయిన రామాచారిగారు మంత్రి పదవికి అంగీకరించి రెండుమాసములు పనిచేసి రాజీనామా నిచ్చిరి. ఆ కారణమిచ్చుట అనవసరమని వ్రాయలేదు.

ఏకాదశాంధ్ర మహాసభ భోనగిరిలో జరుపవలెనని కమ్యూనిస్టు పార్టీవారు ఏర్పాటు చేసికొనిరి. మహాసభకు ముందే స్థాయిసంఘ ఎన్నికలు జరుగవలసి యుండెను. జాతీయపక్షము వారు తటస్థ విధానం బవలంభించితి మని ప్రకటించి ఊరకుండిరి. ఎక్కువమంది స్థాయిసంఘ సభ్యులు కమ్యూనిస్టువారే. అధ్యక్షుడుగా రావి నారాయణరెడ్డిగారు ఎన్నుకొనబడిరి. నాకీ సంగతి తెలియగానే విచారపడి ది. 26=4–44, 9–5–44 తేదీల తెలంగాణా పత్రికలకు వ్యాసములు వ్రాసి యిది కమ్యూనిస్టు సభయనియును, కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభ పేరుతో సభ జరుపరాదనియు వ్రాసితిని. వినేవారెవరున్నారు? పెద్దల ఉపేక్ష యువకుల తటస్థ విధానమును జతపడినవి. నా వ్రాతలు అరణ్యరోదనము లైనవి. ది. 23వ మే 1944 తేదీన 11వ మహాసభ జరుపబడినది. నేను ఏదో కారణమున భువననగిరి వెళ్ళకపోతిని. లేఖ మాత్రము వ్రాసితిని.

తరువాత ఇంకా కొన్నివ్యాసములు వ్రాసినానని జ్ఞాపకము. మా పెద్దలు జాతీయపక్షమువారి నిర్మాణ కార్యక్రమముకు 14వేల రూపాయలిచ్చి ఆంధ్ర మహాసభను కమ్యూనిస్టుల పరం చేసినను జాతీయపక్ష కార్యక్రమము నిర్వహించు సంకల్పములోనే యుండిరి. ఒక సమావేశము జూన్ మాసాంతము శ్రీ రంగారెడ్డి గారింట ఏర్పాటుచేసిరి. ఆహ్వానము పైన నేను కూడా వెళ్లితిని. వరంగలు జిల్లా నుండి 4వేలు వసూలుచేసి నిర్మాణ కార్యక్రమమున కివ్వవలెనని ఆదేశించిరి. గాని నా హృదయావేదన వేరుగా నుండెను. సభ నుంచి బయటికి రాగానే కోపము పట్టజాలక శ్రీ మందుముల రామచంద్రరావుగారితో జాతీయపక్ష నాయకత్వము వహించి ఆంధ్ర మహాసభను కమ్యూనిస్టులకు కట్టిపెట్టితిరని యిష్టము వచ్చినట్లు దూషించి మాట్లాడితిని. వారికి నాయందుగల ప్రేమ గౌరవములు లేకుండినచో వారు సహించక ప్రతిదూషణ చేసేవారు. గాని వారు సహించి ఊరకుండిరి. తుదకు కర్తవ్యమేమని అడిగిరి. మన కార్యకర్తలను

ఆహ్వానించి, సమాలోచనలు జరిపి తుదినిర్ణయమునకు రావచ్చునని చెప్పితిని. అంతట వారు ఒక నెలరోజులలోగా భోనగిరిలో ఒకరోజు సమావేశము ఏర్పాటు చేసి వృద్ధ యువక కార్యకర్తలను నాయకులను ఆహ్వానించిరి. సభకు కనీసం 30 మంది యువకులు పెద్దలు విచ్చేసిరి. సభలో నా ఆవేదన వెల్లడించుచూ యికముందు మహాసభను జరిపేవారు ఎవరు? నడిపేవారెవరు? అని ప్రశ్నించిరి. అందుకు నేను మహాసభను జరిపించెదనని చెప్పితిని. సభలో నున్న శ్రీ జమలాపురం కేశవరావు, మాడపాటి రామచంద్రారావులు మీకు వరంగల్లులో ఎవరు సహాయము చేస్తారు, ఈ భారము మీరు ఎందుకు పెట్టుకున్నారని మరల ప్రశ్నించిరి. అందుకు నేను కనీసము మీరుభయులైనను నావెంట ఉన్న చాలునని చెప్పితిని. వారుభయులు సంతోషముతో మీవెంట తప్పక ఉంటామనిరి. సభలోనున్న శ్రీ మందుముల నరసింగరావుగారు ఈ ఉద్యమమునకు పూర్తి సమయము నిచ్చి తోడ్పడుటకుగాను అవసరమైనచో అధ్యక్షుడుగా నుండి పని చేయుటకు సిద్ధముగా నున్నానని చెప్పిరి. శ్రీ రంగారెడ్డిగారు మహాసభానంతరము ఒక సంవత్సరము కార్యక్రమము నడుపుటకు కావలసిన డబ్బు వసూలుచేసి యిచ్చెదనని చెప్పిరి. ఈ ప్రకారము మేము ముగ్గురము మూడు బాధ్యతలు తీసికొనుటచే ఆంధ్ర మహాసభ పునరుద్ధరణ కార్యక్రమము ప్రారంభించ వచ్చునని శ్రీ హనుమంతరావు పంతులుగారును, మందుముల రామచంద్రరావు గారును సంతోషముతో శలవిచ్చిరి. తక్కిన సభ్యులు కూడా ఆమోదించిరి. అదే రాత్రి అందరము తమతమ స్థలములకు వెళ్ళిపోతిమి.

## ఆంధ్ర మహాసభ పునరుద్ధరణ

నేను వరంగలు చేరి శ్రీ పరచ రంగారావు, రామేశ్వరరావు మొదలగు మిత్రులతో సంప్రదించితిని. వారు సుముఖముగా ఉత్సాహమును చూపకుండిరి. యువక మిత్రులందరు జాతీయ పక్షమువారె అయియుండిరి. అందరికిని ఆంధ్ర మహాసభ భిన్నాభిన్నమైన దనియును, కుదుట బడుట కష్టమనియును, నిరాశ యుండెను. నాకును శ్రీ నరసింగరావుగారికిని, శ్రీ రంగారెడ్డిగారికిని ఉత్తర ప్రత్యుత్తరములు జరుగుచుండెడివి. పట్టం వెళ్ళినప్పుడు ముగ్గురము సమాలోచనలు చేయుచుండేవారము. మేము ముగ్గురమును పట్టుదలను వదలి ప్రయత్నమును మానలేదు. వారుభయులు నాకు ప్రోత్సాహ మిచ్చుచుండిరి. ఆంధ్ర మహాసభను చేతిలోనికి తీసికొని నడప వలెనని విరివిగా ప్రాథమిక సభ్యులను చేర్చి బలము చేకూరిన పిమ్మట ఆహ్వానసంఘము నేర్పాటు చేయవలెను. ఇది సక్రమ మార్గమని

నిశ్చయించుకొంటిమి. సభ్యత్వ ఫారములు జిల్లా సంఘము నుండి తీసికొనవలెను. అందుకని నేను ఖమ్మంలో జిల్లా సంఘ కార్యస్థానమునకు వెళ్ళితిని. అధ్యక్షులుగా శ్రీ చిర్రావూరి లక్ష్మీనరసయ్య పని చేయుచుండెను. వారితో కలసి ఒక వెయ్యి ఫారములను తీసికొంటిని. వాటిని కొందరు స్నేహితులకిచ్చితిని. ఇంకా 4వేల ఫారములు పంపుమని లక్ష్మీనరసయ్యగార్కి వ్రాసితిని. నా ప్రయత్నమును గ్రహించి వారు కార్యకర్తల పేర్లు అర్హతలు తెలిపినచో పంపెదమని జవాబిచ్చిరి. వారిని యాచించుటచే లాభము లేదనుకొంటిని. వరంగలులోనే మొదటి పర్యాయము 40వేల ఫారములు అచ్చువేయించితిని. కొన్ని పట్టం పంపితిని. అవధానుల వీరభద్రశర్మ గారిని వ్రాత పనికొఱకు నియమించుకొంటిని. కీ. శే. శ్రీ గురురావు గారు నాతో కలసి కార్యదర్శివలె పని చేయుచుండిరి. శ్రీ ముదిగొండ రాజలింగంగారు తన సహచరుల ద్వారా ప్రాథమిక సభ్యులను చేర్చుట కంగీకరించిరి. వారికి 300 రూపాయిలు అవసరమైన ఫారములు ఇచ్చితిని. వరంగలులో కొంచమే డబ్బు సహాయము దొరికినది. నేను వీరభద్ర శర్మగారి సహా నర్సంపేట, మానుకోట, ఇల్లెందు, పాలివంచ, ఖమ్మం, మధిరలకు వెళ్ళి సమావేశము జరిపి ప్రచారము చేసి సభ్యత్వము చేయించుటకు చెప్పి ఫారములు వారికందజేసితిమి. ఆ ప్రదేశములలో పనిచేయు వకీళ్ళు స్థానిక ప్రముఖులు ఉద్యమాభిమానులేగాక నాయందు ప్రత్యేక ఆదరాభిమానులుగా నుండి సహకారము చేయుటకు సిద్ధపడిరి. వారు ప్రయత్నము చేయుచుండిరి. సభ్యుల సంఖ్య వేలాదిగా పెరిగి పోవుచుండెను. అందుచే శ్రీ హయగ్రీవాచారి, రాజలింగం, కేశవరావు మొదలగు జాతీయవాద మిత్రులకు ఆశకలిగినది. నాకు కొన్ని సలహాలు ఇచ్చుచుండేవారు. మొత్తంమీద వరంగలు జిల్లాలో 32 వేల ప్రాథమిక సభ్యులను చేర్చగలిగితిని. మానుకోట, ఖమ్మం, మధిరలకు 3, 4 పర్యాయములు కూడా వెళ్ళితిమి.

కమ్యూనిస్టులు మాకు నాన్‌పార్టీ అని పేరుపెట్టిరి. అయినను వేలకొలది ఉత్సాహముతో సభ్యులుగా చేరుటయు కొందరు పలుకుబడిగల ప్రముఖులు సహకారమునకు సిద్ధపడుటయు, కమ్యూనిస్టులు గ్రహించిరి. దీనిని వారు సహించలేకుండిరి. ఒక రహస్య కరపత్రము తీసి అందు ప్రజానీకముతో మనకే సన్నిహితత్వము ఉండవలెను. ఇకముందుపెద్దలతోను వకీళ్ళతోను గల సంబంధమును సాగనీయక తెగదెంపులు చేయవలెను. వారి అవసర వ్యవహారములను మనమే నిర్వహించవలెను అని వ్రాసుకొనిరి.

ఒకరోజు నేను ఖమ్మం వెళ్ళి శ్రీ పరచ శ్రీనివాసరావుగారింట వరండాలో తిరుగుచుంటిని. కమ్యూనిస్టువారు షుమారు 500 మంది దేపుకులతో 4 గంటల పగటివేళ ఊరేగింపుతో వచ్చి

1. పోటీసభ ఎందుకయ్యా? మాదిరాజయ్యా
2. ఉన్న సభలు చాలవా? మందుములయ్యా
3. .................... రంగారెడ్డయ్యా

శ్రీనివాసరావుగారింటి వద్ద నన్ను చూచి 13 నిమిషములు కదలకుండా ఉండిరి. డప్పులు వాయించి యేగుచుండిరి. నా మీదికీ దౌర్జన్యముగా రాలేరని నాకును ధైర్యమేగనుక నినాదములు వినుచు నిలుచుంటిని. కొంతసేపటికి వారు వెళ్ళిపోయిరి. ఇంతేకాక 3 సమాధులు చూపుచూ ఒకటి రంగారెడ్డిగారిది, ఒకటి నర్సింగరావుగారిది మూడవది రామకోటేశ్వరరావుది అని పేర్కొనుచుండేవారట. నాకు మధిరలో కుడిభుజమువలె శ్రీ దేవంభట్ల అనంతపద్మనాభశాస్త్రీ, కందిబండ పురుషోత్తమరావు, జమలాపురం కేశవరావుగార్లును, మధిర, కల్లూరు వేంసూరు పట్టెలలోని కొందరును, ఖమ్మంలోని శ్రీ పరచ శ్రీనివాసరావుగారు అయితరాజు జీడికంటి రామారావుగారును, మానుకోటలో శ్రీ అడ్డి రాజయ్య రంగాచార్యులు గార్లును, ఇల్లెందు కొత్తగూడెం పాలవంచలో కొందరును పూర్తి సహకారము చూపిరి. అంతటితో నాకు తృప్తి గలిగి ధైర్యము వచ్చినది. 1, 2 పర్యాయములు శ్రీ నరసింగరావుగారు వరంగలు వచ్చి సంగతులు తెలుసుకొని నాకు సలహా యిచ్చిరి. కరీమ్‌నగరం, చెన్నూరు, లక్కిసెట్టిపేట, ఆసిఫాబాదుల సభ్యత్వమునకు నేనే ప్రయత్నించితిని. అచ్చటి మిత్రులు కొందరు సభ్యులను చేర్చిరి. గాని మెదక్, నిజామాబాదు, నల్లగొండ, మహబూబ్‌నగరం అతరాఫ్ జిల్లాల సభ్యత్వమునకు శ్రీ నర్సింగరావు, రంగారెడ్డి, రామచంద్రరావుగార్లు ప్రయత్నము చేసిరి. మొత్తంమీద వరంగలు జిల్లాలో 32 వేలును, తక్కిన 7 జిల్లాలలో 30 వేలును మొత్తం 62 వేల సభ్యత్వముతో ఆంధ్రమహాసభ నిలువగలిగెను.

అంతట ఒకరోజు మధిరెలో ఆహ్వాన సంఘ నియామకము కొఱకు తాలూకాల స్నేహితుల కాహ్వానములు పంపి సమావేశము జరుపబడెను. మిత్రులందరు నన్నే ఆహ్వాన సంఘాధ్యక్షునిగా నియమించిరి. ధర్మవరం సభకు కార్యదర్శులుగాను, సహకార్యదర్శులుగాను పని చేయుటకు ఉత్సాహముతో ముందుకు వచ్చి పని చేయుచుండిరి. గాని అట్లు సహకారము ఈ సభకు వరంగలులో లభించి యుండలేదు. తుదకు గురురావు గారిని కార్యదర్శిగా

నియమించుకొంటిని. ఆ రోజు మధిరలో భోజనాల అనంతరం శ్రీ రాజలింగం, హయగ్రీవాచారి మరికొందరు ఒక గదిలో నుండగా వారిని సంబోధించి మీరందరు వెనుకటివలె (ధర్మవరంలో వలె) ఉత్సాహముతో ప్రదేశముపైన ఉండి పందిళ్ళు పాకలు మొదలగు నిర్మాణములు చేయవలె నని కోరితిని. అంతట వారు ఆశ్చర్యముతో డబ్బులేని కార్యము నెగ్గజాలదుగదా నీ వద్ద ఇప్పటివరకు డబ్బేమి లేదు. ఎట్లా ఉండి పనిచేయవలెను. మేము చేయజాలమనిరి. అచ్చటకు వచ్చియున్న వారిలో పెండెల రామానుజరావు ధర్మవరం సభలో నాతో పనిచేసిన అనుభవజ్ఞుడు ఉండెను. ఆయనతో పూర్వమువలెనే ఉత్తర ప్రత్యుత్తరముల కార్యక్రమమైననూ చేయుమని కోరితిని. ఆయన అంగీకరించలేదు. జాతీయ పక్షమువారు తెలిపిన ఆక్షేపణలలో యదార్థమున్నదని నాకు తెలుసు గాని ఆహ్వాన సంఘము ఏర్పడేవరకు విరాళముల కొరకు ప్రయత్నము చేయజాలముగదా? ఇంతేగాక ఉద్యమము పడిపోయినదని అందరికి నిరాశయే యుండెను. ఐనను ప్రచారముచేసి డబ్బు వసూలుచేసి తెచ్చెదనంటిని. అయినను వారంగీకరించలేదు. సాయంత్రము ప్రత్యేకముగా శ్రీ కందిబడ పురుషోత్తంరావు గారితోను, పద్మనాభ శాస్త్రిగారితోను, జమలాపురం కేశవరావుగారితోను మాట్లాడితిని. మధిర తాలూకాలో రు. 2000/– వసూలుచేసి యివ్వలసి నదనిన్ని అది కేశవరావుగారి వద్దకే పంపుచుండ వలసినదనిన్ని కేశవరావుగారు సభాస్థలమందుండి మండపాది నిర్మాణములు చేయించవలసిన దనిన్ని చెప్పితిని. అలాగే పరచ శ్రీనివాసరావుగారి తోను, ఖమ్మం నుంచి రూ. 2000/–లు వసూలు చేసి యిచ్చే బాధ్యత మీదేనని‌న్ని, జీడికంటి రామారావుగారు ప్రదేశమునకు వచ్చి పనులు చేయించవలెనని కోరితిని. వీరందరు ఉద్యమాభిమానులే గాక నాయందు ప్రేమాదరణలు గలవారగుటచే అంగీకరించిరి. ముఖ్యముగా శ్రీ జీడికంటి రామారావుగారు జమలాపురం కేశవరావును ఉత్సాహముతో కొంత డబ్బు తీసికొని త్వరలోనే వచ్చెదమనిరి. వరంగల్ మానుకోట తాలూకాలలో నేను ప్రయత్నము చేసెదనంటిని. సభముగించుకొని నేనున్నూ గురురావుగారున్నూ వరంగలు వచ్చితిమి. అప్పటివరకు సభాస్థలము నిర్దేశమై యుండలేదు. వరంగలు నగరంలో రేషను నియమములు అమలులోనున్నవి. అందువల్ల నేను సుబేదారు గారితో కలసి రేషను ఇబ్బందులను ఆహార పదార్థముల సప్లయి కొరకు అనుమతి ఇప్పించ వలసినదని కోరితిని. అప్పుడు అమీర్ అలీఖాను సాహేబుగారు హబీబుద్దిన్‌గారు తాలూక్దారుగాను ఉండిరి. వారు ఖాజిపేట ఏర్యా వెలుపల పందిళ్లు వేసుకోవచ్చు

ననిన్నీ బియ్యము తెచ్చుకొనుటకు అనుజ్ఞ ఇచ్చెదమనిన్ని నాకు ధైర్యమిచ్చిరి. ఆ ప్రకారము రోడ్డు ప్రక్కన మడికొండ సరిహద్దులలో సభాస్థలిని నిర్ణయించితిమి. ఈ సంగతిని నరసింగరావు, రంగారెడ్డిగార్లకు తెలిపి వారి సమ్మతిని తీసికొంటిని. రోడ్డుప్రక్కన ఒక భూస్వామి శలవుపొంది 14 ఎకరముల భూమిలో ఇంజనీర్ల ప్లాను ప్రకారము పందిల్లు పాకలు వేయుటకు ప్లానులు చేసికొంటిని. వరంగలు వర్తకుల దగ్గరకు వెళ్ళి విరాళము లిప్పించుటకు అడిగితిని. కాని ధర్మవరం సభనాటి వలె భూరివిరాళము లిచ్చుటకు వెనుకాడిరి. వచ్చిన డబ్బుతో పనులు సాగించుచుంటిని. ఇంతలో కొంతడబ్బు తీసికొని కేశవరావుగారు వచ్చిరి. వారు మరికొందరు మిత్రుల సహాయముతో సభాస్థలమున వంట ఏర్పాటు చేసికొని నివసించుచు పందిళ్ళు పాకలు వేయించు చుండిరి. నాకు సహాయము కొరకు శ్రీ నరసింగరావుగారు అవసరాల కామేశ్వరరావుగారిని, రంగారెడ్డిగారు వేములపల్లి భాస్కరరావుగారిని హనుమకొండకు పంపిరి. వారు వారం పది రోజులు నా వద్దనే ఉండి ఉత్తర ప్రత్యుత్తరములు మొదలగు వాటిని జరుపుచుండిరి. ఒకరోజు నరసింగరావుగారు వరంగలు వచ్చి ఖమ్మం వెళ్లిరి. అప్పటివరకు ఖమ్మం డివిజనులో ఉద్యోగిగా పనిచేయుచున్న శ్రీ బొమ్మకంటి సత్యనారాయణరావు గారున్నూ మరి ముగ్గురు మిత్రులున్నూ ఆంధ్రోద్యమములో చేరి పని చేసెదమని చెప్పినందున నరసింగరావుగారు సంతోషముతో వారికి స్వాగతమిచ్చిరి. సత్యనారాయణరావుగారు ఉద్యోగమును వదలి అప్పటినుండియే ప్రజాసేవకు బద్ధకంకణులై నేడు శాసనసభా సభ్యులై పనిచేయుచున్నారు. బహుశః నరసింగరావు గారి వెంటనే పరచ శ్రీనివాసరావుగారు వచ్చిరని జ్ఞాపకము. నేను, నరసింగరావు గారు, ఉదయరాజు రాజేశ్వరరావుగారు మరికొందరు మిత్రులు సమావేశమైతిమి. నేను వసూలు చేసిన డబ్బు సంగతిని తెలుసుకొని పరచ శ్రీనివాసరావుగారు భయపెట్టుచు డబ్బు దగ్గరలేనిదే పని ప్రారంభించ వద్దని గట్టిగా చెప్పిరి. అందుపైన నేనును, రాజేశ్వర్‌రావుగారును చెరి ఒక వెయ్యి రూపాయిలు అడ్వాన్సుగా యిచ్చి పనులు సాగించు చుండెదమని చెప్పి అలాగే డబ్బు యిచ్చి పనులు ప్రారంభించి తిమి. తరువాత కొన్ని రోజులకు పరచ శ్రీనివాసరావుగారు తాను వాగ్దానము చేసిన 2000లలో 1600/-లు జీడికంటి రామారావుగారి ద్వారా వరంగలు పంపిరి. మిగతా 400/-లు అక్కడ స్థాపించిన ఒక ఉద్యమమునకు ఇచ్చినామని చెప్పిరి. జీడికంటి రామారావుగారు కూడా సభాస్థలికి వచ్చి మరికొందరు కార్య కర్తలు తోడ్పడిరి. సభాసన్నాహములు నిర్విఘ్నముగా కొనసాగుచుండెను. నేను

ఒకసారి మానుకోటకు వెళ్లితిని. అచ్చట సుమారు 600 రూపాయలు విరాళము దొరికినవి. వరంగలులో సుమారు 1000 రూపాయిలు విరాళములు దొరికినవి. ఈ విధముగా అంగ, అర్థబలములు చేకూరుటచే ధైర్యముతో కార్యక్రమము ముందుకు సాగించు చుంటిని. ఒకనాడు రంగారెడ్డిగారున్నూ, నరసింగరావు గారున్నూ హనుమకొండకు వచ్చిరి. ఇంకా కొందరు కార్యకర్తలు కూడ సమావేశ మైరి. మడికొండలోని పంద్రెండవ ఆంధ్రమహాసభకు మందుముల నరసింగరావు గారు అధ్యక్షులుగా నుండవలెనని నిశ్చయించుకొంటిమి. గాని బొమ్మకంటి సత్యనారాయణ రావుగారు, హయగ్రీవాచారిగారు మరికొందరు యువకులు ఈ సభకు జమలాపురం కేశవరావుగారిని అధ్యక్షులుగా చేయమని కోరిరి. నేనును రంగారెడ్డిగారును తటస్థించిన పరిస్థితుల దృష్ట్యా అనుభవజ్ఞుడైన నరసింగరావుగారే అధ్యక్షుడుగా నుండుట అవసరమని చెప్పితిమి. అంతట నరసింగరావుగారు యీ సంవత్సరము కేశవరావుగారిని కార్యదర్శిగా తీసికొనెదననియు, వచ్చే సభకు కేశవరావుగారిని అధ్యక్షునిగా చేసి నేను కార్యదర్శిగా నుండెదననియు చెప్పిరి. యువక మిత్రులు కూడా అంగీకరించిరి. శ్రీ కాళేశ్వరరావు పంతులుగారు తెలంగాణా ఉద్యమములను తెలుసుకొనుటకు కుతూహలము గలవారే గనుక ఆంధ్రమహాసభ కమ్యూనిస్టుల వశమగుటయు, పునరుద్ధరించి హస్తగతము చేసి కొనుటకు మేము చేయు ప్రయత్నములను వారికిని తెలుసును గనుక మడికొండ మహాసభకు కొలది రోజుల ముందు కమ్యూనిస్టులను ఆంధ్రమహాసభ నుండి వెళ్ళగొట్ట వలెనని వారిద్వారా నాకాదేశమిచ్చిరి. మహాసభకు సందేశమును కూడా పంపిరి.

మడికొండ శివారు మైదానములో అనగా ఖాజిపేటలోని ఇండ్లకు దూరముగా సభామంటపములు తయారగుట తెలుసుకొని మా మిత్రులు తీవ్రవాది జమలాపురం గోపాలరావుగారు నాతో అడవిలో పందిళ్ళు వేయుచున్నావు. కమ్యూనిస్టులు వచ్చి తగలబెట్టెదరు ఏమిచేస్తావు? అని బార్‌రూంలో న్యాయవాద మిత్రుల యెదుట ప్రశ్నించెను. అందుకు నాలో కూడా కొంత ఆవేశమువచ్చెను. నావద్ద వందలాది సేవాదళమున్నది మడికొండలో నాయందు విశ్వాసముగల ప్రజలున్నారు. సభాస్థలికి కమ్యూనిస్టులు వచ్చి దౌర్జన్యము చర్యలకు దిగితే నేను ద్రోణాచారిగా ప్రవర్తించి దౌర్జన్యపరులగు గుండాలను మెట్టిరామప్పగుట్టకు బలిపెట్టించగలనంటిని. మా మిత్రులందరు సంతోషించిరి.

మహాసభ సమావేశమునకు రెండు రోజులు ముందు యస్.సి. అయ్యంగారు అనే పూర్వపరిచితుడైన సి.ఐ.డి. ఇన్‌స్పెక్టరు వచ్చి మీ సభాస్థలి

వద్దకు కమ్యూనిస్టు మూకలు వచ్చి దౌర్జన్యములు జరుపకుండా రక్షణ చేయుటకు సాయుధ పోలీసులను ఉంచుటకు ప్రభుత్వాజ్ఞ అయినది. నేను సాయుధ పోలీసులతో వచ్చి రోడ్డుకు ఉత్తరముగా డేరా వేసుకొని ఉండెదను. ఒకసారి విన్యాసము చేయించెదనన్నాడు. నేనే మీ పోలీసు సహాయము మాకక్కరలేదు. మీరు వచ్చినట్లు ప్రదర్శనలు కూడా చేయుట అనవసరము. మీరు బెద్రసుగా డేరాలో ఉండవచ్చునంటిని. లోపలికివచ్చి ఉపన్యాసములు వింటామన్నారు. వారికి ప్రేక్షక టిక్కెట్లు ఈయబడెను. వారందరు పూర్వపరిచితులే గనుక సంతోషముగా కార్యకర్తలతో కలిసి తిరుగుచుండేవారు.

శ్రీగుండవరం హనుమంతరావు అనె ఒక కమ్యూనిస్టు కార్యకర్త (పూర్వము నరసింగరావు గారి వెంట ఆంధ్రోద్యమములో తిరిగిన పరిచయుడె) నావద్దకు వచ్చి సభలోనికి రావచ్చునా? విషయములునోటు చేసికొనవచ్చునా? అని శలవడిగెను. ప్రేక్షక టిక్కెట్టు తీసికొని ప్రశాంతముగా కూర్చొనవలెను గాని విరుద్ధ ప్రసంగములకు దిగితే సేవాదళం మిమ్ములను నెట్టివేయుదురంటిని. ఆయన అందుకు అంగీకరించి మర్యాదగానే కూర్చొని వెళ్ళిపోయేవాడు.

కలెక్టరుగారు కావలసిన కిరసనాయిల్ పంచదార మొదలగు రేషన్ వస్తువుల కొఱకును, 25 బస్తాల బియ్యము ఘనపురం నుండి తెచ్చుకొనుటకును పరిమిటు యిచ్చెను. ప్రతిరోజు 5000 మంది భోజనము చేయవలసి యుండగా 25 బస్తాలు చాలవంటిని. అందుకు కలెక్టరుగారు ఎప్పటికి 25 బస్తాల పరిమిటు నీవద్ద ఉండును. వచ్చినవి ఖర్చుగుచుండును. నిలువ ఉండవుగదా? అని చెప్పెను. మొత్తం మీద అధికార వర్గమునకు మాయందుగల సద్భావము కమ్యూనిస్టుల యెడలగల అసూయ ఈ సహకారమునకు కారణములని వేరుగా చెప్పనక్కరలేదు. అధికార వర్గము హిందువు లైనను ముస్లిం లైనను స్వాతంత్ర వాంఛాపరులె. గనుక మా ఉద్యమమును గర్హించక కొంత సానుభూతి కనుపరచేవారు.

ఖమ్మం, మధిరె, మానుకోట, వరంగలు సంగతి పైన వ్రాసితిని. మొత్తం 10వేలు కావలసి యుండును. గనుక ఒక మోటారుకారు తీసికొని నా మిత్రులు శ్రీ ఉదయరాజు రాజేశ్వరరావు, తూము వరదరాజు గారలు 2 రోజులు సంచారము చేసి 16 వందల రూపాయిలు తెచ్చిరి. శ్రీ ముదిగొండ రాజలింగం గారు షుమారు నూరుమంది సేవాదళముతో సభాస్థలికి వచ్చిరి. వారే దళాధిపతిగా నుండిరి. శ్రీ హయగ్రీవాచారిగారు అల్పాహార పానీయముల యింతెజామును చేసిరి. ఎప్పటివలెనే కొన్ని ప్రదర్శనశాలలు వచ్చెను. కీ. శే. గురురావుగారు

ప్రధాన కార్యదర్శిగాను, పందిళ్లు పాకలు, వేదిక మొదలగు సభాస్థలి కార్యక్రమము లకు శ్రీ జీడికంటి రామారావు, జమలాపురం కేశవరావుగార్లు తమతమ సహచరులతో కార్యదర్శులుగాను, భోజనశాల ఆహారపదార్థ రక్షణ మొదలగు పనులకు తమ సహచరులతో కవులూరు సత్యనారాయణరావుగారును కార్యదర్శు లుగా పనిచేసిరి. నాస్వాగతోపన్యాసము ప్రకటించబడినది. అయినను గాని ఆంధ్ర మహాసభ పునరుద్ధరణ విషయములను పాఠక మహాశయులకు యిదే సందర్భమున తెలుపుట ఉచితమనుకొని యిందే పొందుపరచుచున్నాను.

స్వామి రామానందతీర్థగారు ధర్మవరంలో వలెనే వచ్చి సందేశమిచ్చిరి. తీర్మానములు ఆంధ్రోద్యమ చరిత్ర రెండవ భాగమున సంగ్రహంగా ప్రచురింప బడినవి. సభ ప్రశాంతముగాను జయప్రదముగాను జరిగి వరంగలు జిల్లా మడికొండ గ్రామములో పునరుద్ధరణ చేయబడినది. కమ్యూనిస్టుల బారినుండి ఉద్యమమును హస్తగతము చేసికొనగలిగితిని. ఈ విధముగా పునరుద్ధరణ కార్యక్రమమునకు భోనగిరిలో చేసిన వాగ్దానము ప్రకారము నా ప్రధమ కర్తవ్యము నెరవేర్చ గలిగితిని. రక్షణాభారము అధ్యక్షుడు నరసింగరావు గారికి వప్పగింత పెట్టితిని. మా విజయమునకు కమ్యూనిస్టు మిత్రుల హృదయ సంతాప మెట్లుండెనో అవి కొన్ని పత్రికలలో కూడా వ్రాయబడినవి.

గాని యువక జాతీయవాదులు సంశయాత్మకులైరి. పునరుద్ధరణ సమ్మతమే గాని వృద్ధనాయకత్వము ఇష్టములేదు. ఇదే దృష్టితో మహాసభ సమయమున కూడా వారు మావెంట ఉన్నను మాటలలోను, క్రియలలోను యధోచిత సహకారమే కనుపరచిరి. ఈ విషయమును మేము గ్రహించితిమి. సభ ముగియగానే కేశవరావుగారిని పిలచి ముందు మీ ఫాలసి ఎట్లుండును అని శ్రీ నరసింగరావు గారు ప్రశ్నించిరి. తమ అనుయాయులతో సంప్రతించి చెప్పుటకు కొంత అవకాశము కోరెను. ప్రతినిధులందరు వెళ్ళిపోయినను శ్రీ హనుమంతరావు, రంగారెడ్డి, నరసింగరావుగార్లు నేను అచ్చటనే ఒక రోజంతయు ఉంటిమి. కేశవరావు మొదలగు 50 మంది జాతీయపక్షము వారు సమావేశమై 3, 4 గంటలసేపు చర్చలు జరుపుకొని తుది నిర్ణయము చేసికొని సహకారము చేయుదు మని చెప్పి వెళ్లిపోయిరి. సభ్యులు హయిద్రాబాదు నాయకులు వెళ్ళిపోయిరి. మరురోజు నుంచి మిగిలిన వస్తు సామగ్రిని విక్రయించి యివ్వలసిన బాకీలు యిచ్చివేసితిమి. నేనును, శ్రీరామేశ్వరరావుగారును అడ్వాన్సుగా యిచ్చిన డబ్బు మాత్రము పూర్తిగా భర్తీ కాలేదు. తగులుమాటు సంఖ్య వ్రాయుట అనవసరము.

మహాసభానంతరము శ్రీ నరసింగరావుగారు తన కార్యవర్గమును ఏర్పాటు చేసికొనిరి. అందు నేనొక సభ్యుడనుగా నుంటిని. మొదట అనుకున్నట్లు జమాలపురం కేశవరావుగారిని కార్యదర్శిగా ఏర్పాటు చేసిరి. కార్యస్థానము నారాయణగూడలో తానున్న యింటనే ఒక భాగములో నుంచిరి.

కొన్ని మాసముల తరువాత నరసింగరావుగారు నేనును వేంసూరు, కల్లూరు, ఖమ్మంలకు వెళ్లి సమావేశములు జరిపి కార్యకర్తలను ప్రోత్సహించితిమి. వరంగలు జిల్లా సంఘమునకు పరచ శ్రీనివాసరావు గారును, తాలూకా సంఘమునకు కొలిపాక వెంకటకిషన్‌రావు గారును అధ్యక్షులుగా నుండిరి. ఖమ్మం సమావేశములో ప్రచ్ఛన్న కమ్యూనిస్టులు వచ్చి తమ భావములనే వెల్లడించిరి. తరువాత 1 నెల రోజులకు నేనును శ్రీ నరసింగరావు గారును కరీంనగరం జిల్లా పర్యటనకు సంకల్పించుకొంటిమి. నరసింగరావు గారు నావద్దకు హనుమకొండ వచ్చిరి. ప్రత్యేక మోటారును తీసుకొని మొదట హుజూరాబాదు వెళ్లితిమి. అచ్చట శ్రీ గుండవరపు జగన్నాధరావుగారిని వెంట బెట్టుకొని కరీంనగరం చేరితిమి. . అచ్చట వకీలు పెండ్యాల శ్రీనివాసరావుగారింట 4 రోజులు అతిథులుగా నుంటిమి. ఒకరోజు కరీంనగరం కార్యకర్తల సమావేశము జరిపి జిల్లా సంఘము నేర్పాటు చేసితిమి. హరిజన పాఠశాల, గ్రంథాలయమును చూచితిమి. తరువాత ఒక్కొక్క రోజు తాలూకా ముఖ్యస్థానములగు శిరిశిళ్ళ, జగిత్యాల, సుల్తానాబాదు, పెద్దపల్లి (ఒకరోజు సుల్తానాబాదు పెద్దపల్లి)కి మోటారు పైన వెళ్ళితిమి. ఆంధ్రోద్యమ నాయకులు కార్యకర్తలు మాకు స్వాగతమిచ్చి సమావేశములు జరిపిరి. ఆహార సమస్యలు, లేవి మొదలగు రైతు సమస్యలను గురించి రైతులతో సంప్రతించితిమి. వారల కష్టములను తెలుసుకొంటిమి. కొన్నిటిని అధికారులకు చెప్పితిమి. ఈ విధముగా కరీంనగరంలో ఆంధ్రోద్యమా భిమానము – కమ్యూనిజం పైన నిరసన వ్యాపింప జేసితిమి. అంతట శ్రీ నర్సింగారావు గారు పట్టం వెళ్లిపోయిరి. దీనితరువాత ఇట్లే శ్రీ రంగారెడ్డిగారు నేను ప్రత్యేక మోటారులో విరాళముల కొరకు బయలుదేరితిమి. కరీంనగర్ వరంగల్ సూబాలోనిదే గనుక నాకును ఆ జిల్లాలో కక్షిదారులు ఎక్కువ నుండిరి. శ్రీ రంగారెడ్డి పలుకుబడి కూడా బాగా ఉండెడిది. శ్రీ గుండవరపు జగన్నాధరావు గారిని వెంట నుంచుకొని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, మెట్టపల్లి, సుల్తానాబాదులకు పెద్దపెల్లికీ వెళ్ళితిమి. స్థానిక ప్రముఖులు విరాళముల నిచ్చుటకు వాగ్దానము చేసిరి. అందు కొంత నగదు రూపముకముగా వసూలయ్యెను. ఈ

విధముగా మొదట ప్రచారమునకును, రెండవసారి ఆర్థిక సహాయమునకును కరీంనగర్ జిల్లాలో సంచారము చేసితిమి. పర్యటన జయప్రదముగానే సాగినది. ఇట్లే వరంగలు, పాఖాల తాలూకాలలో కూడా శ్రీరంగారెడ్డి నర్సింగరావుగార్లు నేను కలసి తిరిగితిమి. ఇక్కడ కూడా ఆర్థిక సహాయము చాలా లభించెను. సంవత్సర కాలము పూర్తి అయినది. మధ్యకాలమున జరిగిన కార్యవర్గ సభలకు వెళ్ళుచుంటిని. జరిగిన కార్యక్రమము యింతవరకు ఆంధ్రోద్యమ చరిత్రలో వ్రాయబడియే యున్నది. అనుకున్న మాట ప్రకారము కంది గ్రామములో 13వ ఆంధ్ర మహాసభ శ్రీ జమలాపురం కేశవరావుగారి అధ్యక్షతన జరిగెను. నేను స్థాయిసంఘ సభ్యుడనుగా సభకు వెళ్లితిని. మూడవరోజున శ్రీ కోదాడ నారాయణ రావుగారు ఒక కరపత్రమును చదివిరి. అందు 12వ సభ జరిపి నడిపిన శ్రీ రంగారెడ్డి నరసింగరావు గార్ల పైనను నాపైనను దూషణలతో నిండియుండెను. అందుకు కేశవరావు విచారమును వెలిబుచ్చెను. వృద్ధ యువక అతివాద మితవాద పరస్పరారోపణలతో ద్వేషములు పెంచుకొని బహునాయకత్వముతో ఉద్యమ పతనమునకు కాలము వచ్చిన దనుకొంటిమి. శ్రీ నరసింగరావు, రంగారెడ్డిగార్లు ప్రత్యుత్తర మిచ్చిరి. వాటి వివరములు అనవసరమని వ్రాయలేదు. ఆపూట నేను బయలుదేరి వరంగలుకు చేరితిని. ఆ సంవత్సరము నా సేవ కూడా యధోచితము గానే ఉండెను.

## స్టేటు కాంగ్రెసు

1946 సంవత్సరమున నిజాం ప్రభుత్వము వారు భయము మాని స్టేటు కాంగ్రెసు పేరుతో రాజకీయ ఉద్యమము నడపరాదనే నిషేధమును తొలగించిరి. అంతట ఆంధ్ర మహారాష్ట్ర కర్నాట ప్రాంతీయ మహాసభల కార్యవర్గ సభ్యులు సమావేశమై తాత్కాలికముగా శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారి అధ్యక్షతన స్టేటు కాంగ్రెస్ రాజకీయ సంస్థను ప్రతిష్ట చేసితిమి. శ్రీ రావి నారాయణరెడ్డి పార్టివారు తమదే ఆంధ్ర మహాసభగా గ్రహించమని కోరిరి. గాని త్రైప్రాంతిక సభ్యులు ఏకగ్రీవముగా దానిని నిరాకరించి నారాయణగూడలో ఆఫీసు పెట్టి నడుపుచున్నది ఆంధ్రమహాసభ యని స్థిరపరచిరి. తరువాత కొలది రోజులకు మూడు ప్రాంతీయ సభల స్థాయిసంఘ సభ్యులుచేరి అధ్యక్షుని యెన్నుకొనవలెనని కొనిరి. తెలంగాణమున 8 జిల్లాలున్నవి గనుక సభ్యుల సంఖ్య యెక్కువగాని యువక తత్వము పెరిగిపోయినది. సహజముగా మహారాష్ట్రులలోని ఏకైక నాయక తత్వము

ఆంధ్రులలోని బహు నాయకతత్వము కలదని అందరికి తెలిసిన విషయమె. గనుక ఆ యెన్నికలలో 13 అధిక ఓట్లు స్వామి రామానందతీర్థగారు యెన్నుకొన బడిరి. పోటీచేసిన తెలంగాణా నాయకుడు శ్రీ రామకృష్ణారావు గారు యువకుడు కాదు గనుక అధ్యక్షుడు కాజాలకపోయెను. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ యువక పార్టీ. బ్రాహ్మణ బ్రాహ్మణేతర పార్టి లేకుండినచో తెలంగాణా మేమాశించినంత అభివృద్ధికి రాగలుగునని నా విశ్వాసము. మొత్తం మీద చల్లని పద్ధతులతో స్థాపింపబడి ఒడుదుడుకులు లేకుండా 17 కాలములు పనిచేసి చైతన్యము కలిగించి ప్రజలను స్వాతంత్ర్య వాంఛాపూరితుగా సిద్ధపరచిన ఆంధ్ర మహాసభ స్టేటు కాంగ్రెసులో లీనమై తన విద్యుక్తముగా నుండగలదు. తెలంగాణ అభ్యుదయమునకు ఆంధ్రోద్యమమే మూలాధారము.

హైదరాబాదు ప్రథమ స్టేట్ కాంగ్రెస్ మహాసభ శ్రీ స్వామి రామానంద తీర్థగారి అధ్యక్షతన 1947 సంవత్సరం జరుపబడెను. ఆ మహాసభకు పూర్వము నుండియు రాజ్యాంగ సంస్కరణలు బాధ్యతాయుత ప్రభుత్వము కావలెననెడి తీర్మానములు బహునమ్రతగా ప్రార్థనాపూర్వకముగా జరుగుచుండెడివి. గాని బ్రిటిషువారు ఇండియాను వదలివెళ్ళినారు గనుక హైద్రాబాదు స్వతంత్ర రాజ్యముగా నుండవలెనని నైజాంగారును యిత్తెహాదుల్ ముస్లిమీన్ ముస్లింలీగు వారలును భావించుచుండిరి. గాని ప్రజలు దానికి వ్యతిరేకముగా నుండిరి. ప్రథమ స్టేటు కాంగ్రెసు మహాసభలో తీవ్రముగా చర్చలు జరిగెను. యావద్భారత ప్రజలకు స్వాతంత్ర్యమిచ్చి వెళ్ళెదరు గనుక అట్టి స్వతంత్రము హైద్రాబాదు ప్రజలకు కూడా లభించుననియును, బాధ్యతాయుత ప్రభుత్వము నేర్పాటు చేయుట మంచిదనియును దేశీయరాజులు ముఖ్యముగా నిజాం ప్రభువు రాజ్యమును వప్పగింతపెట్టి వెళ్ళినా బ్రిటిషు ప్రభుత్వముకు ప్రతినిధి ననుకొని నిరంకుశ ప్రభుత్వము చలాయింప జాలడనియును సహేతుకముగా చర్చలు జరుపబడియె. భారత ప్రజలతోపాటు హైద్రాబాదు ప్రజలుకూడా స్వాతంత్రమును అనుభవించ గలరని తీర్మానము ప్రవేశపెట్టబడెను. ఈ తీర్మాన ప్రతిపాదకులు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు వినియోగించిన క్రింది శబ్దములు భవిష్యత్తును తెలుపుచుండెను. అవియొక జ్యోతిష్యమువలె యధార్థము లైనవి.

వత్తిడి వచ్చుటచే యుద్ధము వచ్చును. మరియొక మహారాష్ట్ర న్యాయవాది మహారాజా మా హితమును వినుము.లేదేని యివి ఆఖరు రోజులనుకొనవలసి వచ్చును. వాంఛలు చూస్తె తుదికాలముగానే కనబడుచున్న వనెను. ఈ

మహాసభానంతరము 3 ప్రధాన రాజకీయ పక్షములు బయలుదేరినవి. ఒకటి స్టేటు కాంగ్రెసు, రెండవది రజాకార్ ఉద్యమము, మూడవది కమ్యూనిస్టు పార్టీ. కాంగ్రెసులో ఒక పార్టీ శ్రీ స్వామి రామానందతీర్థ యువక పార్టీకి చెందినది. రెండవది శ్రీ రామకృష్ణారావుగారి వృద్ధపార్టీవారిది. రాజకీయ పార్టీలు విప్లవ సిద్ధాంతములపై తమ కార్యక్రమమును నడుపుచుండిరి. హత్యలు, దోపిడీలు, దౌర్జన్యములు, మానభంగములు విధ్వంసచర్యలు ప్రబలుటచే ప్రజలు నానా కష్టముల పాల్పడి దేశభ్రష్టులు కావలసివచ్చెను. వాటిని సందర్భానుసారముగా అచ్చట వ్రాసితిని. వృద్ధకాంగ్రెసు వాదులు అనగా ఆంధ్రోద్యమ నాయకులు మాత్రము సత్య అహింసా సిద్ధాంతములనే నమ్మియుండి కాంగ్రెసు కార్యక్రమమును సాగించుచుండిరి.

స్టేటు కాంగ్రెసు తరువాత తటస్థించిన రాజకీయ పరిస్థితులు చరిత్రాంశ ములుగా నుండగలవని ప్రత్యేకముగాను వివరముగాను వ్రాసితిని.

* * *

*ప్రకరణము - 14*

# వరంగల్ మూడవ దురంతము

## (మొగిలయ్య హత్య)

కాంగ్రెసు మీద నిషేధము పోయినది. స్టేటు కాంగ్రెసు స్థాపించబడినది. 1946వ సంవత్సరమున భారతీయ ప్రభుత్వములో కొందరు హిందూ ముస్లిం నాయకులను మంత్రులుగా నియమించుకొనిరి. భారత దేశమును భారతీయులకు ఒప్పగింత పెట్టుట నిర్ణయింపబడెను. ఆ కారణమున హైద్రాబాదు ప్రజలలో స్వాతంత్ర్యము వచ్చినదని ఉత్సాహము రేకెత్తెను. అచ్చటచ్చట భారత త్రివర్ణ పతాకములను నిలిపి జండావందనములు చేయుచుండిరి. అవి వరంగల్ ప్రాంతములో కూడా అచ్చటచ్చట జండా వందనములు ప్రారంభింపబడెను. 1947వ సంవత్సరము జూలై ప్రారంభమున ఒకటి రెండు పర్యాయములు వరంగల్ కోటలో సమావేశము జరిపి జండావందనము చేయుచువచ్చిరి. దానికి చాలామంది హిందూ ప్రజలు వచ్చేవారు. ఈ సమావేశములో శ్రీ రాజలింగం హయగ్రీవాచారి చంద్రమౌళీశ్వరరావుగార్లును మరికొందరు విద్యార్థికులు కూడ నుండిరి. ఇది ముస్లిముల కిష్టములేదు. వారు సహించలేకపోయిరి. జూలై మాసాంతమున హిందువులు జండావందనమునకై వరంగల్ ఖిల్లా గ్రామములో సమావేశమైరి. దీనిని ప్రతిఘటించుటకు శంభునిపేట ఖిలావరంగ్‌లోని కొందరు ముస్లిములు ఆయుధములతో ఈచోటుకు వచ్చిపడిరి. అక్కడ సమావేశమైన ఖిలా కాపురస్తులలో ముఖ్యులు బత్తిని రామస్వామి ఆయన సోదరుడు మొగిలయ్య అనే వారుండిరి. మొగిలయ్య కూడా కర్రకత్తితో సాముచేయు గలవాడే గాని

నిరాయుధుడుగా నుండెను. అయినప్పటికీ ధైర్యముతో ముస్లిము గుంపును ఎదుర్కొనెను. గాని ముస్లిములలో లకిడి పహెల్వాన్ చేతిలో ఈటయుండెను. ఆ ఈటెతో మొగిలయ్య ఛాతిపై పొడిచెను. మఱికొందరు ముస్లిములు రామస్వామి ముక్కుపైనను యితరచోట్లను గాయపరిచిరి. ఈ బీభత్సమును చూచి విద్యార్థికులైన శ్రీ రాజలింగం, హయగ్రీవాచారి, చంద్రమౌళీశ్వరరావు మొదలగువారు మరికొందరు ఇండ్లలో నుంచి వెనుకమార్గముల తప్పించుకొని పారిపోయిరి. మొగిలయ్య మరణము వలన అలజడి ఎక్కువై గ్రామ ప్రజలందరు గుమికూడిరి. అంతట ముస్లిములు కూడా పారిపోయిరి. పోలీసులు వచ్చి రక్షణ బందోబస్తు చేయుచుండిరి. కలెక్టరు మొదలగు అధికారులు కూడా ఖిలా గ్రామమునకు వెళ్లివచ్చినారని తెలిసినది. దారిలో కలెక్టరు హబీబుద్దీనుగారికి హంతకుడైన లకిడీ పహిల్వాను కలిసినాడట. సంగతి తెలిసి మనసులో యిష్టమే గనుక హంతకుడికి తానే సలాము చేసినాడని ఒక ఆరోపణ చేయబడినది. నేనట్లు చేయలేదని యెప్పుడో కలసినప్పుడు హబీబుద్దీన్ గారు నాతో చెప్పిరి. నిజానిజములు నేను నిర్ణయించజాలదు.

ఆ రోజు ఊరంతయు భయభ్రాంతముతో నుండెను. నేను గ్రామాంతరము వెళ్ళియుంటిని. మరురోజు వచ్చితిని. ఈ వార్త వినగానే ఉదయం 8 గంటలకు కలెక్టరుగారి వద్దకు వెళ్ళితిని. అప్పుడు డి.ఎస్.పి. కూడా వచ్చిరి. డి.ఎస్.పి. నాతో మీ కాంగ్రెసువారు ఊరేగింపులు, ఉత్సములు తీసి ఆవేశము రెచ్చగొట్టుచున్నారు. అందువల్ల ఈ హత్య జరిగినది అని నేరము ఆరోపించి చెప్పెను. నేను వారితో మా కాంగ్రెసు కార్యకర్తలు ప్రభుత్వాజ్ఞకు విరుద్ధముగా నడిచినట్లయితే వారిని పోలీసువారు అరెస్టు చేయవలసి యుండెను. గాని ముస్లిం ప్రజలు ప్రతీకారము తీసికొనుట విరుద్ధము. ఇందువలన పోలీసు యొక్క బలహీనతయే వెల్లడియగునని చెప్పితిని. మేముభయులము మాట్లాడుచుండగా సివిల్ సర్జన్ వచ్చెను. నన్ను పోలీసువారు శవపరీక్ష చేయుమని కోరుచున్నారు. నావద్దకు వారు శవమును పంపజాలకున్నారు. నేను అక్కడికి వెళ్లజాలకున్నాను. వేలాది హిందువులు ఆవేశముతో దెబ్బలాడుటకు సిద్ధముగా నున్నారని డి.ఎస్.పి.తో చెప్పిరి. ఇంతలో కలెక్టరుగారు లోపలి నుండి బయటికి వచ్చిరి. వారు రాగానే సివిల్ సర్జన్ మరల ఇదే విషయమును వారితో చెప్పిరి. కలెక్టరు పోస్టుమార్టం అవసరమా అని నన్ను ప్రశ్నించెను. నేను హంతకుని అరెస్టుచేసి కేసు నడుపదలచుకున్నచో పోస్టుమార్టము అవసరము గాని, చర్య తీసికోలేని పక్షములో పోస్టుమార్టం వృథా అని అంటిని. కలెక్టరు తప్పక కేసు పెట్టెదమని చెప్పెను. తరువాత స్థానిక పరిస్థితులు కలెక్టరు విని మీరు వెళ్ళి శవపరీక్ష

చేయించుమని నన్ను కోరిరి. నేను అందుకు అంగీకరించితిని. నేను డి.ఎస్.పి. సివిల్ సర్జన్ హనుమకొండ సివిల్ హాస్పటలుకు వచ్చి అదివరకు గాయపడి ఆసుపత్రిలో చేర్చబడిన, చనిపోయిన మొగిలయ్య అన్న రామస్వామిని మోటారు పైన తీసికొని వరంగలు కోటలో నున్న రామస్వామి ఇంటివద్దకు వెళ్లితిమి. మొగిలయ్య శవమున్న చోటికి నేనును, రామస్వామియు వెళ్ళితిమి. పోలీసు వారిని దూరముగానే ఉంచితిమి. బంధువులందరు ఏడ్చుచుండిరి. వారినందరిని ఓదార్చి హత్యచేసిన వానిమీద కేసుపెట్టి శిక్ష విధించుటకు ప్రయత్నము చేయుదుము. దానికొఱకు శవపరీక్ష కావలెనననంటిని. తల్లి మొదలగు వారు శవమును కోసి కుక్క నక్కలపాలు చేసెదరనిరి. మొగిలయ్య తల్లితోను, భార్యతోను ఇతర బంధువులతోను బాగా నచ్చచెప్పి నేను శవపరీక్ష చేయించి వెంటనే శవమును మీకప్పగింత పెట్టించెదనని నమ్మకంగా చెప్పితిని. వారు నాయందుగల విశ్వాసముతో బంధువులలో కొందరు శవమును తీసికొని ఒక ఫర్లాంగు దూరములో నున్న వేపచెట్టు వద్దకువచ్చి నాకు వప్పగింతపెట్టిరి. నేను శవమువద్ద ఉంటిని. సివిల్ సర్జను, కాంపౌండరు మాత్రమే శవమువద్దకు వచ్చి గాయపడిన చోటును, మరికొన్ని చోట్లను కోసి పరీక్షించిరి. మొగిలయ్య మరణము కత్తిపోటు వలననే జరిగినదని సివిల్ సర్జనుగారు వ్రాసుకొనిరి. పోలీసులు డి.ఎస్.పి. గారిని దూరముగానే ఉంచితిమి. కోసిన భాగమును కుట్టించి శవమును దహనము చేసికొనుటకు మొగిలయ్య బంధువులకు వప్పగింత పెట్టించి వారితో శలవు తీసికొని నేను ఇంటికి వచ్చితిని.

ఈ సంగతి వెంటనే హైద్రబాదు నాయకులకు తెలిపితిని. రెండవ రోజుననో, మూడవ రోజుననో శ్రీ రామకృష్ణారావుగారు, రంగారెడ్డిగార్లు హనుమ కొండకు వచ్చిరి. వారిని తీసికొని వెళ్ళి జిల్లా వరంగలులో ముఖ్య ప్రదేశము లన్నింటి చూపించి ప్రజలకు ధైర్యము చెప్పి వచ్చితిమి. ఖిలావరంగలు జనసంఖ్య షుమారు 7000 వరకుండును. అందులో హిందువుల సంఖ్య చాలా ఎక్కువ. హిందువులు ప్రతీకారము తీసికొంటారని ప్రభుత్వమునకును, ముస్లింలకును భయము అందువలన ఒకశాంతి కమిటీ ఏర్పాటు చేయబడెను. అందులో నేనుకూడా సభ్యుడుగా నియమింపబడితిని. మధ్యమధ్య వెళ్ళి ఖిల్లావరంగల్ పౌరులతో కలసి విచారించి వచ్చుచుండేవాడను. ఈ ఉదంతమును పురస్కరించుకొని శ్రీ ఎం.ఎస్. రాజలింగం, రామస్వామి, హయగ్రీవాచారి, కాళోజి నారాయణరావు గార్లను నామకః కొందరు ముస్లిములు హైద్రాబాదునుంచి వరంగలుకు కొన్ని మాసముల వరకు రాకూడదని నిషేధాజ్ఞ జారీ చేయబడెను. దానిని తొలగించమని నేను శాంతిసభలో ప్రతిపాదించితిని. అది అంగీకరించబడి

ప్రభుత్వమునకు పంపబడెను. ప్రభుత్వమువారు సవతితల్లి ప్రేమతో ఆలస్యముచేసి నిర్ణీత కాలమునకు ఒక వారం రోజుల ముందు నిషేధాజ్ఞ తొలగించబడినట్లు ఉత్తర్వు జారీచేసిరి. ఇందువలన నాతో మాట దక్కినది. శ్రీ రాజలింగం ప్రభృతులకు క్రియాపూర్వక లాభములేక పోయినది. అందువలన ఈ రాయితి మాకక్కరలేదు పూర్తి రోజులు గడిపియే ఇంటికి వచ్చెదమనిరి. అన్నిచోట్లను హిందూముస్లింల కొట్లాటలు పెచ్చు పెరుగుచుండెను. ఒక పర్యాయము జిల్లా వరంగలులో ప్రత్యేక పోలీసు సిబ్బంది ఏర్పాటు చేసితిమనిన్నీ దానిఖర్చు 5000/– రూపాయలు హిందూ ప్రజలవల్ల వసూలు చేసెద మనిన్నీ సమస్య తేబడెను. దానికి నేను ప్రతిఘటించితిని. ఒక హెడ్‌కానిస్టేబుల్ 10 మంది జవానులు నా నిగరానీలో యిచ్చినట్లయిన శాంతి భద్రతల భారము నేను వహించెదనని చెప్పితిని. అట్లుకాదేని హిందూ ప్రజలు ప్లేగు సమయంలో వలె గ్రామాంతరమందు గుడిసెలు వేసికొని రాత్రులయందు నివసించెదరనియును వారి ఆస్తులను కాపాడే బాధ్యత పోలీసు వారియందే ఉండగలదనియును చెప్పితిని. కలెక్టరు, డి.ఎస్.పి. దీనిని విరమించుకొనిరి.

ఒక పర్యాయము శ్రీ ప్రకాశం పంతులుగారు, కాళేశ్వర రావుపంతులుగారు మొదలగు నాయకులు ఎక్సుప్రెస్‌లో ఢిల్లీ వెళ్లుచుండిరి. 200 మంది ప్రజలును, నేనును ఖాజీపేట స్టేషనులో వారిని సందర్శించితిమి. సి.ఐ.డి. పోలీసు మావెంటనే ఉన్నది కనుక ప్రకాశంగారితో రహస్యంగా అప్పుడు హైద్రాబాదు ప్రధానిగా వున్న మిర్జాయిస్మాయిలుతో తాము చెప్పగలిగెదరా అని వారిని కోరితిని. అందుకు ప్రకాశంగారు 'మిర్జా మునుపటివాడే నని అనుకున్నావా' అని నాకు బదులుచెప్పెను గ్రహించి ఊరకుంటిని. ఖిలా ప్రజలు ధైర్యము వహించి తమ రక్షణ తాము చేసుకొన గలిగిరి. మరికొన్ని రోజులకు పరకాలలో యిట్లే హిందూ మహమ్మదీయుల మధ్య పోట్లాట జరిగెను. చాలామంది హిందువులకు దెబ్బలు తగిలెను, కొందరు మరణించిరి. దానికి ఒకటిరెండు రోజుల తర్వాత హుజూరాబాదులో సర్కిల్ ఇన్స్‌పెక్టరుకును, ప్రజలకును పెద్ద ఘర్షణ జరిగెను. నాకు తెలియగానే పరకాల వెళ్ళి ప్రజల నాయకుడైన కేశవరెడ్డిగారితో మాటాడి సంగతులు తెలిసికొని హుజూరాబాదు వెళ్లితిని. అక్కడ సంగతులను కూడా తెలుసుకొని హైద్రాబాదు వెళ్ళి కొందరు ప్రజలతోను, తహసీలుదారుతోను విచారించి అక్కడి సంగతులు తెలిసికొని వచ్చితిమి. మేము ప్రజలకు ధైర్యము చెప్పుటయు, విచారణాంశములను ఉన్నతాధికారులకు తెలుపుటయు చేయు చుంటిమి. అధికారులు శాంతివచనములు చెప్పినను క్రియాపూర్వకముగా సహాయము ఏమియు చేయకుండిరి. మేము పరామర్శ చేసి వచ్చుటవలన ప్రజలలో

ధైర్యము ఉత్సాహము కలిగి ఆత్మరక్షణకు సిద్ధమగుచుండిరి. దీని తరువాత కొన్ని మాసములకు అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్న సర్ మిర్జా యిస్మాయిల్ గారు వరంగలు విచ్చేసిరి. అప్పుడు వరంగలులోని అందు ముఖ్యముగా యువక న్యాయవాదులు సమావేశమై, యిచ్చట రజాకారు దురంతములు, అధికారుల ఉపేక్ష వివరముగా వ్రాసి దానిని సమర్థించుటకు నన్ను సర్ మిర్జా దగ్గరకు వెళ్లుమనిరి. ఆ ప్రకారం నేను కేశవరెడ్డిగారును వెళ్ళితిమి. ఆ ఆర్జీని సమర్పించితిమి. కేశవరెడ్డిగారు చదివి వినిపించిరి. హబీబొద్దీను కల్లెకరు కూడా అచ్చటనే యుండిరి. సర్ మిర్జాగారు కొంచెముసేపు నాతో విషయములను గురించి చర్చించెను. ఇంతలో యిత్తెహాదుల్ ముస్లిం నాయకులును రజాకారు మూమెంటు కార్యకర్తలైన అబ్దుల్ అలీం, ఖుర్బాన్‌అహమదు, అబ్దుల్ సమద్, హబీబుజైలానీ బంజరుదారు మొదలగు కొందరు ముస్లిం ప్రముఖులు విచ్చేసిరి. వారితో కూడా మిర్జాగారు విచారించిరి. విషయములలో చాలాభాగము వారును అంగీకరించిరి. శాంతిమార్గ మేమని ఆయన ప్రశ్నించెను. అబ్దులుఅలీగారు లేచి రామకోటేశ్వరరావుగారు ఈ ఊరిలోనే గాక మా న్యాయవాది సంఘములో కూడా ఆయనే పెద్దవాడు. ఆయన శ్రద్ధ తీసుకుంటే శాంతి కావచ్చునని చెప్పెను. నేను యిప్పటివరకు హిందూ ముస్లింలను ఐకమత్యముతో ఉంటిమి. హిందువులు జ్యేష్టసోదరులుగాను, ముస్లింలు కనిష్ట సోదరులుగా ఉంటూ ఉంటిమి. న్యాయవాదులలో కూడా అబ్దులు అలీంగారు చెప్పినటుల నాయందు హిందూ సోదరులేగాక, ముస్లిం సోదరులు కూడా గౌరవ మర్యాదలతో నడచు చున్నారనియును, ఇకముందు కూడా ముస్లిం సోదరులు నాతో సహకారము జరిపినట్లయితే నేను జిల్లాకంతటికి శాంతి భారము వహించెదననియును చెప్పితిని. సర్ మిర్జాగారు మీ సంభాషణవిని నేను ఆనందించినాను. మీరందరు మర్యాదగల పెద్దమనుష్యులు, మీతో నేను కొన్ని గంటలసేపు మాటాడితేనేగాని తృప్తిపడజాలను. రెండు మాసములలో వచ్చి మీకు పూర్తి టైం ఇచ్చెదనని చెప్పి శాంతిని కాపాడుమని కలెక్టరు వగైరాలకు కూడా చెప్పిరి.

* * *

*ప్రకరణము - 15*

# రజాకార్ ఉద్యమము

భారత ముస్లింలీగ్ ప్రభావము హైద్రాబాదు ముస్లిం ప్రజలపైన కూడా పడినది. ముస్లిములు యిత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థ (ఐక్యముస్లిం సమాజము)ను స్థాపించిరి. దానికి హైద్రాబాదులోని ఒక చిన్న జాగీర్దార్ బహుద్దురు యార్‌జంగ్ అధ్యక్షుడుగా నుండి నడుపుచుండిరి. వారు సంఘ బలమునకు ప్రయత్నము చేయుచుండిరి. హైద్రాబాదు రాష్ట్రమునకు కొంత కాలమునుండి ఆర్యసమాజము కూడా పనిచేయుండెను. శుద్ధ సంఘటన యిత్యాది కార్యక్రమముతో పనిచేయు చుండిరి. ఈ ఉభయ సంస్థల్లో స్పర్థలు పెరిగి పెరిగి దెబ్బలాటలు, హత్యల వరకు వచ్చెను. యిత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థ స్థాపించిన తరువాత తీవ్రదశకు వచ్చెను. ఇది ఇట్లుండ జిన్నాగారి మంత్రోచ్చాటనచే ముస్లింలీగ్ స్థాపించబడెను. ప్రజలు తిరస్కరించిన నేతిబీరకాయ వంటి రాజ్యాంగ సంస్కరణలు ఫ. 1349లో అమలులో పెట్టబడెను. అనుభవజ్ఞుడైన సర్ మీర్జా ఇస్మాయిల్ ప్రధానిని తొలగించి నవ్వాబ్ చత్తారిని పిలిపించిరి. ముస్లిం ప్రజలు భారతదేశమును విభజించి పాకిస్తాను వేరుచేయుటయు రెండు రాజ్యములకు స్వాతంత్ర్యము నిచ్చుటయు తటస్థించిన తరువాత భారతదేశ మంతయు పాకిస్తాను కావలెననియును హైద్రాబాదు ముస్లిముల ఆశయమైయుండెను. బహుశ? జిన్నాగారి తిరుమంత్రము యిట్లే ఉండవచ్చును. కావున ఢిల్లీలాల్ ఖిల్లాపైన తమ జెండా కట్టెదమనియును యుద్ధముచేసిన కత్తులను బందరు సముద్రరేవులో కడిగెద మనియును ప్రగల్భములు పలుకుచుండిరి. సైన్యము కావలెను గనుక రజాకార్ ఉద్యమము

ప్రారంభించిరి. రజాకార్ అనగా స్వచ్ఛంద సైనికుడు అని అర్థము. నవ్వాబ్ చిత్తారిపైన ఈ రజాకారులె దౌర్జన్యముచేసిరి. ఆయన వెళ్ళిపోయెను. రజాకార్ దళనాయకుడు ఖాశింరజ్వి (ఒక న్యాయవాది) గారును, ప్రధానిగా లాయఖల్లిగారును ఏర్పరుచబడిరి. పరిస్థితులను గమనించి నిజాంగారి కరుణా రసమో ఉపేక్షయో, అసమర్థతయో కారణములని చెప్పవలసి వచ్చును. ఇదేదియో ప్రజలును చరిత్రకారులు నిర్ణయించగలరు.

స్టేటు కాంగ్రెసు తరువాత దేశమంతటను దోపిడీలు, హత్యలు, మానభంగములు జరుపబడినవి. ఈ రజాకార్లు చేసిన దురంతముల వివరించుట నాకవసరము లేదు. కాని వరంగలులో జరిగిన దురంతములను వేరొకచోట వ్రాసితిని. 1948 ఆగష్టు నెల నుండి స్టేటు కాంగ్రెస్ పక్షమున సత్యాగ్రహంలు సాగించబడెను. దేశభక్తులు వేరువేరు తేదీలలో సత్యాగ్రహము చేసి జైలులకు పోయిరి. సెప్టెంబరు మాసములో శ్రీ రామకృష్ణారావు, రంగారెడ్డిగారలు హనుమ కొండకు వచ్చి న్యాయవాదులను మిత్రులను సమావేశపరచిరి. మాలోకొందరిని జైలుకు వెళ్ళుమని కోరిరి. సెప్టెంబరు నెలాఖరుననో అక్టోబరు మొదటివారము లోనో నా కొఱకును శ్రీ పరచా రంగారావుగారి కొఱకును ఏర్పాటు చేయబడినది. ఇంకెవ్వరును సిద్ధపడలేదు. వారు వెళ్ళిన తరువాత కొన్ని సంశయము లుద్భవించినవి. అంతకు షుమారు 5 లేక 6 నెలల నుండి నాకు గుండెనొప్పి వచ్చుచున్నది. అది పూర్తిగ నెమ్మదించలేదు. బహుశః నాలో కొంత పిరికితనము కలిగి హృదయముపైన ప్రభావము పడియుండవచ్చును. అందుమూలమున నాకు ఆ నొప్పి అధికమై కొంచెము జ్వరము కూడా ప్రారంభించినది. రెండవది వరంగలు అధికార వర్గమునకు నాయందు విశ్వాసముండెడిది. నేను అహింసావాది నని, కలహములను అణచగలనని వారికి నాయందు నమ్మకము. దానికి ఈ క్రింది విషయము తార్కాణము కాగలదు.

వరంగల్ నాలుగవ దురంతము (హత్యలు విధ్వంసక చర్యలు) తరువాత పోస్టులో నాకొక ఉత్తరము వచ్చెను. అందులో నిన్ను ఒక తేదీన (15 రోజుల తర్వాత) చంపెదమని వ్రాసిరి. ఈ విషయము ఎన్.సి.అయ్యంగారు అను సి.ఐ.డి. ఇన్‌స్పెక్టరుగారికి తెలిసి డి.ఎస్.పి.కి తెలిపెను. డి.ఎస్.పి.గారు నాతో రహస్యముగా కలిసి అడిగెను. నిజమని చెప్పితిని. ఎవరు వ్రాసినారో హిందువులా ముస్లిములా అని మరల ప్రశ్నించిరి. అది నాకు తెలియదంటిని. డి.ఎస్.పి.గారు మీరు అహింసావాదులు, హిందూ ముస్లిం ఐక్యతకోరేవారని ముస్లింల నమ్మకము. కనుక ముస్లింలు వ్రాయరు అని చెప్పెను. తదుపరి ఉత్తరము నాకివ్వమనియు,

మీ ఇంటిపైన రక్షణ బందోబస్తు చేయుమందురా అని మరల ప్రశ్నించెను. అందుకు ఉత్తరము ఈయజాలను, రక్షణ బందోబస్తు అవసరములేదు అని బదులు చెప్పితిని.

వరంగలు మూడవ దురంతర సమయమున నేను ప్రశాంతముగ మొగిలయ్య శవమును తెప్పించి, శవపరీక్ష చేయుటలోను, వరంగలు నాల్గవ దురంత సమయమున ఉరుసు కరీమాబాదులో నుండి హిందూ ముస్లిముల మధ్య కొట్లాటలు జరుగకుండ ఆపగలిగితిని. ఈ రెండు సమయములలో పోలీసువారు ఉండిరేకాని వారికేమియు పని కలుగలేదు. శాంతి పద్ధతులతోనే నేను నిర్వర్తించితిని. ఈ సంగతి మా మిత్రులకును, అధికార వర్గమునకును తెలుసును.

ఈ విషయమును గమనించి మా మిత్రులందరు నీవు జైలుకు పోయినట్లయిన ప్రజలు నిస్సహాయులు కాగలరు. నీవు ఉంటే అధికారులకును, ముస్లిములకును నచ్చజెప్పి ఆపగలవు. కాబట్టి జైలుకు పోవుటకంటె ఉండుటయే మంచిదనిరి. అందుకు నేను శ్రీ రంగారెడ్డి రామకృష్ణారావు గార్లకు మాటఇచ్చి ఎట్లు తప్పుకొందునని అంటిని. దానిపై శ్రీ జమలాపురం గోపాలరావుగారు, ఆవంచ వెంకట్రావుగారును పట్ణం వెళ్లి శ్రీరంగారెడ్డి, రామకృష్ణారావు గారలతో చెప్పి నీ జైలు సంకల్పమును ఆపుటకు శలవు తెచ్చెదమని చెప్పి పట్ణం వెళ్ళిరి. ఆ ప్రకారము వారుభయులు శ్రీ రంగారెడ్డి, రామకృష్ణారావుగారలతో చెప్పగా ఈ విషయమును మీరే నిర్ణయించు కొనవచ్చునని సెలవిచ్చిరి. దానిపైన నేనును శ్రీ పరచా రంగారావుగారును కొంతకాలము తరువాత పరిస్థితులనుబట్టి నిర్ణయించు కొనవచ్చునని జైలుకు వెళ్ళకుంటిమి. ఇది నా జీవితములో ఒక కళంకము కావచ్చునని హృదయమున బాధించుచున్నది. వరంగలులో 1948 జులై నెలలో జరిగిన విధ్వంసకాండ తరువాత స్థానిక పెద్ద అధికారి నిష్పక్షపాతియైన వాడుండ వలెనని ప్రయత్నించితిమి. నాకును, రివిన్యూమంత్రి ఖురేషిగారికిని పాత స్నేహముండెడిది. ఆ కారణమున వారికిని నాకును యింకొక పెద్దమనిషి ద్వారా సంప్రదింపులు జరిగెను. ఇదివరకు ఇక్కడ నిష్పక్షపాతముగా సుబేదారుగా నుండి పనిచేసి వెళ్లిన హబీబుమహమ్మదు గారిని మరల సుబేదారుగా పంపుమని తెలిపితిని. మొత్తంమీద హబీబుమహమ్మదుగారే సుబేదారుగా వచ్చెను. రాగానే ఆయన నావద్దకు వచ్చి పరిస్థితులను విచారించెను. వరంగల్ విధ్వంసకాండ అనంతరము వరంగల్ వర్తకులు భీతిచెంది బయటకు వెళ్లిపోయిరి. సువర్ణ రజితములు లక్షలాది ధనముతో బయటవెళ్లిపోయినారు. గ్రామములు

ఖాళీ అగుచున్నవి. ప్రజలు ధనము పోయిన తరువాత ప్రభుత్వ మెందుకని వారికిని చెప్పితిని. మీ సహకారము ఉంటే బందోబస్తు చేస్తానని సుబేదారు చెప్పెను. మీతోపాటు వరంగలు బజారులో పక్కవేసికొని పడుకొనుటకు సిద్ధముగా నున్నానని వారితో గట్టిగా చెప్పితిని.

బహుశః కార్తీకమాసములో ఏవో శలవులు వచ్చెను. నేను జుజ్జూరు వెళ్ళితిని. అచ్చటనుంచి నీలికుర్తి పంటను చూచుటకు నౌకరును (శౌరిదార్)ను వెంటబెట్టుకొని బయలుదేరి ఖమ్మంలో బస్సు ఎక్కితిమి. అందులో ఇద్దరు పోలీసు జవాను లుండిరి. బస్సు పాతర్లపాటి వద్దకు చేరగానే సుమారు 50 మంది కఱ్ఱలతో వచ్చిరి. వారిలో 3, 4 తుపాకులు, రివాల్వరులు ఉన్నట్లు జ్ఞాపకము. వారు బస్సు డ్రైవరుపైన తుపాకులు కాల్చిరి. బస్సును ఆపుమనిరి. బస్సు ఆగిపోయినది. ప్రయాణీకులను దిగుమనిరి. మేము దిగితిమి. అందొకడు సిక్కువలె కనుపడెను. నాకు సలాంచేసెను. నేను భయముతో నుంటిని గనుక గుర్తించజాలక పోతిని. ప్రయాణీకులు నలుదిశలు పరుగెత్తిరి. నేను దక్షిణదిశగా 50 గజముల దూరము పోతిని. అక్కడ ఉన్న ఒకడు అటు పోవద్దనెను. ఉత్తరము తిరిగితిని. తూర్పుదిశకు పరుగెత్తు చున్న పోలీసు జవానులపైన రివాల్వరుకాల్చి చంపివేసిరి. బస్సును మంటపెట్టిరి మంటమండుచున్నది. భయమునకు బదులు ఆశ్చర్య వచ్చెను. బస్సుపైన నా బెడ్డింగు ఉన్నదంటిని. ఆ సిక్కు మనిషి యింకొకడికి చేతితో యిషారా చేసెను. అంతట ఒకడు పైకి ఎక్కి నా బెడ్డింగును క్రింద పడ వేసెను. అంతేగాక ప్రయాణీకుల మూటలను కూడా క్రిందపడవేసెను. దీనిని చూచి ఇది రజాకారుల చర్యకాదు. కమ్యూనిస్టుల చర్య అని ఊహించితిని. వుత్తర దిశకు తిరుగగానే బస్సు కండక్టరు కన్ను చాతిపైన దెబ్బకొట్టి సుమారు 80, 90 రూపాయలు తీసుకొన్నారనెను. కీసర వాసుదేవరెడ్డి అనే మిత్రుడు నావెంట ఉండెను. నా బెడ్డింగు నా నౌకరు తీసికొనెను. మేము కొందరము వుత్తరదిశగా ఉన్న గ్రామముల వైపు నడచితిమి. రాత్రి అయినది. వరిపొలముల బురదలో నుంచి నడచి పాతర్లపాడు చేరి పటేలు యింటికి పోతిమి. మాకు పురుషోత్తమాయగూడెం వరకు బండి యివ్వమంటిని. ఆ పటేలు నన్నెరుగును గనుక బండి యిచ్చెదనని తెప్పించెను. నాకు కొంత మజ్జిగ యిచ్చెను. ఆ బండినెక్కి నేనును వాసుదేవరెడ్డిగారును పురుషోత్తమాయగూడెం రాత్రి 9 గంటలకు వెళ్ళితిమి. అచ్చట వారి బంధువులు నూకల రఘునాధరెడ్డిగారింట రాత్రి ఉండి తిమి. ఉదయమున రెడ్డిగారు నేను డబ్బు వెండిబంగారములతో యిచ్చట వుండుట మంచిదికాదు రేపే బయలుదేరి కుటుంబయుక్తముగా బెజవాడలో నుండెదననెను.

మరురోజు రెడ్డిగారి బలవంతముపైన వారితోటలో వంటచేసికొని భోజనంచేసి వారిచ్చిన బండిపైన మానుకోట చేరితిని. అచ్చట చాలామంది అధికారులు, వకీళ్ళు పోలీసువారు కలిసి విషయములను తెలుసుకొనిరి. కొందరు దౌర్జన్యపరులగు కమ్యూనిస్టులనియును, కొందరు విప్లవవాదులగు కాంగ్రెసు వారనియును పలు విధముల మాట్లాడిరి. మరురోజు సాయంత్రం రైలులో బయలుదేరి యెర్రుపాలెం చేరితిని.

రాత్రి 7 గంటలయినది. నా కచ్చడంబండి స్టేషనుకువచ్చి యుండెను. ఆ బండిమీద జమలాపురం నారాయణరావు గారింటికివచ్చితిని. బంధువుడయినను నన్ను రాత్రికి ఉండమనే దానికి బదులు బావా! నీవు నీవు ఉంటే మంచిదో పోతే మంచిదో ఏమి అనలేకున్నాను. ఎందుకనగా 9 గంటల నుంచి సాయుధులగు ముస్లిం రజాకారులు గ్రామములో తిరుగుతారు. నీబండి, యెడ్లు నౌకర్లు వీధిలో ఉండవలసి వచ్చును. వారికి అపాయము రావచ్చుననెను. వెళ్లెదనని బయలుదేరితిని. నా కోడలి అన్న వెంకట్రావు కుటుంబయుక్తముగా అంతకుముందే లేచివెళ్లెను. దారిలో మా మరదలింటి వద్దకు వచ్చితిని. ఆమెయు, కేశవరావు తమ్ముడు నారాయణరావు యిల్లు విడచి వెళ్ళుటకు సామాను బయట పెట్టుకొని కూర్చుండిరి. త్వరగా వెళ్ళుటయే మంచిదనుకొంటిని. నా యెడ్లు గుఱ్ఱమువలె నడచినవి. ఒక నౌకరు బండితోలుచుండెను. యువకుడగు యింకొక నౌకరు ముందు పరుగెత్తుచుండెను. 1.5 మైలు దూరము పరుగెత్తి నైజాము సరిహద్దుచేరి నిర్భయులమైతిమి. ఇంతలో ఈశాన్యమూల నుండి 7, 8 మంది మనుష్యులు మావైపు వచ్చుచుండిరి. వారిని చూచి రజాకార్లని భయపడితిని. వారు నైజాం గ్రామములలో జొన్నలు చౌకగా కొనుక్కొని వెళ్ళుచుండిరి. రెండు మార్గములు కలియుచోటు సమీపించుచుండెను. ఆ వచ్చే వారికిని ఒక భయము వెంటనంటి యుండెను. అదేమనగా నైజాం నుండి కరోడ్గిరి లేకుండా ఏ సరుకు తీసికొని పోకూడదు. ఇంతేగాక ధాన్యముకు కంట్రోల్ ఆర్డర్సు ఉండెను. బండిలోనున్న నన్ను కరోడ్గిరి లేక రివిన్యూ అధికారినని వారి భ్రమయుండెను. ఉభయులము సమీపించితిమి. నేను ధైర్యముచేసి ఏ వూరుమీది అని అడిగితిని. మాది నరసన్నపాలెం అని నెమ్మదిగా చెప్పిరి. ఆ ఊరు మా జుజ్జూరు సమీపమున నుండటయు గ్రామస్తులందరు నన్నెరిగినవారె గనుక చనువుతో "యెవరయ మీరు" అంటిని. మా పేర్లు ఫలాన అని బిగ్గరగా చెప్పిరి. ఒకరిని ఒకరము తెలిసికొని నిర్భయముగా జుజ్జూరు వెళ్ళితిమి. యెర్రుపాలెం ముస్లింల బంధువులు కొందరు యెర్రుపాలెంలో మా బంధువుల నౌకరులు కొందరు వారి భూములను

దున్నేరైతులు కొందరు నాకు క్లయింట్లుగా నుండి ఉపకారము పొందినవారు. అయినను ఆ రోజు వారికి నేను భయపడుట కాలమహత్తుగాని మరేమికాదని వేరుగా చెప్పనక్కరలేదు.

రజాకార్లకు స్థానికాధికారుల ప్రోత్సాహము సహాయము ఉండెడిది. జిల్లా తాలూకా సంఘములలో ముస్లిం న్యాయవాదులు నాయకులుగా నుండేవారు.

నైజాంగారికి స్వాతంత్ర వాంఛ కలిగినప్పటి నుండియే స్వచ్ఛంద సైని (రజాకారుల)కుల సంఖ్యాబలం అధికమగుచుండెను. ఆయుధములు సిడ్నికాటన్ అనే ఆంగ్లేయుడు సప్లయి చేసెను. రజాకార్లకు ఆయుధములు కూడా యివ్వబడుచుండెను. రజాకారులు చెలరేగి యిష్టము వచ్చినట్లు దోపిడీలు, హత్యలు, మానభంగములు చేయుచుండిరి.

రాజ్యమును లొంగదీయుటకు వివిధ రాజకీయ పార్టీలు కూడా విప్లవ కార్యకలాపములను సాగించుచుండిరి. గాని వారు మానభంగములు చేయలేదు. రజాకార్లు వారి నెదుర్కొనవలె ననెడి మిషతో వీరవిహారములు సలుపుచుండిరి. వాటి వివరములు అనవసరము. గాని 1. గుర్తూరు సోమవరం అనేచోట యిదే మిషతో 12 మందిని వరుసగా నిలబెట్టి 30కి ఒక గుండుతో కొట్టి చంపిరి. కొందరి స్త్రీలను దిగంబరులను చేసి మూటలు నెత్తినపెట్టి పోలీసుస్టేషనుకు తీసికొని పోయిరి. దీనికీ అధికారుల యిషారా ఉన్నదన్నారు. 2. యెర్రుపాలెం రైలుస్టేషనులో పోలీసులు ఉండేవారు. ఒకనాటిరాత్రి ఒక విప్లవవాది మీనన్ అనే పేరుగల కేరళవాడు తుపాకితో పడుకొనియున్న జవానులపైన కాల్పులు కాల్చెను. దానిచే యిద్దరు కానిస్టేబిల్సు మరణించిరి. తదుపరి ఒక ఆంగ్ల సార్జెంటును మరికొందరు సిపాహీలను ఉంచిరి. ఆ సార్జెంటు ఒకరోజు అకస్మాత్తుగా మీనవోలు గ్రామం వెళ్ళి కోళ్ళకొరకు దౌర్జన్యము చేసెను. ప్రజలు రాళ్ళు రువ్విరి. సార్జెంటు ఫైరుచేసెను. ప్రజలలో ఒకరిద్దరు మరణించి తోటాలు అయిపోయినందున చేతులు బారసాచెను. జనులు అతనిని కొట్టి చంపిరి. పేర్లు తెలియవు. తరువాత రజాకార్లు కొందరు స్థానికోద్యోగులు వచ్చిరి. మీనవోలు గ్రామమును తగులబెట్టిరి. నష్టము ఒక లక్ష వరకైనా అయి ఉంటుంది. 3. కొందరు విప్లవవాదులు, రైలుపడగొట్టుటకు సంకల్పించి గంగినేని కొండపల్లి స్టేషనుల మధ్య పట్టాల కింద బాంబులు పెట్టిరి. లైనుపైన గూడ్సు బండి వచ్చుచుండెను. బాంబులు ప్రేలి గూడ్సుబండి యింజను డబ్బాలతో సహా కిందపడిపోయెను. బండిలో నున్న 4, 5 లక్షలు విలువగల సరుకులను యెత్తుకొని

పోయిరి. విప్లవకారుల పేర్లు తెలియలేదు కాని దీని ప్రతీకారముగ రజాకారులు స్థానికాధికారులు వచ్చి రేమిడిచర్ల గ్రామమును తగలపెట్టిరి. ఇండ్లు, గడ్డి, చొప్పవాములు, ధాన్యము మొదలగునవి భస్మీభూతమాయెను. దీని విలువ 4, 5 లక్షల వరకు ఉంటుందని తెలియవచ్చెను. ఇలాంటి చర్యలు హైద్రాబాదు రాజ్యమున అసంఖ్యాకములు. దీని పర్యవసానమే పోలీసుసైనిక చర్యలు జరుపబడినవి. ప్రజలు అష్టములు పాలుకారేని భారత ప్రభుత్వము మధ్య నిజాంరాజు మధ్యను సంభాషణలు జరుగుచుండేవి. నిజాం రాజుకు ప్రత్యేక అధికారములిచ్చి రాజుగా ఉంచెదరో లేక మైసూరు, తిరువాన్కూరులవలె స్వాతంత్ర ప్రభుత్వ మయ్యెడిదో చెప్పజాలము. మొత్తంమీద "వినాశకాలే విపరీతబుద్ధిః" అను ఆర్యోక్తి సార్థకమయినది.

* * *

ప్రకరణము - *16*

# వరంగల్ నాల్గవ మహాదురంతము-బీభత్సము

1356 ఫసలీ జులై 15వ తేదీ అనగా తొలి యేకాదశిరోజున ఉరుసులో నున్న ఆర్యసమాజ మందిరము పైన సాంప్రదాయానుసారము జండా ప్రతిష్ఠాపన జరిగెను. దానికి ముస్లింలు ఆందోళనపడి గుంపుగా చేరి జండాను దింపించి పారవైచిరి. దానితో హిందూ ప్రజలకు రోషములు ప్రబలెను. ఆ రాత్రి హిందూ మహమ్మదీయుల మధ్య పెద్ద సంఘర్షణ జరిగినది. ఉభయ పార్టీలును ముగ్గురు నలుగురు చంపబడిరి. అచ్చటనున్న మామూలీ పోలీసు ఆపలేకపోయెను. మరురోజు పట్టణమంతయు పోలీసు బందోబస్తు చేయబడినది. కరుఫ్యూ ఉత్తర్వుకూడా జారి చేయబడెను. ఉరుసులో ముస్లిములే యెక్కువ చచ్చినారని కొందరును, హిందువులే ఎక్కువ చచ్చినారని కొందరును చెప్పసాగిరి. నేను ద్వాదశిరోజు ఉదయమున కలెక్టరును చూచి అదివరకు నా వద్దనున్న మునగాల రాజాగారి మోటరును నడుపుకొనుటకు అనుజ్ఞ యిప్పించమని కోరుటకు కలెక్టరు దగ్గరకు వెళ్ళితిని. ఆయన చాలా భీతావహముతో రాత్రి ఉరుసులో హత్యలు దెబ్బలాటలు జరిగినవి. మీరు తక్షణం అక్కడికి వెళ్ళి శాంతి చేయుమని చెప్పి మీ మోటరును యెవ్వరు ఆపజాలరని కూడా చెప్పెను. నేను గేటు బయటకు రాగానే ఖుర్బాన్ అహమ్మద్ వకీలు కలిసి నేను కూడా వెళ్ళుచున్నాను. నా మోటరుపైన రమ్మని చెప్పెను. నాతో రత్నాకర్‌రావు గారు కూడా వచ్చిరి. మేం ముగ్గరము పురమధ్యమున వెళ్ళుచుండగా దుకాణములు, యిళ్ళ తలుపులు మూసియుండుట చూచితిమి. ఒకరిద్దరు వర్తకులు కలసి ముస్లింలు పెద్ద తయ్యారి

చేయుచున్నారు. యేదో ఆపత్తు రానున్న దనిన్ని భయముతో నున్నామని చెప్పిరి. కర్ఫ్యూ ఆర్డరు జారి అయినది. ప్రత్యేక పోలీసుదళము వచ్చుచున్నది. మీకు భయము ఉండదు. నేను కూడా త్వరలో తిరిగి వచ్చెదనని వారితో నేను చెప్పితిని. అంతట మా మోటారు బయలుదేరి శంభునిపేట వద్దకి వచ్చెను. అచ్చట హబీబుజైలాని, అబ్దుల్‌కరీమ్‌గార్లు వకీళ్ళు కూర్చొని మా మోటరును ఆపిరి. అంతకుముందే కొందరు పోలీసులతో ఒకలారీతో సర్కిల్ ఇన్‌స్పెక్టరు ప్రాసిక్యూటింగ్ ఇన్‌స్పెక్టరు బయలుదేరి అక్కడికి వచ్చి యుండిరి. హబీబుజైలానీ వగైరాగారలు మమ్ములను భయపెట్టి అక్కడ ఫైరు జరుగుచున్నది. మీరు ఉ రుసుకు వెళ్ళవద్దని చెప్పిరి. మమ్ములను ఎవరు ఏమిఅనరు వెళ్ళుతామని చెప్పితిమి. సర్కిల్ ఇన్‌స్పెక్టరు రక్షణలేని మీ మోటారులో మీరు కూర్చొనవద్దు అని చెప్పి, తమ లారీలోనికి మమ్ములను రమ్మనిరి. మేము ముగ్గురము పోలీసులారీ ఎక్కితిమి. లారీ ఉరుసులోనికి వెళ్ళెను. అప్పటివరకే ఒక ఇంటిలో డిప్యూటీ సూపరింటెండెంటు 70, 80 మంది పోలీసులు వచ్చి యుండిరి. పరిస్థితులను గురించియు, ముందు కర్తవ్యమును గురించియు మాట్లాడితిమి. ఇండ్ల తలుపులన్నియు మూయబడి యుండెను. ప్రజలు భయముతో నుండిరి. అంత డిప్యూటీ సూపరింటెండెంటు నాతో "మీరు కొందరి యిచ్చటి పెద్దలతో కలిసి ధైర్యము చెప్పి నిర్భయముగా తిరుగునట్లు చేయమని కోరెను. అంతట నేను ఒక వర్తకుని ఇంటికి వెళ్ళితిని. నేను పిలువగానే ఆయన తలుపుతీసెను. రాత్రి జరిగిన ఉదంతములను నాతో చెప్పెను. మేమందరము ప్రాణములు తెగించి ముస్లింల దాడిని ఎదుర్కొనుటకు సిద్ధముగా ఉన్నాము. మా బలము తక్కువలేదు. మీరు ఆందోళన పడవలసిన పనిలేదని నాకు చెప్పెను. పోలీసు నా వెంట ఉ న్నది. కొట్లాటలు జరుగకుండా చేయగలను. మీరు కూడ దౌర్జన్యమునకు దిగవద్దని చెప్పితిని. అంతట ఆయన నన్ను చేయిపట్టుకొని 100 గజముల దూరమున గ్రామాంతరమునకు తీసికొనివెళ్ళి ఒక దృశ్యమును చూపెను. సుమారు 1000 మంది హిందువులు తాళమేళములతో ద్వాదశి బోనముల కుంభములతో ఒక దేవత వద్దకి వెళ్ళి ఊరేగింపుతో వచ్చుచుండిరి. వారివద్ద పురాతనమైన కత్తులు, ఈడెలు, కర్రలు మొదలైన ఆయుధములు ఉండెను. నాతో వచ్చిన పెద్దమనిషి వారివద్దకు పోదాము రమ్మని పిలిచెను. గాని వారే వచ్చుచున్నారు గనుక వెళ్ళటము అనవసరమని నేను చెప్పితిని. ఇంతలో ఒక సిఖ్ఖు కానిస్టేబుల్‌ను డిప్యూటి సూపరింటెండెంటు గారు నావద్దకి పంపిరి. ఇద్దరము కలిసి వెనుకకు మరలితిమి. అప్పటివరకే సుబేదారి మదద్‌గారు శ్రీ బషేర్ అహమ్మద్, కలెక్టర్ ఏక్బాల్‌చంద్,

డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు మొహిసిన్ రచ్వే, డి.ఎస్.పి గులాఆఫ్జల్ బియాబానీ ఔలియాఖాదర్ వకీలు మరికొందరు ఉరుసు జాగీరుదార్లు, యింకా కొందరు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉండిరి. నా వెనుకనే వచ్చుచున్న ఊరేగింపు దర్గా వెనుకవైపు దారిన వచ్చుచు దర్గాకు సమీపించెను. మేళ తాళములతో ఊరేగింపును దర్గా పక్కనుంచి పోనీయకూడదని ముస్లింలు పట్టుపట్టిరి. నేను ఔలియాఖాదిరీ వకీలుతోను, తదితర జాగీర్లతోను సుహృద్భావముతో ఈ రోజువరకు మాత్రము ఊరేగింపును మాత్రము సాగిపోనీయమనిన్నీ అడ్డుపెట్టినచో ఆవేశములు పెరిగి కొట్లాటలు సిద్ధమగుననియు చెప్పితిని. ఇంతలో కలెక్టరుగారు కూడా నేటివరకు మాత్రము నేను శలవిచ్చితి ననియును ముందెన్నడు యిట్లు జరుగకూడదని ఉత్తర్వు యిచ్చెనని చెప్పెను. డిస్ట్రిక్టు మేజిస్ట్రేటుగారు కూడా దానిని బలపరిచిరి. ఊరేగింపు దర్గా వెనకభాగమునకు పూర్తిగా వచ్చెను. ఒక హెడ్‌కానిస్టేబులు వారి వద్దకు వెళ్ళి మీరు యెటుపోతున్నారని ప్రశ్నించెను. నేను కూడా కొందరితో తెలుసుకుంటిని. వారు మొదట కరీమ్‌ఆబాద్, రంగశాయిపేట, ఖిల్లా వరంగల్ చోట్లకు పోయెదమనిరి. నేను వెనుకకు మరలగానే అక్కడవున్న ఒక సందులో నుంచి కొందరు మా వైపునకే రావటమునకు బయలుదేరిరి. వారిని పోలీసులు ఆపి మా వద్దకు వచ్చి చెప్పిరి. మేము అందరు ఒకేసారి రావద్దు కొద్దికొద్దిగా రమ్మని చెప్పితిమి. పోలీసులు వెళ్ళి చెప్పిరి. గాని మేము చెప్పిన దానికన్నా ఎక్కువ సంఖ్యతో బయలుదేరి సుమారు 500 మంది ప్రజలు దర్గా ముందుకు వచ్చిరి. వారందరి చేతులలో కర్రలు, కట్టెలు, ఈటెలు ఉన్నవి. వారందరిని ప్రశాంతముగా యిండ్లకు పొమ్మని చెప్పితిని. మొదట నా మాటలు వినలేదు. వారిలో నుంచి ఒక పెద్దమనిషి బయటకువచ్చి రామ కోటేశ్వరరావుగారి వంటి పెద్దమనిషి చెప్పినది వినటం మనవిధి అని కఠినంగా వినిపించెను. అంత వారందరు బయలుదేరి ఆర్యసమాజ మందిరమునకు వెళ్ళి కూర్చుండిరి. తక్కిన జనులు స్త్రీలు, పిల్లలు వృద్ధులు కరీమ్‌ఆబాద్ రంగశాయి పేటకు వెళ్ళిరి. ఆర్యసమాజ మందిరం వద్ద గుమికూడిన మాట పోలీసు వల్ల మేము తెలుసుకొంటిమి. గుమిగూడుటకు కారణము తెలుసుకొనగా కొందరు సాయుధ ముస్లింలు షుమారు 400 మంది ఒక యింటిలో రహస్యముగా నున్నారనిన్ని వారివల్ల అపాయము రక్షించుకొనుటకు మేము యిచ్చట నున్నామని చెప్పిరి. అంతట అధికార వర్గము ముస్లింల కొరకు మేము వెళ్ళెదమనిన్ని హిందువుల కొరకు మీరు వెళ్ళి శాంతముతో ఉండునటుల చేయమని నాతో చెప్పిరి. నాతో వచ్చిన రత్నాకర్‌రావు, ఖుర్బాన్ అహమ్మద్‌గార్లు నన్ను వదలి ఎటో వెళ్ళిపోయిరి.

నేను ఆర్యసమాజ మందిరమునకు వెళ్లిపోతిని. నాతో కూడా ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు కూడా బయలుదేరెను. ఆయనను నాతో రావద్దంటిని ఆయన ఆర్య సమాజ మందిరమునకు ఒక ఫర్లాంగు దూరములో ఒక చింతచెట్టుక్రింద ఒక కానిస్టేబుల్‌తో కలసి కూర్చొని ఉండెను. నేను ఆర్యసమాజ మందిరమునకు వెళ్ళితిని. అప్పటికి షుమారు ఒంటిగంట అయినది. ఆర్యసమాజ మందిరములో నున్న కొందరు నాకు పరిచితులైనవారు. నాతో ముస్లింలు దగ్గరనే ఒక యింట్లో ఉన్నారని చెప్పిరి. నేను ఆ సంగతిని డిస్ట్రిక్టు మేజిస్ట్రేటుకు తెలిపితిని. వారు చెప్పిన యింటివద్దకు డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు మొదలగు అధికారవర్గము వెళ్ళిచూచిరి. ఆ యింట్లో వారు కనబడలేదు. ఆ వార్త మరల నాకు తెల్పిరి. ఇంకొక ఇంట్లో ఉన్నారని హిందువులు వార్త తెచ్చిరి. ఆ సంగతి కూడా అధికార వర్గమున కందజేసితిని. ఆచోటు తెలిసికొని అధికార వర్గము అచ్చటికి వెళ్లిరి. నేను ఆర్యసమాజ మందిరమున వీరందరిని కూర్చొనపెట్టి ఒక సభచేసి మహాత్మాగాంధీ ఉద్యమము 1921 మొదట స్వాతంత్రియ దినోత్సవము వరకు జరిగిన కథలన్నియు ఉపన్యాస రూపకముగా 3 గంటలసేపు వివరించి చెప్పితిని. వారందరు ఆనందముగా వింటు ప్రశాంతముగా కూర్చొనిరి. ముస్లింలతో అధికార వర్గము ముస్లిం గుండాలవద్ద ఉండి రెండు గంటలసేపు మంచిమాటలతో బోధచేసిరి. సాయంత్రం 3, 4 గంటలవేళకు బహుకష్టంపైన వారందరు అచ్చటినుంచి లేచి చీలి వెడలిపోయిరి.

జరిగిన సంగతులను బట్టియు తెలిసిన వార్తలను బట్టియు ఈ క్రింది విషయములు ఊహించవలసి వచ్చినది.

1. ముస్లింలు ది. 14 జులై తేదీన ఉరుసుకరీమాబాదులో ఆర్యసమాజ మందిరముపైన దాడిచేసి ఆ రాత్రి దెబ్బలు తినుటచే ఆవేశపరులైరి. 15 జులై తేదీన ఉరుసుకరీమాబాదులో రక్షణకు పోలీసులు వెళ్ళుటచూచి రైలుకట్టకు ఉత్తర భాగపు వరంగల్ బజారులలో వీరవిహారముతో విధ్వంస చర్యలు జరుపుటకు నిర్ణయించి పైశాచిక కృత్యములను యల్లమ్మబజారు నుండి ప్రారంభించి వచ్చు చుండిరి. నేనును అధికారవర్గము ఉరుసుకు పోయిన సంగతి తెలిసికొని మేము ఉత్తర దిశకు రాకుండుటకై 200 మంది ముస్లిం గుండాలను ఉరుసు కరీమా బాదుకు పంపివేసిరి. వారిబారి నుండి ప్రజలను రక్షించుటకు మేము కాలమును గడుపుచుంటిమి. ఉత్తర వరంగల్ వార్తలు మాకు తెలియకపోయినవి. బహుశః స్థానిక పోలీసు ఉద్యోగులు కుట్రకులోనై డి.యస్.పి.కి తెలుపక యుండవచ్చును.

ఉత్తర వరంగలు దురంతములు పూర్తి అయినవని ఊహించి అక్రమముగా ఉరుసులో కూడియున్న ముస్లింగుండాలు చీలి వెళ్ళిపోయి యుంటారు.

ఈమధ్యకాలంలో వరంగల్ కోటగోడలపైన 200 మంది హిందువులు కూర్చొని అవసరమైతే రావడమునకు సిద్ధముగానుండి వార్తలకు నిరీక్షించు చుండిరి. ఇద్దరు విద్యావంతులు సైకిళ్ళను చేతపట్టుకొని నావద్దకు వచ్చి వార్తలు తెలుసుకొని పోవుచుండిరి. దౌర్జన్యములు పనికిరావనియును, అవసరముగా పోట్లాటకు రావద్దనియును ఖిల్లా ప్రజలకు యెప్పటికప్పుడు తెలుపుచుంటిని. ఈ విధముగా 4 గంటల సమయమైనది. ముస్లింలు వెళ్ళిపోయినారు. గ్రామములో ప్రజలకు కొంత భయము వదలిపోయినది. ఆ సంగతి తెలిసికొని అచ్చటనున్న మంచినీళ్ళ మావివద్దకు సుమారు 300 మంది స్త్రీలు బిందెలు పట్టుకొని నీళ్ళకు వచ్చి నీళ్ళను తీసికొనిపోయిరి. అనగా అప్పటివరకు భయముతో ఇంట్లో నుంచి నీళ్ళు తెచ్చుకొనుటకు కూడా కదలకుండా యిండ్లలోనే ఉన్నారని తేటపడుచున్నది. ముస్లింలు పోయిన తరువాత 4 గంటలకు అధికారవర్గము నేను సమావేశము అయితిమి. ఇచ్చట రక్తపాతము లేకుండా ప్రశాంతముగా జరిగినందున అందరము ఒకరికొకరు అభినందించుకొంటిమి. కలెక్టరు డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు గారలు యీ రాత్రి మీరు ఉరుసులో ఉంటే ప్రశాంతముగా జరిగిపోతుంది. రాత్రికి ఉండు మనికోరిరి. కిందటిరోజు ఏకాదశి ఉపవాసము చేసి, ద్వాదశిరోజు ఉదయం 9 గంటలకు భోజనం చేసి అప్పటివరకు జలపానము చేయకుండా ఉంటిని గనుక రాత్రి ఉరుసులో ఉండజాలనని చెప్పితిని. కనీసం మేము మరల వచ్చువరకు ఉండమని కోరిరి. వారందరు మోటార్లపైన యెటో వెళ్లిపోయిరి. ఉరుసులో యిదివరకు వలనే కొందరు పోలీసులలో డిప్యూటీ సూపరింటెండెంటు ఉండెను. నేను జాలియాఖాదరి వకీలుగారింటికి వెల్లితిని. ఆయనతో స్నేహితరీత్యా మాట్లాడుతూ కూర్చుంటిని. ఆయన నాకు ఏమి తినుపించలేనందుకు విచార పడెను. మేము ఆభేదముగా ఎప్పటివలె ప్రసంగము చేయుచూ సాయంత్రంవరకు కూర్చుంటిమి. 7 గంటల రాత్రి అయినది. డిస్ట్రిక్టు మేజిస్ట్రేటుగారి కారు రాలేదు. డిప్యూటీ సూపరింటెండెంటు నా వద్దకు వచ్చి శిఖ్ఖు జవానును పంపి పోలీసులారీ వరంగల్ పోవుచున్నది. దానిలోనివారు వరంగల్ వెళ్ళెదరా అని తెలిపెను. నేను ఆమోదించి పోలీసు లారీలో ఎక్కి వరంగల్ టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరితిని.

వరంగల్ పెద్ద వర్తక స్థానము రాత్రి 10 గంటలవరకు సాధారణముగా దుకాణములు తెరచి యుండుటయు ప్రజలు అసంఖ్యాకులుగా తిరుగుచూ

కోలాహలముగా నుండెడిది. ఆ రోజు నేను వచ్చేవరకు అనగా 7 గంటల వేళకే నిశ్శబ్దము నిర్మానుష్యము అయిపోయినది. పోలీసుస్టేషన్‌లో దిగిన తరువాత టౌన్ ఇన్‌స్పెక్టరుతో కలిసి శ్రీ లక్ష్మినారాయణ వకీలు గారింటికి వెళ్లితిని. వరంగల్‌కు ఆ పరిస్థితి ఎందుకు సంభవించినదో అంతవరకు నాకు తెలియదు. టౌన్ ఇన్‌స్పెక్టరు ఆదేశానుసారము ఒక పోలీసు జవాను వచ్చుచుండెను. శ్రీ లక్ష్మినారాయణగారు శ్రీరంగం రాజారాం గారింట్లో ఉండేవారు. ఆ యింటికి వెళ్లితిని. తలుపులు మూసి ఉండగా పిలిచి తీయుమని కోరితిమి. రాజారాంగారి భార్య వృద్ధురాలు తలుపు వద్దకు వచ్చి కొద్దిగా తలుపు తెరచి పేరు తెలిసికొని నాయనా లోపలకు వచ్చెదవా అని బహు నెమ్మదిగా ప్రశ్నించెను. మరియు లక్ష్మీనారాయణగారు లేరని చెప్పెను. నేను తిరిగి పోలీసుస్టేషన్‌కు వచ్చితిని. దారిలో ఒకరిద్దరు నిరాయుధులుగా ఉన్న ముస్లిం యువకులు కలసి నాకు సలాం చేసిరి. పోలీసుస్టేషన్‌కు మరల చేరగానే ఇన్‌స్పెక్టరుగారు ఈ రోజు పగలు డాక్టరు నారాయణరెడ్డిగారిని చంపినారని రహస్యముగా చెవులో చెప్పెను. పరామర్శ చేయుటకు వారి ఇంటికి వెళ్ళెదనని చెప్పితిని. అంతట ఆయన మహా భయంతో మీరు వారింటికి వెళ్ళజాలరు. అపాయము తటస్థించగలదు. నేను పోనివ్వనని చెప్పెను. తరువాత దగ్గర ఉన్న ఒక దుకాణములోనికి వెళ్లి హనుమకొండలోని డాక్టరు అయ్యంగారికి టెలిఫోన్ యిచ్చి టాంగా గాని మోటరుగాని పంపగలరా అని కోరితిని. వారు నేనును ఏంచేయజాలనని జవాబు చెప్పెను. మరల పోలీసుస్టేషన్‌కు వచ్చితిని. ఇంతలో సుబేదారు ఆఫీసు జమాదారు కలసి మరియొక దుకాణములోని టెలిఫోన్ వద్దకు తీసికొనిపోయెను. ఆ దుకాయము మద్రాసు లబ్బీసాహెబుది. అక్కడి టెలిఫోన్‌లో కలెక్టరుగారి బంగళాకు కలిపి మాట్లాడితిని. అనగా మా ఇంటికి ఎవరినైనా పంపి మోటారు ఇక్కడకు పంపే ఏర్పాటు చేయమని కోరితిని. ఆ ముస్లిం వర్తకుడు నాతో అయ్యా మీరు పెద్ద మనుష్యులు నేను పెద్దవాడను. మనము ఎట్టి పోట్లాటలో జోక్యము పెట్టుకునేవాళ్ళం కాము. మీరు నావద్ద ఉండవచ్చును. భోజనము చేయరు గనుక నేనేమి చేయజాలను కాని ప్రశాంతముగా పండుకొన వచ్చునని చెప్పెను. నేను ఎట్లాగైనా ఇంటికి వెళ్ళెదను ఉండను అని చెప్పి మరలితిని. జమాదారు గేటు కింద ఫైరింగు జరిగినది. తాలూకుదారు డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు మొదలగు అధికార వర్గము వెనుకనే ఉన్నారు. వారు రాగానే వారి మోటరులో వెళ్లవచ్చునని నాతో చెప్పెను. పోలీసు స్టేషన్‌కు వచ్చితిని. ఇంతలో ఖమ్మం నుంచి బస్సు వచ్చినది. టౌన్ ఇన్‌స్పెక్టరు నన్ను ఆ బస్సు మీద వెళ్లమనియును నాతో కూడా ఒక

ఇన్‌స్పెక్టరును ఇద్దరు కానిస్టేబుల్సును యిచ్చెదనని చెప్పెను. జరిగిన సంగతులు తెలియక నేను నిర్భయముగానే ఉన్నాను. గనుక సరేనంటిని. పోలీసులు ఆయుధములతోనే బయలుదేరిరి. హనుమకొండ చౌరస్తా వరకు మధ్యన ఆపవద్దని టౌన్ ఇన్‌స్పెక్టరు కండెక్టరుకు చెప్పెను. నాతో వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టరు మెడలో ఒక తూటాలదండ ఉన్నది. చేతులో రివాల్వరు ఉన్నది. ఎవరైనా మోటారు ఆపి నట్లయితే యీ తూటాలు ఖర్చు అయ్యేవరకు ఫైరు చేస్తాను భయములేదు. మోటారు నడపుమని చెప్పెను. నేను ఆయన మాట్లాడుకుంటూ హనుమకొండ చౌరస్తాకు చేరితిమి. అక్కడ చాలామంది జనం దిగిపోయిరి. కొంతసేపటిలో నేను నా యింటికి చేరితిని. హనుమకొండలో ఏ భయము లేకుండెను.

కలెక్టరుగారింటి కిచ్చిన టెలిఫోన్ ప్రకారము నా కుమారుడు సుబ్బారావు మోటారు తీసికొని హనుమకొండ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఇన్‌స్పెక్టరు శ్రీ జాఫర్‌తో వరంగల్ వరకు కానిస్టేబుల్ సహాయము యిప్పించుమని కోరెను. ఆయన సుబ్బారావుగారు మీ నాయినగారి వెంట అధికార్లు ఉన్నారు. వారికి భయములేదు కాని మీరు నిర్భయముగా వరంగల్ చేరజాలరు. నేను జవానుని ఇవ్వజాలను. అంతేగాక మిమ్ములను పోవద్దని ఆటంక పెట్టుచున్నానని కూడా చెప్పెను. అంతట సుబ్బారావు యింటికి వచ్చి నేను ఇంటికి రాగానే నాతో ఈ సంగతి చెప్పెను.

## మరురోజు మా విచారణ

మరురోజు వరంగల్‌లో జరిగిన బీభత్సమును గురించి ప్రజలు ధనమాన ప్రాణములకు శాంతిలేదని భయపడుచుండిరి. మేము ఎవరము వరంగల్ వెళ్ళి పూర్తి సంగతులను విచారించక పోతిమి. గాని అక్కడి స్నేహితులు ముఖ్యముగా చెదురు కాంతయ్య గారికి వివరములు తెలుపుమని మాత్రము తెలియబర్చితిమి. వరంగల్ బీభత్సమును గురించి హైద్రాబాదు నాయకులకు టెలిఫోన్ ద్వారా తెలిపినట్లు జ్ఞాపకము హనుమకొండ నుండియు కొన్ని వార్తలను తెలుసుకొంటిమి. 3వ రోజు సాయంత్రం వరకు హైద్రాబాదు ప్రముఖ నాయకులు శ్రీ బి. రామకృష్ణారావు, వినాయకరావు విద్యాలంకారు యింకా మరికొందరు రెండు మోటార్లతో రాత్రికి మాయింటికి వచ్చిరి. పరిస్థితులను గురించి మేమందరము చాలావరకు మాటాడితిమి. మరురోజు ఉదయం మేము వరంగల్ వెళ్ళి చెరుకు కాంతయ్యగారిని కలిసితిమి. ఆయన తన సహచరుల ద్వారా విషయములను సేకరించి 32 కేసులను నోటు చేసియుంచెను. ఆ నోటును తీసికొని శ్రీ రామకృష్ణా రావుగారును నేనును కాంతయ్యగారును యల్లమ్మబజారు, చారుబావులి మొకద్రం

జాహీరోడ్డు, మట్టెవాడ, రామన్నపేట, గిర్మాజిపేట, యింతెసార్‌గంజ్ మొదలగు వీధులలో తిరుగుచు నడచుచుంటిమి. మా విచారణలో యీ క్రింది విషయములు తెలిసినట్లు నాకు జ్ఞాపకమున్నది.

1. యల్లమ్మబజారులో ఒక వర్తకుని యిల్లు కొల్లగొట్టి బట్టలదుకాణమునకు నిప్పుపెట్టిరి. జరిగిన నష్టము షుమారు 50,000/-.

2. ఆర్యసమాజ మందిరమును పగులగొట్టి సామనులు చెల్లాచెదరు చేసిరి. గ్రంథములను తగులబెట్టిరి.

3. ఒకచోట టాంగా గుఱ్ఱమును చంపివేసిరి.

4. దారిలో తటస్థించిన కొంతమంది మనుష్యులను గాయపరచిరి. అందులో 1, 2కి అపాయమైన గాయములు తగిలినవి. చచ్చినట్లు కూడా జ్ఞాపకము.

5. కేవలము ముస్లింవీధి అయిన చారుబావులివద్ద ఒక యింటిలో రెండు మూడు సంవత్సరముల నుండి కాపురముండి హిందూ, ముస్లింలకు వైద్యము చేయుచు పేరు ప్రతిష్ఠలతో జీవించుచున్న డాక్టరు నారాయణరెడ్డి రోగుల వద్దకు వెళ్ళి ఇంటికి వచ్చుచుండగా గేటు వద్ద ఆయన మోటరును చుట్టివేసి ఆయనను కత్తులతో పొడిచిరి. ఆయన ఒక కొద్దిసేపటిలోనే మరణించెను.

డాక్టరు నారాయణరెడ్డి యువకుడు. బాయిలరు ఇన్‌స్పెక్టరు రామలింగారెడ్డి గారికి అల్లుడు. గత నాలుగు సంవత్సరముల నుండి ఉండిరి. ఆయనకు 4గురు పిల్లలుండిరి. ఆయన మొకరంజాహి రోడ్డుకు ఉత్తరభాగమున చార్‌బావ్‌లి అనే ముస్లిం వీధిలోని అద్దె ఇంట్లో నుండిరి. వారు తరచుగా ముస్లింలకే చికిత్స చేయుచుండిరి. ఆ రోజు ఏదో దౌర్జన్యము జరుగునని వదంతులు ప్రబలినను ముస్లింలు తమకీ అపకారము చేయరని నమ్ముచుండేవాడు. ఆరోజు రోగులను చూచి స్వంత మోటారుపైన ఇంటికి వచ్చెను. నౌకరు త్వరగా గేటు తీయలేదు. ఇంతలో సాయుధులగు ముస్లిం దుండగులు వచ్చి మోటారుపైబడిరి. ఆయనను కత్తులతో పొడచి గాయపరచిరి. ఆ పరిస్థితిలో గేటు తీయగానే లోపలచేరి పిల్లలను కాపాడుమని భార్యకు ఆదేశమిచ్చి ప్రాణములు విడిచెను. తరువాత రామలింగారెడ్డిగారు నాతో కలిసి ఈ విషాద వార్తను కుటుంబ పరిస్థితులను దుఃఖించుచు చెప్పెను. ఈ రాక్షస రాజ్యము త్వరలో అంతము కాగలదని శాపవాక్యములు పలికెను.

6. ఎందరో పెద్దపెద్ద షావుకార్లు కొండూరు రామలింగం, ఆకారపు నర్సింగం గార్ల యిండ్ల తలుపులు బద్దలు కొట్టుటకు తుపాకులు కాల్చియు, రాళ్ళు రువ్వియు, కర్రలతో కొట్టుచు ప్రవేశించుటకు ప్రయత్నించిరి. అదృష్టవశాత్తు పటిష్టమైన భవనములు వారి దెబ్బలకు తట్టుకోగలిగినవి. మొత్తం మీద షుమారు 500 మంది ముస్లింలు సర్వాయుధములతో 11 గంటలు మొదలు సాయంత్రం 3 గంటల వరకు స్వైరవిహారములు సలిపిరి.

7. ఈ సంగతి ఉరుసు కరీమాబాదులో నున్న నాకును, డి.ఎస్.పి. వగైరాలకును తెలియలేదు. వరంగల్ ఖిల్లాలో ఈవార్త తెలిసి రైలుగేటుకు దక్షిణముగా ఖిల్లా వరంగలు వరకు నివసించిన ప్రజలలో కొందరు గేటుదాటి రామన్నపేట, గిర్మాజిపేట వైపుకు రావటమునకు ప్రయత్నించిరి. ఇంతలో ఒక గూడ్సుబండి ఖాజీపేట నుండి వరంగల్‌కు వచ్చుచు గేటువద్ద అడ్డముగా నుంచ బడినది. బయలుదేరిన ప్రజలు దక్షిణ భాగముననే ఉండిరి. అక్కడ కొంచెము ఘర్షణ జరిగినది. హిందువులు ఒక అరబువానిని చంపిరి. ఉరుసులోనున్న నా వద్ద నుండి తెలిసియో తెలియకనో (నాకు చెప్పలేదు గనుక) డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు వగైరా అధికార వర్గము బయలుదేరి మోటార్లపైన గేటు వద్దకు వచ్చిరి. అంతకు ముందే వరంగల్ స్థానిక పోలీసులు తామేమి చేయజాలక హైద్రాబాదు టెలిగ్రాం ఇచ్చినారట. హైద్రాబాదు నుండి ఒక పోలీసు దళముతో లారీ గేటు ఉత్తరపు వైపునకు వచ్చెను. అడ్డముగా ఉంచబడిన గూడ్సుబండిని రెండు గంటల వరకు ఆపియించిరి. దక్షిణముగా నిలిచియున్న జనమును వెళ్ళిపొమ్మని అధికారులు చెప్పినారట. గాని వారు వెళ్ళిపోలేదు. అంతట కాల్పులు జరిగినవి. 3గురు హిందువులు మరణించిరి. జనం చీలిపోయినది. రైలుబండి తీసివేయబడినది. ఇది అంతయు నేను ఉరుసు నుండి లారిపైన టౌన్ పోలీసుస్టేషను చేరేలోపున జరిగిన ఉదంతము. మేము అనగా రామకృష్ణారావు, వినాయకరావుగార్లు నేను యిండ్లు తిరుగుచుండగా కలెక్టర్, డి.ఎస్.పి. మేమున్నచోటికి వచ్చి మేము చేయుచున్న పనిని తెలిసికొనిరి. మా కెందుకు రిపోర్టు చేయలేదని మమ్ముల ప్రశ్నించిరి. మా కార్యకర్త మాకు రిపోర్టు చేసినాడు. మీ పోలీసు ఉద్యోగస్తులు మీకు రిపోర్టు చేయవలసి యుండెను అని చెప్పితిని. ఆ నోట్సు ముగించుకొని సాయంత్రం వరకు ఒక రిపోర్టు తయారుచేసి నాల్గవరోజు ఉదయం నేను రామకృష్ణా రావుగారు వినాయకరావుగారు సుబేదారు జమీల్‌హసన్‌గారి దగ్గరకు వెళ్ళి సమర్పించితిమి. ఆయన సవతితల్లి ప్రేమతో విచారము వెలిబుచ్చెను.

ఇంకొక కాపిని ప్రభుత్వమునకు అందచేసెదనని రామకృష్ణారావు గారు తెలియజేసిరి.

శ్రీ జమాల్ హసన్‌గారు ఉదంతము జరిగిన 2, 3 రోజులకు హనుమకొండలో ఒక సమావేశము నేర్పాటుచేసి అధికార అనధికార పెద్దలను ఆహ్వానించెను. నేను కూడా వెళ్ళితిని. ఆరోజు జరిగిన విషయములను 1. రామకృష్ణారావుగారి రిపోర్టులో ఉదహరించినవి. 2. ఉరుసు కరీమాబాదులో నేను ఉండి శాంతిగా కాపాడిన సంగతులు వివరముగా చెప్పి నాకు తన అభినందనములను తెలిపెను. ఆ సభలో రజాకార్ నాయకుడు అబ్దుల్‌అలీం వకీలుగారు ఉండగా ఆయనను చూచి నిన్న వరంగల్‌లో దోపిడీలు జరిగినప్పుడు మీరెక్కడ ఉంటిరని ప్రశ్నించెను. ఆయన పాపయ్యపేటలో బంజరుదారు ఇంటిలో ఉంటినని చెప్పెను. రామకోటేశ్వరరావు ఉరుసులో వుండి శాంతి కాపాడ గలిగినప్పుడు మీరు ప్రయత్నము చేస్తే శాంతిని కాపాడేవారేకదా. ఈ స్థితి రాకపోవునదికదా అని సుబేదారుగారనిరి. అబ్దుల్ అలీం ప్రభృతులు ప్రత్యుత్తర మీయలేక పోయిరి.

**ఇంకొక చిత్ర కథ:**

ఆ రోజు కందిబండ పురుషోత్తమరావుగారు మరియొకరు మధ్యాహ్నం పాసింజరులో వరంగ్ల దిగి రామావిలాస్ హొటల్ వద్దకు వచ్చిరి. ముస్లిం గుంపులను చూచి పైన కొంతసేపు దాగుండిరి. 2 గంటల వేళ ఒక టాంగాపైన హనుమకొండకు రావలెనని బయలుదేరిరి. పాపయ్యపేట మసీదు వద్దకు రాగానే కొందరు ముస్లింలు టాంగాను చుట్టుముట్టి దిగమనిరి. వారు దిగిరి. వారిపైన దౌర్జన్యము చేయుటకు ముందు ఒక వృద్ధ మహమ్మదీయుడు చూచి వీండ్లు బెజవాడ వాండ్లు. వీళ్ళతో మనకు పనిలేదు. ఏమిచేయకూడదని హితము చెప్పెను. గుండాలు ఏమిచేయక పొమ్మనిరి. ఇందువలన నైజామేతర హిందువుల జోలికి పోరాదని వారి పాల్సిఅయి యుంటుందని తెలియుచున్నది. ఇంటికి రాగానే పురుషోత్తమరావుగారు నాకు చెప్పిరి.

వరంగల్ పట్టణవాసులు ధన మాన ప్రాణములకు శాంతి యుండదని గ్రహించి దేశమును వదలి వెళ్ళుటకు నిశ్చయించుకొనిరి. క్రమక్రమముగా పెద్ద పెద్ద వర్తకులు తమ పరిచయము ననుసరించి బెజవాడ, బందరు, ఏలూరు, రాజమండ్రి మున్నగుచోట్లకు వెళ్లి కాపురములు మార్చుకొనిరి. బంగారు, వెండి నగదు మొదలగు ద్రవ్యమును కూడా బయటకు పంపివేసిరి. గుమస్తాల ద్వారా పనులను నెగ్గించుకొనుచుండిరి. చాలా భాగము మిల్లుల వ్యాపారమును

తగ్గించివేసిరి. రైళ్ళలో ప్రయాణములు కూడా దుర్భరమై పోయెను. రజాకార్లు రైళ్ళలోని ఎక్కి మామూలు ప్రజలను సోదా చేస్తుండేవారు. మాబోటివాండ్లు I, II క్లాసులలో ప్రయాణములు చేసేవారము. నౌకర్ల వెంట నుంచుకొనేవారము. బయటవెళ్ళిన వర్తకులలో చాలామంది ముఖ్యులు బెజవాడ స్థావరముగ నేర్పరుచు కొనిరి. మేము సామదానముగల అధికార వర్గముతో సంప్రతింపులు చేయుచు శాంతికొరకు ప్రయత్నించు చుంటిమి. అప్పుడునన్న సుబేదారుతో శాంతి జరుగునన్న ఆశ లేకపోయెను. మార్పుకొరకు ప్రయత్నించితిమి. ఇక్కడ పనిచేసి వెళ్లిన రివిన్యూ మంత్రి గులాం మహిమూద్ హురేషీగారికి ఒక ముఖ్య మిత్రునిద్వారా నా అభిప్రాయమును తెలియజేసితిని. కొలది రోజులకు పూర్వము అరబ్‌జాతికి చెందిన హబీబ్ మహమ్మద్ అనే ఒకరు వరంగల్‌కు సుబేదారుగా నుండి నిష్పక్ష పాతముగ పనిచేసి వెళ్లిపోయెను. ఆయనను పంపుమని రివిన్యూ మంత్రిగారికి తెలియజేసితిని. ఆ ప్రకారము త్వరిత కాలములో హబీబ్ మహమ్మద్ సుబేదారుగాను, బాకరు హుస్సేను కలెక్టరుగాను పంపబడిరి. హబీబ్ మహమ్మద్ వరంగల్ రాగానే మా ఇంటికి వచ్చెను. మే ముభయములము ఏకాంతముగా పరిస్థితులను గురించి మాట్లాడితిమి. ఆయన నేను ధైర్యముతో శాంతిని కాపాడెదనని చెప్పి ముందేమి జరుగవలెనో మీరేమి సహకారము చేయుదరని ప్రశ్నించెను. నేను రాజ్యమునకు ముఖ్యమైన ధనము ప్రజలు బయటకు వెళ్లి పోయినారు. వారిని రప్పించి శాంతిస్థాపన చేయవలెను. మీరు కోరినచో నేనును మిత్రులును వరంగల్ బజారులో మీవెంట ఉండి రాత్రులలో అక్కడనే పడుకొనుట టకు కూడా సిద్ధముగా నుండెదమని చెప్పితిని. కాని ఆయన కూడా ఏమియు చేయలేకపోయెను. బహుశః ఖాశింరజ్వీ ఆయనను త్వరలోనే రివిన్యూమంత్రిగా చేసెదనని ఆశపెట్టి లోబరచుకొనెనని తెలిసికొంటిని. దురంతరములు చెలరేగు చుండెను. వాటి వివరములు అనవసరము. కాని గుర్తూరు సోమవరం అను ఒక ప్రదేశమున పన్నెండు మందిని వరుసగా నిలువబెట్టి 30 మందిని ఒక గుండు దెబ్బతో కాల్చినారనియు, కొందరు స్త్రీలను బట్టలు విడిపించి మూటలు నెత్తిన పెట్టి నగ్నముగా పోలీస్‌స్టేషన్‌కు నడిపించినారనియు వింటిని. ఈ విషయము సుబేదారు హబీబ్ మహమ్మద్ ఎదుటనో లేక ఆయన అపేక్షతోనో జరిగెనని కూడా వదంతులు ప్రబలెను. దానికి కొలది రోజుల తరువాతనే ఖలీలుజ్జమా అనే చీఫ్ జస్టిస్ వరంగల్‌కు వచ్చెను. ఆయన కొరకు నేను పెద్ద సభ జేసితిని. అధికారులతో న్యాయవాదులతోను సభ నిండియుండెను. అధ్యక్షుడైన నే నుపన్యసించితిని. ప్రధాన న్యాయమూర్తి కూడా మొదట వకీలుగానే యుండెను.

గనుక ప్రభుత్వ యంత్రమునకు వకీళ్ళు పరికరములుగా పనిచేయు ననియును, ఏ పనికైనను వకీళ్ళు తగుదురనియును చెప్పి ఇందుకు తార్కాణము మన ప్రధాన న్యాయమూర్తియే అని నిరూపించితిని. మరియు ప్రస్తుతము చెలరేగియున్న దురంతరముల నణచుటకు ప్రభుత్వము బలహీనముగా నున్నదనియును మేమెంతయో విశ్వసించిన హబీబ్ మహమ్మదు సుబేదారు ఉద్యోగ కాలమున గుర్తూరు దురంతముల విషాదఘట్టము జరిగినదని ఇక మా వంటి న్యాయవాదులు రంగమున నుండి ప్రజలకు ఏమియు సహాయము చేయజాలమనియును ఇప్పటి స్థితిలో తొలగుటయే మా కర్తవ్యముగా తోచుచున్నదని చెప్పితిని. ఆ సభలో సుబేదారు హబీబ్ మహమ్మదుగారు కూడా మౌనము వహించి యుండెను. సభ ముగిసిన తరువాత ప్రధాన న్యాయమూర్తి నన్ను మరురోజు తన వద్దకు రమ్మని కోరెను. అలాగనే నేను మరురోజు కాజీపేట క్యాంపులో ప్రధాన న్యాయమూర్తిని కలిసితిని. ఆయన ఏకాంతముతో చాలాసేపు అవకాశమిచ్చి జరుగుచున్నవియు, జరుగనున్నట్టివియు దురంతరములను తెలిసికొనెను. తన విచారమును తెలిపి నన్ను కొలది రోజులలోనే హైద్రాబాదుకు రావలసినదనియు మన ముభయులము ప్రధాని లాయఖలీతో కలిసి మాట్లాడుదమనియు చెప్పెను. కాని ముందు చెప్పెడి విధముగా ఇది లాభకారి కాజాలదని పూర్తిగా తెలియుటచేతను, నేను మా పెద్దల ఆదేశానుసారము వికాలత్ వదలి వెళ్ళవలసి వచ్చుటయు తటస్థించుట వలన నేను ప్రధాన న్యాయమూర్తిని, ప్రధాన మంత్రిని కలియుటకు హైద్రాబాదు వెళ్ళుట విరమించుకొంటిని.

ఇలాంటి పనులనుబట్టియే నన్ను జైలుకు వెళ్ళవద్దని మా మిత్రులు కొందరు కోరిరి. ఆ విషయమును ఇంకొక సందర్భమున వివరముగా వ్రాసియున్నాను.

* * *

*ప్రకరణము - 17*

# స్టేటుకాంగ్రెస్ మహాసభానంతరము కోర్టు బహిష్కారము-రాజ్య పరిస్థితులు-పోలీసుచర్య

హైద్రాబాదు రాజ్యమున ఒక తెలంగాణమే గాక మహారాష్ట్ర కర్నాటక భూభాగములుచేరి స్టేటు కాంగ్రెసులో నాయకులు, కార్యకర్తలు, ఈ మూడు ప్రాంతముల వారుండేవారు. అధ్యక్షుడు స్వామి రామానందతీర్థగారు మహారాష్ట్రుడు.

మహాసభానంతరము కాంగ్రెసులో రెండు గ్రూపులుగా చీలినవి. 1947 సంవత్సరం ఆగస్టు 15వ తేదీనుండి రాజ్యాంగతత్వము మారిపోయినది. నైజాం బ్రిటిషు ప్రభుత్వకాలమున భారత ప్రభుత్వమునకు లోబడిన సామంతరాజుగా నుండెను. భారత స్వతంత్ర ప్రభుత్వమున తాను స్వతంత్ర ప్రభువు ననుకొనెను. ప్రజలు ప్రతిఘటించిరి. బ్రిటిషువారు ఈ విషయమును సందిగ్ధముగా నుంచిపోయిరి. బ్రిటిషు ప్రభుత్వము పోయిన తరువాత రెసిడెంటు తొలగింప బడెను. భారత ప్రభుత్వ ప్రతినిధిగా శ్రీ కె.ఎం. మున్షిగారు ఏజంటుగా నియమింప బడిరి. వారు బెజవాడ ఉపన్యాసములలో నేను భృంగవంశ సంభూతుడనైతినేని హైద్రాబాదును క్రమబద్ధమైన ప్రభుత్వమును నెలకొల్పగలనని ప్రతిన చేసెను. 1948 స్టేటుకాంగ్రెసు మహాసభానంతరము రజాకార్లును, ప్రభుత్వోద్యోగులును ప్రజలను నానావిధముగా బాధలు పెట్టుచుండిరి.

1. రజాకార్లకు ప్రభుత్వ భయములేదుగనుక పగలే డబ్బు వసూలు చేయుటకు దౌర్జన్యముగా దోపిడీలు హత్యలు చేయుచుండేవారు.

2. కమ్యూనిష్టులు రాత్రులయందు సాయుధులుగా సంచారముచేసి హత్యలు ధనధాన్యముల దోపిడీలు చేయుచు యిండ్లు పడగొట్టి ధ్వంసము చేయు చుండేవారు.

3. ఇంకొక పార్టీ విప్లవవాదులు, గ్రామములు తిరిగి దౌర్జన్యముగా డబ్బు వసూలు చేసేవారు. స్టేటుకాంగ్రెసు పక్షమున బెజవాడ, కర్నూలు, మదరాసు మొదలగుచోట్ల క్యాంపులు ఏర్పాటుచేసికొని కార్యకర్తలు, నాయకులు పనిచేయుచుండిరి. కార్యకలాపములలో నాకంతముగా సంబంధములేదు. గాని కొన్ని పర్యాయములు డబ్బు వసూలుచేసి పంపితిని. బెజవాడ క్యాంపుకు వెళ్ళి శ్రీ హయగ్రీవాచారి, బొమ్మకంటి సత్యనారాయణ బసవరాజు గార్లతో మాట్లాడి వచ్చేవాడను. వారు నాకు కొన్ని సంగతులు చెప్పేవారు. జులై 7వ తేదీ నుండి సత్యాగ్రహము ప్రారంభింపబడినది. అధ్యక్షుడు స్వామిజీగారు, కాశీనాధరావువైద్యా గారు, వినాయకరావుగారు, రామకృష్ణారావుగారు, కేశవరావు మొదలగువారు సెప్టెంబరు మాసాంతము వరకు వేర్వేరు తారీఖులలో సత్యాగ్రహము చేసి జైలుకేగిరి. శ్రీ రంగారెడ్డిగారిని నిర్ణీత తేదీకిముందే సత్యాగ్రహము చేయనిదే యింటి నుంచి అరెష్టుచేసి జైలుకు పంపిరి.

వరంగలు 4వ దురంతముల శీర్షికలో ఇచ్చుటి పరిస్థితులు వ్రాసితిని. సత్యాగ్రహమునకు పూర్వమునను, తరువాతను కార్యకర్తలపైన కేసులు పెట్టిరి. కొందరికి శిక్షలు విధించిరి. ఈ కేసులలో నేనును నా మిత్రులును పని చేయు చుంటిమి. జుడిషియల్ ఆఫీసరు న్యాయముగానే వినును జమానతు అంగీకరించు టలోను కేసులు కొట్టివేయుటలో, అప్పీళ్ళు అంగీకరించుట యందు నిష్పక్షపాతులు గానే ప్రవర్తించిరి.

కారాగారమున కేగిన నాయకులకు 'ఏ' క్లాసు ఈయబడినది. మరికొంద రికి 'బి' క్లాసు ఈయబడెను. డిశంబరు మాసాంతమున, నాయకులు మాత్రము విడుదల చేయబడిరి.

జులై నుండి డిశంబరు వరకు చాలామంది ఇండ్లు ఖాళీచేసి నైజాం రాజ్యపు వెలుపలి గ్రామములకు వెళ్లిపోయిరి. పట్టణములు, గ్రామములు భూత పిచాచములు తాండవ మాడుచుండెనే గాని విద్యాధికులు మంచి గృహస్తులు, జమీందారులు, వర్తకులు, రైతులు మొదలగువారు కనపడకుండా ప్రవాసమునకు పోయిరి. దేశము అరణ్యమయినది.

మా బంధువులు చాలామంది గృహములను వదలి యూనియన్ గ్రామములలో నివాసమేర్పరచుకొనిరి. కమ్యూనిష్టుల చర్యలు సాగుచున్నచోట మా అల్లుడు శ్రీనివాసరావుకు పోలీసు సబ్ఇన్స్పెక్టరు బయట వెళ్ళుటకు సహాయపడెను.

## విడుదల అయిన పెద్దలు

ఒకరోజు శ్రీ బూర్గుల రామకృష్ణారావు, రంగారెడ్డి, వినాయకరావు, నర్సింగరావు, చెన్నారెడ్డి రామకృష్ణాదూత్, కాశినాధరావు, వైద్య మొదలగు 12గురు పెద్దలు 4 మోటార్లపైన పరిస్థితులు నరయుచు నల్లగొండ సూర్యపేట మీదుగా జగ్గయ్యపేటకు వచ్చిరి. అదివరకె అచ్చటికి వచ్చి యున్న క్యాంపు కార్యకర్తలు రెండవ పార్టీకి చెందిన ఈ పెద్దలతో తిరస్కార సంభాషణ చేసిరని చెప్పుటచాలును. పై పెద్దలు జగ్గయ్యపేట నుండి ఖమ్మంమీదుగా వరంగలుకు బయలుదేరిరి. దారిలో శుభ్రవీడు వద్ద ఒక హెడ్కానిస్టేబిల్ వీరితో అనవసర ప్రశ్నలుచేసి తాను కూడా వెంట బయలుదేరెను. అతని ఉద్దేశ్యము వీరిని తన స్వాధీనములోనికి తీసికొంటిననియును, హెడ్క్వార్టరులో వప్పగింత పెట్టవలయు ననియును అనుకొనెను. ఈ మోటారులు రాత్రి 9 గంటలకు కలెక్టరు బంగళాకు వెళ్ళెను. అక్కడనే డి.ఎస్.పి. కూడా ఉండెను. తమ వెంటనున్న నక్షత్రకుని చూపిరి. అంతట డి.ఎస్.పి. జమేదారును పొమ్మనెను. వీరితో మర్యాదగా తాత్కాలిక సంభాషణలుచేసి వెళ్ళుమనెను. వీరందరు 10 గంటలకు నావద్దకు వచ్చి భోజనములు చేసి పరుండిరి. గత విషయములను చెప్పుకొని భావికర్తవ్యమును గురించి కూడా మాట్లాడితిమి. ఇక సత్యాగ్రహముచేసి జైలుకు వెళ్ళుట లాభము లేదని నిశ్చయించుకొంటిమి. అది 22 జనవరి తేది. ఆ రోజున స్వామిరామానంద తీర్థ కాశినాధరావు వైద్య ఈ వచ్చిన పెద్దలలో ముఖ్యులు జైలుకు వెళ్ళుటకు నిశ్చయించుకున్న తేది. పర్యటన అనుభవము, గ్రామములలోని విధ్వంసక చర్యలను బట్టి రక్షణ మార్గమే ముఖ్యమనుకొన్నారు గనుక ఉదయం 5 గంటల రైలులో ఒక మనిషిని ఉత్తరమిచ్చి స్వామిజీ వద్దకు పంపిరి. అందులో జైలుకు వెళ్లవద్దని వ్రాసిరిగాని వారు వినలేదు. స్వామిజి 12 గంటలలోగానే సత్యాగ్రహము చేసి జైలుకు వెళ్లిరి. శ్రీ రామకృష్ణారావు ప్రభృతులు నాతో ఇదివరకు నీవు జైలుకు వెళ్లలేదు. యిప్పుడా కార్యక్రమము విరమింపబడినది గనుక నీవును జైలుకు వెళ్లనక్కర లేదు. మేమిక కోర్టుకు వెళ్లము కాబట్టి నీవును కోర్టుకు వెళ్లద్దని

ఏకగ్రీవముగా చెప్పిరి. నేను సరేనని ది. 1 ఫిబ్రవరి నుండి మానుకొనెదనని గట్టిగా చెప్పితిని. అంతటవారు వెళ్లిపోయిరి.

ఈ నిర్ణయము తరువాత రెండు మూడు రోజులలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఖలీలుజ్జమాగారు వరంగలు వచ్చిరి. వారికి వకీళ్ళపక్షమున విందు చేసితిమి. అధికారులందురు ఉండిరి. నేను న్యాయవాదుల అర్హత, సేవ, యిత్యాది విషయములు చెప్పి ప్రస్తుతము దేశమున అశాంతి ప్రబలియున్నది. ప్రభుత్వము బలహీనమై యున్నది. ఈ సుబేదారుగారు వచ్చి అల్లర్లను అణచెదరని ఆశించితిమి. గాని మొన్ననే గుర్తూరు వద్ద 12 మందిని ఒక గుండుతో కాల్చి చంపుట జరిగినది. యిట్టి స్థితిలో ప్రజాప్రతినిధుల మనుకునే మేము కూడా బలహీనులమై ప్రజల యెదుట తలయెత్తజాలకున్నాము. రంగము నుండి తొలగుటయే కర్తవ్య మనిపించుచున్నది అని గట్టిగా చెప్పితిని. సుబేదారు విని యూరకుండెను. నా ఉపన్యాసము బదులు చెప్పి సభ ముగిసిన తరువాత ప్రధాన న్యాయమూర్తి నన్ను పిలిచి రేపు ఖాజీపేటలోని తన క్యాంపుకు వచ్చి మాట్లాడి పొమ్మనెను. అందరము మేడమీది నుంచి క్రిందికి దిగగానే నా మిత్రుడు జిల్లా రజాకారు సంఘాధ్యక్షుడు అబ్దుల్ అలీం దగ్గరకు వచ్చి మీద చేతులువేసి "పండిత్‌జీ బార్ యిజ్జత్ ఆప్ హిసెహై" (బారు గౌరవము మీ వల్లనే ఉన్నది) అని నవ్వుతూ చెప్పెను. మా కాలము తీరినది. యిక ఉండి లాభం లేదని జవాబిచ్చితిని. నేను వెళ్ళదలచియే ఉంటిని గనుక ఆ మాటలలో మాట్లాడితిని. పెద్దవాడనైనాను యిక మానుకుంటా నన్నానని అలీంగారు భావించిరి.

మరురోజు నేను ప్రధాన న్యాయమూర్తి గారి వద్దకు వెళ్ళి కలిసితిని. ఆయన కూడా మొదట న్యాయవాదియే గనుక మా ఉభయులలో స్నేహ పూర్వకముగా అంతరంగిక సంభాషణలే జరిగెను. ఉదంతములన్నియు వివరముగా చెప్పితిని. ఆయన కొంత విచారమును సూచించి నీవు పట్నం రావలెను. నిన్ను లాయఖల్లి ప్రధాన మంత్రి వద్దకు తీసికొని వెళ్ళెదను నేను కూడా చెప్పెదనని చెప్పెను. ఇంటికివచ్చి స్నేహితులతో సంప్రదించితిని. రజాకారు ఉద్యమము ప్రభుత్వ బలముతో నడపబడుచున్నప్పుడు లాయఖల్లి యేమి చేయజాలడు. వెళ్ళి ఏమి లాభము లేదనిరి. పట్నం ప్రయాణం మానుకొంటిని.

ఈ వారం రోజులలో కొన్ని కట్టుబాట్లు చేసికొని నా కుమారులు సుబ్బారావు, లక్ష్మీకాంతరావులకు పని వప్పగింత పెట్టి సిద్ధపడితిని. గాని ఒక బీద వితంతువు రోదనను బట్టి 3వ తేదీ వరకుండి ఆమె కేసులో పనిచేసి పని

మానుకొని 4వ తేది ఉదయం యింటిపనులు సవరించుకొని బెజవాడ మార్గముగా జుజ్జూరు వెళ్ళితిని.

నేను వరంగల్‌లో నుండగానే ది. 30 జనవరి తేదీన మహాత్మాగాంధి నిర్యాణము జరిగెను. తరువాత అచ్చటచ్చట సంతాప సభలు జరిపితిమి. జుజ్జూరు చేరిన తరువాత జుజ్జూరు గ్రామములో సభలు సమావేశములు జరిగినవి. వాటిలో పాల్గొని బెజవాడ వెళ్ళి చితాభస్మము తెచ్చి కృష్ణలో కలిపిన రోజు అచ్చటనే ఉంటిని. మా బంధువులింట వివాహములో ఉండవలసి వచ్చెను. ఒక మాసము గడచినది. హైద్రాబాదు న్యాయవాద సంఘమువారు సమావేశమై ఏకముఖముగా అందరు వకీళ్ళు పని మానుకొని కోర్టు బహిష్కారము చేయవలెనని తీర్మానము చేసిరి. ఒక మెమోరాండము తయారుచేసి అందు జరుగుచున్న దుష్టచర్యలు అధికారుల సహాయము ఉపేక్ష వివరించుచు ప్రభుత్వము బలహీనమైన ప్రజలకు న్యాయము కలుగజేయజాల నప్పుడు వకీళ్ళు ప్రజాప్రాతినిధ్యము వహించ జాలరనియును ఆ కారణమున మేము పనిమానితిమని వ్రాయబడి యుండెను. ఆ మెమోరాండము బహిరంగముగా అందచేసి పనిమానుట కాదేశింపబడిరి.

నేనా సంవత్సరము వరంగల్ న్యాయవాద సంఘమున కధ్యక్షుడుగా నుంటిని. కాంగ్రెసు పెద్దల ఆదేశానుసారము వికాలత్ మాని యింటికి వెళ్ళితినని పైన వ్రాసియుంటిని. హైద్రాబాదు న్యాయవాద సంఘ తీర్మానము వరంగల్ కందగానే నన్ను రప్పించి అందరము కలిసి మెమోరాండము అందజేయవలెనని మా మిత్రులు అభిప్రాయపడిరి. అంతట శ్రీ జమలాపురం గోపాలరావు, జే. లక్ష్మీనారాయణ గారలు జుజ్జూరు వచ్చి నాకీసంగతి తెల్పిరి. నేను వారి కోరిక ప్రకారం బయలుదేరి హనుమకొండ వచ్చితిని. అందరము హనుకొండ మా యింటిలో సమావేశమై ఏకాభిప్రాయమునకు వచ్చితిమి. తుదకు ది. 7 మార్చి 1948 సంవత్సరం తేదీన 43గురు కోర్టుకు వెళ్ళి సెషన్‌జడ్జి మొహియుద్దీన్ అలిఖాన్‌గారితోను, మొహసన్‌రజ్వి డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు గారితోను, మున్సఫ్ గారితోను చెప్పితిమి. వారు ముగ్గురు సెషన్స్ కోర్టులోనికి వచ్చి కూర్చుండిరి. పోలీసులు వచ్చిరి. బహుశః మమ్ములను అరెష్టు చేయవలెనేమోయని అనుకొని యుండవచ్చును. జడ్జీలు యిది బెంచిబార్ సమావేశము గనుక మీరు ఉండకూడదు వెళ్లిపొమ్మనిరి. పోలీసులు వెళ్లిపోయిరి. తరువాత నేను మా మిత్రులందరు వెంటనుండగా మెమోరాండమును సమర్పించితిని. జడ్జిగారు మీకు మాకు ద్వేషములు లేవు. మేము మీయెడలగాని ప్రజలయెడలగాని అన్యాయము చేసి

యుండలేదు. కోర్టుకు రావడము ఏల మానెదరనెను. నేను పైన చెప్పినట్లు దేశములో విధ్వంస చర్యలు చట్టవిరుద్ధ కార్యములు జరుగుచున్నప్పుడు ప్రజలకు చెప్పజాలక సిగ్గుపడుచున్నాము.

డిస్ట్రిక్టు మేజిస్ట్రేటుకు శాంతి కాపాడుటకు సర్వాధికారములుంటవి. పోలీసు మీవెంట ఉంటుంది. నేను మీతో ఉండెదను. ఆయా ప్రదేశముల మీదికి వెళ్ళి చూపించి రుజువు చేసెదను.

తుపాకి కాల్చిన సార్జెంటును చంపినందుకు మీనవోలు తగలబెట్టబడినది. రైలు పడగొట్టుట గ్రామీణులు చేయజాలరు. నిపుణుడు కావలసి ఉంటాడు. రైలు పడగొట్టిన మిషబెట్టి రేమిడిచర్ల తగులబెట్టబడినది. ఇది ఒక్క రజాకారులే కాదు రివిన్యూ పోలీసు ఉద్యోగస్తులుకూడా ఉన్నారు. తాము విచారించి చర్య తీసికొనవలెను. యెక్కువ పోలీసు తెప్పించి రక్షణ చేయించవలెను. ద్రోహులను అరెష్టు చేయించవలెను. అందుకు కావలసిన సహకారము నేను నా మిత్రులును చేసెదమంటిని. వారు నిరుత్తరులయిరి. అంతట డిస్ట్రిక్టు మేజిస్ట్రేటుగారు పనిమానుకొని ఊరుకుంటారా? కడుపునిండిన నీచుడు ఆకలితోనున్న మర్యాదస్తుడు ఏ పనికైనా పాల్పడుతాడు అనెను. అందుపైన నాకీ క్రింది భర్తృహరి పద్యము జ్ఞాపకమువచ్చి

గ్రాసములేక స్రుక్కిన జరాకృశమై విశీర్ణమైన
సాయాసమునైన నష్టరుచియైనను బ్రాణ భయార్తమైన
సంత్రాసమదేభ కుంభపిశిత గ్రహలా శీలసాగ్ర హాగ్రేస
రభా సమానమగు గేసరి జీర్ణతృణంబు బోయునే.

ఉరుదులో సింహమునకుగాని, పెద్దపులికిగాని ఆకలి అయితె గడ్డి మేయునా అని జవాబిచ్చితిని. అంతటితో ఆ సమావేశము ముగిసినది.

సుబేదారు వద్దకు శ్రీ ఆవంచ వెంకట్రామయ్యగారు వెళ్ళి మెమోరాండము ను అందజేసెను. చదివించుకొని సుబేదారు హబీబ్ మహమ్మదు గారు రాజ్యము వప్పగింత పెట్టి పోతామా అని ఊరకుండెను.

ఇంకొక తాలూక్దారు బాకర్ హుస్సేన్‌గారికి ఒక కాపి నిచ్చిరి. ఆయన చదువుకొని ఏమిచేస్తారు అనెను. ఇక్కడి నియమముల ప్రకారము ఉదయపు కోర్టులు కనుక 12 గంటలకు వెనుకకు మరలి మా యింటికి వచ్చి టెలిగ్రాం ద్వారా హైద్రాబాదు న్యాయమండలికిని, ప్రభుత్వమునకును ఢిల్లీ కేంద్ర ప్రభుత్వమునకును తెలిపితిమి. అదేరోజు సాయంత్రం వరకు ఢిల్లీ నుంచి సంతోషిం

చినట్లు జవాబు అందెను. నేను జడ్జీలకిచ్చిన జవాబుకు మా మిత్రులు సగర్వముగా ఆనందించిరి. ఒక స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసి యప్పటి విషయము లప్పుడే గ్రంథస్థము చేయుచు హైద్రాబాదువారికి తెలుపుటకు కార్యదర్శికి ఆదేశమిచ్చితిని. మరురోజు నేను బయలుదేరి బెజవాడ చేరితిని. ఖమ్మం, మానుకోట, ఇల్లెందు, మధిర న్యాయవాదులకు యిదే సలహా నిచ్చితిమి. వారును కోర్టు బహిష్కారము చేసిరి. ఆ సందర్భమున మొత్తం దేశమున 800 మంది వకీళ్ళు పోలీసుచర్య జరిగే వరకు పని మానివేసిరి.

మరికొన్ని రోజులకు శ్రీ రామకృష్ణారావు, నర్సింగరావు, రామచంద్రారావు, రంగారెడ్డి, చెన్నారెడ్డిగారలు పట్టం వదలి బెజవాడ వచ్చి వసతి గృహములలో ప్రవేశించిరి. నేను జుజ్జూరు బెజవాడల మధ్యన తిరుగుచు పై మిత్రులతో భవిష్యత్తును గురించి స్వామిజీ కాంగ్రెసు కార్యకర్తల కార్యకలాపములను గురించి మాట్లాడుకొనుచుంటిమి. క్యాంపులోని శ్రీ హయగ్రీవాచారి ప్రభృతలతోను శ్రీ కాళేశ్వరరావు పంతులుగారితోను మాట్లాడుచుండేవాడను.

1. నిజాం ప్రభుత్వమునకును, భారత ప్రభుత్వమునకును రాయబారములు జరుగుచుండెను. భారత ప్రభుత్వ హితవాక్యములను అంగీకరింప బడలేదు.

2. హైద్రాబాదు నుండి కోట్లకొలది ద్రవ్యము పాకిస్థానుకు పంప ప్రయత్నములు జరుగుచుండెను.

3. సిడ్నికాటన్ ద్వారా ఆయుధములు తెప్పి,చుకొనుచుండిరి.

4. లండన్ బారిష్టరుద్వారా బ్రిటిషు వారివద్ద రాయబారములు జరుపుచుండెను.

5. రజాకారు దళము అధికమగుచు రాక్షస చర్యలు సాగించుచుండిరి.

6. కే.యం. మున్షిగారికి యిక్కడి దుష్టచర్యలు పోటీకాంగ్రెస్ నాయకులు తెలుపుచుండిరి.

7. ఉభయ కాంగ్రెసు నాయకులు మధ్యమధ్య ఢిల్లీ వెళ్ళి తమ కష్టములను చెప్పుకొని రక్షణ కోరుచుండిరి.

8. పత్రికల ద్వారా వార్తలను ఎప్పటికప్పుడు ప్రకటించే ఏర్పాటు చేయబడెను.

భారత ప్రభుత్వం హైద్రాబాదు రక్షణకును, రాజ్యాంగ చక్రమును చేబూని నడుపుటకును కావలసిన సిబ్బందిని సిద్ధము చేసికొనిరి. తుదకు పోలీసుచర్య జరిపి గౌర్నరు పరిపాలనకు కావలసిన ఏర్పాట్లు నిర్ణయింపబడెను. రాజ్యమునకు చుట్టును పలు ప్రదేశములలో సైన్యము లుంచబడెను. నిజాం ప్రభుత్వము వారు

ఏజంటు జనరల్ కే.యం. మున్షిగారి భోలారంలోని బంగాళాపైన పహరాయించిరి. తుదకు భారత ఆజ్ఞానుసారము నలుముఖముల సైన్యము బయలుదేరినది. ఉత్తర దిశగా మేజర్ జనరల్ చౌదరీగారి నాయకత్వమున బయలుదేరి భారత సైన్యము హైద్రాబాదుకు 30 మైళ్ళ సమీపమునకు చేరెను. రజాకారులు దోమలవలె నలిపివేయబడిరి. ఆ సందర్భమున ఆంద్రూస్ అనే సైనికాధికారి రాజుగారి వద్దకు వెళ్ళి కొన్ని గంటలలో రాజభవనంపైన బాంబులు పడవచ్చునని చెప్పెను. రాజుగారు కర్తవ్యమును తెలియగోరి కె.ఎం. మున్షిగారిని పిలిపించుకొని సలహా నడిగిరి. వారు చౌదరీగారికి శరణుజొచ్చుటయే ప్రథమ కర్తవ్యమని సలహా యిచ్చెను. అందుపైన యువరాజుగారు ఆంద్రూసుగారును చౌదరీగారి వద్దకు వెళ్ళి శరణుజొచ్చిరి. గౌర్నరు ప్రభుత్వము ఏర్పడెను. ఇది 17 సెప్టెంబర్ 1948 అని జ్ఞాపకము. అదేరోజు ముస్లిం నాయకుడు మహమ్మదల్లి జిన్నాగారు దివంగతులైరి.

"అన్యథా చింతంకార్యం, దైవమన్యత్ర చింతయేత్"

గౌర్నరు ప్రభుత్వము పోలీసు చర్యానంతరము స్థాపించబడిన కొలది రోజులకు నేను రైలులో ప్రయాణము చేయుచుండగా ఒక క్షత్రియ కెప్టెన్‌తో మాట్లాడుట తటస్థించెను. ఆయన ఇట్లు చెప్పెను.

మంత్రుల నిర్ణయ సమయమున సైన్యము రజాకార్లను జయించి హైద్రాబాదు చేరుటకు 15 దినములు పట్టుననుకొనిరి. సర్వసేనాపతి రాజేంద్ర సింహగారును, తదితర సేనాపతుల సమాలోచనలలో 15 దినములు అనవసరము 7 రోజులు చాలుననుకొనిరి. మేము కెప్టెనులము అదియు అవసరములేదు 3 దినములు చాలునని ఊహించితిమి. సైనికులు ఆవేశముతో 24 గంటలలో నిజామును పట్టుకుంటామనిరి. దీనికి కారణము ముస్లిం రజాకారులు హిందువుల యెడల చేసిన హత్యలు, విధ్వంస చర్యలు, స్త్రీల మానభంగములే ఆవేశపరులను చేయగలిగినవి. మరియు ఆయన ఇట్లనెను మేము బయలుదేరితిమి. షోలాపూర్ సమీపమున యెదుర్కొన్న రెండువేల రజాకారులను సునాయాసముగా కాల్చివేసితిమి. మా మోటారులు, టాంకులు హైద్రాబాదుకు 3వ రోజున చేరగలిగివే కాని దారిలో ఒకచోట మైన్సు పెట్టబడియుండెను. దానిని మేము గ్రహించితిమి. వాటి నన్నిటిని తీసివేయుటలో కొంచెము కాలము పట్టెను. ఆ కారణమున 4వ రోజున పట్ణం చేరగలిగితిమి. మొత్తంమీద గొఱ్ఱెపొట్టేలు బలిసి పర్వతముతో ఢీకొన్నట్లు శిక్షణ లేకుండానే చేరిన ముస్లింమూకలు సుశిక్షితులై

ఆరితేరిన భారత సైన్యము నెదుర్కొని నశించిపోయి ఆసఫ్‌జాహి రాజ్యమును హైద్రాబాదు నుంచి పోగొట్టుకొన్నారు.

పోలీసుచర్య సంగతి తెలియగానే జుజ్జూరు నుంచి బెజవాడకు వెళ్ళి శ్రీ రామకృష్ణారావు ప్రభృతులను కలిసికొంటిని. ఒక ప్రత్యేక మోటారులో శ్రీ రామకృష్ణారావు, రంగారెడ్డి గారును మరియిద్దరును హైద్రాబాదు వెళ్లుటకు బయలుదేరిరి. వారిని సాగనంపి జుజ్జూరు వెళ్లి బట్టలు, అవసర సామాను తీసుకొని మరురోజు బెజవాడ వచ్చితిని. ప్రయాణీకుల సంఖ్య విపరీతముగా నుండుటచే టిక్కట్టు దొరకలేదు. ప్లాటుఫారం టిక్కెట్టుతో రైలువద్దకు వచ్చి సెకండ్ క్లాసు పెట్టెలో ఎక్కితిని. అందెందరో మిత్రులుండిరి. దారిలో టికెట్టు కలెక్టరుకు చెప్పి చార్జి యిచ్చితిని. గవర్నరు పరిపాలన రాగానే రాజకీయ ఖైదీలనందరిని విడుదల చేసిరి. జైలు నుంచి వచ్చిన శ్రీ యం.యస్. రాజలింగం గారిని వరంగల్‌లో కలుసుకొని హనుమకొండ చేరితిని. యెందరో మిత్రులు దారిలో కలిసినందున స్టేషను నుండి యింటికి చేరుటకు 4 గంటల కాలము పట్టెను.

హనుమకొండలో రెండు మూడు రోజులుండి పట్టణం వెళ్లితిని. న్యాయవాదుల సమావేశము జరిగెను. నేను కూడా ఉంటిని. ఒక మెమోరాండ మును సమర్పించి మరల వకాలత్ పనులు సాగించుకొనవచ్చునని నిర్ణయింప బడెను. ఆ ప్రకారము వరంగల్‌లో ఆ మెమోరాండమును సదరు అదాలతులోను, సివిల్ ఎడ్మినిస్ట్రేటరు పళనియప్పన్ గారివద్దను తోడి న్యాయవాదులు వెంటనుండగా అధ్యక్షుడనైన నేను దాఖల్ చేసితిని. అంతటి నుంచి వకీళ్ళందరు తమ తమ పనులు యధాప్రకారము కొనసాగించుచుండిరి.

చీలికెలు లేకుండా 43గురు హిందూ వకీళ్ళ బసిష్కారము చేసినందుకు శ్రీ కె.యం. మున్షీగారును సంతోషించిరి.

* * *

*ప్రకరణము - 18*

# గౌర్నరు పరిపాలన స్థాపించిన తరువాత స్టేటు కాంగ్రెస్‌లోని చీలికెలు-రాజకీయములు

దీ. 17 సెప్టెంబరు 1948 సంవత్సరం తరువాత పోలీసు చర్య జరిపి గవర్నరు పరిపాలన ఏర్పరుచబడినదని పైన వ్రాసియుంటిని. కాంగ్రెసు నాయకులు కార్యకర్తలు తమతమ నివాసములకు చేరుకొనిరి. రజాకార్లు అంతరించి పోయిరి. వారి ఆయుధములు కమ్యూనిష్టులకు వప్పగించిరి. కమ్యూనిష్టులు మాత్రము కొండలలోను, అరణ్యములలోను నివసించుచు రాత్రులయందు దాడులు చేయుచు విధ్వంస హత్యాకాండలు జరుపుచునే యుండిరి. కమ్యూనిష్టులను అణచుటకు ప్రభుత్వపక్షమున అదనపు పోలీసులు, మిలిటరీ సిపాయిలు తెప్పించబడిరి. అచటచట క్యాంపుల నేర్పాటుచేసి రక్షణ చేయుచుండిరి. గ్రామములలో గ్రామీణులే గస్తులు తిరుగుచు కమ్యూనిష్టుల వలన అపాయము రాకుండా కాపాడుచుండిరి. అచ్చుటచ్చుట సంఘర్షణలు జరుగుచుండెను. కమ్యూనిష్టులు రక్షకభటుల తుపాకి గుండ్ల కెరయగుచుండిరి. కొందరిని పట్టుకొని జైళ్ళకు పంపించుచుండిరి. ఆ సమయంలో కాంగ్రెసు కార్యకర్తలు అధికారులకును రక్షకభటులకును సలహాలు, సహాయములు చేయుచుండిరి.

1947 స్టేటు కాంగ్రెసు మహాసభకు పూర్వము కక్షలు ఏర్పడినవనియును మహాసభానంతరము అవి చీలికలు కలిగించి రెండు పార్టీలుగా విడబడుటకు కారణ మేర్పడినదనియును స్పష్టపడినది. అందొకటి శ్రీ బూర్గుల రామకృష్ణారావు

గారి పార్టీ, రెండవది శ్రీ రామానందతీర్థపార్టీ. హైద్రాబాద్‌లో గవర్నరు పరిపాల నకు బదులు ప్రజాయత్త మంత్రివర్గము ద్వారా ప్రభుత్వము సాగించవలె నని ఉభయ పార్టీల కాంగ్రెస్‌వారును కోరుచుండిరి. కాని స్వామిజీ పార్టీవారు తమ పార్టీ నుండియే మంత్రివర్గము యేర్పాటు చేయవలయునన్ని రామకృష్ణారావు పార్టీవారు తమపక్షము వారిని మంత్రులుగ ఏర్పాటు చేయవలెనని కోరుచుండిరి. రామకృష్ణారావుగారి పార్టీలో మేధావులు, విద్యావంతులు, అనుభవజ్ఞులైన వకీళ్ళు న్ను అన్ని వృత్తుల వారును ఉండిరి. స్వామిజీ పక్షమున యువకుల సంఖ్య అధికముగా నుండెను. ఈ సంగతి పటేలు మంత్రిగారికి బాగుగ తెలియును. ఆయన ఒక ప్రసంగ సందర్భమున "సర్ ఏక్‌తరఫ్ థండ్ ఏక్‌తరఫ్" (సిరస్సు ఒకవైపున, మొండె మొకవైపున) ఉన్నదని అన్నారు. వారు త్వరగా ఏ నిర్ణయమునకు రాజాలకపోయిరి. కాంగ్రెసువారికి ప్రజలలో ధైర్యము పురికొల్పి శాంతిస్థాపన చేయవలసిన అవుసరముండెను. పరస్పర విరుద్ధములగు రెండు పార్టీలు సాధించజాలవు. కనుక రామకృష్ణారావుగారి పక్ష కాంగ్రెసు సభ్యులు అందరును హైదరాబాదులో సమావేశము జరిపి సక్రమ పరిస్థితులతో కాంగ్రెసు సంస్థను ఏర్పాటు చేయవలెనని నిర్ణయించిరి. నూతనముగా ఏర్పరుచబడిన స్టేటుకాంగ్రెస్ సంస్థ శ్రీ జనార్దనరావు దేశాయి అధ్యక్షుడుగను, కొందరు స్వామి సంఘ సభ్యులు గను వారిలో నుండి కొందరు కార్యవర్గ సభ్యులుగను ఎన్నుకొనబడితిమి. అటు తరువాత జిల్లాలో, తాలూకాలలో అడహక్ కమిటీలు ఏర్పాటు చేయబడెను. అప్పటినుంచి రెండు కాంగ్రెసు సంస్థలు పని చేయుచుండెను. కొందరు మధ్యవర్తులు ఒక కాంగ్రెసుకు పోటీకాంగ్రెసు లేక దేశాయి కాంగ్రెసు అనియును రెండవ కాంగ్రెసు గోసాయి కాంగ్రెసు అనియును మరికొందరు ఒకదానిని సంసారీ కాంగ్రెసు అనియును వేరొక కాంగ్రెసును సన్యాసి కాంగ్రెసు అనియును అనుచుండేవారు. నేనును వృద్ధుడనే గనుక రామకృష్ణారావు అనుయాయులతోనే ఉంటిని. పోటీకాంగ్రెసు ఏర్పడిన తరువాత నేనును రంగారెడ్డిగారును వరంగల్‌లో సభచేసి కొందరిని మా పక్షమున పని చేయుటకు కోరితిమి. శ్రీ కాళోజీ రామేశ్వర రావు, నారాయణరావు, ఉదయరాజు రాజేశ్వరరావు, చెరుకు కాంతయ్య ఇత్యాది విద్యాధికులు మరికొందరు కార్యకర్తలు మాతో నేకీభవించిరి. వరంగల్ జిల్లా సంఘమునకు శ్రీ రామకిషోర్‌గారు అధ్యక్షులుగ ఏర్పడిరి. తరువాత మే ముభయు లము పాకాల, మహబూబ్‌బాద్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, కల్లూరు,

వేంసూరులకు వెళ్ళితిమి. అచట ప్రముఖులందరు మా సంస్థలో చేరి ధన సహాయము చేసిరి. ఖమ్మంలోని పరచా శ్రీనివాసరావుగారు, మధిరలోని కందిబండి పురుషోత్తమరావు, పద్మనాభశాస్త్రి, మానుకోటలో డాక్టర్ ఉమ్మెత్తల గోపాలరావు, పాకాలలో ఏపూరి లక్ష్మారెడ్డిగారలు, తాలూకాసంఘ అధ్యక్షులుగ నుండి పనిచేసిరి. ధన సహాయము చేసిరి. మేము వేంసూరు వెళ్ళినప్పుడు దానికి సమీపమున నున్న కందుకూరు, వెంకటాపురం రేజెర్ల మొదలగు గ్రామములలో మేము సంచారము చేసి సభలు జరిపి ఉపన్యాసముల నిచ్చితిమి. మరియొకప్పుడు నేను శ్రీ రంగారెడ్డి, నర్సింగరావుగారలు కలిసి వరంగల్ జిల్లాలోని కొన్ని గ్రామము లలో తిరిగి ప్రచారము చేసితిమి. మొత్తం మీద మా సంస్థ చాల బలపడెను. కమ్యూనిష్టులను అణచివేయుటలో ప్రభుత్వమునకు అండదండగా పని చేసితిమి. హైద్రాబాదు రాజ్యమున గల పేరు ప్రతిష్ఠలుగల వారందరు ఈ సంస్థలో చేరియుం డినందున అధికార వర్గము కూడా వారి మాటలనే పాటించుచుండిరి. వరంగల్ జిల్లా రివిన్యూ పోలీసు అధికారులు విరివిగా నాతో సంప్రతింపులు జరుపు చుండిరి. రెండు సంవత్సరముల తరువాత భారత ప్రభుత్వమువారు మిలటరీ ప్రభుత్వమును తొలగించి సివిల్ పరిపాలన సాగించవలెనని నిర్ణయించి శ్రీ వెల్లోడిగారిని గవర్నరుగను నలుగురు ప్రజాపక్ష మంత్రులను ఏర్పరచి సాగించ వలెనని నిర్ణయించిరి. ఆ ప్రకారము స్వామిజీ పక్షమువారు శ్రీ దిగంబరరావు బిందూగారిని హెూమ్‌మంత్రిగను, శ్రీ వల్లూరు బసవరాజుగారిని కార్మికమంత్రి గను, రెండవ పక్షమువారిలో శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారిని విద్యా రివిన్యూ శాఖల మంత్రిగను, శ్రీ వినాయకరావు విద్యాలంకారుగారిని శాఖల మంత్రిగను నియమించిరి.

శ్రీ రామకృష్ణారావుగారు రివిన్యూ మంత్రిగ నియమింప బడిన తరువాత ప్రప్రథమున వారిని వరంగల్‌కు ఆహ్వానించి శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలకు ప్రారంభోత్సవము జరిపించితిని. వారివెంట శ్రీ వల్లూరు బసవరాజు కూడ నుండిరి. పోటీకాంగ్రెస్ అధ్యక్షులు జనార్దనరావు దేశాయిగారు ఏర్పడినారని పైన వ్రాసితిని. తెలంగాణా కాంగ్రెసు కమిటీకి శ్రీ రంగారెడ్డిగారిని అధ్యక్షులుగా ఎన్నుకుంటిమి. నేను కార్యవర్గ సభ్యుడనుగా నుంటిని. శ్రీ రామకృష్ణారావు మంత్రి గారు వరంగల్ నుంచి అశ్వారావుపేట వరకు పర్యటన చేసి కొత్తగూడెం ద్వారా తిరిగి రావలెనని కార్యక్రమములు ఏర్పాటు చేయబడియె. ఈ పర్యటన

కార్యక్రమము నా సలహాపెంట జరిగినదని స్వామిజీ పార్టీవారికి ఆక్షేపణ యుండెను. ఉభయ కాంగ్రెసు పార్టీల కార్యకర్తలు మార్గమధ్యమున మంత్రులకు స్వాగత సన్మానములు తమతమ కృతముగనే జరుపవలెనని తలచుచుండిరి. రంగారెడ్డిగారు నేను ఒక మోటరులోను, శ్రీ హైగ్రీవచారి, కేశవరావుగార్లు ఒక మోటరులోను వారివెంట బయలుదేరితిమి. మంత్రుల యొక్కయు, వారి సిబ్బంది యొక్కయు రివిన్యూ పోలీసు అధికారుల యొక్కయు మోటారులు కూడా నుండెను. ఈ మోటార్ల సంఖ్య 16 వరకు ఉండునని నా జ్ఞాపకము. మార్గమధ్యమున కార్యకర్తలు, రివిన్యూ కమీషనరు శ్రీ నంజప్ప, కలెక్టరు శ్రీ పళనియప్పన్ గార్లు మరియు ఇతర స్థానిక పెద్దమనుష్యులు మా పార్టీవారే ఎక్కువగ నుండుటచే ఖమ్మం, వరంగల్ మధ్యన పెక్కుచోట్ల శ్రీ రంగారెడ్డిగారి అధ్యక్షతతో డాక్టర్ వుమ్మెత్తల గోపాలరావుగారి పర్యవేక్షణతో జరుగుచుండెడివి. వరంగల్ నుండి మేము బయలుదేరుటకు ముందు బాలికా పాఠశాలలో అల్పాహారవిందు చేయబడెను. ఒక మనిషి వచ్చి గతరాత్రి రామనాథం, లక్ష్మినర్సయగారలు అరెస్టు అయినారని తెలిపెను. నేను రామనాథం మంచివాడేనంటిని. రామకృష్ణారావుగారు ఒక పూర్వపు సంగతిని చెప్పిరి. అదేమనగా "నేను రామకోటేశ్వరరావుగారు, రామనాథం వేంసూరు వెళ్లితిమి. రామకోటేశ్వరరావు అల్లుడు శ్రీనివాసరావు గారు మాకు విందు చేసిరి. ఆ విందులో మా కందరకు వెండి పళ్ళెములు, వెండి చెంబులు, వెండి గిన్నెలు, చెంబులు పెట్టిరి. దానిని చూచి రామనాథం మీరు బూర్జువాలు, ధనికవర్గమువారు కనుక ఇట్లా భోజనము పెట్టుచున్నారు అని అనెను. దానికి నేను మేము అట్లాగే పెట్టెదము. అట్లాగే తినెదము అంటిని" తాను చెప్పిన మాటలు జ్ఞాపకము ఉన్నవి అని వారు శలవిచ్చిరి.

వరంగల్ నుండి ఖమ్మం రోడ్డుపైన ప్రయాణము సాగించితిమి. మార్గమధ్యమున తొర్రూరులో శ్రీ డాక్టరణ గోపాలరావుగారు మానుకోట సంఘాధ్యక్షులు తొర్రూరులో స్వాగతమిచ్చిరి. అధ్యక్షులు రంగారెడ్డిగారే ఉండిరి. ఇట్లే మరియొక చోట జరిగెను. మధ్యాహ్నంకు ఖమ్మం చేరితిమి. ఖమ్మంలో సభలు సమావేశములు జరిగినవి. పాఠశాలలు గ్రంథాలయములు చూచిరి. ఒక సాయంత్రం శ్రీ చావా వెంకటకోటయ్యగారి ఆహ్వానముపైన గోకినేపల్లి ప్రజాయత్త పాఠశాలకు వెళ్ళితిమి. స్థానికులు స్వాగత పత్రముతో పాటు పాఠశాలనుహైస్కూలు చేయుమని కోరిరి. తరువాత అది హైస్కూలు అయినదని తెలుపుటకు సంతోషించుచున్నాను. మరురోజు ఖమ్మం నుంచి సాగి మధ్యాహ్నము వరకు లంకపల్లి చేరగలిగితిమి. దారిలో పెక్కుచోట్ల అనగా వైరా, కల్లూరు మకాములలో ప్రజలు తండోప

తండలుగా వచ్చి స్వాగతమిచ్చిరి. వైరా సమావేశములో చెరుకుపల్లి హనుమయ్య గారు అధ్యక్షత వహించిరి. లంకపల్లి నుంచి బయలుదేరి సాయంత్రం సదుపల్లి చేరితిమి. అచ్చట వేంసూరు, వెంకటాపురం, కందుకూరు మొదలగు గ్రామాదుల వారు మంత్రులకు స్వాగతమిచ్చిరి. అంతకు కొన్ని రోజుల పూర్వము నుండి వేంసూరులో ఒక హైస్కూలు స్థాపించవలెనని ప్రయత్నము చేసి పాఠశాలను స్థాపించిరి. దాని అభివృద్ధికొరకు శ్రీ పరిటాల నారాయణరావు, మాదిరాజు వెంకట శ్రీనివాసరావు, అరవాల వెంకట కృష్ణారావు, రాధాకృష్ణారావు, రామయ్యగార్ల కృషి ప్రశంశనీయము. సమావేశకర్తలు వేంసూరులో హైస్కూలు స్థాపించవలెనని విద్యామంత్రిగారిని కోరిరి. మంత్రిగారి వెంట జిల్లా విద్యాశాఖా ధికారి ఉండిరి. వారు ఒకేసారి హైస్కూలు స్థాపించజాలమనియును, ప్రస్తుతము 3వ ఫారమ్ వరకు అనుజ్ఞ యిచ్చి క్రమేణా హైస్కూలుగా పొందించవచ్చునని అభిప్రాయ మిచ్చిరి. అట్లే వేంసూరులో మాధ్యమిక తరగతి పాఠశాలగా ప్రారంభిం చబడి గ్రామస్తులు కృషివలన హైస్కూలుగా వృద్ధి చేయబడినది. ప్రస్తుతము ఆ హైస్కూలును పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యమునకు తీసికొన్నారని వినుటకు సంతోషము. సదుపల్లి నుంచి మంత్రులు, మేము బయలుదేరితిమి. మధ్యన ప్రజలు స్వాగతమిచ్చి తమ కష్టములను తెలుపుకొనిరి. ఆ సందర్భములో ఒక పోలీసు అధికారి నాతో కలిసి కొంచెము సేపు ముచ్చటించెను. దారిలో గతరాత్రి మంత్రిగారు వరంగల్‌లో నుండగా రామనాథం, లక్ష్మినరసయ్యగారలు తమంతట తామే వచ్చి పోలీసులకు పట్టుబడి నారనియును, ఇది వారి తెలివిగల పనియని యును, అట్లా జరుగక ఘర్షణకు దిగినచో వారికి సునాయసముగా రష్యాటికట్టు జరిగి యుండెడిదనియును చమత్కారముగా చెప్పిరి. తరువాత నేనును రామకృష్ణారావు గారును, రంగారెడ్డిగారును ఒకే మోటారులో కొంతదూరము ప్రయాణము సాగించితిమి. ఆ సందర్భమున శ్రీ రామకృష్ణారావుగారు గతరాత్రి నాకు వరంగల్‌లో రామనాథం, లక్ష్మినరసయ్యగారలు అరెష్టు అయిన సంగతి తెలిసిన దనియును వారిపైన ఎట్టి దౌర్జన్యములు జరుపక సక్రమ చర్య వెంట జైలుకు పంపవచ్చు ననియును ఉన్నతాధికారులకు ఆదేశమిచ్చితి ననియును చెప్పిరి. సర్వదేభట్ల రామనాధంగారు విద్యావంతుడేగాక, ఆంధ్రోద్యమములో కార్యకర్తగానుండి నాతో పనిచేసెను. ఆయన వివేకముతో ప్రవర్తించినందుకు నేను మనస్సులో సంతోషించితిని. అందరును రాత్రికి అశ్వారావుపేట చేరితిమి. నా వెంట పర్చా శ్రీనివాసరావు, కందిబండ పురుషోత్తమ రావు, పద్మనాభశాస్త్రి, చెరుకుపల్లి హనుమయ్య గారలుండిరి. తెలంగాణా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ

రంగారెడ్డి గారు కూడా మా వెంట ఉండిరి. పోలీసు చర్యానంతరము అశ్వారావు పేటలోని కందిబండ వెంకట రామారావుగారింటిలో దోపిడీ జరిగి కొంత ద్రవ్యము దోచుకొనిపోయిరి. ఈ విషయమును ఆయన ఉభయ కాంగ్రెసు నాయకులతోను, మంత్రులతోను వివరముగా చెప్పిరి. మరురోజుదయమున మేమందరము అశ్వారావుపేట నుండి బయలుదేరి సదుపల్లికి వచ్చి అచట సోవరాజు రంగారావు గారింట తేనీరు పుచ్చుకొని తల్లాడ చేరితిమి. అచట కొంత ప్రజానీకము మంత్రులను దర్శించి కొన్ని విషయములను తెల్పిరి. అచటి నుంచి ఏన్కూరు చేరితిమి. అచట ఒక చిన్న సమావేశము జరుగెను. ఆ సమావేశములో ప్రజలు కమ్యూనిష్టుల వలన తమకు కలుగుచున్న బాధలను చెప్పుకొనిరి. తగు రక్షణ యిప్పించుమని కోరిరి. బహుశా అక్కడ అంతకుముందే ఒక మిలిటరీ క్యాంపు ఉన్నదని జ్ఞాపకము.

## భూసంస్కరణల ప్రస్తావన

1354వ ఫసలీలో నిజాం ప్రభుత్వ కాలమున కౌలుదారి శాసనము ఆర్డనన్స్ రూపముగా జారికాబడెను. అది అంతగా భూస్వాములను బాధ పెట్టజాలదు. గాని కౌలుదార్ల రక్షణ మాత్రము కొన్ని నియమ నిబంధనములకు లోబడి గావింపబడెను. గౌర్నరు పరిపాలన వచ్చిన తరువాత మైసూరి నుండి పిలిపించబడిన పేషాద్రి మంత్రిగారు భూసంస్కరణలు శాసనము చేయవలెనని సంకల్పించిరి. తమ పర్యటన సందర్భమున అనుభవజ్ఞుల అభిప్రాయములు తీసుకొనుచుండిరి. వరంగల్ మకాములో నేను పరచా శ్రీనివాసరావుగారుని లిఖిత పూర్వకమగు అభిప్రాయములనే ఇచ్చుటయే కాక చాలసేపు చర్చలు జరిపి మనోభావములను వెల్లడించితిమి. గాని వారి కాలమున శాసనములు చేయబడలేదు. గవర్నరు ప్రభుత్వము అంతరించి, శ్రీ వెల్లోడిగారు ముఖ్యమంత్రి గను, శ్రీ రామకృష్ణారావు ప్రభృతులు ప్రజాహిత మంత్రులుగను ఏర్పడినట్లు పైన వ్రాసితిని. శ్రీ వెల్లోడిగారు భూసంస్కరణల విచారణ చేసి నివేదిక సమర్పించుటకు సర్ మాధవరావు కమిటీ ఏర్పాటు చేసిరి. నేను మాధవరావు కమిటీ ఎదుట గరిష్ట కమతమును గురించి సాక్ష్యమిచ్చితిని. పరిమితి ఎక్కువ యుండవలెనని పోటీ కాంగ్రెసు వారును, తక్కువ యుండవలెనని స్వామిజీ పార్టీవారును, అంతకంటె తక్కువ యుండవలెనని సోషలిష్టులును, భూమినంతయు

పంచి పెట్టమని కమ్యూనిష్టులును సాక్ష్యమిచ్చిరి. తుదకు జూన్ 1950 సంవత్సరంలో శాసనము చేయబడెను. అది తాము చేసిన ప్రజోపకారమని మంత్రులును, రంగారెడ్డిగారును ఈ పర్యటన సందర్భములో చెప్పుచుండిరి. ఒకచోట శ్రీ రంగారెడ్డిగారితో నేను శాసనములను గురించి చెప్పునప్పుడు రైతులకు కూడ హక్కు బాధ్యతలు పూర్తిగ చెప్పుమని కోరితిని. ఆ విషయములను అచ్చటచ్చట అస్మదాదులను వివరించుచుంటిని. మధ్యాహ్నముకు ఏన్కూరు నుంచి కొత్త గూడెం అందరము చేరితిమి. సాయంత్రం పెద్ద బహిరంగ సభ చేయబడెను. శ్రీ రామకృష్ణారావుగారు దీర్ఘోపన్యాసమును యిచ్చిరి. వారు తక్కిన విషయములతో పాటు కమ్యూనిష్టుల దౌర్జన్య చర్యలను నిరసించుచు ప్రజారక్షణ చేయించెదమనిరి. భూములను అందరికి పంచి పెట్టెదమని కమ్యూనిష్టులు చేయుచున్న ప్రచారము సరికాదనియును, అట్లు చేసినచో జనాభానుబట్టి మనిషికి 12 కూడా లభించదని చెప్పిరి. ఆ రాత్రి మంత్రులు రంగారెడ్డిగారు రైలుపైనను, నేను పర్చా శ్రీనివాసరావు, ఉదయరాజు రాజేశ్వరరావు మరికొందరు మిత్రులును వచ్చిన మోటారు పైననే పయనం సాగించుకొని ఖమ్మం ద్వారా వరంగల్ చేరితిమి. శ్రీ రామకృష్ణారావుగారి రివిన్యూ మంత్రికాలమున నేను దేవాదాయ, ధర్మాదాయ సలహాసంఘ సభ్యుడనుగా నియమింపబడి పని చేసితిని. ఆ వివరము మరియొకచోట వ్రాసియున్నాను. పోలీసు చర్యానంతరము చీలికలు వచ్చి రెండు కాంగ్రెసులు నడుచుచుండెనని పైన వ్రాసితిని. ఇది అనర్థకమని అందరును గ్రహించిన విషయమే. ఒక పర్యాయము కీ.శే. పటేలు మంత్రిగారు హైద్రాబాదుకు వచ్చి ఉభయ కాంగ్రెసు నాయకులను, కార్యకర్తలను సమావేశపరచి ముచ్చటించిరి. నేను కూడా ఆ చర్చలో పాల్గొంటిని. రెండు కాంగ్రెసులు ఉండకూడదని ఏకగ్రీవ ముగా అంగీకరించిన విషయమే కనుక ఒకదానిని రెండవదానిలో లీనము చేయవలసి వచ్చినది. శ్రీ స్వామి రామానంద్‌తీర్థగారి ఆధ్వర్యమున జరుపబడు కాంగ్రెసు సంస్థ ఎన్నికల ద్వారా ఏర్పడినది. గనుక తరువాత వచ్చే ఎన్నికల వరకు దానినే ఉంచి కార్యకర్తలలోను, ఆశయములోను కొన్ని మార్పులు చేయబడెను. ఉభయ పార్టీలవారు ఒక్కొక్క మెమోరాండమును సమర్పించిరి. శ్రీ పటేలుగారు దానిని ఢిల్లీకి తీసికొని వెళ్ళి అఖిల భారత కాంగ్రెసు కమిటీ ద్వారా నిర్ణయమును వ్రాసిపంపిరి. ఆ ప్రకారము స్వామిజీయే అధ్యక్షుడుగా ఉండెను. స్థాయి సంఘములోను, కార్యవర్గ సమితిలోను స్వామిజీ పార్టీకే మెజారిటీ

ఉండెను. శ్రీ పటేలు మంత్రిగారు తుది పరిష్కారము చేసినను పార్టీలలోని వర్గ విద్వేషములు ఏమాత్రము తగ్గిపోలేదు. ఒకరిని ఓడించుటకు రెండవవారును తమ పార్టీకే ఆధిక్యత సంపాదించవలెనని ప్రయత్నము చేయుచుండిరి. నియమితు లగు మంత్రుల కాలమున రెండు సంవత్సరములు జరిగెను. ఇతర ప్రదేశములతో పాటు హైద్రాబాదు స్టేటు ఎసెంబ్లీ కొరకును ఎన్నికలు జరుపవలసి వచ్చెను. ఎన్నికల కొరకు ప్రజాస్వామ్యమున కూడా అభ్యర్థులకు టికెట్టు యిచ్చే ఆచారం సాగించబడుచున్నది. ఇది కూడా నియంతృత్వ విధానమని అనుట అతిశయోక్తి కానేరదు. ఆ కమిటీలో స్వామిజీ పార్టీవారి సంఖ్య అధికముగానుండెను. అందరికిని అర్హతను, సేవనుబట్టి స్థానమును లభింప చేయవలెనని ఇరుకక్షల వారునూ చెప్పుచు హైద్రాబాదు నందు గాంధి భవనమున ఒక సమావేశము జరుపబడెను. ఆ సమావేశములో కమిటీ సభ్యులు నిష్పక్షపాతముగా ప్రవర్తించ వలెనని నేను చెప్పితిని. ఉభయ పార్టీలలో ముఖ్యులు ముఖప్రీతి మాటలే మాట్లాడిరి. మరురోజు మరల శ్రీ రామకృష్ణారావు గారి భవనమున సమావేశము జరుపబడి కొన్ని చర్చలు జరిగినవి. దానికి స్వామిజీగారు వచ్చియుండలేదు. ఎక్కడివారక్కడ లేచిపోయిరి. నేను డౌన్ వరంగల్ మహబూబాబాదు, వేంసూరు నియోజకవర్గములలోనే నభ్యర్థిగ ఉండుటకు అంగీకరించుమని కోరిరి. డబ్బు కూడ దాఖలు చేసితిని. ఇట్లే అనుభవయోగ్యులగు మరికొందరు కూడ కొన్ని నియోజక వర్గముల కొరకు దరఖాస్తు పెట్టిరి. వరంగల్ జిల్లాలోనే నాతోపాటు ఉదయరాజు రాజేశ్వరరావు, పరచా శ్రీనివాసరావు, ఏపూరి లక్ష్మారెడ్డి ఇంకా కొందరిని అభ్యర్థులుగా ఉంచకపోయిరి. ఎన్నికలలలో కాంగ్రెసు అభ్యర్థులలో చాలమందికి ఓటమియే జరిగెను. కులమత గ్రూపు ముఠా తత్వములు లేకుండా మేము ఆంధ్రమహాసభను జరిపితిమి. భేదములకు కారణము లేకుండెను. గాని స్వాతంత్ర్యము వచ్చిన తరువాత ఇట్టి ముఠా తత్వములు బయలుదేరి కాంగ్రెసు పేరు ప్రతిష్టలను గాంధీ సిద్ధాంతములను తలక్రిందులు చేయబడినవి. తరువాత పార్టీలలో ద్వేషములు పెచ్చుపెరిగి స్వామిజీని స్టేటు కాంగ్రెసు అధ్యక్షత పదవి నుండి తొలగించిరి.

ఆంధ్రోద్యమములోను, స్టేటు కాంగ్రెసులోను పనిచేసి రాజ్యాంగ సంస్కరణల సందర్భమున అసెంబ్లీ సభ్యత్వమును కాంక్షించక నిరాకరించిన నాకు నాతో కలసి పనిచేసి నా సేవ శక్తి సామర్థ్యములను తెలిసిన స్వామిజీ

పార్టీవారు నాకు ఎసెంబ్లీ సభ్యత్వమునకు తావీయక నిరాకరించుటకు ముఠాతత్వమే కారణము. నేను స్వతంత్ర అభ్యర్థిగా డబ్బు దాఖల్ చేసి వరంగల్ నియోజకవర్గ స్థానమునకు దరఖాస్తు పెట్టితిని. ఇంతలో శ్రీ రామకృష్ణారావుగారు కాంగ్రెస్ నుండి తొలగిపోవలదనియును, దరఖాస్తును ఉపసంహరించుకొనుమని టెలిగ్రామ్ యిచ్చిరి. వారి ఆజ్ఞను శిరసావహించి ఉపసంహరించుకొంటిని. శ్రీ ముదిగొండ రాజలింగంగారికి ఓటు యిచ్చితిని. వారు ఎన్నుకొనబడిరి. నాకు పోట్లాటలతో ప్రసక్తి లేదు. మర్యాదగా జీవితము గడచినది. కాంగ్రెసుకు సభ్యుడను గానే యున్నానుగాని పదవికాంక్షతో ఎన్నికలలో పాల్గొనలేదు. ఒకరిని ఆశ్రయించు టకును యిష్టపడేవాడను గాను. ఉన్నదానితో తృప్తి చెందుచున్నాను.

* * *

*ప్రకరణము - 19*

# అనుమాన కమ్యూనిస్టుల రిలీజు కమిటీ

రజాకారు మూమెంటు కాలమున అరాజకము పెచ్చు పెరిగినట్లు పైన వ్రాసియే యున్నాను. దానిని పురస్కరించు దేశీయ కమ్యూనిస్టులు కూడా తమ ఉద్యమమును బలపరచుటకు ప్రబల ప్రయత్నములు, చేయుచుండిరి. గ్రామముల దోపిడీ కుప్పలను తగలబెట్టుటయు ధాన్యములను దోచుకొని పంచి పెట్టుటయు, చేయుచుండిరి. అమాయకులగు బీద ప్రజలకు దుర్బోధలు చేయుచు, వారిలో కొందరిని తమ పార్టీలో చేర్చుకొనుటకును వారియిండ్ల వద్ద భోజనములు చేయుచు పగలంతయు దాగి యుండి రాత్రులయందు సంచారము చేయుచుండిరి. ధనవంతులని కొందరిని పార్టీ విరోధులని కొందరిని నిర్ణయంగాను నిర్మొగమాటముగాను హత్య చేయుచు యెన్నియో కుటుంబములు నాశనము చేసిరి. ఆయుధములు తీసికొని పోవుచుండిరి. మొత్తం మీద పోలీసు చర్యకు పూర్వమే వారు కొన్ని దేశీయ విదేశీయ తుపాకులను రివాల్వరును సంపాదించుకొని కత్తులు ఈటెలు బల్లెములు ఉన్నవేగాక కొన్ని తయారు చేయించుకొనిరి. నిజాం ప్రభుత్వమున సిడ్నీ కాటన్ ద్వారా ఆయుధములు తెప్పించి రజాకార్లకు సప్లయిచేసి యుండిరి. పోలీసుచర్య అనంతరం రజాకార్లకు డబ్బు యిచ్చి ఆ ఆయుధములను సంపాదించిరి. వాటి సహాయముతో రాత్రులలో నిశచారులై వీరవిహారము చేయుచు పైశాచక కృత్యములు తాండవమాడించుచుండిరి. యిది తెలంగాణమున చాలా పెచ్చు పెరిగిపోయెను. ఆ గ్రామములలో ప్రత్యక్ష కమ్యూనిస్టులుగాకున్నను

బుద్ధి పూర్వకముగాను అమాయకత్వమును భయముతోను కమ్యూనిస్టులకు చందాలిచ్చుచు భోజనములు పెట్టుచు సహకారము చేయుచుండిరి.

గౌర్నరు పరిపాలన ప్రారంభం అయిన పిమ్మట రాజ్యములో సివిల్ పరిపాలనకు తగిన యేర్పాటు చేయించుటయే గాక దేశమున పెచ్చు పెరిగిపోయిన కమ్యూనిస్టు దుండగములను అణచి శాంతి స్థాపన ప్రయత్నము చేయవలసి వచ్చెను. కేంద్ర ప్రభుత్వము నుండి పిలుపించ కొందరు మంత్రులను, కొందరు కార్యదర్శులు, కొందరు కలెక్టర్లను కొందరు తహశీల్దార్లనుగా నియమించిరి. యిట్లే మామూలు పోలీసు శాఖలో ఉద్యోగులను నియమించుటయే గాక ఆంధ్ర, మద్రాసు, మలబారు, మైసూరు, యు.పి. రాష్ట్రములోంచి పోలీసులను రప్పించి ప్రత్యేకముగా కమ్యూనిస్టులను అణచుటకే నియమించి గ్రామములలో కొన్ని క్యాంపులను పెట్టి రక్షణ చేయుచుండిరి. గ్రామీణులకు ఉత్సాహము కల్పించి ఆత్మరక్షణ కొరకు రాత్రులయందు గస్తీ తిరుగటకు అభ్యాసము చేయించిరి. కొందరు అడవులలో గుహలలో గ్రామముల నివసించు వారిని అరెస్టు చేయుచు దోపిడీచేసి తెచ్చిన ఆయుధములను బంగారు వెండి వస్తువులను నగదును స్వాధీన పరచుకొనుటకు పోలీసువారు పార్టీలుగా తిరుగుచుండిరి. అనేకచోట్ల సంఘటనలు తటస్థించినప్పుడు కమ్యూనిస్టులను కాల్చివేయుటయు కూడా చేయు చుండిరి.

ఈ విధముగా వేలాది సంఖ్యలో అరెస్టు చేయబడి కారాగారముల కంపబడిరి. వందల సంఖ్యలలో కాల్చివేయబడిరి. నాయకులలో మాత్రము కాల్పులకు గురికాలేదు. మధ్యరకంవారు కొందరు పట్టుబడిరి. వారిపైన కేసులు పెట్టబడెను. విచారణలు జరుపబడుచుండెను. అరెస్టు చేయబడిన వారి సంఖ్య కొన్ని వేల వరకు పెరిగిపోయెను. ఒక్క వరంగల్ సెంట్రల్ జైలులోనే షుమారు 1600 మందియు హైద్రాబాదు జిల్లా జైళ్ళలో షుమారు యింకొక 2000 మందియు అనుమానము మీద పట్టుకొని జైళ్ళలో ఉంచబడిరి. ఆ కాలమున శ్రీ రామంచంద్రనాయకు అనే దేశభక్తుడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయు చుండిరి.

శ్రీ రామచంద్రనాయకు సుప్రసిద్ధ ధార్మిక కుటుంబమున పుట్టి బారిస్టరు అయి చాలారోజులు న్యాయవాదిగా నుండి సాంఘిక రాజకీయములలో పనిచేసిన ధీరుడు. బిరారు యిలాకా ఆకోలాలో జరిగిన హైద్రాబాదు రాజకీయ సభకు వారధ్యక్షత వహించిరి. శ్రీ ధర్మవీర వామన నాయకుగారి అన్న కుమారుడును అయి యుండెను. వకాలత్ కాలము నుండియు నాకు వారితో స్నేహము. వారు

కాం(గెసు, ఆం(ధోద్యమ విద్యాభివృద్ధి సమావేశములతో సహచర్య యుండెడిది. వారు న్యాయమూర్తిగాను, (ప్రధాన న్యాయమూర్తిగాను పనిచేయు కాలమున కూడా వారికి నాయెడల గౌరవాదములు ఉండెడివి. గౌర్నరు పరిపాలన (ప్రారంభించిన తరువాత అనగా 1951 సంవత్సరమున (నాజ్ఞాపకము) వారు పర్యటన సందర్భమున వరంగల్‌కు విచ్చేసిరి. విద్యుక్త ధర్మముగనుక జైలుకు వెళ్ళి పరిశీలించి వచ్చిరి. అచ్చట కేసు లేకుండా రిమాండులో నున్న 1600 మందిని చూచి వచ్చిరి. స్థానిక జ్యూడిషియల్ అధికార్లను కలెక్టరును డి.ఎస్.పి.ని కొందరు వకీళ్ళను పిలుపించి సమావేశము జరిపిరి. న్యాయ సంఘాధ్యక్షుడనుగా నేను వెళ్ళి పాల్గొంటిని. (ప్రధాన న్యాయమూర్తిగారు యింతమందిని అకారణముగా జైలులో యెట్లు ఉంచినారని (ప్రశ్న వేసిరి. డి.ఎస్.పి.గారు వారందరు కమ్యూనిష్టులు అని చెప్పిరి. అయితే యెంతకాలము విచారణ లేకుండా నిర్బంధములో నుంచెదరు? యిది న్యాయవిరుద్ధము కాదా? అని మరల (ప్రశ్నించెను. దానికి అధికారవర్గ మేమియు (ప్రత్యుత్తర మీయకుండిరి. అంతట నేను లేచి ఒక చిన్న కమిటీని ఏర్పాటు చేసి నిర్బంధితుల చర్యను పరిశీలన చేయించ వలె ననియును రికార్డునుబట్టి కొందరిపైన నేరములు మోపుటకును లేక కొందరిని జమీను కోరుటకు కోర్టుకు పంపమనియును అనుమానముతప్ప చర్యలు ధృవపడని పక్షమున వదలివేయమనియును చెప్పితిని. ఈ కమిటీలో ఒక పోలీసు అధికారియు, పబ్లికు పక్షమున ఒక కాం(గెసు సభ్యుడును ఉండవలెనని చెప్పితిని. దీనికి అధికారులు ఆమోదించిరి. విషయము బాగా ఉన్నది (ప్రభుత్వము నకు (వ్రాసెదనని (ప్రధాన న్యాయమూర్తిగారు చెప్పిరి. వారు అదేవిధముగా (ప్రభుత్వమునకు తెలిపిరి. కొన్ని రోజులకు (ప్రభుత్వము వారంగీకరించి పైచెప్పిన విధముగా రిలీజ్ కమిటీలను ఏర్పాటు చేయుటకు జిల్లా కలెక్టర్లకు అధికారమిచ్చిరి. సాధారణముగా ఈ కమిటీలలో కాం(గెసు సభ్యులయిన న్యాయవాదులే ఏర్పాటు చేయబడిరి.

వరంగల్ జిల్లాలో (ప్రతి తాలూకా శాఖ కమిటీ ఏర్పాటు చేయబడెను. డిప్టికలెక్టరు డి.వై.యస్.పి. ఒక కాం(గెసు కార్యకర్తను సభ్యులుగా ఏర్పాటుచేసి రికార్డును పరిశీలించుటకు ఆదేశమిచ్చిరి. అప్పుడు వరంగల్ జిల్లాకు నిష్పక్షపాతియు మేధావియు అయిన శ్రీ పళని అప్పన్‌గారు కలెక్టరు (సివిల్ అడ్మినిస్ట్రేటరు)గా నుండిరి. ములుగు తాలూకాకు డిప్టికలెక్టరు శ్రీ దొరైరాజా డి.వై.యస్.పి. శ్రీ చలమారెడ్డి కాం(గెస్ పక్షమున నేను కమిటీ సభ్యులుగా ఏర్పాటు కాబడితిమి. కొన్ని రోజులు పోలీసు రికార్డును పరిశీలించి రికార్డు

వున్న కొందరిపైన కేసు పెట్టి కోర్టుకు చాలాన్ చేయుమనియును కొందరిని వదలి వేయుమనియును నిర్ణయించుకుంటిమి. వరంగల్ సెంట్రల్ జైలులో నున్న నిందితులను వదలిపెట్టుటకు మొదట హైద్రాబాదు నుండి డిప్యూటీ కమీషనర్ పోలీసు వచ్చెను. పబ్లికు సభ్యులము అందరము వెళ్ళితిమి. కలెక్టరు, డి.ఎస్.పి. యింకా కొందరు పోలీసు అధికార్లు ఉండిరి. కొందరిని సమీకరించి వారి వైఖరిని పరీక్షించుచు వారితో కొన్ని ప్రశ్నలు వేసి చిత్తవృత్తులను గ్రహించుచు నోటు చేసుకొనుచుండిరి. ఆ జైలులో సర్వదేవభట్ల రామనాథంగారి భార్యయు చిర్రావూరు లక్ష్మీనరసయ్యగారి భార్యయు ఉండిరి. వారిని సమీకరించి ఒక పోలీసు ఉద్యోగి మీ భర్త లెచ్చటనున్నారు? మీ వద్దకు వారు వచ్చుచుంటారు గదా అని ప్రశ్నించు చుండెను.నేను కూడా నాకు పరిచితులయిన ఆ అబలల వద్దకు వెళ్లి నిలుచుంటిని. వారు మాకు తెలియదని చెప్పిరి. తరువాత నేను పోలీసు ఉద్యోగియు బయటకు వచ్చితిమి. నేను సమీకరించుట వలన ఆ మహిళలకు కొంత ధైర్యము కలిగియుండు ననుకుంటాను. ఆ రోజు కొన్ని వందల మందిని వదలుటకు నిశ్చయించబడెను. బయట జైళ్ళకు ప్రత్యేక తేదీలలో వెళ్ళుటకు ఏర్పాటుచేసిరి. మా మిత్రులు ఉదయరాజు రాజేశ్వరరావు, కాళోజీ రామేశ్వరరావుగారు వరంగల్ పాఖాల తాలూకాల పక్షమున సభ్యులుగా నుండి జిల్లాకు వెళ్ళివచ్చిరి.

ములుగు, మానుకోట, సూర్యాపేట, మరికొన్ని తాలూకా నిర్బంధితులు జిల్లా జైలులో నున్నవారిని వదలుటకు తేదీ ఏర్పాటు చేయబడెను. ములుగు తాలూకా పక్షమున నేనును, మానుకోట పక్షమున చేబూరి గోవిందరావుగారు జిల్లా వెళ్ళితిమి. జాల్నాకు యితర తాలూకాల పక్షమున వచ్చిన కాంగ్రెసు సభ్యులు కలిసిరి. వారిలో కుందూరు లక్ష్మీకాంతరెడ్డి సూర్యాపేట గార్లపేర్లు జ్ఞాపకమున్నవి. మేము జైలులోనికి వెళ్లితిమి. అది సెంట్రల్ జైలుగా కట్టబడినది. సైనికుల కొరకు కట్టబడిన యిండ్లుగా నుండెను. దానికి తీగెతో ఆవరణ చేయబడి తీగెలో కరెంటు పెట్టబడెను. సైనికులు రక్షణ చేయుచుండిరి.

నిర్బంధితులలో చాలామందితో మాట్లాడితిమి. వారు పల్లెం గ్రామములలో నివసించు లంబాడీలు, కోయలు మొదలగు వారుండిరి. వారు చెప్పిన దేమనగా అయ్యా రాత్రిపూట ఆయుధములతో మా యిండ్ల గుడిశెల వద్దకు వచ్చి అన్నం నీళ్లు అడిగిరి. మేము వారును మనుష్యులు గనుకను పెట్టకుంటె కొట్టెదరనియును భయపడి కొందరము అన్నము పెట్టితిమి. కొందరికి మజ్జిగనీరు పోసితిమి. కొందరిని రాత్రిపూట పడుకోనిచ్చితిమి. ఏమిచేయగలము మరురోజు పోలీసులు వచ్చి యెందుకు సహాయము చేసితిరి. వాండ్లను చూపండి అని అడిగిరి. జరిగిన

సంగతి చెప్పితిమి. గాని వారిని చూపలేమంటిమి. అంతట పోలీసువారు మమ్ములను పట్టుకొని వచ్చిరి. అంతేగాని మాకేమియు సంబంధము లేదు. యికముందు ఉండదు అని బదులు చెప్పిరి. వారిలో చాలామంది ఆటవికులు. కట్టుబట్టలు లేనివారు పాలకజనులు ఉండిరి. అట్టివారిని వదలుటకు నిర్ణయించు కుంటిమి. వారి సంఖ్య దాదాపు 300 వరకు ఉండెను. మా అభిప్రాయానుసారము కొలది రోజులకు వారిని వదలుటకు ఉత్తరువుయిచ్చిరి.

జాల్నా ఔరంగాబాద్ జిల్లాలోనిది. అది మహారాష్ట్ర ప్రాంతమునకు చెంది యుండెను. నేను పోటీకాంగ్రెస్ వర్కింగుకమిటీ సభ్యుడను గనుక తాలూకా కాంగ్రెస్ ఆఫీసుకు వెళ్లి అధ్యక్షుడుగా నున్న న్యాయవాదితో కలసి పరిస్థితులు తెలుసుకొంటిని. తరువాత ఒక న్యాయవాది యింటికి వెళ్లి ఆహారకమిటీల సంగతి, భూసంస్కరణలను గురించి మాట్లాడితిని. ఆయన కూడా భూములు కలవాడె. ఆయన మాకును మా కౌల్దార్లలోను భేదాభిప్రాయములు లేవు. అనుకున్న ప్రకారం నగదుగాని ధాన్యముగాని మాను యిచ్చుచుంటారు. వారిని మేము పిల్లలవలె చూచుచు వారి అవసరములకు నగదుగల్లా అప్పుగా యిచ్చి పంటలలో తీసుకుం టాము. వారు మమ్ములను తలిదండ్రులవలె భక్తివిశ్వాసములతో కనిపెట్టుచుం టారు. వారిలో కొందరు చాలాకాలము నుండి శేవ్యము చేయుచు కౌల్దార్లున్ను ఉన్నారు.నీతితో ప్రవర్తించె మాకు కౌల్దారి శాసనము అవసరము. అట్లే కొంత భూమిని స్వంత శేవ్యము కూడా చేయుచుంటాము. గరిష్ట పరిమితికూడా క్షేమకరం కాదని అంటూ మీరు రిలీజు కమిటీలో వచ్చితిరి. ఈ విచారణ మీకెందుకు అని నన్ను ప్రశ్నించెను.

వారితో నేను కాంగ్రెసు సంఘసభ్యుడను న్యాయవాద సంఘాధ్యక్షుడను. ఆహార కమిటీ సభ్యుడను. స్వంత వ్యవసాయమున్న భూస్వామిని గనుక మీ ప్రాంత సంగతులను కూడా తెలుసుకొని అధికార అనధికార మిత్రులకు తెలుపుటకు విచారించుచున్నా నంటిని. ఆయన నన్ను ఆదరించి సంతోషముతో శలవిచ్చెను.

జాల్నాలో ఒక ఉన్మాదుల చికిత్సాలయము కూడా ఉండెను. దానిని చూచుటకు అనధికార సభ్యులందరము వెళ్లితిమి. డాక్టర్లు మమ్ములను గదుల వద్దకు తీసుకొని వెళ్ళి పలు తరగతుల పిచ్చివాండ్లను చూపించిరి. అచ్చట ఉ న్మాదులు గనుక పిచ్చిచేష్టలు చేయుచు మనుష్యులను బాధపెట్టువారును ఊరికె

వాగుచుండేవారును, మానసిక దౌర్బల్యముతో నిశ్చేష్టులుగాను కొందరు మాట్లాడే వారును ఉండిరి. వీరందరికి వసతి, చికిత్స, ఆహారము ప్రభుత్వమువారే యిచ్చు చుండిరి. ప్రతిఫలము లేదు. కొందరు స్థితిగలవారు తమ వ్యయముతో గదులు, పక్కలు తీసుకొని ఔషధ శేవ చేయుచు విశ్రాంతి తీసుకొనుచుండిరి.

మేము చూచి బయటకు వచ్చుచుండగా కూర్చునిఉన్న ఒక పిచ్చివాడు లేచి మమ్ములను పిచ్చివాండ్లు చూచిపోవుచాన్నరని తెలుగు భాషలోనే అనెను. మేము నవ్వుకుంటిమి.

తరువాత ఒక మోటరులోకి వెళ్లితిని. అచట కొందరు తెలుగు మాట్లాడే వారు కలిసిరి. వారిలో కొందరు తెలంగాణా వాస్తవ్యులు కొందరు, ఆంధ్ర మండల వాసులు అయియుండిరి. వారితో పరిచయము కలుగచేసుకొంటిని. వారు నాపేరు తెలుసుకొని కొంత తెలిసినవారివలెనే మాట్లాడిరి. అచ్చట అయిదారు వందల తెలుగు ప్రజలు పలు వృత్తులలో ఉన్నారని తెలుసుకుంటిని. వారందరితో మీరొక ఆంధ్ర సమాజము నేర్పాటుచేసి ఒక గ్రంథాలయము స్థాపించండి. హైద్రాబాదు వరంగల్ నుండి మేము వచ్చి మీకు సలహాలిచ్చు చుంటాము. మీ వలెనే యితర మహరాష్ట్ర, కర్నాటక జిల్లాలో తెలుగు వారున్నారు అని చెప్పితిని. వారు సంతోషించి ప్రయత్నము చేయుదుమని చెప్పిరి.

* * *

ప్రకరణము - 21

# సంస్కృత భాషాసేవ

వరంగల్‌లోని వర్తకులలో ఆకారపువారి కుటుంబము ప్రముఖ స్థానము వహించినది. శ్రీ చెన్నయ్య గారికి నాయందు విశ్వాసము కలుగుచు వచ్చినది. ఎన్నియో ప్రజోపయోగ కార్యములకు వారివలన భూరి విరాళముల నిప్పించ గలిగితిని. త్రిలింగాయుర్వేద విద్యాపీఠమునకు ఆయన అధ్యక్షుడుగాను నేను కార్యదర్శిగా యుండి పని చేసితిమి. తుదకు చెన్నయ్యగారి కుటుంబమునకు, చెన్నయ్యగారికిని వారి కుమారుడు నరసింగం గుప్తగారికిని సలహాదారుగా నేర్పాటు చేసుకొనబడితిని. నరసింగం గారికి నా యెడల మిత్రభావము విశ్వాసము గాఢమగుచు వచ్చినది. కోర్టు వ్యాజ్యములోను వర్తక వ్యవహారములలోను, ధర్మ కార్యములలోను నా సలహాను పాటించు చుండేవారు. వారెన్నియో ధర్మకార్యము లను చేసిరి. వాటి వివరము అనవసరము. నరసింగంగారికి శివాలయ ప్రతిష్ఠ చేయవలెనని సంకల్పము కలిగెను. స్టేషన్‌రోడ్డుపై నున్న వారిదే స్థలము దేవాలయము కొరకు నిర్దేశింపబడినది. దేవాలయ నిర్మాణములకు ప్రభు త్వానుమతి అవసరము గనుక దానిని పూర్తి చేయించితిని. అప్పుడు వరంగల్‌కు సుబేదారుగా నున్న నారాయణరావుగారి వలన శంకుస్థాపన చేయించి దేవాలయము ప్రారంభించబడినది. దక్షిణదేశపు శిల్పులతో రాళ్లను చెక్కించి మందిర నిర్మాణము పూర్తి చేయించెను. సుందరమైన ఆకారము శిల్ప నైపుణ్యము వర్ణనాతీతము. నరసింగంగారి స్థలము చాలదనుకొని నందున ప్రక్కనున్న నా పాత క్లయింటు గుముడవెల్లి పద్మనాభస్వామిగారికి చెప్పి కొంత స్థలము

యిప్పించితిని. విజపూర్ నుండి సుందరమైన విగ్రహములను తెచ్చి కాశీ విశ్వేశ్వర స్వామి పేరుతో మహదేవుని పార్వతీదేవిని సుబ్రహ్మణ్యస్వామిని శ్రీ నరసింగం గారు ప్రతిష్ఠ చేయించిరి. మరియు కల్యాణ మండపము యజ్ఞశాల వసతి గృహములు నిర్మాణము చేయించెను. కావలసిన వెండి బంగారు ఆభరణములను సమర్పించెను. దీనికి ఒక లక్ష రూపాయిలు వ్యయము చేయబడెను. శ్రీ విశ్వేశ్వర స్వామివారి నిత్య నైవేద్య దీపారాధనలు పక్షోత్సవ మాసోత్సవ కల్యాణోత్సవాదులు నిరాటంకముగాను శాశ్వితముగాను జరుగుటకు వరంగల్‌లోని కొన్ని యిండ్లను పూర్తిగాను, ఖమ్మం, మద్రాసులోని కొన్ని యిండ్ల ఆదాయము యొక్క కొంతభాగమును శ్రీ స్వామివారికి అర్పణ చేసెను. ఈ స్థల ఆదాయము పదివేల రూపాయిల వరకు ఉండునని అంచనా వేయబడెను. ఇందును గురించి ది. 17 ఫిబ్రవరి 1950 సంవత్సరం తేదీన ఒక ట్రస్టు దస్తావేజు వ్రాయించిరి. రిజిష్టరి చేయించితిని. దానిలో 2800 రూపాయిలు సంస్కృత కళాశాలకు కేటాయించబడెను. మందిర నిర్మాణ సంకల్పము మొదలు విశ్వేశ్వరస్వామి ప్రతిష్ఠ వరకుప్రతి సందర్భమునను నేను ఈశ్వరభక్తితోను సనాతన ధర్మాసక్తితోను సలహాల నిచ్చుచునే యుంటిని. కాని పట్టణములోని కొందరు విద్యాధికులకు యిది నచ్చలేదు. వారు దేవాలయ ప్రతిష్ఠ వకదుర్వ్యయమని భావించుచుండిరి. ఈ విమర్శకు మందిర నిర్మాత ఆకారపు నరసింగం ఒక్కడేగాక నేను కూడా గురియైతిని. యువక విద్యాధికులు యింత ధనము వెచ్చించినచో కాలేజీ ప్రతిష్ఠాపనయే జరుగవచ్చునని చెప్పుచుండిరి. యిది కూడా వాస్తవమే. నేడు దేవాలయముకన్న విద్యాలయములకు, గ్రంథాలయములకు ప్రాముఖ్యత హెచ్చుచున్నది. ఈ విమర్శలను గురించి నేను కొన్ని పర్యాయములు నరసింగం గారితో చెప్పితిని. నరసింగం గారికి వ్యవహార విషయములలో నాయందెంత విశ్వాసమో అట్లే మత విషయములలో ఆయన స్వీయగురువు ముదిగొండ రామ లింగయ్యగారి యందును గురుతుల్యులు శ్రీ ముదిగొండ వీరేశలింగ శాస్త్రిగారి యందును విశ్వాసము ఎక్కువ. ఏదేని విద్యా ప్రతిష్ఠాపన ఆయనచేత చేయించవలె నని మేము ముగ్వురము ఏకాభిప్రాయమునకు వచ్చితిమి.

## వైదికపాఠశాల

మా ముగ్గురి సలహా ప్రకారము మొదట నరసింగంగారు ఆకారపు చెన్నయ్య గారి నరసింగం వైదిక పాఠశాల యను పేరుతో సంస్కృత పాఠశాల ఏర్పాటు చేసెను. దానిలో శ్రీ ముదిగొండ వీరేశలింగశాస్త్రీగారు (ఉభయ భాషాప్రవీణ)

సంస్కృతమునందును, శ్రీ మహాదేవ ఘనాపాఠిగారు వేదము చెప్పుటకును అధ్యాపకులుగా నియమింపబడిరి. వారి వేతనము నరసింగంగారే యిచ్చుచుండిరి. అందు కొందరు విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీ ప్రిలిమినరీ భాషా ప్రవీణ విద్యా ప్రవీణ పరీక్షలకు వెళ్లి పరీక్ష యిచ్చుచుండిరి. తరువాత హిందీ పరీక్షలకును, ఆంధ్ర సారస్వత పరీక్షలకును విద్యార్థులు పంపబడుచుండిరి. కొంత కాలమువరకు క్రమబద్ధమైన కమిటీ ఏర్పాటు చేయకుండ ఎప్పటికప్పుడు నేనును శ్రీ వీరేశలింగ శాస్త్రిగారును నరసింగగారును సంప్రదించుకొనుచు నడుపుచుండెవారము.

## సింహ్వాద్రిబాగ్ వైదిక కళాశాల

వరంగలు వాస్తవ్యులు శ్రీ ముడుంబై రామానుజాచార్యులుగారు హైద్రాబాదు శీతారాంబాగ్ సంస్కృత కళాశాలలో విద్యనభ్యశించి వచ్చిరి. వారికి వరంగలు నందు ఒక సంస్కృత పాఠశాల ఏర్పరుచవలెనని సంకల్పము కలిగెను. వరంగలు భద్రకాళి చెరువు పశ్చిమభాగమున నరశింహ్వాస్వామి దేవాలయమున్నది. దానికి సమీపమున శ్రీ పాలారపు లక్ష్మయ్య అనే వర్తకుడు సత్రముపేర ఒక యింటిని కట్టించెను. ఆ యింటిలో రామానుజాచార్యుల వారు ఒక పాఠశాలను స్థాపించిరి. దాని వ్యయమును ఆయన చందాల మూలమున సంపాదించుచుండెను. దానికి కొన్ని రోజులపాటు నేను అధ్యక్షుడుగాను, కార్యకర్తగాను పనిచేసితిని. ఒక పర్యాయము శ్రీ కొత్వాల్ రాజాబహద్దురు వెంకట్రామరెడ్డిగారిని ఆహ్వానించి వారి ఆధ్వర్యమున సభ జరిపితిమి. ఆ సభకు నేను ఆహ్వాన సంఘాధ్యక్షుడుగ నుంటిని. తరువాత అవసర సందర్భములో రామానుజాచార్యులవారు నాతో సంప్రదించుచు సభలు జరుపుచుండేవారు. ఆ సభలలో నేను కూడా పాల్గొనెడి వాడను. ఆ పాఠశాల మార్గమధ్యమున చిన్నివాగు వుండెడిది. ఆ వాగుపైన వర్తకుల సహాయముతో ఒక వంతెన నిర్మాణము చేయబడెను. దాని ప్రక్కనున్న కొంత భూమిని శ్రీ ఉదయరాజు రాజేశ్వరరావుగారు దానము చేసిరి. ఆ పాఠశాలకు ఒక పర్యాయము శ్రీ దివాన్ బహద్దుర్ ఆరావముదు అయ్యంగారిని ఒక పర్యాయము శ్రీ కాళేశ్వరరావు పంతులు గారిని తీసికొని వెళ్ళి చూపించి వారితో సదభిప్రాయములు వ్రాయించితిని. వారు నా కోరిక ననుసరించి సంస్కృత భాషతోపాటు వృత్తి విద్యయనబడు ఆయుర్వేదమును కూడ నేర్పుట లాభదాయకమని అభిప్రాయములలో వ్రాసిరి. ఆ పాఠశాల యిప్పటికిని మంచి స్థితిలోనే నడచుచున్నదనుటకును నేను సేవ చేయకున్నను సంతోషించు చున్నాను.

## రామలింగేశ్వరాలయములోని సంస్కృత పాఠశాల – రామన్నపేట

వరంగల్ వర్తకుల సహాయముతో శ్రీ ముదిగొండ శంకరశాస్త్రిగారు శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయములో ఒక సంస్కృత పాఠశాలను నడుపుచుండిరి. అది కొన్ని సంవత్సరముల వరకు నడచి సంస్కృత భాషా సేవ చేసి కొందరు విద్యార్థులను తయారుచేసి పరీక్షల కంపుచుండెను. దానికిని ఆకారపు నరసింగం గుప్తగారే స్వయంగాను వెళ్లి కనుక్కొనుచుండేవాడను. దీని చరిత్రను నేను వరంగల్‌లోని ప్రజాయత్త పాఠశాలల వరుసలో వ్రాసితిని. గాని నేను అందొక కార్యకర్తగా మాత్రము పనిచేయలేదు. పై చెప్పిన ఆకారపు చెన్నయ్యగారి నరసింగం సంస్కృత పాఠశాల నడుచుచుండగా ఒకరోజు శ్రీ చందాకాంతయ్యగారు నరసింగం గారి వద్దకు వచ్చి రెండు సంస్కృత పాఠశాలలను లీనముచేసి మీరు ధర్మకర్తగా నుండి ఒకే సంస్థను నడుపుట ఉచితమని చెప్పిరి. రెండు పాఠశాలల యొక్క ఆస్తిపాస్తులను నిలవ డబ్బును రాబోవు ఖర్చులను గురించి వివరముగా నేనును నరసింగం గారును, చందా కాంతయ్యగారును, శ్రీ వీరేశలింగ శాస్త్రిగారును చర్చించితిమి. తుదకు ఒక నిర్ణయమునకు వచ్చితిమి.

1. నూతనముగా ఏర్పడు కళాశాలకు రామలింగేశ్వరస్వామి దేవాలయములో సంస్కృత పాఠశాల యొక్క నిలవడబ్బును, ఆస్తులను, విరాళముల బాకీలను వప్పగింత పెట్టవలెను.

2. ఆకారపు నర్సింగంగారు 5000/– రూపాయిలు ప్రతి సంవత్సరము పాఠశాలకు విరాళము యిచ్చుచుండవలెను.

3. నూతన సంస్థ శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల అనే పేరుతో నడపబడును. అంతకు పూర్వము నడుపబడుచున్న ఆకారపు చెన్నయ్యగారి నర్సింగం వైదిక పాఠశాల యిందులో లీనము చేయబడవలెను.

4. శ్రీ నర్సింగంగారు అనువంశికముగా వ్యవస్థాపకులు (ధర్మకర్త) అనే పేరుతో వాడబడుదురు.

5. సంస్థ వ్యవహారములు నిర్వహించుటకు ఒక పాలకవర్గము ఏర్పాటు చేయవలెను. శ్రీ నర్సి,గంగారు జీవితాంతము వరకు అధ్యక్షులుగా నుండెదరు. యీ విషయములన్నిటిని శ్రీ నర్సింగంగారు ఆమోదించిరి. పైన చెప్పినట్లు అంతకు పూర్వము దేవాలయ ఆదాయము నుండి సంవత్సరము 1కి 2800/– రూపాయీలు సంస్కృత పాఠశాలకు కేటాయించి ఈయబడుచుండెను. అది చాలదు

గనుక నర్సింగంగారు తమ యొక్క లూజు గోదామనే ఒక యింటిలోని 0-11-0 అణాల భాగమును యిచ్చెదమనియును, దానివలన సంవత్సరమునకు 2200/ రూపాయిలు ఆదా వచ్చుననియు చెప్పిరి. ఆ ప్రకారం లూజ్‌గోదాలో ఉమామహేశ్వరస్వామి కొరకు నిర్దేశించబడిన 0-5-0లు భాగముగాక తక్కిన 0-11-0 భాగము ట్రస్టెడ్ ద్వారా విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలకు దత్తము చేయబడెను. ఈ దస్తావేజు నేనే వ్రాయించి రిజిష్టరి చేయించితిని.

## శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల - వరంగల్

శ్రీ ఆకారపు నరసింగంగారిచే పేర్కొనబడిన సభ్యులను ఆహ్వానించి నరసింగం గారి యింటిలోనే విరోధి సంవత్సర పాల్గుణ బ 10లకు సరిఅయిన ది. 16-3-1950 సాయంత్రం 5 గంటలకు సభ జరిపి కళాశాల కార్యభారమును క్రమబద్ధమైన పాలకవర్గమునకు వప్పగింత పెట్టబడెను. అందు శ్రీ నరసింగంగారు అధ్యక్షులుగాను నేనుపాధ్యక్షునిగను శ్రీ ముదిగొండ వీరేశలింగశాస్త్రిగారు కార్యదర్శిగను, శ్రీ తాండ్ర వెంకట్రామనర్సయ్య గారు సహాయ కార్యదర్శిగను నియమితులమయితిమి. మొదట పాలకవర్గములో శ్రీ యఱ్ఱబల్లి వెంకటేశ్వరరావు, కొండూరు రామలింగం చందా కాంతయ్యగార్లు మరికొందరును ఉండిరి. నేను పాలకవర్గ నియమావళి సిద్ధము చేసితిని. హైద్రాబాదు స్న 1350 ఫసలీ 1వ శాసనం ప్రకారం ది. 8-6-1950 సంవత్సరం తేదీన రిజిష్టరు చేయించితిమి. అనతి కాలముననే అనగా ది. 9-7-1950 సంవత్సరం తేదీన శ్రీ కొండా వెంకటరంగారెడ్డి (కాంగ్రెసు అధ్యక్షుడు) గారి ఆధ్వర్యమున అప్పటి విద్యాశాఖామంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారిచే అతి వైభవముగా ప్రారంభోత్సవము జరిపించితిమి. ప్రపంచ పరిస్థితుల ననుసరించి అడుగంటుచున్న ప్రాచీన విద్యలనుద్దరించుట కర్తవ్యమనుకొని ఈ సంస్థ మూలమున యీ క్రింది ఉద్దేశ్యములను నెరవేర్చ వలెననుకొంటిని.

1. సంస్కృతాంధ్ర హిందీభాషలను వృద్ధిపరచుట.

2. వేదశాస్త్రములను ప్రోత్సహించుట.

3. ఉదరపోషణార్థకమగు సాంకేతిక విద్యను అనగా ఆయుర్వేద విద్యను ప్రోత్సహించుట.

1920 సంవత్సరంలో త్రిలింగాయుర్వేద విద్యాపీఠమును సంస్కృత పాఠశాల, ధర్మ వైద్యశాలను స్థాపించి విఫల మనోరథుడనైతినని పైన వ్రాసియే

యున్నాను. కోరికె అంతరించి పోలేదు గనుక పైజెప్పిన 3వ ఉద్దేశ్యమును కూడా చేర్చగలిగితిని. సంస్కృత కళాశాల స్థాపనానంతరము ఆయుర్వేద విద్యాభి వృద్ధికి ఒక శాఖను వేరుచేసి ఒక వైద్యపండితుని నియమించి శిక్షణ యిప్పించవలయు ననియును దానితోపాటు ధర్మవైద్యశాలను కూడా స్థాపించి నడుప వలయు ననియును నర్సింగం గారికి కొన్ని పర్యాయములు చెప్పితిని. గాని ఆయన ఆరోగ్యము నానాటికి క్షీణించుచూ వచ్చి తుదకు స్వరభంగము గలిగి మాటలను ఉచ్చరించలేక నిశ్చేష్టుడు కావలసి వచ్చెను.

## కళాశాల వ్యవస్థాపకుని పరలోకప్రాప్తి

పై వ్రాసినట్లు ఆకారపు నరసింగంగారికి వ్యాధి ప్రబలము కాజొచ్చెను. ఆయనకు యింకెన్నియో భావములు వుండెను గాని ఆయనకు వాటిని వెలిబుచ్చుటకు కూడా శక్తి లేకపోయెను. తుదకు నేను గ్రామాంతరమున నున్నరోజున అనగా ది. 16-9-1951 తేదీన దివంగతుడైనారని విచారముతో తెల్పుచున్నాను.

## ధర్మకర్త కుటుంబము

నరసింగంగారు జీవించియుండగానే ఒక పిల్లవానిని దత్తుచేసుకొని ఆయనకు రాజ చెన్నవిశ్వేశ్వరరావు అని నామకరణము చేసెను. ఆ పిల్లవానికి ఉపనైన వివాహములు కూడా చేసెను. గాని దత్తుకుమారుడు మైనరుగా నుండెను. పెద్ద భార్య శ్రీమతి అనంతలక్ష్మమ్మ, చిన్నభార్య సుశీలాదేవి వుండిరి. నరసింగం గారు సుశీల అను ఒక పిల్లను తెచ్చి పెంచి చకిలం నాగభూషణరావుకు యిచ్చి వివాహము చేసెను. కుమారుడు మైనరగుట చేతను భార్యలు వ్యవహారా లనుభవము లేనివారగుట చేతను నరసింగంగారితో సంబంధించి వర్తక వ్యాపారములు దేవాదాయ ధర్మాదాయ విషయములు నాగభూషణరావు పర్యవేక్షణలోనే జరుగుచుండెను. సంగెం రామచంద్రం పాత మునీమున్ను శ్రీ జూపూడి నరసింహారావు అనే పెట్రోల్ యేజన్సీ వ్యవహర్తయు పని చేయుచుండిరి. కొన్ని రోజులు గడచిన తరువాత నాగభూషణరావు, నరసింహారావు, రామచంద్ర ములతో నేనును వీరేశలింగ శాస్త్రిగారున్ను ముదిగొండ చినవీరభద్రయ్యగారున్ను ఆయుర్వేద శాఖ స్థాపించుటకొరకు ప్రసంగములు చేయుచుంటిమి.

శ్రీ నరసింగంగారు కాలంచేసిన తరువాత పాలకవర్గమువారు నన్ను అధ్యక్షునిగా యెన్నుకొనిరి. కొంత కాలమునకు వారి భార్యలుకూడా ఆమోదించి

నెల 1కి రు.100/-లు అధికముగా విరాళము యిచ్చుటకు అంగీకరించిరి. ఆ కారణమున 31-1-1952తేదీన శ్రీమాన్ వేదాంత తిరుమల రామానుజస్వామి వారిచే ప్రారంభోత్సవము చేయించబడి ఆయుర్వేద పాఠశాలయు శ్రీ ఆకారపు నరసింగం ధర్మ వైద్యశాలను స్థాపించితిమి. ఆ సభలో హైద్రాబాదులోని ప్రముఖ వైద్య పండితులు హకీం నారాయణదాసుగారు కూడా పాల్గొనిరి. ఆయుర్వేద శాఖను నిర్వహించుటకు శ్రీహరి సూర్యనారాయణ శాస్త్రీగారిని వైద్యునిగాను, అధ్యాపకునిగాను నియమించితిమి. ఆయన రోగులకు చికిత్స చేయుచు, విద్యార్థులకు శిక్షణ యిచ్చుచుండెను. ప్రతి సంవత్సరము ఆయుర్వేద విద్వాన్, బిషగ్, ఆచార్య పరీక్షలకు విద్యార్థులను పంపుచుంటిమి. యింతేగాక వరంగల్‌కు 8 మైళ్ల దూరమున నున్న అయినవోలు గ్రామంలో శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయ ముండెను. దానికి ప్రతి సంవత్సరము సంక్రాంతి మొదలుకొని రెండు మాసముల వరకు జాతర జరుగుచుండెడిది. వేలాది జనులు వచ్చి పోవుచుండేవారు. అచ్చట యాత్రికులకు వైద్యసహాయము యేమియు లేదని గ్రహించితిమి. శ్రీ సిద్దంశెట్టి రామనాధంగారి వలన 100/-లున్ను, మరికొందరిచేత విరాళములున్ను పోగుచేసి హరి సూర్యనారాయణశాస్త్రి గారిని ఔషధముల యుక్తము అయినవోలునకు నేనును వీరేశలింగశాస్త్రి గారును తీసుకొనివెళ్లి 1953 సంవత్సరం జనవరి 13 నుండి తాత్కాలిక ఆయుర్వేద చికిత్సాలయము స్థాపించితిమి. ఆరోజు డిప్టికలెక్టరు తహశీల్దారు ఆరోగ్య శాఖాధికారి దేవస్థాన పాలకవర్గం ఆ వేడుకలో పాల్గొనిరి. ఒక యింటియందు వారం రోజులపాటు చికిత్సాలయం ఉంచి దాదాపు 400 మంది యాత్రికులకు అవసర చికిత్స చేయించితిమి. యిదే విధముగా విరాళములు పోగుచేసి ప్రతి సంవత్సరము ది. 31 జనవరి నుండి వారం రోజులపాటు తాత్కాలిక చికిత్సాలయము ద్వారా మూడు నాలుగు వందల మంది యాత్రికులకు అవసర చికిత్సలు చేయించుచుంటిమి. ఈ విధముగా 4 సంవత్సరములు సేవ చేసితిమి. ఆ సంవత్సరములలో అధికార చికిత్సాలయము పంపబడలేదు. స్థానిక దినమున మా ఆహ్వానముపైన కలెక్టరు మొదలగు అధికారులు వచ్చి పాల్గొనేవారు. సదభిప్రాయములను వ్రాయుచుండేవారు. ప్రభుత్వ పక్షమున గాని దేవస్థాన పక్షమునగాని ఆర్థిక సహాయముచేసి ప్రోత్సహించి యుండలేదు. దేవస్థానమునకు యాత్రికుల వలన సంవత్సరం 1కి 20 వేల రూపాయిలు ఆదా వచ్చుచుండెడిది. ఆ కాలమున ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖలలో నేను సలహాసంఘ సభ్యుడనుగా నుంటిని. కొన్ని పర్యాయములు దేవస్థానాధికారులను దేవాదాయ శాఖాధికారులను సహాయం చేయించమని హెచ్చరించితిని. కార్యకాదికాలేదు.

సంస్కృత కళాశాల ప్రతిష్ట దినదినాభివృద్ధి చెందజొచ్చినది. శ్రీ వీరేశలింగ శాస్త్రిగారు ఒక్కరేయగుట వలన ఒక వ్యాకరణ పండితుడు కొంకా విశ్వనాధశాస్త్రి గారిని అధ్యాపకులుగా నియమించితిమి. తర్వాత యింకొక సంస్కృత పండితుడు కొన్ని రోజులు పనిచేసెను. అంతకుపూర్వము హైద్రాబాదు సీతారాంబాగ్‌లోని సంస్కృత పాఠవాల ఒక్కటియే ప్రభుత్వాదరమును బడసి గ్రాంటును పొందు చుండెను. అంతేగాక ఆ కళాశాలను ఉస్మానియా యూనివర్సిటీవారు రికగ్నైయిజు (అనుబంధము) చేసుకొనిరి. వేమును ప్రభుత్వ సహాయమును అభ్యర్థించుచుంటిమి. ప్రభుత్వము వారు మొదట 1-7-54 నుండి సంవత్సరము 1కి రు. 1200 చొప్పున గ్రాంటు యిచ్చుట కంగీకరించిరి.

## ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధము

హైద్రాబాదు ప్రభుత్వమునగల సంస్కృత పాఠశాలలో విశ్వేశ్వర సంస్కృ తాంధ్ర కళాశాల రెండవస్థానము నాక్రమించుటచే ఉస్మానియా యూనివర్సిటీవారు దీనిని రికగ్నైజు చేసుకొని సంస్కృత విద్యాశిక్షణకు 22-6-55వ తేదీనను ఆంధ్ర విద్యాశిక్షణ ది. 1-1-2-1955వ తేదీనను అంగీకరించి యున్నారు. యూనివర్సిటీ ఆదేశానుసారము సంస్కృతములోను ఆంధ్రములోను ఎంట్రన్సు డిప్ ఓ.ఎల్., బి.ఓ.ఎల్. తరగతులకు శిక్షణ యీయ బడుచున్నది. ఈ విధముగా ప్రతి సంవత్సరం విద్యార్థులకు శిక్షణ యిచ్చి పరీక్షల కంపబడుచున్నారు. వరంగల్ ప్రభుత్వ కళాశాలలోనే సంస్కృతాంధ్ర పరీక్షలుకూడా జరుగుటకు కేంద్రము నిచ్చియున్నారు. తర్వాత ప్రభుత్వమువారు ది. 1-5-1956 నుండి సంవత్సరము 1కి రు. 2200/-లు గ్రాంటును యిచ్చుచుండిరి. తరువాత 1958 నుండి సంవత్సరం 1కి రు. 5120 ల చొప్పున గ్రాంటు యిచ్చుటకు అంగీకరించి యున్నారు. ఈ కళాశాలలో శిక్షణపొందు బీదవిద్యార్థులలో దాదాపు 20 మందికి ఉచిత భోజనము యిచ్చుచు అవసరమైనంత మంది విద్యార్థులకు నివసించుట వసతి కూడా కల్పించబడుచున్నది.

## ఆయుర్వేద శాఖ

సంస్కృత విద్యతో అవినాభావ సంబంధము గల ఆయుర్వేద విద్యలోగూడ శిక్షణ యిచ్చుచు విద్యార్థులను పరీక్షల కంపుచున్నట్లు పైన వ్రాసితిని. ఈ విద్యార్థుల సంఖ్య కూడ నానాటికి పెరుగుతూ వచ్చినది. 1958వ సంవత్సరం నాటికి

పరీక్షకు వెళ్లిన విద్యార్థుల సంఖ్య 18 వరకు పెరిగినది. ప్రభుత్వము వారికి మా కృషిని తెలుపుచూ సహాయము కోరుచుంటిమి. వారు 1956వ సంవత్సరం నుంచి సంవత్సరం 1కి రు. 720 చొప్పున యిచ్చుట కంగీకరించిరి. త్రిలింగాయుర్వేద విద్యాపీఠము అంతరించినను యీ విధముగా ఆ సంస్కృతాంధ్రాయుర్వేద విద్యసేవ చేయుటకు కొంత అవకాశము లభించినది. 1959వ సంవత్సరంలో మందులకొరకు నెల 1కి 20 రూపాయిలు చొప్పున యిచ్చుటకు కూడా ప్రభుత్వమువారు అంగీకరించిరి. అనంత లక్ష్మి ఆయుర్వేద కళాశాల స్థాపింపబడిన తరువాత సంస్కృత కళాశాలను బంధమగు ఆయుర్వేద శిక్షణా శాఖను ఉంచడమా తీసివేయడమా అనే సమస్య ఉత్పన్నమైనది. అనుభవజ్ఞులగు శ్రీమాన్ తిరుమల వేదాంతరామానుజస్వామి గారితోను మరికొందరు ఆయుర్వేద పండితులతోను చర్చించి వారి అభిప్రాయమును తీసికొంటిని.

1. అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాలలో ప్రవేశించు విద్యార్థులు మెట్రుక్యులేషన్ పరీక్షలో విధిగా ఉత్తీర్ణులయి యుండవలెను. అందు ఇంగ్లీషు లేకుండా కేవలము ఆంధ్ర సంస్కృతి విద్యలు మాత్రమే నేర్చిన వారికి అవకాశములు లేవు. మా విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల ఆయుర్వేదశాఖలో శిక్షణ పొందుటకు ఏ పరీక్షల నిర్బంధములేదు.

2. బెజవాడ నుండి చిరకారము నుండియు ఒక విద్యాపీఠము ఉండి వైద్య విద్వాన్ పరీక్షలు చేయుచు పట్టములనొసంగుచున్నారు.

ఢిల్లీలోని అఖిల భారతాయుర్వేద విద్యాపీఠము నుండి బిషక్ ఆచార్య అనే పరీక్షలు జరుపుచు పట్టముల నిచ్చుచున్నారు.

ఆయుర్వేద విద్వాన్, బిషక్, ఆచార్య బిరుదముల నందినవారు వైద్యపండితులుగా పరిగణింపబడుచును శాస్త్రీయమైన ఆయుర్వేద వైద్యమును చేసి ప్రజాసేవ చేయుచున్నారు. వీరి అర్హతలను గమనించి గ్రామ వైద్యశాలలో వైద్యులుగా నియమింప బడుచున్నారు.

అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాలలో ఆంగ్లేయ వైద్యశిక్షణ కొంతవరకు ఆయుర్వేద వైద్యశిక్షణ కొంతవరకే గనుక రెండు వైద్యములు అసమగ్రములుగా నుందు ననియును ఆయుర్వేదము వారికి పూర్తిగా రానందుచే వారు ఆంగ్లవిధానమే మంచిదనియు ఆయుర్వేద పండితులవాదము. పై మూడు పరీక్షలు జరుపుటకు వరంగలులో పరీక్షా కేంద్రము కూడా ఏర్పాటు అయినది. ఈ కారణమును బట్టి ఆయుర్వేదశాఖను యథాతథాగా నుంచి శిక్షణ యిప్పించుచున్నాము.

రెండు సంవత్సరముల క్రితము గ్రామీణ వైద్యులకు అత్యవసర విషయములను బోధించుటకు ఒక శిక్షణా తరగతినేర్పాటు చేసి 4 మాసములు శిక్షణ యిప్పించితిమి. ఉత్తీర్ణులైన వారికి ఆయుర్వేద మండలివారు ధృవపత్రములు కూడా యిచ్చియున్నారు.

శ్రీ డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారు మొదలగు నాయకులు నడపుచున్న ఆయుర్వేద మహామండలి ఉద్దేశ్యములను నెరవేర్చుటకు యింకెన్నియో విధములగు ఆయుర్వేద విద్యప్రచారము జరుగవలసి యున్నది. మరియు మూలికా క్షేత్రము వస్తుపరిశోధనాలయము స్థాపించవలసి యున్నది. అందుకు వరంగలు అనుకూలముగా నుండునని గట్టిగా చెప్పవచ్చును.

## కౌన్సిల్ ఆఫ్ సంస్కృత ఎడ్యుకేషన్

సంస్కృత విద్యాభివృద్ధి కొరకు హైద్రాబాదులోని కొందరు ప్రముఖ విద్యాభిమానులు ఒక సమితి నేర్పాటు చేసిరి. దానికి 'కౌన్సిల్ ఆఫ్ సంస్కృత ఎడ్యుకేషన్' అని పేరుపెట్టిరి. దానిలో అప్పటి ఆంధ్రరాష్ట్ర మంత్రి కల్లూరు చంద్రమౌళిగారును, హైద్రాబాదు ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారును, నరసింహయ్యంగార్ అడ్వొకేటు గారును ఎక్కువ శ్రద్ధ తీసుకొనుచుండిరి. ఈ సంస్థకు అత్యధిక మేధావియైన శ్రీ సౌందర రాజన్ అయ్యంగారు కార్యదర్శిగా పని చేయుచున్నారు. దోమలగూడలో మహాదాత సహాయముతో బాలాజి భవన మనుపేర ఒక మందిరము నిర్మాణము చేయబడెను. సీతారాంబాగ్‌లోని సంస్కృత కళాశాల మొదట ఈ భవనమునకు మార్చబడెను. యిప్పుడు మరల స్వస్థానమునకే చేర్చబడినది. ఈ కళాశాలకును తిరుపతి మందిరమునకును శ్రీ అయ్యంగారే ఆధ్వర్యము వహించుచుండిరి. వారు నాకు చిరకాల మిత్రులగుటచే వారిని మధ్యమధ్యన దర్శించుచుంటిని. మా సంభాషణలలో వారు తమ ఉద్యమ మూలమున ఎన్నియో సంస్కృత పాఠశాలలను స్థాపించి సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేయుచున్నామని చెప్పుచుండిరి. నేనధ్యక్షుడుగా నున్న వరంగల్ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలకు ప్రభుత్వ సహాయము విరివిగా లభించలేదని వారితో చెప్పితిని. వారు తమ సంఘము ద్వారా సహాయము చేయించెదమని నాతో చెప్పిరి. వారికిని నాకును ఉత్తర ప్రత్యుత్తరములు జరుగుచుండెను. నేను సహాయము కోరినట్లే సింహాద్రిబాగ్ వైదిక కళాశాల పక్షమున గూడ కౌన్సిల్‌వారిని సహాయము కోరిరి. అయ్యంగార్ కౌన్సిల్ పక్షమున మొదట శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారిని, ఇన్‌స్పెక్టరు రంగాచారిని విచారణార్థము పంపిరి. వారు

నాతోను వైదిక కళాశాల కార్యదర్శి రామానుజాచార్యుల గారితోను మాట్లాడిరి. రెండు సంస్థలను యేకము చేయవలెనని కూడ వారు ప్రయత్నించిరి. ఒకరోజు హనుమకొండ శ్రీ రాజరాజనరేంద్రాంధ్ర భాషానిలయమున కొందరు విద్యాభిమానుల నాహ్వానించి మాట్లాడిరి. శ్రీ రామానుజాచార్యులవారు తమ కృషి వలన యింతవరకు తీసుకొనివచ్చిన కళాశాలను విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో లీనము చేయుటకు సమ్మతించక పోయిరి. శ్రీ కీ.శే. ఆకారపు నర్సింగం గారి దాన పత్రములు రిజిష్టరీ చేయబడినవి. చట్టబద్దమైన కళాశాలను నియమావళికిని ధర్మకర్త ఆదేశములకును విరుద్దముగా అధ్యక్షాధికారముతో ఈ కళాశాలను సింహాద్రిబాగ్ కళాశాలకు ఒప్పగింత పెట్టుటకు నా కధికారము లేదంటిని. వా రుభయులు రెండు మూడు రోజులు యిక్కడ మకాం చేసిరి. ఆ సందర్భమున మా కళాశాల విద్యార్థులచే "భోజచెంపు" అనే ఏకాంకిక సంస్కృత నాటకమును ప్రదర్శింప చేసితిమి. వారు సంతోషించిరి. ఆ విద్యార్థులలో ఎక్కువ మంది వైష్ణవ విద్యార్థులే యుండిరి. నేను వచ్చిన పెద్దలతో ఈ కళాశాలలో శైవ, వైష్ణవ మొదలగు మతభేదములు లేకుండ విద్యార్థుల కందరికి అవకాశ మిచ్చుచున్నామని నమ్మకము కలుగ జేసితిని. వాస్తవముగా విద్యార్థులలో స్మార్తవ, శైవ, వైష్ణవ, బ్రాహ్మణులును, సాతాని, తెలగ, కమ్మ, రెడ్డి, విశ్వబ్రాహ్మణ కులము వారును విద్య నభ్యసించు చుండిరి. దీని తరువాత మాకింకను కౌన్సిల్ వారి వలన సహాయము లభించునని కోరిక యుండెను. నేను సౌందరాజన్ అయ్యంగారితో కలిసినప్పుడల్లా రెండు పాఠశాలలకు కూడ విరివిగా గ్రాంటు యిచ్చుటకు అవసరమని చెప్పుచు వ్రాయుచుండేవాడను. వారు నాకొక సలహా నిచ్చిరి. విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల చట్టబద్ధమై యూనివర్సిటీచే రికగ్నైజు కాబడి నడచుచున్నది. గనుక మీరు ఆకారపు నరసింగం హైస్కూలు పేరుతో హైస్కూలును వేరుగా ఏర్పాటు చేయమనిరి. మేమును అట్లే ఆకారపు నరసింగం సంస్కృత ఉన్నత పాఠశాల పేరుతో వేరుగా కొందరి ఉపాధ్యాయులతోను, విద్యార్థులతోను ఏర్పాటు చేసితిమి. దానికి శ్రీకర వది రామకృష్ణారావు గారిని ప్రధానోపాధ్యాయులుగా నేర్పాటు చేసితిమి. ది. 22-8-1957 తేదీన సౌందర రాజన్ అయ్యంగార్ తానే వచ్చి ఏదేని నిర్ణయము చేసెదనని రూఢిగా తెలిపెను. ఆనాటి సమావేశము శ్రీ హైగ్రీవాచారి గారి యింటియందు సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేయబడెను. నేను మా పాలకవర్గ సభ్యులందరిని ఆహ్వానించితిని. అట్లే రామానుజాచార్యులుగారు కూడా వారి సంఘ సభ్యులను ఆహ్వానించెను. ఆ సభలో ఏదేని నిర్ణయము జరుగునని తలంచి మనస్సులో

ప్రాముఖ్యతనిచ్చి నేను తప్పక ఉండి తీరవలెననుకొంటిని. ఆ రోజు ఉదయమున ఖమ్మంలో నా పెద్దకోడలు అకస్మాత్తుగా చనిపోయినదని టెలిఫోను వార్త వచ్చెను. వెంటనే నా రెండవ కుమారుని భార్యను నా భార్యను పంపివేసితిని. నేను సభలో పాల్గొంటిని. శ్రీ అయ్యంగార్ ఒక కేంద్రకమిటీ (సమితి) నేర్పాటుచేసిరి. అందు విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలపక్షమున నేను మా కార్యదర్శి గాను, వైదిక కళాశాల పక్షమున సీతారామాచార్యులు గారును సభ్యులుగాను, శ్రీ హైగ్రీవా చార్యులుగారు అధ్యక్షులుగా నుండవలెనని ఏర్పాటుచేసిరి. ఈ సంఘము మూడు పాఠశాలలకు తగు సహాయము సహకారము చేయవలెనని ఏర్పాటు చేయబడెను. అంతటితో సభ ముగిసినది. నేను రాత్రి 7 గంటల బండికి ఖమ్మం వెళ్లితిని. ఈ కేంద్ర సంస్థ ఏర్పాటైన తరువాత కౌన్సిల్ వారి విద్య ప్రణాళికను తెప్పించి చూచితిమి. దానిలో ప్రభుత్వ పాఠశాలలో వలెనే తరగతులు ఉంచి యింగ్లీషు, లెఖ్ఖ, చరిత్ర భూగోళములు చెప్పవలసి యున్నది. సంస్కృతమునకు ప్రాముఖ్య మీయబడినది. ఈ ప్రణాళిక ప్రకారము IV, V ఫారమునకు చదివిన విద్యార్థులను చేర్చుకొని ఎక్కువ మందికి బోర్డింగు యిచ్చుచు పై చెప్పిన ఉన్నత పాఠశాలను నడుపుచుంటిమి. కరవది రామకృష్ణారావుగారే గాక కొందరు పార్టుటైము ఉపాధ్యాయులను కూడ నియమించితిమి. గాని మూడు నాలుగు మాసముల తరువాత కౌన్సిల్ వారి వలన ఆర్థిక సహాయమును లభించదని రూఢిగా తోచినది. అందువలన నేను ఉపాధ్యాయులు శ్రీ రామకృష్ణారావుగారికి తటస్థించి క్లిష్ట సమస్యను తెలిపి విరమింప జేసితిని. తరువాత ప్రవేశించిన విద్యార్థులలో అర్హులగు వారిని ఆంధ్ర ఎంట్రన్స్ తరగతిలో శిక్షణ యిప్పించి పరీక్షకు పంపితిమి. తరువాత నాకును శ్రీ సౌందరరాజన్ అయ్యంగారికి ఉత్తర ప్రత్యుత్తరములు చాల జరిగినవి. వారు నెం. 336, 22-4-1958 తేదీగల లేఖ ద్వారా విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల యొక్క ఆస్తిపాస్తులను, నిలువ ధనమును మేనేజిమెంటును పూర్తిగా తమ కప్పగించినచో తామే బాధ్యత వహించి నడిపెదమని తెలిపిరి. అది ధర్మకర్త ఉద్దేశమునకు విరుద్ధము గనుక సాధ్యము కాదని తెలిపి మీరు కొంత గ్రాంటు యిచ్చినచో మీ ఆదేశానుసారము పాలకవర్గమువారు కళాశాలలను నడిపెదరని తెలిపితిని. సింహాద్రిబాగ్ వైదిక కళాశాలకు 6, 7 వేల రూపాయిలను, గీతా పాఠశాలకు రు. 3000 డబ్బున్నూ యిచ్చుచున్నారని తెలిసినది. మా కళాశాల నియమ నిబంధనలు కౌన్సిల్ వారి అభిమతమునకు విరుద్ధముగా యున్నందున కాబోలు యిట్లయినదని నే నూహించుకుంటిని.


ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటువారు ఓరియంటల్ భాషాభివృద్ధికొరకు ప్రయత్నము చేయుచున్నారు. అందుకు ఒక శాఖ ఏర్పడి దాని కార్యస్థానము కాకినాడ యందు ఏర్పాటు చేయబడినది. ఆ శాఖపక్షమున ఒక ఇన్‌స్పెక్టర్ పర్యటన చేయుచుంటారు. ఇన్‌స్పెక్టర్ శ్రీ మార్కండేయ శర్మ ఎం.ఏ. గారు మా సంస్కృతాంధ్ర కళాశాలను పరిశీలించిరి. ఈ విధముగా నడుపబడు కళాశాల ఈ ప్రాంతము నందెక్కడ లేదని సదభిప్రాయమును వ్రాసియున్నారు. తరువాత ప్రభుత్వము వారు 1958 సంవత్సరముల నుండి సంవత్సరం ఒక్కంటికి 5120/– రూపాయిలు యిచ్చుటకు అంగీకరించుట వలన కళాశాల నడుపుటకు కొంత ధైర్యము కలిగినది. అయినను క్రమాభివృద్ధి నొందుచున్న ఈ కళాశాలను సర్వాంగ శోభితముగ వృద్ధిచేయుటకు ఈ సహాయము లభించగలదని ఆశించుచున్నాము.

## సంస్కృత భాషాభిమానము

ప్రజలలో ఆంగ్ల భాషయందు ఎంత వ్యామోహమో ప్రాచీన భాషయగు సంస్కృతమునందు అంత అభిమానము లేదు. కొందరు దీనిని మృత భాషయని కూడా ఆక్షేపించుచున్నారు. గాని సంస్కృత పాఠశాల దేవభాషయని భారతీయుల విశ్వాసము. వేదశాస్త్రములు ప్రాపంచిక పారమార్థిక విజ్ఞానము ఆ భాషయందే ఉన్నది. నేటికిని వేదశాస్త్రములు అంతరించిపోక యథాతథాగనే యున్నవి. అసంఖ్యాకులైన పండితులున్నారు. భారతీయులు ముఖ్యముగ బ్రాహ్మణులు శ్రౌత స్మార్తములను వదలివేయకుండా కాపాడుచున్నారు. గ్రంథములు లేని రోజులలో కూడా పద, క్రమజంట, ఘనపాఠముల మూలముగా వల్లెవేసి స్వర ఉదాత్తానుదాత్తములను పోనీయకుండ కాపాడుచున్నారు. అచ్చటచ్చట ప్రాచీన విద్యాభిమానులు గురుకులములు పాఠశాలలు పెట్టించి వేదశాస్త్రములలో శిక్షణ యిప్పించుచున్నారు. ఇది పుణ్య కార్యమని కూడా భావించుచున్నారు. ఇదియే కీ.శే. నరసింగంగారికి కలిగిన భావము. ఆయన తన దేవాలయమున ఏర్పాటు చేసిన సంస్కృత కళాశాలయు తదితర విద్యాసంస్థలు చూడగా దేవాలయమే గురుకులముగా కన్పట్టగలదు.

## ఆకర్షణ

పైన చెప్పినట్లు ఆంగ్ల విద్యాభ్యాసమునకై తల్లిదండ్రులు తమ పిల్లల కొరకు వేలకు వేలు ఖర్చు పెట్టుచున్నారు. గాని ప్రాచీన విద్యాభ్యాసమునకై ఖర్చు పెట్టు తల్లిదండ్రులు, పోషకులు కనిపించుటలేదు. ఆంధ్రదేశమున కొవ్వూరు, ఆకిరిపల్లి,



శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల వరంగల్‌లో శ్రీశ్రీ జగద్గురు శంకరాస్వాముల వారికి గ్రంథకర్త స్వాగతపత్రము సమర్పించుట

తెనాలి, గుంటూరు, తిరుపతి మొదలగుచోట్ల సంస్కృత కళాశాలలున్నవి. అచట విద్యార్థులకు ఉచిత విద్యయేగాక, ఉచిత భోజన వసతులు కూడా కల్పించవలసి వచ్చినది. యిదియే యీ కళాశాలలోను తటస్థించినది. ధర్మకర్త విరాళము, ప్రభుత్వ సహాయము, ఉపాధ్యాయుల జీతములకును, తదితర ఖర్చులకును చాలకుండుటచే దాతల నాశ్రయించితిమి. శ్రీ చందా కాంతయ్యగారు ఒక సంవత్సరము విద్యార్థులకు 1954 సంవత్సరం పూర్తిగాను, 55, 56 సంవత్సరము లలో కొంతభాగపు భోజన వ్యయమును భరించియున్నారు. ఇట్లే మరికొందరు దాతలు భోజన పదార్థములను కూడ స్వల్పముగ నిచ్చుచుండిరి. తరువాత యిట్టి సహాయము అతి స్వల్పమై పోయినది. ఈ పాఠశాలలో 1958, 59 సంవత్సరము లలో 22గురు విద్యార్థులకు ఉచిత భోజనవసతి కల్పించబడినది. నేటి కాలములో విద్య ఉదర పోషణార్థమునకే వినియోగింప బడుటచే ఆధునిక భాష, వైజ్ఞానిక విద్యలను అభ్యసించుచున్నారు. విద్యార్థులు మా కళాశాలలో ఎన్‌ట్రన్స్‌లోను D.O.L., B.O.L. పరీక్షలలోను ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణులగు టయు వారికి ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగములు లభించుటయు జరుగుచున్నందు నను, విశ్వకళాపరిషత్తు (యూనివర్సిటీ) వారి ఆజ్ఞానుసారము మా కళాశాలలో చదివి ఆంధ్ర ఉన్నత పరీక్షలలో ఉత్తీర్ణులగుటకు అవకాశమున్నందు వలనను, విద్యార్థులలో కొంతవరకు సంస్కృత మభ్యశించిన వారును కూడ ఆంధ్ర పరీక్షలకే వెళ్ళుచుండిరి. మేము సంస్కృత భాషయందు అభిరుచిని కలిగించుటకై యీ సంవత్సరము అనగా 1959, 60 సంవత్సరములలో సంస్కృతమున విద్యనభ్యసించు వారికి విధిగా భోజన సౌకర్య మేర్పరచుటయే కాక ఎంట్రన్సు విద్యార్థులకు నెల 1కి 3 రూపాయిల చొప్పు D.O.L. విద్యార్థులకు నెల 1కి 4 రూపాయిల చొప్పునను B.O.L. చదువు విద్యార్థులకు నెల 1కి 5 రూపాయిల చొప్పున బహూకరణమును యిచ్చెదమని కూడా ప్రకటించి ఆదాయ వ్యయ అంచనాలో చేర్చితిమి. మరియు స్మార్తవము జ్యోతిష్యము కూడా నేర్చుటకు అవకాశములు కల్పించబడు చున్నవి.

**ఆస్తి**

రామలింగేశ్వరస్వామి దేవాలయములోని సంస్కృత పాఠశాలను లీనము చేసికున్నప్పుడు కొంత నిలువ ధనము, కొన్ని విరాళములు, కొన్ని బాకీలు కూడా యీ సంస్థకు చెందజేయబడినట్లు చెప్పియున్నాను. మొత్తం మీద కొంత నిలువ ధనము రు. 10,000/-లు హోలీలు స్థిరాస్తి హామీపైన వడ్డీ కిప్పించితిమి. ఆ విధముగ వడ్డీ మూలమున కూడా కొంత ఆదాయము లభించుచున్నది.

## స్థిరాస్తి

విద్యావంతులు సంస్కృత విద్యాభిమానియు అగు శ్రీ యర్రబల్లి వెంకటేశ్వర రావుగారు తమ తాలూకు వరంగల్ ఖిల్లా గ్రామములోని 5 ఎకరముల భూమిని దానము చేసిరి. అందు మింజుమలె షుమారు 3 యకరముల భూమిని 1958 సంవత్సరం కట్టలు కట్టించి పల్లపు సాగు చేయించితిమి. అందువలన విద్యార్థుల భోజనమునకు కొన్ని వడ్లు లభించుచున్నవి. ఇవిగాక కీ. శే. శ్రీ కొమరవెల్లి కాశయ్యగారు రామన్నపేటలోని 750 గజముల భూమిని దానము చేసియున్నారు. ఇదిగాక వరంగల్ గ్రైన్ మార్కెటులో రెండు ప్లాటుల భూమియున్నది. ఈశ్వరాను గ్రహముననే యీ కళాశాల దినదినాభివృద్ధి గాంచి ఆంధ్ర సంస్కృతభాషను అభివృద్ధి చేయునని ఆశించుచున్నాను.

## ఆయుర్వేద విద్య

సంస్కృత పాఠశాలకు అనుబంధముగా ఆయుర్వేద ధర్మ వైద్యశాలను నడుపుచుంటిమని దాని వృత్తాంతమును పైన వ్రాసియుంటిని. భాషా ప్రయుక్త రాష్ట్రముల ఏర్పాటుతో పాటు హైద్రాబాదు రాష్ట్రము విచ్ఛిత్తు సందర్భమున ప్రతి శాఖలోని డబ్బును ఆయా ప్రాంతములకు పంచిపెట్టిరి. వైద్యశాఖలోని డబ్బులో తమ భాగపు డబ్బుతో నాందేడు నందొక ఆయుర్వేద కళాశాల నొకటి నేర్పాటు చేయించమని మహారాష్ట్రులు కోరియుండిరి. దానిని ప్రభుత్వ మంగీకరించెను. ఈ సంగతి మాకు తెలిసి నేనును శ్రీ ముదిగొండ వీరేశలింగశాస్త్రి గారును, శ్రీ తిరుమల వేదాంత రామానుజస్వామి గారితో సంప్రదించి ఒక విజ్ఞప్తిని ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారి వద్ద సమర్పించితిమి. వారు అంత ధైర్యముగ వాగ్దానము చేయలేకపోయిరి. గాని వెంటనే ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ నవాబ్ మెహద్దీ నవాజ్ జంగ్ గారితోను, సెక్రటరీ రామప్ప గారితోను సంప్రతించితిమి. వారు కొంత అనుకూలముగా మాట్లాడిరి. తెలంగాణ భాగపు ఆరోగ్యశాఖ సంబంధమైన డబ్బుతో మా విజ్ఞప్తిలో ఓరుగల్లు నందు హైద్రాబాదు నందు వలెనే ఆయుర్వేద కళాశాల స్థాపించినచో మా సంస్కృత కళాశాల పక్షమున యింటి వసతిని ఏర్పాటు చేసెదమని వారికి నమ్మకము కలుగ జేసితిని. ఇదేవిధముగా సింహాద్రిబాగ్ వైదిక కళాశాలవారును తెలంగాణా ఆయుర్వేద మండలివారును కూడా వరంగల్‌లో తమతమ అభిప్రాయాను సారముగా కళాశాల నేర్పాటు చేయుమని కోరిరి. మొత్తము మీద అందరును

వరంగల్ నందు కళాశాల కావలెననియే కోరుచుండిరి. అప్పుడు హైద్రాబాదుకు ఉపమంత్రిగా నున్న శ్రీ ఎం.ఎస్. రాజలింగం గారు చాల శ్రద్ధ తీసుకొనిరి. వారొక పర్యాయము వరంగల్‌కు వచ్చి మూడు పక్షముల వారిని ఆహ్వానించి సంధి ప్రయత్నము చేసెను. ఆయుర్వేద మండలివారును నగదు రూపకముగ చందాలను సమర్పించెద మనిరి. వైదిక కళాశాలపక్షమువారు స్థలము మాత్రము యిచ్చెద మనిరి. మా కళాశాల పక్షమున విశాలమైన నాలుగు గదులు గల ఒక భవనమును, మరికొంత స్థలమును యిచ్చి అవసరమైన నిర్మాణములను కూడ చేయించెదమని వాగ్దానము చేసితిమి. మొత్తము మీద ఆ సభలో విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలపక్షమున యీయబడు భవనములో ఆయుర్వేద కళాశాల నేర్పాటు చేయునటులను వైద్యమండలివారు చందాల నిచ్చునట్లును ఆమోదింపబడి అదేరోజున సంయుక్త సభ్యులుగల ఒక పాలకవర్గ మేర్పాటు చేయబడియే. దానికి వైద్య విద్వాన్ శ్రీ టి.నరసింహాచారిగారు అధ్యక్షులుగను, నేనును మరి ముగ్గురు కార్యవర్గ సభ్యులుగ నుండునట్లును తీర్మానింపబడెను. నేనును శ్రీ వీరేశలింగ శాస్త్రిగారును సాహసముతోను, విశ్వాసముతోను చేయబడిన యీ వాగ్దానమును ధర్మకర్తగారి పక్షమున పనిచేయుచున్న కీ. శే. తిరుమల రాజశేఖరయ్యగారు కూడా ఆమోదించిరి. తరువాత సంస్కృత కళాశాల సభ్యుల కోరికపైన అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాల అని పేరు పెట్టుటకు అంగీకరింప బడెను. తరువాత ఆరోగ్య శాఖామంత్రి శ్రీ మొహద్దిన్ నవాబ్ జంగ్ గారిచే ప్రారంభోత్సవము జరుపబడి అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాల స్థాపింపబడియె. ఈ కార్యవర్గ సభకు ఇండియన్ మెడిసన్ స్పెషల్ ఆఫీసరు అధ్యక్షులుగా నుండెదరు. వారి ఎదుటనే అర్హులగు ఉపాధ్యాయులు నియమింపబడిరి. ప్రతి సంవత్సరము 40 మంది విద్యార్థులను చేర్చుకొనుటకు అవకాశ మీయబడినది. యిప్పుడు నాల్గవ సంవత్సర పాఠములు ప్రారంభమైనవి. ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుచున్నది. దీనికి అనుబంధముగా ఔషధ కర్మాగారాము ఆయుర్వేద చికిత్సాలయము, శవ పరీక్ష గృహము ఏర్పాటు చేయబడినది. ఆకారపు అనంతలక్ష్మిగారి ఔదార్యముచే మొదట దత్తము చేయబడిన 4 గదులపైన విశాలమైన పై అంతస్థు నిర్మాణము చేయబడియే. దీనికి ఆకారపువారు దాదాపు రు. 20,000/–లు అధికముగ ఖర్చు పెట్టియుండిరి. 1950–60 సంవత్సరమునకు 50 మంది విద్యార్థులు చేర్చుకొనబడిరి. యిందులో తెలంగాణా జిల్లాలవారు 40 మంది వరకున్నారు. నేనాశించిన సంస్కృత విద్య, ఆయుర్వేద విద్యలు చెప్పబడిన కళాశాలలో నడుప బడుచు వాటికి సేవ చేయుటకు అవకాశము లభించినదని తృప్తిపడుచున్నాను.

ఈశ్వరుడు యీ సదుద్యమమును దినదినాభివృద్ధి గావించ వలయునని ప్రార్థించు చున్నాను. ప్రాణముండి బుద్ధి శరీరములు పనిచేసి నంతవరకు సేవ చేయవలెననియే నా ఆశయము. అది ఈశ్వరేచ్ఛ.

* * *

*ప్రకరణము - 21*

# దేవాదాయ ధర్మాదాయ సలహా సంఘము

నిజాం ప్రభుత్వ కాలమున ఉమూరె మజహబి మత విషయశాఖ అనే పేరుతో ఒక డిపార్టుమెంటు హోంమంత్రితో సంబంధము కలిగి యుండెడిది. వెల్లోడి ప్రధాని కాలమున 1950 సంవత్సరముల ఆ శాఖకు రివిజన్ బార్టబుల్ పబ్లికు ఎండోమెంట్సు అనే పేరు పెట్టబడెను. అది రివిన్యూ మంత్రి శ్రీ రామకృష్ణారావుగారి ఆధీనమున నడుపబడు చుండెను. వారు శ్రీ బావరాజు కృష్ణారావుగారిని స్పెషల్ ఆఫీసరుగా నియమించిరి. 3గురు అధికారును, 23గురు అనధికార సభ్యులతో ఒక సలహా సంఘము నేర్పాటుచేసి ఈ సభ్యులు వారిచే పేర్కొనబడిన వారే అయి యుండిరి. అందు నేనొక సభ్యుడనుగా నియమించబడితిని. నాకు ది. 15 నవంబర్ 1950 సంవత్సరం లేఖ ద్వారా తెలియపరచిరి. మంత్రిగారే అధ్యక్షులుగా నుండిరి. 2 మాసముల కొకతూరి ఐనను సంఘ సమావేశము జరిగి ముఖ్య విషయములు తీర్మానించ బడుచుండెను. మత మందిర నిర్మాణముల కును, ఉత్సవములు, ఊరేగింపులకును అనుజ్ఞ పొందవలె ననెడి ఉత్తరువును తత్సంబంధమైన వేరిన నియమములను రద్దుచేసిరి. మరియు చిత్తుశాసనము తయారు చేయుట కొక (లీగల్ సబ్‌కమిటీ) ఉపసంఘము నేర్పాటు చేసిరి. దానికి నన్నును, శ్రీ శంకర్రావుబోల్ గావున్‌కర్, శ్రీ మెట్టాలక్ష్మీ నరసయ్య, నవ్వాబ్ నాజర్‌యార్ జంగు రిటైర్డు హైకోర్టు జడ్జి, శ్రీ వలీఉల్లా హుస్సేని (గుల్బర్గా దర్గా) ధర్మకర్తగార్లును నియమించి హైద్రాబాదు నియమ నిబంధనలను దృష్టి యందుంచి నూతన శాసనములను తయారు చేయుటకు ఆదేశించిరి. తరువాత

ఉపసంఘ సమావేశము కొరకు తక్కిన సభ్యులకు తెలుపబడెను. ముస్లిం సభ్యులు ఏ సమావేశమునకు రాలేదు. శ్రీ లక్ష్మీ నరసయ్యగారు చిత్తుబిల్లు వ్రాయుటకు నాకును శంకరరావుగారికిని అధికారమిచ్చి స్వరూపము తయారైన తరువాత చూచెదననిరి. ఆ ప్రకారము నేను కొన్ని సెక్షనులు తయారుచేయుచు సెలవు రోజున పట్నంవెళ్లి శ్రీ శంకరరావుగారికి వినిపించుచు అవసర సవరణలు చేసికొనుచు వారి ఆదేశములను తీసుకొనుచు 6 మాసములలో చిత్తుబిల్లు ఉరుదు భాషలో తయారుచేసితిని. హైద్రాబాదు శాసనము 16 సెక్షనులలో దస్తూరుల్ అమలు (ఆర్డినెన్సు) పేరుతోను 405 సెక్షనుతో భి వాయద్ (నిబంధనలు) పేరుతోను ఉండెను. వాటిలోను మద్రాసు యెండోమెంట్సు పాత క్రొత్త శాసనముల తోను సహాయము తీసుకుంటిని.

ఆ రోజులలో శ్రీ రమణారావు ఎం.ఏ.బి.ఎల్. కూడా ఉద్యోగిగా నియమింపబడెను. అనాయాసముగా ఆయన బొంబై ట్రస్టు ఆక్టును దృష్టిలో నుంచుకొని ఒక చిత్తుబిల్లు ఇంగ్లీషులో వ్రాసి కమీషనరు కందజేసెను. అటు తరువాత భావరాజు కృష్ణారావుగారు కూడా అనాయాసముగా ఒక చిత్తుబిల్లు వ్రాసియిచ్చిరి. నా బిల్లులోని సగభాగము ముందుగానందచేసితిని. దానిని వినుటకు రివిన్యూ బోర్డు సెక్రటరీ రామలాల్ గారు కొన్ని తారీఖులలో శ్రమచేసిరి. ఈ మధ్య కాలములో రెండవ భాగపు చిత్తు తయారు చేసితినిగాని అది బెజవాడ ప్రయాణములో పోవుటయు వారం పది రోజులు శ్రమపడి మరల వ్రాయుటయు జరిగినది. శ్రీ రామలాల్గారు నా చిత్తుబిల్లును తన విద్యుక్తమనుకొనియును నా యందుగల ఆదరాభిమానములతోను సాంతము వినిరి. నా చిత్తుబిల్లులో దేవ స్థానములలోను దానికి ఒక ఫర్లాంగు దూరములోను జంతుబలి చేయకూడదని కొన్ని సెక్షనులలో వ్రాసితిని. శ్రీ రామలాల్ గారు నవ్వుచూ మీరు బ్రాహ్మణులు గనుక ఈ నిషేధమును పెట్టియున్నారు. తక్కిన కులమత వర్ణములవారు ఏకీభవించెదరా? అని ఛలోక్తిగా అనిరి. హింసాకాండను పవిత్ర దేవస్థానములలో నిషేధించుట అన్ని మతములవారికి అవసరమని నేను చెప్పితిని. బిల్లుపైన శంకర్రావు లక్ష్మీనరసయ్యగార్లు నేనును సంతకములు చేసితిమి. గాని ముస్లిం సభ్యులు సంతకము చేయలేదు.

మధ్యకాలములో ఎన్నికలు జరిగి పూర్తిగా ప్రజా ప్రభుత్వము వచ్చినది. శ్రీ రామకృష్ణారావుగారు ముఖ్యమంత్రిగా ఎన్నుకొనబడిరి. శ్రీ రంగారెడ్డిగారు రివిన్యూ మంత్రిగా ఏర్పాటు అయినందున దేవాదాయ శాఖను వారి ఆధీనము

చేయబడెను. నా బిల్లు కాజిపేట సభ్యుల కందజేయుటయు ఇంగ్లీషులో భాషాంతరీకరణము జరిగినది. శ్రీ రంగారెడ్డిగారి మంత్రిత్వ కాలమున సలహా సంఘమును ఆహ్వానించి బిల్లుపైన చర్చలకు అవకాశమిచ్చిరి. డాక్టరు నాజర్ యారుజంగు గారి బిల్లును చూపితిని. కష్టపడి అన్ని విషయములను సమగ్రముగా చేర్చినందుకు నేనును ఆమోదమును తెలుపుచున్నాను గాని ఇది ముస్లిమేతరుల వరకే యుండవలెను. గాని ముస్లిములతో సంబంధింప జేయరాదు. ఏలననగా కేంద్ర ప్రభుత్వము యెదుట జాకిర్‌హుస్సేన్ వఖ్ఫు బిల్లు ఆలోచనలో నున్నది. అది యావద్భారత ముస్లిముల కందరికి వర్తింప జేయబడుచున్నప్పుడు ప్రత్యేక హైద్రాబాదు శాసనములకు లోబడజాలమనిరి. అంతట నేను హైద్రాబాదు ముస్లిము రాజ్యము – ఆ ప్రభుత్వ కాలమున తయారుజేయబడిన శాసనములు నిబంధనలు యెదుట నుంచుకొని వ్రాసితిని. ఇందు మీకేమైన నష్టకరములైన విషయములుంటే వాటిని తొలగించుటకును, అట్లే అవసర విషయములను చేర్చుట కును నేనంగీకరించెదను. హిందువుల కొక శాసనము ముస్లిముల కింకొక శాసనము చేసి చీలికలు కల్పించుట మంచిదికాదంటిని. ముస్లిమేతర సభ్యులందరు ఆమోదమును తెలిపిరి. బిల్లు కమిటీచే అంగీకరింపబడెను. దానిని న్యాయశాఖకు పరిశీలించుటకు పంపివేసిరి. శ్రీ రంగారెడ్డిగారి మంత్రి కాలమున జాగీర్లతో పాటు ఈనాములు కూడ రద్దుచేయబడినవి. మష్రుకల్ ఖిద్మత్ ఈనాములు అనగా సేవాప్రతిఫలముగా యిచ్చే ఈనాములను గురించి దేవాదాయ ధర్మాదాయ సలహా సంఘము ఎదుట చర్చకు రాబడెను. ఏలననగా నిత్య నైవేద్య దీపారాధనలు అర్చకాది పరిహారముకు ప్రతిఫలము భూరూపకముగా పూర్వులు యిచ్చే యుండిరి గదా. అవి రద్దయినచో దేవాలయములే మూసివేయవలసి వచ్చును. గనుక అట్లు ఈనాములు రద్దు కాగూడదని తీర్మానించితిమి. బహుశా ఇట్టి ఈనాములు రద్దు కాలేదనియే నేననుకుంటాను. ఆంధ్ర మండలములో వీటిని ప్రత్యేకించ లేదని వినినాను. దేశములో పెద్ద పెద్ద దేవాలయములున్నవి. వాటినన్నిటిని తిరిగి చూచి స్థానికాచారములను లోటుపాట్లను గ్రహించి శాసనములో అవసర విషయములను చేర్చవలెనని ప్రభుత్వమును కోరితిమి. గాని ఖర్చులకు డబ్బు లేదనే కారణమున అట్టి ఏర్పాటున కంగీకరించలేదు. కొన్ని దేవాలయములలో నెలల పర్యంతము జాతర (ఉత్సవములు) జరుగుచుండుటయు దానివలన వేలాది ఆదాయము లభించుటయు జరుగుచున్నది. అది సద్వినియోగము కావడము లేదు. దేవాలయపు మరమ్మతులకు గాని యాత్రికుల సౌకర్యార్థం గాని వసతిగృహ నిర్మాణములకును బాటలను బాగుచేయుటకును వినియోగించుటలేదు.

అయినవోలులో సాలానా 20వేలు వసూలవుతవి. ఇట్లే కొరివి, కొమ్మూరు, కొమరవెల్లి, కొత్తకొండ మొదలయిన జాతరలలో వేలాది రూపాయిలు వసూలగుచున్నవి. ములుగు తాలూకాలో మేడారంలో సారక్క–సమ్మక్క జాతర రెండేండ్ల కొకసారి జరుగుటయు దేవాలయము లేనిచోట 50వేల వరకు వసూలగుటయు జరుగుచన్నది. ఈ డబ్బు నుంచి ప్రాచీన విద్యల (వేదశాస్త్రములు ఆయుర్వేదము) వృద్ధికొరకు కొంతయు నిర్మాణములకు కొంతయు వ్యయపెట్టుడని అభిప్రాయ మిచ్చితిని. గాని ప్రభుత్వము శ్రద్ధతీసుకొని యుండలేదు. రామప్ప, సహస్ర మంటప దేవాలయము అయినవోలు మొదలగు కొన్ని దేవాలయములను వృద్ధి పరచుటకు ప్రజలు సిద్ధముగా నున్నను ఆర్కిలాజికల్ డిపార్టుమెంటు వారి నిరోధము వలన అట్టి నిర్మాణాభివృద్ధికి ఆటంకము కలుచున్నది. అయినవోలు దేవాలయపు ఉత్సవములకు 3, 4 సంవత్సరములు వరుసగా వెళ్ళితిని. రోడ్డు నిర్మాణమునకై ప్రత్యేకముగా కమిటీకిని స్థానికాధికారులకును చెప్పితిని. దేవాదాయ శాఖవారికి వ్రాతమూలకముగా గూడా తెలిపితిని. 3, 4 సంవత్సరములు తాత్కాలిక చికిత్సాలయమును పంపితిని. దాని వివరములు సంస్కృత భాషాభివృద్ధి శీర్షికలో వ్రాసితిని.

## భద్రాచల క్షేత్ర అపూర్వ విషయములు

భద్రాచల రామచంద్రస్వామి మహిమను గురించి భారత దేశము నందంటను కొనియాడబడుచునే యున్నది. ఆంధ్రదేశమున ఆ పుణ్య క్షేత్రమును తెలియని వారేలేరు. ఆ దేవస్థానమునకు నైజాం ప్రభుత్వము 19645లు హాలీలు ప్రతి సంవత్సరము యిచ్చుచున్నారు. శ్రీ రామకృష్ణారావు గారు మంత్రి అయిన తరువాత మత శాఖను రద్దుచేసి ఇండోమెంట్సు శాఖను ఏర్పాటు చేసినారని పైన వ్రాసియున్నాను. దానితోపాటు మత శాఖ పక్షమున హిందు ముస్లిం మత మందిరముల కిచ్చుచున్న నగదు మామూళ్ళను ఈయబడదని కూడ ఉత్తర్వు యిచ్చిరి. అది వచ్చిన తరువాత చిల్లర మత మందిరములతో పాటు భద్రాచల దేవస్థానమూ కూడా రద్దగునని భయపడితిమి.

ఆ గ్రాంటు రద్దు కాకుండుటకు ప్రయత్నము చేయవలె ననియను అందుకు కావలసిన ఆధారములను సంపాదించవలె ననియును ఊహించుకొని అప్పుడు ఇండోమెంట్సు స్పెషల్ ఆఫీసరుగా పని చేయుచున్న శ్రీ భావరాజు వెంకటకృష్ణా రావుగారితో సంప్రదించి భద్రచాలం పర్యటన కార్యక్రమము ఏర్పాటు చేసుకొని ఉభయులము 1952 సంవత్సర శీతాకాలములో వెళ్ళితిమి. దేవాలయములోని

1832 సంవత్సరపు శిలాశాసనమును చూచితిని. తరువాత వరంగల్ సుబేదారు మహమ్మదల్లిగారు విచారించి యిచ్చిన విజ్ఞప్తిని చూచితిని. స్థానిక అనుభవజ్ఞుల తోను సంప్రదించితిని. అర్చకుల వద్దనున్న విరాసత్ తక్తాలను, ఆదాయ వ్యయ పట్టికను చూచితిని. శ్రీ కంచర్ల గోపన్న రామదాసుగారు చేయించిన ఆరు లక్షల రూపాయిాల నవరత్న ఖచితమైన బంగారు ఆభరణములను చూచితిని. గోదావరి స్నానము చేసి, కొండమీది వసతి గృహములో 3 రోజులు నివసించి ప్రతిరోజు రామచంద్రస్వామిని దర్శించుచు నిత్యోత్సవములను పవళింపు సేవ వరకును చేయు సేవలను చూచి ఆయా సందర్భములలో పాడుటకు భక్తులు రచించిన కీర్తనలను వినుచూ కాలము గడిపితిమి. రాజమండ్రి తాలూకా భూములను ఆస్తులను అచ్చటి ఆదాయమును భక్తులు సమర్పించిన ఆభరణములను భక్తులు కట్టించిన సత్రములను చూచితిమి.

ఇదే సందర్భమున వ్రాయుట ఉచితము గనుక వరంగల్ న్యాయవాది కీ.శే. తుంగతుర్తి నరసింహారావుగారు ఒక యిజారా అనిశెట్టిపల్లి అనే గ్రామమును దాన పూర్వకముగా సమర్పించి, దాని ఆదాయమును యాత్రికుల అన్నదానము నకు వినియోగించుమని దానపత్రమును వ్రాసెను. అంది యిప్పటికిని సాగుచునే యున్నది.

ఒకరోజు పర్ణశాలకు వెళ్ళి మార్గమధ్యమునగల దండకారణ్యము రామ చంద్ర సీతారామలక్ష్మణులు తిరిగి నివసించినారని చెప్పుకునే స్థల విశేషములను చూచితిమి.

మే ముభయులము ఆస్తికులము కించిత్ భగవత్ సేవాసక్తిపరులము. పై చెప్పిన విశేషములను తెలుసుకొనుటలో కేవలము భక్తిభావనముతోనే గాక వ్యవహార దృష్టితోకూడ పరిశీలించితిమి.

## వ్యవహార విశేషములు

గోల్కొండ రాజ్యమును అబూల్ హసన్ తానీషా అనే నవ్వాబ్ పరిపాలించె ననియును వారి కాలమున అక్కన్న మాదన్నలుమంత్రులుగా నుండిరనియును, నేలకొండపల్లి కాపురస్తుడు ఆత్రేయ సగోత్రోద్భవుడు శ్రీ కంచర్ల గోపన్నగారు భద్రాచలం తాలూకాకు తహశీల్దారుగా నియమింపబడి రనియును ఆయన పరమ భాగవతోత్తముడైన కబీరుదాసుకు శిష్యుడై తారకమంత్ర ముపదేశింపబడి రామదాసనే వ్యవహార నామముతో ఉద్యోగ ధర్మము నెరవేర్చెననియును తాలూకా

పైన వచ్చే ఆదాయమును శ్రీరామచంద్రమూర్తికి దేవాలయ నిర్మాణమునకును, ఆభరణములకును వినియోగించె ననియును, తరువాత రామదాసు గోల్కొండ చెరసాలలో కొన్ని సంవత్సరములు ఖైదీగా నుంచబడి పలుబాధలకు లోనై సదా రామస్మరణతో కాలము గడిపెననియును తదుపరి ఒకనాటి రాత్రి రామలక్ష్మణులు వేషధారులై తానీషా అంతఃపురమున 6 లక్షల వరహాలు చెల్లించి రనియును పిమ్మట రామదాసు విడుదల చేయబడె ననియును చరిత్రాత్మక విషయముగా మనవి చేయబడుచున్నది. నాకు దొరికిన ఆధారములను బట్టి తానీషాగారు భద్రాచాలం తాలూకాను శాలివాహన శకం 1574 నందున నామ సంవత్సర చైత శు 9 (1652 సం.)ల రోజున రామచంద్రమూర్తికి యిచ్చిరి. సనదు కనబడలేదు. శాసనం చెక్కించబడినది.

రామదాసు నిర్యాణానంతరము కొంత కాలమునకు ఔరంగజేబు ప్రభుత్వో ద్యోగి ధ్వంస జఫరుద్దౌలా అనే ఆయన ఆంధ్రదేశ సంచారము చేసి హైద్రాబాదు నుంచి మచిలీబందరు వరకు అచ్చటచ్చట మజిలీలలో మసీదులు సరాసత్రము కట్టించుచు బావులు త్రవ్వించుచు పోవుచుండెను. దేవాలయములను కొల్లగొట్టినాడని కూడ వాడుక. ఈ సంగతి భద్రాద్రిలో తెలిసె. దేవాలయము పడగొట్టి లక్షలాది విలువగల ఆభరణములను దోచుకొని పోవునని భయపడిరి. వెంటనే గర్భాలయ ద్వారమును రాయికట్టి మూసివేసి అర్చకులు, ఉత్సవ విగ్రహములను ఆభరణములను తీసుకొని పోలవరం వెళ్ళిపోయి ఒక బీదయింట దాగిరి. ధ్వంసవచ్చి చూచెను. గాని దేవాలయము మూసి ఉండెను. ఆభరణములు లేవు. చేయునదిలేక వెళ్ళిపోయెను. సంవత్సరము నిర్ణయించ బడలేదు. గాని ఒక నూరు సంవత్సరములనైనను విగ్రహములు ఆభరణములు సహా పోలవరములో నుండిపోయినవి. తరువాత కొంత కాలమునకు అర్చకులు మరల విగ్రహములు ఆభరణములుసహా భద్రాచలం ప్రవేశించి పునఃప్రతిష్ఠ నందన నామసంవత్సర చైత్ర శు. 8 సోమవారము రోజున చేయించి పూజ పురస్కారములు సాగించుండిరి. బహుశః 1242 ఫసలీ అయి యుండవచ్చును. అటు తరువాత వంగవోలు కాపురస్తుదు పరమ భాగవతోత్తముడు అయిన తూము లక్ష్మినరసింహ దాసుగారు నానాయాత్రలు సేవించి కాంచీ కాపురస్తుడు నాదెళ్ళ (భద్రగిరి) వరద రామదాసును శిష్యునిగా జేసుకొని భద్రాద్రి వచ్చెను. క్షేత్ర ప్రభావము రామదాసు సుకీర్తి చాల ఉన్నను మధ్యన కొంతకాలము దేవాలయము అంతర్వ్య పడిపోవు టయు భద్రాచాలం తాలూకాను అశ్వారావు గారికి స్వాధీన పరచుటయు జరిగినందున అరాచకము ప్రబలియుండెను. దానిని సహించజాలక ఉభయులు

హైద్రాబాదు వెళ్ళిరి. అది నాసరుద్దౌలా పరిపాలనా కాలము. రాజా చందూలాలు మంత్రిగా నుండెను. మహిబా ప్రభావముచే నరసింహా రామదాసు గారు మంత్రిని దర్శించి సంగతి అంతయు తెలిపిరి. రామదాసు కాలమునాడు భద్రాచలం తాలూకా గోదావరికి ఉత్తర దక్షణ భాగములలో కొంతభాగము వ్యాపించి యుండవచ్చును. నార్దరన్ సర్కారులు బ్రిటిషు పరిపాలనకు చెందిన తరువాత గోదావరి దక్షిణమున పాలవంచ తాలూకా నైజాం పరిపాలనయు ఉత్తరమున భద్రాచలం తాలూకా బ్రిటిషు పరిపాలనకు చెందియుండవచ్చును. రాజా చందూలాలుగారు ఆర్థిక నిపుణుల సలహావెంట అశ్వారావుగారి జమీందారి కొంతవరకు ఉంచి వరద రామదాసుగారి పేర చ.15 జమాది ఉస్సాని 1250 హిజరి (1244 ఫసలీ) తేదీన ఒక సనదు ఈ క్రింది విధముగా జారిచేసెను. అందు...

హసనాబాదు పరిగణా పాలవంచ తాలూకా శంకరిగిరి పట్టు

55 గ్రామములు అమాని,
11 గ్రామమలు సర్‌బస్తా,
---------
మొత్తం 66 గ్రామములు.
సాయరు సహా
71,000 పన్ను
వె---------
32,000 పేష్కషష్
8,000 వెయ్యి సిబ్బంది తోపుసహా
12,500 పరిపాలన వ్యయం
18,500 దేవస్థానం
------
71,000

ఈ సనదు పుట్టినప్పటి నుండియు రామచంద్రస్వామివారి పూజలు, ఉత్సవములు అద్భుతముగా సాగబడుచున్నవి. ఈ కాలము 1834 సంవత్సరము అయి యుంటుంది. ఉభయ రామదాసులో నరసింహ్మా రామదాసు పండితుడు, కవి, మహాభక్తుడని చెప్పకతప్పదు. ఆయన రచించిన కీర్తనలు గేయములు అనేకములు ప్రకటింపబడి నేటికిని భక్తులు పాడుచున్నారు. ఉభయ రామదాసు

లలో ఒక నిర్ణయము ఉండెనట. అదేమనగా మన ముభయులము ఒకేసారి వైకుంఠయాత్ర చేయవలెను. అనగా ఒకరికి మరణము తటస్థించితే అదేరోజు రెండవవారు జీవయాత్ర చాలించవలసినదే. ముందు వరద రామదాసు గారికి 1834 సంవత్సర విజయ సంవత్సర భాద్రపద బ. 14 రోజున మరణము తటస్థించెను. వెంటనే లక్ష్మినరసింహ్వా రామదాసుగారు తాను తన శిష్యుని తీసుకొని వైకుంఠమునకు వెళ్లెదమని చెప్పి భజనలతో బయలుదేరెను. వారి వెంట యింకా 13గురు వైకుంఠయాత్రకు సిద్ధమైరి. నడిగోదావరి లోనికి పడవలపైన వెళ్ళి గోదావరిలో శవమును పడవేసి తక్కిన వారును పడే కార్యక్రమము నిర్ణయింప బడెను. వీరివెంట 15 మంది గజఈతగాండ్లు కూడా రక్షించుటకు బయలుదేరిరి. గజఈతగాడు అనగా నిండుగోదావరిలో యివతలి ఒడ్డునుంచి అవతలి ఒడ్డువరకు సునాయాసముగా ఈదగలవాడని యర్థము. ఇంతలో యిద్దరు చపరాశీలు వచ్చి మేము పన్ను వసూలు చేయుటకు వచ్చినామనినారట. వారిని చూచి నరసింహ్వా రామదాసుగారు మేము వైకుంఠమునకు వెళ్లుచున్నామని చెప్పిరి. అంతట కొంత విచారించి మేమును మీతో వచ్చెదమని బిళ్ళలు అవతలపారవేసి బయలుదేరిరి. వరద రామదాసుగారి మృతకళేబరమును పెద్ద ఊరేగింపుతో భజనలు చేయుచు బయలుదేరిరి. అప్పుడు నరసింహ్వా రామదాసు గారీ పాటను పాడిరి.

కీర్తన

తర్లిపోతాము చాలా దయయుంచండీ
మళ్ళీ ఈ జన్మమునకురాము మదిలో నుంచండీ

ఈ విధముగా 17 మంది పడవలమీద పడి గోదావరిలోనికి వెళ్ళీ తరంగములతో పొంగిపొర్లుచున్న మహానదిలో వరద రామదాసుగారి భౌతిక కళేబరమును పడవైచి రామనామము స్మరించుచు లక్ష్మినరసింహ దాసుగారు దుమికి అంతర్ధానమైరి. వారివెంట తక్కిన 15 మంది దుమికిరి వారివెంట గజఈత గాండ్లును దుమికిరి. 15 మందిలో 5గురు మాత్రము రక్షింపబడిరి. తక్కిన వారందరును పరమపదమున కేగిరి. ఈ అయిదుగురిలో రామదాసుగారి భార్యయు యుండెనట. ఈ కథనే ఆంధ్ర మహాభక్త విజయములో తూము లక్ష్మీనరసింహదాసు చరిత్ర ప్రకరణలో విపులముగా వ్రాయబడియున్నది.

పై జెప్పిన సనదు తరువాత ఉభయ రామదాసులు దివంగతులైరి. గ్రామముల పొందుబాటు శిస్తుల వసూళ్ళు, పన్నుల చలామణిచేయు బాధ్యులెవరు ముందుకు వచ్చినట్లు కనబడుటలేదు. పాలవంచ భద్రాచలం జమీందారు

అశ్వారావు బహుద్దురు వారసు అయిన రాజా సీతారామచంద్రరావు సవాయ్ అశ్వారావు బహుద్దుర్ పేర నవ్వాబ్ సర్ సాలర్ బహుద్దుర్ పాలవంచ, శంకరగిరి పట్టీలను సంస్థానముగానిచ్చి ప్రతిఫలముగా సాలానా భద్రాచలం దేవాలయము నకు 20981లు యివ్వమనిన్నీ అందు మింజుమలె 1000లు అమరావతి దేవాలయమునకు చెందజేసి తక్కిన 19681లు భద్రాచలము కొరకని ఉదహరించ బడెను. ఈ సనదు తేది 14 షవాల్ 1275 హిజిరి (అనగా 1264 ఫసలీ) అయియున్నది. గాని తరువాత లెఖ్ఖలలో భద్రాచలమునకు 19645లు హాలీలు యిచ్చుచున్నట్లు తెలియుచున్నది. అమరావతి డబ్బు అమరావతికి యివ్వబడు చున్నదని కూడ తెలియవచ్చినది. ఇంతేగాక అమరావతిలో అమరేశ్వరస్వామికి మధిరె తాలూకా దెందుకూరులో 500 యకరముల మెరక ఈనాముకూడా ఈయబడినది.

భద్రాచలం బ్రిటిషు పరిపాలనలోని తూర్పుగోదావరి జిల్లాలో చేరియున్నను దేవాలయము నైజాం పరిపాలనలోనే ఉంచబడెను. ఒక మేనేజరు ఉండేవాడు. నైజాం పోలీసులుండేవారు. కల్యాణోత్సవము రోజున నైజాం యిలాకా రివిన్యూ పోలీసు అధికారులు చైత్ర శు. 9 (శ్రీరామనవమి, కల్యాణోత్సవముల రోజున జవాహిరితో స్వామిని ఊరేగింపు చేయుచు కల్యాణ మంటపమునకు కొనిపోయి కల్యాణోత్సవానంతరం స్వామిని ఆభరణముల సహా దేవాలయమునకు చేర్చుచుండే వారు. కానుకలు వేయు దిబ్బెమును కాపాడేవారు. రాజ్యాధిపతులలో కలహము లేకున్నను క్రింది ఉద్యోగస్థులు రంధ్రాన్వేషణలు చేయుచు నూతన విధానమును కల్పించు చుంటారు.

షుమారు 20 సంవత్సరములకు పూర్వము అధికార వాంఛా పరులగు క్రింది ఉద్యోగుల ప్రేరేపణచే మద్రాసు ప్రభుత్వంవారు ఒక ఉత్తర్వు నిచ్చిరి. అనగా దేవాలయము లోపల నైజాం తన సిబ్బందిని ఉంచుకొనవచ్చును. దేవాలయం బైట బ్రిటిషు మేజిస్ట్రేటు బ్రిటిషు పోలీసు రక్షణ శాస్త్రీయము గానేరదు. ఆ ప్రకారమే అమలు జరుగుచుండెను. విశాలాంధ్రము, ఆంధ్రప్రదేశ ప్రభుత్వము వచ్చినది. ఇప్పుడట్టి భేదములకు కారణముండదు.

భద్రాచల రామచంద్ర స్వామివారికి కుతుబ్‌షాహి పరిపాలన కాలమున తానీషా భద్రాచలం తాలూకాను సమర్పించుటయు అద్దానిని ఆసఫ్‌జాహి వంశీకులు స్వాధీన పరచుకొని నాసరుద్దౌలా కాలమున కంపెన్‌సేషన్ గాసాలానాగా కొంత యిచ్చుటకు ఒడంబడిక చేయుటయు, దానిని స్వతంత్ర

హైద్రాబాదు ప్రభుత్వము రద్దు చేయకూడదని నా కోరికే. రాజు చావదు, మనిషి మారుతాడు. రాజాజ్ఞను రెండవ రాజు పరిపాలించు ధర్మము గనుక ప్రస్తుత ప్రభుత్వము ఆ ప్రతిఫలమును రద్దు పరచజాలదని నా వాదన అని చెప్పితిని. స్పెషల్ ఆఫీసరు శ్రీ బావరాజు వెంకటకృష్ణారావుగారును ఆమోదించిరి.

ఇది శ్రీ రామచంద్రస్వామివారి స్వామివారి మానసిక సేవయని తృప్తిచెందితిని.

కం. నీ పాదకమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపా భూత దయయును
దాపసమందార నాకు దయసేయగదే.

**ఇంతటితో ఈ అధ్యాయమును ముగించుచున్నాను.**

* * *